కాలం వెంట కలం

(వ్యాస సంపుటి)



సుధామ



కాలం వెంట కలం

సుధామ - వ్యాసాలు

కాలం వెంట కలం

(వ్యాస సంపుటి)

సుధాను

స్నేహిత స్రవంతి
జి.12, సాదత్‌టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్,
సలీంనగర్ కాలని, మలక్‌పేట,
హైదరాబాద్- 500 036

Kaalam venta kalam

(A collection of essays)

By **Sudhama**

© Sudhama

98492 97958
sudhama60@yahoo.com

First Edition : 25th Nov. 2020

For Copies :

A. Usharani,
Snehitha Sravanti
G.12, Sadath Towers, Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet
Hyderabad - 500 036 (Telangana)
Cell: 98482 76929/ 98492 97958
and
All Leading Book Shops

Book Production :
'Pustaka Shilpi'
T. Muralidhar Goud
tmgowd@gmail.com

Cover Design:
Snehith Allamraju

D.T.P.:
K.B.T. Kondaiah

Printed at :
Karshak Art Printers
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

Price : **₹ 300/- $ 15**



నా బాల్యంలోనే సాహిత్యాభిరుచికి
ప్రేరణాత్మకమైన
ప్రియమైన అన్నయ్య
అల్లంరాజు రాధాకుమార్ (రాధాయి) కూ
వదిన
అల్లంరాజు (ఆకొండి) వసంత కూ
ఆత్మీయంగా

కాలం వెంట నడుస్తూ...

సుధామగారి సాహిత్య వ్యాససంపుటికి స్వాగతం!

తెలుగు పాఠకలోకానికి సుపరిచితులు– సుధామగారు. జాతీయకవిగా, కార్టూనిస్ట్‌గా, చిత్రకారునిగా, సమీక్షకునిగా, వ్యాఖ్యాతగా, సినీవిశ్లేషకునిగా, కాలమిస్ట్‌గా, వక్తగా, పదబంధ ప్రహేళికల నిర్మాతగా, నూత్న ప్రక్రియల ఆవిష్కర్తగా, ప్రయోగశీలిగా సుధామగారు సాహిత్యాభినివేశం ఉన్న ప్రతి తెలుగు పాఠకునికీ అభిమాన రచయిత. సాహితీవేత్తగా, యువభారతి ముఖ్యకార్యకర్తల్లో ఒకరుగా– ఎందరో ప్రముఖులకూ, సాహితీకారులకూ ఆయన ఆత్మీయ స్నేహితుడు, సన్నిహితుడు, హితుడూ కూడా.

సుధామ వివిధ ప్రక్రియల్లో బహుగ్రంథకర్త. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ప్రతిష్ఠాత్మక సన్మాన, సత్కార, పురస్కారాలు పొందిన సుధీమంతుడు! రేడియో 'వాడి'గా, అనేక టీవీ చర్చల 'నాడి'గా– శ్రోతలకూ, వీక్షకులకూ కూడా దగ్గరివాడు. ఐదు దశాబ్దాలకు పైబడిన అవిరళ సాహితీపరివస్యతో 'పొద్దుచాలని' కృషీవలుడు!

ఇది 'కాలంవెంట కలం'. 73 సాహిత్య వ్యాసాలసంపుటి. రాశిలో, వాసిలో బృహద్గ్రంథం. కాలానుసరణంగా ప్రచురింపబడిన రచనల సమాహారం. ఆవిధంగా– ఇందులోని వ్యాసాల్లో సుధామగారి సద్యఃస్ఫూర్తినీ, సర్వమూ ఆకళించుకున్న సాహిత్య సంప్రదాయ స్పందన– ప్రతిస్పందనల విజ్ఞతనీ దర్శించవచ్చు. అలా, సుధామగారి బహుముఖీన ప్రతిభా పట్టకం ఇది!

విషయపరంగా వ్యాసాల్లోని విభిన్న సాహిత్యాంశాల వైవిధ్యం– సుధామగారి అధ్యయనపటిమనీ, అనుభవలోకజ్ఞతనీ, అనుబంధ బాంధవ్యాల గాఢతనీ తెలియజేస్తుంది. ఇందులో– ప్రముఖుల సాహిత్య వ్యక్తిత్వ, వ్యక్తిత్వవిశేషాల్ని పరిచయం చేస్తున్న వ్యాసాలు ఉన్నాయి.

ఆధ్యాత్మిక తేజోమూర్తులు– శివానందమూర్తి, పుట్టపర్తి సాయిబాబా దర్శనమిస్తారు. జ్ఞానపీఠాసీనులు– సినారె, భరద్వాజ సందేశిస్తారు. ఆకాశవాణి భీష్మసములు రజని, సాహిత్య కులపతి పుల్లెలవారు భాషిస్తారు. యువజన స్ఫూర్తి ప్రదాత కలామ్ ధీరంగా సంభావిస్తారు. నోబుల్ పురస్కారగ్రహీత డిలాన్, విశ్వవిఖ్యాత కార్టూనిస్ట్ ఆర్.కే.లక్ష్మణ్, చిత్రకారులు బాపు, సత్యమూర్తి, నటవిరాణ్మూర్తులు– గిరీశ్‌కర్నాడ్, అశోక్‌కుమార్, భానుమతి, వేణుమాధవ్ వంటివారి ప్రతిభాప్రాభవం పునశ్చరణకి వస్తుంది. సాహితీ దిగ్దంతులు కుందుర్తి, దాశరథి రంగాచార్య, మునిమాణిక్యం, ముళ్లపూడి, కొవ్వలి, పెద్దిభొట్ల, సులోచనారాణి, గొల్లపూడి, శశాంశ, శ్రీకాంతశర్మ, ఛాయాదేవి, తురగా జానకీరాణి, కె.బి.లక్ష్మి, వేదగిరి రాంబాబు– వంటి ఎందరో మరోసారి తేజోరేఖలుగా కనిపిస్తారు.

ఇంకా మాన్యశ్రీరమణాచారి, తిరుమల శ్రీనివాసాచార్య, ఎం.వి.ఆర్.శాస్త్రి, శీలావీ, నవీన్, విహారి, అమ్మంగి వేణుగోపాల్, విశ్వనాథం, సింహప్రసాద్ వంటి ఈనాటి ప్రతిభాభాస్వరుల సాహితీకిరణ ప్రసారాన్నీ ఆనందిస్తాము... ఇంత విస్తృతమైన, విస్తారమైన సాహిత్యానుశీలనం నెరపిన సుధామగారి వ్యాసరచనాకృషికి 'నమోవాకాలు' చిన్న అభినందనే!

సుధామ పరిచయ విధానాన్నీ, జ్ఞాపకాలమాలనీ కూడా చూస్తాము ఈ వ్యాసాల్లో. పైన పేర్కొన్న వ్యక్తుల జీవన రేఖలన్నీ మనకీ గుణవిశేషాల్ని అందిస్తాయి. సాహిత్య వ్యాసానికి అవసరమైన రచనాశిల్పంలోని లోతైన పరిశీలన, విశ్లేషణ, విషయ ప్రస్తావన, చదివించే శైలివంటి అంశాల్ని సుధామగారు రాసిన 'మునిమాణిక్యం రచనల్లో హాస్యం', 'అధిక్షేపాక్షర సంచారి' (ఎం.వి.ఆర్.శాస్త్రి), 'నూరేళ్ల తెలుగు కథాసుధ', 'సామయిక కవిత్వం', 'నేటి తెలుగునవల'– వ్యాసాల్లో గాఢంగా, సాంద్రంగా చూస్తాము. ఆయన కొన్ని వ్యాసాల్లో 'రికార్డ్' చేసిన చారిత్రకాంశాలు ఎంతో విలువైనవి. 'గోరాశాస్త్రి నుండి ఎం.వి.ఆర్.శాస్త్రి– వరకు' అన్న ఆంధ్రభూమి గురించిన వ్యాసం, 'భాషాపరశేషభోగి సాహితీ ప్రియత్వం' అని పి.వి.నరసింహారావుగారి గురించిన వ్యాసం, 'ప్రసార మాధ్యమాలు', 'తొలినాళ్ల సాహిత్యజ్ఞాపకాల బాటలో...' వ్యాసాలు ఈ కోవకు చెందినవి.

వ్యాసరచనలో సుధామగారి అభిప్రాయాల్లో ఎక్కడా శషభిషల్నీ ముఖప్రీతి ధోరణినీ చూడము. ఉన్నది, తాననుకున్నది– ప్రకటించటంలో ఆయన 'నిక్కచ్చి' రచయిత! 'చిన్నకథల కథ'లో అంటారు, 'పత్రికా ప్రపంచం కలుషితమైపోయింది.

ఈ ప్రమాదాన్నుండి పత్రికలని, పాఠకులని రక్షించవలసిన అవసరం ఉంది. అందుకు ముందుగా రచయితల్లో జాగృతి కలగాలి!' అలాగే, 'కథకకవి చిత్రకారిత్వం–కరుణించిన దేవత'లో దీర్ఘమైన నవలా విశ్లేషణనీ, సమీక్షనూ చేస్తూ– 'తీర్థానికి తీర్థం ప్రసాదానికి ప్రసాదంలా– వర్ణనలు వర్ణనల కోసమే చేసిన తావులు కొన్ని వున్నా...' అని వాస్తవ స్థితిని స్పష్టీకరిస్తారు.

సుధామగారు ఈ వ్యాసాల్లో గీసిన స్మృతిరేఖల్లో కొన్ని అనేక విధాలుగా మెరుపుల్ని కురిపిస్తున్నాయి. ఉదాహరణకి 'అట్లూరి(న) కలం' వ్యాసమంతా ఎ.వి.ఆర్. అనబడే అట్లూరి వెంకటేశ్వరరావుగారి జీవన ప్రస్థానంలోని స్ఫూర్తిదాయకమైన అంశాల్ని వెల్లడి చేస్తుంది. ప్రవృత్తి మార్గంలో– ఎన్నో మనోవైజ్ఞానిక వ్యాసాల్ని రాసిన అట్లూరి అధ్యయన సాధనని గురించి చెప్పి, ఆపైన 1993 లో ఆయన రాసిన స్టీఫెన్ హాకింగ్ జీవితవిశేషాల గ్రంథంగురించి వివరించారు. ఇది చాలా విలువైన వ్యాసం.

విస్మృత మహనీయుల్ని గురించీ, వారి విజయ సాధన గురించి సాహితీలోకాన వెలుగు ప్రసరింపజేయటం సుధామ రచనాకృషిలో నిత్య దైనందిన చర్య. పైడిమర్రి రామచంద్రరావుగారి గురించిన రెండు వ్యాసాలూ ఈ కోవకి చెందుతాయి. తురగా జానకీరాణి, మాడభూషి రంగాచార్య, కె.బి.లక్ష్మి, వేదగిరి రాంబాబు వంటి తనకు బాగా సన్నిహితులైన వారికి అర్పించిన నివాళిలో– సుధామ సాహిత్య చరిత్రాంశాల్నీ, సాంఘిక ప్రాధాన్యాల్నీ, ప్రముఖంగా పొందుపరచారు.

సుధామగారి వ్యాసరచనా విధానంలో ఒక తెలుగుదనం, తేటతనం అంతర్వాహినిలుగా కనపడుతూ ఉంటాయి. లోతైన పరిశీలన చేయనిదే ఆయన వ్యాసరచనకు పూనుకోరు. 'రేడియో తెలుగు భాషాసాహిత్య వికాసం' చదివితే, సుధామ చిత్తశుద్ధికి అబ్బురపడతాము. వస్తు స్వీకరణ సరే, దాని ఆవిష్కరణంలో– ఎన్నెన్ని (అ)పూర్వవిషయాల్నో ఆయన ఉటంకిస్తారు. 'కుసుమించిన సంక్రాంతి కవితాలత', 'ఆకాశవాణిలో భరద్వాజ' వంటి వ్యాసాలు సుధామ పరిణత ప్రజ్ఞనీ, విషయసమగ్రత కోసం ఆయన చేసే మేధోమథనాన్నీ– మనకు తెలియజేస్తాయి.

సుధామ వ్యాసరచనా శిల్పం ఒక విలక్షణతతో కూడివుంది. ఆయన ఒకటి, రెండు (ఒక్కొక్కప్పుడు మూడు నాలుగు) పేరాలవరకూ, ఉద్దిష్ట విషయ నేపథ్యాన్ని సమూలంగా విస్తరిస్తారు. ఆ తర్వాతే ప్రస్తుతాంశం మనముందుకొస్తుంది.

ఈపద్ధతివలన పాఠకుడికి ఎంతో మేలుజరుగుతుంది. సాహిత్య, సామాజిక, సాంస్కృతికరంగాల సంభవాల ఆనుపానులు కొత్తవెలుగుతో లభిస్తాయి. 'యువ' విశ్వ'నాదం' వ్యాసం చదవండి.

'కాలంవెంట కలం' వర్తమాన సాహిత్య చరిత్రకు ఒక విలువైన చేర్పు. ఒక ప్రతిభామూర్తి పంచుతున్న ఆలోచనామృతధార. ఇది ఖచ్చితంగా తెలుగు సాహిత్య వైభవదీప్తికి ఒక ఆకరగ్రంథంగా మన్ననల్ని అందుకుంటుందని ఆశిస్తున్నాను. ఈ నాలుగు మాటలూ చెప్పే అవకాశాన్నిచ్చిన సుమనస్వి, ఆత్మీయమిత్రులు సుధామగారికి ధన్యవాదాలు.

అభినందనలతో, శుభాకాంక్షలతో

హైదరాబాద్-36

- విహారి

(98480 25600)

నా మాట

నా సాహిత్య రచనలను సంపుటీకరించే సంకల్పంలో భాగమే ఈ వ్యాససంపుటి. నా పద్నాలుగవ ఏట అచ్చులో తొలి రచన చూసుకోవడం మొదలుగా, నేను అర్ధశతాబ్దికి పైగా రాసిన వ్యాసాలను 'కాలంవెంట కలం', 'సందర్భ' అనే రెండు సంపుటాలుగా భద్రపరుచుకునే క్రమంలోని– ఈ సంపుటిలోని వ్యాసాలన్నీ అధికశాతం వివిధ సందర్భాలలో పత్రికలవారు నా చేత అడిగి రాయించుకున్నవే. ప్రజాతంత్ర, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ప్రజాశక్తి, వార్త, కమెండో, చుక్కాని, ఉదయం, చినుకు, ఈనాడు, తెలుగు వెలుగు, పాలపిట్ట వంటి పత్రికలవారందరికీ ఇందుకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. కొన్ని వ్యాసాలు ప్రత్యేకసంచికలకై– ఆయా వ్యక్తులు, సంస్థలు కోరగా రచించినవి. ఇలా ఈ వ్యాసాలు అనేక సామయిక సందర్భాలలో రూపొందినవే. 'కాలంవెంట కలం' అన్నందువలన ఈ వ్యాససంపుటిలోని వ్యాసాలు ఆయాపత్రికలలో ముద్రితమైన కాలక్రమంలో సంతరించడం జరిగిందని మనవి.

ఒకే అంశంపై పలుసందర్భాల్లో అవసరార్థం ఒకటి రెండు వ్యాసాలు రాయవలసి వచ్చినప్పుడు కొన్నిసంగతులు చర్వితచర్వణం కావడం అనివార్యమే! అలాగే పునరుక్తంగా అన్పించే కొన్ని భావాలు– ఆ అంశంపట్లా, ఉదాహృతమయ్యే కొటేషన్ల పట్లా గల స్వీయ అనురక్తికీ, గాఢతకూ నిదర్శనాలుగా మాత్రమే గ్రహించగలరని భావిస్తున్నాను. ఆయా అంశాలను సహృదయ విమర్శకులు గణించి, మన్నన చేయగలరని కోరుతున్నాను. వృత్తిరీత్యా నేను ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారినైనా, నేనొక పత్రికారచయితగా తెలుగు సాహితీజగత్తులో గుర్తింపబడడానికి నన్నొక కాలమిస్టుగా సమాదరించడం మాత్రమే కాక, ప్రత్యేకించి ఈ సామయిక వ్యాసాలను రాసే అవకాశాలను నాకు కల్పించిన పత్రికా సంపాదకులకు నా నమస్సుమాలు. శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రి, శ్రీ పి.విజయబాబు, శ్రీ గుడిపాటి,

శ్రీకె.పి.అశోక్‌కుమార్, శ్రీమతి జె.శ్యామల, శ్రీమతి అంజన, శ్రీమతి ఎ.ఎస్.లక్ష్మి వీరంతా సంపాదకులుగా వుండి నా చేత సంతరింపజేసిన వ్యాసాలు ఈ సంపుటిలో చేర్చడం నాకు ఆనందదాయకం. అలాగే తొలిరోజులలో నా వ్యాసరచనలను ప్రోత్సహించిన కీర్తిశేషులు గోపాలచక్రవర్తి, కాశీనాథుని సుబ్రహ్మణ్యం, పోతుకూచి సాంబశివరావు గార్లు నాకు స్మరణీయులు.

నా సాహిత్యవ్యాసాలు గ్రంథరూపేణా వెలువరించమని సూచించి, ఎంతగానో ప్రోత్సహించినవారు, ప్రేరకులయినవారు ప్రముఖ కవి, కథకులు, విమర్శకులు, సాహితీవేత్త శ్రీ విహారి (జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి) గారు. వారి ప్రోద్బలమే లేకుంటే ఈ యత్నం సాధ్యమయ్యేదే కాదు. నా పట్ల ఎంతో ఆదరాభిమానాలతో తమ అమూల్యమైన పీఠికను సంతరించి ఇచ్చినందుకు శ్రీ జె.ఎస్.మూర్తి (విహారి) గారికి నా మనఃపూర్వక ధన్యవాదాలు.

ఇక బాల్యంలోనే నా సాహిత్యాభిరుచికీ, రచనావ్యాసంగానికీ ప్రేరణ కల్పించింది అన్నయ్య శ్రీ అల్లంరాజు రాధాకుమార్. 'రాధాయి' అన్న పేరున తను రచనలు చేస్తూండేవాడు. సిండికేట్ బ్యాంక్ ఉద్యోగిగా, రాధాస్వామి సత్సంగ సేవా తత్పరునిగా తలమునకలయిన బాధ్యతలతో తన రచనావ్యాసంగం కొంత మందగించినా, ఇప్పటికీ గొప్ప సాహిత్యాభిలాషి, అడపాదడపా కలంసారించే అగ్రజుడు. శ్రీ అల్లంరాజు రాధాకుమార్ (రాధాయి) అన్నయ్యకూ, మా ప్రియమైన వదిన అల్లంరాజు (ఆకొండి) వసంతకూ నా ఈ 'కాలంవెంట కలం'– కానుకనిచ్చే అవకాశం కలిగినందుకు ఆనందిస్తున్నాను– మా వదిన వసంత 'సోవియట్ యూనియన్' పత్రికా సంపాదకులుగా చేసిన కీ॥శే॥ ఆకొండి రామకృష్ణగారి రెండో అమ్మాయి. విద్యారంగంలో మాంటిసరీ పాఠశాల, వనస్థలి ప్రిన్సిపాల్‌గా మా వదిన ఎందరి పిల్లలభవిష్యత్తుకో బాటలు వేసిన విదుషి. ఇలా 'కాలంవెంట కలం' నా అన్నావదినలకు ఆత్మీయ అక్షరకానుక.

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అన్నారు. మా కుటుంబ మిత్రులు, అత్యంత ఆత్మీయులు అయిన డాక్టర్ దంపతులు– శ్రీ భట్టిప్రోలు సీతారామ సత్య ఆంజనేయశర్మ శ్రీమతి దుర్గాలక్ష్మిప్రసన్నగారు. ప్రముఖ చారిత్రకులు, కవి, రచయిత అయిన కీ॥శే॥బి.ఎస్.ఎల్. హనుమంతరావుగారి తమ్ముడు మాత్రమే కాక, స్వయంగా సాహిత్యాభిలాషి, అన్నగారి రచనలకు ముద్రితగ్రంథాలుగా ప్రాచుర్యం కల్పించిన

సౌజన్యమూర్తి, కేంద్రప్రభుత్వ ఆరోగ్యశాఖ సి.జి.హెచ్.ఎస్. డాక్టర్‌గా పేరొందినవారు ఆంజనేయశర్మగారు. వారి శ్రీమతి దుర్గాలక్ష్మి ప్రసన్న హిందీ సాహిత్యంలో డాక్టరేట్ పొందిన సృజనశీలి మాత్రమే కాక ఆకాశవాణిలో మా సహోద్యోగి. నా శ్రీమతి ఉషకు ప్రాణస్నేహితురాలు. వారిరువురూ ఆకాశవాణిలో శిక్షణాసంస్థ అసిస్టెంట్ డైరెక్టర్లుగా వన్నెవాసికెక్కారు. డా॥ ఆంజనేయశర్మగారు, ప్రసన్నగారు మా పట్ల చూపే ప్రేముడికి కృతజ్ఞతా చిహ్నంగా 'సందర్భ' వ్యాససంపుటి వారికి నా కూరిమి ఉపాయనం.

నా రచనలను సంకలనం చేయడం గురించీ, పుస్తకాలుగా ముద్రించడం గురించీ పట్టుబట్టి వెన్నంటి అన్నివిధాలా ప్రోత్సహిస్తున్న నా జీవనసహచరి ఉషకూ, తన చిత్రకళా నైపుణ్యంతో ఈ వ్యాససంపుటులకు అందంగా ముఖచిత్రాలను అందించిన మా కుమారుడు చిరంజీవి స్నేహిత్‌కూ, సమాదరిస్తున్న కోడలు పిల్ల చి॥సౌ॥స్రవంతికీ నా ప్రేమాభినందనలు.

ఈ వ్యాససంపుటి గ్రంథాలను ముద్రించడంలో ఎంతగానో సహకరించిన పుస్తకరూపశిల్పి 'చిరకాల మిత్రుడు శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడుగారికీ, మనూగ్రాఫిక్స్ శ్రీకుడుపూడి భాస్కర్‌గారికీ, సతీష్ గ్రాఫిక్స్ శ్రీ సతీష్‌గారికీ, డి.టి.పి. నిర్వహించిన శ్రీ కె.బి.టి.కొండయ్యగారికి, ముద్రాపకులకూ అందరికీ నా కృతజ్ఞతలు. ఈ నా వ్యాససంపుటికి ఎప్పటివలెనే పాఠకసమాదరణను ఆశిస్తూ, అభిలషిస్తూ–

సదా మీ

25-11-2020 **సుధామ**

వ్యాససూచిక

1. తెలుగు పత్రికలలో కార్టూనులు-జోకులు ---------- 15
2. నేటి తెలుగు నవల గురించి ---------- 23
3. సామయిక కవిత్వం ---------- 27
4. చిన్న కథల కథ ---------- 32
5. వచనకవితా స్ఫూర్తి కుందుర్తి ---------- 38
6. ఎద ఝల్లుమనిపించే ఎల్లా మృదంగ తరంగం ---------- 41
7. తులలేని తెలుగు దీపం ---------- 45
8. అశోకా ది గ్రేట్ ---------- 49
9. భాషాపరశేషభోగి సాహితీప్రియత్వం ---------- 52
10. కళాసాంస్కృతిక వటవృక్షం ---------- 58
11. అట్లూరి(న) కలం ---------- 61
12. ప్రసన్న కథామూర్తి ---------- 64
13. మునిమాణిక్యం రచనల్లో హాస్యం ---------- 67
14. చిరంజీవి బాపుకు 70 ఏళ్ళు ---------- 83
15. భానుమతి కథల్లో అత్తగారికి కొత్తరూపు ---------- 89
16. ప్రసార మాధ్యమాలు ---------- 92
17. కథకకవి చిత్రకారిత్వం 'కరుణించని దేవత' ---------- 100
18. ఆరిపోని దారిదీపం శ్రీశ్రీ కవిత్వం ---------- 109
19. జ్ఞాపకాలనీడ ---------- 113
20. రామాయణ పదవిహారి ---------- 116
21. 'యువ' విశ్వ'నాదం' ---------- 119
22. మనసున్న కథకుడు ---------- 122
23. నూరేళ్ళ తెలుగు కథాసుధ ---------- 124
24. లిఖిత పత్రికలు ---------- 134

25. పాటలో ఏముంది... ---------- 140
26. గోరాశాస్త్రి నుంచి ఎం.వి.ఆర్. శాస్త్రి వరకు ---------- 146
27. 'పుచ్చ పువ్వు' నవ్వుకు నిండా నూరేళ్ళు ---------- 151
28. సమాధిగతమైన సత్యసాయి ---------- 155
29. తక్కువేమి మనకు బాపు ఒక్కరుండువరకు ---------- 164
30. ముళ్ళపూడి మార్కు కథల జడి ---------- 168
31. నవ్వులలోకం ---------- 174
32. అధిక్షేపాక్షర సంచారి ---------- 179
33. అమృతోత్సవ సత్యమూర్తి ---------- 185
34. ఆకాశవాణిలో భరద్వాజ ---------- 189
35. బొమ్మల బ్రహ్మ అవతారం చాలించాడు ---------- 198
36. ఇక తిరిగిరాని జానకీరాణి ---------- 203
37. చిరునవ్వుల సద్గతి చిరంజీవి రాగతి ---------- 208
38. కాలానికి నిలిచే కామన్ మేన్ ---------- 211
39. ఆధ్యాత్మిక శిఖరం– అపర శివావతారం ---------- 216
40. అస్తమించిన సురభారతి చంద్రుడు ---------- 219
41. నేలరాలిన మోదుగుపువ్వు ---------- 223
42. కాలాతీతవ్యక్తి కలామ్ ---------- 226
43. రమణీయ భావనం ---------- 231
44. పూర్ణసాహితీశశాంక ---------- 238
45. స్వరసాహితికి నోబెల్ పట్టం ---------- 241
46. 'జీవనశైలి'కి కాలరేఖల కాలమ్ ---------- 246
47. ఆరిపోయిన అక్షరదీపం ---------- 252
48. సాహితీ కీర్తిశిఖరం ---------- 261
49. సెరిబ్రల్ పాల్సీకి కవిభిషక్కు ---------- 267
50. తొలినాళ్ళ సాహిత్య జ్ఞాపకాల బాటలో... ---------- 272

51. నానారుచిరార్థ రుబాయీ పరమకవీశ్వరుడు ---------- 277
52. బతుకుపుస్తక భద్రగ్రంథాలయం ---------- 296
53. నాటకీయ వెలుగుల కవి అమ్మంగి ---------- 304
54. పదబంధ ప్రహేళికలు ---------- 311
55. కవి తల పోతగా ఉగాది ---------- 319
56. శ్రవ్య మాధ్యమ శకపురుషుడు ---------- 327
57. కథాభారతి ఫాలభాగపు పెద్ద బొట్టు! ---------- 330
58. ఆగిన 'జీవన తరంగాలు' ---------- 334
59. ధ్వని మాంత్రికుడి నిశ్శబ్ద నిధనము ---------- 341
60. తొమ్మిది 'మెరుపులు' ---------- 344
61. తెలుగు కథానిక ప్రేమైక జీవి ---------- 346
62. అనుభూతుల 'ఇంద్ర'జాలకవి! ---------- 352
63. రేడియో-తెలుగు భాషా సాహిత్య వికాసం ---------- 355
64. కుసుమించిన సంక్రాంతి కవితాలత ---------- 380
65. తెలుగు నాటక వైభవ దీప్తి ---------- 392
66. నవచేతనా వసంతం ---------- 395
67. సాహిత్య, నాటక, సినీ 'గిరీశు'డు! ---------- 403
68. అస్తమించిన సాహిత్య 'ఛాయ' ---------- 410
69. విలువల గ్రహింపు కలిగించే నేర్పరి కథకుడు ---------- 416
70. తరలిపోయిన సాహితీ స్నేహమయి ---------- 421
71. స'కాలమ్'లో స'కలం-విహారి' ---------- 424
72. సృజనాత్మక బుద్ధిమతాం వరిష్టం! ---------- 430
73. వెలగాలి తెలుగు ---------- 434

❖

(1) తెలుగు పత్రికలలో కార్టూనులు-జోకులు

ప్ర... ప్ర... ప్రకటన:

'పత్రిక తిరగేస్తున్నారు. పదిపేజీలకో మరింకొన్ని పేజీలకో ఒక్కొక్కసారి అనుకోకుండా మీ పెదవులమీద చిరునవ్వు మెరుస్తోంది. ఒక్కోసారి ఆపుకోలేక గట్టిగా నవ్వేస్తున్నారు. ఈ మధుర దరస్మితవదనానికి ప్రేరణ ఏమిటి?- కార్టూనులు, జోకులు. 'సత్వర ఆనందం పొందడానికి కార్టూనులూ, జోకులే వాడుడు. బనానేవాలే... టింగ్ టింగ్'- ఇది జనరంజని కార్టూనులు, జోకులు ప్రకటన అనుకుంటున్నారా? లేదా, ఏమైనా కానీయండి! తెలుగు పత్రికలలో కార్టూనులు, జోకులకొక ప్రత్యేకత, అలాంటిదే ఒక స్థానం వుందని పెదవులనే ధంకామీద చిరునవ్వు అనే దెబ్బకొట్టి చెప్పచ్చు. కాదనగలరా?-లేరు.

ప్రస్తావన:

అసలు స్వాతంత్ర్యయుగోదయంలోనే ఈ కార్టూనులు, జోకుల మహోదయం వుందని చెప్పాలి. స్వాతంత్ర్యానికి పూర్వం దాస్యశృంఖలాలు త్రెంచుకునే దేశభక్తి ఉద్రిక్తతతో వున్నామే తప్ప మనమీద మనం జోకులేసుకుంటూ, కార్టూన్లు గీసుకుంటూ అంతగా నవ్వులాటగాలేము. స్వాతంత్ర్యానంతరం తెలుగుపత్రికలు సంఖ్యలోనూ, స్థిరత్వంలోనూ చెప్పుకోదగినట్లుగా వచ్చాయి. హాస్యానికి దేశ, కాల, పాత్రముల ననుసరించి ఉనికి, మనికి, ప్రగతి ఏర్పడుతూవస్తుంది. అప్పటి హాస్యానికీ, ఇప్పటి హాస్యానికీ మనకు చాలా తేడా కనిపిస్తుంది. మనిషిధోరణిలోనూ, సాహిత్యంలోనూ ఒకప్పుడు హాస్యం కాస్త మొరటుగా, జుగుప్సావహంగానే వుండింది. ఇవాళ్టి హాస్యంలోని కాస్త వైవిధ్యం మీరు అనుభవిస్తూనే వున్నారు.

తొలి తెలుగు కార్టూనిస్టుగా ఈ స్వాతంత్ర్యయుగోదయంలో శ్రీ తలిశెట్టి రామారావును చెప్పుకోవాల్సి వుంటుందేమో? 'తాటిచెట్టుమీదికెక్కిస్తూ కుర్రవాడికి కల్లుతీయడం నేర్పిస్తున్న తండ్రి'– అది దృశ్యం. క్రిందదానికి శీర్షికగా– 'గీతాబోధన' అని– అది స్వాతంత్ర్యానంతరపు తొలివత్సరాల్లో ఒక తెలుగు పత్రికలో కార్టూను. అప్పటి కార్టూన్ల ధోరణి అలా వుంటుంది.

నిర్వచననిఘంటువు:

కార్టూన్లకు, జోకులకు నిర్వచనం చెప్పడం కష్టం. 'ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్' అన్నారు. అంతే. జోకుకు రూపం కంటికెదురుగా ఉండదు. ఊహలో కనిపిస్తుంది. కార్టూను అంటే రేఖలతోకూడిన జోకు అనచ్చు. అంటే రూపం కూడా కనిపించే జోకుమాట. అయితే కేవలం ఇలా నిర్ధారించడం డేంజరు. చరిత్రకందని వీరుల్లా కార్టూను కందని జోకులూ వుంటాయి. జోకుల్లేని కేవల రూపాలు (అవీ బ్రహ్మాండంగా నవ్విస్తూనే) కార్టూన్లుగా కూడా బోల్డు. కార్టూనుకు తెలుగు పేరుంది. వ్యంగ్యచిత్రం అని. చిత్రం వ్యంగ్యంగా ఉన్నా, వ్యంగ్యవాక్యాలతో కూడిన చిత్రమైనా అది వ్యంగ్యచిత్రం. అంటే కార్టూను అన్నమాట. కార్టూనులో నవ్వించడానికి తగిన మనుషుల్ని, వాతావరణాన్ని సంతరించాలి రేఖల్లో. జోకును జోకుగా రాసేస్తే చాల్తుంది.

'సం'గతులు:

పత్రికను ఆసాంతం చదివించేందుకు ఆకర్షణ ముందు ముఖచిత్రం అయితే ఆ తర్వాత అందుకు ఉత్సాహాన్ని కలిగించేవి ముందుగా పాఠకులు తిరగవేసే కార్టూనులు, జోకులే. అవి బాగుంటే పత్రికంతా బాగుంటుందని పాఠకులు చదవడం నాకు తెలుసు. ఎంత తీరికలేని మనిషి చేతయినా ఒకసారి పత్రిక తిరగవేయించే ఘనత వీటికుంది. ఇప్పటిదాకా అంటే ఈ 1972 ఫలానా ఇవాళ తారీకుదాకా లెక్కవేస్తే కొన్నివేల కార్టూనులు, అంతకుమించి జోకులు తెలుగుపత్రికలలో వెలువడ్డాయి. ఇటీవలి 15 ఏళ్ళల్లో వీటిసంఖ్య చెప్పుకోదగ్గట్టుగా, వీటిఫలితాలు అంతకుమించి ఆనందించదగ్గట్టుగా ఉన్నాయి. ఆంధ్రప్రభ, పత్రిక, ఆంధ్రజ్యోతి, ప్రగతి, యువ, జ్యోతి, తరుణ, స్వాతి మొదలైన వార, మాస పత్రికలన్నీ ఇప్పుడూ కార్టూనులు జోకులూ ప్రచురిస్తూనే వున్నాయి. డిటెక్టివ్, సెక్స్ పత్రికలుకూడా వాటి వాటి ధోరణుల్లో వీటిని వేస్తున్నాయి. ఆంధ్రప్రభ వారపత్రికలో 'లోకోక్తిచిత్రిక' అనే

శీర్షిక ద్వారా చాలామంది కార్టూనిస్టులకు ప్రోత్సాహమూ, అవకాశమూ ఆ పత్రిక కలిగించింది. గతంలో ఆంధ్రజ్యోతిలో 'కార్టూన్ స్ట్రీట్' అని ప్రత్యేకంగా శీర్షికే వుండినది. ప్రగతి అనే సచిత్రవారపత్రిక 1970 దీపావళికి కార్టూన్ల పోటీ నిర్వహించింది (ఫలితాలు తెలుపనేలేదు. బహుమతులిచ్చారో లేదో కూడా తెలీదు– అది వేరే సంగతి అనుకోండి) ఆంధ్రజ్యోతిలో 'జోకాభిరామాయణం', జ్యోతిలో '(ప్రముఖుల హాస్యాలు', జగతిలో (ఒక మాసపత్రిక) 'నిమ్మతొనలు', విశ్వరచనలో 'చిట్టికథలు' ఇలా జోకుల కోసం ప్రత్యేక శీర్షికలున్నాయి. అయితే విచిత్రం ఏమిటంటే కార్టూనిస్టులసంఖ్య వేళ్ళమీద లేదుగానీ వేలమీద అసలులేదు. తొలివందల్లోనే వుందేమో! జోకులు చాలామంది రాసివుండచ్చు గానీ కార్టూన్లు మాత్రం అంత 'చాలామంది' వేయలేదు.

కార్టూను= బాపు, జోకు= ముళ్ళపూడి:

ఏ తెలుగువాడూ (నవ్వినవాడు, నవ్వేవాడు, నవ్వగలవాడు) కాదనలేని పరోక్ష నిర్వచనం ఇదే. సత్తిరాజు లక్ష్మీనారాయణ (బాపు), ముళ్ళపూడి వెంకటరమణ జమలికలుగా తెలుగుపత్రికల ద్వారా అనేక లక్షల పర్యాయాలు అనేక లక్షల పాఠకులకు కడుపునొప్పి తెప్పించిన పాపం వూరికేపోదు. అది మళ్ళీ వారి అడుగుజాడల్లో అనేక శిష్యపరమాణువులను సృష్టించి, మళ్ళా వాళ్ళ చేతుల్లో కార్టూన్ల ద్వారా, జోకుల ద్వారానే పోతోంది, పోతుంది. నిజానికి ఇవాళ 'మహతి' తన మహత్తరమైన మ్రోతలో ఈ విషయాన్ని కూడా ఒక రాగంగా సంతరించేలా కార్టూన్లు, జోకులకు ఒక గుర్తింపు దశను, విశిష్ట దశను చేకూర్చిపెట్టిన ఘనత ఆ జమలికకే దక్కుతుంది. వారి సంపాదకత్వంలో ఒకప్పుడు జ్యోతి మాసపత్రిక ద్వారా ఈ కార్టూన్లు, జోకులు ఒక విశేషపథానికి ఎక్కగలిగాయి. ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయి. జ్యోతిలో– తర్వాత కొన్నాళ్ళపాటు వారి దక్షతలోనే వెలువడిన 'సుధ' మాసపత్రిక కూడా ఈ కార్టూనులు, జోకుల ప్రక్రియలో ప్రత్యేకతను వెలార్చింది. ఇవాళ ఒక కార్టూనో, జోకో లేకుండా ఏ వారపత్రికా, ఏ మాసపత్రికా దాదాపు రావడం లేదనే చెప్పాలి. వచ్చినా ఆకర్షించడం లేదని ఖచ్చితంగా చెప్పాలి. పాఠకుల్ని ఆకర్షించడానికి పత్రికకు కావలసిన ముడిసరుకులో కార్టూనులు, జోకులు పనికొచ్చే ప్రథమ సరుకు.

ఇన్ ఎ నట్‌షల్ అను అద్దంలో కొండ:

పాతికేళ్ళ స్వాతంత్ర్యంలో తెలుగుపత్రికలలో కార్టూన్లు, జోకులు ఎన్నిరకాలుగా వచ్చాయో, ఎన్ని విభిన్నమైన గిలిగింతలను ఇచ్చాయో, ఎన్ని విషయాలను నవ్వులాట

చేసాయో, ఎందరి తత్వాలను, ఎందరు పెద్దమనుషులను ఎగతాళి చేసాయో, చిన్ని చిన్ని చురకలతో ఎందరిని తమలోకి తాము చూసుకునేట్లు చేసి, తెలియకుండానే సంస్కరణోద్యమంలో పాలు పంచుకున్నాయో చెప్పడం అంత సులభం కాదు. 'కార్టూన్లు– జోకులు+నేను' అని ఒక శీర్షికయిచ్చి ఒక సెమినార్ చేసినా పూర్తి వివరాలు వ్యక్తం అవుతాయా అన్నది అనుమానమే. ఈ స్వాతంత్ర్య యుగోదయంలో జీవితంలోని, సమాజంలోని ప్రతిరంగానికీ ఒక కార్టూనో, జోకో తెలుగుపత్రికకు ఎక్కిందనడంలో సందేహం అక్కరకురాని చుట్టమే అవుతుంది. భార్యాభర్తల పోట్లాటలు, మనుషుల అమాయికత, వెర్రివెంగళాయతనము, పిల్లలు, బళ్ళు, హోటళ్ళు, వంటలు, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఆఫీసులు, ప్రేమలు, వాహనాలు ఇలా కార్టూన్లకు, జోకులకు 'థీమ్'లుగా, ప్రేరణలుగా అనేకానేకం అనేకానేకరంగాల్లో వున్నాయి.

రాజకీయంగా తెలుగులో కార్టూన్లు అంతగా రాలేదు. ఇంగ్లీషు భాషలో ఇలాంటి విట్స్ ఎక్కువ వచ్చాయి. రాజకీయ కార్టూన్లంటే సాధారణంగా మంత్రుల వ్యవహారాల మీదా, ఎన్నికలమీదా, ఓట్లమీదా వేసే కార్టూన్లు అని కాదు నా అభిప్రాయం. నడుస్తున్న పాలనమీద– ఆయా పీఠాలమీద వున్న వ్యక్తుల ముఖాలను వ్యంగ్యంగా కార్టూన్లగా మలచి చురకల్లా వ్యవహరించిన కార్టూన్లు తెలుగు కార్టూనిస్టులు అతి తక్కువగా వేశారని నా అభిప్రాయం. బాపు, సాంబు– ప్రభ, పత్రికల్లో కొన్ని వేశారలాంటివి. మామూలుగా రాజకీయాలను వ్యంగ్యంగా చిత్రిస్తూ దినపత్రికల్లో కార్టూన్లు వేస్తున్నవారు కొందరున్నారు. ఆంధ్రప్రభలో పిళ్ళా సుబ్బారావు (చిత్తజగత్తు), ఆంధ్రజ్యోతిలో ఈ.వి.రమణ (లోకం పోకడ), ఆంధ్రపత్రికల్లో ఇలాంటి కార్టూన్లుంటాయి. 'శంకర్స్ వీక్లీ' లాంటి రాజకీయ కార్టూన్ల పత్రిక ఒకటి తెలుగులో వుంటే బాగుంటుంది. ఆ పత్రికలోని కార్టూనుకే తెలుగు చేరుస్తూ విశాలాంధ్ర మొదలైన పత్రికలు తరుచు ప్రచురిస్తున్నాయి. ఆంధ్రపత్రిక వీక్లీలో 'వూమెన్ కార్టూన్స్' ఒకటే పూర్తి రాజకీయ కార్టూన్ల శీర్షిక అని చెప్పాలి.

ఇవాళ మన జోకుల్లోనూ, కార్టూన్స్‌లోనూ తెలుగుతనం వున్నందుకు సంతోషించాలి. ఇంగ్లీషు, హిందీ, కన్నడం మొదలైన భాషలవాటితో పోల్చి చూసుకుంటే ఇంగ్లీషు తరువాత ఎక్కువ విశిష్టతకలిగినవి మన తెలుగు కార్టూనులు, జోకులే. జోకులకన్నా కార్టూన్లు వేయడం కష్టం. కార్టూన్లకు బొమ్మలు రావాలి. హాస్యరేఖలు కావాలి. వినోదధోరణివున్న ప్రతిమనిషీ జోకును సృష్టించగలడు. కానీ, కార్టూన్లు గీయడానికి చిత్రకళ రావాలి. గీతల్లో హాస్యం చొప్పించాలి. జోకు చప్పనిదయినా రేఖాకృతుల్లో బ్రహ్మాండంగా నవ్వించవచ్చు. కార్టూన్లలో బొమ్మలోని కనుముక్కు తీరు,

నోరు, వ్యక్తి వాతావరణం యొక్క ఆకృతి గమనించగానే నవ్వు పుట్టాలి. కార్టూనిస్టుల్లో ఇలాంటి స్వంత రేఖలు, చక్కనిగీతలు, తెలుగుతనం ఉట్టిపడేరీతులు ఉన్నవారు వేళ్ళమీదేవున్నారు. ఇవాళ సగానికి సగంమంది కార్టూనిస్టులు బాపు, గోపుల ననుకరిస్తూ తమ జోకులను అందులో చూపిస్తున్నవారే. రేఖలను సంతరించడంలో ఆ అందం, పొంకం, సహజత, హాస్యత కలిగి అందెవేసినచేయి 'బాపు'యే కావడం దానికి కారణం. స్వంతగీతలున్నా ఇతర కార్టూనిస్టుల రేఖల్లో మరి అంత అందం కనిపించమంటే పాఠకులకు కనిపించడంలేదు. అయినా సత్యమూర్తి, బాబు, జయదేవ్ మొదలైన కొందరిలో వారి ప్రత్యేక గీతల ధోరణిలో అందాలున్నాయి. బాపును అనుకరిస్తూ, అనుసరిస్తూ చంద్ర, సుధామ, అంజన్, మాధవి, రామకృష్ణ, శంకు, గుప్త, సురేంద్ర, టింగు, గోర్కీ, రషీదా, రమేష్, భవాని, త్రిగుణ్, రుక్మిణి మొదలైన కార్టూనిస్టులు ఇప్పటి తెలుగుపత్రికల్లో మనకు కనిపిస్తూంటారు. కార్టూన్లు చూడడమే, నవ్వడమే గానీ కార్టూనిస్టులను గుర్తించకపోవడం ఇవాళ పాఠకుల్లో కొంత ఉందని ఈ కొన్ని పేర్లుగానీ ఇంకా ప్రఖ్యాతులు, యువకులు అయిన కార్టూనిస్టులున్నారు. అందరిపేర్లు చెప్పడం కష్టం స్థలాభావం దృష్ట్యా. కేవలం అయోమయం, అందవిహీన రేఖలవల్ల కూడా రూప, విష్ణు మొదలైన కొద్దిమంది కార్టూనిస్టులు హాస్యాన్ని సృష్టించయత్నిస్తున్నారు.

శైలి:

కార్టూన్, జోకులకు ఒక ప్రత్యేకశైలి వుంది. ఆ శైలిలో అది సృష్టించే హాస్యం ఒకరకం ప్రత్యేకత. వార్నీ, గవఁత్తు, బాంది, ఏవోఁయ్, పాయింటేస్మీ, సమ్మో వంటిపదాలు ఈ శైలిలో వుంటాయి. ఈ కార్టూన్ల భాషలోకి వచ్చేటప్పటికి భాషాశాస్త్రజ్ఞులు కూడా నవ్వేయవలసిందే. ఈ శైలిలో కొన్నిచోట్ల మకారాన్ని అర్ధసున్నతో కూడిన 'వ'కారంగా మార్చడం వంటి రూపాలు హాస్యానికి మెరుగులు దిద్దడం జరుగుతోంది. ఈ కార్టూన్లశైలి 'జోకులాష్టమి'నాడు పుట్టాడనిపించే ముళ్ళపూడిలోనే విశేషంగా కనిపిస్తుంది. అతని 'బుడుగు' ఈ శైలిలోనేవుండి జోకు కథ అనో, జోకు నవల అనో అనిపించడానికి సందేహం అక్కర లేదంటుంది.

గుసగుస:

గా చెప్పుకోవలసిన కబురేమిటంటే కొన్ని జోకుల్ని కార్టూన్లు చేయచ్చు. కార్టూన్లను జోకులు చేయచ్చు. ఇవాళ చాలామంది ఆ పని చేస్తున్నారు కూడా.

కొన్ని జోకులకి బొమ్మసంతరించి కార్టూన్లుగానూ, కొన్ని కార్టూన్లలోని మాటలను బొమ్మతొలగించి జోకులు చేసుకోవడం, ఇప్పుడిప్పుడు పాతవాటిని మరల తిరగతోడడం, అటువిటువి విట్లుగా చేయడం కూడా జరుగుతోంది. కార్టూన్లలో అప్పడాలకర్ర దశ ఇటీవలే ముగిసింది అని చెప్పవచ్చు.

జోకా! నువ్వు హాస్యకథకు పునాదివా?– వర్ధిల్లు:

జోకులు ఆధారంగా చిట్టిచిట్టి కథలకు, ఓ మోస్తరు పెద్దహాస్యకథలకు నిర్మాణం కూడా జరుగుతోంది. ఆంధ్రపత్రికలో కొంతకాలంక్రితం హమేషా తమాషా కథలు, కథకానికథ వంటి శీర్షికలు అలాంటివే. ఆంధ్రజ్యోతిలోని 'గాథావళి' శీర్షిక ప్రముఖుల జోకావళే చాలాభాగం. కాలేజీలో ఒకరోజు, మరపురాని సంఘటన మొదలైన కొన్ని పత్రికల శీర్షికలకింద జోకులను కథలుగా మలచి అల్లినతనం కనిపిస్తుంది. హరికథల్లోనూ, బుర్రకథల్లోనూ– కథకులు ఈ కార్టూనిస్టుల జోకులను ఉపయోగించి జనరంజనకు కృషిచేస్తున్నారు.

పుస్తక ప్రచురణ:

నిండుగా నవ్వుకుందామని కార్టూన్లు జోకులతో వున్న పుస్తకాల్ని కొనుక్కుందామని మీరు బజారుకెడితే ఆంగ్లంలో లభించినన్ని తెలుగులో లభించవు. ఈ విషయంలో మనం కొంచెం బోల్డు వెనకపడేవున్నాం. కారణం కార్టూన్ల పుస్తకం ప్రచురించడం ఖర్చుతో కూడిన వ్యవహారం. జోకులతో పుస్తకం ప్రచురించడం సులభమే అయినా ఎందుకో అవీ ఎక్కువగా మనకు లేవు. కార్టూన్లు, జోకులు మిళాయించిన పుస్తకాలు నిజానికి ఎన్ని వెలువడితే అంత బాగానే వుంటుంది కానీ, ప్రచురణకర్త లెవ్వరూ నవలలు మొదలైనవి ప్రచురించినట్లుగా, ఒక కార్టూనిస్టు కార్టూన్లన్నిటినీ పుస్తకంగా ప్రచురించడానికి సాహసించరుమరి. అలాంటి సాహసం కొందరు చేయగా మనకువున్న కార్టూన్లు, జోకుల పుస్తకాలు పదుల్లోనే వున్నాయి. రసికజన మనోభిరామం, నవ్వితే నవ్వండి, యుక్తులూ ఛలోక్తులు మొదలైనవి అతిస్వల్పం. ఒకే వ్యక్తి కార్టూన్లు గల పుస్తకాలు వ్రేళ్ళమీద చెప్పవచ్చు. పిళ్ళా సుబ్బారావు 'చిత్రజగత్తు', సత్యం కార్టూన్లు ఆ కోవలోనివి. ఆ మధ్య ఎవరో కుర్రకార్టూనిస్టు పుస్తకం 'మైకార్టూను' చూసిన గుర్తు.

నిఝం... సీరియస్‌గా ఇంకొన్ని విషయాలు:

హాస్యపత్రికలు, కార్టూన్లపత్రికల పేర్లతో కొన్ని మాసపత్రికలు వచ్చాయి. జోకర్, నవ్వులు పువ్వులు, పకపకలు, హాస్యప్రియలాంటి నాలుగైదు. అయితే వాటిల్లోని కార్టూన్లు, జోకులు స్థాయికి ఎదిగి నవ్వించినవి చాలా స్వల్పం. ఆ పత్రికలు కూడా చాలామటుకు దెబ్బతినేసాయి. కార్టూన్లతో కొన్ని తెలుగు సినిమాల టైటిల్స్ కూడా చూపబడ్డాయి. 'బాలరాజుకథ' టైటిల్స్ చెప్పుకోదగ్గవి. సినిమా రెండోసారి ఆ టైటిల్స్ కోసమే చూశా నేను. 'ప్రేమించుచూడు' మొదలైన ఇంకొన్ని చిత్రాలు కూడా కార్టూన్లు చూపాయి. ఆ ప్రక్రియ విస్తరిస్తే బావుంటుంది.

పత్రికల్లో కార్టూన్లు, జోకులు చూసి నవ్వుకునేవారే తప్ప వాటిని వేసే కార్టూనిస్టుల గురించి ఎవరు ఆలోచిస్తున్నారు. ఆలోచిస్తున్నవారు తక్కువ. కొందరు 'కార్టూన్లు మీరే అంటే (మనుషులే అనేట), వేస్తారా' అని కార్టూనిస్టులను అడగడం నాకు వింతవేసింది. అవి పత్రికలే వేస్తాయి అని వారి ఉద్దేశ్యంట. (అచ్చు వేసేది అవే అనుకోండి) కార్టూనిస్టులు అనేది పత్రికల్లో ఒక ఉద్యోగంగా అంతటా స్థిరపడితే ఎలా వుంటుందో మరి ఆలోచించాలి? రచయితల్లాగానే కొన్ని పత్రికలకు కూడా గుత్తపుచ్చుకున్నట్లు కార్టూనిస్టులు కొందరుండడం పరోక్షంగా అలాంటిదే అనుకుందామేంటి పోనీ.

రచయితలకు, కవులకు వున్నంత గుర్తింపు కార్టూనిస్టులకు లేదు. "వీరు కార్టూన్లు వేస్తూంటారండీ", "వీరు ఫలానా కార్టూనిస్టుగారు" అంటే అది కూడా జోకుగానూ, కార్టూనులానూ, తీసుకుంటుంటే ఏం చేస్తాం. అంటే ఏం చేయలేమన్న మాటేగా. కార్టునిస్టులకిచ్చే ఆర్థిక ప్రోత్సాహం నాలుగూ అయిదూ. అవీ కొన్ని పెద్దపత్రికలే. అదే పెద్దమొత్తం అనేవారిని గురించి ఏమనగలం. ఏ ఆంధ్రప్రభలోనో ఒక ఫుల్‌పేజీ కార్టూన్లు పడితే అక్కడికి కార్టూనిస్టు కొండంత సంతృప్తి పడడం చూస్తూనే వున్నా.

కొన్ని పత్రికలు రెమ్యూనిరేషన్ చెల్లించవు సరికదా– కార్టూనిస్టుకు ప్రతి కూడా పంపవంటే మీరు ఆశ్చర్యపడిపోనక్కర్లేదు. (కొందరు రచయితలక్కూడా ఈ దిక్కు లేదుటలెండి) కార్టూనిస్టులకు కూడా కోరికలున్నాయి, శ్రమవుంది, బాధ్యతలున్నాయి, హక్కులున్నాయి. కాదంటారా! అనకండి. సంఘసంస్కరణకు సమాజంలోనూ, మనిషిలోనూ మార్పుకు– రచన సంగతేమోగానీ, కార్టూన్లు, జోకులు

మాత్రం పరోక్షంగానైనా కారణమౌతూనే వున్నాయి. హేళనగా, మృదువుగా, ఎగతాళిగా, ఒక్కోసారి కఠినంగా నడుస్తున్న రీతులమీద వెలువడుతున్న కార్టూన్లు చూసి లోలోపల తమమీదే అనుకుంటూ సిగ్గిల్లుతున్న వారిని నేను కనుక్కోగలిగానుకూడా. అందుకని కార్టూనిస్టులను గురించి కూడా సీరియస్‌గా ఆలోచించండి.

అందరికీ సంఘాలున్నాయి, సమావేశాలున్నాయి, సభలున్నాయి, కార్టూనిస్టు లకు లేవు. పెడదామని ఆశ. పెట్టవలసిందే. అఖిలభారత తెలుగు కార్టూనిస్టుల మహాసభ ఒకటి (సీరియస్‌గానే చెబుతున్నది. "ఇన్నాళ్ళుగా మనల్ని రకరకాలుగా, ఘోరంగా చిత్రిస్తూ వచ్చిన కార్టునిస్టులందరూ ఒకేచోట దొరికారు పట్టుకోండి" అని మహిళాసమాజం అప్పడాలకర్రలూ మొదలైన ఆయుధాలు పట్టుకువస్తున్నట్లు మా 'బాబు' కార్టూన్ నిజమైపోయినాసరే) నిర్వహించాలి. ఆ ఆవశ్యకత నిజంగా వుంది. కార్టూనిస్టుల సమస్యలు, సాధకబాధకాలు, కష్టనిష్ఠూరాలు చర్చించుకోవల్సిన అవసరం వుంది. కార్టూనిస్టుల పరిచయాలతో, ఫోటోలతో 'హూ ఈజ్ హూ' లాంటి గ్రంథం ఒకటి ప్రచురించాలి. పెద్దఎత్తున వ్యంగ్యచిత్ర కళాప్రదర్శనం జరగాలి. అందుకే "తెలుగు కార్టూనిస్టులారా ఏకంకండి" అని ఒక స్లోగన్ రాద్దామనుకుంటున్నాను. (నవ్వకండయ్యా బాబూ!) ఇవన్నీ జరిగితేతప్ప పూర్తిగా కార్టూనిస్టులంటే ఏమిటో జనానికి తెలీదు. ఇవన్నీ ప్రణాళికలు. సత్ఫలితాలను సాధించాలంటే కార్యరూపంలో యువభారతిలాంటి సంస్థలే పూనుకోవాలి. అలాంటి సంస్థ యువభారతి ఒక్కటే కాబట్టి ఎప్పటికైనా దీనికి యువభారతే పూనుకోవాలి. తను పూనుకోవడం, పూనుకోకపోవడం అన్నది, కార్టూనిస్టుల, తెలుగువాళ్ళ భాగదేయంమీద ఆధారపడి వుంటుంది.

ముక్తాయింపు:

స్వాతంత్ర్యయుగోదయంలో తెలుగుపత్రికల్లో కార్టూనులు, జోకులు అనే నాకు ప్రసాదించిన ఈ విషయానికి నే చేసిన న్యాయాన్యాయాలు ఏమిటోగానీ, ముగింపుగా ఒకటేమాట– "కార్టూన్లను, జోకులను హాస్యంగా తీసుకోండి. అభ్యంతరంలేదు. కానీ వాటిని సంతరించే మనుషుల (కార్టూనిస్టుల) జీవితాలను మాత్రం జోకుగా తీసుకోకండి. జోక్ చేయకండి".

('మహతి' యువభారతి స్వాతంత్ర్య రజతోత్సవ వ్యాస సంపుటి–14 ఆగస్టు 1972)

❖

(2) నేటి తెలుగు నవల గురించి...

మధిర సుబ్బన్న దీక్షితులుగారు మహానుభావుడని శ్రీ గోరాశాస్త్రి ఊరికే అనలేదు. నేటి కాల్పనిక సాహిత్య పీఠాధిపతులైన రచయిత్రులను పరికిస్తూంటే వారు దీక్షితుల మానస పుత్రికలై పాఠక ప్రపంచంలోకి తమ కలం పంటలను ఎంతటి విరళంగా ధారాళంగా పంచిపెడుతున్నారో, ఎంతటి స్వాప్నిక పరిపాలనను సాగిస్తూ మత్తుమందు సుఖడోలలు ఊపుతున్నారో గమనించినప్పుడు 'నవలామణుల నవలారాజాలు కాశీమజిలీల పునర్జన్మ' అన్న శాస్త్రిగారి ఉవాచను బేషరతుగా ఒప్పేసుకోవలసిందే.

నవలా సాహిత్యం నిజంగా నిత్యవంటకంగా విరాజిల్లుతోంది నేడు. కమ్మని మసాలాతో, పోపుతో వంటకాలు చేసి వడ్డిస్తున్నారు రచయితలు ఆడా, మగా కూడాను. ఆ రుచి మరిగిన భోజనప్రియులకు అది పోషకాహారమా, కల్తీసరుకా అన్న వివేచనే పోతోంది. విస్తరిముందు కూచుంటే ఎన్నిగంటల వడ్డన అయినా నిరంతరంగా తినమరిగేట్టు వంట చేయడానికి పోటీపడి, పోటీల్లోపడి గరిటె పుచ్చుకుని సిద్ధమౌతున్నారు తయారు చేసేవాళ్ళు.

'ఉరుకులతో, పరుగులతో, ఆఫీసులకు, కాలేజీలకు, కంపెనీలకు చేరుకుని యంత్రాలలా పనిచేసే ప్రాణులకు విరామసమయంలో ఉల్లాసం కలిగించే రచనలు కావాలి!'

'కొద్దిపాటి పాండిత్యంతోనే అర్థం చేసుకొనగలిగేలా ఉండాలి!'

"ఇంటి ఇల్లాలికి పొరుగింటి పుల్లమ్మ లోకాభిరామాయణం కంటె ఇంకాస్త మజాగా ఉండే అద్భుతమైన రచన కావాలి!"

అని– ఇలా కావలెను ప్రకటన వేసి "అందుకోసం సత్వరమే ఉపయోగించండి ఫలానా రచయిత్రి మార్కు ఫలానా నవల" అన్నట్లుగా బ్రహ్మాండమైన పబ్లిసిటితో సరుకులు దిగుమతి అయిపోతున్నాయి.

'సామాజిక జీవనాన్ని ఐశ్వర్యం పరిపాలించటంవల్ల కలిగే ఒడిదుడుకులు చిత్రించలేకపోయినా– ఏ రకంగా వ్రాస్తే డబ్బు మరింత ఎక్కువ సంపాదించుకోవచ్చునో గ్రహించి ఆ రకంగానే వ్రాస్తున్నారు. సమకాలీన ప్రభావాన్ని తప్పించుకోవటం ఎవరితరం!' అని సి.ఆనందారామంగారు ఒకచోట తనను కూడా ఆ గాడికే కట్టేసుకున్నారు.

'నేటి తెలుగు నవల ఆశాజనకంగా లేదు. సినిమా కథలలాగా అసహజమైన సంఘటనలు– అవాస్తవికమైన సన్నివేశాలు, అనుచితమైన నాటకీయ ధోరణీ, అర్థంలేని కల్పనలు, అధిక సంఖ్యాకంగా వెలువడుతున్న నవలల్లో కనబడుతున్నాయి' అన్నమాట మంజుశ్రీదే అయినా భావం చాలామందికి ఉన్నదే.

పత్రికలు ఎన్ని ఎక్కువ పుట్టినా కొత్త రచయితలు ఘోషిస్తూనే ఉన్నారు. చేయి తిరిగిపోయిన రచయితలు పత్రికలన్నిటినీ ఫీడ్ చేయలేక– వారిమీదే ఆధారపడి ఆ పత్రికల వాళ్లు జీవిస్తున్నారు కాబట్టి– చెత్తయినా నింపేస్తున్నారు.

ఇప్పుడు కొత్తట్రెండ్ వచ్చింది. అది మాసపత్రికల పాలబడింది. ఫలానావారి పూర్తి నవల అని–మాసపత్రికలో సగం పేజీలను నింపేసుకుంటున్నాయి ఆ పత్రికలన్నీ! ప్రతి మాసపత్రికలోనూ ఇవాళ విధిగా ఇలాంటి ప్రచురణ సాగడం మొదలుపెట్టింది. నవలల క్రేజ్ ఎంతకు పెరిగిపోయిందో ఇదే ప్రబల తార్కాణం. "నవలలు తప్ప కథలు చదవం. కథలు చదవడమేమిటీ?" అనే స్థాయికి వచ్చేస్తారేమో ముమ్ముందు పాఠకులు. ఇంక సీరియల్ నవలల సంగతి చెప్పనవసరమేలేదు. ఒకే కలంనుండి పలు పత్రికలకు సీరియల్ నవలారాజాలు ప్రవహించి ఏ వారానికావారమో, ఏ నెలకానెలో– ఎప్పటికప్పుడు– దేనికి దానికే వ్రాయవలసివచ్చి– కలమే తబ్బిబ్బైపోయి– ఈ నవలలో వాళ్ళు ఆ నవలలోకి– ఆ నవలలో జరగాల్సిన కంటిన్యూటీ ఈ నవలలోకి– జరగడం వంటి ప్రమాదాలు ఎదురైన సందర్భాలూ వచ్చాయి.

'చదవగలగడమే తప్ప గాఢమైన సాహిత్యాభిరుచిలేని పాఠకులను తృప్తి పరచటానికి, చదవడం తప్ప ఇంకేమీ చేతకాని వాళ్ళుగా ఆ చదువరులను తయారు చేయడానికి ఇవాళ్టి పత్రికల నవలలు కంకణం కట్టుకున్నట్లున్నాయి'.

సాహిత్యపు విలువలతో, ప్రయోజనవంతమైన రచనా సంవిధానంతో, ఆలోచనలను రేకెత్తించి కొత్త మలుపులు తేగల్గే రచనలు ఒకటో రెండో వెలువడుతున్నా సముద్రంలో కాకిరెట్టలాగా అవుతున్నాయి. అలాంటి రచన ఒకటి చదివి నిలిచి మాట్లాడకుండానే మళ్ళీ మత్తు వెల్లువ పాఠకుడిని ముంచెత్తుతోంది.

వ్యక్తుల ప్రైవేట్ గాథలు:

ఈ నవలారచనల రొటీన్‌ను పురాణం ఒకచోట ఇలా వ్రాశాడు– "ఇవన్నీ కూడా ప్రజల సమష్టి జీవితాన్ని చిత్రించడానికి మారుగా, వ్యక్తుల ప్రైవేటు గాథలుగా మాత్రమే వుంటున్నాయి. అన్నిటా నాయికా నాయకులు నిండుగా పాకిపోతారు. ఇంకా మూసపోసినట్టే మరికొన్ని పాత్రలు– విలన్ అనీ, కమీడియన్ అనీ, సెకండ్ హీరోయిన్ అనీ మనకు తటస్థ పడుతుంటారు. సాహిత్య కళారంగాల్లో ఇవి ప్రజలను దగా చేస్తున్న పాత్రలు. నిజమైన మనుష్యులు వీరిలా వుండరు. నిజజీవితంలో ఎక్కడా సంభవంకాని పాత్రలు వీరు. అయితే నల్లమందులా ఈ విషయం తరతరాలుగా ప్రజల తలకెక్కింది. ఈ యంత్ర యుగంలో మనిషి నలుసుకంటె అల్పాతి అల్పమైన ప్రాణి. వారి శృంగార జీవితం, వారి ప్రైవేటు వ్యవహారాలు ఇంతింతలు చేసి సాహిత్యంలో కెక్కించి జనాన్ని చావగొట్టేస్తున్నారు. సాహిత్యం– నవలైనా, కావ్యమైనా మరే పుస్తకమైనా చదివినప్పుడు కలిగేది వ్యక్తిగత ఆనందమైనప్పటికీ, అది జనం సామూహిక జీవితాన్ని ప్రతిబింబించేదిగానే ఉండాలిగాని, వ్యక్తుల ప్రైవేటు వ్యవహారాలను పెద్దవిచేసి చూపే భూతద్దాల్లా ఉండటం అవసరమా?" మనిషి లోపలి మనిషిని గురించి తెలుసుకొనకుండా బయట మనిషిని గురించి వ్రాయడం అసహజమూ, అవివేకమూ అంటాడు పురాణం.

యువతీ యువకులు ముఖ్యంగా అమ్మాయిలు– ఈనాటి నవలా పఠనంలో గొంతునిండా కూరుకుపోయినట్లున్నారు. నవలల్లో పాత్రల శృంగార జీవితాన్ని, వారి విలాస జీవితాన్ని, మనస్తత్వాలను, చేష్టలను ఆదర్శంగా ఊహించుకుని ఆ పాత్రలు తామే అన్నట్లుగా కలలలో తేలిపోతూ, వాస్తవ జీవితంలోకి వచ్చేటప్పటికి ఎదురు దెబ్బలు తింటున్నారు.

వస్తు వైవిధ్యం, కొత్తదనం:

కొత్త విషయం, ఏమీలేకపోయినా చెప్పే పద్ధతిచేత చదివించే రచనలు వచ్చేస్తున్నాయి కొన్ని. ఒకే కలంనుండి ఒకే కథ పలు నవలలుగానూ వచ్చేస్తుంది.

ఆదర్శవాద ధోరణి:

వ్యవస్థలో మార్పురాకుండానే వ్యక్తుల మంచితనంతో మార్పులు వస్తాయనే భ్రమ ఈ మార్కు నవలల్లో తొంగిచూస్తూంటుంది. దానితో కొన్ని ఆదర్శవాద ధోరణిలో

ఊహించిన కల్పనలై ప్రయోగాత్మక నవలలుగా, ప్రయోజనవంతమైన నవలలుగా పేర్కొనబడుతూ, మరింత ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి. రాజకీయంగా, సామాజికంగా వచ్చిన వేగవంతమైన పరిణామాలను సాహిత్యం అందుకోలేకపోతోంది. రచనలలో ఆ ప్రతిబింబాలు అత్యంత అస్పష్టాలుగానే వుంటున్నాయి.

తెలుగునవల పుట్టి నూరేళ్లు పైబడినాక ఇవాళ నవలల తీరు తెన్నులను చూస్తే శోచనీయస్థితే అనిపిస్తుంది. వెలువడిన కొన్ని వేల నవలలలో సమాజాన్ని ప్రభావితం చేసి చదువరులలో చైతన్యోద్దీపనం కలిగించిన నవలలు, రచయితలు వేళ్ళమీదే తప్ప చెప్పుకోదగ్గ సంఖ్యలో రావలసినంతగా రాలేదు.

వాస్తవికంగా సమాజంతో ప్రోత్సహింపబడని ప్రేమవివాహాలు, కులాంతర, మతాంతర, వర్ణాంతర వివాహాలు ప్రతి నవలలో మాత్రం వ్రాయబడుతూనే వున్నాయి! తనదాకా వస్తే తన్నితగలేసే ఆదర్శాలు, ఆశయాలూ రచయితలు రచనలలో మహోన్నతంగా గుప్పిస్తూనే వున్నారు! పురుషుల దౌర్జన్యాలను ప్రతిఘటిస్తూ స్త్రీలను ఎత్తుగా నిలబెట్టే రచనలు చేస్తూనే, వాస్తవిక జీవితంలో అలా ఎదుర్కొని నిలుస్తున్న సాటిస్త్రీని రచయిత్రులు అపహసిస్తూ చెవులు కొరుక్కుంటూనే వున్నారు! దుమ్మెత్తి పోసుకుంటూనే వున్నారు. అట్టడుగు సామాన్యుడి మీద బోలెడు సానుభూతిని రచనలో వర్షింపచేస్తూ–నిజానికి అటువంటి సామాన్యుడే ఎదురైతే వాడిని విదుల్చుకుంటూనే వున్నారు. కష్టించి పనిచేసేవాళ్ళు వర్ధిల్లాలి అన్నా, కష్టానికి తగిన ఫలితాన్ని తామెక్కిన రిక్షావాడికైనా అందించకుండానే గీచిగీచి బేరాలు ఆడుతూనే వున్నారు! ఇలా రచనకు జీవితానికి పొత్తుకుదరడం లేదు.

ఇవాళ వెలువడుతున్న నవలలలో 90 శాతం రచనకూ జీవితానికీ సమన్వయం కన్నా వైరుధ్యాన్నే ఎక్కువ చేస్తున్నట్లున్నాయి. కాల్పనిక సాహిత్య సామ్రాజ్యం విశాలమై వాస్తవిక ప్రపంచం అమితంగా సంకుచితం అయ్యేందుకు రచయిత (త్రు)లు ఇలానే దోహదం చేస్తుంటే– భవిష్యత్తు, యువతరం ప్రమాదంలో పడుతుంది. యువతరం దీన్ని ఎదుర్కోవాలి.

(ప్రజాతంత్ర వారపత్రిక, 3 నవంబర్ 1974)

❖

(3) సామయిక కవిత్వం

దీపావళి కవిసమ్మేళనం, ఉగాది కవిసమ్మేళనం, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా కవితాగోష్ఠి... అని ఒక పక్క–

జన్మదిన ప్రత్యేక సంచిక, గాంధీజయంతి ప్రత్యేక సంచిక, దసరా సంచిక, క్రిస్టమస్ ప్రత్యేక సంచిక... ఇలా అని మరో పక్క–

'ఈ సారి ప్రత్యేక సంచికలో నీ కవిత లేదేమిటోయ్ మిత్రమా!' అని ఒక పక్క–

'మొన్న కవిసమ్మేళనానికి మీరు రాలేదేమండి' అని మరో పక్క–

ఏమిటిదంతా?– అకేషనల్, పొయెట్రీ. సామయిక కవిత్వం.

'ఒక మొబైల్ యూనిట్‌లాగా వుందండీ! నగరంలో ఎక్కడ కవిసమ్మేళనమైనా కవిత్వం చదివేది అవే ముఖాలు'.

'ఇదేదో కాంట్రాక్ట్ పాడినట్లుంది. స్పెషల్ ఇష్యూలంటే వీళ్ళ కవితలు కంపల్సరీగా వుంటున్నాయి, వుంటాయి'.

ఎందుకిదంతా?

గమ్మత్తేమిటంటే కొత్తగా కలంపట్టిన కవులకూ ఈ అకేషనల్ పొయెట్రీయే అచ్చుపురుటికి అవకాశం ఇస్తుంది.

అంతో యింతో వ్రాస్తూన్న కవులు వీటికి ఆసక్తి చూపిస్తూనే వుంటారు.

ప్రసిద్ధులు, ప్రఖ్యాతులు అయిన కవులకూ ఇవి తప్పవు. వారు తమ రచనతో ప్రాణం పోయందే లాభం లేదు వీటికి.

అతను రాసిన కవిత్వమంతా దీపావళి మీదా, ఉగాదుల మీదా తప్పితే అతని అసలు కవిత్వం ఊహలు ఏమిటో తెలియనే తెలియవు. పండగలకు తప్ప అతనసలు

కవిత్వం వ్రాయలేడు. కవిసమ్మేళనం ఎక్కడ జరిగినా అతడు హాజర్. ఇది నిఖార్సయిన సామయిక కవి, అకేషనల్ పొయెట్ ప్రాథమిక ప్రతిభా లక్షణాలు. అతనికి కవిగా ఎంత పాపులారిటీ వుంటుందో, ఆ కవిత్వం గురించి అంత చులకనా వుంటుంది జనాలకు. ఏమిటీ సామయిక జాడ్యం. ఇదీ అవకాశవాద లక్షణమేనా? ఇలా పండగలకు పబ్బాలకు ఇన్‌స్టెంట్ పొయెట్రీ కాచి ఇవ్వడం కవి లక్షణమేనా? పెళ్ళిళ్ళకు కూడా భోగంమేళాల్లా కవిసమ్మేళనాలూ– కావ్యగానాలూ... ఇదిలా సాగవలసింది అవసరమేనా?

మరో భావన:–

సామయికమంటే పండగలూ పబ్బాలేనా? ఉద్యమ సందర్భాలూ, యుద్ధాలూ ఇవీ అకేషనల్ కిందికి రావా?

బంగ్లాదేశ్ యుద్ధ సందర్భంగా జరిగినవి, ప్రాంతీయ పోరాటాలు (సారీ), ప్రాంతీయ కలహాల సందర్భంగా వెలువడినవీ, ఆ కవిత్వాలన్నీ సామయిక కవిత్వం కిందకు రావా?

సామయిక కవిత్వంలో కవిత్వ లక్షణాలంటూ వుంటాయా అసలు? అసలుసిసలు కవిత్వం వెలువడే అవకాశముందా? దీన్ని గురించి ఆలోచించవలసిన అవసరం వుంది.

ఉద్యమాలూ, కవిత్వమూ...:

అసలు ఉద్యమాలకూ కవిత్వానికీ చాలా సన్నిహిత సంబంధముంది. ప్రముఖమైన కావ్యాలు ఏదో ఉద్యమ సందర్భంగా జనియించినవిగానూ, ప్రముఖులైన కవులూ ఏదో ఉద్యమం రోజుల్లోనే ప్రముఖమైనట్లుగానూ అనిపిస్తుంది. అయితే స్వతహాగా ప్రసిద్ధులైన కవులూ, ప్రసిద్ధమైన కావ్యాలూ లేవా అంటే వున్నారు. వుండచ్చు. కానీ తక్కువ సంఖ్యగానో, తక్కువ ప్రముఖంగానో వున్నాయని చెప్పాలి.

ఉద్యమాల సందర్భంగా వచ్చిన కవిత్వాలు చాలా. ఉద్యమంగా వచ్చిన కవిత్వాలూ వున్నాయి. అయితే ఉద్యమోద్ధృతంగా వున్న వాని వెనుక ప్రేరణలు– సామాజికంగానో, రాజకీయంగానో– సంఘర్షణాయుతంగా ప్రబలంగా వున్న సమస్యలు, సాగుతున్న చరిత్రలు.

అయితే సామయికకవిత్వ రచనల్లోనూ కవి స్వయంశక్తి గోచరిస్తూనే వుంటుంది. సంప్రదాయబద్ధంగా, ఛందోగుణ సహితంగా కవిత్వం రాసేవాళ్ళు దీపావళి మీద

రాసినా, దీపాల దుకాణం సేఠ్‌గారి షష్టిపూర్తిమీద రాసినా– సీసాలు తయారు చేస్తూనే వుంటారు. గేయాలు రాసేవాళ్ళు గాయాలు చేస్తూనే వుంటారు. ఇక వచన కవిత్వం సంగతి సరేసరి! దీపావళిని రమ్మని కొందరంటే, పొమ్మని కొందరంటారు. దీపావళిని సుందరి అని కొందరంటే మంధర అని కొందరంటారు. దీపావళే కాదు, ఏ పర్వాన్నయినా ఇలా చిత్రిస్తూనే వుంటారు.

సామయిక కవిత్వం ఎందుకు అంటే ఒక పద్ధతిలో ఇలా సమాధానం కనబడుతుంది. 'ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం' అని కవిలక్షణాలు. అంటే కవి కావడానికి లక్షణాలు అన్నమాట. మొదటి రెండింటి సంగతి పక్కనపెట్టి, అభ్యాసం విషయం తీసుకుందాం. ఏ కళకయినా సాధన అవసరం. ఆ సాధనకూడా క్రమబద్ధంగా పరిణామం చెందితేనే ఒక ప్రత్యేక వైశిష్ట్యాన్ని సంతరించుకుంటుంది. నిరంతర అభ్యాసం లేనిదే కళ వికాసం చెందదు. పైగా మరుగున పడిపోవచ్చు. గాయకుడు, వాద్యగాడు రోజుకో గంటయినా సాధనచేయాలి. చిత్రకారుడయినా తరచుగా చిత్రలేఖనం చేయకపోతే గీత పాడయిపోతుంది. చెయ్యి తిరగదు. అదే విధంగా కవిత్వరచన కూడా చేస్తూండాలి. అంటే ఆలోచనా క్రమంనుండి జారిపోయే యాంత్రికతకు కవి వశమై పోతే– ఊహాశక్తి, భావశబలత, భావపుష్టి క్షీణించి పోతాయి. అందుకని ఏదో ఒకటి రాస్తూ వుండాలి అని. ఈ దృష్టిలో సామయిక కవిత్వం అటువంటి అభ్యాస అవకాశాన్ని కలిగిస్తుంది. ప్రతి ఏడాదీ పండుగలు వస్తూనే వుంటాయి కాబట్టి ఆ వంకన కవిత్వాభ్యాసం, అంతోయింతో వెంటనే ఫలితం సమకూరుతాయి. రాయని భాస్కరులు అయిపోకుండా ఏదో రాయడం వీలవుతుంది.

మరో దృష్టిపథంలో మరోమాట వినిపిస్తుంది– 'కవిత్వం దానంతట అది రావాలి కానీ కృత్రిమంగా తయారు చేయడమేమిటి?' అని. ప్రేరణలు కలగవలసినవే కానీ కల్పించవలసినవి కావు అని వారి అభిప్రాయం. స్పందన చెందిన హృదయం ఊహించగల మేధతో భావాలను అక్షరాకృతిలో నిల్పుతుంది. అయితే ఆ స్పందన కలిగేదా? కలిగించబడేదా? ప్రతి పండగా ప్రతి కవికీ ప్రతిసారీ స్పందన నివ్వదు. అటువంటప్పుడు స్పందనశక్తి మరోవైపునుండి రావాల్సి వుంటుంది.

వాతావరణ ప్రభావం:

సామయిక కవిత్వంలో వాతావరణ ప్రభావం ప్రతిఫలించే అవకాశం వుంది. వాతావరణాన్ని కవిత్వం సంతరించుకున్నప్పుడు అందులో కవిత్వలక్షణం కన్నా డైరీ

లక్షణమే కన్పిస్తుందనేవారూ వున్నారు. ఒక దీపావళికి సామాజికంగా వాతావరణం ఏదో సమస్యోద్రిక్తంగా వుందనుకుందాం. అప్పుడు కవిత దీపావళి గురించి రాసిందే అయినా, వాతావరణానికి అనుగుణ్యంగా మలచబడటం జరుగుతుంది. దీనివల్ల అప్పటి పరిస్థితుల స్పర్శ కనబడుతుంది.

అయితే కొన్ని కవిత్వాలుంటాయి. అది ఆ పండగ ఎప్పుడు వచ్చినా పనికివచ్చే పద్ధతిలో తయారు చేయబడి రెడీమేడ్ డ్రెస్‌లో వుంటాయన్నమాట. 1960 లో వ్రాసిన ఓ ఉగాది కవిత ఆయనగారిది, 1974 లోనూ చదివి వినిపిస్తారు. 1994 లోనూ చదివి వినిపించగలరు. అయితే అందులో సార్వకాలీన గుణం వుంది అని సమర్థించితే ప్రమాదంలో పడతాం. అది కవితే కాదనేవారుంటే కవితాగుణం ప్రసక్తి ఎక్కడిది?

కవిత్వ రచనపట్ల స్థిరమైన ఆశయం, ఆదర్శం వున్నవారు, సామూహిక, సామాజిక ప్రయోజననిమిత్తం కవిత్వం అని నమ్మేవారు ఈ సామయిక కవిత్వం చేపట్టకూడదా? చేపట్టటంలో ప్రమాదం వుందా? వీటికి సమాధానం వారేమిస్తారో కానీ చాలామంది చేపడుతూనే వున్నారు. అయితే వారి రచన వికాసవంతంగానే వుండడం కనిపిస్తోంది.

జాతి నాడుల్లోకి ఎక్కిన కొన్ని ఉపమానాలు, జాతీయాలూ, వ్యక్తులూ, సన్నివేశాలూ, సందర్భాలూ వుంటాయి. వాటిని ఉపయోగించుకోవడం ద్వారా తాము చెప్పదలచుకున్న నవ్యసిద్ధాంతాన్ని, నూతన పథాన్ని, మార్పుకు దోహదం చేసే ఆశయాన్ని ప్రజల్లోకి చేరువగా తీసుకువెళ్ళగలిగినప్పుడు ప్రయోజనదాయకమే కానీ, ఆ పురాతన ఛాందసాలను తాను తలకెక్కించుకుని ప్రమాదంలో పడితే ప్రమాదమే! ప్రబంధాలను, పురాణాలను దుయ్యబట్టేవారు, ప్రయోజన రాహిత్యాలని తిరస్కరించేవారు వాటిలోని పాత్రలనో, సన్నివేశాలనో తమ నూతన రచనల్లో ఉపమానాలుగా ఉపయోగించడం జరుగుతోందంటే– వాటిని పేర్కొనడం ద్వారా ఇదివరకే అవి, వాటి తీరుతెన్నులు పాఠకులకు తలకెక్కి వుంటాయి కాబట్టి వాటితో ఉపమించడం ద్వారా– తమ నూతన ప్రతిపాదనను త్వరగా పాఠకులు అర్థం చేసుకునే అవకాశముంటుందనే.

అలజడి మా ఊపిరి
ఆందోళన మా జీవితం
తిరుగుబాటు మా వేదాంతం

అని ఒక కవి అన్నాడనుకోండి. ఆ 'వేదాంతం' అన్న పదప్రయోగం వల్ల అతడు ఆస్తికుడనీ, జీవితంలో వేదాంతంతో ఊపిరి తీసుకుంటున్నాడనీ ఏ ఒక్కడైనా అనుకుంటే వాడిని చూసి మనమంతా నవ్వుతాం. కవిత్వాన్ని అర్థం చేసుకోలేని వాడని అంటాం. తిరుగుబాటును వేదాంతంతో ఉపమించడం వలన జీవితంలో వేదాంతం ప్రాధాన్యం– అనుకునేవాళ్ళకు సైతం ఈ కవి తిరుగుబాటు ఆవశ్యకతను ఎంతగా చాటి చెబుతున్నాడో అర్థమవుతుంది.

ఇలాఅంటే ఎప్పటి సమయంలోని పదాలో, భావాలో, ఇప్పటికీ ఉపయోగిస్తూండడంలోని భావన, ఉద్దేశం ఇది. సామయికమైన విషయం సమర్థమైన ఆశయాన్ని, ప్రయోజనాన్ని వ్యక్తీకరించడానికి కూడా అవకాశం ఇవ్వగలదనిపిస్తుంది ఒక్కొక్కసారి. సామయిక కవిత్వం గురించి చెప్పవలసింది ఇంకా ఎంతో వుంది. మరోమారు వీలయితే ప్రస్తావిద్దాం.

(ప్రజాతంత్ర వారపత్రిక, 1 డిసెంబర్ 1974)

❖

(4) చిన్న కథల కథ

ఓ పత్రికా సంపాదకుడిని ఓ రచయిత కలుసుకుని 'అయ్యా! నా చిన్న కథ మీరు ప్రచురిస్తున్నారా!' అని అడిగాడు. సంపాదకుడు 'అయ్యా! అందరికీ తెలిసిన అనగనగా ఒక రాజు. ఆ రాజుకు ఏడుగురు కొడుకులు... ఆవటా! కాపీ కథను తీసుకొచ్చి ప్రచురించమంటారేమిటండీ!' అని కోప్పడ్డాడు. దానికి రచయిత 'అసలు ఆ కథ రాసింది నేనేనండీ. ఒకటోతరగతి వాచకాలకు నేనే యిచ్చానది. అయినా మీ కిచ్చినప్పుడు కొత్తగా వుంటుంది అని, దానికి శీర్షిక 'అనగనగా ఒక రాజు లేక ఏడు చేపల్లో ఎండని కథ' అంటూ పెట్టాను చూడలేదూ?...' అన్నాడు. పత్రికా సంపాదకుడు నోరు వెళ్ళబెట్టాడు.

ఎప్పటెప్పటి కథలో ఇప్పటికీ ఎందరెందరి పేర్లమీదో చెలామణి అయిపో తున్నాయి. రాజకుమారులు, మాయలఫకీర్ల కథలే కాదు సాంఘికేతివృత్తాలతో దశాబ్దాల క్రితం వెలువడిన కథలు ఎన్నెన్నో, వాతావరణాన్ని మాత్రం మార్చుకుని సాగి పోతున్నాయి. పత్రికా ప్రపంచంలో కథానికల అవసరం పెరిగిపోతోంది. వారంవారం, నెలనెలా వెలువడుతున్న ఎన్నెన్నో పత్రికల మనుగడకు కథలు ఆహారం, అందునా నిత్యావసర పదార్థం– అయిపోయాయి. అందుకే లెక్కవేసుకుంటే ఏటా కొన్నివేల కథానికలు వెలువడుతున్నాయి.

చిన్న కథలు అనే ప్రక్రియ మనది కాదనీ, పాశ్చాత్యుల నుండి అరువు తెచ్చుకున్నదనీ అనేవారున్నారు. కానీ కథ పేరు మన తెలుగు సాహిత్యంలో శతాబ్దాల క్రితమే వినిపించింది.

జనాకర్షకమైన ప్రక్రియ:

అసలు కథల మీద ఆసక్తి ఎక్కడనుంచి పుట్టిందంటే తెనాలి రామలింగడి కథలు, అక్బర్ వీర్బల్ కథలు, కాశీ మజిలీకథలు, పంచతంత్రం కథలు అని చెప్పాల్సి

వస్తుంది. ఈ కథలన్నీ జనహృదయాలలోకి ఎంతగానో చొచ్చుకు పోవడం వలననే కథానిక ప్రక్రియ అనేది జనాకర్షకమైన ప్రక్రియ అనే సత్యం వెల్లడయింది. అనేకమైన జానపద కథలు కూడ జనహృదయాల్ని దోచుకున్నాయి. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే– కథా సంస్కృతి తెలిస్తే గానీ, దాని పరిణామ దశ తెలియదు. ఏ ప్రక్రియాను గుణమైన రచన సారాంశమైనా రెండు రకాలు. ఒకటి ఆహ్లాదం, రెండవది ప్రయోజనం. కథానందంతో బాటు లౌకిక జీవన నియమం కూడా కథలతో వచ్చింది. సహితస్వభావం సాహిత్యం అయింది. కథాసాహిత్యమైనా అంతేకదా. 'మన జీవితంలో వచ్చే మార్పులే మన సాహిత్యం, కళల్లో కూడా వస్తాయి. ఏతరం ఆ తరానికి కావలసిన సాహిత్యాన్ని సృష్టించుకుంటుంది. రేపటి రచయితలు రేపటికి కావలసిన కథలు రాస్తారు'. అందుచేత ఒకనాటి కథలకూ, ఈనాటి కథలకూ మార్పు ఏర్పడింది. అయితే అది ఏ రూపంలో ఎంతవరకూ అన్నది చూడవలసినదే. మాయలు, మంత్రాలు, ఇంద్రజాలాలూ, శాపాలు, వరాలూ, అపురూప సాహసాలు ఒకనాటి కథలు. ఈనాడూ అలాంటి కథలు లేకపోలేదు. అయితే ఒకప్పుడు అధికశాతం పాఠకులను అలరించినా అవి ఇవాళ అంతశాతంలో లేవు.

ఇవాళ అధికశాతం పాఠకులు చదవడానికి కోరుకుంటున్న కథలు వేరు. పాత కథలే అయినా కొత్తగా చెప్పగలిగితే చాలు అన్నట్లుగానూ కొంత ధోరణులు కనబడుతున్నాయి. అందుకే ఇవాళ్టి రచయిత్రుల కథలు కాశీమజిలీల పునర్జన్మ. కథలకు కావలసిన ముడిసరుకును జీవితం నుంచి పిండుకునేవారికి జీవితం గూర్చి సరైన అవగాహన లేకపోవడం ప్రథమ శోచనీయం. అందుకే అటువంటి వారు వ్రాసే రచనలు ఆహ్లాదాన్నిచ్చినా ఆలోచన ఇవ్వవు. ప్రయోజనం గురించి తలపోయ నీయవు. కథల పాప్యులారిటీకి, కథల యోగ్యతకీ అట్టే సంబంధంలేదు. చాలా బాగా రాయని కథలు జనాన్ని ఆకర్షించవచ్చు. పర్ఫెక్టుగా రాసిన కథలు ఎవరూ చదవకపోవచ్చు. కథానిక హైబ్రోస్ కోసం కాదు.

"ఇంటలెక్చువల్ జిమ్నాస్టిక్స్ చేయటం కోసం కాదు– సిద్ధాంతరాద్ధాంతాల కోసమనీ కాదు. తాత్కాలిక మానసిక ఆనందంకోసం తన్మయత్వం కోసం కథ చదువుతారు కానీ, కథలు చదివి ఎవరూ జీవితసమస్యలను పరిష్కరించుకోరు. పాఠకుడికి ఎటువంటి తన్మయత్వం కలిగించాలి, అతడికి ఎటువంటి ఆనందాన్ని కలగజేయాలి అనే విషయాన్ని రచయితలు ఎవరికి వారే నిర్ణయించుకోవాలి".

"ఈనాడు సాహిత్య ప్రయోజనం కేవలం మనోరంజన హృదయ స్పందనం కలిగించడమే కాదు. కళలన్నీ ప్రజల చేతుల్లో ఆయుధాలు కావాలి. ప్రజల విముక్తి పోరాటాలకు అవి తుపాకీ గుళ్ళలా మారి వర్గశత్రువు గుండెల్ని చీల్చాలి" అంటాడు పురాణం.

ఒక్క నాలుగేళ్ళలోనే రచనల విషయంలో వచ్చిన మార్పును చూపడానికే ఈ వాక్యాలు. సాహిత్యానికి జీవితాన్ని ప్రతిబింబించడం ముఖ్యం అయినప్పుడు ఈనాడు రాజకీయాల ప్రభావాన్ని వేరుచేసి జీవితాన్ని చూడటం, ఆ జీవితం నుండి పిండుకునే కథలు వ్రాయటం అసాధ్యం, అసమంజసం అనే భావం బలంగా ఇలా ఆవరించుకుంటోంది నేడు.

ఆకలి కథలు... కేకల కథలు:

ఈనాడు వెలువడుతున్న కొత్తజవం కథలు ఆకలి కథలు, కేకల కథలు. వీటిని చూసి వైవిధ్యం పోతోందని గోలచేసేవారి గురించి బీనాదేవి ఇలా అంటారు– "ఆకలి కథలు చదవడం వారికి నిజంగానే ఇష్టం లేకపోతే అట్టి కథలు రావడానికి గల సాంఘిక పరిస్థితుల్ని లేకుండా చేయడానికి ప్రయత్నిస్తే మంచిది. దేశాన్ని దుర్భల పరుస్తున్న అధ్వాన్న స్థితులను రూపుమాపే కథలు రాయాలి! అంచేత మనకింకా శక్తిమంతమైన 'ఆకలి కథలు', విశిష్టమైన 'విప్లవ కథలు' రావాలి".

'కాశీమజిలీల పునర్జన్మే నేటి రచయిత్రుల కథలు':

"నేటి కథకుల దృక్పథంలో రచనాశిల్పంలో వైవిధ్యం కనబడం లేదు. కారణం– వారు జీవితంలోని వైవిధ్యాన్ని చూడలేకపోవడం, ఆకళింపు చేసుకోలేకపోవడం. ఏ వ్యక్తుల ప్రాబల్యాన్ని దుయ్యబడుతున్నారో ఆ ప్రాబల్యాన్ని మాత్రం, దానికి మూల బలాన్ని మాత్రం ఆకళింపు చేసుకోలేకపోతున్నారు. ఆ వ్యక్తులను ద్వేషించినంత మాత్రాన ప్రయోజనం లేదు. వారి శక్తికి మూలాధారం ఏమిటో వివరించడం కథకులు చెయ్యగలిగిన, చెయ్యవలసిన పని. భారతకథ ఆ యుగాన్ని ఈ నాటికీ మనం మరచిపోలేనంత స్పష్టంగా, రసవంతంగా చిత్రించినట్లు, అనేకమైన మంచి కథలు వెలువడుతున్నా గొప్ప కథలు అరుదైన నేడు, క్లిష్టంగా జటిలంగా, అయోమయంగా కనబడే వర్తమాన సమాజాన్ని అర్థవంతంగా చిత్రించగల భారతకథ వంటి కథలు– ఎన్నటికీ మరచిపోలేనివి ఎన్నయినా వస్తే– అప్పుడు తెలుగు కథా సాహిత్యం సుసంపన్నమైనట్లు" అంటారు శ్రీ పాలగుమ్మి పద్మరాజు.

"తెలుగు కథల్లో ఈనాడు గొప్పవిగా చెప్పుకోదగ్గ కథలు చలం 'ఓ పువ్వు పూసింది', పద్మరాజు 'గాలివాన', 'పడవ ప్రయాణం', విశ్వనాథశాస్త్రి 'కార్నర్ సీట్', 'నీడలు' వంటివి వున్నాయి. జీవితగాంభీర్యాన్ని అంటే ఎందుకు అనే ప్రశ్నకు లొంగని, వివరణకూ విశ్లేషణకూ అతీతమైనదాన్ని ఒక సౌందర్యాన్ని (చలం), ఒక మమకారాన్ని (పద్మరాజు), ఒక విషాదాన్ని (విశ్వనాథశాస్త్రి) హృదయ స్పందిగా ఆవిష్కరించే రసధ్వని ఈ కథల లక్షణం" (ఆర్.ఎస్.సుదర్శనం. 'తెలుగు కథ')

ఇలా తెలుగు కథ తీరు తెన్నుల గురించి విమర్శకుల అభిప్రాయాలు ఎన్నెన్నో వున్నాయి. ఏమైనా మధురాంతకం రాజారాం అన్నట్లు– "ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు' అంటూ శ్రీశ్రీ చెప్పింది అట్టడుగు తరగతి ప్రజలను గురించి. దీనులు, హీనులు, పీడితులు, తాడితులు అని వీళ్ళ కెన్నెన్ని బిరుదులనైనా ప్రసాదించవచ్చు. జనాభాలో వీళ్ళ శాతమే హెచ్చు. ఐనా ఉగాదులూ ఉషస్సులూ లేని ఈ నిర్భాగ్య జీవులు నిన్న మొన్నటి దాకా చరిత్రచేత, సాహిత్యం చేత విస్మృతులు'.

"కావ్యం కన్నా, నవల కన్నా జన జీవనాన్ని చిత్రించడంలో ముందంజ వేసిన కథానిక, ఈ దీన మానవుల కరుణామయ గాథల్ని పైకి తోడడంలో సైతం శక్తివంచన లేకుండా కృషి సల్పింది".

ఇలా ప్రయోజనాపేక్ష లక్ష్యంగా, సామాజిక స్పృహ ధ్యేయంగా కథాగమనం అవసరం అని భావింపబడుతున్న నేటి రోజుల్లోనే– మరోప్రక్క ఊహల్లో తేల్చివేసే కేవల తాదాత్మ్యావస్థలోని కథానాయకుని కథలు, ప్రేమోన్మత్త రచనలు, అర్థహీనమైన త్యాగాలు, అసహజమైన సంఘటనలు– కథలుగా వ్రాయబడుతూనే వున్నాయి. పత్రికల్లో చోటు చేసుకుంటూనే వున్నాయి. అధికశాతం జనాన్ని ఆలోచనా శూన్యులుగా చేసే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. కొన్ని పత్రికలు కేవలం ఇటువంటి కథలనే ప్రచురిస్తే మరికొన్ని రెండు రకాల కథలనీ ప్రచురిస్తున్నాయి. కేవలం ప్రయోజనాపేక్షతో మార్పుకు దోహదం చేసే కథలను మాత్రమే ప్రచురించే కంకణం ఏ పత్రికా కట్టుకోలేకపోతున్నది. కట్టుకుంటే బ్రతికి బట్ట కట్టలేకపోతున్నది. వ్యాపారం ముందు ఆదర్శాల బలం క్షీణించి పోతోంది. కొన్ని పత్రికలు కథలపోటీ యజ్ఞాలు చేస్తున్నాయి. దీపావళి పేరుతోనో, మరో పండుగ పేరుతోనో నడుపుతున్న ఈ పోటీల ఫలితాలు చూస్తే అదో విడ్డూరం ఒక్కోసారి.

డిటెక్టివ్ పత్రికలు, సెక్స్ పత్రికలు ఆయా ధోరణిలో వాటి కథలు ప్రచురిస్తూ వుంటాయి. వారపత్రిక కథకన్నా, సెక్స్‌పత్రిక కథ వేసే చెడు ప్రభావం ఎక్కువ. ఎన్నిటికో ఆందోళనలు చేసే యువతరం తమ శక్తిని బలహీనపరచే ఇటువంటి విష వాతావరణాన్ని సమూలంగా తొలగించడానికి ఎందుకు యత్నాలు చేసుకోరు? అనిపిస్తుంది.

పత్రికా ప్రపంచం కలుషితం అయిపోతోంది. ఈ ప్రమాదాన్నుండి పత్రికలనీ, పాఠకులనీ రక్షించవలసిన అవసరం వుంది. అందుకు ముందుగా రచయితల్లో జాగృతి కల్గాలి.

జనబాహుళ్యం ఇవాళ అధికశాతం యాంత్రిక నాగరిక జీవిత వాతావరణానికి లోనవుతోంది. ఇది యంత్రయుగం. మనుషులకు తీరుబడి చిక్కడమే అరుదు. చిక్కినా ఎంతోసేపు నిలిచి వుండదు. మళ్ళీ తీరిక లేని పనులవైపు పరుగెత్తిస్తుంది. ఆనందించినా, ఆలోచించినా ఆ కాసింత తీరిక సమయంలోనే. ఏం చదివినా, తెలుసుకున్నా ఆ సమయంలోనే. అందుకనే చదివే పత్రికమీద సైతం పాఠకుడు ఎక్కువ సమయాన్ని కేంద్రీకరించలేడు. సాధ్యమైనంత తొందరగా, క్లుప్తంగా ఏది గ్రహించగలడో దానినే అధికంగా పొందే ఆరాటం హెచ్చవుతోంది. సుదీర్ఘమైన రచనల కన్నా, చిన్న చిన్న కథల అవసరం అందుకే ఎక్కువనిపిస్తుంది. ఇటువంటి సమయంలో తెలుగు కథకుల బాధ్యత ఎక్కువవుతోంది. చదివించే శైలి, ఆలోచించే వస్తువు ఈ రెండింటినీ సమన్వయం చేసి, ఎంత చిన్నగా చెప్పగలడో– అంత క్లుప్తంగా చెప్పగలిగే కథకులు పాఠకుల్లో ప్రభావం వేసి నిలిచి వుండగలరు.

చదవడంలో ఆహ్లాదం, చదివాక ఆలోచన రేకెత్తించే ప్రయోజన వంతమయిన చిన్న కథలు ఎన్ని వెలువడితే అంత మంచిది. యువతరంలో కథా రచనపై ఆసక్తి అమితంగా వుంది. వారి చేతుల్లో ఈ ప్రక్రియ బహుళ వ్యాప్తమై విశిష్టతను సంతరించు కుంటుందని విశ్వసిద్ధాంతం. శ్రీ శీలా వీర్రాజు అన్నట్లు "తెలుగు కథకులు ఇప్పుడిప్పుడు వస్తువుపైన, శైలిపైన ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. కాలక్షేపానికి కథలు రాసేవారు వెనుకటి కన్న ఎంతో ఎక్కువగా వున్నప్పటికీ, సామాజిక స్పృహతోనూ, రాజకీయ చైతన్యంతోనూ ఒక లక్ష్యసిద్ధికై కథలు రాస్తోన్న ప్రగతి దృక్పథంగల రచయితలు సైతం మునుపటికన్న ఎక్కువగానే వున్నారు. ముఖ్యంగా యువ రచయితల్లోనే ఈ చైతన్యం కన్పిస్తోంది. వీరందరికీ విధిగా మంచి శక్తిమంతమైన శైలిని ఆశ్రయించాల్సిన

అవసరం ఏర్పడింది. అందుకే మరీ ఇటీవలి కాలంలో వస్తోన్న చాలామంది యువ రచయితల కథల్లో శైలి బావుంటోంది. అయితే ఇది బావుండడంతోనే సరిపోదు. స్వంత గొంతుకను ఏర్పరచుకోవాలి. అందుకు మరికొంత కాలం పట్టొచ్చు. అంతవరకు యువరచయితలు ఓపికగా సాధనచేయాల్సి వుంటుంది".

అనుభవాలు బలపడి, ఆశయాన్ని పుంజుకుని, కలం రాటుదేరి ముఖ్యంగా యువరచయితల చేతుల్లో తెలుగు కథానికా ప్రక్రియ తేజోవంతమై విస్తారమౌతుందని, నూతన సామాజిక చైతన్య ద్వారాలను తెరుస్తుందని ఆకాంక్షిద్దాం.

(ప్రజాతంత్ర, 15 డిసెంబర్ 1974)

❖

5 వచన కవితాస్ఫూర్తి కుందుర్తి

కుందుర్తి గొప్పకవి అని నేను మొదలుపెట్టక్కర్లేదు. ఎందుకంటే ఈ గొప్ప అనే లక్షణం కుందుర్తి విషయంలో రాయడం పునరుక్తి అవుతుంది. ఈ గొప్ప ఆయనకెవరో అంటగట్టింది కాదు. ఆయన కవిత్వంతోబాటుగానే అదీ అంటు కట్టింది. ఆయన కవిత్వం ఎంత గొప్పదో ఆయన అంత గొప్పవాడు అని మొదలెడతాననుకోండి. ఇది ఆయన వ్యక్తిత్వానికి ప్రశంస అవుతుంది. కవిత్వంవల్ల వ్యక్తి రాణించాడా వ్యక్తివల్ల కవిత్వం రాణించిందా అని ప్రశ్నవేసుకుంటే కుందుర్తి విషయంలో ఇది విత్తు ముందా చెట్టుముందా లాంటి ప్రశ్న అయిపోతుంది.

వచనకవిత వ్రాసి కుందుర్తి రాణించాడు. కుందుర్తి రాయడంవలన వచన కవిత రాణించింది. ఈ రాణింపు ఏకకాలంలో కొనసాగుతూ వచ్చింది. కుందుర్తిని 'వచనకవితా పితామహుడు' అన్నారు. వచనకవితకు వాచస్పతి అన్నారు. 'వచన కవితాపితామహ' అన్న పేరు బిరుదుగా చాలా బావుంది కానీ, పితామహత్వం అంటే ముసలితనం ఆయన కవిత్వానికి లేదు. అది నిత్యయౌవనం. జీవనది. ముసలితనం అంటే ఇప్పటి వాళ్ళకు ఛాందసం, మూఢ సంప్రదాయం, వదలలేని పాత ఆచారం వీటిప్రోవుకింద తోస్తుంది కాబట్టి కుందుర్తిలో ఈ జరచ్ఛాయలు లేవని ఖచ్చితంగా చెప్పాలి. "రచనల పూలతోటలో ఛందస్సు మొక్కలు నాటడం ఏనాడో వదిలేసి భావనలో సామాన్యుని జీవితవలయాలు దాట"కుండా ఆయన కవితాప్రతిజ్ఞ నిలుపుకున్నాడు. అర్థంకాని పదం ఆయన కవితకు ఎప్పుడూ ఆమడ దూరం. సున్నితమైన హాస్యం, అందులోనూ నిండయిన భావగాంభీర్యం వారి కవితకు కొత్త ఊపిరి. కుందుర్తి వ్యక్తిత్వ కవిత్వాలు రెండింటా కూడా ఒక ప్రత్యేక ఉదాత్తత వుంది. తనదైన దారి ఉంది. అది వారి అహంకారంగా, నిరంకుశ లక్షణంగా భావించినవారుండవచ్చు. కానీ అది స్వాతంత్ర్యేచ్ఛ, నిత్య నూతనత్వాకాంక్ష. "ఆస్మదాదులం ఏదో క్రొత్తను వెదుక్కుంటూ, ఇలా కాలం గడుపుకుపోతున్నాం, ఎప్పుడో ఒక మహాకవి భగీరథుడిలా

వస్తాడు, క్రొంగ్రొత్త కవితాగంగను తెస్తాడు" అనడంలో నూతన అన్వేషణలో క్రొంగ్రొత్తను ఆవిష్కరించే భగీరథుడు తానే కాగల్గడానికి అవకాశమూ, అర్హతా సంసిద్ధమై వున్నవే. అయినా "నా అంతస్తుకు మించిన కవితా కీర్తి కావాలని కోరుకోను" అని వినమ్రత్వాన్నే సూచిస్తాడు. కనుకనే కుందుర్తి కుందుర్తిగా లోకానికి చేరువయ్యాడు. వచన కవిత్వ చరిత్రకు సువర్ణ పత్రం అందించాడు. వచన కవితను ఒక ఉద్యమంగా, ఆ ఉద్యమ ఫలితాలను ఉత్తేజంగా తీర్చిదిద్దిన నాయకత్వం కుందుర్తిది. "క్రమక్రమాగత చైతన్య ధనుష్పాణులు ప్రజలు నేడు– సమాజ సమష్టి ప్రయోజన నిశితబాణులు ప్రజలు నేడు" అంటూ 1949 ప్రాంతంలోనే 'తెలంగాణా' రచనతో విప్లవాంకురాలు నాటాడు కవితా కావ్యంలో. ఆయనలో కొంత వ్యక్తివాదం వుందనేవారు అది సామాజిక వాదంతో ముడిపడిందేనని గ్రహించగలరు. కుందుర్తి సామాన్య కవికాడు కానీ సామాన్యుల కవి. ఆయన వ్యక్తి సామాజిక శక్తితో కలసిందే. ఈ విషయం వారి ఇవాళ్టి కవితా ఖండికల్లో కూడా స్పష్టంగా కనిపిస్తూంటుంది.

అయితే కుందుర్తి ఏ రాజకీయ పార్టీకో వత్తాసుకవి మాత్రం కాడు. తాను మార్క్సిస్టునని స్వయంగా చెప్పుకుని, కవిత్వపరంగా 'ఇదీ నా దారి' అనే ప్రత్యేకంగా స్పష్టంగా చెప్పాడు. పుస్తకాలు అంకితం ఇవ్వడం, సన్మానాలు చేయించుకోవడం, పుస్తకావిష్కరణ సభలంటూ పొగిడించుకోవడం ఆయన తత్వానికి విరుద్ధమే. 1968 లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డును 1970 లో సాహిత్య అకాడమీ బహుమతిని ఆయన అందుకున్నారు.

కుందుర్తి సన్మాన సంఘం కుందుర్తిగారిని అంగీకరింపజేసి ఆయన సర్వకవితా సంకలనాన్ని ప్రచురించిన సందర్భంగా ఆవిష్కరణోత్సవం ఏర్పాటు చేశారు. ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం కోసం ఒక సన్మాన సంచికను వెలువరించారు. కుందుర్తి సర్వకవితా సంకలనం 'కుందుర్తి కృతులు' తెలుగు ప్రజలకు ఒక మహత్తర కానుక. ఆ కానుకను ఆవిష్కరించడానికై మార్చి 30 వ తేదీ ఆదివారం ఆంధ్ర సారస్వత పరిషత్‌లో సమావేశం జరిగింది. జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి కుందుర్తి కృతులు ఆవిష్కరించారు.

నయాగరా, తెలంగాణ, ఆశ, యుగే యుగే, నగరంలో వాన, నాలోని నాదాలు, ఇదీ నా దేశం, వేకువ వెలుగులు, దండియాత్ర, సాహసయాత్ర, భగవంతునికి బహిరంగ లేఖ, అనువాద మాల, మాతృగీతం, శిక్ష ఏమిటి? మొదలైన కవితల సమగ్ర సంకలనం 'కుందుర్తి కృతులు'.

వచన కవితను ప్రజాపరం చేసి ప్రజలకోసం, అందునా తాడిత పీడిత జనంకోసం కలంపట్టి, సామాజిక స్పృహతో, మార్క్సిజాన్ని చేపట్టినా హ్యూమనిజాన్ని వదలక, చైతన్యవంతమైన ఆశయంతో వచన కవితకు కొత్త మెరుగులు దిద్దుతూ, ఒక ప్రయోగశాలగా వచనకవితను నిర్వహింపజేస్తూ వర్తమానానికి, వర్తమాన సాహిత్యానికి– అందునా ఆధునిక కవితకు తుష్టిని, పుష్టిని, ప్రయోజనాన్ని చేకూర్చిన కవి కుందుర్తి. వ్యక్తిత్వ కవిత్వాల్లో ఆయన సమవర్తి.

(కమెండో పక్షపత్రిక, ఏప్రిల్ 1975)

❖

6 ఎద ఝల్లుమనిపించే 'ఎల్లా' మృదంగ తరంగం

ఏడేళ్ల వయస్సులోనే ప్రతిభా పాటవాన్ని ప్రదర్శిస్తూ, పన్నెండేళ్ల ప్రాయంలో ప్రముఖ సంగీత విద్వాంసుల పక్కన చేరిన బాల్యం–

16 వ ఏడు వచ్చేవేళకే ఆకాశవాణి అలవరసలపై తన లయవిన్యాసాలు విరజిమ్మిన యౌవనం–

కౌమార వేళకు– తన సంగీత కౌముదిని విదేశాలకు సైతం విరబూయించిన ఘనత అతనిది. 'ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కర్ణాటక సంగీత కార్యక్రమం' అంటూ రేడియోలో ప్రకటన వచ్చాక, పక్కవాయిద్యాల పేర్లలో మృదంగం– ఎల్లా వెంకటేశ్వరరావు అన్న పేరుకోసం ఎదురు చూసే సంగీతాభిమానులు ఎందరెందరో వున్నారు.

పశ్చిమ గోదావరి పాలకోడేరులో 1947లో సంగీత కుటుంబంలో పుట్టాడు ఎల్లా. తండ్రి శ్రీరామమూర్తిగారు ద్వారంవారి శిష్యుడు. వయొలిన్ విద్వాంసుడు. మృదంగరత్న శ్రీ ఎల్లా సోమన్నగారు పెంచుకుని శిక్షణ ఇచ్చారు ఎల్లా వేంకటేశ్వర రావుకు. ఒక పక్కవాయిద్యంగానే అనిపించే మృదంగానికి – ఒక పక్క పక్కవాయిద్య కారునిగా ప్రముఖ విద్వాంసులకు సహకరిస్తూనే, మరో పక్క ఒక ప్రత్యేక విశిష్టతను, తనదైన ఒక విలక్షణతతో తెచ్చిపెట్టాడు ఎల్లా. మృదంగాన్ని పాప్యులరైజ్ చేసిన ఘనత ఎల్లాకు ప్రత్యేకించి ఆపాదించనవసరం లేదు. తన స్వయం ప్రతిభతో ఆ కీర్తి రత్నాన్ని అతనెప్పుడో సంపాదించేశాడు. జాతీయ సంగీత కార్యక్రమాల్లో, రేడియో సంగీత సమ్మేళనాల్లో ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ఎల్లా కచేరీలు చేశాడు.

1961 లోనే ఆకాశవాణి సంగీతపోటీలలో ప్రెసిడెంట్ అవార్డును అప్పటి ప్రెసిడెంట్ డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ నుండి పొందాడు. అఖిల భారత వార్షిక బహుమతిని 1978 లో 'నవమృదంగ సమ్మేళనం' ద్వారా గ్రహించాడు. ఆంధ్రప్రదేశ్ కళావేదిక 'కళాసరస్వతి' అవార్డు నిచ్చింది.

పరమేష్టి తాండవ నృత్యహేలకు నాద చిత్రమా! అన్నట్లు ఎల్లా రూపొందించిన 'శివతాండవం' కార్యక్రమానికి ఇండోనేషియాకు చెందిన 'హౌసాబంక అవార్డు' లభించింది. అంతర్జాతీయ సంగీత రంగానికి ఎల్లా ప్రతిభ విస్తరించింది.

తిరుమల తిరుపతి దేవస్థానం, యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, కొన్నాళ్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అతనిని ఆస్థాన మృదంగ విద్వాంసునిగా నియమించి గౌరవించాయి.

అనేక సంగీత సంస్థలకు, కూటములకు, అధికార అనధికార సంస్థలకు 'ఎల్లా' గౌరవసభ్యుడిగానో, హితవరిగానో, పరీక్షాధికారిగానో, న్యాయనిర్ణయాధికారి గానో కనిపిస్తూనే వుంటాడు. నిరాహారంగా పచ్చి మంచి నీళ్ళయినా ముట్టుకోకుండా 16 ఆగస్టు 1981 ఉదయం ఆరింటికి ప్రారంభించి 29 గంటల పాటు ఏకధాటిగా కల్చరల్ ఎఫైర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైద్రాబాద్ శంకరమఠంలో భక్తిభావ పరవశంతో అతను చేసిన మృదంగ మహాయజ్ఞం గతంలో పత్రికలను, ప్రజలను కూడా ఆశ్చర్యచకితుల్ని చేసింది. తానేదో రికార్డులను అధిగమించాలని లేదా ఏవో గిమ్మిక్స్ ప్రదర్శించాలని గంటల తరబడి మృదంగనాదాలు పలికించలేదనీ, ఒక ఆవేశంతో, పరమశివునిపట్ల ఆరాధనా భావంతో ఆ మృదంగ మహాభిషేకం చేశాననీ అంటాడతను వినమ్రతతో.

మృదంగవాద్యంలో తను సంతరించిన నవ్యత, ఒక ప్రయోగ దృక్పథంతో జరిపిన కృషి ప్రశంసనీయాలు. మృదంగం టేబుల్ తరంగ్, త్రయంగా లయవిన్యాసం, పంచమృదంగం, సప్తార మృదంగ లయచిత్రం, నవమృదంగం, 30 వివిధ సంగీత వాద్యాలతో నిర్వహించిన 'శివతాండవం' ఎల్లా ప్రతిభా సంపత్తిని తేటతెల్లం చేస్తాయి.

శంకరాభరణం, కామవర్ధని, అభోగి, చక్రవాకం, అభేరి, వేదం– వీటినన్నింటినీ మృదంగం మీద మ్రోగిస్తూ ఆకాశవాణి ఆర్కెస్ట్రాతో 'సప్తస్వర' పేర ఓ దసరాకు రూపొందించిన ఎల్లా సంగీత కార్యక్రమం ప్రముఖంగా ప్రశంసలను అందుకుంది.

లయవిన్యాసం కార్యక్రమం మృదంగంపై అందిస్తూ పక్షులు, జంతువులు, రైలు, వర్షం, తుఫాను మొదలైన శబ్దాలను మృదంగం మీదే సృష్టించడం ఎల్లాకే చేతనయింది. మృదంగంమీద వేదం పలికించిన కీర్తి అతనిదే.

తొమ్మండుగురు మృదంగ విద్వాంసులతో, ఒకే పల్లవితో, వివిధ లయలతో, కళ్యాణిరాగంలో ఎల్లా నవమృదంగ సమ్మేళనం కావించాడు. 'ద్వాదశ షోడశ

మృదంగం', 20మంది శిష్యులతో, 20 మృదంగాలతో 'రిథమ్ ఈజ్ యూనివర్సల్' వంటి కార్యక్రమాలు అతను రూపకల్పన గావించాడు. కర్ణాటక శాస్త్రీయ, లలిత శాస్త్రీయ, జానపద, లలిత, సంగీత రూపకాలనేకం ఎల్లా మృదంగ వైదగ్ధ్యం చాటి చూపేవిగా వున్నాయి.

బహుమతి పొందిన 'సప్తపది' చిత్రంలో సంగీత రూపకల్పన, నిర్వహణ భారాన్ని ఎల్లా వేంకటేశ్వరరావే వహించిన విషయం కొందరికి తెలిసి వుండకపోవచ్చు.

తనకు తెలిసిన విద్యను నలుగురికీ పంచిపెట్టడమే విజ్ఞుల లక్షణం. దేశ విదేశాలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులు ఎల్లా దగ్గర మృదంగ వాద్యంలో శిక్షణ పొందుతున్నారు. గురుకుల పద్ధతిలో ఎటువంటి దక్షిణా తీసుకోకుండానే ఎల్లా శిష్య ప్రశిష్యులను కొందరిని తయారు చేశాడు. ఎల్లా నుండి విద్య నేర్చి, సంగీత కళాశాలల్లో, ఆకాశవాణివంటి కళారంగాల్లో ప్రవేశించిన వారున్నారు. రాణకెక్కుతున్నారు.

బిరుదులు, సన్మానాలు ప్రతిభావంతుల్ని వెదుక్కుంటూ రావడంలో ఆశ్చర్యం ఏముంది. ఒక వ్యక్తి గొప్పతనానికి అవే తార్కాణాలు కాకపోచ్చు. కానీ కొందరు వ్యక్తుల్ని చేరడం వల్ల వాటికీ సార్థకత దొరుకుతుంది.

రోమ్ మహానగరంలో తన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాలు పొందడం, సువర్ణ ఘంట కంకణాలు అందుకోవడం, కనకాభిషేకాలు దేశంలో పలు తావుల్లో పొందడం, పలు సంగీత సంస్థలతో మృదంగ సార్వభౌమ, మృదంగ సమ్రాట్, మృదంగ శిరోమణి, నాదముని, మృదంగ తాండవేశ్వర, మృదంగ మార్తాండ, మృదంగ వాద్య సార్వభౌమ, మృదంగ కళా ప్రపూర్ణ, మృదంగ వాద్య మహోదధి, మృదంగ శిఖామణి, మృదంగ చక్రవర్తి, మృదంగ నాదజ్యోతి, లయ విన్యాస చతుర, లయ విన్యాస కళావిలాస, మృదంగ కేసరి, మృదంగ చూడామణి వంటి బిరుదు లందుకోవడం ఎల్లాలోని ఎల్లలెరుగని సంగీత సుధాస్రవంతికి సాదర గౌరవాభి వందనాలు చేస్తూ– అతనిలోని మృదంగ నాదముని విరాడ్రూపాన్ని కొనియాడుతూ కనిపిస్తాయి.

ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ, దేశాధ్యక్షుని మొదలుకుని పలువురు ప్రముఖ వ్యక్తులందరి వద్దనుండి– 'ఎల్లా' ప్రశంసలనూ, సన్మానాలనూ పొందాడు.

చిన్నప్పుడు సరదాగా అమ్మదగ్గర వంటింట్లో కూచుని ఏ బియ్యం డబ్బా మీదనో తన చేతులు లయనర్తనలు చేసినప్పుడు అతనే ఊహించి వుండకపోవచ్చు, మృదంగం తన ప్రాణమవుతుందనీ, తనకింత పేరు తెస్తుందనీ. ఎల్లాకీ చాలా కలలున్నాయి. కాంక్షలున్నాయి. మృదంగం గురించి బోలెడు ప్రణాళికలున్నాయి. ఆశించినంత ఆదరణ, ద్రవ్యనిధి లభిస్తే మృదంగం గురించి ఒక యూనివర్సిటీయే పెట్టేయగలంత ఉత్సాహం వున్నాయి.

పక్క వాయిద్యమైన మృదంగానికి అతనూ, అతనికి మృదంగమూ విశిష్టతలను విస్తృతం కావిస్తారని విశ్వసిద్దాం.

(ఉదయం దినపత్రిక, 17 నవంబర్ 1985)

❖

7 తులలేని తెలుగు దీపం

నిజాంరాజు నిరంకుశ పరిపాలనాకాలంలో తెలుగు భాషాదీపం ఆరిపోకుండా, తెలంగాణా పల్లె పట్టులలో మినుకు మినుకు మంటున్న తెలుగు సాహితీ సంస్కృతుల కాంతిని ఏకోన్ముఖంగా చేసి తేజరిల్లజేయడానికి హైదరాబాద్ నగరంలో ఆవిర్భవించిన సంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. మే26,1943 వ సంవత్సరంలో స్థాపించబడిన ఈ సంస్థ బాలారిష్టాలను, తీవ్ర ప్రతిబంధకాలను అధిగమించి, ఈ 43 సంవత్సరాలుగా తెలుగు భాషా సాహిత్యాలకు, సాంస్కృతిక వికాసానికి చేసిన సేవ ఎనలేనిది. గడచిన నాలుగు దశాబ్దాలలో పరిషత్తు తన ఆశయాలకు అనుగుణంగా సుస్పష్టమైన కార్యక్రమాలను అనుసరిస్తూ కృషిగావించింది.

వయోజన విద్యావ్యాప్తి చేయాలనే సంకల్పంతో ఆంధ్రసారస్వత పరిషత్తు గ్రామాలలో వయోజన విద్యా కేంద్రాలను నిర్వహించే ఆసక్తి కలవారికి ఒక శిక్షణా కేంద్రాన్ని నిర్వహించడమే కాకుండా, దాదాపు 200 రాత్రి పాఠశాలలను నడిపింది. ఆయా శాఖల్లో 1951 లో వయోజన విద్యా వారోత్సవాలను నిర్వహించడం 1950 డిసెంబర్‌లో జబల్పూరులో జరిగిన అఖిలభారత వయోజన విద్యా గోష్ఠిలో ప్రత్యేక ఆహ్వానంపై పాల్గొనడం, ముఖ్యంగా 1951 నుండి 1954 వరకూ సింగరేణి, కొత్తగూడెం బొగ్గుగనుల ప్రాంతాలలో వయోజనవిద్యా కేంద్రాల ద్వారా వేలాది కార్మికులను అక్షరాస్యులను చేయడం ఎవ్వరూ మరచిపోలేనివి.

1952–54 ల్లో జంటనగరాల్లో సాంఘిక విద్యా కేంద్రాల ద్వారా పరిషత్తు తెలుగేతరులెందరికో తెలుగు భాషా సాహిత్యాలపట్ల అభిరుచి పెంచి, తెలుగు భాషా పరిచయం, ప్రవేశం కల్పించింది.

పరిషత్తు చేస్తున్న అపారమైన సేవలో ప్రముఖంగా చెప్పుకోవలసింది మరొకటుంది. ఒక నిర్దుష్టమైన ప్రణాళికతో ఆంధ్రసారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న

తెలుగు పరీక్షలు ప్రాథమిక, ప్రవేశ, విశారద (పూర్వ, ఉత్తర) ఎందరినో విద్యావంతులను కావిస్తూ వారి ఉపాధికి బాటలు వేస్తున్నాయి. ఇప్పటికి దాదాపు లక్షమందికి పైగా (ముఖ్యంగా వేలాదిగా స్త్రీలు) ఈ పరీక్షలు రాసి లబ్ధిపొందారు. విశారద పరీక్ష పాసైనవారు తెలుగు పండితులుగా నియామకం అయ్యేందుకు వీలుగా ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. తెలుగు పండితుల శిక్షణా కోర్సులో ప్రవేశించడానికి కూడా వారికి అర్హత కల్పింపబడింది. తద్వారా ఈ పరీక్షలకు ఎంతో ప్రాముఖ్యం చేకూరింది. దాదాపు 70 పరీక్ష నిర్వహణా కేంద్రాలు కేవలం రాష్ట్రంలోనే కాక బొంబాయి, మద్రాసు, బెంగుళూరు, హోసూరు, షోలాపూర్ మొదలైన ఇతర రాష్ట్రాల ప్రాంతాలలో కూడా ఏర్పడినాయి. మారిషస్‌లో కూడా ఒక కేంద్రం నెలకొనింది.

ఈ పరీక్షల విషయంలో ప్రత్యేకించి పేర్కొనదగిన అంశం– రాష్ట్రంలోని పలు సెంట్రల్ జైళ్ళు, సర్టిఫైడ్ స్కూల్సుకు చెందిన అభ్యర్థులను ఉచితంగా ఈ కోర్సుల నిమిత్తం చేర్చుకోవడమే కాకుండా, పరిషత్తు– పేద విద్యార్థులకు, అర్హులైన అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలను కూడా పంపిణీ చేయడం జరుగుతోంది.

గ్రంథాలయోద్యమానికి పరిషత్తు పూర్తిగా తోడ్పడింది. విద్యార్థులు నిర్వహించిన ఆంధ్రాభ్యుదయోత్సవాలను పరిషత్తు ప్రోత్సహించింది. తెలంగాణా రచయితల సంఘ స్థాపనకు పరిషత్తు దోహదం కావించింది. లక్ష్మణరాయ పరిశోధక మండలికి– పరిషత్తు కేంద్రంగా వుంది. అఖిలభారత తెలుగు రచయితల సమావేశాలకు, యువభారతి సాహిత్య కార్యక్రమాలకు, ఇంకా ఇతర సాహిత్య సంస్థల కార్యకలాపాలకు పరిషత్తు సంపూర్ణ సహకారం ఇచ్చింది.

1954 లో కార్యాలయానికై నిర్మించిన కొన్ని గదులు అభివృద్ధి చెందుతున్న పరిషత్తు అవసరాలకు చాలలేదు, ఆంధ్రప్రదేశ్ అవతరణానంతరం పరిషత్తు కార్యకర్తలు భవన నిర్మాణానికై యథాశక్తి కృషి చేశారు. ఎన్నో శ్రమదమాదులకోర్చిన తరువాత డా॥ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ మందుముల నరసింగరావు, శ్రీ దామోదరం సంజీవయ్య, శ్రీ ఎమ్. రామప్ప ప్రభృతులు పలువురి చలువతో 1959 లో ఆడిటోరియంకు శంకుస్థాపన జరిగింది. 1960 లో భవన నిర్మాణం ప్రారంభింపబడి 1962 నాటికి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి పట్టుదలవల్ల పూర్తి అయింది.

నేడు ఆంధ్ర సారస్వత పరిషత్తు అనగానే సాహితీ సాంస్కృతిక వికాసాల కేంద్రంగా ఎరుగని జంటనగరవాసులు లేరంటే అతిశయోక్తి కాదు. పరిషత్తు ఆడిటోరియం వరండాలో పఠనాలయం వుంది. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ– దిన,

వార, మాస పత్రికలు పాఠకులకు అందుబాటులో వుండి ఈ ఉచిత పఠనాలయాన్ని రోజూ దాదాపు వందమందికి పైగా వినియోగించుకోడం జరుగుతోంది.

ఆంధ్రసారస్వత పరిషత్తు గ్రంథాలయం స్నాతకోత్తర విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తోంది. మొత్తం పదివేల దాకా పుస్తకాలున్నాయి. అలభ్యమైన ఎన్నో పాత పత్రికలు, విశేష సంచికలు ఇందులో ఉన్నాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పరిషత్తు నిర్వహిస్తున్న ప్రాచ్య కళాశాల 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్నది. తెలుగులో ప్రీ డిగ్రీ కోర్సు, బి.ఏ. (లాంగ్వేజెస్), ఎం.ఏ. (లాంగ్వేజెస్) కోర్సులు ప్రాచ్యకళాశాలలో నడుస్తున్నవి. పరిషత్తు విశారద పరీక్ష ఉత్తీర్ణత చెందిన వారికి– ప్రీ డిగ్రీ కోర్సులో ప్రవేశార్హత వుంది. ప్రతి యేటా దాదాపు 200 మంది ప్రాచ్యకళాశాలలో విద్య నభ్యసిస్తున్నారు. కళాశాల మంచి ఫలితాలను సాధిస్తోంది. ఎం.ఫిల్, పిహెచ్.డి. పరిశోధక విద్యార్థులకు కళాశాలలోని పలువురు ఉపన్యాసకులు మార్గదర్శకులుగా కూడా వ్యవహరిస్తున్నారు. 'నెలవంక' అన్న వార్షిక సంచిక కళాశాల వెలువరిస్తోంది. 1964 నుండి 1976 వరకు పరిషత్తు భవనాలలోనే పండిత శిక్షణ కళాశాలను నిర్వహించి దాదాపు మూడువేల మందికి లబ్ధిని చేకూర్చడం జరిగింది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన ఇప్పటి వరకూ సుమారుగా వంద గ్రంథాలు ప్రచురించబడ్డాయి. తొలిసారి జానపద వాఙ్మయాన్ని మూడు సంపుటాలుగా ప్రచురించిన ఘనత పరిషత్తుదే. పరిషత్తు ప్రచురించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర మొదటి జాతీయ బహుమతి నందుకున్న తెలుగు గ్రంథం. తెలుగులో హాస్యాన్ని గురించి రెండు సాహిత్య విమర్శ గ్రంథాలు, తెలుగు భారత, భాగవత, రామాయణాలను గూర్చిన మూడు విమర్శనాత్మక గ్రంథాలను, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, చారిత్రక వ్యాసాలవంటి ఉత్తమ గ్రంథాలను పరిషత్తు ప్రకటించింది. మన రాజ్యాంగం, ప్రపంచ రాజ్య సర్వస్వం తెలుగులో వెలువరించిన తొలి గౌరవం పరిషత్తుదే అనవచ్చునేమో. పరిషత్తు ఒక పుస్తక విక్రయశాలను కూడా నిర్వహిస్తోంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం ఉదయం పది గంటలకు డా॥ కె.కె.రంగనాథాచార్యులు సంచాలకులుగా సాహిత్య , చర్చా సమావేశాలు నిర్వహిస్తున్న 'సారస్వత వేదిక' రేపు అక్టోబర్‌కు 10 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోంది. ప్రతి ఏడాది ఒక్కొక్క శీర్షికపై సమావేశాలు నిర్వహించి ఆ ఉపన్యాస వ్యాసాల సంకలనాన్ని ముద్రించడం జరుగుతోంది. ఈ సమావేశాలు

ఎందరెందరినో ఆకట్టుకుంటున్నాయి. సారస్వత వేదిక సమావేశాలు సాహిత్యం పట్ల కొత్త దృక్పథాలను, అభినివేశాన్ని కలిగిస్తున్నాయి.

స్వర్గీయ మాడపాటి హనుమంతరావు పంతులుగారు తమ ఆంధ్రోద్యమ చరిత్రలో పరిషత్తు కృషిని సమీక్షిస్తూ ఈ కృషి ఒక మహోద్యమంలా తెలంగాణాలో వ్యాపించిందని ఉద్ఘాటించారు. సూర్యుని వెలుతురువలె రాష్ట్రంలోని ప్రతిపల్లెను పరిషత్తు విజ్ఞానవంతం కావిస్తోందని ఒక మారు స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావుగారు చెప్పారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు కృషికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుల వంటి విద్వన్మణుల ఆశీర్వచనం లభించింది.

చైతన్య పూరితమైన ఆశయసాధనా సంరంభాన్ని జడమైన అచ్చు సిరాద్వారా చెప్పడం దుర్లభం. కొండను అద్దంలో చూపెట్టడంలాగా పరిషత్తు సాధించిన విజయాల విరాడ్రూపాలను కొన్ని పుటలలో ఇమడ్చడం సాహసమే. పరిషత్తు ఈనాడు ఇంత మహోన్నతంగా ఎదగడానికి వెనుక ఎందరి మహనీయుల కృషో వుంది. పేరు పేరునా వారినిక్కడ పేర్కొనడమూ సాధ్యం కాదు. తెలుగు దేశంలో పనిచేస్తున్న సాహిత్య సంస్థలలో పరిషత్తుకు జాతీయ సంస్థగా, సాంస్కృతిక సంస్థగా ఒక విశిష్టమైన స్థానమున్నదన్నమాట నిర్వివాదాంశం.

మరింత ఉజ్జ్వలంగా పరిషత్తు రానున్న తరాలను కూడా తీర్చిదిద్దేలా వెలుగొందాలనీ, అందుకు అనుగుణంగా, ప్రభుత్వ పరంగా, ప్రజాపరంగా అన్నివిధాల సహాయ సహకారాలు పరిషత్తుకు సమకూరాలని శుభాకాంక్షిద్దాం.

('యువ కళావాహిని' త్రైమాసిక, జూలై 1986)

❖

(8) అశోకా ది గ్రేట్

ఒకతరం అమ్మాయిలకు డ్రీమ్‌బాయ్. అనంతరం ఓ మంచి నాన్న. ఆపై ఇంటికి పెద్దదిక్కయిన ఓ తాత. ఇది ఒకవైపు.

మరోవైపు కనబడని క్రూరత్వం మూర్తీభవించిన విలన్.

ప్రత్యక్షంగానే ఒక్కోసారి ప్రతినాయకుడు.

ఇంకోవైపు నవ్వులు చిందించే పాత్రలకు ప్రతిరూపం.

ఇంతటి బహుముఖీనమైన ప్రజ్ఞ ఒక్క వ్యక్తిలో కొన్ని దశాబ్దాల తరబడి నిలచివుండడం మాటలు కాదు. వెండితెర అయినా, బుల్లితెర అయినా అతని ప్రజ్ఞ ఎప్పుడూ ప్రముఖంగానే రాణించింది. తొంభైఏళ్ల జీవితంలో అతను ఎందరికో తమవాడనిపించాడు. నటన వృత్తి అయినా, హోమియో వైద్యం ప్రవృత్తిగా తన దగ్గరకొచ్చే జనం బాగోగులు చూశాడు. ఎన్ని ఉన్నత శిఖరాలనధిరోహించినా, ఎన్ని బిరుదులు, అవార్డులు పొందినా– తొణకని బెణకని స్థిరవ్యక్తిత్వం తనది.

అతనే– కాశీ విశ్వేశ్వర్ గంగూలి లేదా కుముద్‌లాల్. ఈ రెండింటి పేర్లతో కూడా తెలియదు కానీ– అతను అశోక్‌కుమార్. సినీరంగాన బాలీవుడ్ క్షేత్రాన అతను దాదామునిగా సుప్రసిద్ధుడు. 1969 లో ఆశీర్వాద్ చిత్రానికి జాతీయ నటుడిగా ఎన్నికయిన తను 1988 లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందాడు. భారత ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించింది.

కలకత్తాలో న్యాయశాస్త్రం చదువుతూ పరీక్ష ఫీజు 35 రూపాయలతో ముంబాయ్ చేరుకున్న ఆనాటి ఆ కుర్రాడి ఆశ తాను దర్శకుడు కావాలని. తన బావ శేషేంద్రముఖర్జీ స్థాపించిన ఫిల్మాలయా స్టూడియోలో టెక్నీషియన్ అసిస్టెంట్‌గా కెమెరా అసిస్టెంట్‌గా పనిచేశాడు. హిమాంశురాయ్– 'జీవన్‌న్యాయ్' చిత్రంలో అప్పటికే అందాల తారగా స్థిరపడిన దేవికారాణితో అశోక్‌కుమార్‌ను హీరోగా నటింపచేశాడు.

1936 లో అప్పట్లో అశోక్‌కుమార్ నటనకు దేవికారాణి విసుక్కున్నా ఆ తర్వాత వారిద్దరిదీ వెండితెరపై మంచి జంట అయింది.

తనకున్న హీరో ఇమేజ్‌కు విరుద్ధంగా– సాహసించి ప్రతినాయక పాత్రలు ధరించి కిస్మత్, ఆర్తి, ఉస్తాదోంకా ఉస్తాద్ చిత్రాల్లో విలన్‌గా కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. 'చల్తీకానామ్ గాడీ'లో తన సోదరులు కిశోర్‌కుమార్, అనూప్‌కుమార్ లతో కలిసి నటించి నవ్వులు రువ్వాడు. అతను అలరించిన ప్రేక్షకులకు అంతే లేదు.

తమాషా ఏమిటంటే మహోన్నత వ్యక్తుల వెనుక కథలు కొన్ని ఉంటుంటాయి. వాటి గురించి సాధారణంగా వారే మాట్లాడరు. కానీ అశోక్‌కుమార్ అలా కాదు. తన జీవితాన్ని తెరిచిన పుస్తకంలా ఉంచడానికి ఆయన కష్టపడలేదు. అయితే అందరితో కాకపోయినా ఆత్మీయులు కొందరితోనయినా.

వయసు పైబడినా ఉత్సాహంగా ఆరోగ్యంగా కనిపిస్తూండే అశోక్‌కుమార్‌ని దానికి కారణం ఏమిటని అడిగితే నవ్వుతూ ఇచ్చిన సమాధానం– "సైకిలింగ్ నా ఆరోగ్య రహస్యం. క్రమబద్ధంగా సైకిలింగ్ చేయడం మంచి ఎక్సర్‌సైజ్" అనేవాడు. సైకిల్ ఎక్కి ప్రయాణించడానికి ఎప్పుడూ సరదాపడేవాడు.

తొలిరోజుల్లో నళినీ జయవంత్‌తో ప్రేమాయణం సాగించాడని అశోక్‌కుమార్ మీద గాలి వార్తలు రాయబడ్డాయి. అసలు జీవితంలో తనకీ ఆపదలకీ ఏదో అవినాభావ సంబంధం ఉందనీ, తనతో ముడిపడినవారికి ఆ దురదృష్టం అంటడం విచారం కలిగిస్తుందనీ బాధపడేవాడు.

అశోక్‌కుమార్ 13.10.1911 న పుట్టాడు. ఆ శుక్రవారం ఆ ఇంటపుట్టిన తొలిబిడ్డ కావడంతో వారసుడు పుట్టాడన్న సంతోషంతో అతని బామ్మగారు ఆ సంతోషవార్త అందరికీ చెప్పాలనే ఆత్రంతో మేడమెట్టు దిగుతూ పడిపోయి దాంతో మెదడు దెబ్బతిని చనిపోయింది. ఆ తరువాత అక్షరాభ్యాసంనాడు మరో ప్రమాదం జరిగింది. అతని అక్షరాభ్యాసాన్ని ఇంట్లో పెద్ద పండుగగా చేశారు. పంతులుగారు ఇంటికే వచ్చాడు. అందరివీ విందు భోజనాలై సరదాగా ఉండగా ఆ పంతులుగారు మేడమెట్లు ఎక్కుతుండగా కాలుజారి పడి తీవ్రమైన గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. సినిమాల్లో చేరాక కూడా దేవికారాణీ, తనూ నటిస్తున్న ఓ చిత్రం సందర్భంగా హీరోయిన్ని బాధిస్తున్న విలన్ బారినుంచి రక్షించాలి. అందుకుగాను ఆ సీన్‌లో

కిటికీనుంచి దూకి విలన్‌మీద పడాలి. ఏక్షన్ అనగానే అశోక్‌కుమార్ కిటికీలోంచి దూకేశాడు. కానీ వెళ్లి హీరోయిన్ మీద పడ్డాడు. అందరూ బ్యాలెన్స్ తప్పి కిందపడడంతో బాగా దెబ్బలు తగిలి వారంరోజులు తీవ్రమైన బాధపడ్డారు. అప్పటి నుంచి అశోక్‌కుమార్ ఏ చిత్రం ముహూర్తం షాట్స్‌కి వచ్చేవాడు కాడు. వచ్చినా మొహం కెమెరాకు చూపేవాడు కాడు.

ఒకరోజు ఒక చిత్రం షూటింగ్‌కు మించి పాల్గొనేవాడు కాడు. కానీ ఒకే ఒక సందర్భంలో దర్శకుడు దాసరికోసం ఆ పని చేశాడు. రెండు చిత్రాల షూటింగ్‌లో ఒకేసారి పాల్గొన్న సందర్భం అదే.

తనమీద తనకు పట్టువున్న వ్యక్తి ఆయన. తన భార్య రాణీబెనర్జీతో తాను సోమవారం పోతానని అంటూండేవారు. అలాగే మొన్న సోమవారం మధ్యాహ్నం స్వగృహంలోనే అస్తమించిన అశోక్‌కుమార్ అంత్యక్రియలు కూడా ఆ రాత్రే జరిగి పోయాయి. మనిషిలేకున్నా ఆయన మహోన్నత నటన, వ్యక్తిత్వం చలనచిత్ర చరిత్రలో అజరామరాలు. అటువంటి నటుల తరం మళ్లీ చూడగలమన్న నమ్మకం లేదు.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 12 డిసెంబర్ 2001)

❖

(9) భాషాపరశేషభోగి సాహితీ ప్రియత్వం

ఆయన మేధస్సు రాజకీయం

అయినా హృదయం సాహిత్యం.

'ఢిల్లీకి రాజయినా తల్లికి ఒక కొడుకే' అనే మాట ఆయన నోట అనేకసార్లు వచ్చిందంటే– తన మూలాలను అంటిపెట్టుకునే మౌలిక లక్షణం నుంచి ఆయన ఏనాడూ వైదొలగలేదనే. ఆయన విలక్షణత అదే. ఆయన ప్రత్యేకత అదే.

పలుభాషల మీద అధికారం, పలు 'బాసల' మీద వైదొలగని మమకారం ఆయన సంపద. రాజకీయంలో ఎంతటి చాణక్యుడో, సాహిత్యంలో అంతటి రసభావుకుడు. ఆయన వ్యక్తిత్వం ప్రాతిపదికలు అన్నీ సాహిత్యంతో పెనవేసుకుని పెరిగినవే. అందువల్లనే ఆయన విలక్షణ రాజకీయవేత్తగా రాణించారు.

చిన్ననాట హన్మకొండ వీధుల్లో, వరంగల్లు రంగంగా కుర్రకారుగా విహరించినప్పటినుండి ప్రధానంగా కార్యకర్తే అయినా– కావ్యకర్తకు కావలసిన లక్షణాలు పుష్కలంగా పెంచుకున్న వ్యక్తి. కాళోజీ వంటి మిత్రుల సాంగత్యంలో తాను ఎలా లాభపడిందీ ఆయనే స్వయంగా చెప్పుకుంటారు. 'నా గొడవ' కాళోజీ సమగ్ర కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన ప్రసంగం విన్నవారెవరికయినా ఆయన ఉదాత్త హృదయం ఆవిష్కృతమై తీరుతుంది. ఎంతటి ఉన్నత పదవులు రాజకీయంగా అధిష్ఠించినా, సాహిత్య సంస్కారమే మనిషిని ఉన్నతుని చేస్తుంది అని విశ్వసించిన లక్షణం వారిది. 'కాళోజీ అనే భూతం నన్ను ఇన్నాళ్ళూ వెంటాడుతూనే వుంది' అని ఆయన చమత్కరించిన మాటలోని భావం అదే.

అంతర్జాతీయ వేదిక మీద ప్రసంగిస్తూ కూడా కాళోజీ కవిత్వ పంక్తులను ఆయన ఉటంకించడం అంటే– తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన కవిత్వమౌలిక పునాదులను అంటిపెట్టుకుని ఉండడమే.

విశ్వనాథవారి సంప్రదాయ అభిజ్ఞ, కాళోజీ ప్రజాచైతన్య ప్రజ్ఞ రెండింటి సమన్వయమూ ఆయన సాహితీమూర్తిలో నిక్షిప్తమై వుంది. విశ్వనాథవారి 'వేయి పడగలు' హిందీలోకి 'సహస్రఫణ్' పేరిట అనువదించిన కృషి సామాన్యమైన సాహితీ వ్యవసాయమేమీ కాదు. ఒక పరిణతి చెందిన రచయిత అయితే తప్ప, ఆత్మచరిత్రాత్మక కథనాన్ని 'ఇన్‌సైడర్' వంటి నవలతో ఆవిష్కరించడం కుదిరేపని కాదు. దానికి ఎంతో సాహసమూ కావాలి.

1999 నవంబరు 8 ఆంధ్రప్రభ వారపత్రికలో ఆయన రాసిన 'మంగయ్య అదృష్టం' అనే నవలిక రాజకీయ వ్యవహారసరళిపై ఒక చక్కని అధిక్షేపరచన. బ్రహ్మగారి భాగ్యలేఖన శాఖను సాక్షాత్తు ఆయన పత్ని అయిన సరస్వతి కూడా తూర్పార బడుతుంది. ఒక మహావిద్వాంసుడు బిచ్చమెత్తుకునే దౌర్భాగ్య స్థితిని నిరసిస్తుంది. ఆరోగ్యం శూన్యమైనా, విద్య ఏ కోశానా లేకున్నా, చిల్లిగవ్వ సంపాదన లేకున్నా, బుద్ధి లేశమైనా లేకపోయినా, కళాత్మకత మృగ్యమయినా, ప్రేమయోగం లేకున్నా ఒక్క రాజకీయ యోగం పడితే సమస్తమూ అవే సమకూడుతాయన్న విషయాన్ని 'మంగయ్య' పాత్ర సృష్టిద్వారా హాస్య, వ్యంగ్య, అధిక్షేపాలతో కూర్చి చేసిన రచన అది.

దేవతలమధ్య నిజాయితీతో వచ్చిన ఒక అభిప్రాయ భేదాన్ని పరిష్కరించడానికి మంగయ్య వ్యవహారాన్ని 'టెస్ట్‌కేస్'గా నిలిపి భాగ్యలేఖన శాఖే సర్వోపరిగా వుండక తప్పదనీ 'నాన్యఃపంథా అయవాయ విద్యతే!'... ఇదే ముమ్మాటికీ నిజం అనీ బ్రహ్మదేవుడి చేత అనిపిస్తారు. మనిషి విషయంలో అందునా రాజకీయవ్యక్తి విషయంలో దేవతలందరూ విరుద్ధంగా ఏకమయినా, బ్రహ్మరాతే అసాధారణ ఉదంతంగా అభివ్యక్తం అవుతుందని చమత్కారంగా చెబుతారు. మనిషి విషయంలో బ్రహ్మరాతను మార్చలేక బోల్తాపడిన దేవతలు ఆత్మహత్య చేసుకుందామనుకుంటే అమరత్వం అడ్డు వచ్చి అమరత్వానికి సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడినే తమ అమరత్వం ఉపసంహరించమని వేడుకోవలసి వస్తుందట. 'అసలు దేవతలంటే ఎవరనుకున్నావ్? వారంతా మానవుల కల్పనల్లోంచే ఉద్భవించారన్న పరమసత్యం నీకు తెలియదా? మాట వరుసకి ఒక గాడిద తన ఇష్టదేవతను ఊహించుకుంటే ఒక మహాగాడిదగానే ఊహించుకుంటుందని ఎవరో మహాతాత్త్వికుడు చెప్పిన విషయం నీవు వినలేదా?'.

'నేను అహంకారిని కాదనీ ఇతర దేవతల అభిప్రాయాలను ఎప్పుడూ గౌరవించే వాడిననీ మీకు తెలియంది కాదు. ఐతే నేను మిమ్మల్ని ఒకే ఒక్క ప్రశ్న అడుగుతున్నాను.

తక్కిన శాఖలేవీ అమలే చేయకపోతే భాగ్యలేఖన శాఖ ఉనికికేమైనా అర్థముంటుందా? సర్వజగత్తులో అదృష్టం పట్ల విశ్వాసం లేకుండా పోయేట్టు మనమే ప్రవర్తిస్తే ఇది కంచె చేనుమేసినట్టు కాదా? మరి మన శాఖలన్నీ సమన్వయ పద్ధతిలో పకడ్బందీగా పనిచేయకుంటే విధిలిఖితం తప్పనిసరిగా ఎలా జరిగి తీరుతుంది?'

'శత్రువును తుపాకితో చంపినదాని కంటే ఎన్నికల్లో ఓడించడం ప్రతీకారానికి సభ్యత్వ పద్ధతిగా భావించబడుతున్నట్లు వారు గమనించారు'.

'అయ్యో పాపం! అయ్యోపాపం! అన్నదే ఏకైక నినాదమైంది. మేనిఫెస్టోలు మాయమై పోయాయి. ఉపన్యాసాలూ, బహిరంగ సభలూ పట్టించుకున్న వాడే లేడు. కన్నీళ్లతో కళ్లు నిండిపోతే మంగయ్యకు పడ్డ ఓట్లతో డబ్బాలు నిండిపోయాయి'.

'మంగయ్యను ఢిల్లీ పత్రికల్లో ఎంత దుయ్యపట్టితే అంతే అధికంగా అతనిపట్ల ఢిల్లీ అధికార వర్గాల్లో అదొక వర్ణించరాని నిష్కారణ సహానుభూతి ఉబికి వచ్చింది. మామూలుగా రాజకీయాల్లో ఒక వ్యక్తిపై ఇంతటి సానుభూతి పుట్టుకు రావడం అట్టే జరగదు. పరస్పర సంహారమే రాజకీయాల లక్షణం. కాని అప్పుడప్పుడు అనేక చిత్ర విచిత్ర పరిణామాలు కూడా రాజకీయాల్లో తలవని తలంపుగా ప్రత్యక్ష మౌతుంటాయి'.

మొదలైన పాత్రోచిత సంభాషణలు, వ్యాఖ్యలు, నిశితంగా వివేచించినప్పుడు ఆయనలోని నిశితపరిశీలనా దృక్పథం, విషయాన్ని అభివ్యక్తం చేసే నైపుణి స్పష్టంగా తెలుస్తాయి. మౌనంగానూ, గంభీరంగానూ కనిపించే ఆయనలోని హాస్య, వ్యంగ్య ధోరణులు, మాటకారితనం అబ్బురమనిపిస్తాయి. 'సమస్య వైశాల్యాన్ని తగ్గించి దానినొక స్థానిక సమస్యగా మార్చడం', 'చేతకాని పనిని పక్కవాడి ఒడిలో పడవేయడంలో కలిగే హాయి', 'మానవుల్లో వలెనే దేవతల్లో కూడా నిర్ణయం తీసుకునే బాధ్యత తప్పితే అందరూ సంతోషిస్తారేమో' అనడం తాను తలమునకలుగా వున్న రాజకీయరంగాన్నే ఒక సాహితీపరునిగా ఎదుట నిలుపుకుని విశ్లేషించి వ్యాఖ్యానించడం వంటిదే.

'పదవి నలంకరించడమే తడవుగా మంగయ్య గుణగణాలు కొల్లలు కొల్లలుగా పత్రికల పుటల్లో అనంతధారలై రాసాగాయి. మంగయ్యక్కూడా తనలో ఇంత సుగుణ సంపద కుదించి కుదించి ఉందని తత్పూర్వం తెలియదు. చూస్తూ చూస్తూనే మంగయ్య జీవిత చరిత్ర అధికారికంగా వెలువడింది. విశుద్ధ కల్పిత కథా సాహిత్యం కోవలోకి సునాయాసంగా చేరే ఆ చరిత్రలో మంగయ్యనొక ఆదర్శ మనిషిగా చిత్రించడం

విజయవంతంగా జరిగింది. చరిత్రకారుడు స్పష్టంగా చెప్పకనే చెప్పబూనిందేమంటే మంగయ్యకూ మహావిష్ణువుకూ మధ్య మహా ఐతే బెత్తెడెడం ఉంటే ఉండొచ్చని' అని సందర్భవశాత్తూ వ్యాఖ్యానించడంలో– రాజకీయం ముందు సాహిత్యం కూడా ఒక్కొక్క సారి ఎలా నిస్సిగ్గుగా వినమ్రమవుతోందో ఆ అసందర్భస్థితిని అధిక్షేపించడమే. లోక వృత్తాన్ని ఎంతో సహజంగా, నిజాయితీగా ఆకళింపు చేసుకుని నిర్భయంగా వ్యక్తీకరించగల చేవ ఇది.

ఆంధ్రప్రభ దీపావళి ప్రత్యేక సంచికలో వెలువడిన ఆ నవల ఎందరో పాఠకులను గిలిగింతలు పెట్టింది. అలాంటి ఒక నవలను పి.వి.రాసారా! అని అబ్బురపడిన వారూ ఉన్నారు. సామాన్య పాఠకులను సైతం అలరించగల జనమమేకమైన శైలికి 'మంగయ్య అదృష్టం' ఒక దాఖలా.

ఇంతటి సాదాసీదాగా కనిపించే వ్యక్తిలోనే అసాధారణ పాండిత్యం కూడా వుంది. ఆయనకు అనేక భాషలు తెలియడమే కాదు. ఆ భాషల్లోని సాహిత్యాంశాల పరిచితి కూడా ఎంతగానో వుంది. 'వేయి పడగలు' వంటి గ్రంథాన్ని హిందీలోకి అనువదించడమంటే హిందీభాషపై ఎంత పట్టు ఉంటే అది సాధ్యమో తెలియనిది కాదు కదా!

1979 లో జనతాప్రభుత్వ సమయంలో ఢిల్లీకి వెళ్లినప్పుడు ఆకాశవాణిలో నా సహచర మిత్రుడు మంత్రవాది సుధాకర్, నేనూ ప్రత్యేకించి వెళ్లి పి.వి.నరసింహారావు గారిని కలవడం ఒక మరపురాని ఘట్టం మాకు. వారింట్లో వారు ఇచ్చిన టీ తాగుతూ ఒక ఇరవై నిముషాల సేపు వారితో సంభాషించడం, అందునా వారు చెప్పిన అధికశాతం అంశాలు సాహిత్యపరమైనవే కావడం నాకు బాగా గుర్తు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య వాతావరణాన్ని గురించి మమ్మల్ని అడిగారు. మాటల మధ్యలోనే ఢిల్లీలో– ఢిల్లీ నుంచి ప్రసారమయ్యే రేడియోలోని తెలుగు వార్తలు వినలేకపోతున్నామనీ, అవి ఎలా వినడం కుదురుతుందనీ వాకబు చేసారు. భాషపట్ల, సాహిత్యం పట్ల ఆయనది అనవరత మమకారం అని మాకు క్షుణ్ణంగా ఆనాడే అర్థమయింది. వారు ప్రధాని అయ్యాక– రాష్ట్రంలో పలుమార్లు వారి పర్యటనల కార్యక్రమ ప్రసంగాలను రికార్డు చేసి, రేడియో నివేదికలు సమర్పించే అవకాశం నాకు కలిగింది.

తెలుగులో వారు జన సమూహాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు సూటిగా, సరళంగా ఉండడం మాత్రమే కాదు అంతస్సూత్రంగా ఒక సాహిత్య సుగంధాన్ని,

భాష తీయదనాన్ని సంతరించుకుని భాసించేవే. మాడుగుల నాగఫణిశర్మగారి సహస్రావధానం సందర్భంగా ఆయన ప్రసంగం అవధాన ప్రక్రియపట్ల ఆయనకున్న అపార విశ్లేషణనూ, తెలుగు కవిత్వం, ధారణాశక్తి మహిమాన్విత్వం, వంటి అంశాలను ఆయన వివరించిన తీరూ– ప్రేక్షకులకు తెలిసి మంత్రముగ్ధులను చేసాయి. మాడుగుల నాగఫణిశర్మగారికి ఒక ప్రశ్న వేయుమన్నప్పుడు 'గడ్డివాములో పడిన సూదిని బయటకు తీయమన్నట్లుగా ఉంది. నిద్రావస్థలో కూడా ప్రశ్నలతో సతమతమయ్యే నాకు ఒక ప్రశ్నను వేరు చేస్తే తక్కిన వాటికి అన్యాయం చేసినట్లవుతుంది. కవి తన భావనలో అతిపెద్ద ప్రశ్నగా భావించిన అంశానికి సమాధానం చెప్పాల'ని హితవు పలికారు. ఆ సందర్భంగానే "పదునెరిగిన పసదెలిసిన పరిపాలన మేధావి, పలుబాసలు రసనదిరుగు చదువులమ్మ కెమ్మోవి– భారతదేశపు ఠీవి పీ.వీ. మీ ఆయుధమ్ము మౌనము అసమానము– జ్ఞానే మౌనమ్మను మాటకు నీవే ఉదాహరణము" అని మాడుగుల వారు ప్రధాని పి.వి.ని కవితాగానంతో కొనియాడారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు నాటి మా 'యువభారతి' సాహితీ సాంస్కృతిక సంస్థ భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా వంద వ్యాసాలతో ప్రచురించిన 'మహతి' సంకలనాన్ని 14.8.1972 న ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించింది ఆయనే. సభ సరిగ్గా ఆరుగంటలకు అంటే ఆరుగంటలకే మొదలై పోయింది. బహుకార్యక్రమ మగ్నులైన పి.వి.రాక కొద్ది ఆలస్యమైనా యువభారతి సభ సకాలానికే ప్రారంభించడాన్ని ఆయన సమర్థించి, ప్రశంసించి తన ఆలస్యానికి శ్రోతలను మన్నించమనడం గొప్ప సాహితీ సంస్కారానికి నిదర్శనం. నాటి వారి ఉపన్యాసం పాతికేళ్ల తెలుగు పర్వాన్ని సమవీక్షణం చేసింది. 'మహతి' వ్యాస సంపుటిలో విశ్వనాథ, శ్రీశ్రీల వ్యాసాలు సాహిత్య చరిత్రలో మైలురాళ్లుగా నిలుస్తాయని నాడు ఆయన అన్నమాటలు యథార్థాలయ్యాయి.

పి.వి. ప్రధానిగా ఉన్న హయాంలోనే వినియోగదారుల చైతన్యం కూడా విస్తృతమైంది. కన్స్యూమర్ ఎడ్యుకేషన్, కన్స్యూమర్ అవేర్‌నెస్ లిటరేచర్ విరివిగా వచ్చింది. 1992 లో గిద్దలూరులో ఒక బహిరంగ సభలో కరెంటు, నీరు పొదుపు గురించి అశేష జనసమూహాన్ని ఉద్దేశించి సరళంగా ఆయన చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తే. ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టపగలే ఫ్యానులూ, లైట్లూ నిరంతరాయంగా పనిచేస్తూ వుండటం, గదిలో ఎవరూ లేకపోయినా వాటిని ఆపి ఎవరూ వెళ్లకపోవడం గురించి ఆయన చెప్పినప్పటి నుంచి ఎప్పుడయినా, ఎక్కడయినా అలాంటి పరిస్థితి కనబడితే

వెంటనే ఫ్యానూ, లైటూ ఆఫ్ చేయడం ఒక అసంకల్పిత చర్యగా మారిన ప్రభావం వేసింది వారేననాలి.

'మౌనం బంగారం' అన్నదానికి ఆయనే ప్రతీక. అంతరాంతరాల్లోకి తొంగి చూసుకుని అంతర్ముఖమయ్యేవాడే ఉదాత్తంగా ఉత్తాలంగా బహిర్గతమూ కాగలుగుతా డనిపిస్తారాయన. స్వామి రామానంద తీర్థ అంతేవాసిత్వం వారిలో ఆ స్థిత ప్రజ్ఞత్వాన్ని పాదుకొల్పి వుండవచ్చు. 'ఇన్‌సైడర్' పేరున ఆయన ఇంగ్లీషులో రాసిన ఆత్మ చరిత్రాత్మక మనిపించే గ్రంథాన్ని మిత్రుడు కల్లూరి భాస్కరం తెలుగులోకి అనువదించినప్పుడు ఆయన ఆ అనువాదాన్ని ప్రత్యక్షరం పరిశీలించి తన భావాలకు అనుగుణంగా ఉందో లేదోనని సరిపోల్చుకోవడం, అక్షరరూపం దాల్చే భావాలకు సాహిత్యగౌరవం లభిస్తుందని శ్రద్ధవహించడం భాస్కరంగారు చెబుతూంటే ఆయన శ్రద్ధాసక్తులకు చెయ్యెత్తి దండం పెట్టవలసిందేననిపించేది. ఆంధ్రప్రభ దినపత్రికలో రోజూ ఆ రచన చదవడం పాఠకునిగా ఒక మధురానుభూతి.

శ్రీ పి.వి.నరసింహారావుగారు తెలుగులో చేసిన ప్రసంగాలూ, ఆయన రచనలూ అన్నీ గ్రంథాలుగా వెలువడితే, అలాగే ఆయన ఆంగ్లాది భాషలలో చేసిన ప్రసంగాలూ, రాసిన వ్యాసాలూ, వారితో పాత్రికేయుల ఇంటర్వ్యూలు వంటివన్నీ సంకలితం అయితే ఆయనలోని సాహితీమూర్తి పాఠకలోకానికి మరింత సన్నిహితం కాగలరనిపిస్తుంది. ఆ కృషి మొదలై సఫలీకృతం కావాలని ఆశ, ఆకాంక్ష. వారి సాహితీమూర్తిమత్వాన్ని అభిమానించే శతాధికుల్లో ఒకనిగా ఈ చిరుతలపులు కలబోసుకునే అవకాశం కలగడం ఆనందదాయకం.

(ప్రతిభావైజయంతి–అజో.విభో–కందాళం.వారి శ్రీ పి.వి.నరసింహారావు సమ్మానోత్సవ సంచికి– 6 జనవరి 2002)

(10) కళాసాంస్కృతిక వటవృక్షం

కొందరు మన మధ్యే ఉంటారు. వారెంత గొప్పవారో మనం గ్రహించలేక పోవచ్చు.

బిరుదులూ, అవార్డులే కొలమానాలయితే మరి వారి ప్రతిభ వాటన్నిటికీ అతీతమైనది. నిరంతరం సృజనాత్మక జీవనం గడపడమే వారి నైజం. ఒక విధంగా తమ అభిరుచుల తన్మయత్వంలో నిష్కామకర్మ నిర్వర్తించుకుంటూ సాగడమే వారి తీరు. బహుశా అదే వారి శక్తి కూడానేమో!

ప్రపంచం నలుమూలలా ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అద్భుతమయిన ఉపన్యాసాలిచ్చినా, అమూల్యమైన గ్రంథాలను సంతరించినా, సజీవ దృశ్య కవితలనేంత మనోహరంగా మన శిల్ప, చిత్రకళల గురించీ, నదుల గురించీ లఘుచిత్రాలు నిర్మించినా, సాదాసీదాగా ఒక నియమబద్ధ జీవనం గడపడం కొందరు కర్మిష్ఠులకే సాధ్యం. అలాంటి ఒక అద్భుతమైన వ్యక్తి తొమ్మిదిపదుల వయసున్న పైడిమర్రి రాజా రామచంద్రరావు.

దేశంలోని నాలుగు విశ్వవిద్యాలయాలే కాదు విదేశీ యూనివర్సిటీలు కూడా గౌరవ డాక్టరేట్‌లను ఇస్తామంటే "ఆ పేపర్ డాక్టరేట్‌లు నాకు అక్కర్లేదు" అని వినమ్రంగా తిరస్కరించిన వ్యక్తిత్వం ఆయనది. తెలుగువారి కళాసాంస్కృతిక ప్రాభవాలను విదేశాలలో గత శతాబ్దపు నలభయ్యవ దశకంలోనే తమ అద్భుత వాక్పటిమతో, పరిశోధనా ప్రాభవంతో చాటి చెప్పిన వాడాయన.

పందొమ్మిదివందల నలభైతొమ్మిది (1949) లోనే డిబ్లిన్ ట్రినిటీ కాలేజ్ ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మ్యూజియంలలో ప్రారంభించి 1972 వరకూ శాన్‌ఫ్రాన్సిస్కో, రోమ్, కేంబ్రిడ్జి, న్యూయార్క్, టొరంటో, ఏథెన్స్, వాషింగ్టన్, వర్జీనియా, లాస్ ఏంజెల్స్, కాలిఫోర్నియా, టోక్యో, లండన్, అటావా, పిట్స్‌బర్గ్, హోస్టన్, సిడ్నీ, మెలబోర్న్,

ఆమ్‌స్టర్‌డామ్, ఫిలడల్ఫియా, కొలంబియా, వియన్నా, కోపెన్‌హేగన్, సింగపూర్, జకార్తా, కైరో, పారిస్ మొదలయిన అనేక చోట్ల విశ్వవిద్యాలయాల్లో, ఆర్ట్ మ్యూజియంలలో అద్భుతమైన ఆంగ్ల ప్రసంగాలు చేసి మెప్పించిన అక్షరాలా తెలుగు వాడాయన.

'ఫస్ట్ పర్సన్ సింగ్లర్' అనే పి.ఆర్.రామచంద్రరావు పుస్తకం చదివితే సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. ఎందరెందరో ప్రముఖులతో ఆయనకు గల సన్నిహిత పరిచయాల, అనుభవాలు– జ్ఞాపకాల సమాహారం అది. మహాత్మాగాంధి, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్, జిడ్డు కృష్ణమూర్తి, రవీంద్రనాథ్ టాగోర్ వంటి వారి ఆదరాభిమానాలను, గౌరవాలను అందుకున్న ప్రతిభామతి ఆయన.

వృత్తిరీత్యా న్యాయవాది, కానీ ప్రవృత్తి రీత్యా ఒక గొప్ప సాంస్కృతికాభిమాని. శిల్ప, చిత్రకళల పట్ల అపారమైన ఇష్టం. స్వయంగా మంచి ఫోటోగ్రాఫర్. ఆయన తీసిన అనేక ఛాయాచిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఆయన ఒక గొప్ప చారిత్రక పరిశోధకుడు కూడాను. నాగార్జునసాగర్ నిర్మాణ సమయంలో కొండమీద మ్యూజియం నెలకొల్పి అపూర్వ శిల్పసంపదను పరిరక్షించవలసిన కర్తవ్యాన్ని ప్రధాని జవహర్‌లాల్‌కు చెప్పి ఒప్పించిన వారిలో పి.ఆర్.రామచంద్రరావే ప్రథములనీ, ప్రముఖులనీ చాలామందికి తెలియదు. ఏమిచేసినా ఏదో ఆశించి చేసిన వ్యక్తి కానందువల్లనే ఆయన తన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నేటికీ నిలబెట్టుకుంటూ వస్తున్నారు.

1965 లోనే 'కాంటెంపరరీ ఇండియన్ ఆర్ట్' అనే పుస్తకాన్ని ప్రచురించి ఎమ్.ఎఫ్. హుస్సేన్, ఎస్.వి.రామారావుల చిత్రాలను అప్పట్లోనే విదేశీయులకు రుచి చూపించారు. ఆలంపూర్ గురించీ, భువనేశ్వర్ గురించీ, ఆంధ్ర శిల్పం గురించీ ఆయన రాసిన ఆంగ్ల గ్రంథాలు దేశవిదేశీ పత్రికల ప్రశంసలు అందుకున్నాయి.

న్యాయవాదిగా ఆయన విజయాల గురించి కన్నా, సాంస్కృతిక సేవకునిగా ఆయన కృషి గురించి చెప్పడమే ఆయనకు ఇష్టమైన సంగతులు. రాజ్యాంగాన్ని గురించీ, రాజనీతి శాస్త్ర విషయాలను గురించీ ఎంత విస్తారంగా దేశవిదేశాలలో ప్రసంగాలు చేశారో, అంతకుమించి విస్తారంగా పర్యటించి భారతీయ శిల్ప, చిత్రకళల గురించి ప్రసంగాలు చేశారు.

రచయితగా, వక్తగా, ఛాయా చిత్రగ్రాహకునిగా గుర్తించదగిన ఖ్యాతి వారిది. వృత్తిరీత్యా హైకోర్టుల్లో, సుప్రీంకోర్టులో లాయర్‌గా ఎంత పేరు ప్రఖ్యాతులు

సంపాదించినా ఒక సాంస్కృతిక జీవిగానే ఆయన శిల్ప చిత్రకళారంగాలలో రచనా వ్యాసంగంలో గొప్ప తృప్తిని ఆర్జించుకున్నారు. లలితకళా అకాడమీ (న్యూఢిల్లీ) కూడా ఆయనను గౌరవించింది 'భారతీయ కళా రాయబారి'గానే. అమరావతి, నాగార్జున కొండల గురించి ఆయన రాసిన పుస్తకాలు మెచ్చని విదేశీయులు లేరంటే అతిశయోక్తి లేదు.

ఆయన ఇంగ్లీషు శైలి రాధాకృష్ణన్ పండితుడినే అబ్బురపరచింది. ఆయనలా ఇంగ్లీషు మాట్లాడాలనీ, రాయాలనీ తపించిన ప్రముఖులెందరో ఉన్నారు. తాము స్వయంగా రచించి, ఫోటోగ్రఫీకి దర్శకత్వం వహించి నిర్మాతగా రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాలు 'రివర్‌కృష్ణ', 'విజయనగరం', 'ఔట్‌స్టాండింగ్ మాన్యుమెంట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' చూసిన వారెవరయినా ఆ రచనా సంవిధానానికీ, చారిత్రక పరిశోధనా పాటవానికీ, మనోహరమైన దృశ్యసంపదకీ ఆనందించి తీరవలసిందే. కృష్ణానది గురించిన డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను బి.బి.సి. లండన్, ఫ్రాన్స్, కెనడా, జర్మనీ, సిడ్నీ దేశాలకు చెందిన టీవీ ఛానెల్స్ అద్భుత రసాత్మక దృశ్య చిత్రణగా, ఒక మనోహర పద కవితగా అభివర్ణించాయి. ఇప్పటికీ రామచంద్రరావు రోజుకి పద్దెనిమిది గంటలు పనిచేస్తూనే ఉంటారు. 'ఆంధ్ర శిల్ప కళా వైభవాన్ని' ఆంధ్రాంగ్లాలలో సరికొత్త డాక్యుమెంటరీలుగా తీసే పనిలో నిమగ్నమై ఉన్నారు. గుణాఢ్యుని నుండి ఇటీవలి సాహితీవేత్త వరకూ అందరి గురించీ ఆయన అధ్యయనం చేస్తారు. ఆయన ప్రణాళికలూ, కల్పనలూ అన్నీ సాంస్కృతిక నేపథ్యం మూలకందగా విప్పారేవే. భారతీయ కళా సాంస్కృతిక వైభవాన్ని దృశ్య మనోహరంగా ప్రపంచ పరివ్యాప్తం చేయాలన్నదే ఆయన లక్ష్యం. మనదేశ మహోన్నత సాంస్కృతిక సంపదను మనవారు అర్థం చేసుకుని ఆస్వాదించి అధ్యయనం చేసి నలుగురికీ తెలియచెప్పాలన్నదే ఆయన కాంక్ష. తెలుగువారు గర్వించదగిన సాంస్కృతిక వటవృక్షం పైడిమర్రి రాజా రామచంద్రరావు.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 20 మార్చి 2002)

❖

(11) అట్లూరి(న) కలం

తమాషా ఏమిటంటే మొదటిసారి ఆయన గొంతు వినగానే అదేమీ ఇంప్రెసివ్‌గా అనిపించదు. అదేమీ మేరు గంభీరమైన గళం కాదు. గరుకుగా, కట్ వాయిస్‌గా అనిపిస్తుంది. మేనేజ్‌మెంట్ స్కిల్స్ గురించి ఈ మనిషేనా అనేక కార్యాలయాల్లో, సంస్థల్లో ప్రసంగాలు చేసి మెప్పించిందీ, శిక్షణా తరగతులు ఇప్పించిందీ అనిపిస్తుంది. కానీ పరిపాలనా సామర్థ్యాల గురించీ, మంచి యాజమాన్య పద్ధతుల గురించీ ఆయన చెప్పే విషయాలు, చేసే సూచనలు ఎంతో విలువయినవని గుర్తించడం వల్లనే (అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్) పాలనా సంస్కరణల గురించి సూచించ డానికి రాష్ట్రప్రభుత్వం తాను నెలకొల్పిన కమిటీలో ఆయనను ఒక సభ్యుడిగా తీసుకుంది.

నిజమే! ఆయన గళం గురించి కన్నా, మాటాడుకోవాల్సింది నిజానికి ఆయన కలం గురించి. తెలుగు, ఇంగ్లీషు భాషలలో ఆయన నలభైకి పైగా పుస్తకాలు రచించాడు. అవన్నీ ఏవో కాల్పనిక కథలు, నవలలు కాదు. తాను ఎంతగానో అభిమానించే మానసికశాస్త్ర రంగానికి సంబంధించినవే దాదాపు ఆ గ్రంథాలన్నీ. నిజానికి ఆయన మానసిక శాస్త్రవేత్తగా ఏ డిగ్రీలూ పుచ్చుకోలేదు. ఆయన డాక్టరేమీ కాదు. కనీసం ఆయన వృత్తి కూడా దానితో ముడిపడినదిగా ఏమీ ఉండినది కాదు.

ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ (ఎ.పి.ఎస్.ఇ.బి.) లో వివిధ హోదాలలో పనిచేసి, డైరెక్టర్– పర్సనల్ సర్వీసెస్ హోదాలో సుమారు రెండు దశాబ్దాల క్రిందే రిటైరయ్యాడు. ఆ తరువాత ప్రతిష్ఠాత్మకమైన ఆల్విన్ సంస్థ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన పట్టభద్రులయింది ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో. కానీ వృత్తి ఏదయినా ప్రవృత్తి మాత్రం రచనా వ్యాసంగం. అది కూడా మానసిక శాస్త్రరంగ సంబంధమే. వివిధ రంగాలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొనే మానసిక సమస్యలను విశ్లేషిస్తూ

విభిన్న కోణాలలో ఆయన ఆలోచనాత్మకమైన పుస్తకాలను రచించారు. పలు దినపత్రికలలో మనోవైజ్ఞానిక సంబంధమైన కాలమ్స్‌ను నిర్వహించారు.

బహుగ్రంథ పఠనం ఆయన అభిరుచి. ప్రపంచంలో మానసిక శాస్త్రంలో వచ్చిన అనేక పుస్తకాలను చదువుతూ, మన దేశ కాల పరిస్థితులకు సమన్వయిస్తూ, తనదైన విశ్లేషణను జోడించి ఆయన రచనలు చేశారు. చాలా చిన్న చిన్న విషయాలు అనుకునే వాటిని కూడా శాస్త్రీయంగా విశ్లేషించి వ్యాఖ్యానించేవారు. తన రచనల్లో ఒక్కొక్కసారి చెప్పిన విషయమే చెప్పినట్లు అనిపిస్తూ ఉన్నా, ఆ చెప్పే పద్ధతిలో ఒక నవ్యతనూ, నూతన సోపపత్తికతనూ సంతరించి చెప్పడం ఉండేది.

మానసిక ఒత్తిడిని అన్ని వయసుల వారూ, అన్ని రంగాలలోని వారూ శాస్త్రీయంగా ఎదుర్కోవడానికి నిశ్చయంగా ఆయన రాసిన పుస్తకాలు మార్గం చూపిస్తాయని విమర్శకులెందరో ఆయనకు కితాబునిచ్చారు. సఫారీ వేసుకుని, చేతిలో చిన్న బ్రీఫ్‌కేసు పట్టుకుని, ఆయన మన గదిలోకి అడుగుపెట్టి గొంతు విప్పగానే వెంటనే మనం 'అలర్ట్' అయిపోతాం. ఆయన సంభాషణలోకి దించి విషయ వివరణంలోకి వెడుతూంటే సహజంగానే ఆసక్తి అంకురించి, ఆయన ప్రస్తావిస్తున్న విషయాల గురించి మరింతగా తెలుసుకోవాలన్న కుతూహలమయితే కలుగుతుంది. ఆయన కన్నా ఆయన పుస్తకాలు నిజంగానే ఎక్కువ మాట్లాడతాయి.

స్టీఫెన్ హాకింగ్ గురించి తెలుగు పాఠకులకు బాగా పరిచయం చేసింది మొదట ఆయనే అని నా విశ్వాసం. 'తనువు మొండికేస్తే తల గదమాయిస్తోంది' అని మిసిమి పత్రికలో 1992 లో ఆయన ముందు ఒక వ్యాసం రాశారు. నడవలేని, మాట్లాడలేని, పళ్లు తోముకోలేని, బట్టలు వేసుకోలేని, తనంత తాను భోజనం తినలేని, తల పక్కకు వాలితే నిటారుగా సరిచేసుకోలేని, ఎప్పుడూ చొంగకారుతూ ఉండే వ్యక్తి ప్రపంచ శాస్త్రవేత్తలందరిచే గొప్పవాడిగా గుర్తింపబడి– ఖగోళ శాస్త్ర రహస్యాలను ఆవిష్కరించడం గురించి చదివి, ఆ అద్భుత వ్యక్తి స్టీఫెన్‌హాకింగ్ గురించి మరింతగా తెలుసుకోవాలని జనం ఉత్సాహపడ్డారు. 1993 లో 'వనితా జ్యోతి' మాసపత్రిక సప్లిమెంటరీగా విఖ్యాత విజ్ఞానశాస్త్రవేత్త స్టీఫెన్‌హాకింగ్ జీవిత విశేషాలను ఆయన ఒక పుస్తకంగా రాసి, ఆ తర్వాత దాన్ని గ్రంథంగా వెలువరించారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేరిన స్టీఫెన్‌హాకింగ్ తన శారీరక మానసిక అవసరాలను, బలహీనతలను అన్నిటినీ అధిగమించి ఎలా విశ్వవిఖ్యాతుడయ్యిందీ చదివి

తీరవలసిందే. ఎందరికో చైతన్యోద్దీపకంగా ఆయన వెలువరించిన ఆ పుస్తకం ఆయన రచనలలో ఒక విశిష్ట గ్రంథం అనక తప్పదు.

'పిల్లల పెంపకంలో తల్లిదండ్రులకు శిక్షణ' దగ్గర నుండి '21వ శతాబ్దపు యాజమాన్య సవాళ్ళు' వరకూ ఆయన రాసిన ప్రతి పుస్తకం వ్యక్తిత్వ వికాసానికీ, మానసిక స్థైర్యానికీ, వొత్తిడులను అధిగమించడానికీ ఉద్దేశించినవే.

'ప్రతి పామూ తల ఎత్తిందని వానపామూ తల ఎత్తిందని' తెలుగులో ఒక సామెత ఉంది. కానీ భూమిని సారవంతం చేసే వానపామూ గుర్తింపునకు అర్హమైనదే అనీ, ప్రతి వ్యక్తీ సాధనతో విజయపథాన సాగగలడనీ అనిపింప చేస్తారాయన తన రచనలతో. 'వానపాముల'లో జన్మించిన ఆయన తన డబ్భై అయిదు సంవత్సరాల జీవనయాత్రలో ఒక వ్యక్తిగా కన్నా సామాజిక శక్తికి అభివ్యక్తిగా, సమష్టి కృషికి ప్రేరక శక్తిగా ప్రయాణించారు. ఆయన ఇద్దరు కొడుకులూ కూడా ఉన్నత స్థానాలలో పారిశ్రామిక, పరిపాలనా రంగాలలో రాణించడం ఆయన శిక్షణాశక్తికి మౌలిక ఉదాహరణలు కాదా మరి! శాస్త్రసాంకేతిక రంగాలలో పరిశోధనలు, మానసిక శాస్త్ర విషయాలను సృజనాత్మకంగా చెప్పిన రచనలు ఆయనను ప్రముఖ మనోవిజ్ఞాన వేత్తను చేశాయి. ఆయన ఉపన్యాసాలు, ఆయన గ్రంథాలు ఎందరికో చైతన్య భావస్ఫోరకం అయ్యాయి. గత శుక్రవారం ఆగస్టు 16 వ తేదీన అస్తమించిన ఆ సుప్రసిద్ధ రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి, మిత్రబృందానికి ఏ.వి.ఆర్.గా సుపరిచితుడయిన అట్లూరి వేంకటేశ్వరరావు. ఆయన అక్షరశక్తి సదా స్మరణీయం...

(ఆంధ్రప్రభ దినపత్రిక, 21 ఆగస్టు 2002)

❖

(12) 'ప్రసన్న' కథామూర్తి

ఆయనకు మనుషులు ఇష్టం. మానవత్వం ఇష్టం. అందరూ గతంలో జరిగిన చేదును మర్చిపోలేక ఆ గాయాలను కెలుక్కుంటూ ఉంటే, ఆయన మాత్రం గతంలోని మంచినీ, మేలునూ అది రవ్వంతదయినా కొండంత చేసి చూపించడానికే ఇష్టపడేవారు. జీవితంలో పాజిటివ్ థింకింగ్ అవసరమనేవాడాయన. కష్టాలూ, కన్నీళ్ళూ ఎలాగూ ఉంటాయి. 'నవ్వాలనుకొంటె కథలు' చెప్పుకోవడమే భేషుగ్గా ఉంటుందనేవాడు. అలాగని ఆయనకు చికాకూ, కోపం లేవని కాదు. సమాజపు అస్తవ్యస్తతలమీద ఆయనకు ఆగ్రహమే. కుహనా సంస్కారాల గురించీ, కలేజాలేని కర్రపెత్తనాల గురించీ, సాహిత్య ప్రపంచంలోని అవాంఛనీయ ధోరణుల గురించీ, అల్పబుద్ధుల అగ్రాసనాధిపత్యాల గురించీ ఆయన అసహనం ప్రకటిస్తూండేవాడు. అయితే అదంతా మాటలలోనే. రాతల దగ్గరకి వచ్చేసరికి ఆయన లక్ష్యం, సంకల్పం ఉదాత్త ఇతివృత్తాలకు సంబంధించినవే.

జాతీయోద్యమ నేపథ్యంగా స్వాతంత్ర్య సమరయోధుని జీవన దర్పణంగా ఆయన రాసిన 'కౌసల్య' నవల, 'తల్లిదండ్రులు' చలనచిత్రం కథారచన, దూరదర్శన్ జాతీయ ప్రసారాల్లో వచ్చిన 'ఆస్మాన్ అప్నే అప్నే' హిందీ ధారావాహిక ఆయనకు పేరుతెచ్చి పెట్టాయి. చలనచిత్ర కథారచయితగా రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు ఆయనకు వచ్చింది. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం లభించింది.

కొన్ని పాఠ్యపుస్తకాలకు రచన చేశారాయన. సాహిత్య అకాడమీ ఉన్న రోజుల్లో రాష్ట్రంలో 'వన్‌మ్యాన్ అపోజిషన్ లీడర్'గా, నిర్మాణాత్మక విమర్శకునిగా, సభ్యునిగా వ్యవహరించేవాడని ఆనాటి అకాడమీ అధ్యక్షులు బెజవాడ గోపాలరెడ్డిగారే అంటూండేవారు. 'కనక్ ప్రవాసి' అనే చామర్తి కనకయ్యగారితో, పోతుకూచి సాంబశివ రావులతో మైత్రీబంధం చివరంటా సాగింది. 'తరుణ సాహితీ సమితి' నెలకొల్పి

సంప్రదాయ, అభ్యుదయ భావాల సమ్యక్‌వేదికగా దానిని నిర్వహించాడాయన. 'ప్రసన్న' కలం పేరుతో తొలుత రచనలు చేశాడు. మొదట్లో పద్యాలు గిలికినా– తన బాణీ గద్యమేనని హృద్యంగా గ్రహించి, వచన రచన వైపు మొగ్గి కథలు, నవలలు రచించాడు. దీపశిఖ, కవిసార్వభౌమ, పొత్తుల బావి, సదువుకున్న మారాజులు వంటి నవలలు, పలు కథాసంకలనాలు వెలువరించాడు.

'బాపట్ల' అంటే ఆయనకు మక్కువ ఎక్కువే ఒకప్పుడు. పుట్టింది అమలాపురమే అయినా ఆంగ్లోపన్యాసకునిగా పలు ప్రాంతాల్లో పనిచేశారు. షేక్స్‌పియర్ సాహిత్య వైభవాన్ని తెలుగు పాఠకులకు రసమంచితంగా చవిచూపించారు. రేడియోలో బోలెడు ప్రసంగాలు చేశారు.

హాస్యం అంటే ఆయనకు ఇష్టం. వ్యంగ్య, చమత్కారాలతో మాటలే కాదు రాతలూ నిర్వహించాడు. అయితే అదే సమయంలో మానవీయ విలువలపట్ల, దయా, జాలి, కరుణ, త్యాగం, దానం, ధర్మం వంటి అంశాల పట్ల ప్రీతి ఎక్కువ కనుకనే అటువంటి అంశాలనే కథలుగా రాసేవారు. దాంపత్యంలోని మధురిమలు, లలిత శృంగారం అంటే కూడా ఆయనకు మోజు. అందుకే సరసమైన కథలు ప్రచురించే పత్రికలలో ఆ తరహా కథా రచనలూ చేశారాయన. 'మంచి గతమున కొంచెమేనోయ్' అని అనుకున్నా– ఆ మంచిని రక్షించుకుని, వర్తమానంలో నిలుపుకుని, భవిష్యత్తుకూ తీసుకు పోవాలనేదే ఆయన తపన. 'ఆ రోజుల్లో' శీర్షికన ఒక వారపత్రికలో ఆయన తెలుగు సంస్కృతికీ, మానవీయతకూ దర్పణాలనదగిన ఒకనాటి సంఘటనలను గురించీ, ఆనాటి మనుషుల గురించీ, వారిలోని మహనీయతలను గురించీ వ్యాఖ్యానాలతో వ్యాసరూపక కథలను చెప్పారు. అవి ఆసక్తిగా చదివించే రచనలే. ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రి అయ్యాక తన 'కాన్వాయ్' దారి మరల్చి, సుబ్బయ్య అనే నిరుపేద మిత్రుడిని ఒకనాటి జైలు సహచరుడిని మారుమూల పల్లెటూరు పూరిపాకలో కలుసుకోవడం, అతనితో నులకమంచం మీద కూచుని కబుర్లాడి అతని స్థితికి కంటతడి పెట్టడం, కలెక్టర్‌కు ఆదేశించి పది రోజుల్లోగా ఒకనాటి తన సహచర స్వాతంత్ర్యయోధుడికి భూమి ఇప్పించి, అతని జీవితాన్ని నిలబెట్టడం వంటి కథలు అనేకం– మానవీయ పరిమళాలు గుబాళించేవిగా ఆయన గుదిగ్రుచ్చి వెలువరించారు.

సాధారణంగా దంపతులు అయిన భార్యాభర్తలిద్దరికీ ఒకే రకం అభిరుచులుండడం అరుదు. ఒకవేళ ఉన్నా ఒకరే రాణించి, మరొకరు మరీ మరుగున

పడిపోవడం జరుగుతూంటుంది. అటువంటిది ఆయన భార్య రాజ్యలక్ష్మి కూడా రచయిత్రి కావడం, అందునా నవలా రచయిత్రిగా పేరు తెచ్చుకోవడం విశేషమే. హైదరాబాద్‌లో దంపతులిద్దరూ కలిసి సాహితీ సమావేశాలకు హాజరవుతూ ఉండడం, వీలయినప్పుడల్లా సభలలో మాట్లాడుతూండడం, వృద్ధాప్యంలో కూడా జంటగా సంచరించడం ముచ్చట గొలుపుతుండేది. తన 'బోదకాలు' ఇబ్బందిని కూడా అధిగమించి ఆయన, తరుణభావాలతో అందరితో కలివిడిగా సంచరిస్తూండే వారు. పత్రికాఫీసులకు వెళ్లడం ఇబ్బందయితే– ఇంట్లోనే 'ఫ్యాక్స్' ద్వారా రచనలను పంపుతూండే వారు. తనకు ఆ వీలు కల్పించిన కుమారుడిని అభినందిస్తూండేవారు.

కుమారుడిని చూసేందుకే ముంబయ్ భార్యాసమేతంగా వెళ్ళిన ప్రముఖ కథా, నవలా రచయిత శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి గత శుక్రవారం ఆగస్టు 30, రాత్రి అక్కడే మరణించారన్న వార్త సాహితీమిత్రులకు విషాద హేతువయ్యింది. సౌజన్యమూర్తి, స్నేహశీలి, ఉదాత్త మానవీయ విలువలకై తన కలాన్ని కథలుగా, నవలలుగా సారించిన రచయిత పోలాప్రగడ వారి మరణం అంతరించి పోతున్న ఒక తరానికి మరొక చిహ్నం. 'ఆ రోజుల్లో' వారు ఆశించిన జీవితపు విలువలూ, మనిషిలోని మంచితనం భావికాలాల్లో కూడా రక్షింపబడితే అదే వారికి ఆత్మశాంతి. పోలాప్రగడ వారికి ఇది నివాళి.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 4 సెప్టెంబర్ 2002)

(13) మునిమాణిక్యం రచనలలో హాస్యం

ఆనందోబ్రహ్మ అన్నారు. సృష్టికి హేతువు, స్థితికి సేతువు, లయ అనంతర శాశ్వతత్వ ధాతువు ఆనందం. జనన మరణాతీతమైన శాశ్వతముక్తిని కూడా బ్రహ్మానంద మనే అన్నారు. అన్ని కళలు ఆనందం కోసమే. మనిషి పుట్టుక, మనుగడ, మృత్యువు కూడా ఆనందం కోసమే.

హాస్యలహరి అంటే వేదాంతలహరి మొదలైందేమిటా అని అనుకోకండి! వేదాల అంతమైనా, వేదనల అంతమైనా ఆనందం కోసమే. ఆ ఆనందం యొక్క బాహిరరూపమే హాస్యం అన్నారు. హాసం కలిగించేది హాస్యం. నవ్వించేది హాస్యం. అయితే సహృదయుడూ, ఆరోగ్యవంతుడూ, సంస్కృతీమతీ, నాగరికుడూ అయినవాణ్ణి నవ్వించేదే ఉత్తమ హాస్యం అనీ. అలా కానిది హాస్యంగా అనుకోవడం హాస్యాస్పదమనీ గుర్తించాలి.

అయితే తమాషా ఏమిటంటే చాలా సున్నితమూ, రసగ్రహణ చేయగలవారికే గోచరించే సత్యమూ అయిన ఈ హాస్యం– నవరసాల్లో శృంగార కరుణల మధ్య ద్వితీయంగా పేర్కొనబడిన అద్వితీయ రసం. శృంగారానికి వెన్నంటి వెన్నుదన్నుగా నిలిచేదీ, పరిపక్వమై కరుణగా మనిషిని మనీషిని చేయగల మానవీయ స్పందనలకు ప్రాతిపదిక కాగలిగేదీ హాస్యమే. 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి' అంటే అది నిజమైన రసస్థాయి అనే. గొప్పగా నవ్వించే ఛార్లీచాప్లిన్ వంటి హాస్యనటుల జీవితాల లోని కరుణకాంతులు గురించి అందుకే సహృదయ విమర్శకులు విశదీకరిస్తుంటారు.

'లాఫ్ విత్ ఎనీబడీ– బట్ డోంట్ లాఫ్ ఎగైనస్ట్ హిమ్' అని హాస్యం గురించి పేర్కొన్న వారే, హాస్యం గొప్పదనాన్ని చెబుతూ– 'ఇట్ లైటెన్స్ ది హార్ట్– బట్ ది ప్రాసెస్ టు అరైవ్ ఎట్– ఇట్ రిక్వయిర్స్ సీరియస్ థింకింగ్' అన్నారు. అందుకనే క్లిష్టతరమైనదీ, కష్టతరమైనదీ నిజమైన హాస్యం. నవ్వు వికృతితో జనించడమే జనానికి

ఎక్కువగా తెలుసు. ఎందరు కవులూ, రచయతలూ, కళాకారులూ వున్నా అందుకే– హాస్య వైదుష్యం కలవాళ్లు కొంచెంమందే వుంటారు.

ఆలంకారికులు కూడా–

"వికృతాకార వాగ్వేష చేష్టాదేర్నర్తకాద్భవేత్
హాస్యోహాసః స్థాయీ భావః" అనేశారు.

వికృతమైన ఆకారమూ, వేషమూ, చేష్టలూ, భాష వీటివల్ల హాస్యం పుడుతుంది అన్నారు. వేషం వల్లా, చేష్టవల్లా పుట్టే హాస్యం బాహ్యమైనది. కానీ భావంతో జనించే హాస్యం ఆంతరమైనది. భావంతో అది అభివ్యక్తి కావడానికి భాష అవసరం. వికృతమైన వేషంతో, చేష్టలతో నవ్వించడం కంటే, భాషా సంబంధంగా రచనా చమత్కృతితో నవ్వించడానికి మేధాసంపత్తి కావాలి. అందుకే అన్ని రచనలకన్నా హాస్య రచనలు చేయడం మరీ కష్టం.

అందునా– తెలుగులో హాస్యం అనేసరికి జుగుప్స, మొరటు, అవహేళన, ఎగతాళి, వెక్కిరింత, ఏవగింపు, అసభ్యత, అవినీతి ఇవన్నీ ఆక్రమించి– 'హాస్యం' అనే దాని స్థాయినే ప్రథమగణ్యం కాదు సరికదా, ఒక్కోసారి అధమస్థాయికి గురిచేసాయి, చేస్తున్నాయి. ప్రాచీన సాహిత్యంలోని హాస్యం, నాటకాల విదూషకులూ, కేతిగాళ్లూ, గంధోళిగాళ్లూ వికృత జన్యమైన హాస్యాన్ని సృష్టించినమాట నిజమే గానీ, ఆ నవ్వులో ఉదాత్తత లోపించనట్లే అనిపిస్తుంది. కుంటి, గుడ్డి, చెవిటి, నత్తి వంటి పాత్రల ద్వారా సృష్టించబడిన హాస్యం నేడు మనం నిరసిస్తున్నా, అదొకరకం హాస్యంగానే, ఆ మాటకొస్తే చాలా మటుకు ఆ బాపతుదే హాస్యంగా– చెలామణి అయింది. వెకిలి హాస్యమూ హాస్యమే కావచ్చు కానీ, అది సభ్య నాగరికత అనిపించు కోదుమరి!

"ఆంధ్రసాహిత్యంలో సరిగా కాలూనని ఆరోగ్యకరమైన హాస్యానికి– గట్టి పునాదులు వేసి, తరతరాలు తెలుగువారు హాయిగా, ఆనందంగా నవ్వుకుంటూ విహరించడానికి ఒక రమ్యహాస్యమందిరాన్ని నిర్మించి ఇచ్చారు శ్రీ మునిమాణిక్యం" అని కీర్తిశేషులు పోలాప్రగడ సత్యనారాయణమూర్తిగారు వేసిన అంచనా సరియైనది. విహసితం, ఉపహసితం, అపహసితం, అతి హసితం కాక ఉత్తమమైన స్మితానికీ, హసితానికీ సంబంధించి సహృదయుడూ, విజ్ఞుడు, దయామయుడూ, నాగరికుడూ, సంస్కారీ అయిన పాఠకుడు ఆనందించే ఆరోగ్యకరమైన హాస్యాన్ని ఇరవయ్యో

శతాబ్దంలో భమిడిపాటి, మొక్కపాటి, మునిమాణిక్యం అనే హాస్యత్రయమే పాదుకొల్పిందనీ, గురజాడ, వీరేశలింగం, చిలకమర్తి, పానుగంటి వారల హాస్యంలో కూడా ఎగతాళులూ, వెక్కిరింపులూ, వెటకారాలూ, కొంత మొరటూ ద్యోతకమౌతాయని అనే మాటలోనూ యథార్థం లేకపోలేదు.

మేలిరకమైన హాస్యాన్ని తన రచనలకు జోడించి, లలితంగా, నాజూకుగా శబ్ద భావాశ్రయాలతో బాటు అర్థ సంబంధిగా కూడా సంతరించి, పదికాలాలపాటు పఠించి ఆనందించగల అవకాశం– తెలుగు వారికి కాన్కపెట్టిన, మునిమాణిక్యం అందుకే నిజంగా విశిష్టులు.

"నేను వ్రాసిన మొదటికథ 'టీ కప్పులో తుఫాను'. ఒక చిన్న శృంగార కలాపం అందులో కథావస్తువు. అందులోనే కాంతం కనబడుతుంది. అప్పటి నుండి ఇప్పటిదాకా కాంతం లేకపోతే కథే లేదు" అని ఒకచోట ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. తెలుగు సాహిత్యంలో 'కాంతం' ఒక అజరామరమైన పాత్ర. దాంపత్య జీవితపు సరస సరాగాల అందచందాలను మధ్యతరగతి భిత్తికపై నిలిపి, గృహమనే స్వర్గసీమనూ, ఇల్లాలు అనే బంధాన్నీ పటిష్ఠపరిచిన రచనలు మునిమాణిక్యం వారివి. 'కాంతం' పాత్రను ఆయన సృష్టించి ఉండకపోతే, ఆ కాలంలో భావకవులు ఒకవంక సృష్టిస్తున్న భావనా ప్రేయసులు, చలం స్త్రీవాదంతో రేపిన ఝంఝామారుతాలు పాఠకులను మరింకెటో నెట్టుకుపోవడం జరిగేదేమో!

"నాకు రాబందుల రెక్కల చప్పుడూ ఝంఝానిలషడ్జధ్వానం వినిపించవు. కణకణమండే త్రేతాగ్నులూ, అగ్నికిరీటపు ధగధగలూ కనిపించవు. పదండి ముందుకు అని నేననను. ఇంట్లోనే ఉండమంటాను. ఆవిడిచ్చిన కాఫీ తాగి హాయిగా పిల్లలతో ఆడుకోమంటాను. సుఖదుఃఖాలు అనాదిగా ఉన్నవే. ఇకముందు కూడా ఉండేవే. మనం ఎంత గుండెలు బాదుకున్నా పోవు. ఏదో కలో అంబలో తాగి తృప్తిగా జీవించమంటాను. జీవితానికి తృప్తీ ఆనందమూ దేనివలన కలుగుతుందో దాన్నే కథా వస్తువుగా, కావ్యవస్తువుగా తీసుకుంటాను. అదే చెప్తాను. అయితే దాన్ని వీలైనంత రమ్యంగా చెప్తాను" అంటారు మునిమాణిక్యం.

ఆయన 'కాంతం' పాత్రను సృష్టించి నిజానికి మహిళా సాధికారికతకు మకుటం పెట్టాడు. కాంతం ముగ్ధ, ప్రౌఢ. ఆమె గయ్యాళితనం–జాణతనం తప్ప మరేమీ కాదు. 'దాంపత్యోపనిషత్తు' వెలయిస్తూ 1954 లో 'మునిమాట'గా ఆయన చెప్పిన మాటలు– ఆయన రచనాశయాన్ని స్పష్టం చేస్తాయి.

"హరిణీప్రేక్షణా యత్ర గృహిణీ న విలోక్యతే
సేవితం సర్వసంపద్ధిరపి తద్భవనం వనయ్

ఏ భవనంలో కురంగీనయన అయిన గృహిణి కనపడదో, ఆ భవనం సకల సంపత్తుల కూడుకున్నప్పటికీ అడివే అవుతున్నది. కానీ భవనం కావడం లేదు. గృహానికి గృహలక్ష్మి ఉండాలె అన్నాడు పండితరాజు.

దాంపత్య జీవితాన్ని రమ్యంగా చిత్రించాలని నా అభిలాష. మంజులమయిన మధురవాక్కులతో కథాకథనం చెయ్యాలనీ, గార్హస్థ్య జీవిత సౌందర్యమును మనోహరంగా ఆవిష్కరణ చేయాలని ముప్పదిసంవత్సరాల నుంచీ ప్రయత్నం చేస్తున్నాను. ఏదో కొంతవరకు నా కోరిక నెరవేరిందనే నేను అనుకుంటున్నాను.

రంభలు, నలకూబరులు, హంసలు, చిలుకలు, రాయబారాలు లేకుండానే వాస్తవ జీవితంలోని మధురతమమైన ఘట్టాలను తీసుకుని చిత్రంలో కళారూపం పొందేలాగున చెయ్యడానికి నా శక్తులన్నీ ధారపోసినాను.

జీవితరామణీయకము మహారాజుల ఉన్నత సౌధాలలోనూ, ఉద్యాన వనాలలోనూ మాత్రమే కాక రసవిహీనమనుకున్న సామాన్య గృహస్థజీవితంలో కూడా ఉన్నదని చూపడానికి నేను నా జీవితం అంతా ప్రయత్నించాను" అని పేర్కొంటా రాయన.

హాస్యం గురించి మునిమాణిక్యం వారికి వున్న స్పష్టమైన అభిప్రాయం కూడా ఆ 'మునిమాట'లోనే వుంది.

"హాస్యరస ప్రధానమైన రచనను ఉత్తమ రచనగా పరిగణించే ఆచారం మనకు లేదు. కరుణకూ శృంగారానికీ ఇచ్చిన గౌరవం దీనికి ఎప్పుడూ లేదు. కానీ హాస్య రసం కూడా రమణీయమైనదే. దీనికీ గౌరవమూ, ఆదరణా ఇయ్యవలసి ఉంది. హాస్యం తేలిక అయినదనీ బరువు లేనిదనీ అంటారు. బరువు లేకపోతేనేమి? బంగారం లాంటి సరుకు ఇది. జీవితానికి ఆనందాన్ని ఇస్తుంది. అంతకంటే ఏం కావాలి? హాస్య సృష్టికి కూడా ఒక విశిష్టమైన దృష్టి, ఒక రకమైన ప్రతిభ కావాలి. దీనికి తేలికతనం ఎందుకు వచ్చిందీ అంటే, ఇది అందరికీ అర్థము అవుతుంది కాబట్టే. పద్యాలు అర్థం కాకపోయినా బాగానే ఉంటవి. పద్యం అర్థం కాకపోయిన కొద్దీ దానికి గౌరవం ఎక్కువ అవుతుంది. దాని కావ్యగుణం కూడా పెరుగుతుంది. దాని సంగతి అల్లా ఉంచండి. అర్థం అయినంత మాత్రాన హాస్యం ఏమీ తక్కువది కాదు.

హాస్యం అర్థమైనట్లు ఉంటుంది. కానీ నిజానికి బాగా అర్థం కాదు. దాని లోతులు తెలియడమూ కొంచెం కష్టమే. కవిత్వం ఎట్లా అర్థం చేసుకుంటారో, హాస్యాన్నీ అట్లాగే అర్థం చేసుకోవాలె. లోతుపాతులు వెదకి కనుక్కోవాలె. మెరుగుల లోపల ఉన్న చమత్కారపు లోతు తెలిసికొని ఆనందిస్తే ఇంక కావలసినది ఏమున్నది" అంటారాయన.

వినోదానికి రాసిన గ్రంథాల వల్ల కలిగే విజ్ఞానం, వికాసం నిజానికి విశిష్టతలో వేటికీ తీసిపోయేవి కావు. ఆయనే అన్నట్లు ఆయన రచనల్లో ఏది ఉన్నా ఏది లేక పోయినా– 'అది' ఉన్నదని ధైర్యం. ఏమిటి 'అది?' పాఠకుణ్ణి పుస్తకం చివరదాకా లాక్కుని వెళ్ళే గుణం 'అది' ఉన్నది. దానిని రసం అనచ్చు. రమణీయత్వం అనవచ్చు.

మునిమాణిక్యం హాస్యంలోని వైశిష్ట్యాన్ని అందుకునే ముందు ఆయన జీవిత రేఖలు స్థూలంగా:

మునిమాణిక్యం నరసింహారావుగారు సంగం జాగర్లమూడి అనే గుంటూరు జిల్లాలోని ఒక గ్రామంలో హేవిళంబి నామ సంవత్సరం ఫాల్గుణ బహుళ అష్టమినాడు అంటే 1898 వ సంవత్సరం మార్చి నెల 15 వ తేదీన జన్మించారు. సంప్రదాయ కుటుంబమే అయినా కలిగిన వారు మాత్రం కారు.

ఆయన తల్లి పేరు రుక్మిణమ్మ, తండ్రి సూర్యనారాయణ. మునిమాణిక్యం వారి తండ్రిగారయిన సూర్యనారాయణగారు కూడా మంచి హాస్య సంభాషణా చతురులే. బహుశా అదే వారసత్వం తండ్రి నుంచి ఆయన పుణికి పుచ్చుకున్నారు. తండ్రి ఉపాధ్యాయ వృత్తిలోనే ఉండేవారు. ఆ వారసత్వమూ ఈయనకు వచ్చింది. మునిమాణిక్యం చిన్నతనంలోనే తల్లి రుక్మిణమ్మగారు మృతి చెందారు. మేనత్తగారింట పెదరావూరులో మునిమాణిక్యం బాల్యం గడిచింది. తెనాలి, విజయవాడలలో ఉన్నత పాఠశాల చదువును, గుంటూరులో ఇంటర్మీడియట్, ఆ తరువాత విజయనగరంలో శ్రీ కొండా వెంకటప్పయ్యగారి ధనసహాయంతో కళాశాల చదువు పూర్తిచేసి, బి.ఏ. డిగ్రీ పొందారు. 1923 లో రాజమండ్రిలో ఎల్.టి.పూర్తి చేసారు. ఆ తరువాత సుమారు ముప్పై ఏళ్లు గుంటూరు, భీమవరం, ఎడ్లపాడు, వేటపాలెం, మచిలీపట్నం, వరంగల్ జిల్లా బచ్చన్నపేట ప్రాంతాలలో ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ఆ తర్వాత ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో విద్యావిషయిక కార్యక్రమాల ప్రొడ్యూసర్‌గా చేసి, ఉద్యోగ విరమణ అనంతరం– ఆంధ్రసారస్వత పరిషత్తు

తెలుగుపండిత శిక్షణా కళాశాలలో అధ్యాపకులుగా, ప్రధానాధ్యాపకులుగా అయిదు సంవత్సరాలు పని చేశారు. ఉపాధ్యాయునిగా వేలాది మంది శిష్యుల అభిమానం పొందారు. రేడియోలో రసాత్మకమైన శ్రవ్య, దృశ్యనాటికలు రచించారు.

బి.ఏ. చదువుతున్న రోజుల్లోనే ఆయనకు సాహితీసమితి సభాపతి తల్లావఝుల శివశంకరశాస్త్రిగారి ప్రోత్సాహం లభించింది. "ఇన్ని కబుర్లు ఇంత ఆసక్తికరంగా చెబుతావు కదా! ఇవే కథలుగా మలచి వ్రాయకూడదూ" అన్నారట శివశంకరులు ఒకనాడు. ముందు మునిమాణిక్యం కూడా పద్యాలు, గేయాలు రాసారు. 'గాజులపెట్టి' పేర ఆయన కవితల సంకలనం వెలువడిందిట. ఆ తరువాత కథానికలు, గల్పికలవైపు ఆయన దృష్టి మళ్లింది. భావకవుల అమలిన శృంగార భావాన్నీ, చలం ఉద్ఘోషిస్తున్న స్త్రీ స్వేచ్ఛనూ గమనించిన మునిమాణిక్యం– మధ్యతరగతి తెలుగు కుటుంబాల దాంపత్య సాంసారిక జీవన మాధుర్యాన్ని నిలబెట్టే రచనలకు సమకట్టాడు. అనురాగ సుధలతో రసానంద ఫలాలు పండించే ఇల్లాలుగా స్త్రీమూర్తిని నిలపడానికే– ఆయన అనురాగవతి, సంభాషణా చతురమతి అయిన తన ధర్మపత్నే స్ఫూర్తిగా– 'కాంతం' పాత్రను సృష్టించారు. మునిమాణిక్యంగారి భార్య పేరు 'కాంతం' కాదు. ఆమె పేరు శేషగిరమ్మ. కాంతం భర్తగా 'నేను' పేర చిత్రించే పాత్రకు– మునిమాణిక్యం ఇచ్చిన పేరు వెంకట్రావు. తన స్వీయానుభవాలనే వెంకట్రావు, కాంతం పాత్రల ద్వారా కమనీయమైన కథలుగా మలిచారు మునిమాణిక్యం. ఆయన తొలి కథల సంకలనం 'కాంతం కథలు'గా 1927లో అచ్చయింది. ఆ తరువాత 'నేను– మా కాంతం' 1933 లో అచ్చయింది. 'కాంతం కైఫీయతు', 'కాంతం కాపురం' వంటి సంకలనాలు ఆపై వెలువడ్డాయి. 1938 లో మునిమాణిక్యం భార్య శేషగిరమ్మ మరణించింది. అదే ఏడాది పెద్దకూతురు రుక్మిణి మరణం కూడా ఆయనను కుంగదీసింది.

హాస్య, శృంగార రసాలనే అంతవరకూ తన రచనలకు ఆలంబనం చేసుకున్న మునిమాణిక్యం, అప్పుడు కరుణ రస ప్రాధాన్యంగల రచనలు చేసారు. అందుకు తార్కాణం ఆయన రాసిన మూడు నవలికలు అవి 'తిరుమాళిగ', 'రుక్మతల్లి', 'దీక్షితులు'.

మునిమాణిక్యం ఆ తరువాత సంస్కరణ దృక్పథంతో మళ్లీ పెళ్లి చేసుకున్నారు. ఆయన ద్వితీయపత్ని రాజ్యలక్ష్మమ్మగారు. ఆయన రచనా వ్యాసంగంలో హాస్యంకే పెద్దపీట. 'తిరుగుబాటు', 'గృహప్రవేశం' అనే నాటకాలు– 'ఆడబడుచు', 'జయమ్మ కాపురం', 'ఇబ్బందులు', 'మేనరికం', 'సంవత్సరాది పండుగ', 'రాజబంది',

'విదూషకుడు' 'వెలుగు' వంటి పలు నాటికలు రచించారు. అయితే వీటిలో సంభాషణాత్మకమైన సన్నివేశాలే ఎక్కువ. ఎక్కువభాగం ప్రహసనాలుగా కూడా అనిపిస్తాయి. 'తిరుగుబాటు' నాటకం పుస్తకం మీద, సామ్యవాద దోహదం అనిపించేలా అట్టమీద సుత్తులు, కొడవళ్లు ఉండటంతో– వస్తు విషయం గమనించ కుండా బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించిందట కూడాను. విద్యార్థులకోసం 'అన్నయమంత్రి', 'కింగ్ లింగ్‌ల కథ', 'వక్రలేఖ' వంటి రచనలు చేసారు. నవలలూ, కథలూ, నాటికలే కాక సున్నిత హాస్య చమత్కారాలను వెదజల్లుతూ 'వితండవాదాలు', 'మంచివాళ్లు– మాటతీరు', 'మాట నేర్పరితనం', 'స్తుతి–ఆత్మస్తుతి', 'అప్పులు చేయడం– తీర్చడం', 'మాణిక్య వచనాలు', 'ఇల్లూ ఇల్లాలు', 'ఇంటావిడతో పోట్లాట', 'ప్రణయ కలహం', 'భార్యను లొంగదీసుకోవడం ఎలా?' వంటి వ్యాసాలు, గల్పికలు వంటివి కూడా ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. 'హాస్యకుసుమావళి' పేర జోక్స్ సంకలనాన్ని తెలుగులో ఆ బాపతు పుస్తకాలు అధికంగా రావాలనే ఆకాంక్షతో మునిమాణిక్యంగారు వెలయించారు.

అలాగే 'మన హాస్యము' పేర పిహెచ్.డి. పరిశోధనకు మిన్న అయిన రీతిలో హాస్యం గురించిన ఒక రమణీయ పఠన యోగ్యమైన గ్రంథాన్ని సంతరించారు. శ్రీ ముట్నూరి సంగమేశంగారు హాస్యం మీద అంతకుమునుపే ఒక పుస్తకం రాసారనీ, ఆయన ఇచ్చిన హాస్య గర్భితమైన పద్యాలు తన సిద్ధాంత గ్రంథంలో కొన్ని వాడుకున్నా ననీ, హాస్య పారిభాషిక పదాల సృష్టిలో కేశవపంతుల నరసింహ శాస్త్రిగారు తోడ్పడ్డారనీ పేర్కొన్నారు. హాస్యరీతులను అంత సవిస్తరంగా వర్గీకరించి, భేద ప్రభేదాలు విశదీకరించి, వాటికి పారిభాషిక నామకరణం చేసి, ఉదాహరణ సహితంగా వివరించడం నిజంగా గొప్ప కృషి. వయసుపైబడినా శ్రమకోర్చి అంతటి కృషి చేసిన మునిమాణిక్యం వారిని ప్రశంసిస్తూ ముదిగొండ వీరభద్రశాస్త్రిగారు 'వయసు, ఓపిక, అవకాశాలూ ఉండి బద్దకించే కొందరు యువతరం వారు నిజంగా సిగ్గుపడి వారిని చూసి నేర్చుకోవాలి' అని చురకవేస్తారు. ఉపాధ్యాయవృత్తి నిర్వర్తించడం వలన పాఠకులు సరిగ్గా అర్థం చేసుకుంటారో లేదోనని విషయవివరణలు విస్తరించి చేయడం, పునరుక్తం చేయడం వంటివి వున్నా– 'మన హాస్యము' హాస్యరససిద్ధాంతాన్నీ, హాస్యలక్షణా లనూ నిరూపించే తొలి తెలుగు గ్రంథం అనవచ్చు.

వ్యక్తిగా మునిమాణిక్యం వారు పొట్టివారికిందే జమ. నల్లటి ఛాయే. ఆయననుచూస్తే వెంటనే ఎవరూ ఆయనలో అంత హాస్యప్రియత్వం దాగి ఉందని అనుకోలేరు. కానీ ఆయనతో సంభాషణకి దిగితే ఆ 'చమత్కారిదారి' అందుకోగలిగే

వారు అంతా. విశ్వనాథ, ముట్నూరి, చెరకువాడ నరసింహం వంటి పెద్దల చెలిమి, తల్లావఝుల, నోరి, జలసూత్రం వంటి వారితో సాహితీ సమితి సభ్యత్వం, దేవులపల్లి, బుచ్చిబాబు, స్థానం వారల స్నేహం– ఇవన్నీ కథకునిగా మునిమాణిక్యం వ్యక్తిత్వాన్నీ, ప్రతిభా పాటవాలనూ తీర్చిదిద్దిన అంశాలే. ప్రభావమంతా తొలి భార్య శేషగిరమ్మతో గడిపిన దాంపత్య జీవనానిదట. అవే ప్రాతిపదికలు అని ఆయనే చెప్పుకున్నారు.

మునిమాణిక్యం వారి హాస్యరచనా సంవిధానంపై మరో ప్రభావం 'బారీపెయిన్' అనే ఆంగ్ల రచయితదనవచ్చు. 19 వ శతాబ్ది చివరలో ఇంగ్లీషు సాహిత్యంలో, విమర్శలో ప్యూరిటీ అనగా పవిత్రతను గురించిన కొన్ని సిద్ధాంతాలు వచ్చాయి. బారీపెయిన్ సాంసారిక జీవన మాధుర్యం వస్తువుగా తీసుకొని చేసిన రచనలు ఆయనకు ప్రేరణ కలిగించాయి. ఇంటి ఇల్లాలికి సాహిత్యంలో పట్టం కట్టిన ఘనత 'కాంతం' పాత్ర ద్వారా మునిమాణిక్యం వారికే దక్కుతుంది.

మునిమాణిక్యం కథకులుగా సుప్రసిద్ధులు కావడానికి– ఆయన కథనరీతి, శిల్పం, సన్నివేశకల్పన, సంభాషణ చాతుర్యం, భాష, శైలి వంటివన్నీ కారణాలే. తనదైన ఒక సహజతను, సరళతను ఆయన దానిలో సాధించారు. వ్యావహారిక శైలినే కాక, కొన్ని రచనల్లో గ్రాంథిక పద్ధతిని వాడినా, అది హాస్యాన్ని పరిపుష్టం చేసుకునేందుకు మలుచుకున్నారు. అలాగే 'శ్రీ కాంతాయమ్మారావుగారి కైఫీయతు', 'దర్బారు– దాని కథాకమామీషు' వంటి కథల్లో చరిత్రకు, సాంఘిక పరిస్థితుల అవగాహనకు సాధనంగా ఉండే మెకంజీ రాయించిన కైఫీయతుల ధోరణినీ, అలాగే 'కోర్టులో కాంతం' వంటి కథల్లో కోర్టు పరిభాషను పేరడీ చేసి హాస్యాన్ని సృష్టించారు. వ్యాసంలో, ఉపన్యాసంలో వారి సహజ హాస్య ధోరణి కనిపిస్తుంది.

1968 ఫిబ్రవరి 1 న ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ మునిమాణిక్యం నరసింహారావుకు విశిష్ట సభ్యత్వం ప్రదానం కావిస్తూ చేసిన ప్రశంసలో అన్నట్లుగా– 'శ్రీ నరసింహారావుగారు హాస్య రసపోషణ ప్రౌఢి ప్రియంభావుకులు. ఎంత హాస్యోక్తి ప్రియులో అంత ప్రతిభాసంపన్నులు. హాస్యలక్షణ విచక్షణులు, నిరాడంబరులు. వారి యొడలెంత శ్యామలమో యెదదంత కోమలము. మాట యెంత లలితమో మతియంత నిశితము. వర్తనమెంత నిర్మలమో వైఖరి యంత ధార్మికము. సర్వాంధ్ర జన సాదర పఠిత సరసకృతి రచనా ధురంధరులు వారు' అన్న ఏతాదృశ గుణగణ భూషిత సంవిధానానుసంధానం వారి రచనల్లో దర్శించగలం.

'హాస్యకుసుమావళిలో' ఆయన సంతరించిన కొన్ని నిర్వచనాలు:

గ్రంథకర్త: సమకాలికులను, స్నేహితులను విసిగించడంతో తృప్తిపడక ముందుతరాల వారిని ఏడ్పించడానికి ప్రయత్నించేవాడు.

బ్రహ్మచారి: అందరికీ తెలిసిన భార్యలేనివాడు. పక్కనుండి నిద్రలేచేప్పుడు ఏవైపు నుంచి అయినా దిగటానికి అవకాశం వున్నవాడు.

విసుగుపుట్టించే సంభాషణ: నీవు నిన్ను గురించి మాట్టాడాలని అనుకుంటూంటే అవతలివాడు తనను గురించి మాట్లాడడం ఆపకుండా సాగిస్తే అది విసుగు పుట్టించే సంభాషణ అవుతుంది.

స్వర్గం: ఒక ప్రదేశం. అక్కడకు ఎప్పుడూ వెళ్లని వాళ్లు, అక్కడకు వెళ్లే అర్హత లేనివాళ్లతో దాన్ని గురించి గొప్పగా చెబుతారు.

కమ్యూనిజం: లేనివాళ్లందరూ ఉన్నవాళ్ల ఆస్తిని సమంగా పంచుకోటానికి వేసిన పథకం.

అప్పుపుచ్చుకునేవాడు: ఏదో నీకొచ్చే దాంతోనే తన సంసారం కూడా గడవాలని చూసేవాడు.

సామర్థ్యం: ఏదైనా పనిని నిర్వహించగల నేర్పు. అంతకంటే బాగా చేయాలని కోరిక. తాను చేయాల్సిన పనిని ఇతరుల చేత చేయించగల శక్తి.

మొదలైన: చెప్పిన దానికంటే ఇంకా ఎన్నో విషయాలు తెలుసుననే భావం చదివే వాడికి కలగజేయటానికి ఏర్పడ్డ గుర్తు.

నలభై ఏళ్ల క్రితం తన చిన్నతనంలో జరిగిన సంగతి అంటూ మునిమాణిక్యం 'హాస్యకుసుమావళి'లోనే ఓ విషయం రాసారు. గుంటూరు నుండి రైలు పోతున్నది. రైలు మంగళగిరి దాటిన తరువాత ఒక ముసలమ్మ రైలు కట్టవెంటనే గుంటూరు వైపు నడుస్తూ ఉండటం చూశాడు డ్రైవరు. పాపం ఆమె వృద్ధురాలు. నడవలేక నడవలేక నడుస్తున్నది. ఆమెను చూచి డ్రైవరు జాలిపడ్డాడు. పోనీ రైలులో ఎక్కించుకుని గుంటూరులో దింపేద్దాము, పుణ్యము అయినా ఉంటుంది అని అనుకొన్నాడు.

"అవ్వా గుంటూరుకేనా?"

"అవును నాయనా"

"పెద్ద దానవు ఏం నడుస్తావు. రైలు ఆపుతా. ఎక్కు గుంటూరులో దింపేస్తాను".

"మంచివాడవు నాయనా! సంతోషమే కాని నాకు కొంచెము తొందరపని ఉంది నాయనా! ఏమనుకోకే" అన్నదా ముసలమ్మ.

☆ ☆ ☆

ఏదో పనిమీద బయటకు వెడుతున్న కొడుకును నిలబడి చూచి కాంతం "ఎట్లా నడుస్తాడో చూశారా" అన్నది భర్తతో.

"ఏం మామూలుగానే ఉంది" అన్నాను.

"మామూలుగా ఉందీ!– వంకర కాళ్లతో... వంగి, తూలుతూ నడిచేవాళ్లకు నడకలో ఉండే దర్జాతనం ఏం తెలుస్తుంది? బెంగాలులో ఉంటారు చూశారూ జమీందారులు శరత్‌బాబు, హేమచంద్ర... అదిగో అట్లాటి వాళ్ల నడక అబ్బాయిది" అందిట కాంతం (దొరబాబు). భర్త నడకను భంగ్యంతరంగా ఎకసెక్కం చేయడం అది.

☆ ☆ ☆

మునిమాణిక్యం వారు నిజానికి తెలుగుమాస్టారు కాదు. హిస్టరీ, ఇంగ్లీషు మాస్టారు. ఆయన ఉపాధ్యాయునిగా ఉండగా తెలుగుపాఠాలు చెప్పమని వినియోగించారట. 'డోంట్‌టాక్ సిట్‌డౌన్' అని గట్టిగా కోప్పడితే వచ్చే ఫలితం, 'మాట్లాడకు కూర్చో' అంటే అల్లరి కుర్రాళ్ల దగ్గర సత్ఫలితాలివ్వదనే మాట నిజమే అంటారాయన. తెలుగు క్లాసు తీసుకుంటుండగా ఒక కుర్రవాడు వచ్చి పాండిత్యాన్ని పరీక్షిస్తున్న వాడిలాగ "లంగూడీ' అంటే ఏమిటండీ?' అని అడిగాడట. 'ఆ మాట ఎక్కడొచ్చిందిరా' అంటే 'వెంకయ్య వ్యాకరణంలోనండీ' అన్నాడట. ఈ మాటకు అర్థం చెప్పకపోతే వ్యాకరణజ్ఞానం లేదనుకుంటారని ఆయన భయపడ్డారట. ఆ పూటకు గంటకొట్టేసరికి మర్నాడు అడగవచ్చాడా అనుకున్నారటగానీ, ఆ కుర్రాడు మర్నాడు అడగనే అడిగాడు. 'ఏ సందర్భంలో ఆ పదం వాడారో చూడాలి. పుస్తకం తే' అని తెప్పించి చూస్తే– ఆ వాక్యం "అ ఆ ఇ ఈ లంగూడి అని ఉందిట". అలాగే మరోసారి ఇంకో కుర్రాడొచ్చి 'రావణాసురుడి ఇంటి పేరేమిటండీ' అని అడిగాడట. 'ఆ కాలంలో అలాంటివేం లేవబ్బాయ్' అంటే– "లేకేమండీ రావణుడి ఇంటిపేరు 'గాదె'వారండీ" అన్నాడట. 'నీకెట్లా తెలిసిందిరా' అంటే పాఠ్యపుస్తకంలో ఉందని

తెచ్చి చూపించాడు. అందులో ఉన్నది 'గర్వించి చెడిపోయె గాదె రావణుడు' అని. విడదీసి చదవడంతో ఉత్పన్నమయ్యే హాస్యం అది.

☆ ☆ ☆

శక్తిహీన పదప్రయోగం అన్నదాన్ని గురించి వివరిస్తూ మునిమాణిక్యం వారు 'మన హాస్యము'లో ఒక వృత్తాంతం చెప్పారు. ఒకసారి ఆయన రైలులో ప్రయాణిస్తుండగా కంపార్టుమెంటులోకి వెళ్లేసరికే ఓ పెద్ద మనిషి కూర్చుని ఉన్నాడట. ఆయనను ఎక్కడో చూసినట్లుందిగానీ ఎవరో గుర్తుకు రాలేదు. బైట ప్లాట్‌ఫారం మీద నిలబడివున్న ఓ కుర్రాడితో ఆయన ఏదో మాట్లాడుతున్నాడు. ఎందుకో గట్టిగా కోప్పడుతున్నాట్ట కూడాను. ఆయన అన్నమాటలు ఇవి– "అల్లాగ తెల్లబోయి చూస్తావేంరా! స్కెనాజర్ ఒకటి తెచ్చి పెట్టమంటే. స్కెనాజర్‌రా...! స్కెనాజర్ అంటే తెలీదురా సన్యాసీ! ఇంత మాత్రం తెలీని వాడివి ఎలా బ్రతుకుతావురా" ఆ మాటలు విని ఈయన ఆశ్చర్యపడ్డాడు. ఆయన మునిమాణిక్యం వైపు తిరిగి "బాబూ చూశారా! ఈ కాలపు పిల్లల తెలివి తేటలు. ఒక్క స్కెనాజర్ తెమ్మన్నానండీ. మామూలు స్కెనాజర్. అయినా అదేమిటో వాడికి తెలీడం లేదు. వీడు ఎందుకయినా పనికొస్తాడంటారా" అన్నాడు. ఈ కాలపు కుర్రాళ్లు వాడే వస్తువులు, కొన్ని నాకు కూడా తెలీదు నిజానికి. 'అదేమిటో మీరైనా చెప్పండి' అని ఎక్కడంటాడో అని మునిమాణిక్యంగారు భయపడుతూంటే, అతగాడు– 'స్కెనాజర్ కూడా తెలీకపోతే ఏం చదువులండీ వెధవ చదువులు! ఇలాంటి వారు అడుక్కుతిని పోవాల్సిందే' అన్నాడు. ఈయన 'మరే మరే' అంటే, 'అడుక్కోడానికి మాత్రం ఎలా పనికొస్తాడండీ స్కెనాజర్ అంటే తెలీకపోతే' అన్నాడు. 'నిజం నిజం అంతేనండీ' అని ఈయన దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు పక్కకు తిరిగితే, 'మాస్టారూ స్కెనాజర్ ఖరీదు రూపాయికంటే ఎక్కువ ఉంటుందంటారా' అని అడిగాడట. దానికి జవాబుగా ఈయన 'అబ్బే ఉండదండీ! తక్కువే ఉండచ్చు' అని ఎందుకయినా మంచిదని– 'అయితే ఇటీవల అన్ని వస్తువుల రేట్లలాగానే పెరిగి ఉండవచ్చు' అన్నారట. అలా పదినిమిషాలు స్కెనాజర్ గురించి ఈయన్ని రకరకాలుగా అనిపించి, ఆ తర్వాత విరగబడి నవ్వాడట. 'మాస్టారూ! స్కెనాజర్ మీరెప్పుడైనా చూసారా? నేనయితే చూళ్లేదు. అసలా పేరే విన్లేదు. నేను మీ విద్యార్థిని. సరదాగా అలా మాట్లాడాను అంతే! ఏం అనుకోకండేం' అన్నాడట. తన విద్యార్థి హాస్యచతురతకు ఆయన ఆనందించారు.

☆ ☆ ☆

పోట్లాటలకు తలాతోకా ఉండదు అని చెప్పడానికి 'దాంపత్యోపనిషత్తు'లో కలహస్వరూపంలో ఓ ప్రస్తావన చెప్పారు. ఏదో విషయం వచ్చి 'ఆయనకు చూస్తూ చూస్తూ పిల్లను ఎవ్వరూ ఇయ్యరు' అంది కాంతం ఒకతని గురించి. 'ఎందుకివ్వరు' అన్నాను. 'ఎట్లా ఇస్తారండి' 'ఏం ఎందుకివ్వకూడదు' 'ఆయన బర్మా వెళ్లి వచ్చాడండీ' 'బర్మా వెళ్ళొస్తే పిల్లనియ్యడానికేం' 'ఏమో మీకు నేను చెప్పలేను. బర్మా వెళ్ళొచ్చిన వాళ్ళకు పిల్లను ఎవ్వరూ ఇయ్యరు'. ఎందుకు అటువంటి వాడికి పిల్ల నియ్యకూడదో నాకు అర్థం కాకపోవడం వలన పోట్లాట నలభై నిమిషాలు సాగింది. చివరకు ఆమెగారు ఒక మాట అంది. "మీకు చచ్చినా అర్థం కాదు. బర్మా వెళ్ళి వచ్చినవాళ్ళకు చూస్తూ చూస్తూ పిల్లను ఎవ్వరూ ఇయ్యరు". నాకు వళ్ళుమండి 'అసలు ఆయన బర్మా వెళ్లివచ్చాడని నీకెట్లా తెలిసింది' అని నిలదీసి అడిగాను. ఆవిడ జంకలేదు. అంగుళం కూడా వెనకడుగు వేయలేదు. నాకంటే పెద్దగా అరచి చెప్పింది. "ఆయన బర్మా వెళ్లి వచ్చాడని చూచిన వాళ్లకు ఎవరికైనా తెలుస్తుంది. ఒక్కరు చెప్పక్కరలేదూ పెట్టక్కరనూ లేదు. అలాగ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తూలుతూ నడవడం కనబడడం లేదుటండీ" అని తేల్చి చెప్పింది.

☆ ☆ ☆

"దాంపత్య జీవిత పరిణామ సౌఖ్యజనిత శాంతిసాధనకు ఒకటే మార్గం. ఏమిటంటే కొంపలో నీ మాట సాగాలని కలలోనైనా అనుకోకపోవడమే. ఆమెగారిదే హైకమాండు. ఇది అందరికీ తెలిసిన విషయమే. గృహసామ్రాజ్యానికి ఆమె పట్టమహిషి" అంటారు మునిమాణిక్యం.

☆ ☆ ☆

సంగీత శాస్త్రంలో మంద్రస్వరం ఎలాంటిదో కలహశాస్త్రంలో సాధింపు అల్లాంటిది. ఇక్కడ కలహం కాశీ వద్ద గంగానదివలె మందగతిని పొందటం మనం గమనింపదగిన విషయం.

సాధింపులో కలహశక్తి లేతరంగులో ప్రకాశిస్తుంది.

ఒక చిన్న పొరపాటు జరిగితే దానిని బ్రహ్మాండమైన తప్పుగా నిర్ణయించి, దాని వలన రాగల ఆపత్తు ఒకటి ఊహించి, అది వచ్చినట్లుగానే భావించి, భర్తను నిందించడం అనే ప్రక్రియనే సాధింపు అంటారు. మగవాళ్లు సాధించలేరు. ఈ

సాధింపు జయప్రదంగా జరపడం ఆడవాళ్లకే తెలుసు. ఈ ప్రజ్ఞ స్త్రీకి మాత్రమే ఉన్నది. మంత్ర శాస్త్రజ్ఞులు దీనికే స్త్రీ విద్య అని పేరు పెట్టి బోలెడంత గ్రంథం వ్రాశారు అని వివరిస్తారాయన. గొడుగు పారేసాడు భర్త. భార్య మొదలు పెట్టింది. "గొడుగు పారేశారుటండీ! మొన్ననే కదండీ కొన్నది! కొత్త గొడుగు! ఆ గొడుగు పారేయడానికి మీకు చేతులెట్లా వచ్చినైయండి".

"పారేయాలని పారేశానా" అంటాడు ఆయన.

"ఆఁ!... పారేయాలని పారేయకపోతే అయ్యో గొడుగు పోయిందే అని అనుకోనైనా అనుకోరేం మరి! చీమకుట్టినట్లు అయినా లేదే మీకు".

"అసలు మీ చేతుల్లో గొడుగు ఉంటుందా! పసివాడి చేతిలో గారెముక్క ఉంటుందా! తీసికెళుతున్నప్పుడే అనుకున్నా దీన్ని ఎక్కడో పారేసి వస్తారని!".

"అయ్యో! నిక్షేపం లాంటి గొడుగు! పది రూపాయలు! నేను రెవికలు కుట్టించుకుంటానండీ అని మొత్తుకున్నా వినక గొడుగు కొంటిరి. అయిదు రెవికలన్నా వచ్చేవి! ఒక సంవత్సరం పాటు రెవికలకు ఇబ్బంది లేకుండా ఉండేది. మీరెందుకు వింటారు! ఇంట్లో డబ్బు ఉంటే నేను రెవికలు కొనుక్కుంటానని మీకు తెలుసు. నాకు రెవికలు లేకుండా చేయాలనేగా మీరు గొడుగుకొని పారేశారు. రేపు ఆఫీసుకు ఎల్లా వెడతారు వానా కాలం కూడాను".

"ఏం, తడిస్తే తడుస్తానులే".

"అవునవును మీకేం! మీరు వానలో తడిసి జ్వరం తెచ్చుకుని దర్జాగా పడుకుంటారు. చెయ్యలేక నేను చావాలి. మీరు ఏమిచేసినా నన్ను అవస్థ పెడదామనేగా".

"పిల్లలు బడికి ఎల్లా వెడతారు! వాళ్లు తడుస్తారు! వాళ్లకు జ్వరాలు వస్తవి! ఇంటిల్లిపాదీ జ్వరాలతో పడుకుంటే చెయ్యకేం చేస్తుందనేగా మీ ఊహ. ఎన్ని దురుద్దేశాలు లేకపోతే నిక్షేపంలాంటి గొడుగు పారేసి వస్తార్లెండి".

"మా అన్నయ్య సంవత్సరం నుండి జబ్బుతో తీసుకుంటున్నాడు. ఈ పదిరూపాయలు వాడికిస్తే మందుపుచ్చుకునేవాడు. దాంతో జబ్బు కూడా నయం అయ్యేది! అట్లానైనా చేయకపోతిని. ఏది చేయనిస్తేనా! ఆలోచించనిస్తేనా! లటిక్కున గొడుగు కొనుక్కొస్తిరి. అస్సలు మీకు మా అన్నయ్య బ్రతకాలని ఉంటే గొడుగు ఎందుకు కొంటారులెండి! పోతే పోయినాడని అనుకొనే గొడుగు కొనుక్కొచ్చారు".

"మాట్లాడుతారేమో! ఎందుకు మాట్లాడుతారు! అంతా నా మాటలు విని ఈవిడ ఎంత గడుసుమనిషో అని అనుకోవద్దూ! అందుకనే మీరు మాట్లాడక పోవడం. మీరు నోరుమూసుకుని నన్ను కోత కోస్తున్నారు".

"అబ్బ! నిద్రపోనియ్యి".

"ఎవరొద్దన్నారు! నిద్రపోండి. మహారాజులాగా పొండి. గొడుగు పోయింది. నాకు రెవికలు లేకుండా పోయినవి! మా అన్నయ్యకు జబ్బునయమూ కాదు! ఇంకేం మీ కళ్లు చల్లబడ్డవిగా హాయిగా నిద్రపోండి".

"నిశ్చింతగా ఎట్లా నిద్రపోయినారు! అప్పుడే గురక కూడా పెడుతున్నారు".

"ఏం మనిషో అబ్బ!"– ఇది ఒకరకం సాధింపు.

విషయము, అధికారము, ప్రయోజనము అనే అంగాలను గురించి సంపూర్ణ జ్ఞానం ఉన్నప్పుడే ఈ ప్రక్రియ జయప్రదంగా సాగుతుంది. ఈ ప్రక్రియ జరపడానికి అధికారి ఎప్పుడూ స్త్రీయే. సర్వకలహ ప్రపంచానికి స్త్రీమూర్తియే అధిష్ఠానదేవత.

... సాధింపు గంగాస్నానాలవలె సకల మనోవైక్లబ్యమునూ కడిగి వేస్తుంది. కోపం అంతా ఆ రూపంలో వెళ్లిపోయిన తరువాత స్త్రీమూర్తి కడిగిన ముత్యంలాగా కళకళలాడుతుంది. ఆమె ఆత్మ ప్రకాశిస్తుంది.

☆ ☆ ☆

"నేను నిజంగా సంఘానికి లోకానికీ ఉపకారం, మేలు చేశాను. నేను ఆ పనిచేసి అధమము ఒక ప్రాణినైనా కాపాడినట్లు లోకం గుర్తించాలి" అన్నాడు భర్త.

భార్య "ఏమిటి ఆ మేలు" అన్నది.

"ఆ మేలు ఏమిటంటే నేను నిన్ను పెళ్లి చేసుకోవటమే" అన్నాడు గృహస్తు.

☆ ☆ ☆

ప్రారంభవాక్యంలోనే ఆకర్షించే కథా చమత్కృతి మునిమాణిక్యంది.

'పొద్దున్న ఎనిమిది గంటలైంది' అనే వాక్యంతో 'నిజం నిజం' అనే కథ, 'ఏమిటండీ ఇవన్నీ అన్నది మా ఆవిడ' అనే వాక్యంతో 'ది పెరఫెక్ట్ వైఫ్' అనే కథ, 'మన ఇంటి పక్కన ఉన్న వాళ్లని బట్టి ఉంటుంది మన సౌఖ్యం' అంటూ 'ఇరుగు పొరుగు' అనే కథ మొదలౌతాయి. ఉత్కంఠకు ఊతం ఆ తొలి వాక్యాలే మరి!

☆ ☆ ☆

పరమ ఆహ్లాదకరమైన కుటుంబ జీవితేతివృత్తాన్ని కథగా చెప్పిన మనస్వి ఆయన. 'ప్రయాణసన్నాహం'లో హంపీ వెడదామనుకున్న భర్తతో తానూ పిల్లలతో వస్తానంటుంది కాంతం. ఇతను ఏవేవో కబుర్లు చెప్పి తప్పించాలని చూస్తాడు. 'నారదుడు త్రిలోక సంచారి అయినా ఆయన భార్య వెంట వస్తానని ఎప్పుడూ అనలేదు తెల్సా' అంటాడు. 'అవునవును. చాల్లెండి! మీ కల్పనా మీరున్నూ... అసలు నారదుడికి భార్యలేదంటారే' అంటుందావిడ. 'ఎవరు చెప్పారు. నీకు' 'ఎవరు చెప్పేదేమిటి నాకు తెలీదా? మొన్న గుళ్లో మాఘపురాణం చదువుతున్నప్పుడు కూడా ఆ మాటే విన్నాను'. 'ఇంతేకదా మాఘపురాణం వ్రాసే కాలం నాటికి ఆయనకు వివాహం కాలేదు. దాని తరువాత మత్స్య, కూర్మ, వరాహాది పురాణాలు వ్రాసారు. వాటిలో ఆయన భార్య సంగతి ఉంది' అంటాడు. కథ చివర 'మా భార్యగారి మహాపతివ్రతా మహత్యం వల్ల నా ప్రయాణం ఆగిపోయింది' అని ముగుస్తుంది.

☆ ☆ ☆

'పిల్లలుగల తల్లి' అనే కథ కాంతం మరణాన్ని వివరించే కథ. 'బడ్‌నసీహత్' అనే కథలో కాంతం గడుసుదనం లేదుగానీ, కాంతంగారి భర్త సుఖప్రదమైన సంసారం కోసం తయారు చేసిన పద్ధతి ఒక ముసలిదంపతుల విషయంలో బెడిసికొట్టిన సమాచారం సాగుతుంది. భార్యని భర్త పెట్టుకునే 'ముద్దు' సహజమైన ఆవేశంతో కాక, శాస్త్రపరమైన ధోరణిలో జరిగినప్పుడు జరిగే అవాంతరాలను హాస్య ధోరణిలో వివరిస్తారా కథలో. 'కాంతం వృద్ధాప్యం' వంటి కథలు ఆయన రాయకుండా ఉంటేనే బాగుండేది అంటారు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. 'మునిమాణిక్యం దీధితులు' అని ఆయన రచనలపై సిద్ధాంతగ్రంథం రాసిన రామగిరి మాధవరావు– మానవమనస్తత్వం చక్కగా ఎరిగిన ప్రౌఢులు, విశ్వజనీనమైన అనురక్తికలవారు, సహజంగా చమత్కార సంభాషణాశీలి కావడం వల్లనే మునిమాణిక్యం కథ నడపడంలో సిద్ధహస్తులు కాగలిగారనీ, వినోద ప్రధానంగానే ఆయన సాహిత్యసృష్టి అంతా జరిగిందనీ, ఆహ్లాదజనకమైన రచనలు సృజించారనీ అంటారు.

మునిమాణిక్యం హాస్యం ఆరోగ్యప్రదమైనది. లలితమైనది. మధ్యతరగతి మందహాసాలకు, దాంపత్య మధురిమలకు ఆయన హాస్యం ప్రోది చేస్తుంది. కాంతం పాత్ర ద్వారా ఇంటి ఇల్లాలికి సాహిత్య గౌరవం కల్పించి, సంసారాలు రాగ సుధాభరితాలై నిలిచేందుకు– భార్యాభర్తలిద్దరూ రైట్ రైట్ అంటూ బతుకు బండిని

నలుగురిలో చిన్నతనం పడకుండా నడుపుకు పోవడంలోనే మానవుడు ఆనందాన్ని అనుభవించే ట్రిక్కు దాగి ఉందనీ నిరూపిస్తారు. "సంసారం ఈదలేని సాగరం కాదు. ఆనందాల కొలను." అని జనానికి అర్థమయ్యేటట్లు చెప్పటమే ఆయన జీవితాశయం. సంసారంలో చిప్పిల్లిన ఆనందాన్ని సార్వజనీనం చేసిన ఘనత వారిది అంటారు కర్నాటి లక్ష్మీ నరసయ్యగారు, మునిమాణిక్యం గురించి. హాస్య రచయితగా తనదైన విశిష్ట ముద్రవేసి, 'కాంతం' పాత్రతో నిజంగానే కావ్య ప్రయోజనమైన 'కాంతాసమ్మిత తయోపదేశయుజే'ని సాధించిన ఆ మహనీయుడు 1973 ఫిబ్రవరి 4 వ తేదీన హైదరాబాద్‌లోనే అస్తమించారు. ఆయన మనోజ్ఞ హాస్య దీధితులు పఠితల హృదయాలలో, చదివినప్పుడల్లా ఉదయించి ప్రకాశిస్తూనే ఉంటాయి.

(యువభారతి 'హాస్యలహరి' గ్రంథం– 29 డిసెంబరు 2002)

(14) చిరంజీవి 'బాపు'కు డెబ్భై ఏళ్లు

'బాపు' నిస్సందేహంగా గొప్ప కవి. ఎటొచ్చీ మాటల బదులు గీతలుంటాయి. అంచేత ఆయన 'గీతా'కారుడు. భగవద్గీత కంటే 'భవద్గీతే' గొప్పదని 'బాపు' గురించి అనుకునేవాళ్లు బోలెడు మందున్నారు. ఎందుకంటే భగవదంశ లేకుండా బాపూ 'వంశవృక్షం' ఎలాగూ లేదు. ఆయనకు రామాయణం, భక్తి– పెద్ద అబ్సెషన్ అనుకునే వాళ్లు కూడా శ్రీశ్రీ మహాప్రస్థానానికీ, దిగంబర కవుల కవిత్వానికీ, అనేకానేక అభ్యుదయ (కొండొకచో విప్లవ) కవితా సంకలనాలకీ ఆయన తన రేఖలతో సంతరించిన 'ఆముఖ' కవిత్వాన్ని చూస్తే– 'బాపు 'గీత' బోధించిన నారాయణుడా, 'గీత' విని యుద్ధం చేసిన నరుడా' అని నివ్వెరపోవచ్చు. నరనారాయణులిద్దరూ 'బాపు'లో వున్నారు. మనకు ఇద్దరుగా కనబడటం కోసమే 'బాపు, రమణ'లుగా కనబడుతూంటారు కూడాను.

బాపు వొట్టి కవి కాదు, కథకుడు, విమర్శకుడు, భాషావేత్త కూడాను. అయితే అభివ్యక్తికి– అక్షరాలను కాక, రేఖలను ఎన్నుకున్న సాహిత్యవేత్త. 'లేఖా సాహిత్యం' అన్నట్లే– బాపుని బట్టి 'రేఖా సాహిత్యం' అనడం సబబని నా గాఢ ప్రతిపాదన. ఈ నెల పదిహేనో తారీఖుకి ఆయనకు 70 ఏళ్లు నిండాయి. ఇప్పుడాయన సప్తతి పూర్తి రేఖా సాహితీవేత్త.

ప్రాచీన సాహిత్యం తాటాకుల నుంచి వావిళ్ల గ్రంథాలకు వచ్చినా– ఆ తరువాత ఎమెస్కో వారు 'బాపు సాహిత్యం'తో జతగలిపి పుస్తకాలుగా తేవడం మొదలెట్టాకే– ఇంటింటా గ్రంథాలయాలు నెలకొనడమే కాదు, ప్రాచీన సాహిత్య పఠనం పట్ల తెలుగు ఇళ్లల్లో అభిరుచి పెరిగింది. ఒక ప్రవరుడినో, వరూధినినో, గిరికనో, నిగమ శర్మనో, అతగాడి అక్కగారినో కావ్య పరిచయం రేఖాపరంగా చేయడం మాత్రమే కాదు, అసలు కృష్ణుడు, రాముడు వంటి భగవదవతారాలు, దేవీ దేవతలు, రామాయణ,

భారత, భాగవత పాత్రలను ఎన్నింటినో ఆయన 'రేఖా సాహిత్యమే' పఠితల కనులముందుంచింది. రస పరవశంలో ముంచింది.

'సంపూర్ణ రామాయణం' బాపూ సినిమాగా తీసింది వాల్మీకి చూసి వుంటే– వేలవేల శ్లోకాల ఆత్మను, అంత అలవోకగా పట్టుకున్నందుకు బాపును నిజంగా 'బాపురే' అని మెచ్చేవాడే! ప్రస్తుతం టీవీ ఛానెల్‌లో ఆయన 'భాగవతం' విషయంలో పోతనా అంతే!

అసలు– నామరూప రహితుడయిన భగవంతుడిని మనిషి తన ఆకారంలో నిర్మించుకోవడమే ఒక చిత్రమయితే, తన చిత్రాలలో భగవంతుడి రూప రేఖా విలాసాదులకే కాదు, భగవత్ తత్త్వానికి కూడా ప్రాణప్రతిష్ఠ చేయగలిగిన స్రష్ట 'బాపు'. బాపూ గొప్ప మౌని. అనవసరంగా మాట్లాడకపోవడం మాత్రమే కాదు, అవసరానికి కూడా మాటలు మహా పొదుపుగా వాడతారు. కళాప్రపూర్ణుడయినా, ఎన్ని విశిష్ట సత్కారాలు అందుకున్నా, వినమ్రంగా ముకుళిత హస్తుడవుతాడు గానీ ముక్తపదగ్రస్తుడు కూడా ఎక్కువకాడు.

'బాపు' అనకుండా ఆయన అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ అన్నామనుకోండి! నిజంగా ఓ ప్రాచీన కవి పేరులానే ఉంటుంది. అందులోంచి 'సరాలనా' అని ఏరుకుని వుంటే, ముత్యాల సరాలను కూర్చిన ఆధునిక కవి గురజాడ వారసుడూ రావచ్చు! బాపుకు పద్యాలు వచ్చు. కావలస్తే 'బుడుగు' ముఖాన అప్పచెప్పిన దాఖలాలు చూడచ్చు.

సరే! కవులు– వారు పద్యంవాళ్లు కానీయండి, కృష్ణశాస్త్రి వంటి భావాంబర విహారులు కానీయండి, అభ్యుదయ, విప్లవ గత్రాలు కానీయండి బాపూ గీతకు జోత అనేసారు! 'తక్కువేమి మనకూ బాపు ఒక్కడుండు వరకూ' అని రసానందభరితు లయ్యారు. చాలాకాలం క్రితం తెలుగు వాచకంలో 'కలవారి కోడలు కలికి కామాక్షి' అనే విశ్వనాథ గేయకథ బాపు బొమ్మలతోనే ముద్రితమై కొన్ని తరాలను ముందుకు నడిపించింది. ప్రాథమిక విద్యాబోధనకు అక్కడే అంకురార్పణ అనుకుంటే, ఆ తరువాత ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ప్రభుత్వం పక్షాన 1986 నుండి దాదాపు అయిదారేళ్లు బాపు రమణలు రూపొందించిన వీడియో పాఠాలు– మారుమూల పల్లెటూరి పిల్లవారికి కూడా అత్యాధునిక ప్రక్రియ ద్వారా చదువు చెప్పాలన్న మహత్సంకల్పానికి దృశ్య కల్పనలయ్యాయి. ఆ పాఠాల కోసం వేల సంఖ్యలో బొమ్మలూ, అక్షరాలు గీసి బాపు అలసట నెరుగని ఆనందాన్ని పొందిన విద్యా సంస్కర్త అయ్యారు.

అలవోక గీచిన గీ
తలు మురువులు– చిత్రలక్ష్మి
తలమానికముల్
పలుకులు కులుకులు కవితా
లలితములై చెలగు బాపు రమణీయమ్ములో

అని లక్ష్మణ యతీంద్రుల వారు ఒకప్పుడు మంగళాశాసనం పలికారు బాపుకు. ఎమెస్కో వారి ప్రాచీనాంధ్ర సాహితికి గానీయండి, కందుకూరి రుద్రకవి 'జనార్దనాష్టకా' నికి కానీయండి, దాశరథి 'గాలిబ్ గీతాలు' అనువాదానికి గానీ, అలాగే దాశరథి 'కవితా పుష్పకం', ఆరుద్ర 'అరబ్బీ మురబ్బాలు', సి.నారాయణరెడ్డి 'మధ్యతరగతి మందహాసం', లండన్ కృష్ణమూర్తిగారు అచ్చేసిన శ్రీశ్రీ చేతివ్రాత 'మహాప్రస్థానం'కు వేసిన బొమ్మలు, పుట్టపర్తి వారి 'శివతాండవం' ఇంకా ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'చిత్రకల్పన' శీర్షికన కవుల కవితలకూ, అలాగే పదకర్తల పదాలకూ బాపు గీసినవి అన్నీ వట్టి బొమ్మలు కాదు, రసాత్మ సాక్షాత్కరించే రేఖాత్మక కృతులే!

ఇక బాపు స్వయంగా కథకుడు. తొలిరోజుల్లో ఆంధ్రపత్రికలో సత్తిరాజు లక్ష్మీనారాయణ పేర ఆయన కథ మీరు చూళ్లేదూ! దాంపత్య ప్రణయ బంధాల 'పెళ్ళిపుస్తకం', భారతీయ కుటుంబ జీవన విలువలకు ప్రాతిపదికలు ఆ అక్షరాల్లో వున్నాయి. బాపు చదివినన్ని కథలు, నవలలు ఎవరూ చదవలేదేమో? తన కథ బాపు బొమ్మతో రావాలని ఒకప్పుడు పరితపించని రచయిత(త్రు)లు లేరనవచ్చు. బాపు బొమ్మ చెప్పే కథ ముందు, అసలు కథ ద్విగుణీకృతమౌతుంది! ఆ బొమ్మ లేకపోతే ఆ కథ తేలిపోయేది అనిపించే సందర్భాలు ఎన్నో. వారపత్రికలో సీరియల్ నవల అంటే వారం వారం బాపు వేసిన బొమ్మలు చూసుకుని, దాచుకుని, నేర్చుకుని, కాపీకొట్టుకుని బాపు పుణ్యమా అని బ్రతుకు తెరువు పొందిన చిత్రకారులు ఎందరో ఉన్నారు.

ఆయనకు ఏకలవ్య శిష్యులెందరో! శతకోటి లింగాల్లో నా బోటి బోడిలింగాలూ ఎందరెందరో! బాపూ కవితాత్మక శైలి ఒక ఎత్తయితే, కథనాత్మక శైలి మరొక ఎత్తు. పంచతంత్రం కథలు జంతువులను పాత్రలుగా చేసి మనుషులుగా పలికిస్తే, బాపు ఒక పీరియడ్‌లో కథలకు, నవలలకు ఆయా రచనల్లోని పాత్రల జంతు స్వభావాలను– తన్ముఖంగానే చిత్రించి పాఠకులను పఠనోన్ముఖులను చేశారు. చిత్రరచనలో అరుదైన కథాకథన శైలి నిర్మించారు. 'జ్యోతి' మాసపత్రిక, కొద్దికాలమే వచ్చిన 'సుధ' మాసపత్రిక, 'ఆంధ్రప్రభ', ఆంధ్రజ్యోతి' వీక్లీలు ప్రధానంగానూ, ఇంకా అనేకానేక వార,

మాసపత్రికలూ, ఆఖరికి 'పుస్తక ప్రపంచం' వంటి ఎమెస్కో వారి ఇంటింటా స్వంత గ్రంథాలయం సభ్యుల కోసం వేసిన నెలవారీ సంచికలూ– ఇవన్నీ బాపు బొమ్మలతో కళకళలాడిపోయాయి. కొన్ని తరాల తెలుగు వెలుగులను ఉద్దీపింప చేశాయి. గురజాడ వారి 'గిరీశం', ముళ్లపూడి 'రాధ', 'గోపాలం', 'బుడుగు', భానుమతి 'అత్తగారు', మొక్కపాటి వారి 'బారిస్టరు పార్వతీశం' సజీవంగా కదలాడిన కథనాలకు బాపూ బ్రహ్మే మరి కారణం.

అందమైన అమ్మాయికి అచ్చ తెలుగు పర్యాయపదం 'బాపు బొమ్మ'. ఇంతకు మించిన 'రేఖా సాహిత్యం' ఇంకేముంది? బాపు బొమ్మను కుదించి, 'బామ్మ'గా పలికితే అమ్మమ్మలూ, బామ్మలూ, నాయనమ్మలూ కూడా ఆనందించారు.

ఇక బాపూ ఒక విమర్శకుడు కూడాను. సాహిత్య విమర్శకుడే కాదు, సమాజ విమర్శకుడు కూడాను. దానికి ఆయన వేలాది వ్యంగ్య చిత్ర సాహిత్యమే దాఖలా. 'మనవాళ్లు', 'బుడుగు' వంటి కార్టూన్లూ, కార్టూన్ స్ట్రిప్స్, 'బంగారం సింగారం' వంటి బొమ్మల కథలూ, ఆయన విమర్శనా పాటవానికీ, సమీక్షా వీక్షణాలకూ సాటిలేని మేటి ఉదాహరణలే. విశ్లేషించి చూస్తే బాపులోని విమర్శక నైపుణ్యం, సూటిదనం, వ్యంగ్య వైభవం స్పష్టంగా కనిపిస్తాయి. సాహిత్య ధోరణుల మీదా, రాజకీయ పరిణామాల మీదా, బాపు గీసిన కార్టూన్లు చూస్తే అది తెలుస్తుంది. బాపు రాజకీయ కార్టూన్లు విలక్షణమైనవి. అవి నేతల ముఖాలను మించి, వారి చేతలను చిత్రిస్తూ, రాజకీయం బురఖాలోని అసలు స్వరూపాలను బహిర్గతం చేసేవిగా ఉంటాయి.

బాపూ ఎందరి జీవిత చరిత్రలనో 'కార్టూన్'లుగా ఒక క్యారికెచర్‌లో, కొన్ని పంక్తుల అక్షరాల్లో అద్భుతంగా కుదించి రాసేశాడు. తారీఖులు దస్తావేజులు కాక చరిత్ర సారంలా వ్యక్తుల సారభూత జీవన దర్శనాన్ని వాటిల్లో అందుకోగలం. తెలుగు వెలుగుల ప్రముఖులు ఎందరో ఆయన రేఖల్లో వారి వ్యక్తిత్వ మహత్వాలతో సంపూర్ణంగా ఆవిష్కరింపబడ్డారు. మరి అలా బాపు 'జీవిత చరిత్ర కారుడు' కూడా అయ్యాడు.

బాపు భాషావేత్త, లిపికారుడు కూడాను. తెలుగు అక్షరానికి బాపు ఇచ్చిన సొబగే, ఏ లిపి సంస్కర్తలూ చేయలేని గొప్ప పని చేయగలిగింది. తెలుగు అక్షరాలు బాపు చేతిలో వంపులు, వొయ్యారాలు పోయి 'బాపు లిపి'గా స్థిరమయ్యాయి. 'చేతి రాత'ను అందంగా మలుచుకోవడానికి బాపూ అక్షరాల కాపీరైటింగే, ఎందరెందరికో ఆదర్శమూ, అనుసరణీయమూ, అనుకరణీయమూ అయింది. బాపు లేకపోతే తెలుగు అక్షరం రూపురేఖలు ఆ గుండ్రటి పరిధులు దాటి రాలేక, ఆ గుండ్రటి రాతలూ

ఎందరికో చేతకాక, అసలు చేతిరాతలు ఏమైపోయి వుండేవో ననిపిస్తుంది! బాపు 'లిపి' సంస్కరణ– తెలుగుల పుణ్యఫలమే. భాష ఏదయినా లిపి వున్నప్పుడే ఎక్కువ పరిపుష్టమూ, పరివ్యాప్తమూ కాగలుగుతుంది. తెలుగు భాషకు 'బాపు లిపి' సమకూర్చిన అందమూ, నిండుదనమూ శాశ్వతాలు. కంప్యూటర్లో 'బాపు లిపి' తరతరాలకు నిక్షిప్తమయిన పెన్నిధి.

అసలు హైస్కూలు చదివే రోజుల్లో మొదలయిందిట బాపు 'రేఖ' సాహిత్యం. 1943–44 లో 'బాల' పిల్లల పత్రికలో బాలన్నయ్య న్యాయపతి రాఘవరావుగారి ప్రోత్సాహంతో ప్రారంభమై– బి.కామ్ చేసి లా చేసినా, లా ప్రాక్టీస్ కాకుండా, 'బీకామ్' అన్నట్లుగానే వుంటూ, ప్రాక్టీస్ చేసిందంతా బొమ్మ'లా'యే! 1950 ల్లో 'ఆనందవాణి' 'ఆంధ్రపత్రిక'ల్లో కథలకు బొమ్మలు వేయడం మొదలెట్టారు. అడ్వర్‌టైజింగ్ శాఖలోనూ పని చేశారు. బాపు– ఎన్.ఎన్.చామకూర్ వద్ద కళాభ్యాసం చేశారు. ఆయన దామెర్ల రామారావు శిష్యులు. ఆ తరువాత బాపు బొమ్మలకు గురువుగా– 'గోపులు'గారి శిష్యరికం పనిచేసింది. అప్పుడే అడ్వర్‌టైజింగ్ శాఖ వైపు మళ్ళారు. జె.వాల్టర్ థామ్సన్ కంపెనీలో ఆర్ట్ డైరెక్టర్‌గా బాపు ఏడాదిన్నర పనిచేశారు. తర్వాత ఫ్రీలాన్సర్‌గా మారారు. ఆంధ్రపత్రిక అమృతాంజనం పబ్లిసిటీ, కె.సి.పి. సంస్థ వారి స్వీట్స్ ప్రకటనలూ ఆ రోజుల్లో బాపుయే చేశారు. ఎఫిషెంట్ పబ్లిసిటీస్‌లో ఆర్ట్ డైరెక్టరయ్యారు కొన్నాళ్లు.

సదరన్ లాంగ్వేజెస్ బుక్‌ట్రస్ట్‌కి ఫోర్డ్ ఫౌండేషన్ తరపున ముఖ్య సలహాదారుగా 1956–66 మధ్యకాలంలో ఇండియాలో వున్న, ప్రొఫెసర్ ఐజన్‌బర్గ్ పరిచయం– బాపును సాహిత్య ప్రియుడిగా, పుస్తక ప్రియునిగా మరీ మార్చింది. 'ఏదయినా బొమ్మ వేస్తే ఏ మాత్రం వీలున్నా ఏదో మూల పుస్తకాల దొంతర బొమ్మలో చూపించు. ఎక్కడో అక్కడ ఓ పుస్తకం ఉండాలి' అని ఆయన చెప్పిన మాట, బాపు సినిమాలలో కూడా పాటించారు. శేషాచలం అండ్ కో వారి ఇంటింటా స్వంత గ్రంథాలయ ప్రణాళికకు ఐజన్‌బర్గ్ గారే మూల కారణంట. ఐజన్ బర్గ్‌తో దేశమంతా తిరిగి బాపు వేలాది ఫోటోలు తీశారు. ఆ తరువాత 'బర్గ్' ఇజ్రాయిల్ వెళ్లిపోయినా, బాపుతో ఉత్తరాల పరిచయం సాగుతూనే వుండింది. ఆర్థర్ రాజామ్, రెజనాల్డ్ క్లీవర్, పీటర్ ఆర్నో, జార్జ్‌ట్రెస్, డ్యూలాక్, హోమ్‌సోయ్, గోపులు, అహ్మద్ వంటి చిత్రకారు లంతా తనకు గురువులేననీ, ఆంధ్ర చిత్రకారుల్లో పిలకా నరసింహమూర్తిగారి పెయింటింగ్స్ చాలా ఇష్టమనీ, సీతాకల్యాణం సినిమాలో దశావతారాలు వారి చేత వేయించినవేననీ అంటారు బాపుగారు.

మొన్న డిసెంబర్ ఒకటవ తేదీనే బాపుకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తన 18 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశిష్ట పురస్కార ప్రదానోత్సవం నిర్వహించింది. నూతన్ ప్రసాద్, రావుగోపాలరావు, ఏ.వీ.యస్.వంటి నటులను చిత్రపరిశ్రమకు తీర్చిదిద్దింది ఆయనే. హిందీ నటుడు అనిల్‌కపూర్– బాపు 'వంశవృక్షం' సినిమాలోనే హీరోగా పరిచయమయ్యాడు. బాపూ సినిమాలన్నీ ఆయన దృశ్య సాహిత్య వైశిష్ట్యానికి తార్కాణాలే. 'అందాల రాముడు', 'ముత్యాల ముగ్గు' వంటి బాగా ఆడిన సినిమాలే కానక్కర్లేదు. 'బంగారు పిచిక', 'జాకీ', 'బుల్లెట్' వంటి సినిమాలు కూడా బాపు ప్రతిభను గుర్తింపజేస్తాయి. 'సీతాకళ్యాణం', 'సంపూర్ణ రామాయణం' వంటి చిత్రాల సినేరియోలు చలనచిత్ర పరిశ్రమకు పాఠ్యగ్రంథాలని విదేశీయులు సైతం కొనియాడారు.

'సప్తతి పూర్తి బాపు'– చిత్రకారుడు అనడం కన్న 'గీతా' కారుడు అనడం సబబు. 'తెలుగు వారి ఏకైక రేఖా సాహితీవేత్త' అనడం కూడా మరింత సబబు. ఆయనను పొగిడితే మనకు ఒరిగేదేమీ ఉండదు. తెలుగుతనంలో మనకు మనం ఒరిగి జారిపోకుండా, నిలబెట్టుకోవడానికే 'బాపు' మనకు నిండా నూరేళ్ళు కావాలి. వెయ్యి సంవత్సరాలయినా ఉండాలి. "నమోనమో బాపూ! మాకు సాహిత్య 'భగవద్గీతా' మార్గమే చూపూ!" అంటూ ఆయనను అభినందిద్దాం. అది చాలు. బాపుగారికి జేజేలు.

(ఆంధ్రభూమి దినపత్రిక, ఆదివారం 21 డిసెంబర్ 2003)

(15) భానుమతి కథల్లో అత్తగారికి కొత్తరూపు

తెలుగు సినిమాల్లో అత్తగారు అనగానే సూర్యకాంతం గుర్తుకొస్తే, తెలుగు సాహిత్యంలో అత్తగారు అనగానే భానుమతి గుర్తుకొస్తారు. సినిమాల్లో అనేక పాత్రలు వేసిన భానుమతి, తెలుగు సాహిత్యంలో తన 'అత్తగారి కథలు' ద్వారా సృజించిన అత్తగారిపాత్ర నిజంగా విలక్షణమైనది. అత్తగారు అనగానే గయ్యాళి తనం, కోడల్ని రాచి రంపాన పెట్టే స్వభావం సర్వసాధారణంగా స్ఫురించే ధోరణి. దానికి భిన్నంగా భానుమతి 'అత్తగారు' కోడలి పట్ల ఆప్యాయతానురాగాలతో వుండడం మటుకే కాదు, ఇంట్లోని నౌకర్లను చాకర్లను కూడా అభిమానంతో చూసుకుంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ వారికి ఒక పెద్దదిక్కుగా నిజమైన ఆరిందాగా వ్యవహరిస్తూంటుంది. అమాయకత్వం ఎంతవుందో గడుసుదనమూ అంతా వుంది. పంతం ఎంత వుందో తాను నమ్మిన ఆచారాలూ, సంప్రదాయాల పట్ల కొంత పట్టు విడుపుల ధోరణీ అంతగానూ వుంది. తనకు అన్ని సంగతులూ తెలుసుననుకుంటుంది. ధాష్టీకంతో వ్యవహారాల్లో జోక్యం చేసుకుని నిర్వహిస్తూంటుంది. కథలద్వారా ఇలా ఒక స్త్రీ పాత్రకు సాహిత్యంలో ప్రాచుర్యం కల్పించిన ఏకైక రచయిత్రి భానుమతి గారేనేమో! అత్తగారి కథలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతిని అందుకున్నారు. పాలగుమ్మి పద్మరాజు, కొడవటిగంటి కుటుంబరావు, డాక్టర్ రాజమన్నారు వంటివారు భానుమతి కథలను బహుధా ప్రశంసించారు.

వీటిని ఫక్తు మధ్యతరగతి కథలు అనలేం. ఎందుకంటే పనిమనిషి, వంటవాడు, తోటమాలి, డ్రైవరు ఇలా ఇంటినిండా నౌకర్లు చాకర్లు వున్న గృహ వాతావరణమే అది. అయితే ఇంట్లో జరిగే విషయాలు మటుకు మధ్యతరగతి మనస్తత్వాలకు సమీపమైనవి. ఈ అత్తగారికి వంట చేయవలసిన అవసరం ఏమీ లేదు. తన కోడలు మీద పెత్తనం చేసే దుర్మార్గ నైజమూ లేదు. కొడుకూ, కోడలూ, మనవడూ అంతా

వెంటే వున్నారు. పనివాళ్ళు పెట్టే ఇబ్బందులు, సమస్యలు, ఇంటి నిర్వహణలో అంటే పెరటితోట నిర్వహణ వంటి వాటిలో వచ్చే ఇబ్బందులు, ఆవిడకు వున్న ఆచారాల పట్టింపులవల్లా, నమ్మకాలవల్లా, వాటిని నెగ్గించుకోవాలనే పట్టుదలల వల్లా, ఇంటికి వచ్చిపోయే వారివల్లా పొడచూపే అంశాలు అనేకం ఈ అత్తగారి కథల ఇతివృత్తాలు. 'యువ' దీపావళి ప్రత్యేక సంచికల్లో భానుమతిగారి కథ తప్పక వుండేదారోజుల్లో. అది చక్రపాణిగారి మాసపత్రిక కావడం ఒకకారణం అనుకున్నా, దీపావళి సంచికకు భానుమతి కథ 'అత్తగారి కథ' కాకపోయినా, 'రంభా చక్రపాణీయం' వంటి ఏదో ఒక కథ వుండటం పండగ ప్రత్యేకతగా పాఠకులు భావించేవారు. భానుమతిగారు సినిమా పాత్రల ద్వారానూ, బయటా అందరికీ కనిపించే, అనిపించే ధోరణికీ అత్తగారి కథల్లోని కోడలి పాత్రకూ పొంతన లేదు. ఆవిడ ధాష్టీకం, హాస్య చతురతా కోడలి పాత్రలోనే కనిపిస్తాయి. అత్తగారూ నరసమ్మాయణం, అత్తగారూ పనివాళ్లూ, అత్తగారూ లంకె బిందెలు, అత్తగారూ అంతరాత్మా, అత్తగారూ అరవసంవత్సరాది, అత్తగారూ–బాల్ పాయింట్, అత్తగారూ ఆవకాయ, అత్తగారూ జపాను యాత్ర, చక్రపాణి–ఇంద్రలోక యాత్ర... వంటి కథలు భానుమతిగారు రాసిన కథల్లో విశిష్టంగా చెప్పుకునేవి.

భానుమతిగారి కథల్లో భాష చాలా హాయిగా వుంటుంది. తెలుగు తమిళ సంప్రదాయాల మేలు కలయిక అంశాలున్నా, తెలుగుతనం ఎక్కువగా భాసిస్తుంది. ప్రాచీన సంస్కృతి మీద గట్టి పట్టు, ప్రియత్వమూ కలిగి దానిని నవతరానికి అనుసంధానించే యత్నం కనబడుతుంది. వెకిలితనం లేని హాస్యం, సహజ సుందరంగా, హుందాగా సాగే కథనం రచయిత్రిగా భానుమతి విశిష్టతలు, పాతబట్టలు వేసి స్టీలు గిన్నెలు తీసుకోవడం, తనకు వంటరాక వంటవాడిచేత మడివంట చేయించుకోవటం, నాడీ జ్యోతిష్యంలో లంకెబిందెలు దొరుకుతాయన్నారనీ, అది తవ్వి తీసేవాళ్లు తెలంగాణా నుంచి వస్తారనీ సొంత యిల్లు నిర్మాణానికి పూనుకోవడం, పాములు పట్టడంలో అజమాయిషీ చేయడం, చుట్టలు కాల్చే పనిమనిషి తత్వం గ్రహించలేని అమాయకత్వం, ఇలా అనేకానేక అంశాల విశ్లేషణ అత్తగారి కథల్లో ఆసక్తిగా చదివించేదే.

'అత్తగారు–అంతరాత్మ' కథలో ముందు అస్థిపంజరాన్ని ఈసడించుకున్న అత్తగారు మనవడు డాక్టరీ చదవడానికి అది తెచ్చుకోవడం, అస్థిపంజరం నేపథ్యంలో–దేహమూ ఆత్మ గురించి విశ్లేషించి హరికథ శాస్త్రులు చెప్పింది విన్నాక డాక్టర్ చదువు

గొప్పతనం కూడా గ్రహించడం, మనవడిని ప్రశంసించడం ఒక మంచి కథే. అత్తగారి కథలకు బాపు బొమ్మలు అదనపు ఆకర్షణ అయి, భానుమతి 'అత్తగారిని' ఆవిడ కథల్లో చిత్రించినట్లుగా మూర్తిమంతం చేసాయి. కథాకల్పనలో కన్న, పాత్ర చిత్రణలోనే భానుమతిగారి ప్రతిభ స్ఫుటంగా కనబడుతుంది. సంభాషణల ద్వారా సన్నివేశాన్ని దృశ్యీకరించడం ఆవిడ దర్శకత్వ ప్రతిభ వలన వచ్చినది. చిన్నచిన్న పాత్రలను కూడా చక్కగా, చిక్కగా ఆవిడ కథల్లో సహజంగా దర్శించవచ్చు. వాళ్ళు పాలవాళ్ళు, నీళ్ళ బండివాళ్ళు ఎవరయినా కావచ్చు. 'అత్తగారూ లంకెబిందెలూ' కథలో తెలంగాణ యాస పాత్రను సమర్థంగా చిత్రించారు.

'అత్తగారు' అనే పాత్రను లోక సహజమైన భావనలకు భిన్నంగా తెలుగు కథా సాహిత్యంలో సృష్టించి, చిరస్మరణీయం చేసిన భానుమతిని ఒక ఉత్తమ రచయిత్రిగా స్వీకరించవలసి ఉంది.

('మహామహిళ'-జ్యేష్ఠ లిటరరీట్రస్టు, విశాఖ-పాలువాయి భానుమతి స్మృతి సంచిక, జనవరి 2006)

❖

(16) ప్రసార మాధ్యమాలు

తెలుగు భాషను నేటి టీ.వీ.ఛాన్సల్స్, ఎఫ్.ఎం. రేడియోలు భ్రష్టుపట్టిస్తున్నాయని ఇవాళ కొందరు పెద్దలు వాపోతున్నారు. మొన్న మొన్నటిదాకా భాషా సాహిత్యాల వికాసానికి రేడియో, టీ.వీ.లు చేసిన కృషినీ, భాషా సాహిత్యాల అభివృద్ధిలో ప్రసార మాధ్యమాల పాత్రను ప్రశంసిస్తూ వుండినవారే కొందరు ఈ మాట అంటున్నారంటే– గత యాభై ఏళ్ళుగా ప్రసారమాధ్యమాలు వున్న తీరుకీ, ఈనాటి స్థితికీ ఒక అంచనా వేయడం, పరిణామక్రమాన్ని అవగాహన చేసుకోవడం భవిష్యత్ సూచికలు ఏర్పరుచుకొని వర్తమానంలో అనువర్తింపచేసుకునే ప్రయత్నం చేయడం అవసరమేనని అర్థం అవుతూనే వుంది.

ఆకాశవాణి ప్రారంభమైన తొలిరోజుల్లోనే ప్రసారశాఖకు కొద్దికాలం ఆధిపత్యం వహించిన మంత్రిగా వున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 'రేడియో ఈజ్ నాట్ ఏ లిటరరీ క్లబ్' అని ఆనాడే వివరించారు. భాష అనేది భావవినిమయ సాధనం. ఈ అంశాన్ని మౌలికంగా గుర్తించినందువల్లనే ప్రసార మాధ్యమాలు తమ ప్రసారాల్లో ప్రయుక్తం చేసేది 'కమ్యూనికేటివ్ లాంగ్వేజ్', అనగా భావప్రసార భాష, పత్రికా ప్రపంచం కేవలం అక్షరాస్యులకే. కానీ ప్రసారమాధ్యమాలు అలా కాదు. నేటికీ దేశంలోని నిరక్షరాస్యులైన ఎందరికో, ఆ జన జీవనంలోకి చొచ్చుకుని పోతున్నది రేడియో, టీ.వీ.లే.

రేడియో, టీ.వీ.లు ఈ శతాబ్దంలో అడుగుపెట్టేంత వరకూ కేవలం ప్రభుత్వ అధీనంలో వుండేవి. వాటిని ప్రభుత్వ బాకాలుగా సంభావించి అభ్యుదయ, విప్లవ వాదులుగా తమని తాము సంభావించుకునే కొందరు సాహిత్య సృజనకారులు ప్రసార మాధ్యమాలు రూపొందించే కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభ్యంతరకరంగా అనుకున్నవారూ వున్నారు. అయితే వారి సంఖ్య గణనీయమైనది ఏమీ కాదు. ప్రసార

మాధ్యమాల శక్తిని గుర్తించిన సాహిత్య సృజనశీలురు తమ భావజాలానికి విఘాతం కలగకుండానే లక్షలాది నిరక్షరాస్యులను చేరుకోగల రేడియో, టీ.వీ.లలో పాలుపంచుకున్న వారూ ఎందరో వున్నారు. ఆ మాటకొస్తే రేడియో ద్వారానే ప్రాచుర్యంలోకి వచ్చిన కవులూ, రచయితలూ ఎందరో వున్నారు. 'నేను కవిగా ఆకాశవాణిలోనే పుట్టాను' అని రాజ్యసభలో ప్రకటించిన డా॥ సి.నారాయణరెడ్డి వంటి కవి ప్రముఖులూ ఉన్నారు. తమ సృజనశీలతకు రేడియో మాధ్యమాన్ని ఉపయుక్తం చేసుకుని ఎందరో రాణించారు.

భాషా సాహిత్యాల వికాసానికీ, కళల్లో సాహిత్య, సంగీతాల అభివృద్ధికీ, ప్రాచుర్యానికి రేడియో చేసిన దోహదం అవిస్మరణీయమైంది. పుస్తకాల గ్రాంథిక భాష నుంచి విడివడి, వాడుకభాషకు పెద్దపీట వేసి, క్రమేపీ పుస్తకాలు కూడా వాడుకభాషలోనే రావలసిన అగత్యం ఏర్పడిన దశలో రేడియోపాత్ర ఎవరు గుర్తించినా, గుర్తించకున్నా బలీయమైనదే. ఒక శిష్ట వ్యావహారిక భాష రూపొందడానికీ, అన్ని ప్రాంతాలవారికీ అర్థమయ్యే తెలుగు ప్రయుక్తమవడానికీ రేడియోపాత్ర ఎంతయినా వుంది.

పత్రికా యాజమాన్యాలు, సంపాదకుల ఆధిపత్యం కారణంగా పత్రికల భాష ఒక ప్రాంతపు తెలుగుకు ఎక్కువ పట్టం కట్టిందన్న అభియోగం నేడు వింటున్నాం. రేడియోలో పనిచేసిన అధికారుల విషయంలోనూ ఇది కొంత వర్తిస్తుందన్నది నిజమే కానీ, పత్రికల భాషకూ, ప్రసార భాషకూ చాలా తేడావుంది. ప్రసార భాష అనివార్యంగా నిరక్షరాస్యులనూ, (పత్రికలను పోషించే కేవల మధ్యతరగతి జీవులను కాకుండా)–పేదలనూ, పరిగణనలోనికి తీసుకుని, అందించే సమాచారం, వినోదం, విజ్ఞానం వారికి అర్థమయ్యే రీతిలో ఉండేది. అక్షరాస్యులకు ఉద్దేశించిన పత్రికలో రాసే తీరు వేరు. రేడియోకి రాసే, కార్యక్రమాలలో మాటాడే తీరు వేరు. అందుకే రేడియోలో నిర్దేశిత శ్రోతలకు ఉద్దేశించిన 'స్పెషల్ ఆడియన్స్ ప్రోగ్రామ్స్' అనేవి చోటు చేసుకున్నాయి. కార్మికుల కార్యక్రమాలు, వ్యవసాయదారుల కార్యక్రమాలు, స్త్రీల కార్యక్రమాలు, పిల్లల కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలు ఇలా ప్రత్యేకించి నిర్దేశింప బడిన కార్యక్రమాల్లో ఉపయుక్తమయ్యే భాష, మాటాడే తీరు, వారికి అందించే అంశాలు అన్నీ వైవిధ్యభరితమైనవి. ఆయా నిర్దేశిత సమూహాలకు అనుగుణంగా వుండేవి.

నిజానికి ఆయా కార్యక్రమాల్లో పాలుపంచుకునే వ్యక్తులు, సాహిత్య సృజన శీలురు తదనుగుణమైన రీతిలో రచించే, మాట్లాడే ప్రత్యేక అభినివేశం కలిగినవారు

కాగలిగినప్పుడే ఉద్దేశించిన లక్ష్యాలు నెరవేరుతాయి. నిర్దేశిత శ్రోతలకు ఉద్దేశించి వారికి అవగాహన అయ్యే, అందుబాటులో వుండే భాషనూ, పదప్రయోగాలనూ, భావాలనూ వినియోగిస్తూ వారికి విజ్ఞాన, వినోద, వికాసాలను అందించడం సంకల్పం. నిజానికి ఈ సంకల్పం అధికశాతం నెరవేరింది ప్రసార మాధ్యమాల్లోనే. అయితే ప్రసార భాష పట్ల అవగాహన, అభినివేశం, దృఢసంకల్పం లేని కొందరు అధికారుల వల్ల కొంతా, ఆయా కార్యక్రమాల్లో పాలుపంచుకునే వ్యక్తుల, రచయితల అలసత్వం వల్ల కొంతా నిజానికి నిర్దేశించిన లక్ష్యాలు నూటికి నూరుశాతం నెరవేరక పోయే స్థితి వుంటూనే వుంటుంది. కానీ అధికభాగం రేడియో జనజీవనంలోకి చొచ్చుకుపోయే ప్రభావం వేయగలిగిందంటే– అనుకున్న లక్ష్యాలు కొంతమేరకైనా విజయవంతం కాగల్గడం వల్లనే.

స్వాతంత్ర్యానంతరం రాష్ట్రంలో మొదట విజయవాడ కేంద్రం నెలకొనింది. హైద్రాబాద్‌లో అంతకుముందే నిజాం అధీనంలో వున్న దక్కన్ రేడియో అనంతరం ఆకాశవాణిగా మారింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కడప కేంద్రాలు ప్రధాన కేంద్రాలు. ఇవి శక్తిమంతమైన మీడియంవేవ్ మీద ప్రసారాలు సాగిస్తూ విశాల పరిధిలోకి వినబడేవి.

నిజానికి ప్రాంతీయ భాషలను, కళలను, ఆచార వ్యవహారాలను, సంస్కృతిని, ఆ ప్రాంతపు యాస, జనసాహిత్యం వీటినన్నింటిని సంరక్షించే, ప్రోత్సహించే సంకల్పంతోనే స్థానిక రేడియో కేంద్రాలు (ఎల్.ఆర్.ఎస్. లోకల్ రేడియో స్టేషన్లు) కు బీజావాపనం జరిగింది ఆకాశవాణి సంకల్పంతోనే. మన రాష్ట్రంలో మొదట కొత్తగూడెం పూర్తిస్థాయి రేడియో కేంద్రంగానే 24-3-1989 లో– 'ఎఫ్.ఎం.' మీద ఏర్పడింది. ఎఫ్.ఎం. అంటే ఫ్రీక్వెన్సీ మాడ్యులేన్స్. దీని ప్రసారపరిధి కిలోవాట్ట్స్ ననుసరించి పరిసీమితమై వుంటుంది. స్థానిక అవసరాలకు ప్రసార మాధ్యమం ప్రోద్బలకంగా, సహాయకారిగా, చైతన్యవంతంగా వుండేందుకే స్థానికరేడియో కేంద్రాలు (ఎల్.ఆర్.ఎస్.లు) ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, తిరుపతి, అనంతరపురం, కర్నూలు, మార్కాపురంలలో నెలకొల్పడం జరిగింది. స్థానిక కేంద్రాలలో ఎనభైశాతం వరకూ కార్యక్రమాలు స్టూడియోలలో కాక ఫీల్డ్‌బేస్‌డ్‌గా జనజీవన క్షేత్రంలో రూపొందించాలని కూడా ఉద్దేశించారు. మూసపద్ధతిలో కాక కాలిక స్పృహతో పనిచేసేందుకు వాటికి ఖచ్చితమైన ఫిక్స్‌డ్‌పాయింట్ ఛార్ట్‌ల శృంఖలాలు కూడా లేవు. అయితే ఆయా స్థానిక కేంద్రాల కార్యక్రమ రూపకర్తలు, అధినేతలు స్థానికులే

అయ్యే అవకాశాలు లేక కొంతా, ఉన్నవారి అలసత్వం వల్ల కొంతా అనుకున్న సంకల్పం చాలామటుకు నెరవేరినా కొంతమేర లోపాలు వుండి వుండవచ్చు. ఏమైనా నేటికీ ఆయా కేంద్రాలు తమ శక్తిమేరకు ఉన్న నేతృత్వంలోనే శ్రోతలను ఆకట్టుకునే కృషి సాగిస్తున్నాయి. ఈ ఎల్.ఆర్.ఎస్.లన్నీ కూడా ఎఫ్.ఎం. కేంద్రాలే.

అయితే ప్రస్తుతం 'ఎఫ్.ఎం.' అనేది రేడియోకి, అందునా ప్రైవేట్ రేడియోలకీ, ముఖ్యంగా యువతకు ఉద్దేశించిన శబ్దమాధ్యమంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మొన్నటిదాకా ఆకాశవాణి ఒక్కటే రేడియో. ప్రభుత్వ సంకల్పంతోనే– ఆకాశవాణి, దూరదర్శన్‌లకు స్వతంత్ర్య ప్రతిపత్తిని కల్పించి 'ప్రసారభారతి– బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'గా జనతా ప్రభుత్వ హయాంలో మార్పుచేయడం జరిగింది. మరింత భావ ప్రసారస్వేచ్ఛ ప్రసారభారతికి ఇచ్చామన్నారు. ఆర్థిక సరళీకరణలతో మొదలై ఎప్పుడైతే దేశంలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విస్తరించడం మొదలైందో అనివార్యంగా ప్రసారమాధ్యమాల్లోనూ ప్రైవేటీకరణ ప్రవేశించింది.

మొట్టమొదట ప్రైవేట్ టీ.వీ.ఛానెళ్లు దూరదర్శన్‌కు తోడుగా మొదలై వాటి మధ్య పరస్పరం పోటీగా వీక్షకుల మీద పడ్డాయి. ఈ.టి.వి., జెమిని, తేజ, విస్సా, ఆదిత్య, టి.వి.9 ఇవన్నీ నేడు ఇంటింటా చొచ్చుకుపోతున్న టీ.వీ.ఛానెల్స్. సిటీ కేబుల్స్‌లా కాక వీటి ప్రసారపరిధి విస్తృతమైనది. ఇక ఆకాశవాణికి పోటీగా రెండు మూడేళ్లుగా ప్రైవేట్ 'ఎఫ్.ఎం.' రేడియోలు మొదలయ్యాయి. నేడు హైదరాబాద్, సికిందరాబాద్ జంటనగరాల పరిధిలోనే 'ఇది చాలా హాట్ గురూ' అంటూ 98.3 ఎఫ్.ఎం.పై – 'రేడియో మిర్చి', అలాగే 106.4 ఎఫ్.ఎం.పై 'రేడియో సిటీ', 'వినుఁ– వినిపించు– లైఫ్ అందించు' అంటూ 92.7 మీటర్లపై 'బిగ్ ఎఫ్.ఎం.' అలాగే ప్రసారభారతే నెలకొల్పిన ట్విన్ సిటీస్ 'ఎఫ్.ఎం. రెయినోబో' 101.9 'ఫుల్ పటాయిస్తాం' అంటూ యువతను ఆకట్టుకుంటున్నాయి.

విశాఖలో, విజయవాడల్లో ప్రసారభారతి ఎఫ్.ఎం.లు, విశాఖప్రైవేట్ ఎఫ్.ఎం., వున్నాయి. ఈ ఎఫ్.ఎం. రేడియోల్లోనూ, టీ.వీ. ఛానల్స్‌లోనూ యాంకర్లు, ప్రయోక్తలు ప్రయోగిస్తున్న భాష తెలుగు, హిందీ, ఇంగ్లీషుల మిశ్రమంగా మణిప్రవాళంగా సాగుతోంది. నిజానికి తెలుగును నరిగ్గా ఉచ్చరించలేని వారు కూడా ద్యోతకమవుతూంటారు. దీనికి ఎవరినో తప్పుపట్టేపని లేదు. ఎప్పుడైతే పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగుమాధ్యమం నిరాదరణపాలై– ఇంగ్లీషు చదువుల ప్రాముఖ్యం హెచ్చిందో, కుటుంబాలలోనూ మమ్మీ, డాడీ సంస్కృతి తిష్టవేసుకుని కూర్చుందో,

తెలుగు చదవడం, రాయడం కుంచించుకుపోవడం మొదలైందో, అప్పుడే ఈ స్థితి వచ్చింది. నేటి కుర్రకారు మాటాడుకునే తీరుకూ, ఆలోచించే తీరుకూ అనుగుణంగానే ఈ సరికొత్త ప్రసార మాధ్యమాలు సాగుతున్నాయి. కమ్యూనికేషన్ అన్నది ప్రసార మాధ్యమాల కర్తవ్యం కనుక ఏ నిర్దేశిత శ్రోతలను తాము లక్ష్యించారో, తదనుగుణంగానే ఈ ప్రైవేట్ ఎఫ్.ఎం. రేడియోలు, ఛానెల్స్ వుంటాయి. భాషా, సాహిత్యాల ఉద్ధరణ గానీ, మన సంస్కృతీ పరిరక్షణ గానీ ధ్యేయంగానీ, బాధ్యత గానీ కాదు. వాటిది ప్రధానంగా వ్యాపార సంస్కృతి. మార్కెట్‌శక్తులే వాటిని శాసించేవి. భావవినిమయంలోనూ ఇప్పుడు 'వినిమయం' అనేది సరుకుగా మారింది. భాషా, సాహిత్యాలు కూడా వ్యాపార సరుకులుగా తమకు ఏ మేరకు పనికి వస్తాయో ఆ కాన్సెప్ట్‌తోనే వారు స్వీకరించడం సహజం. ఎందుకంటే వాటిది 'పబ్లిక్ సర్వీస్ బ్రాడ్ కాస్టింగ్' అన్న నియమం కాదు. తాము రూపొందించే కార్యక్రమాల్లో ఆ తరహా అంశాలు వున్నాయని చాటించుకుంటూనే, వ్యాపార సూత్రాలకు అనుగుణంగా అవి వ్యవహరిస్తాయి. అందుకు వాటిని తప్పుపట్టి లాభంలేదు.

ఇకపోతే ఇప్పటికీ ప్రసారభారతి ఆధ్వర్యంలోని ఆకాశవాణి, దూరదర్శన్‌లు పబ్లిక్ సర్వీస్‌నూ, వ్యాపారీకరణనూ అనుసంధానించే దిశగా మల్లగుల్లాలు పడుతూ, బాధ్యతనూ విస్మరించలేని గతానుగతిక పంథాను నిలుపుకుంటూ, మారుతున్న కాలాని కనుగుణంగా, మారుతున్న తరాల అభిరుచుల కనుగుణంగా– మారాలా వద్దా, మారితే ఎలా మారాలి, ఏ మేరకు మారాలి, మారినా ఆదరణ పాత్రం కాగలుగుతామా! అనే ఒక సందిగ్ధ అవస్థలో వుండి కూడా– ఆరోగ్యదాయకమైన కార్యక్రమాలను అందిస్తూనే వున్నాయి.

శాస్త్రీయసంగీతాన్నే కాదు నేటికీ కవిత్వం, కథ, లలితసంగీతం, నాటకం అనే ప్రక్రియలను సముచితంగా సమాదరిస్తూ, ఆయా కళాకారులను రచయితలను ప్రోత్సహిస్తూ, శ్రోతలను అందునా ఒకతరం శ్రోతలను నేటికీ ఆకట్టుకుంటున్నవి ఆకాశవాణి, దూరదర్శన్‌లే. జనంలో ఆలోచనాశక్తి, పఠనాభిలాష తగ్గిపోకుండా సమస్యాపూరణలు, అవధానాలు, పుస్తక సమీక్షలు వంటి కార్యక్రమాలను ఆకాశవాణి ప్రధాన కేంద్రాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. నాటికలను, రూపకాలను రూపొందిస్తూనే వున్నాయి. ఆర్కైవ్స్ విభాగం నెలకొల్పి ఒకప్పటి క్లాసిక్ సంగీతాన్ని, నాటకాలను సి.డి.ల రూపంలో ప్రసారభారతి అందిస్తోంది. ఒకప్పుడు మనదేశంలో రేడియో సిలోన్ కార్యక్రమాలు విపరీతంగా వినే శ్రోతలను వివిధ భారతి నెలకొల్పడం ద్వారా

దేశీయంగా మలుచుకున్నది ఆకాశవాణియే. నేటికీ వివిధభారతి కార్యక్రమాలు శ్రోతలను అలరిస్తున్నాయి. కాలానుగుణంగా ఎఫ్.ఎం.లను విశాఖ, విజయవాడ వంటి కేంద్రాలలో కూడా ప్రసారభారతి ప్రారంభించి యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూనే వుంది.

'జాతీయ కవి సమ్మేళనం' పేర ఏటా వివిధ భాషల కవితలను ఎంపికచేసి వాటిని ఇతర భాషల్లోకి కూడా అనువదింపజేసి జాతీయ స్థాయిలో కవులను ఆదరిస్తున్నది నేటికీ ఆకాశవాణియే. 'లలిత సంగీతం' అనే ఆకాశవాణి విశిష్ట ప్రక్రియ ద్వారానే ఎందరో కవులు, గాయకులు రూపొంది వెండితెరకు వలసవెడుతూండే వారు. నేటికీ లలితసంగీతం, జానపదసంగీతం యొక్క సంపద ఆకాశవాణి, దూరదర్శన్‌లలోనే ఎక్కువగా నిక్షిప్తమై వుంది.

కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, దాశరథి, బాలాంత్రపు రజనీకాంతరావు, మునిమాణిక్యం, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి (జరుక్‌శాస్త్రి), జి.వి.కృష్ణారావ్, గోపీచంద్, బుచ్చిబాబు, స్థానం నరసింహారావు, పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్, వింజమూరి సీత, అనసూయ, వింజమూరి లక్ష్మి, శ్రీరంగం గోపాలరత్నం, నండూరి సుబ్బారావ్, వేలూరి సహజానంద, కేశవపంతుల నరసింహశాస్త్రి, రావూరి భరద్వాజ, తెన్నేటి హేమలత, వి.ఎస్.రమాదేవి, ఎన్.ఎస్.శ్రీనివాసన్, వోలేటి వెంకటేశ్వర్లు, ఎన్.సి.వి. జగన్నాథాచార్యులు, మారెళ్ళ కేశవరావ్, వాడ్రేవు పురుషోత్తం, మంచాళ జగన్నాథరావు, ఎల్లా వెంకటేశ్వరరావు, ఎన్.సి.కృష్ణమాచార్యులు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, ప్రయాగ నరసింహశాస్త్రి, వారణాసి రామమూర్తి 'రేణు', దండమూడి మహీధర్, అన్నవరపు రామస్వామి, అంపోలు మురళీకృష్ణ, ప్రపంచం సీతారాం, ఆర్.ఎ.పద్మనాభరావు, నండూరి విఠల్, శారదా శ్రీనివాసన్, చిరంజీవి, సుధామ, కృష్ణమోహన్, మంత్రవాది మహేశ్వర్, పి.వి.శేషారత్నం, నాగసూరి వేణుగోపాల్, పైడిశ్రీ, ఇలా చెప్పుకుంటూ పోతే క్రమం ఎలా వున్నా సాహిత్య, సంగీత, నాటకాది రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైన వీరందరూ ఆకాశవాణిలో ఉద్యోగులే. కొంతకాలమైనా అంతా పనిచేసినవారే. చేస్తున్న వారిలోనూ నేడు సంఖ్య కొంత పరిసీమితమైనా ప్రజ్ఞావంతులున్నారు. ఈ పేర్లకు అదనంగా చేర్చవలసినవి మీ స్ఫురణకు వదిలి వేస్తున్నాను.

కవిసమ్మేళనాలను ప్రోత్సహించిందీ, సంగీత సమ్మేళనాలను నిర్వహించిందీ, రేడియో నాటకసప్తాహాలను, జానపదసంగీత ప్రదర్శనలను ఏర్పాటు చేసింది ఆకాశవాణి, దూరదర్శన్‌లు అనే ప్రసారమాధ్యమాలే. రేడియో 'వరల్డ్ స్పేస్' కూడా

ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో లలితసంగీత కార్యక్రమం నిర్వహించడం విశేషమే! ఎందరో కవులు కళాకారులు ప్రసారమాధ్యమాల ద్వారానే రూపొంది, ప్రోత్సహింపబడి లబ్ధప్రతిష్ఠ స్థాయికి వచ్చారు. ప్రముఖులెందరెందరినో పరిచయ కార్యక్రమాల ద్వారా రికార్డు చేసి వారి స్వరాలను భద్రపరిచిన ఘనత ప్రసార మాధ్యమాలదే. రేడియో నాటకాలకు, రేడియో సంక్షిప్త శబ్దచిత్రాలకు ఒకప్పుడు విశేష ప్రాచుర్యం వుండేది.

ఇవాళ ఎక్కువ భాగం ప్రైవేట్ రేడియో, టీ.వీ. ఛానెల్స్, సినిమా ఆధారిత కార్యక్రమాలపై ఆధారపడే సాగుతున్నాయి. ఆకాశవాణి దూరదర్శన్‌లు ప్రజాహిత కార్యక్రమాలను విస్మరించలేదు. టీ.వీ.9, ఈ.టీ.వీ ల్లా సంచలనాత్మక కథనాలు వార్తల్లో ప్రసారభారతికి ఏనాడూ ధ్యేయం కాదు. అందుకే విశ్వసనీయత, నిర్ధారణ, కొంత వ్యవధి తీసుకున్నా రేడియో వార్తలకు నేటికీ నిలిచి వుంది. అయితే ప్రజల అభిరుచుల మేరకు కార్యక్రమాలను రూపొందిస్తున్నామంటున్న ప్రసారమాధ్యమాలు ఒకప్పటిలా కాక ఇప్పుడు ధనార్జనే ప్రధాన ధ్యేయంగా వున్నాయి. ప్రసారభారతి లక్ష్యాలు కూడా అటే వుండడం వల్లనే తను కూడా మార్కెటింగ్ విభాగాలను ప్రారంభించింది. ఎఫ్.ఎం.ల పేర ప్రధాన నగరాలలో కొత్త ప్రసార కేంద్రాలను నెలకొల్పింది. ప్రైవేట్ ఎఫ్.ఎం.లు, టీ.వీ.ఛానెళ్లు కూడా సినిమాల ఆధారిత కార్యక్రమాలు, గేమ్‌షోలకు ప్రధానపాత్ర ఇచ్చినా, ఈ.టి.వి2 వంటి ఛానెల్స్ కొంతమేరకయినా సంస్కృతి, సాహిత్యాలకు వేదిక కల్పించడం అభినందనీయం.

ప్రసారమాధ్యమాల దిశానిర్దేశం చేసేది ప్రజలే. ప్రజలభాష ఎటు ప్రవహిస్తే మాధ్యమాలు అటే ప్రసరిస్తాయి. ప్రజలకు దిశా నిర్దేశంచేయగల ప్రభావోపేతమైన మాధ్యమాలే అయినా, ఇవాళ సినిమా పరిశ్రమలానే– ప్రసారమాధ్యమాలు కూడా పరిశ్రమగా పరిణమిస్తుండడం వలననే వాటి ప్రభావధోరణి 'బహుజనహితాయ బహుజన సుఖాయ', 'సత్యం శివం సుందరం' అన్న తరహా నుండి– 'ఇది చాలా హాట్ గురూ' ధోరణిలో 'ఫుల్‌గా ఫటాయించే' దిశకు మరలుతున్నాయి. రేడియో ఇవాళ సెల్‌ఫోన్స్‌లోకి చొచ్చుకుపోయింది, టీ.వీ.– బెడ్‌రూంను కూడా హాల్‌లోనికి మార్చేస్తోంది. సాహిత్యము, సంగీతమూ, కళలూ ఇవన్నీ రసానందమూ, ఆత్మానందమూ స్థాయిలోకాక, ప్రయోజనం కోసం, అందునా అవికూడా ఏ మేరకు ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వగలవన్న ఆకాంక్షల మేరకు రూపాంతరం చెందుతున్నాయి. డబ్బు, కీర్తి ఇవి ప్రధానంగా మారినప్పుడు మానవీయ విలువలు

అప్రధానమవుతున్నప్పుడు భావవినిమయసాధనమైన భాషాసాహిత్యాలు కూడా వర్తమాన విలువలకనుగుణంగా మారిపోవడం మనం చూస్తున్నదే, మనం చేస్తున్నదే. పరిణామ క్రమాన్ని ఎవరూ నిరోధించలేరు. అయితే ఎంతగా ప్రపంచం మారిపోతున్నా మానవజీవన సరళికి, సుఖశాంతులకు మూలాధార నాడిగా నిలిచేవేవో ఆ విలువలను పరిరక్షించుకోవడం, ఆ విలువలను ప్రోదిచేసి పెంచేవిగా ప్రసారమాధ్యమాలను వినియోగపరుచుకోవడం సృజనకారుల బాధ్యత. ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే అధికారులు, ప్రభుత్వాలు కొంతమేరకైనా చిత్తశుద్ధితో, నిజాయితీతో వర్తించగలిగితే భాషా సాహిత్యాలకుగానీ, మన సంస్కృతికి గానీ భ్రష్టుపట్టే దుర్దశ ఏమీ సంప్రాప్తించదు. 'తెలుగు మాట్లాడే దీపాలు– తెల్లవార్లూ వెలుగుతూనే వుంటాయి'. భాషా సాహిత్యాలు జీవధారలై ప్రవహిస్తూనే వుంటాయి.

(కృష్ణాజిల్లా రచయితల సంఘం, విజయవాడవారి–'తెలుగు పసిడి' గ్రంథం–అక్టోబర్ 2006)

❖

(17) కథక కవి చిత్రకారిత్వం 'కరుణించని దేవత'

వర్ణించేవాడు కవి అని ఆలంకారికుల మాట. ఉన్నది ఉన్నట్టుగా చెప్పక ఆలంకారికంగా చెప్పడంలోనే మామూలుమాటకు, సాహిత్యంలోనిమాటకు తేడా వస్తోంది. ఒక పోలికో, ఒక ఆరోపణో, ఒక ప్రతీకాత్మకతో మాటను రసప్లావితం చేసి అనుభూతి రమ్యం చేస్తాయి. ఒక విషయాన్ని అలా రూపుకట్టించడానిక వర్ణనలే దోహదం చేస్తాయి. అసలు కవిత్వం అంతా వర్ణనామయం అనలేం గానీ, కవిత్వంలోనే వర్ణనలకు స్థానమూ, సామర్థ్యమూ ఎక్కువ. ప్రబంధాలు అన్నీ దాదాపుగా కథాకావ్యాలు. కథాకావ్యాలకు వర్ణనలు ప్రధానమయ్యాయి. అష్టాదశ వర్ణనలు లేకుంటే ఒక కథాకావ్యం– ప్రబంధం కాజాలదని నాడే తీర్మానించారు.

వర్ణనలు కవి ఊహించేమేధలోంచి పుట్టి పఠితలను స్పందింపచేసేవి. ప్రబంధాల ప్రభావం వల్ల వర్ణనలు చేయడంలో గొప్ప వైవిధ్యానికి ప్రాముఖ్యం పెరిగింది. వర్ణనలకు ఆస్కారం వుండే తావులు తమ ప్రతిభాప్రాభవాలను బట్టి ఎంపిక చేసుకుని వర్ణించసాగారు.

వచనకవిత్వాన్ని ఒక ఉద్యమంగా సాగించిన కుందుర్తి వచనకవితలో కథాకావ్యాలు రావాలని అభిలషించారు. అందువల్ల వాటికి ప్రబంధ గౌరవం కలుగుతుందని వారు భావించి వుండవచ్చు. మామూలు కథల్లోనూ రచయితలు వర్ణనలు చేస్తారు. కవిత్వంలోనూ, కథలోనూ కూడా వర్ణనలు ఉంటాయి. అయితే వర్ణనల దగ్గరకు వచ్చేసరికి కథకులు కూడా అంతో ఇంతో కవులైపోతారేమో! ప్రముఖ కథా, నవలా రచయితలైన రావిశాస్త్రి వంటివారి రచనల్లోంచి అలాంటి వర్ణనలు క్రోడీకరించి కీ॥శే॥ త్రిపురనేని శ్రీనివాస్ కవిత్వ గ్రంథంగా ముద్రించిన సంగతి తెలిసిందే. అయితే చిత్రకారుడి వర్ణనాదృష్టి మాటేమిటి?– బుచ్చిబాబు, చలం, గోపీచంద్ వంటి వారి రచనల్లో – అంటే వచన రచనల్లో– అలాంటి కవిత్వాంశాలు మనకు బాగానే కనబడతాయి.

వచనకవిత్వోద్యమం నెరపిన కుందుర్తిచే తనకు అసలుసిసలు వారసునిగా సంభావించబడినవారు శీలా వీర్రాజు. వచనకవితలో కథాకావ్యాలు రావాలన్న కుందుర్తి కలను సాకారం చేసింది ఆయనే. వీర్రాజుగారిలోని విశిష్టత– ప్రముఖంగా ఆయన చిత్రకారుడు, కథకుడు, కవి. వర్ణాల గురించీ, వర్ణనల గురించీ అందుకే ఆయనకు బాగా తెలుసు. శీలావి తొలుత కథలూ, నవలలూ రాసినవారే. ఆ తరువాత తనది 'కవిత్వమార్గం' అని రూఢిగా నిశ్చయించుకుని, ఆ తర్వాత మరి వచనరచనల జోలికి ఎక్కువగా పోలేదు. తనలోని బహుముఖీన ప్రతిభ కవిత్వంలో కేంద్రీకృతం కావడమే ఆయనకు ఇష్టం. 'మైనా' వంటి అద్భుతమైన నవల రాసినా, 'మళ్ళీ వెలుగు' వంటి వర్ణనాత్మక కావ్యం రాసినా ఆయనలోని వర్ణనాపాటవం ఆయన కవితాత్మనే ప్రధానంగా పట్టిస్తుంది. అందునా చిత్రకారుడైన కవి కావడంవల్ల మరింత వైశిష్ట్యం కనబడుతుంది. ఐదు దశాబ్దాల క్రితం నాటి తన ఓ నవలను ఇటీవల కవితాత్మకం చేయడం వెనుక ఆయన సంకల్పం స్పష్టమే.

ఇక 'కరుణించని దేవత' శీలా వీర్రాజుగారు 1964 లో రాసిన నవల. దీన్ని మైనా తర్వాతే రాసినా 'మైనా' కంటె మొదట ముద్రించబడింది. ఈ నవలలో శీలావి కథాకావ్య రచనా ధోరణికి గొప్ప బీజావాపనం జరిగింది. నిజానికి 'కరుణించని దేవత' నవలలో కథ విశేషమైనదేమీ కాదు. బాల్యంలో సత్యమూర్తి రమణమ్మ కూతురు కనకవల్లిని అభిమానిస్తాడు. కనకవల్లి జగన్నాథం పాలవుతుంది. జగన్నాథం ఓ తాగుబోతు కూడాను. ఓ ప్రింటింగ్ ప్రెస్సులో ఉద్యోగం చేసే సత్యమూర్తికి అద్దెకు లభించిన ఇల్లు కనకవల్లీ, జగన్నాథాలదే. కనకవల్లి సత్యమూర్తి పట్ల అభిమానం చూపుతూంటుంది. భార్య సంతోషం కోసం జగన్నాథం కూడా అతనితో స్నేహంగానే ఉంటూంటాడు. సత్యమూర్తికి కుసుమలతతో పరిచయం కలుగుతుంది. ఆమె సత్యమూర్తిని విపరీతంగా అభిమానిస్తుంది. కుసుమలత అంటే సత్యమూర్తికి ఇష్టమే ఐనా కనకవల్లి పట్ల బాల్యంనుంచీ పెంచుకున్న ఆరాధనాభావం అలాగే ఉంటుంది. అనుకోని పరిస్థితుల్లో జగన్నాథం మరణిస్తాడు. కనకవల్లి ఒంటరిదైపోతుంది. కనకవల్లి ఉనికినే అనుమానించే కుసుమలత– కనకవల్లిని గౌరవించగలదని అనుకోలేని సత్యమూర్తి, బాల్యంనుంచీ అభిమానించిన కనకవల్లికి తోడు కావడానికి సిద్ధమౌతాడు. కానీ అతని ప్రేమకీ, గౌరవానికీ తగనిదాననీ, పతితననీ, తనవల్ల అతని జీవితం పాడుచేసుకోవడం ఇష్టంలేదనీ, ఎప్పటికీ అతనిని మరిచిపోలేననీ లేఖరాసి కనకవల్లి ఎటో వెళ్లిపోతుంది. 'ఆమె పతిత కాదు. కరుణించని దేవత' అని సత్యమూర్తి ఎలుగెత్తి దుఃఖిస్తాడు.

నిజానికి ఈ కథను ఒక నవలస్థాయికి తీసుకు వచ్చింది శీలావిలోని చిత్రకారుడైన కవియే. పాత్రచిత్రణలో, సంఘటనల విశదీకరణలో, కథాగమనంలో వీర్రాజుగారు ఒక ప్రబంధస్థాయి వర్ణనలను మూలకందం చేసుకున్నారు. అంటే కథాకావ్యానికి వలసిన మూలాధారనాడి పట్టుకున్నాడు.

ఏ చిత్రపటమైతే నవల ప్రారంభంలో సత్యమూర్తి గదిలో వుంటుందో, నవల ముగింపు– ఆ పటం తీసుకుని కనకవల్లి వెళ్లిపోవడంతో జరుగుతుంది. ఆ చిత్రం ఎప్పుడో గతించిపోయిన సంఘటనలకు ప్రతిరూపంగా, దాన్ని సృష్టించిన చిత్రకారుడి నైపుణ్యానికి ప్రతినిధిగా చెబుతాడు రచయిత. అందులో వున్నది రాధ. పాత్రలను ప్రవేశపెట్టడానికి ముందే నవలలో ఆ చిత్రపటాన్నీ, అందులోని రాధ గురించిన విశ్లేషణనూ ప్రవేశపెట్టారు శీలావి.

అసలు రాధ గురించి ఇలా అంటారు– "శృంగారానికీ, అందానికీ ప్రతిరూపం రాధ. చిలిపితనానికీ, ఆరాధనకూ ఆమెకు ఆమే సాటి. ఆ కళ్ళలోని నిరీక్షణలో భక్తురాలి ముఖంలోని ఆరాటం, భక్తీ తొంగి చూస్తుంటాయి. ఆమె పెదాలలో కోపం, అంతలోనే చిరునవ్వు, మళ్ళీ దుఃఖం. భక్తురాళ్ళల్లో ఆమె భక్తురాలు. ప్రియురాళ్ళల్లో ఆమె ప్రియురాలు. రతీదేవి అందంలో కల్పన వుంది. రాధ అందంలో వాస్తవికత వుంది. నక్షత్రాలు ఆమె ముక్కుపుడకలు కావు. చంద్రబింబం ఆమె పాపిడిపిందె కాదు. కొండవాగులు ఆమె కంఠాభరణాలు కావు. ఉదయిస్తోన్న సూర్యుడు ఆమె నొసట సన్ననిబొట్టు కాదు. రాధ అతి సామాన్యమైన స్త్రీ. ఆమె అందానికి విశేషణాలు లేవు. స్త్రీకి ఉండాల్సిన అందం ఆమెది. చక్కగా వంపులు తిరిగిన కళ్ళు, సూదిముక్కు, పల్చటి పెదవులు, కోలముఖం, సన్నని శరీరం– స్త్రీ రూపానికి ఆమె చివరి మెట్టు, అయితే చిత్రంలోని రాధ బొమ్మ వర్ణనకాదిది. అసలు 'రాధ' గురించిన భావన. ఇంతకీ ఆ చిత్రపటంలోని రాధ ఎలా వుంది?

"చూపుల బాణాల్ని మరీ దూరంగా వదలడానికి బలంకొద్దీ సాగదీసినట్టు అర్ధచంద్రాకారంలో ధనుస్సులా మెలితిరిగిన కనుబొమలు, సూదిగా సానబెట్టిన కత్తి అంచులాంటి ముక్కు, నిరాశతో నిద్రపోతున్న పెదాలు, చీకటి లోయలో ప్రవహించిన వెలుగు జలపాతం లాంటి పాపిడి పిందె, చీకట్లను చెదరగొడుతూ నుదుటిమధ్య ఎర్రని కాగడాలాంటి కుంకుమబొట్టు, మత్తుగా కాండాన్ని అల్లుకున్న పాములా కంఠాన్ని చుట్టుకున్న కంఠాభరణం, పాముతలమీది మాణిక్యం లాంటి పసుపుపచ్చటి రాయి,

పల్చటి మబ్బులాంటి పవిట– వీటితో చీకటి గొడుగులాంటి మర్రిచెట్టు మొదట్లో వంటరిగా కూర్చుంది రాధ. ఆమె పాదాల దిగువున కొలను. కొలనులో గతస్మృతుల మధ్య చిక్కుకుని ప్రతిఫలిస్తోన్న ఆమె ఆకారం".

ఆ రాధ ఆరాధనలో, ఈ రాధ చిత్రంలో సత్యమూర్తి కనకవల్లిని చూస్తున్నా డన్నది చెప్పకనే చెప్పే విషయం. అయితే అసలు రాధకూ, బొమ్మలోని రాధకులాగానే తన బాల్యస్మృతుల ఆరాధనామూర్తి కనకవల్లికీ, ఇప్పటి కనకవల్లికీ వున్న వైరుధ్యం చెప్పడానికే ఈ ప్రతీకాత్మకత.

కనకవల్లి మీద సత్యమూర్తి ఇష్టాన్ని అతని స్వగతంలోనే ఇలా వర్ణిస్తారు. "రంగురంగుల సూర్యాస్తమయమన్నా, చీకటి రాల్చిన వెండిబొట్టులాంటి మంచు బిందువులన్నా, వారం రోజుల తర్వాత మబ్బువిడిచిన ఎండన్నా, జలతారు పోగుల్లాంటి వెన్నెల కిరణాలన్నా, ఫిబ్రవరి నెలలో పెద్దగాలి వెనక– చిలకరించినట్టు పడిన చినుకులన్నా ఎంత ఇష్టమో– కనకవల్లి అన్నా అంతే ఇష్టం తనకు. మల్లెలూ, సన్నజాజులూ, గులాబీలు, లిల్లీలు అంటే ఎంత మోజో– ఆమె అన్నా అంతే. తెల్లవారు ఝామున ఫిడేలు రాగాన్నీ, సూర్యోదయంలో సన్నాయినీ, మధ్యాహ్నం మృదంగం శబ్దాన్నీ, రాత్రి వీణా తంత్రుల్నీ, మధ్యరాత్రి మగతలో వేణునాదాన్నీ వినడం తనకు ఎంత ఆనందమో– ఆమెతో కబుర్లు చెప్తూ కూర్చోవడమన్నా అంతే ఆనందం".

జగన్నాథం నుండి ఆమె అనుభవిస్తున్న బాధలకు తను ఆ ఇంటినుంచి వెళ్లిపోవడమే పరిష్కారం అనుకుంటాడు గానీ, 'కనకవల్లిని విడిచిపెట్టి వెళ్ళిపోవడం అంటే బాధే' కనుకనూ, జగన్నాథం కూడా క్రమేపీ మిత్రభావనను చూపడం వల్లనూ సత్యమూర్తి అక్కడే వుంటాడు. ఇక నవలలోని మరో స్త్రీ పాత్ర కుసుమలత.

అభ్యుదయోత్సవాల్లో పరిచయమైన కుసుమలత పట్ల సత్యమూర్తి తొలి అనుభూతిని అతని స్వగతంలా కాక రచయితే ఆమెను వర్ణించడంలో నిక్షిప్తం చేస్తారు.

"నవ్వినప్పుడు బుగ్గలు ఉబ్బి, ఉబ్బినచోట సిగ్గు గూడుకట్టింది. కొద్దిగా ప్రక్కగా చూసినప్పుడు ఉబ్బిన చెక్కిళ్ళు వాలుగా కిందికి దిగి, ముందుకు పొడుచుకు వచ్చిన గెడ్డంలో కలిసి మామిడి పిందెలా అనిపించింది. ఎర్రంచుల తడిగుడ్డలో చుట్టిన మల్లెపూలు దొంగచాటుగా తొంగిచూసినట్టు పెదాల్ని తప్పించుకొని తెల్లటి పళ్ళు కొద్దిసేపు మెరిసాయి. ఆ మెరవడం ముస్లింపిల్ల పరదాను తొలగించి చూసినట్టుంది.

నల్లటి మబ్బును పక్కకు నెట్టుకుంటూ నక్షత్రాలు తొంగిచూసినట్టున్నాయి. కొత్త పెళ్ళికూతురు మనసు సిగ్గుతెరల వెనుక దోబూచులాడినట్టుంది" అంటారు.

"సత్యమూర్తి ఒక అద్దంలాటివాడు. కనకవల్లి ప్రేమ తనమీద ప్రతిఫలించేందుకు జగన్నాథం అతన్ని ఒక అద్దంలా ఉపయోగించుకుంటున్నాడు" అన్న ఒక వాక్యంతో మూడుపాత్రల స్వభావాన్ని కథాగతంగా చెప్పిన ప్రజ్ఞ వీర్రాజుది. సత్యమూర్తి ఊహల్లో కనకవల్లి రాధ చిత్రమే అయినా, జగన్నాథం ఆమెను సీతాదేవి చిత్రంగా జ్ఞాపకం చేసుకుంటాడు కూడాను.

నిజానికి సత్యమూర్తి గొప్ప భావుకుడు. ఆ భావుకత్వం రచయిత ఆపాదించినదే. వెన్నెలా, పూలు, కోనేరు, ఊరు, సత్యమూర్తి పలు సందర్భాల్లో తలచుకుంటూనే ఉంటాడు. చిన్నప్పటి నల్లకళ్ళ తెల్లమ్మాయిగా, రమణమ్మ కూతురుగా, కనకవల్లి అతని జ్ఞాపకాల్లో తరగలెత్తుతూనే ఉంటుంది. సత్యమూర్తి భావుకత్వం ఎలాంటిదంటే అతనికి ఎలాంటి తోడు కావాలో ఊహించే ఈ వర్ణనలో ఉంది–

"రాళ్ళమీదా, పచ్చికలోనూ తను వెల్లికిలా పడుకుని పగలు నీలాకాశంలో బూడిదరంగు మబ్బుల్నీ, వెన్నెల రాత్రిళ్ళు బూడిదరంగు ఆకాశంలో తెల్లటి మబ్బుల్నీ చూస్తూ కూర్చుంటే గిన్నెలో అన్నం కలిపి నోటి కందించేవాళ్ళు కావాలి. రాళ్ళ మధ్య కదలలేక పడివున్న కొద్దిపాటి నీళ్ళల్లో చంద్రుడ్ని చూస్తూ కూర్చున్నప్పుడు పక్కకు వచ్చి గులకరాళ్ళు ఏరి తెచ్చి, ఒక్కొక్క రాయినీ నీళ్ళల్లోకి విసురుతూ, చంద్రుడ్ని ముక్కలుముక్కలు చేసి, నక్షత్రాల్ని నలువైపులకూ విసిరేవాళ్ళు కావాలి. మంచు కురుస్తోన్న చీకటి రాత్రిళ్ళు పాకలో చీకట్లను పారదోలుతూ చిన్నదీపాన్ని వెలిగించే వాళ్ళు కావాలి" ఇలాంటి ఆలోచనలు సత్యమూర్తివి.

బాల్యపు కనకవల్లిని సత్యమూర్తి తలుచుకునే కమనీయ వర్ణనలు శీలావి చాలానే చేశారు. అయితే కుసుమలత దగ్గరకు వచ్చేసరికి యౌవనగత సౌందర్యం అభివర్ణితమైంది. అది చిత్రకారుడి పనిలా సాగింది.

"కుసుమలత ముఖంలో ఎత్తుపల్లాలు ఎక్కువ. కళ్ళు దిగువునా, దిగువ పెదవి కిందా చేతితో లోపలికి అణిచి, పల్లం ఎక్కువచేసి, కోణాలు తిప్పిన ముఖం ఆమెది. కంఠం ముఖాన్ని కలిపిన చోట గెడ్డం మరికాస్త ముందుకు దిగి, కోలముఖాన్ని మరింత స్పష్టంగా చూపిస్తుంది. చెవి పక్కగా చెంపలమీద నుండి చెక్కిళ్ళ మీదకు అర్ధచంద్రాకారంలో వెంట్రుకల్ని తిప్పడం ఆమెకు అలవాటు. మెడదగ్గర నుండి

కొండచరియల్లా నునుపుగా కిందకు దిగిపోయిన భుజాలు ఆమెవి. వెనక్కు తిరిగినప్పుడు విశాలమైన మైదానంలా కనిపించే వీపు, దాని మధ్య ఎండిపోయిన కాలవలాంటి వెన్నెముకలోతును జాకెట్టు కప్పేస్తుంది. ముందువైపు పురాతన నిరంకుశ సామ్రాజ్యాలు రెండు సార్వభౌమత్వాలతో పటిష్ఠంగా నిలుచుని రాజ్యపాలన చేస్తున్నట్టు ఉన్నతమయిన వక్షాలు నిలిచివుంటాయి. ఆ సామ్రాజ్యాలు దిగ్విజయ స్తంభాలను స్థాపించుకొన్నట్టు పొడవైన చేతులు రెండువైపులా వుంటాయి. మెడలో సన్నటి చైను, రెండు సామ్రాజ్యాలకు మధ్య సరిహద్దు గీత. చూపులు వీటికి కాపలాదార్లు. నోరు రక్షణ స్థావరం. రెండు పెదాలూ రెండు ధనుస్సులు".

... అంటూ సాగే వర్ణన ఒక శిల్పి, ఒక చిత్రకారుడి ధోరణికి దగ్గరగా కనిపిస్తుంది కానీ కవితాధోరణిగా కాదు. కనకవల్లినీ, కుసుమలతనీ సత్యమూర్తి దృక్కోణం నుంచి వర్ణించిన రచయిత సత్యమూర్తిని కుసుమలత దృక్కోణం నుంచి ఒక వంక రూపునీ, మరోవంక మనస్తత్వాన్నీ వర్ణిస్తారు. అందులోనూ చిత్రకారుడే. సత్యమూర్తి రూపం గురించిన వర్ణన ఇలా సాగుతుంది–

"అతను పొడుగు. గ్రీకు దేవాలయాల్లోని స్తంభాల్లా పొడుగ్గా, పటిష్ఠంగా వుంటాడు. భుజాలవద్దనుండి నిటారుగా కిందకుదిగి స్వేచ్ఛకై గింజుకుంటున్న చేతులు అతనివి. క్షణం సేపన్నా అవి నిలకడగా ఉండవు. వేళ్ళు సన్నగా, పొడుగ్గా అజంతాలో ఆడాళ్ళ వేళ్ళలా ఉంటాయి. ఆఫీసుల్లో ఫైళ్ళు రాయడానికీ, ప్రెస్సుల్లో ప్రూఫులు దిద్దడానికీ కాదు. ఆ వేళ్ళు ఏ వీణను మీటడానికో, ఏ మురళిని వాయించడానికో, ఏ చిత్రాన్ని గీయడానికో. ముఖం చిన్నది. ఆ పొడుగుకు తగ్గట్టు లేదు. చెక్కిళ్ళ దగ్గరనుండి గెడ్డంవరకూ వాలు యెక్కువ. అందువల్ల కోలగా అనిపిస్తుంది ముఖం. తలను వెనక్కు దువ్వి, ఎడంవైపు కిందకు అణుస్తాడు. కారడవి పక్కనే మొలిచిన చిట్టడవి మధ్య రెండింటికీ సరిహద్దు బాటలా వుంటుంది పక్కపాపిడి. విశాలమైన నుదురు, నుదుటి మీద అణాకాసంత మచ్చ. చూడగానే కొట్టొచ్చినట్టు కనపడే ఆ మచ్చలో అతని అందమంతా కప్పబడిపోయింది. నుదుటికి వేలాడదీసిన గిజిగాడులా కిందకు దిగిన ముక్కు, ముక్కు దిగువున సన్నటి గాడీ, దానికి అటూ ఇటూ ప్రేమతో పెంచి అందంగా కత్తిరించిన క్రోటన్సు మొక్కల వరుసల్లా సన్నటి మీసాలూ, రహస్యాన్ని దాచలేని వెడల్పాటి పెదాలు, పెదాలకింద సూటిగా చెక్కిన గెడ్డం. చూడగానే దృష్టి మార్చుకోవాలనిపించదు. నిలకడగా వుండలేని చూపులు అతనివి. రంగుల్నీ, అందమైన

రూపాల్నీ వెతుక్కుంటూ పారిపోయే చూపులు. కంటిపాపలు ఎప్పుడూ నృత్యం చేస్తున్నట్టు కదులుతూనే వుంటాయి. వెలుతుర్లో నిలుచుని చీకటిని చూస్తున్నట్టు కళ్ళు చిట్లించి చూస్తాడు. అందువల్లే ఆ కళ్ళు నిద్రలేక ఉబ్బినట్టనిపిస్తాయి. పెదాలు దేవాలయ సింహద్వారాల్లా ఎప్పుడూ తెరిచే వుంటాయి. మల్లెపూల దండల తోరణాల్లా పళ్ళు మెరుస్తుంటాయి. దేవుడ్ని అభిషేకం చేసిన జలంలా నిరంతరం వాక్రువంతి అతని నోటిలో ఊరుతూనే వుంటుంది. ఆ వెనుక మూలవిరాట్టు– అది అతని మనసే".

అలాగే సత్యమూర్తి మనస్సు గురించి కుసుమలత దృక్కోణంలో వర్ణించిన తీరులో అతనిలోని భావుకత, సౌందర్యారాధన, సున్నితత్వం, కరుణ, ఆర్ద్రత స్పష్ట మవుతాయి. అతనికి కోపాన్ని ప్రదర్శించటమే చేతకాదనీ, గట్టిగా కసిరితే ఏడ్చే పసిపాప కళ్ళు అనీ ఆమె సంభావిస్తుంది. అలాగే సత్యమూర్తి "శ్మశానంలో సూర్యాస్త మయమూ, ఎడారిలో చంద్రోదయమూ, కొండల కింద సెలయేరూ, దుఃఖం వెనుక కన్నీళ్ళూ, కాలువగట్టున గడ్డిపూలూ వున్నప్పుడే అందం. కుసుమలత పెదాలమీద చిరునవ్వుంటేనే అందం" అనుకుంటాడు. నిజానికి వందేళ్ళ ముసలమ్మలో కూడా అందం చూసే నైజం, ఒంటరితనంలో అందం గమనించే నైజం అతనికున్నాయి.

వాస్తవానికి 'కరుణించని దేవత' నవలలోని అనేక వర్ణనల్లో శీలా వీర్రాజులోని చిత్రకారుడే ఎక్కువ గోచరిస్తుంటాడు. చిత్రకారుడు కవిగా ప్రాథమికంగా పరిణమిస్తున్న ధోరణి వాటిల్లో తొంగిచూస్తూంటుంది, అంతే! "హెన్రీమూర్ వంటి ఏ శిల్పో వచ్చి ఆమెను అలా రాతిలో ప్రతిష్ఠిస్తే బావుండును. ఎల్లప్పుడూ అదే ఫోజులో చూసే అవకాశం వుండేది. ఆమె కనిపించే రూపాలన్నింటిలోకి అందమైన రూపం అదే. ఆడవాళ్ళ ముఖాల్లో చిరునవ్వు కన్నా సిగ్గున్నప్పుడే అందం ఎక్కువ. గాజులు చేతులకూ, పాపిడిపిందె నొసటికీ, గొలుసు మెడకూ, పట్టీలు కాళ్ళకూ అందాన్నిస్తాయి. కానీ సిగ్గు శరీరానికంతకూ అందాన్నిస్తుంది. పెట్టని ఆభరణం అది. చిరునవ్వూ, సిగ్గూ స్త్రీ సంపాదించుకున్న వరాలు" అనుకుంటాడు కుసుమలత గురించి సత్యమూర్తి.

పాత్రల రూపురేఖావిలాసాలను తెలిపే భౌతిక వర్ణనలు నవలలో చిత్రకారునిగా శీలా వీర్రాజులోని దృష్టిగతపార్శ్వాన్ని బలీయంగా ప్రతిఫలిస్తుంటాయి. ప్రకృతితో, పరిసరాలతో అనుసంధానించి వర్ణించడం ఎక్కువగా చేసారు. కవితాత్మకమైన మనోగత విశ్లేషణలు, బాహిర వర్ణనలతో పోలిస్తే, సంఖ్యలో తక్కువే. కనకవల్లి నవ్వును ఒకచోట

వర్ణిస్తూ ఇరవై ఎనిమిదేళ్ళకే యౌవనం రాలిపోతున్నదన్న భావాన్ని ఆమె కళ్ళకింద ముడతలు పట్టిస్తున్నాయంటారు.

కొన్నిచోట్ల వర్ణనాత్మకంగా వుంటూనే నిర్వచనాత్మకంగా భాసించే విషయ వివరణం కూడా శీలావి చేశారు. "యౌవనంలో గంభీరంగా, హుందాగా, మెల్లగా నడిచే ఏనుగువంటిది కాలం. బాల్యంలో హాయిగా, నిర్లక్ష్యంగా గెంతే కోతివంటిది. వార్ధక్యంలో కసితో, కోపంతో మీదపడబోయే పెద్దపులి వంటిది" అని చెప్పారు.

"సానుభూతి చాలా విలువైనది సత్యం! కనిపించిన వాళ్ళందరికీ దాన్ని పంచి ఇవ్వడం కూడదు. అలా ఇచ్చుకుంటూ పోతే ఒక్కొక్కప్పుడు విపరీతమైన పరిణామాల్లోకి తీసుకుపోయే ప్రమాదం ఉంది. ఇచ్చేకొద్దీ జారిపోయే గుణం వుంది దానికి. సానుభూతి యెక్కువైతే అకస్మాత్తుగా అనుకోని సంఘటనలకు కారణం కావచ్చు" అంటుంది కనకవల్లి.

"చీకటివర్షం, దుఃఖమేఘం, తలలో రక్తం కపాలంలో సలసల కాగడం, హృదయంలో మూలవిరాట్టుకు అభిషేకాలు, చేతిగాజుమీద ఎలక్ట్రిక్ బల్బు కాంతిరేఖ, రాత్రి అనుభవాల ఆలోచనల సిగ్గుతో ఎర్రబడిన నవవధువు చెక్కిలి, నిశ్శబ్దపు అగడ్తలు, మేఘాల రెక్కలు, సౌందర్యం గుండెలమీద చెక్కిన మార్గం, మాగిన అరటిపళ్ళు, చమురు జిడ్డు కలిపిన వింతవాసన" వంటి పదచిత్రాలు అనేకం కనిపిస్తాయి కథన మార్గంలో.

తీర్థానికితీర్థం ప్రసాదానికిప్రసాదంలా– వర్ణనలు వర్ణనలకోసమే చేసిన తావులు కొన్ని వున్నా, ఎక్కువ భాగం పాత్రలను పలు కాలగత పరిస్థితుల్లో వివరించి చెప్పడానికే వాడుకున్నారు. ముందే చెప్పినట్టు వీటిల్లో చిత్రకారుని దృష్టికోణం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే కవిభావుకతకు అది తొలిమెట్టుగా తోస్తుంది. ఎక్కువ భాగం వర్ణనలు ప్రకృతి గతంగానూ, పాత్ర స్వభావగతంగానూ ఎంచుకున్నప్పుడు మాత్రమే స్పందనానుకూలమైన కవిదృష్టి కనిపిస్తుంది. ఇందులో ఎక్కువశాతం వర్ణనలు చిత్రకారుడి ఆల్బమ్ చూస్తున్నట్లు వుంటాయి. కొన్ని కవి భావుకతకు సమీపంగా వచ్చి నిలుచుంటాయి.

'కరుణించని దేవత' నవలా రచనాకాలానికి శీలా వీర్రాజు ప్రధానంగా చిత్రకారుడూ, కథకుడే. కానయితే ముమ్ముందు రూపుదాల్చబోయే కవి హృదయగత

అనుభూతులకు ప్రాతిపదికలు ఎక్కువగా ఈ నవలలోనే కనిపిస్తాయి. కథాకావ్య రచనా బీజాలు నవలలోని వర్ణనలు సంతరించుకొని ఆశలు మోసులెత్తేలా ఉంటాయి.

ఈ నవలకు శీలా వీర్రాజు సాహిత్య ప్రస్థానంలో గొప్ప ప్రసిద్ధి రాకపోయినా, ఆయనను ఒక కవిగా స్థిరీకరించే చిత్రకారిత్వం ఇందులోనే కనబడుతుంది కనుక ఇది ఒక మలుపు వంటిదే! ఈ నవలపట్ల ఆయన మక్కువకు కారణం కూడా ఆ అప్రాప్త మనోహరత్వమే. 'కరుణించని దేవత' వల్లనే తదనంతర కాలాన శీలావి కవిగా స్థిరమయ్యారని నా భావన.

('శీలా వీర్రాజు కలం చిత్రాలు' గ్రంథం– సెప్టెంబర్ 2007)

(18) ఆరిపోని దారిదీపం శ్రీశ్రీ కవిత్వం

శ్రీశ్రీ గురించి నిన్న నవ్య వారపత్రిక ప్రత్యేక సంచిక వచ్చింది. 'శ్రీశ్రీతో అనుబంధం కలిగిన, ఆయనతో ఆత్మీయతలు పంచుకున్న సాహితీ ప్రముఖులందరినీ అడిగి వారి అనుభవాలు జ్ఞాపకాలు సేకరించిన ప్రత్యేక సంచిక' అన్నారు. 'నన్ను అడగలేదే' అనుకున్న వారు ఇంకా చాలామంది ఉండచ్చు. అడగాలని వారికి తోచకపోవడానికి వారి దృష్టిలో వీరు ప్రముఖులు కాకపోవచ్చు. వాళ్లని అడిగి రాయచ్చని వీళ్లకు తోచకపోవడానికి వీళ్లది అలాంటి అడుక్కుని రాసే మనస్తత్వం కాకపోవచ్చు.

ఇంతకీ శ్రీశ్రీ– కవితాభిమానుల 'అందరి వాడు'. కవిత్వానికి ఎంత గౌరవం పెంచాడో, కవులకు వ్యక్తులుగా అంత గౌరవం తగ్గించినవాడు కూడా శ్రీశ్రీయే. "ఆయన రాసి పారేసిన కవిత్వం గుబాళిస్తూంటే– ఆయన తాగి పారేసిన సీసాల సంగతి మనకెందుకు" అని సరిపెట్టుకుందామనుకున్నా, రచనకు జీవితానికీ పొంతన ఆశించేవారికీ, సమాజానికి గొప్ప సందేశాలు సంకలించే కవి– వ్యక్తిగా తాను త్రాగుబోతు, అనార్కిస్టు అవడం జీర్ణించుకోలేని– సగటు విలువల ఆరాటపు జీవులకూ భంగపాటు కలిగిస్తాడు. కుర్రాళ్లకు శ్రీశ్రీ కవిత్వం ఒక ఆదర్శం. 'ఆకలిరాజ్యం' సినిమాలో కమల్‌హాసన్ యువతకు ప్రతినిధిగా, శ్రీశ్రీనీ ఆయన కవిత్వాన్నీ అభిమానించే వానిగా– ఆ రోజుల్లో ఒక గొప్ప ఊపు కలిగించిన విషయం చాలామందికి తెలుసు. శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకున్న యువతకు ఆ పాత్ర– నాటి ఒక సజీవ దృశ్య చిత్రణం. శ్రీశ్రీని చూసినప్పుడు ఆ మహాప్రస్థానం రాసినవ్యక్తి ఈయన కాకపోయుంటే బాగుణ్ణనిపించింది నాటి ఇంటర్ ఫస్టియర్ కుర్రాడు, నేటి నవ్య వీక్లీ ఎడిటర్ జగన్నాథ శర్మకే కాదు, 'అప్పుడంతే! శ్రీశ్రీని తెలుసుకోలేక పోయాను' అని శ్రీశ్రీ సంతకం చేసిచ్చిన రూపాయిని తర్వాత తను ఖర్చుచేసి సిగరెట్టు కొనుక్కున్నా,

ఆకలిరాజ్యంలో శ్రీశ్రీ పుస్తకాలను తూకానికి వేసి, మహాకవి విలువ తూకానికి మూడు రూపాయలని ఆ యువపాత్ర నిట్టూర్చినా, అది బ్రతుకు యథార్థం. అంతెందుకు నాకు బాగా గుర్తు! ప్రస్తుతం ఏ.జీ.ఆఫీసులో వున్న ఆఫీసర్ సుబ్బారావు యువకుడిగా వున్నప్పుడు ఇంట్లో సైకిలు కొనుక్కోమని రెండు వందల రూపాయలిస్తే, శ్రీశ్రీ మీద అభిమానంతో– ఆయన్ను చూడాలని మద్రాసుకు టిక్కెట్టు కొని రైలెక్కి వెళ్లి మరీ కలిస్తే, మద్యం నిషాలోవున్న మహాకవి అప్పట్లో రంగనాయకమ్మ మీద ఎందుకో కోపంతో పచ్చిగా మాట్లాడటం విని తట్టుకోలేక 'ఈయనేనా శ్రీశ్రీ' అని భంగపడి, వెనుతిరిగి వచ్చి, ఆ తరువాత కవిత్వం అంటేనే ఎలర్జీ కలిగిందన్నాడు. అయితే ఇవేవీ శ్రీశ్రీ మహాకవిత్వానికి అవరోధాలు కావు. కవిత్వం వేరు– వ్యక్తి వేరుగా రెండు శ్రీశ్రీ లను వింగడించి చూసుకున్నప్పుడు, కవిగా ఆయన ఊగించి సూచించి శాసించిన వాడే. మహాకవియే, మహా వ్యక్తి కాదు.

ఇవాళ ఎందరో కవులుగా నిలబడడానికి శ్రీశ్రీ కవిగా వారి గుండెల్లో కూచోవడమే కారణం. 1965 లో హెచ్.ఎస్.సి. పాసయ్యాక నేను హైదరాబాద్ వివేకవర్ధని కళాశాలలో పి.యు.సి. సైన్స్ చదువుతూ అప్పటికే ఏర్పడిన సాహిత్యాభిలాషతో యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆదివారం పక్ష సమావేశంలో తొలిసారిగా పాల్గొని, 1967 లో 'క్లుప్తగోష్ఠి' కార్యక్రమంలో ఉత్తమ వక్తగా ఎన్నికయినప్పుడు కీ॥శే॥ ఇరివెంటి కృష్ణమూర్తి, శ్రీ వంగపల్లి విశ్వనాథంగార్ల సంతకంతో 'మహాప్రస్థానం' పుస్తకం బహుమతిగా లభించింది. జ్వరపడి లేచి శ్రీశ్రీ మహాప్రస్థానం రాసాడంటారు గానీ, అది చదివాక నాకు వచ్చిన జ్వరం ఇప్పటికీ తగ్గలేదు. అది కవిత్వ జ్వరం. అది తగ్గుతుందనీ, తగ్గాలనీ అనిపించని జ్వరం. 'జరిగితే జ్వరమంత సుఖం లేదు' అనిపించే జ్వరం. శ్రీశ్రీ కలం ప్రభావం పడిన శతకోటిలో నేనొకడిని. ఆ తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్యార్థిగా శ్రీ కె.కె.రంగనాథాచార్యులు ప్రిన్సిపాల్‌గా వుండగా– 'నెలవంక' వార్షిక సంచికకు ఉప–సంపాదకునిగా నేను శ్రీశ్రీ గురించే వ్యాసం రాశాను. ప్రాచ్య కళాశాల సంచికలో అభ్యుదయ భావ దీప్తులు రంగనాథాచార్యులుగారి ప్రేరణే. శ్రీశ్రీ మూలాధార నాడి.

అయితే శ్రీశ్రీ గురించి వ్యక్తిగా కూడా తెలిసిన తర్వాతే ఆయనను చూడడం వలన– నేనేమీ నిరాశకూ, భంగపాటుకూ లోనవలేదు. సామ్యవాద భావజాలంతో కవిగా శ్రీకారం చుట్టుకోవడానికి నాకూ శ్రీశ్రీయే ప్రేరణ. ఎప్పటికీ సాహిత్యంలో శ్రీశ్రీ కలం– సినారె గళం– శివారెడ్డి మైత్రీదళం నాకు ఇష్టం.

శ్రీశ్రీతో కొన్ని గంటలు గడిపి, ఆయనను ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు ఆకాశవాణి ద్వారానే లభించింది. 1978 లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగంలో చేరాను. రేడియోలో 'ప్రత్యేక జనరంజని' కార్యక్రమం ప్రముఖులు, అందునా సినీరంగ ప్రముఖులచేత సమర్పించడం జరుగుతుండేది. 1982 మార్చిలో శ్రీశ్రీని స్టూడియోకి ఆహ్వానించి, ఆయన్ను స్వయంగా ఇంటర్వ్యూ చేసి, 26.3.1982 న దుందుభి ఉగాది సందర్భంగా శ్రీశ్రీ ప్రత్యేక జనరంజనిని ప్రసారం చేసిన సంఘటన ఒక గొప్ప సంతృప్తి, ఆనందం నాకు– వ్యక్తిగానూ, వృత్తిపరంగానూ కూడా. శ్రీశ్రీ మరణానికి ఏడాది ముందు రేడియోలో ప్రసారమైన ఆ దీర్ఘ ఇంటర్వ్యూ పూర్తిపాఠం విరసం ప్రచురించిన శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం 19 ప్ర.జలో 'శ్రీశ్రీతో సుధామ'గా పదిహేను పేజీలుగా నమోదయింది. రేడియో ఇంటర్వ్యూ సినిమా గురించే ప్రధానంగా సాగినా, ఆయన కవిత్వమూ, ఆయన భావధార గురించి కూడా సంభాషణ సాగింది. ఆ గంటలు మరుపురానివి.

శ్రీశ్రీని ఆ తరువాత 1983 లో ఒకసారి హైదరాబాద్‌లోనే హోటల్ గదిలో కలిశాను. జూన్ 15, 1983 శ్రీశ్రీ అస్తమించిన రోజు రాత్రి– అప్పటికప్పుడు ఆయన మీద ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని దూరదర్శన్‌లో లైవ్ ప్రోగ్రాంగా నేనూ, మిత్రురాలు డా॥కె.బి.లక్ష్మి– వ్యాఖ్యానంతో ప్రసారం చేయడం మరిచిపోలేని ఘటన. ఈమని కృష్ణారావు (నాడు మిత్రుడు, నేడు పెద బావగారు) ప్రొడ్యూసర్‌గా – ఆ కార్యక్రమం కోసం సూరిబాబు వేసిన బొమ్మలను దూరదర్శన్ విభాగం నుండి తగినవి ఏరుకోవడం, ఇంటికి పరుగెత్తుకు వచ్చి శ్రీశ్రీ మహాప్రస్థానానికి ఆంధ్రజ్యోతి వీక్లీలో బాపు వేసిన బొమ్మలను తీసుకోవడం, స్టూడియోలోనే స్క్రిప్ట్ రాసి, మా గళాలలోనే శ్రీశ్రీకి నివాళి కార్యక్రమం సమర్పించడం ఇప్పటికీ ఒక ఉద్వేగ జ్ఞాపకమే. ఆ రాత్రి గుర్తుండిపోయేదే ఎప్పటికీ.

ఆ తర్వాత శ్రీశ్రీ ప్రథమ వర్ధంతికి 'అక్షరాల శక్తి శ్రీశ్రీ' అనే డాక్యుమెంటరీని 'దృశ్య శ్రవణ స్పర్శ' అంటూ ఈమని కృష్ణారావు ప్రొడ్యూస్ చేసినప్పుడు– రచనా సహకారం నాదే. ఆంధ్రప్రభ సంపాదక వర్గంలోని అజంతాని ఆ కార్యక్రమంలో పాల్గొనమని కోరినప్పుడే 'రెండు ఖడ్గ ప్రహారాల మధ్య శ్రీశ్రీ' అంటూ శ్రీశ్రీపై అజంతా రాసిన కవిత నిజానికి ఆ డాక్యుమెంటరీకై రాసిందే. కె.శివారెడ్డి, నగ్నముని, స్వాతి బలరాం లతో శ్రీశ్రీ గురించి ఆ డాక్యుమెంటరీలో మాట్లాడించాం. అది తరువాత ఆంగ్లంలోకి కూడా అనువాదమై నేషనల్ నెట్‌వర్క్‌లో ప్రసారమైందని కృష్ణారావు

చెబితేనే తెలిసింది. శ్రీశ్రీ చనిపోయినప్పుడు మేం లైవ్ చేసిన కార్యక్రమం కోసం శ్రీశ్రీతో ఆకాశవాణిలో నేను దిగిన ఫోటో ఇవ్వగా దూరదర్శన్‌లోనే ఎక్కడో పోయింది. అయితే శ్రీశ్రీతో నేనూ, ఆకాశవాణిలో సహోద్యోగులు రామానుజాచార్యులు, దుర్గారాజ్, స్వామి దిగిన ఫోటో తాలూకు నకలు మాత్రం ఒకటి మిగిలింది.

శ్రీశ్రీ ప్రభావం నుండి బయటపడడానికి చాలామందికి చాలా కాలం పట్టింది. 'ఈ శతాబ్దం నాది. 1930 నుండి తెలుగు సాహిత్యాన్ని నేను నడిపిస్తున్నాను' అన్న శ్రీశ్రీ స్టేట్‌మెంట్ మేం 'యువభారతి' సంస్థ పక్షాన స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా నూరు వ్యాసాలతో వెలువరించిన 'మహతి' గ్రంథంలో 'నేను నా పాతికేళ్ల రచనలు' అన్న అంశం మీద విశ్వనాథ, శ్రీశ్రీలతో వ్యాసాలు రాయించినప్పుడు శ్రీశ్రీ తన వ్యాసంలో ఉటంకించిందే. 'మహతి'కి శీలావి ముఖపత్ర రచన చేయగా, అక్షరాలంకరణ నేను చేశాను. తెలుగు పత్రికల్లో కార్టూనులు– జోకులు అనే అంశంపై నా వ్యాసం కూడా అందులో చోటుచేసుకోవడం ఒక మధురానందం.

శ్రీశ్రీ 'కవితా ఓ కవితా' గానీ, 'మరో ప్రపంచం' గానీ గొంతెత్తి చదువుకోవడం ఇప్పటికీ నాకు ఇష్టం. "ఆ కవితలను శ్రీశ్రీ స్వయంగా చదవడం వినడంకంటే మనం చదువుకుంటేనే ఉత్తేజం అబ్బాయ్" అని కీ॥శే॥ గోపాలచక్రవర్తి నాతో అనడం నాకింకా జ్ఞాపకమే. శ్రీశ్రీలోని ప్రయోగశీలత్వం నాకు ఇష్టం. 'ఒసే తువ్వాలు అందుకో' కథ ఇష్టపడతాను. ఆయన సిగరెట్టు, త్రాగుడు నాకు అలవడనందుకు ఆనందిస్తాను. పదబంధ ప్రహేళికలు కూర్చడం శ్రీశ్రీ నుంచి నేర్చుకున్నదే. 'ఆరుద్రా నువ్వు కూడా ఒక తప్పేనోయ్' అని జ్యోతిలో సమాధానాలు ఇస్తూ శ్రీశ్రీ పేర్కొనడం, ఒక ప్రహేళికలో "పిల్లి లేని పినతల్లి వికారంతో కూడితే గరుత్మంతుడి తల్లి" అని వినత అనే పదానికి ఇచ్చిన శ్రీశ్రీ ఆధారం నాకు మరుపురావు.

మాటాట, పదమవ్యూహం, పదబంధం, మాటవరస, పదనిసలు పేర వివిధ పత్రికల్లో వేలాది గళ్ల నుడి కట్టులు నిర్వహించడానికి శ్రీశ్రీయే ప్రేరణ నాకు. ఇప్పటికీ రోజూ ఆంధ్రప్రభలో పదనిసలు కూరుస్తున్నాను మరి, వార్త ఆదివారం అనుబంధంలో కూడాను. 'శ్రీశ్రీకి ముందూ వెనుకా అంతా శూన్యం' అన్నాడు కానీ అజంతా, శ్రీశ్రీ తన ముందుటి శూన్యాన్ని అభ్యుదయ దీధితులతో నింపి, ఆ తర్వాత నవ్యకాంతులవైపు తెలుగుల ప్రస్థానానికి బాట చూపిన అరిపోని దారి దీపం. శ్రీశ్రీకి శతజయంతి నివాళి ఇది.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 11 జూన్ 2009)

❖

(19) జ్ఞాపకాల నీడలు

తొంభై ఏళ్లు పైబడిన వృద్ధుడంటే ఎవరయినా ఆయన ఏ మంచం మీదనో, సరిగ్గా కనబడకనో, వినబడకనో, మాట్లాడకనో వుంటాడని భావించడం సహజం. కానీ ఆ వయస్సులోనూ ఉత్సాహంగా పనిచేస్తూ కబుర్లాడుతూ, కళాసాహిత్య రంగాలలో కృషి కొనసాగించగలగడం అనేది అపురూపమైన అద్భుతమైన విషయం.

అలా సాక్షాత్తూ నేను దర్శించి, కలసి పనిచేసిన మహనీయులు పైడిమఱ్ఱి రాజా రామచంద్రరావు గారు. 'ఆంధ్ర శిల్పకళా వైభవం' అనే ధారావాహికను దూరదర్శన్ కోసం తొంభై ఏళ్ల వయస్సులో నిర్మించారాయన. స్వయంగా ఇంటికి వచ్చి నన్ను వారి కారులో రికార్డింగ్ స్టూడియోకు తీసుకువెళ్లి, ఆ ఎపిసోడ్‌లకు నా చేత తెలుగులో వ్యాఖ్యానం చేయిస్తూ, నా ఉచ్చారణను స్క్రిప్టుకు అనుగుణంగా ప్రతి అక్షరం వచ్చేలాగా వింటూ పర్యవేక్షణ చేయడం ఎలా మరువగలను. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడా అనేక డాక్యుమెంటరీలు నిర్మించారాయన.

తొంభై అయిదవ పడిలో పడుతున్న వయస్సులోనూ సాహిత్యాభిలాషతో 'కవి పంచకము' అనే గ్రంథాన్ని, తిక్కన, శ్రీనాథుడు, బమ్మెర పోతరాజు, వేమన, గురజాడ వేంకట అప్పారావుల గురించి తెలుగులో రచించి, ప్రచురించడం ఆయనకే చెల్లింది. ఆ గ్రంథం అచ్చుకావడానికి ప్రూఫ్‌లు చూడడంలో నేను సహకరించినా, ప్రత్యక్షరం నిశితంగా తానూ మరోమారు చూసుకొని చదివి సంతృప్తి చెందిన తరువాతే నేను రాసిన పరిచయ వాక్యాలతో అచ్చు వేసేరు దానిని.

ఆయన వ్యక్తిత్వం బహు విశిష్టమైనది. వృత్తిరీత్యా క్రిమినల్ లాయర్‌గా పనిచేశారాయన. భారతీయ సంస్కృతీ వైభవాన్ని ప్రపంచమంతటా పర్యటించి తన ఆంగ్లో పన్యాసాలతో అనేక విశ్వవిద్యాలయాలను అలరించారాయన. ఆయన ఆంగ్లంలో మాట్లాడుతుంటే మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారే 'నేను మీలా ఆంగ్లంలో ఎప్పటికయినా అనర్గళంగా మాట్లాడగలనా' అని అడిగేవారుట.

పైడిమఱ్ఱి రాజారామచంద్రరావు గారు 1912 జూలై 24 న కడపజిల్లా నందలూరు గ్రామంలో పైడిమఱ్ఱి నరసింహారావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. ఆయన వృత్తిరీత్యా న్యాయవాది అయినా హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవులొచ్చినా తిరస్కరించి తనకు ప్రవృత్తిరీత్యా సంతృప్తినిచ్చే విమర్శకునిగా, చారిత్రక వేత్తగా అపారకృషి కావించారు. చిత్ర, శిల్ప, సాహిత్య, సాంస్కృతిక కళాధ్యయనం సేవలో తరించారు.

జాతీయంగా, అంతర్జాతీయంగా భారతీయ కళావైభవాన్ని తమ ప్రసంగాలలో చాటిచెప్పిన రామచంద్రరావుగారు యునైటెడ్ స్టేట్స్, కెనడా, యూరప్, ఆస్ట్రేలియా ఇంకా అనేక తూర్పు ప్రాచ్యదేశాలలో ఆంగ్లంలో అద్భుతమైన ప్రసంగాలు చేసి, దేశ విదేశీయ ప్రముఖులెందరినో ఆకట్టుకుని అబ్బురపరచిన మేటి వక్త. వృత్తిరీత్యా కూడా అనేక దేశవిదేశ ప్రతిష్ఠాత్మక సంస్థలకు ఆయనే న్యాయ సలహాదారు.

'ఫస్ట్ పర్సన్ సింగులర్' అనే వారి ఆంగ్ల గ్రంథం రామచంద్రరావుగారి జీవితానుభవాల, జ్ఞాపకాల, ప్రముఖులతో పరిచయాల వివరణాత్మక సంపుటి. రవీంద్రుడు, నెహ్రూ నుంచి తెలుగులో శ్రీశ్రీ వరకూ ఎందరి గురించో ఆయన పరిచయాల పరీమళాలు ఆ గ్రంథంలో ఆస్వాదించవచ్చు.

'ది ఆర్ట్ ఆఫ్ నాగార్జున కొండ' అనే గ్రంథం పైడిమఱ్ఱి వారికి 1956 లోనే రాష్ట్రపతి అవార్డును తెచ్చిపెట్టింది. 'కంటెంపరరీ ఇండియన్ ఆర్ట్' 1956 లో వెలువరించి నేటి పద్మశ్రీ ఎస్.వి.రామారావు వంటి ఎందరో భారతీయ చిత్రకారులను, వారి చిత్రాలను విదేశీయులకు తొలిసారి పరిచయం చేశారాయన. 'ఆలంపూర్', 'భువనేశ్వర్', 'అమరావతి', 'ఆంధ్రశిల్పం', 'భారతీయ కళావైభవం'ల గురించి వారు రాసిన గ్రంథాలు వాటికవే సాటిగా దేశ విదేశీ ప్రముఖుల, పత్రికల ప్రశంసలు అందుకున్నాయి. 'ది స్కైండర్ ఆఫ్ ఆంధ్రా ఆర్ట్' అనే గ్రంథం ఆయన తన తొంభైయవ పడిలో ప్రచురించడం అపురూపమైన విషయం.

వక్తగా, రచయితగా ఎంత నిష్ణాతులో డాక్యుమెంటరీ చిత్ర నిర్మాతగా, దర్శకుడిగా రామచంద్రరావుగారి ఖ్యాతి అంతకు మిక్కిలిది. స్వయంగా కెమెరా పనితనం చూపే అసాధారణ ప్రజ్ఞ ఆయనది. 'రివర్ కృష్ణ', 'విజయనగరం', 'ఔట్‌స్టాండింగ్ మాన్యుమెంట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్', 'ది స్కైండర్ ఆఫ్ ఆంధ్రా ఆర్ట్' మొదలైన డాక్యుమెంటరీల నిర్మాణం వారి రచనా ప్రాభవానికి, కూర్పుకూ, ఫోటోగ్రఫీ

అందాలకూ, చారిత్రక పరిశోధనా పాటవానికీ, అద్భుత దర్శకత్వ ప్రతిభకూ సాటిలేని దాఖలా.

ఆయన ప్రతి చిత్రం మనోహర దృశ్య శ్రవణ కవిత్వం. అమేయ రసాత్మక దృశ్య చిత్రం. విదేశీయులెందరో ముగ్ధులైన చిత్రాలవి. పుణ్యక్షేత్రాలపై, దర్శనీయ స్థలాలపై, నాట్యకళారీతులపై, సంగీత వాయిద్యాలపై, వాగ్గేయకారులపై, సాహితీ వేత్తలపై ఏ విషయంపై డాక్యుమెంటరీ చిత్రం నిర్మించినా వాటిలో ఒక సాధికారత, సమగ్రత, సరళత, పరిశోధనాపాటవం, శ్రవణ దృశ్య మనోహరమైన అనుభూతి పొడగడతాయి. వీక్షకులు రసపరవశులై పొగిడేటట్లు వుంటాయి. ప్రసార భారతి ఆయనను 'టాప్‌గ్రేడ్ డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత'గా సంభావించింది.

తొంభై అయిదవ పడిలో పడుతున్న వయస్సులో 'తెలుగునకు అసలైన కవిత్రయం తిక్కన, వేమన, గురజాడలు' అన్న మిత్రుడు శ్రీశ్రీ భావస్ఫూర్తితో తెలుగు సాహిత్యానికి ప్రాతినిధ్య కవులనదగిన తిక్కన, పోతన, శ్రీనాథుడు, వేమన, గురజాడల గురించి తన సన్నిహిత మిత్రుడైన శ్రీశ్రీకే అంకితం చేస్తూ పైడిమఱ్ఱి రాజారామచంద్ర రావుగారు 'కవి పంచకం' గ్రంథం రాసారు. కవుల జీవిత కాలాదులను వివరించడం మాత్రమే కాక, వారి సాహిత్య కృతుల పరిచయాన్ని, సారాన్ని అంత సంక్షిప్తంగా, సమగ్రంగా, వారి కృతుల సారభూత కవిత్వోదాహరణలతో అందించగలగడం నిజంగా గొప్ప విశేషం. నేటి యువతకు సాహిత్య పఠనాభిలాష పెంచాలనే జనరంజక కవిపరిచయ గ్రంథ రచన చేశారాయన.

సృజన లోకానికి ఒక స్ఫూర్తి అనదగిన పైడిమఱ్ఱి రామచంద్రరావుగారు 2007లో 'కవిపంచకం' ను సమీక్షలకు పంపడానికి స్వయంగా కవర్లమీద చిరునామాలు రాస్తూ హఠాత్తుగా ఆసుపత్రి పాలై 95 ఏళ్ల వయస్సులో పరమ పదించారు. ఆ వయస్సులోనూ గొప్ప ధారణతో ఉత్సాహంగా మాట్లాడుతూండే తెల్లని పొడుగాటి ఆయన మూర్తి ఇప్పటికీ కళ్లముందు గుర్తుకొస్తూంటుంది.

(నది 'వారం-వారం' వారపత్రిక, జూన్ 2009)

❖

(20) రామాయణ పదవిహారి

కవి అంటే వాల్మీకి. ఏదో 'కాలమ్' రాసుకునే కవికాదు. కాలాలకు నిలబడిపోయే కవి. ఈ ఏడాది వెలువరిస్తే మరు ఏడాదికి మరుగునపడిపోయే కవితలు రాసుకుంటూ, ఏటేటా ఏదో ఒకటి రాసి వెలువరిస్తూంటే తప్ప వర్తమానంలో అస్తిత్వం వుండదని తపించే కవులున్న ఈ కాలాన– ఎప్పుడో ఏళ్లక్రితం రాసిన ఒక కావ్యంతో ఇప్పటికి మాత్రమే కాదు, ఎప్పటికీ నిలిచి వెలుగొందుతున్న కవి అంటే అతడు. అంతేకాదు! రామాయణం వాల్మీకి తన కాపీరైట్ అని ఏమీ అనుకోలేదు. ఎందరో కవులకు కవిత్వభిక్ష పెట్టిన కావ్యం రామాయణం. రామకథ ఇతివృత్తం అలాంటిది. ఎందరు ఎన్నిమార్లు ఎన్నిరకాల చెప్పినా– మానవ జీవనేతిహాసం పొదువుకున్న మహేతివృత్తం కనుకనే, రామకథ రచన ఎప్పటికీ పాతబడని కావ్య వస్తువు. నాలుగు పంక్తుల ఓ ప్రక్రియ సృష్టించి తానే పేరెంట్‌గా పేటెంట్ హక్కుల కోసం వెంపర్లాడే మహానుభావులున్న కాలాన, ఎవరికి ఎలా కావాలో అలా వినియోగించుకునేందుకు విశ్వశ్రేయం చేయబడిన రచన రామాయణం.

ఇవాళ రామాయణం అనగానే కాలాన్ని వెనక్కు తిప్పడమనీ, తిరోగమనమనీ సంభావించే జనాభా తయారైంది. 'సరసిజనాభుడు' అంటే బొడ్డున తామరగలవాడు అంటే తామరపువ్వా? తామరా? అని అడిగినట్లు, కండూతి జనం పెరిగిపోతూ అల్పప్రాణాక్షరాల రచనతో అనల్ప కీర్తికోసం వెంపర్లాడుతున్న వెగటు సాహితీ కాలాన నిజమైన అభ్యుదయ భావన, మానవీయ విలువల మహేతిహాస దీప్తిగల కావ్యరచన సాధారణ విషయమేమీ కాదు. తెలుగుకు తొలి జ్ఞానపీఠం తెచ్చిన విశ్వనాథ సత్యనారాయణ గారు ఎంత శతాధిక గ్రంథకర్త అయినా ఆ అద్భుత పురస్కారం తెచ్చిన రచన ఆయనకయినా 'రామాయణ కల్పవృక్షమే'. నిజానికి రామాయణమే అసలు సిసలు విశ్వంభర. వాల్మీకి రామాయణంలోని ఆరు కాండాలూ ఆరు ఖండాలకూ ఆదర్శ మానవ జీవన గీతలు. రామాయణాన్ని మించి మనిషికి ఇహ పర మోక్షానంద

దాయకమైనన రచన వేరొకటి లేదంటే, ఇదంతా తిరోగమనవాదం అని గంతులేసే విధ్వంస వానరులే గర్వాతిశయపు దుముకులాటల్లో సాహితీ తరుశాఖలపై ఇవాళ పొడగడుతూంటారు.

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు భక్తి టివి ఛానెల్‌లో రాత్రి తొమ్మిది గంటలకు చేస్తున్న సంపూర్ణ రామాయణ పఠనం తోడి ప్రవచనాలు సమాజంలో రామాయణ సమకాలీనతను సాక్షాత్కరింపచేస్తున్న విషయం ఎందరి గ్రహింపుకు వస్తోందో తెలియదు. బహుభాషల్లో అనేక రామాయణాలు వచ్చాయి. ఆధ్యాత్మ రామాయణం, ఆనంద రామాయణం, భాస్కర రామాయణం, గోపీనాథ రామాయణం, మొల్ల రామాయణం, అద్భుత రామాయణం, తులసీ రామాయణం ఇలా ఒకటా రెండా?... ద్విపద రామాయణాలు, వచన రామాయణాలు సరేసరి. శ్రీనివాస శిరోమణి, రాజాజీ, ఉషశ్రీ ఇలా రామాయణాల రచయితలు ఎందరెందరో. 'మరలనిదేల రామాయణం?' అని ప్రశ్నించుకున్న విశ్వనాథ చేస్తున్న సంసారమే మనుషులు చేస్తున్నట్లే కాలావధుల నతిక్రమించి 'తలచిన రామునే తలచెదను. నా భక్తి రచనలు నావిగాన' అని చెప్పుకుని నవకథా ధృతిని మించి ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది అని రసమంచిత రామాయణ రచన చేశారు. కల్పవృక్ష ఛాయల్లో విషవృక్షాలు ఎన్ని మొలచినా 'మనిషి– రాక్షసుడి' కథగా రామాయణం ఎవరి వ్యక్తి నైజాన్ని అనుసరించి ఆ రూపెత్తుకుందన్నది తెలిసిన విషయమే.

ఇప్పుడు ఈ 2009 లో సరికొత్తగా తెలుగు పద్యకావ్యంగా మళ్లీ శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి రామాయణ రచన పూర్తి కావించి ఇటీవలే బాలకాండము, సుందరకాండము వెలువరించారు. శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి అంటే ఎవరికీ తెలియకపోవచ్చు. కానీ 'విహారి' అన్నపేరు తెలుగు సాహితీ పాఠకులకు చిరపరిచితమైనదే. కథా రచయితగా ఆయనకంటూ ఒక ఖ్యాతి వుంది. కథకునిగానే కాదు కవిగా, సమీక్షకునిగా నేటికీ ఆధునిక సాహిత్య ప్రపంచంలో విహరిస్తున్న వారే. స్వయంగా మొన్న ఇంటికి వచ్చి శ్రీ పదచిత్ర రామాయణము బాలకాండము, సుందరకాండము ఆయన అందించి వెళ్లగానే అందమైన బాపు ముఖచిత్రాల అట్టలు తిప్పి, లోన మట్టసంగా వున్న పద్యరచనను పఠిస్తూంటే పద్యం మీద విహారికున్న పట్టు, హృద్యమైన ఆ కథనరీతి ఎంతగానో ఆకట్టుకుని కట్టి పడవేశాయి. విహంగ వీక్షణ విహారమే కావించినా, హృదయానికి కలిగిన ఆనంద స్పందనం అభివ్యక్తం కాకుండా వుండలేకపోతోంది. 'ఇమేజ్' అన్నది పాశ్చాత్యులు కవిత్వంలో తలకెత్తుకున్న

కవిత్వానికి చెందిన మూలాధార నాడి. హృదయానికీ బుద్ధికీ ఏకకాలంలో సంప్రీతిని కలిగించేది ఇమేజ్ అని ఎజ్రాపౌండ్ అంటాడు. కాగా కవి ఇస్మాయిల్ ఇమేజ్ అంటే పదచిత్రం అన్నాడు. అయితే అది వట్టి పదం కాదు. ఆ పదం వెనుక దృశ్యభావాల గాఢ మనోహర సమ్మిశ్రణం వుంది. అందుకే డా॥ సి.నారాయణరెడ్డిగారు భావచిత్రం అన్నారు. తెలుగు అభ్యుదయ కవిత్వంలో భావచిత్రాలు అని నేను డా॥ అరిపిరాల విశ్వం (నేడు శ్రీ స్వామి ఆనందఘన) గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్ పరిశోధన చేసింది కూడా ఈ ఇమేజరీ గురించే. విహారి (జె.ఎస్.మూర్తి) దీనిని వినమ్రంగా 'పదచిత్ర రామాయణం' అనే అన్నారు గానీ, వాస్తవానికి భావచిత్ర రామాయణమే. రామాయణ పరమార్థాన్ని పద్యాల పదపదంలో భావచిత్ర గతులతో దృశ్యీకరించి నిజంగానే ఈ కావ్య రచనతో చరితార్థులయ్యారు. సహజంగా కథకులు కావడంతో సంఘటనలను దృశ్యీకరించి చూపే ప్రాభవం వారికి కరతలామలకం. ఛందస్సులోని విశేష వృత్తాల నన్నిటినీ సందర్భశుద్ధితో కావ్యరచనలో ఆయన ప్రయుక్తం చేసిన పద్ధతి, కథన వైభవంతో సమకూరిన అద్భుత కవితాశైలి ప్రశంసనీయాలు.

బాహ్య వర్తన మంతరాన్వర్థ శీల/ చిత్రణాధిక్య గుణముల జెక్కునెడల/ రెండు విధముల బదచిత్రలేఖ మొఱసె/ నొకటి కథ; కథనమ్ము వేఱొకటి కాగా రామకథ/ 'కవి' ది; కథనక్రమము వ్యక్తిగతము; నిజమస్మదీయ మాక్రమము; కనుక/ దృశ్యముల వెంట దృశ్యముల్ దీటుకొనియె సంజెలో పిల్లలాటాడు సరళిజూపి!

అంటారు కవి విహారి.

"నా రసన కందినట్లు, మననము సాగి/ పెకలిన గతి భావాంబర వీధి చూపి/ నట్టిదెస; కథా ధార పయనము జేసె/ విపులమయ్యెను చిత్రముల్ విస్తరించె" నన్నారు. చిత్రంగానే తోచినా ఒక అభ్యుదయ కథకుడు, విశ్రాంత జీవితబీమా అధికారి శ్రీపద చిత్ర రామాయణాన్ని ఇంత సుందరంగా పండిత జనరంజకంగా, పాఠకజన హృదయంగమంగా రచించడం పురాకృత శుభాధిక్యమే. కావ్యరచనా సామర్థ్యానికి, జీవన వికాస కృతార్థతకు చిరంతన ప్రతీక విహారి రామాయణం. మిగతా నాలుగుకాండలూ కూడా త్వరలో వెలువడి, నాలుగు కాలాలపాటు నిలిచిపోయే కీర్తి శ్రీ పదచిత్ర రామాయణం ద్వారా కావ్యకర్తా, పారాయణం చేసే పఠితా ఆర్జించుకోవాలని శుభాశంస!

(ఆంధ్రప్రభ దినపత్రిక, 1 అక్టోబర్ 2009)

❖

(21) 'యువ' విశ్వ 'నాదం'

నిజమే! సాహిత్య సభలకు వెడితే శ్రోతల సంఖ్య చాలాపలుచనే. అదీనూ యువకుల శాతం మరీ శూన్యం. ముప్పైల లోపు యువతకు సాహిత్యం పట్ల ఆసక్తి చచ్చిపోయిందా? సినిమా పాటలు తప్ప మరే సాంస్కృతిక కార్యక్రమానికీ జనం కనబడరు. లోపం ఎక్కడుంది? యువతలోనా? యువతను అటువైపు ఆకర్షించలేని సాహిత్యంలోనా? సాహిత్య సృజన అంటూ సాగుతున్న వ్యక్తుల వ్యవహార సరళిలోనా?

పాఠశాలల్లో, కళాశాలల్లో, బయట సాంస్కృతిక సంస్థల్లో, వక్తృత్వ, వ్యాసరచన, కవిత్వ విషయిక పోటీలకన్నా, పాటల పోటీలూ, డ్యాన్స్‌ల పోటీలే ఎక్కువ. ఛానెల్స్ నిండా ఆ గోలే కదా! ఆ పాటలూ, ఆ డ్యాన్సులు కూడా అన్నీ మళ్లీ సినిమా చుట్టూ తాయే! సినిమా బలమైన సాధనమే. కానీ దానిని నేటి తరంపై, ముఖ్యంగా యువతపై అత్యంత ప్రభావం చూపుతుందని తెలిసీ, కేవలం వ్యాపారాత్మకం చేసుకున్నాం తప్పితే, అంతర్జాతీయ స్థాయికి, ఆస్కార్లకు కాకపోతే మానె కనీసం జాతీయ స్థాయిలోకి వెళ్ళలేదు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా తెలుగు చిత్రం ఒక్కటయినా గుర్తింపుకు నోచుకోలేదంటే బహుమతులు నిర్ణయించే జ్యూరీనీ, అవార్డుల ఎంపిక ధోరణినీ నిందించి నిరసిస్తున్నాం తప్పితే, మన లోపాల గురించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నామా? ఎదిగేలా చూసుకుంటున్నామా? సాహిత్యం విషయంలోనూ అంతే! కవిత్వం అంటే అది ఏ కొందరికో, వారిమధ్య జరిగే అభివ్యక్తి వ్యవహారంగా తోస్తోంది. రకరకాల ఇజాలు, వాదాలతో గ్రూపులుగా, శిల్పం, శైలి అంటూ ఏదో అందనిదిగా కవిత్వం గురించి భయపెట్టే ధోరణి ఒక వైపయితే, నాలుగు పంక్తులూ, ఓ పాతిక అక్షరాలుగా తేలిక పరిచి, కవిత్వమంటే ఒక సీరియస్‌నెస్‌నూ, ఆసక్తినీ తగ్గించి అదేదో కీర్తికి షార్ట్‌కట్ వ్యవహారంగా చేసిన వైఖరులు మరోవైపు. సాహిత్య సృజనకారులకు చిత్తశుద్ధీ, నిజాయితీ సంస్కారమూ అక్కరలేదా? రాతకు చేతకు కొంతనైనా పొంతన వుండక్కర్లేదా?

ఇంట్లో, స్నేహితులతో, బంధువులతో తెలుగులో మాట్లాడటం నామర్దానా? నిజమే! ఇంగ్లీషు మీడియమ్‌లో పిల్లలు చదవడం అనివార్యమయ్యే వుండవచ్చు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు తెలుగువల్ల అంతగా వెలుగు బాటలు కనిపిస్తూండడం లేకపోవచ్చు! కానీ తనకోసం, తనతనం కోసం, తన ఆత్మీయ హృదయం కోసం, మాతృభాష తెలుగు– తనలో వెలిగించే వెలుగు దీధితులను పుట్టినరోజు సంస్కృతుల పేరిట కొవ్వొత్తుల్లా స్వయంగా ఆర్పుకునే దరిద్రానికి ఎందుకు పాల్పడడం? అది నివారించవద్దా? 'చుట్టూరావున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది' అన్న మాటే స్ఫూర్తిగా ఆచరణలో సాహిత్యం కోసం, సమాజం కోసం, యువత వ్యక్తిత్వ వికాసం కోసం 1964 నుంచీ కృషి చేస్తున్న సంస్థ 'యువభారతి'. అధ్యక్షుడు, కార్యదర్శి కన్నా 'సమావేశకర్త' అన్న వ్యవహృతికి ఆద్యతన స్ఫూర్తి, కీర్తి తెచ్చి, నాటి నుంచి నేటివరకూ అదే ఆశయ దీప్తితో సాగుతూ, మార్గదర్శిగా నిలుస్తున్నది ఆచార్య వంగపల్లి విశ్వనాథం. అప్పట్లో ప్రతినెలా మొదటి, మూడవ ఆదివారాల్లో– హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో మేడమీద మధ్యాహ్నం రెండున్నర నుండి అయిదు వరకూ సాగే పక్ష సమావేశాలే పునాదులుగా, అర్థబలం లేకున్నా అంగబలంగా ఒక యువసేనను తీర్చిదిద్దిన నాయకత్వం లక్షణాలు, ప్రభావోపేతమైన సమ్యక్‌దృష్టి, కార్యాచరణ విశ్వనాథం లక్షణాలు! వాణిజ్యశాస్త్రంలో డాక్టర్ అయినా, వాణిన్నీ, వాణిజ్యాన్నీ కూడా ఏది, ఎక్కడ, ఏ మేరకు వుండాలో ఆ సమతూకం తెలిసిన విశేషజ్ఞుడాయన. దానిని నిలుపుకుని, నిలుపుతున్న నిరాడంబరుడాయన.

యువతరంలో సాంస్కృతిక పునరుజ్జీవనాన్నీ, సారస్వత సంస్కారాన్నీ, సమ్యక్ పరిశీలనా పాటవాన్నీ కలిగించాలనేదే 'యువభారతి' మౌలిక ఆశయం. ఇప్పటికి నూటయాభైకి పైగా గ్రంథాలు సంస్థనుండి వచ్చాయి. 'మారుతున్న విలువలు– రచయితల బాధ్యతలు' అని 1970 లో 'రచన' చర్చాగోష్ఠి నిర్వహించినా, భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా 1972 లో స్వాతంత్ర్య యుగోదయంలో (1947–72) తెలుగు తీరుతెన్నులు గురించి 'మహతి' పేర నూటొక్క వ్యాసాల సమీక్షా వ్యాస సంకలనం ప్రచురించినా, 'కావ్యలహరి' పేరిట అంతకుముందే ప్రాచీన ప్రబంధాలపై దివాకర్ల వారి ఉపన్యాసాలతో మొదలిడి 'లహరి' ప్రసంగ పరంపరలతో విశ్వనాథ నుండి విప్లవ కవుల దాకా ప్రసంగాలనూ, ఆ వ్యాస ప్రచురణలనూ చేసి 'యువభారతి'యే ఆ ఖ్యాతి దక్కించుకుంది.

యువభారతిది 'గత వైభవదీప్తి' అని సమకాలీన ప్రపంచంలో అనిపించడం సహజం! ఎందుకంటే నేటి సాహిత్య సాంస్కృతిక సంస్థల ధోరణుల వెల్లువలో కొట్టుకుపోయే తెలివిడి, సాహసం, సంకల్పం, లక్ష్యం లేకపోవడమే! ఏ యువతను తీర్చిదిద్దాలనే ఆశయంతో, ఆనాడు పక్ష సమావేశాలతో విత్తనాలను నాటిందో, యువభారతి ఈనాడూ అదే పనిలో నెలనెలా మొదటి ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లి సిటీ గ్రంథాలయంలో యువతను చేరదీస్తోంది. ఆచార్య వంగపల్లి విశ్వనాథంగారే అరవై దాటిన వయస్సులోనూ అదే స్ఫూర్తితో– చేరిన పదిమంది యువతనైనా, ప్రభావితులను చేయగలుగుతూ, వ్యక్తిత్వ వికాస శిక్షణ నిస్తున్నారు. పత్రికల్లో సమావేశం వార్తలు రావాలనో, ఫోటోలు పడాలనో, కుర్రాళ్ళను రాత్రికి రాత్రి మహనీయ కీర్తి మంతులుగా ప్రొజెక్ట్ చేసేయాలనో, వేలాది రూపాయల బహుమతులతో ఆకర్షించేయాలనో, జరిగే కార్యక్రమం కాదది. మొన్న అక్టోబర్ 11 వ తేదీ రోజంతా జరిగిన కార్యక్రమంలో ఓ పదిమంది పాతసభ్యులు తప్పిస్తే, పాల్గొన్నది దాదాపు నలభైమంది సరికొత్త యువతే. మూడు విడతలుగా పదిమందేసి అప్పటికప్పుడు తమకు ఇచ్చిన విషయంపై రెండు నిముషాలు ప్రసంగించడం, ఇచ్చిన విషయంపై అయిదు నిముషాల్లో రచన చేయడం వంటి శిక్షణా శిబిరాన్ని విశ్వనాథం నిర్వహించిన తీరు చూసాక ఇంకా లోకంలో విలువల ఆరాటపు వ్యక్తులు, అందునా యువతరాన్ని సుశిక్షితులుగా ఉదాత్త విలువలతో, సంస్కార జీవులుగా, పోటీ ప్రపంచంలో సమర్థులుగా తీర్చిదిద్దే కృషీవలురు, ప్రచారార్భటులకూ, కేవలం ఆర్థిక ఆరాటాలకు దూరంగా పనిచేస్తూనే ఉన్నారు, ఉంటారు అన్న ధైర్యం చిగురించింది.

ఒక వ్యక్తిని కాక, ఆ వ్యక్తిలోని చైతన్య శక్తిని పసిగట్టి, పొగిడి, ప్రోత్సహించడం, సరియైన శిక్షణతో సక్రమంగా వ్యక్తిత్వాన్ని వికసింపజేయడం ఎప్పటికీ సాధ్యమే! ఆచార్య వంగపల్లి విశ్వనాథం అటువంటి యువభారతీయులను రూపొందిస్తున్న ఆదర్శ కృషీవలుడు.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 15 అక్టోబర్ 2009)

❖

(22) మనసున్న కథకుడు

డా॥మాడభూషి రంగాచార్య స్వయంగా కథకుడు. అంతేకాదు కవితా హృదయం గలవాడు. కవితారచన చేసినా, కథలే ఎక్కువ రాశాడు. హైదరాబాద్, శంషాబాద్‌లో 1941 ఫిబ్రవరి 25 న జన్మించిన రంగాచార్య, తుర్కపల్లిలో ఉద్యోగ జీవితంలో అడుగు పెట్టి, కొద్దికాలం హైదరాబాద్ మున్సిపాలిటీలో పనిచేసి, 1963 లో రైల్వేలో, క్యాషియర్‌గా చేరి, 2001 లో రిటైర్ అయ్యాడు. వృత్తికీ, ప్రవృత్తికీ సంబంధం లేకుండానే ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఎం.ఓ.ఎల్., ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎం.ఫిల్, పిహెచ్.డి. చేశాడు. బి.ఇడి. ఎం.ఇడి., ఎం.బి.ఏ., ఫ్రెంచి కోర్సులు చేశాడు. 'తెలుగు కథ– బుచ్చిబాబు' అనే అంశంపై ఎం.ఫిల్. పరిశోధన, 'తెలుగు నవల ఆధునిక స్త్రీ' గురించి డాక్టరేట్ చేసి, ఆ సిద్ధాంత గ్రంథాలు ప్రచురించాడు.

తాను రాసిన కథల్లో మేలిమి వంటి పది కథలతో 'అమ్మ వెళ్లిపోయింది' అనే కథా సంపుటి ప్రచురితమైంది. బాపు ముఖచిత్రీకరించిన ఆ కథ 'ఆంధ్రప్రభ వారపత్రికలోనే 1969 లో మొదటగా ప్రచురింపబడింది. 2003 లో డా॥ మాడభూషి రంగాచార్య జ్ఞాపకాలతో వెలువడిన 'హృదయవాసి' గ్రంథంలో శ్రీ కె.కె.రంగనాథాచార్యులు, జ్వాలాముఖి, తిరుమల దేశికాచార్యులు, డా॥ కె.బి.లక్ష్మి, శ్రీ కాకాని చక్రపాణి, కె.బి.గోపాలం, డా॥ డి.చంద్రశేఖర్‌రెడ్డి, నాళేశ్వరం శంకరం, వరదరాజన్, వనం శంకరయ్య, శీలావీర్రాజు, అంపశయ్య నవీన్ మొదలైనవారి వ్యాసాలు రంగాచార్య వ్యక్తిత్వ, రచనా పార్శ్వాలను స్మరించేవిగా వున్నాయి.

రంగాచార్య కవితల్లో నా 'భామ'లహరి, అభిసారిక, అసంతృప్తిని ఆహ్వానిస్తాను, తస్మాత్ జాగ్రత్త, నా గమ్యం మొదలైన ఖండికలు 'హృదయవాసి'లో సంతరించ బడ్డాయి. బుచ్చిబాబులోని సౌందర్య దిదృక్ష ప్రధానంగా రంగాచార్యను ప్రభావితం చేసిందనాలి. తాను పనిచేసే రైల్వే శాఖకు చెందిన గ్యాంగ్‌మన్, కీమెన్, ట్రాలీమెన్

వంటి వారిపై కవితాత్మక హృదయంతో కదలి రాసిన కథల్లో కటువైన వాస్తవికత వుంది. శ్రీమునిపల్లె రాజు– రంగాచార్య కథల సంపుటికి ముందుమాట రాస్తూ 'నిజానికి ఆయన మనస్తత్వం ఇంగ్లీషు రొమాంటిక్ కవుల తత్వంతో పోల్చదగినది. అన్ని ఐహికలోక సమస్యల మధ్యా ఆముష్మికాన్నే దర్శించినవాడు. కొద్దిపాటి శిక్షణతో గొప్ప కవిత్వం వ్రాయగలిగేవాడు... జన్మతః సాత్విక స్వభావి. స్త్రీ హితాన్ని మనసా, కర్మణా వాంఛించిన వాడు... ఈ కథలు ఒక ఉత్తమ సంస్కారి, భావుకుడు అయిన వ్యక్తి స్వప్న దర్శనాలని మాత్రం చెప్పగలను' అంటూ ప్రశంసించారు. రంగాచార్య అస్తమించి ఎనిమిది సంవత్సరాలవుతున్నా అతని లలిత కవితా హృదయ ఆశయదీప్తి 'కథ'కు ఒక ఉద్దీపనగా వెలుగొందుతూనే ఉంది.

కథానికా ప్రక్రియలో మిత్రుడు మాడభూషి రంగాచార్య పేర, మార్చి 11 2002 న ఆయన మరణించిన అనంతరం, స్మారక సంఘం ఏర్పడి, ఏటా ఒక ఉత్తమ కథకుడి కథాసంపుటికి 'పదివేల రూపాయలు' పారితోషికం ఇస్తున్నారు. రంగాచార్య శ్రీమతి మాడభూషి లలితాదేవి పూనుకుని, 2004 నుంచి నిరాఘాటంగా ఆ కార్యక్రమాన్ని ప్రతి ఏటా ఫిబ్రవరి 25 నాడు హైదరాబాద్‌లో జరిపిస్తున్నారు. ఆ రోజు రంగాచార్య జన్మదినమూ, వివాహ దినోత్సవమూ కావడంతో, సభలను నిర్వహించడం జరుగుతోంది. ఈ అవార్డుకు, పరిశీలనకు అంటూ కథకులు పుస్తకాలు ప్రత్యేకంగా పంపుకోవడమనో, ప్రవేశ రుసుములనో, లేకుండా కమిటీవారే దశలవారీగా సమావేశమవుతూ, చర్చలు జరుపుతూ, కథాసంపుటులను కూలంకషంగా చదివి, పరిశీలించి, ఎంపిక చేస్తున్నారు.

డా॥ మాడభూషి రంగాచార్య స్మారక ప్రసంగాలు ఏటా నిర్వహించడం, ఈ సభలో ప్రముఖ కథా విమర్శకులు ప్రసంగాలు కావించడం, వాటిని ప్రచురించడం మరో మంచి ప్రణాళిక. పాఠశాల విద్యార్థులకు తెలుగు కథానికా రచన పట్ల ఆసక్తి బాల్యం నుండే కలిగించడానికి, ఏటా జంట నగరాల్లోని పాఠశాల విద్యార్థులకు పోటీ నిర్వహించి, బాలబాలికలు సమావేశమై, ఆ రెండు గంటల్లో రాసే కథలను, సాహితీవేత్త చేత పరిశీలింపచేసి, ఏటా గెలుపొందిన పిల్లలకు బహుమతు లిచ్చి ప్రోత్సహిస్తున్నారు.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 1 మార్చి 2010)

❖

(23) నూరేళ్ళ తెలుగు కథాసుధ

తెలుగు కథానికకు నూరేళ్లు.

ఒక ప్రక్రియకు వంద సంవత్సరాల 'మనికి' అనేది సామాన్యమైన సంగతేమీ కాదు. 1910 లో గురజాడతో కథానిక మొదలైంది అన్నది మనం గురజాడ 'దిద్దుబాటు'తో చెప్పుకుంటున్నాం. 1910 కి ముందు కథానికలున్నా, కొత్తగా మాత్రమే కాదు ఒక సంపూర్ణతా లక్షణాలతో ఆవిష్కృతమైంది 'దిద్దుబాటు' కనుకనే, తొలి తెలుగు కథానికగా దాన్ని గుర్తించడం జరిగింది. అంతకుముందు రాసిన కథను గురజాడ స్వయంగా 'దిద్దుబాటు' చేసుకుని, ఒక నాందీ వాచకం పలికిన వాడయ్యాడు. గతకాలపు సమాజానికీ, ఆ భావజాలానికీ, హేతువాదానికి నిలవని ఘటనకూ–పానుగంటి నరసింహారావుగారి 'కానుగుచెట్టు' సరళ గ్రాంథికంలో వెలువడినదే అయినా, పాతకథలకు భరతవాక్యం లాంటిదని 1921 లో విమర్శకులు భావించారు. 'కమలిని' పేరుతో మొదట రాసిన కథను గురజాడ వ్యవహార భాషలోకి పాత్రోచిత సంభాషణలతో ఒక సంఘ సంస్కరణాభిలాషతో, సాంఘిక ప్రయోజనం లక్ష్యంగా 'దిద్దుబాటు' చేసి నవతకు అడుగుజాడ చూపారు. ఆనాటి 'ఆంధ్రభారతి' పత్రికలో 1910 నుండే తొలి కథానికలు వచ్చాయి.

పత్రికలకు 'కథానిక' ఒక మూలాధారనాడి అవడం అప్పుడే మొదలైంది. ఆనాటి పత్రికలు తక్కువే అయినా ఆంధ్రభారతి, త్రిలింగ, సాహితి, ప్రతిభ, ఆంధ్రపత్రిక, శారద, కృష్ణాపత్రిక వంటి వార, మాస పత్రికలన్నీ కథానికలు ప్రచురించేవి. కథారచనలో విధిగా వాడుకభాష వాడి తీరాలని సాహితీ సమితి నిర్ణయం తీసుకుంది కూడా. 1924 లో 'భారతి' మాసపత్రిక మొదలై కథానిక ప్రక్రియకు గొప్ప ఆలంబనం అయ్యింది.

'ఇవి మితవ్యాప్తిని కలిగి, చదువుటకు సులభమై అద్భుతానందములు కలుగ జేయును. ఇప్పుడు యూరోపునందును, అమెరికాలోను మంచి పత్రికలు ఈ చిన్న

కథలను ప్రోత్సహించుచున్నవి. చిన్న కథలను 'నవలిక' యనరాదు. 'కథిక' యని నామకరణం చేయవచ్చునేమో పండితులు యోచింతురుగాక' అంటూ 1924 ఫిబ్రవరి భారతిలో దేవుపల్లి అప్పలనరసింహంగారు ఒక వ్యాసంలో పేర్కొన్నారు. నాలుగేళ్ల తర్వాత ఆయనే 1928 ఆగస్టులో చిన్నకథలను గురించి భారతిలో ఓ వ్యాసం రాస్తూ 'గద్య కథానకములు' అని పేరు పెట్టి 'కథానకము' అన్న పేరు ఈ ప్రక్రియకు తగినదని వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వలన విన్నట్లుగా రాశారు.

'షార్ట్‌స్టోరీ'కి 'కథానిక'గా ఒక స్థిరనామం ఇచ్చింది మాత్రం ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు. 1936 వ సంవత్సరంలో ప్రతిభ మాసపత్రికలో ఆయన రాసిన వ్యాసమే 'కథానిక' అనే మాటకు ప్రాచుర్యం తెచ్చింది. 1939 లో 'భారతి' మాసపత్రికలో తల్లావఝుల శివశంకరశాస్త్రిగారు 'కథానిక పరిణామం' అనే వ్యాసం రాస్తూ 'వైవిధ్యం, వైచిత్ర్యం, వైదగ్ధ్యం ఉట్టిపడేటట్లుగా వస్తుగ్రహణం చేయాలి. యథార్థ జీవిత సంఘటనంతో బాటు ఒక్కింత కల్పన కూడా మేళవించి కథ రసవంతంగా ఉండేట్లు చూడాలి' అని రాశారు. ఉపదేశాలు, నీతులు వంటివి ఉన్నా, మిట్టపండ్లలా ఉండరాదనీ, కథను శ్రోతకు ప్రత్యక్షంగా చెప్పినట్లుండాలనీ, కథానిక ఒక వార్తలా, కరపత్రంలా కాక కళాఖండంగా ఉండాలని మార్గదర్శనం చేస్తూ 'కథానిక' రచనలో నిష్ణాతులుగా ఆ వ్యాసంలో ముప్ఫైఆరుమంది పేర్లు పేర్కొన్నారు. అంటే 1910 నుండి 1939 వరకు అంటే సుమారు మూడు దశాబ్దాల కాలంలో అప్పటికే సుప్రసిద్ధ కథానికా రచయితలుగా 36 మంది పేర్లు ముందుకొచ్చాయి.

వారు పేర్కొన్న పేర్లు చింతాదీక్షితులు, నోరి నరసింహశాస్త్రి, కొడవటిగంటి వెంకటసుబ్బయ్య, మునిమాణిక్యం నరసింహరావు, వఝుల బాబూరావు, శ్రీనివాస శిరోమణి, మొక్కపాటి నరసింహశాస్త్రి, అడవి బాపిరాజు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేటూరి శివరామశాస్త్రి, కవికొండల వేంకటరావు, పూడిపెద్ది వేంకటరమణయ్య, గుడిపాటి వేంకటాచలం, మల్లాది రామకృష్ణశాస్త్రి, వెంపటి నాగభూషణం, రాయసం వేంకటశివుడు, భావరాజు కృష్ణారావు, బుర్రా వేంకటసుబ్రహ్మణ్యం, కొడవటిగంటి కుటుంబరావు, టేకుమళ్ల కామేశ్వరరావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, మొదలి సుబ్రహ్మణ్య శర్మ, కాళూరి రామారావు, కరుణకుమార, తాతా కృష్ణమూర్తి, సురవరం ప్రతాపరెడ్డి, ఆచంట జానకీరాం, బొడ్డు బాపిరాజు, అత్తిలి సూర్యనారాయణమూర్తి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, కుమార రాఘవశాస్త్రి, కనుపర్తి వరలక్ష్మమ్మ, క్రామధాటి జానకీదేవి, యల్లాప్రగడ సూర్యకుమారి, పులవర్తి కమలాదేవి.

1952 లో గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు 'అక్షరాభిషేకం' పేర తెలుగు కథకులను గురించి రాశారు. అందులో తొమ్మిది మంది చోటుచేసుకున్నారు. బహుశా కథకుల గురించి వచ్చిన మొదటి పుస్తకం అదేనేమో. 1982 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 'తెలుగు కథారచయితలు' పేరిటి ఒక పరిశీలనాత్మక సంకలనంలో పన్నెండు మందిని గురించి వ్యాసాలున్నాయి. 'అక్షరాభిషేకం'లో త్రిపురనేని గోపీచంద్, తల్లావఝుల వారి పట్టికలో లేని కథకులుగా 1952 లో చేరగా, 1982 లో 'తెలుగు కథారచయితలు'లో మునిమాణిక్యం, బాపిరాజులను వదలి, గురజాడ, మల్లాది రామకృష్ణశాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, చాగంటి సోమయాజులను గురించి చేర్చడం జరిగింది.

1998 లో మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణగార్లు సంకలన కర్తలుగా 'తెలుగు కథకులు-కథనరీతులు' పేరిట నాలుగు సంపుటాలుగా మొత్తం వందమంది కథకుల గురించి వ్యాస సంకలనం వచ్చింది. ఈ నూరేళ్లలో సుప్రసిద్ధులైన తెలుగు కథకులు వీరు అనీ, వారి కథనరీతి అంటూ, ఒక ముద్రను ఏర్పర్చుకున్న రచయితల గురించి వెలువడిన మంచి సంకలనాలు అవి. ప్రస్తుతం దాదాపు అయిదు వేల మంది దాకా కథానికా రచయితల సంఖ్య ఉన్నట్లు తెలుస్తోంది. 'కథానిలయం' వారు తెలుగు కథకుల పట్టిక ఒకటి రూపొందించే బృహత్‌యజ్ఞం చేశారు.

ఒక నూరు మంది కథకులూ, వారి పేరు చెప్పగానే గుర్తొచ్చే ఒక మంచి కథ అంటే ఎక్కువమందికి తోచే వివరం ఇది. ఆ రచయితదే మరొకరికి మరొకటి మంచి కథగా తోచవచ్చునని అంగీకరిస్తూనే నూరేళ్ల తెలుగు కథానికకు ఒక అభినందన మాలగా ఈ కథానిక పుష్పాలను ప్రస్తావించడం జరుగుతోంది. ఇదే నిర్ధారితమూ, సమగ్రమూ అని మాత్రం చెప్పలేం.

1. గురజాడ అప్పారావు- దిద్దుబాటు
2. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి- వడ్లగింజలు
3. చలం- ఓ పువ్వు పూసింది
4. చింతా దీక్షితులు- గాలిపాటు (వటీరావు కథలు)
5. వేలూరి శివరామశాస్త్రి- డిప్రెషన్ చెంబు
6. మల్లాది శివరామశాస్త్రి- ఖామోష్
7. బుర్రా వేంకట సుబ్రహ్మణ్యం- జేబు రుమాలు

8. మునిమాణిక్యం నరసింహారావు – కాంతం కాపురం (కాంతం కథలు)
9. సురవరం ప్రతాపరెడ్డి– నిరీక్షణ
10. కరుణకుమార– బిళ్లల మొలతాడు
11. అడవి బాపిరాజు– అడవి మల్లె
12. విశ్వనాథ సత్యనారాయణ– మాక్లీ దుర్గంలో కుక్క
13. పాలగుమ్మి పద్మరాజు– గాలివాన
14. బుచ్చిబాబు– అరకులోయలో కూలిన శిఖరం
15. కొడవటిగంటి కుటుంబరావు– చెడిపోయిన మనిషి
16. గోపీచంద్– ధర్మవడ్డీ
17. బాలగంగాధర తిలక్– అద్దంలో జిన్నా
18. కె.సభా– అంతరంగం
19. చాగంటి సోమయాజులు– ఎందుకు పారేస్తాను నాన్నా!
20. కొనకళ్ల వెంకటరత్నం– కత్తిమీద సాము
21. సత్యం శంకరమంచి– రాగిచెంబులో చేపపిల్ల (అమరావతి కథలు)
22. మాగోఖలే– రాయిమడుగులు
23. రాచకొండ విశ్వనాథశాస్త్రి– జరీ అంచు తెల్లచీర (సారా కథలు)
24. పూసపాటి కృష్ణంరాజు– సామంతం
25. పురాణం సుబ్రహ్మణ్య శర్మ– నీలి
26. కాళీపట్నం రామారావు– యజ్ఞం
27. భమిడిపాటి రామగోపాలం– వంటొచ్చిన మొగాడు
28. ఇల్లిందల సరస్వతీదేవి– ఉదర నిమిత్తం
29. బలివాడ కాంతారావు– దారితప్పిన మనిషి
30. మునిపల్లెరాజు– వారాలబ్బాయి
31. అబ్బూరి ఛాయాదేవి– బోన్‌సాయ్ బతుకులు
32. భానుమతీ రామకృష్ణ– అత్తగారూ ఆవకాయ (అత్తగారి కథలు)
33. శీలా వీర్రాజు– నీడపట్టు మనిషి
34. పెద్దిబొట్ల సుబ్బరామయ్య– నీళ్లు

35. రంగనాయకమ్మ– స్త్రీ
36. ముళ్లపూడి వెంకటరమణ– జనతా ఎక్స్‌ప్రెస్ (రాధాగోపాలం కథలు)
37. ఆర్.ఎస్. సుదర్శనం– మధుర మీనాక్షి
38. ఆర్. వసుంధరాదేవి– బ్రిడ్జికింద
39. హితశ్రీ– గ్రహణం
40. కొలకలూరి ఇనాక్– ఊరబావి
41. కేతు విశ్వనాథరెడ్డి– జప్తు
42. సొదుం జయరాం– గూటిలో చిలుక
43. పులికంటి కృష్ణారెడ్డి– కర్త కర్మ క్రియ
44. ఇచ్ఛాపురపు జగన్నాథరావు– రూపాయలు–అణాలు (సుజాత–జగన్ కథలు)
45. అల్లం శేషగిరిరావు– చీకటి (వేటకథలు)
46. కల్యాణసుందరి జగన్నాథ్– అలరాసపుట్టిళ్లు
47. బీనాదేవి– రాధమ్మ పెళ్లి ఆగిపోయింది
48. కలువకొలను సదానంద– ఓండ్రింతలు
49. వాకాటి పాండురంగరావు– అపరాజిత
50. మధురాంతకం రాజారాం– జీవన్ముక్తుడు
51. ఆచంట శారదాదేవి– కారుమబ్బులు
52. అందే నారాయణస్వామి– వ్యత్యాసాలు
53. నెల్లూరి కేశవస్వామి– విముక్తి
54. రాచమల్లు రామచంద్రారెడ్డి– అలసిన గుండెలు
55. భూషణం– అడివంటుకుంది
56. ఆర్.ఎస్. చిదంబరం– సమానాంతర రేఖలు
57. శివరాజు సుబ్బలక్ష్మి– మనోవ్యాధికి మందుంది
58. త్రిపుర– భగవంతం కోసం
59. కె.రామలక్ష్మి– అదెక్కడ
60. అవసరాల రామకృష్ణారావు– మొగాళ్లకుండాలి బుద్ధి
61. వాసిరెడ్డి సీతాదేవి– తరాలు–అంతరాలు

62. పోలవరపు కోటేశ్వరరావు– కాంతిమూర్తి (కాకుళయ్య కథలు)
63. శ్రీవిరించి– అంతరగాంధారం
64. చాగంటి తులసి– యాష్ ట్రే
65. పి.రామకృష్ణారెడ్డి– మనిషి–పశువు (పెన్నేటి కథలు)
66. పి.సత్యవతి– సూపర్‌మామ్ సిండ్రోమ్
67. కె.కె.మీనన్– ముంపు
68. కవనశర్మ– ఆమె ఇల్లు
69. శ్రీపతి– మంచుపల్లకి
70. లంకిపల్లె– పంటకళ్ళం–పసిడినవ్వు
71. ఓల్గా– ప్రయోగం (రాజకీయ కథలు)
72. బి.ఎస్.రాములు– దక్షయజ్ఞం
73. కె.ఎన్.వై. పతంజలి– చూపున్న పాట
74. కాలువ మల్లయ్య– నేలతల్లి
75. విహారి–గోరంతదీపం
76. శ్రీరమణ– మిథునం
77. ఐ.వి.ఎస్. అచ్యుతవల్లి– వర్షం వచ్చిన రోజు
78. ముదిగంటి సుజాతారెడ్డి– విసుర్రాయి
79. బోయ జంగయ్య– గొర్రెలు
80. వివినమూర్తి– స్పర్శ
81. ఉప్పల నరసింహం– తిరగబడ్డ భూమి
82. చిలుకూరి దేవపుత్ర– మన్నుతిన్న మనిషి
83. తోలేటి జగన్మోహనరావు– మాగోడు
84. నామిని సుబ్రమణ్యంనాయుడు– పచ్చనాకుసాక్షిగా (మిట్టూరోడి కథలు)
85. వి.చంద్రశేఖరరావు– జీవని
86. బండి నారాయణస్వామి– చమ్మీదండ
87. గంటేడ గౌరునాయుడు– ఏటిపాట
88. బమ్మిడి జగదీశ్వరరావు– మట్టితీగలు

89. సింగమనేని నారాయణ– ఫిరంగిలో జ్వరం
90. కుప్పిలి పద్మ– మసిగుడ్డ
91. సలీం– రూపాయిచెట్టు
92. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి– కొత్త దుప్పటి
93. మహ్మద్ ఖదీర్ బాబు– దావత్ (దర్గామిట్టకథలు)
94. వి.ఆర్.రాసాని– తాలుగింజలు
95. వేదగిరి రాంబాబు– సముద్రం
96. అల్లం రాజయ్య– అతడు
97. సి. సుజాత– నీడ
98. తుమ్మేటి రఘోత్తమరెడ్డి– పనిపిల్ల
99. శాంతి నారాయణ– మట్టి మరకలు
100. ఎ.ఎన్.జగన్నాథశర్మ– పేగు కాలిన వాసన (అగ్రహారం కథలు)

ఇవి వాచవిగా ఎన్నుకున్నవే గానీ, ఇదే సమగ్రమూ సాధికారికమూ అని మాత్రం కాదు. ఇలా మరో వందమంది కథకులనూ, వారి కథలనూ పేర్కొంటూ పట్టిక రూపొందించవచ్చు. ఈ వందలో ప్రస్తావించని ప్రసిద్ధ కథకులు ఎందరో ఉండవచ్చు కూడాను. యద్దనపూడి, మాదిరెడ్డి, కౌసల్యాదేవి, పరిమళా సోమేశ్వర్, మాలతీ చందూర్, గంటి వెంకటరమణ వంటి ఎందరో రచయిత్రులూ, యండమూరి, మల్లాది వెంకట కృష్ణమూర్తి, చందు సోంబాబు, కొమ్మనాపల్లి, సూర్యదేవర వంటి రచయితలు కథలు రాసినా ప్రధానంగా వారు నవలారంగంలోనే ఖ్యాతి చెందారు. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క తరహా కథలు రాజ్యమేలిన సందర్భాలూ ఉన్నాయి. సంఘసంస్కరణ కథలు, ప్రేమ కథలు, రాజకీయ కథలు, స్త్రీవాద కథలు, దళితవాద కథలు, ప్రాంతీయ కథలు ఇలా ఎన్నో పరిణామ దశలున్నాయి కథానిక రంగంలో. చింతా దీక్షితులు– వటీరావు కథలు, మునిమాణిక్యం– కాంతం కథలు, భానుమతి– అత్తగారి కథలు, సత్యం శంకరమంచి– అమరావతి కథలు, ఖదీర్‌బాబు– దర్గా మిట్ట కథలు, నామిని– మిట్టోరోడి కథలు, పోలవరపు వారి కాకుళయ్య కథలు, సి.రామకృష్ణా రెడ్డి– పెన్నేటి కథలు, ఓల్గా– రాజకీయ కథలు, నగ్నముని– విలోమకథలు, జగన్నాథశర్మ– గోదావరి కథలు కూడా పరంపరలుగా ఒక పాత్రనో, స్థలాన్నో, విషయాన్నో తీసుకుని కథానికలు రాసినవారున్నారు, రాస్తున్నవారున్నారు.

ప్రతి వార, మాసపత్రికా కథలు ప్రచురిస్తూనే ఉన్నాయి. దినపత్రికల ఆదివారం అనుబంధాలలో కూడా కొన్ని పత్రికలు కథలు ప్రచురిస్తూనే ఉన్నాయి. ఆంధ్రభూమి మాసపత్రిక 'కథావేదిక' అని ఒకచో గుదిగ్రుచ్చి నెలనెలా కథలు అందిస్తుండగా, 'కథాకేళి' అనే మాసపత్రిక కేవలం కథలకే అంకితమై వెలువడుతోంది. మధ్యతరగతి కథల జోరు మందగించి– ప్రాంతీయతలకు, మాండలికాలకు ప్రాధాన్యం ఇచ్చే కథలు పెరిగాయి. పాఠకులు కథానికలయినా ఎక్కువ కాలవ్యవధి వెచ్చించి చదివేందుకు మనస్కరించకపోవడం వల్ల చిన్న కథానికలు రూపెత్తుతున్నాయి. కాలమ్ దాటని కథలు, కార్డు కథలూ వంటివి కానవస్తున్నాయి. మినీ కథలు 145 తో ఇటీవలే తెలుగు రచయితల 'మినీకథా సౌరభం' వెలువడింది.

ఇప్పటికే ఏటేటా పలు పత్రికలు విలువైన బహుమతులతో కథల పోటీలను నిర్వహిస్తున్నాయి. రాశిలో ఎక్కువగానే వస్తున్నా– వాసి గురించి సంపాదకులు, న్యాయ నిర్ణేతలు వాపోతూనే ఉన్నారు. బాలసాహిత్యంలో కూడా కథలకే ప్రాధాన్యం. ఇతర భాషల నుండి కథలు అనువదింపబడుతూ 'విపుల' వంటి మాసపత్రికలలో చోటు చేసుకుంటున్నా, తెలుగు నుండి ఇతర భాషల్లోకి అనువాదమవుతున్న కథల సంఖ్య తక్కువేనని చెప్పాలి. 'తూలిక నెట్' పేరిట నిడదవోలు మాలతిగారు తెలుగు కథలను ఆంగ్లంలోకి అనువదించారు కొన్ని. వి.వి.బి.రామారావు, డా॥కె.బి.గోపాలం, స్వాతి శ్రీపాద వంటి వారు కొందరు కూడా కొన్ని తెలుగు కథలను ఆంగ్లానువాదం చేస్తున్నారు. శాంతాసుందరి, ఎం.రంగయ్య వంటి కొందరు హిందీలోకి తెలుగు కథలు అనువదించడం జరిగింది. అలాగే తురగా జానకీవాణిగారి కథలను పుట్టపర్తి నాగపద్మిని హిందీలోకి అనువదించారు. 'ధర్మయుగ్' వంటి హిందీ పత్రికలో, తెలుగు కథల అనువాదాలు, 'గృహశోభ' వంటి పత్రికల్లో నేడు హిందీ కథలకు తెలుగు అనువాదాలు వస్తున్నాయి. హాస్యకథల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందనే చెప్పాలి. మునిమాణిక్యం, భమిడిపాటి, ముళ్లపూడి, ఆదివిష్ణు, యర్రంశెట్టి శాయి, కవనశర్మ, శ్రీరమణ వంటి వారు హాస్య కథలు ఒకప్పుడు విరివిగా రాశారు. ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక ఏటా హాస్యకథల పోటీ నిర్వహిస్తోంది. కానీ గణనీయమైన హాస్య కథానికలు తక్కువే.

ఎప్పుడో పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలి వాన' కథానిక తర్వాత ప్రపంచ స్థాయిలో అలాంటి తెలుగు కథానిక 'ఇదీ' అనే గుర్తింపు రాకపోవటమూ శోచనీయమే!

కథాసమీక్షకై వేదగిరి కమ్యూనికేషన్స్ పక్షాన వేదగిరి రాంబాబు గతంలో ఏడెనిమిది సంవత్సరాలు ఆ ఏడు వివిధ పత్రికలలో వచ్చిన కథలను ప్రముఖులచే సమీక్షింపజేస్తూ గ్రంథాలు వెలువరించారు. ఆ తరువాత ఆ సంవిధానం ఆగిపోయింది. ఏటేటా వచ్చిన కథల్లో ఉత్తమమైన కథలను– కొద్ది సంవత్సరాలు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించి ప్రస్తుతం విరమించుకుంది. 'కథా వార్షిక' పేరిట వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌ల సంపాదకత్వంలోనూ, అలాగే తెలంగాణ కథా సంపుటాలూ వచ్చాయి. రావిశాస్త్రి, చాసో, గోపీచంద్, కొలకలూరి, మధురాంతకం, శాంతినారాయణ, రంగినేని ఎల్లమ్మ, కథాకోకిల, మాడభూషి రంగాచార్య మొదలైన వారి పేర్లతో పలు సంస్థలూ, వ్యక్తులూ కథా రచయితలనూ, కథా సంపుటులనూ ఏటా బహుమతులతో సత్కరిస్తున్న సత్సంప్రదాయం ఉంది. కథా రచయిత 'విహారి' 'పరిచయాలు– పరామర్శలు' పేర ఓ శీర్షికను నిర్వహిస్తూ కొత్త కథలను, కథకులను పరిచయం చేస్తున్నారు. వివిధ పత్రికలలో సుధామ, గుడిపాటి, కె.పి.అశోక్‌కుమార్, జి.రామకృష్ణారావు, గొరుసు, అవసరాల, పద్మ, సౌభాగ్య వంటి సమీక్షకులు కథాసంపుటాలను సమీక్షిస్తున్నారు.

ఒకప్పుడు ఆర్థికస్థాయి లేక పుస్తకాలుగా తమ కథలను ప్రచురించుకోలేక, బాధ్యతలతో కట్టుబడిన ఒకతరం కథకులు ఇప్పుడు జీవితపు వృద్ధాప్య దశలోనయినా పిల్లల సహకారంతోనో, తీరిన బాధ్యతల కారణంగా ఒనగూడిన ఆర్థిక వెసులుబాటు వల్లనో, కొత్తగా కథలు రాయకపోయినా, ఒకప్పటి తమ కథలను గ్రంథరూపంలో వెలువరించుకోవడం ఆనందకరమైన పరిణామమే. అటువంటి కథా సంపుటాలు ఇటీవల బాగానే వస్తున్నాయి.

ఈ నూరేళ్లలో తెలుగు కథానిక పోయిన పోకడలు వైవిధ్యభరితమైనవి. ఎత్తుపల్లాలు, సంచలనాలు అనేకం. తెలుగు కథానిక శతజయంతి సందర్భంగా ఏడాదిపాటు వివిధ జిల్లాలలో సభలు, సదస్సులు వివిధ సంస్థలు నిర్వహిస్తూ వచ్చాయి. వేదగిరి రాంబాబు పడిన శ్రమను ప్రత్యేకించి గుర్తించాలి.

నిజానికి తెలుగుకథానిక అనేక రకాలుగా నేడు విస్తృతమైంది. తొలినాటి తెలుగు కథానికల గురించి 1930 వరకూ ప్రసిద్ధ విమర్శకులు కె.కె.రంగనాథాచార్యులు గారు రాసిన పుస్తకం, అలాగే తెలుగు కథను 1980 వరకు విశ్లేషిస్తూ ఒక గ్రంథాన్ని డా॥ మాడభూషి రంగాచార్య స్మారక సంఘం వెలువరించింది. 'కథాకృతి' పేరిట

విహారిగారు చేసిన వంద విశ్లేషణలు గురజాడకి నివాళిగా శతజయంతి బహూకృతిగా శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ వెలువరించింది.

తెలుగు కథానిక పోకడలపై గత కొద్ది నెలలుగా 'విపుల'–విపుల వ్యాసాలలో స్మరించింది. 2010 జనవరి చివర్లో తెలుగు కథానిక వందేళ్ల పండగ సంరంభాలు, సభలు జరిగాయి. నిజానికి సాహిత్య ప్రక్రియలలో పాఠకులు పట్టించుకుంటున్నదీ, ప్రధానంగా ఆదరిస్తున్నదీ కథానికలనే. కానీ కథానికల గురించిన సాహిత్య విమర్శ మాత్రం కవిత్వానికి వచ్చినంతగా రావడం లేదనే చెప్పాలి. కథా వార్షికలు ప్రచురిస్తున్న సంపాదకులు కూడా వారివారి అభిరుచులకు ఇచ్చిన ప్రాధాన్యం, సంపుటీకరించడంలో వైవిధ్యానికి ఇవ్వడం లేదు. అందువలన కూడా నేడు కథలు ప్రాంతాల వారీగా, వివిధ దృక్పథాల ఇజాల వారీగా విభజించబడి చూడబడుతున్నాయి. కొన్ని పత్రికలలోని మంచి కథలనూ, కొందరు మంచి కథకులనూ ఉపేక్షించే వైఖరి కూడా తారసపడుతోంది. సమగ్రత సాధ్యం కాకపోయినా ఆ దిశగా ప్రయత్నం జరగాలిగా!

ఏమయినా మానవ జీవితమూ, విలువలూ, సంఘమూ, సంఘటనలూ కథలలో ప్రతిబింబితమయ్యేంత గాఢంగా, బలీయంగా, విస్తృతంగా, నైపుణ్యంగా మరో ప్రక్రియలో విశదపరచడం సామాన్యమైన సంగతి కాదు. అందుకే తెలుగుకథ తేజరిల్లుతూనే ఉంటుంది. నూరేళ్లు నిండడం అంటే అంతరించడం కాదు. మరో కొత్త ఉగాదికి ఆరంభం అనే! నవ శతాబ్దికి నాందీ వాచకం అనే! తెలుగు కథాసుధ నవనవోన్మేష జీవనాన్ని పాఠక ప్రపంచానికి సదా అందిస్తూండాలని ఆకాంక్షిద్దాం. సహస్రవర్షగా సాగాలని అభిలషిద్దాం.

(ఆంధ్రభూమి వారపత్రిక, 11 మార్చి 2010)

❖

(24) లిఖిత పత్రికలు

సాహిత్యోపజీవికి పాఠకుడు కావాలి. కథారచయిత, వ్యాసరచయిత ఎవరైనా తన రచన నలుగురూ చదవాలని పాఠకులనుద్దేశిస్తారు. కవిగారికి అదనంగా శ్రోత కావాలి. నాటక రచయితకు ప్రదర్శనమూ, ప్రేక్షకుడూ కావాలి. మొత్తానికి అంతా ఒక గుర్తింపు కాంక్ష.

నాకోసం నేను రాసుకుంటున్నానన్నవాడైనా తన రచన తన దగ్గరే వుంచేసుకోడు. తప్పనిసరిగా ఒకరికి చూపించడమో, చూసేలా చేయడమో చేస్తాడు. అది రచయిత నైజం. అందులో తప్పు పట్టాల్సిందేమీ లేదు. సిరా తడి ఆరకుండానే అచ్చుకు పంపే రచయితలు కొందరైతే, కాలానికి ఆగి తనది తానే చదువుకుని అవసరమైతే చిత్రిక పట్టుకుని బహిర్గతం చేసుకునేవారు ఇంకొందరు. అచ్చులో తన పేర రచన చూసుకోవడం ఎప్పటికీ రచయితలకు ఇష్టమే. అది చదివి పాఠకులు మెచ్చితే సంతోషపడనిదెవ్వరు? గుటెన్‌బర్గ్ అచ్చుయంత్రాన్ని కనుక్కున్నాడు కనుక సరిపోయింది. భావ వినిమయ సాధనమైన భాష లిపిగా అక్షరాకృతి దాలుస్తుంది. సృజన సాహిత్యం. సామాజిక పరిణామ ప్రక్రియల భావజాలం 'పత్రిక' రూపున ముద్రణ రూపంలోకి వచ్చేదాక జరిగిన పరిణామాలు చారిత్రాత్మకమైనవి.

పత్రికల ముద్రణావిస్తృతి లేని కాలంలోనూ భావ వినిమయాభిలాషను తీర్చడంలో, తమ భావాలను నలుగురికీ అందచేయడంలో ఉత్సాహభరితంగా జరిగిన వ్యావృత్తులు అనేకం. ఉత్తరాలు రాసుకోవడం, కరపత్రాలు పంచుకోవడం, గోడమీది రాతలు ఇవన్నీ ఒకప్పటి బలీయమైన మాధ్యమాలు. తమ భావ ప్రచారానికి, సృజన శక్తుల వినిమయానికి, స్వీయ అనుభవానుభూతులకు, పదుగురిలో ప్రత్యేకతకు ఒక అందమైన సాధనంగా తోడ్పడిందే 'లిఖిత పత్రిక'.

చేతిరాతతో పత్రికలు నిర్వహించడం ఎప్పటినుండో వుంది. గోడ పత్రికలు అంటే ఆ గోడ దగ్గరకు వెళ్లి నిల్చుని చదవాలి. లిఖితపత్రిక అంటే కాగితాల మీద

రూపొందించింది కాబట్టి నలుగురి చేతులు మారుతూ అంతా చదువుకునే వీలుండేది. అచ్చులో రాకున్నా లిఖితపత్రికలో తమ రచన నలుగురూ చదువుతారన్న మౌలిక ఆనందం వాటిని నిర్వహించేవారికీ, అందులో రచనచేసే వారికీ కలుగుతుంది.

దేశస్వాతంత్ర్య పోరాటకాలంలో, సామాజిక పరిణామ ప్రక్రియలకు దర్పణంగా, తమ దేశభక్తి, భావదీప్తుల ప్రచోదిత మార్గంగా లిఖితపత్రికలను వెలువరించిన వారున్నారు. రహస్య లిఖిత ప్రతులను బట్వాడా చేసిన అజ్ఞాత విప్లవమూర్తులూ వుండేవారు. అచ్చు పత్రికలున్నా అందరికీ, అందునా సృజనశీలురైన కవులూ, రచయితలు అందరికీ అవి వేదికలు కావడం, అన్నిరకాల రచనలనూ ప్రోత్సహించడం అనుకున్నంత సులువేమీ కాదు. అందుకే సృజనశీలురైన కవులు, రచయితలు కొందరు లిఖితపత్రికలు నిర్వహించేవారు.

కవిత్వమో, కథో తమకు రాసే అలవాటులేకున్నా అందమైన చేతిరాతగల కొందరు సంపాదకులుగా, మిత్రులను సమీకరించి– వారు రాసే కథలు, కవితలు, వ్యాసాలతో, చిత్రకారుల బొమ్మలతో లిఖితపత్రికలు నడిపేవారు. మరీ ముఖ్యంగా చిన్నప్పటినుంచే సాహిత్యాభిరుచిని, రచనాభిలాషను పెంపొందింప చేయడానికి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తరగతి విద్యార్థుల రచనలతో ఇలాంటి లిఖిత పత్రికలను రూపొందించేవారు. అలాగే ఆసక్తిగల సాహిత్య యువబృందాలు తమ రచనలతో అలంకరిస్తూ లిఖిత పత్రికలు తెచ్చేవారు. ఒక వార్షిక సంచికగానో, నిర్దుష్ట వ్యవధిని నిర్దేశించుకునో అలా లిఖిత పత్రికా నిర్వహణం చేసిన వారున్నారు. అయితే ఎవరెవరు ఏయే లిఖిత పత్రికలను రూపొందించిందీ ఈనాడు చెప్పడం చాలాకష్టం. ఆ సంచికలను భద్రపరచడం కూడా వారివారికి అందరికీ సాధ్యమైన విషయం కాకపోవచ్చు. లిఖితప్రతులు తొందరగా చినిగిపోయి, కాగితాలకు అవి సిరాతో రాసినవి కనుక వెలసిపోయి అక్షరాలు చెరిగిపోయే ప్రమాదం, స్ఫుటంగా కనబడలేని స్థితి కలగడం సహజం.

తమ గురించి, తమ అనుభవాలు జ్ఞాపకాల గురించి వారు రాసుకున్నప్పుడు, స్వీయచరిత్రలు, జీవితచరిత్రలు అచ్చు రూపంలో వెలువడినప్పుడు వాటిల్లో ప్రస్తావించి వుంటే వారి అభిరుచులు, ఆయా లిఖిత పత్రికల వైనం తెలిసే వీలుంటుంది. అయితే భవదీయ వ్యాసరచయిత స్వయంగా లిఖిత పత్రిక నడపడం, జంటనగరాల లిఖితపత్రికల సమాఖ్య నెలకొల్పి నిర్వహించారు కనుక, తెలిసిన మేరకు కొన్ని అలాంటి ఆసక్తికర అంశాలను ఉటంకించడమే ఇక్కడ ఉద్దేశ్యం.

ఒక్క తెలుగులోనే కాదు. ఇతర భాషల్లోనూ ఇలాంటి లిఖిత పత్రికలు వున్నాయి. సాహిత్యాభిలాషతో ఎందరో వాటి నిర్వహణలో భాగస్వాములయ్యారు. అయితే ఎక్కువగా లిఖిత పత్రికలు సాహిత్యాసక్తిగల పిల్లలు, వర్ధిష్ణు రచయితలైన యువకులు నిర్వహించినట్లు తెలుస్తోంది. అలా లిఖిత పత్రికల నుండి ఎదిగి అనంతరకాలంలో లబ్ధ ప్రతిష్ఠులైన రచయితలు, వివిధ రంగాల ప్రముఖులు ఎందరో వున్నారు.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలైన ప్రముఖుల్లో 'అజ్ఞేయ్' పేరున ప్రసిద్ధి చెందిన సచ్చిదానంద్ హీరానంద్ వాత్సాయన్ తన పదకొండవ ఏటనే 'ఆనంద బిందు' అనే లిఖిత పత్రికను 1921 లో నిర్వహించారు. అలాగే జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన అస్సామీ రచయిత బీరేంద్ర కుమార్ భట్టాచార్య జోర్హాట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా తోటి మిత్రులు నడిపిన లిఖిత దినపత్రికలో, లిఖిత మాసపత్రిక లో రచనలు చేస్తూ అప్పట్లో బాల రచయితలకై నిర్దేశించిన బంగారు పతకం పొందారు. 1973 లో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కన్నడకవి ఆ ఏటి అవార్డును ఒరియా రచయిత గోపీనాథ్ మహంతితో పంచుకున్నారు. ఆ కన్నడకవి అయిన డా॥ దత్తాత్రేయ రామచంద్ర బేంద్రే ధార్వాడ్‌లో 18 ఏళ్ల ప్రాయంలో 'కర్ణాటక మిత్ర' అనే హస్త లిఖిత పత్రిక నడుపుతూ 1919 లో 'వాగ్భూషణ' పత్రికా సంపాదకులయ్యారు. ఆ మాటకు వస్తే 1897 లోనే జార్జ్ హెండర్ సన్ థామస్ జాన్‌స్టోన్ చేతిరాతతో 'క్విల్' అనే లిఖిత పత్రికను లెదర్ బైండింగ్ చేయించి వెలువరించాడట!

'కవిత్వమొక తీరని దాహం' అని శ్రీశ్రీ అన్నట్లు– సాహితీ పిపాసులకు లిఖిత పత్రికలు ఆ దాహం తీరిన తృప్తినిచ్చేవని చెప్పుకోవచ్చు. తెలుగు రచయితలూ, కవులూ ఎందరో లిఖితపత్రికలతో ముడిపడినవారున్నారు. వివిధ కళారంగాల ప్రముఖులూ లిఖిత పత్రికలతో సంబంధితులై వుండేవారు.

రాజమండ్రిలో వీరేశలింగం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులైన జయంతి గంగన్న (1884–1962) కళాసమితి అనే చిన్న వాఙ్మయ సంఘం స్థాపించి 1926 లో ఒక రాత పత్రికను బయలుదేరదీసి రాసిన వ్యాసాలను బైండుచేసే వాళ్లం అని సాహితీవేత్త టేకుమళ్ల కామేశ్వరరావుగారు రాశారు. 'అయ్యో కొయ్యోడ' అనే హాస్య జానపదగీతం జయంతి గంగన్నగారు రాసిందేనట. ఆచంట వెంకట సాంఖ్యాయన శర్మ (1864–1934) ఒక లిఖిత పత్రిక నిర్వహించారని, అనంతరం ఆయన వెలువరించిన సుజనమోదిని (1903), కల్పలత (1921), పత్రికల్లో కేవలం ఆయన రచనలే ముద్రించుకునేవారనీ తెలుస్తోంది.

ఉత్సాహవంతులైన యువకులు తమ సాహితీ ప్రియత్వానికి లిఖితపత్రికలను బాసట చేసుకుని రచనలు వెలువరించేవారు. వాటిల్లో సచిత్ర లిఖితపత్రికలూ వుండేవి. అందమైన బొమ్మలు, ముత్యాల కోవలాంటి చేతిరాతతో స్నేహబృందాలనూ, గ్రంథాలయ పాఠకులనూ అలరించిన లిఖితపత్రికలుండేవి. కుల పత్రికలు కూడా వెలువడినట్లు తెలుస్తోంది.

1960-70 దశకంలో తెలుగులో అచ్చుపత్రికలు ఎన్ని వుండేవో అంతకు మించి లిఖిత పత్రికలూ వుండేవి. హైదరాబాద్ మలక్‌పేట ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏడవ తరగతిలో వుండగానే తరగతి విద్యార్థులం 'విజ్ఞానజ్యోతి' అనే లిఖిత పత్రికను 1961 లో నిర్వహించాం. విద్యార్థుల చిట్టికథలు, గేయాలు, వచ్చీరాని బొమ్మలు అందులో వుండేవి. ఆంధ్ర బాలానంద సంఘం నల్లకుంట విద్యానగర్ శాఖ 'విశ్వకవి విజ్ఞానకేంద్రం'గా వ్యవహరింపబడుతూ దాని నిర్వాహకులైన జె.పూర్ణచంద్రరావుగారు ఓ లిఖిత పత్రిక నడిపేవారు.

'సుధామ'గా కలంపేరు పెట్టుకుని నేను సంపాదకునిగా, నేటి ప్రముఖ స్త్రీవాద కవయిత్రి జయప్రభ భర్త అయిన విశ్వనాథ సూర్యనారాయణ, మా అన్నయ్య 'రాధాయి' (అల్లంరాజు రాధాకుమార్) ఉపసంపాదకులుగా 1967 మే లో 'యువమిత్ర' అనే లిఖితపత్రిక ప్రారంభించాం. నేను పుట్టకముందే మద్రాసు త్యాగరాయనగర్‌లోని ఆంధ్రాభ్యుదయసమితి వారు 26.1.1951 న వెలువరించిన 'ఉదయం' అనే సచిత్ర మాసపత్రిక లిఖితప్రతి తొలి సంచిక నా కంటబడింది. బాలశౌరిరెడ్డి, సేతు మాధవరావు, కాశీరత్నం మొదలగు ఎనిమిది మంది సంపాదకవర్గంతో వచ్చిన ఆ సచిత్ర లిఖిత పత్రిక సంపాదకీయ స్వవిషయం వుత్తేజితుడిని చేసింది.

1967 లో నేను ప్రారంభించిన 'యువమిత్ర' సచిత్ర లిఖిత మాసపత్రిక మధ్యలో స్వల్ప విరామాలు తీసుకున్నా దాదాపు పదేళ్లు నెలనెలా వెలువడింది. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో, గాంధీ స్మారకనిధి గ్రంథాలయంలో, మలక్‌పేట అమర్‌జవహర్ బాలానంద సంఘంలో ఆ లిఖితపత్రిక ప్రతి నెలనెలా, వారం, పదిరోజులు వుంచి రొటేట్ చేసేవాళ్లం. సంచిక చివర ఒక చిన్న తెల్లకాగితాల పుస్తకం వుంచి పాఠకులను సంచికపై, సంచికలోని రచనలపై అభిప్రాయాలు రాయమనేవాళ్లం. 1974 నాటి జనవరి సంచికలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన నేటి డా॥ సి.నారాయణరెడ్డిగారు 'యువమిత్ర ముద్రిత పత్రికలు ముఖం చూసుకోదగిన అద్దం' అని ప్రశంసించడం,

అలాగే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్యదర్శిగా పనిచేసిన కీర్తిశేషులు ఇరివెంటి కృష్ణమూర్తిగారు 'యువమిత్రను ఇంత అందంగా మలచగలిగిన మీ లేఖిని యంత్రాలను ఎగతాళి చేస్తోంది. కళ యంత్రబద్ధం కానంత వరకు తపస్సే' అనడం– వారి చేతిరాతలోనే ఆ లిఖితపత్రిక సంచికలో నమోదు అయివున్నాయి. యువకులు, యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు ఎందరో యువమిత్రను చదివేవారు. రచనలు పంపేవారు. తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్స్‌లర్, కవి డా॥ ఎన్.గోపి, కవి, విమర్శకులు డా॥ అమ్మంగి వేణుగోపాల్ యువకులుగా యువమిత్ర కార్యాలయానికి వచ్చి రచనలు ఇవ్వడం, అమ్మంగి రాసిన 'ఇరుకులు' అనే కథ లిఖితపత్రికలో రావడం ఒక స్మృతియే! అప్పట్లో మద్రాసులో క్యాలెండర్ కంపెనీలో పనిచేస్తూ క్యాలెండర్ బొమ్మలు రూపకల్పన చేసే కొర్తి ధర్మారావు 'యువమిత్ర' పత్రికను చూసి ముచ్చటపడి, ప్రథమ వార్షికోత్సవ సంచికకు– ఆయిల్‌కలర్స్‌తో తాను ముఖచిత్రం వేశారు. మురళి, శంకర్ వంటి చిత్రకారులు 'యువమిత్ర'లో బొమ్మలు వేశారు.

ఆ కాలంలోనే జంటనగరాల నుండి వి.మధుసూదనరావు– 'యువతార', జీడిగుంట కామేశ్వరరావు, వెంకట్రావుల– 'యువసాహితి', 'యువబాల', వి.హనుమంత రావు, కన్నోజు లక్ష్మీకాంతంల– 'సాహితీ లత', ఇంకా కళ, బాల, కవిత, మెరుపు అలాగే యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ 'యువభారతి' వంటి లిఖిత మాస పత్రికలు ఎన్నో వచ్చాయి. ప్రముఖ నటులు కొంగర జగ్గయ్య 'శోభ' అనే లిఖిత పత్రికను యువకులుగా నిర్వహించారట. దుర్గానంద్ కుమారులు అంబికానంద్, జి.వి.పూర్ణచంద్ కలిసి నూజీవీడు నుండో, భీమవరం నుండో 'మేఘమాల' అనే లిఖితపత్రిక తెచ్చారు. చొక్కాపు వెంకటరమణ, జీడిగుంట రామచంద్రమూర్తి వంటివారు లిఖిత పత్రికల నిర్వహణ చేసినవారే!

జంటనగరాల్లో 1960 ల కాలంనుండీ చాలా సంవత్సరాలు వెలువడిన లిఖిత పత్రికలన్నింటినీ ప్రతి ఏటా పరిశీలించి ఆ ఏడాది వచ్చిన పత్రికల కథల్లో ఉత్తమమైన వాటికి యువమిత్ర సారథ్యం వహించి జంటనగరాల లిఖిత పత్రికల సమాఖ్య నెలకొల్పి బహుమతులిచ్చేది.

లిఖిత పత్రికల నిర్వహణం– ఆసక్తి, ఉత్సాహం, అభినివేశంతో, ప్రత్యేకంగా సాగేవే. మంచి చేతిరాత లిఖితపత్రికకు ముఖ్యఆకర్షణ. కవితలు, కథలు, బొమ్మలు, సీరియల్స్‌తో అచ్చు పత్రికలకు తీసిపోని విధంగా కొన్ని లిఖిత పత్రికలుండేవి. 1990 ప్రాంతాల్లో కూడా సెయింట్‌జోసఫ్ పబ్లిక్ స్కూల్ తరగతి విద్యార్థులు లిఖిత పత్రిక

నడిపిన వార్త వుంది. కొన్ని కాగితాలు, రంగులు, తీరిక సమయం సద్వినియోగం చేయడం ఇవే ప్రధానమైన పెట్టుబడులు. సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసే కుతూహలం గల వారెవరైనా కొందరు కలిసి, లిఖితపత్రికలను నిర్వహించడం జరుగుతుండేది. కార్బన్‌పేపర్లు పెట్టి రాసి రెండు, మూడు ప్రతులు చేసేవారు కొందరైతే, ఆ తరువాత సైక్లోస్టయిల్ మిషన్ వచ్చాక సైక్లోస్టయిల్ లిఖిత పత్రికలు వచ్చాయి. 1980 ల్లో శ్రీ పద్మాంజలి నవ్యకళావాహిని 'మానవత' అనే సచిత్ర మాసపత్రికను సైక్లోస్టయిల్ పత్రికగా తేగా, కవితా సంకలనంగా సైబ పరంధాములు చేతిరాతతో, బొమ్మలతో, కవిత్వంతో ఎ.సూర్యప్రకాశ్, వెన్ను గంగాధర్, స్వాతి శ్రీపాదలతో 'చౌరస్తా' అనే సంకలనం వెలువరించారు. నాడు అది ఒక సంచనలమే.

లిఖిత పత్రికలకు పాఠకుల సమాదరణ ఎంతగా వుండేదంటే యువమిత్ర లిఖిత మాసపత్రికలోని కథ ఒక దానిని ఆ రచయితే– నాడు విజయవాడ నుండి వెలువడే 'ప్రగతి' వారపత్రికకు పంపగా, వారది ముద్రించగా– మరుసటి వారం పాఠకుడొకరు అది కాపీ కథ అనీ, యువమిత్ర లిఖిత మాస పత్రికలో అంతకుముందే వచ్చిందనీ ప్రగతికి లేఖ రాయడం, వారు దానిని ప్రచురించడం ఒక విశేషం! సైక్లోస్టయిల్ మాసపత్రికలు కూడా లిఖిత పత్రికల వంటివే. అయినా రంగుల్లో లేకపోయినా ప్రతులు ఎక్కువ తీసుకునే వీలుండేది. మాక్జిమ్ గోర్కి 'మదర్'ను అమ్మ పేరిట నవలగా అనువదించిన క్రొవ్విడి లింగరాజుగారు 1922 లోనే మార్చి 22 న 'ఆంధ్ర యువజని' పేర సైక్లోస్టయిల్ లిఖిత మాసపత్రిక వెలువరించగా, మద్దూరి అన్నపూర్ణయ్యగారి సంపాదకత్వాన 1929 మార్చి 16 న 'కాంగ్రెస్' అనే తెలుగు వార పత్రిక లిఖిత సైక్లోస్టయిల్ పత్రికగా వచ్చింది. రాజమండ్రి నుండి 1938 లో 'నవశక్తి' పేరిట తొలి వామపక్ష పత్రిక తొలుత లిఖిత పత్రికగానే మొదలయింది.

ఇంకా వెలుగులోకి రాని లిఖిత పత్రికల సమాచారం ఎంతగానో వుండే వుంటుంది. పరిశోధక విద్యార్థులెవరైనా పూనుకుని 'లిఖిత పత్రిక'ల గురించి సిద్ధాంత గ్రంథమే వెలువరించవచ్చు. సాహిత్యాభిలాష, పఠనాభిలాష, రచనా ప్రతిభ, చేతిరాత అభివృద్ధికి లిఖిత పత్రికలు పోషించిన పాత్ర అవిస్మరణీయమైనది. సాహిత్య, చైతన్య శీలమైన ఆనాటి బాల, యువ ప్రజాశక్తిలో లిఖితపత్రికల ఉనికి గణనీయమైనది. చారిత్రాత్మకమైనది.

(ప్రజాశక్తి దినపత్రిక, ఆదివారం అనుబంధం 23 మే 2010)

❖

(25) పాటలో ఏముంది...

భారతీయ సాహిత్యవేత్తలలో డా॥ సి.నారాయణరెడ్డి ఒక విలక్షణమైన ప్రతిభామూర్తి. ఆయన నిరంతర కవి, ఉత్తమ అధ్యాపక ఆచార్యులు, సృజనాత్మక విమర్శకుడు, పరిపాలనాదక్షుడు, రాజకీయాల్లో సాంస్కృతిక రాయబారి, గొప్ప వక్త, జనం నాల్కల మీద కదలాడే అనేక సినీగీతాల జనరంజక సినీకవి. ఇన్ని లక్షణాలు పుణికిపుచ్చుకుని అన్ని వర్గాలవారికీ ఆమోదయోగ్యుడై, విశ్వనాథ వారి తరువాత తెలుగుకు నాటి నుంచి నేటివరకు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతగా నిలిచిన ఏకైక సజీవ సృజనమూర్తి.

సినీకవిగా డా॥ సి.నారాయణరెడ్డిగారు తన సినిమా పాటల నేపథ్యాన్నీ, ఆ పాటల విశేషాలనూ, విశ్లేషణలనూ తామే స్వయంగా వివరిస్తూ రాసిన 'పాటో బయోగ్రఫీ' (స్వీయ సినీగీత చరిత్ర) 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది'. రెండు భాగాలుగా వెలువడిన ఈ విలక్షణ గ్రంథం మొదటి సంపుటి (1962–1974) తనను సినీకవిగా చలనచిత్రరంగానికి పరిచయం చేసిన నటమౌళి నందమూరి తారకరామారావు ఆత్మీయస్మృతికే అంకితం కావడం విశేషం. బహుశా మరే భాషలోనూ ఏ సినీగేయకవీ ఇలాంటి గ్రంథం రాసిన దాఖలాలు లేవు. తెలుగులో ఒక సినిమాకవి పాటల సంకలనం వెలువడడం కూడా తొలిసారిగా దక్కించుకొన్న ఘనత నారాయణరెడ్డిగారిది! యువభారతి సంస్థ 'పగలే వెన్నెల' పేరిట 1976 లోనే నారాయణరెడ్డిగారి 125 పాటలను 'ప్రణయవల్లరి, ప్రకృతి సుందరి, మువ్వలరవళి– మోహనమురళి, నివాళి, వేదనాఝరి, సందేశలహరి, నవ్వుల పందిరి, లేతజాబిలి, జానపద మాధురి, మిశ్రమంజరి' అనే పది ప్రకరణాలుగా వింగడించి ఆయా రసభావదీప్తుల చిత్రగీతాలను సంకలనంగా ప్రచురించింది. దానికి ముందుమాట– 'వెన్నెల అంగడి–వెండిత్రాసు'లో రావూరు వెంకట సత్యనారాయణరావు గారిలా అంటారు–

"పాటకు ప్రాణాలు రెండు. ఒకటి వాణి! రెండు బాణి! ఒకదానితో ఒకటి పోటీపడుతూ వుంటాయి. ఒకప్పుడు ఒకదానికంటే ఒకటి పైచేయిగా మారి మాధుర్యాన్ని అందచేస్తూ వుంటాయి. రెండూ అన్నచెల్లెళ్లలాగా అన్యోన్యతగా సంచరించాలి. పరస్పర గౌరవాన్ని ప్రసాదించుకోవాలి అంతేగాని అత్తాకోడళ్ళ సరళి ప్రమాదకరం.

రెడ్డిగారి పాటలలో ఇలాంటి ఇబ్బంది లేదు. ఆయన మాటలు సంగీతాన్ని మచ్చిక చేసుకుంటాయి. మాలిమితో కులుకుతూ ముందుకు సాగుతాయి. మాధుర్యాన్ని గుమ్మరిస్తాయి. మనసుల్ని అలరిస్తాయి. రెడ్డిగారి పాటలలో ప్రతిపంక్తి ఒక సరళిని గుర్తుకు తెస్తూ మరొక సరళికి ముడిపెడుతూ వుంటుంది. నారాయణరెడ్డిగారు కనిపించని గాయకుడు. భాషా పరంగా చూస్తే గొప్ప వైతాళికుడు".

నిజమే! నారాయణరెడ్డిగారు తన మాట పాటై మోగాలని, పాటమాటై నిలిచి పోవాలని తపనపడే సృజనశీలి.

మాటకు దండం పెడతా– పాటకు దండం పెడతా
మాటను పాటను నమ్మిన– మనిషికి దండం పెడతా

అని తన షష్టిపూర్తి ఉత్సవంలో పలికారాయన. 1963 లోనే గుంటూరులో జరిగిన ఒక పౌర సన్మానసభలో–

ఎన్ని తెన్నుల కైతకన్నె విహరించినను
పాటలోనే నాదు ప్రాణాలు గలవందు

నని సూటిగా పలికారు. 'పల్లె నాకు పాటనిచ్చింది. పట్నం నాకు మాట ఇచ్చింది' అని చెప్పుకున్నారాయన. పాట ఆయన ఒంట పుట్టింది. వెంటపడి తెచ్చుకున్నది కాదన్నారు. పదవతరగతి వరకూ గ్రాంఫోన్ రికార్డయినా విననివ్యక్తి ఇవాళ పదికాలాల పాటు పదిమందీ చెప్పుకునే పాటల రచయితగా ఖ్యాతి గాంచడం వెనుక ఉన్నది ఆయన కృషే! చిన్నప్పుడు చాలాకాలం తాను కొన్ని సినిమా పాటల పుస్తకాలు భద్రపరుచుకున్న అభిలాషి ఆయన.

ఓ సినిమా చూసినప్పుడు అందులోని పాటల పల్లవులు నాల్కమీద మెదలుతూ వుంటే, వాటికి దీటైన వేరే పంక్తులు మనసులో కదలాడేవనీ, ఆశువుగా అల్లుకునే గుణం వుండేదనీ ఆయనే చెప్పుకున్నారు. ఇప్పటికీ చాలామంది ప్రసిద్ధ పాటల

వరుసల్లో భక్తిగీతాలు కూర్చడం చేస్తుంటారు. 'ఏడు కొండల మీద వెంకటేశ' అంటూ 'పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లా' బాణీలో రాసుకునే వారూ కనబడుతుంటారు.

హైదరాబాద్‌లో ఇంటర్ మీడియట్ చదువుతున్న రోజుల్లో నారాయణరెడ్డిగారు ఎక్కువగా హిందీ సినిమాలు, ఒకటికి నాలుగుసార్లు 'బాలనాగమ్మ' వంటి చిత్రాలు చూశారు. హిందీ పాటల ట్యూన్‌లకు తెలుగు పదాలు తొడిగి సరదా ఫీట్లు చేసేవారు.

గాయె చలాజా గాయె చలాజా
ఏక్ దిన్ తేరభీ జమాన ఆయెగా

అనే ఒక హిందీపాట పల్లవిలో ఆయనకూ, ఆయన సన్నిహిత మిత్రులు మా యువభారతి అధ్యక్షులు ఇరివెంటి కృష్ణమూర్తికీ– ఏక్‌దిన్ + తేరభీ అనే విరుపు నచ్చలేదు. అందుకు డా॥ సి.నారాయణరెడ్డిగారు వెక్కిరింతగా ఇలా అన్నారు దూకుడుగా–

పాట పాడుబే పాట పాడుబే
ఒక్కనాడ్ నీదిభీ బొక్కలిరుగు బే

ఆయనే వివరించినట్లు "ఇందులోని తమాషా ఏమిటంటే 'గాయె చలాజా' కాస్త నచ్చింది అయినా మిగతాది నచ్చకపోవడం వల్ల 'పాట పాడుకో' అనడానికి బదులు 'పాటపాడుబే' అనడం, ఆ తరువాత దూషణస్థాయికి దిగడం కుర్రతనం గాక ఏమవుతుంది? అయితే ఇందులో బాణీ దృష్ట్యా ఒక తమాషా వుంది 'ఏక్‌దిన్' అనేదానికి 'ఒక్కనాడ్' అనడం, ఆ తరువాత తిక్కముదిరి 'బొక్కలిరుగు బే' అనడం. బొక్కలంటే తెలంగాణాలో 'బొమికెలు'.

సినిమా పాటల్లో వుండే పంక్తుల్లాంటివి ఇంటర్మీడియట్ దశలోనే ధారాళంగా పలికారు. "పల్లెటూరులే భారత భూమికి బంగరుటేరుల ఊటలురా– పల్లెటూరులే ప్రపంచ మానవ కల్యాణానికి బాటలురా" అని రాసారు విద్యార్థి దశలోనే. 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' మొదటి సంపుటంలో సినారె సినీకవిగా రూపొందడానికి గల ప్రాతిపదికలు ఆయనే వివరించారు.

"ఇప్పుడనిపిస్తూంటుంది నాకు. ఆంధ్రప్రాంతంలో నేను జన్మిస్తే అంతకు నాలుగయిదేళ్ల ముందే చెప్పుకోదగ్గ కవిగా రూపుదిద్దుకునే వాణ్ణని. అయితే ఒకరకంగా నాటి ఉర్దూ చదువులతో మేలే కలిగింది. ఉర్దూ గజళ్ల సౌందర్యాన్ని ఒంట బట్టించుకోవడం వల్ల నా తెలుగు గీతాల్లో ఒకరకమైన విలక్షణత ఏర్పడింది".

ఆ మాట అక్షరాలా సత్యం. మిగతా తెలుగు సినీగేయ రచయితల్లో నారాయణ రెడ్డి కలం, గళం సాధించిన బహుముఖీనత విలక్షణమైది, విశిష్టమైనది. పైగా గేయ రచయితగా సినీరంగ ప్రవేశానికి ముందే ఆయన 'నాగార్జున సాగరం', 'కర్పూరవసంత రాయలు' వంటి అద్భుత గేయకావ్యాలు రాశారు. 'ఋతుచక్రం'తో ఆరు ఋతువుల కాలాన్ని అందంగా మధ్యతరగతి జీవి బ్రతుకుతో స్వానుభవంగా కవితాత్మకం చేశారు. బి.ఎన్.రెడ్డిగారు ఒక దశలో 'కర్పూర వసంతరాయలు' చలనచిత్రంగా రూపొందించ సంకల్పించారట కూడాను.

డా॥ సి.నారాయణరెడ్డిగారు ఆకాశవాణికి అనేక లలితగీతాలు, గేయనాటికలు, సంగీతరూపకాలు రచించి, అప్పటికే అసంఖ్యాక శ్రోతల ఆదరణ నందుకున్నారు. 'ప్రవేశిస్తే సింహద్వారం ద్వారానే ప్రవేశించాలి గదా' అని తొలిచిత్రంలో అన్ని పాటలూ రాసే అవకాశం వస్తేనే దిగాలని సంకల్పించినందువల్లనే 10 మార్చి 1960 లో 'గులేబకావళి కథ' చిత్రానికి పాటలు రాసేందుకు మద్రాసులో అడుగుపెట్టారు. ఆ మోపిన పాదం అసంఖ్యాక చలనచిత్రాభిమానుల ఆమోదం పొంది ఆరాధ్యమయ్యేలా పాటల రచనా పాటవంతో అభినందనీయమయ్యింది.

'సినీకినారే సినారే' అని ఆయన సినీకవిగా రూపుదాల్చిన వార్త ఆంధ్రపత్రిక కెక్కింది. సి.నారాయణరెడ్డిగారికి సినీకవిగా 2010 స్వర్ణోత్సవ సంవత్సరం. 1962 లో విడుదలైన చిత్రం లగాయితు 1974 లో అల్లూరి సీతారామరాజు చిత్రం వరకు వివిధ చిత్రాలకు తాను రాసిన పాటలను గురించి మొదటి సంపుటంలో నారాయణ రెడ్డిగారు ఎంతో వివరంగా రాసారు. 'తారీఖులు దస్తావేజులు ఇవి కాదోయ్ చరిత్రసారం' అన్నట్లు తేదీలు పట్టికలు కాక, ఆ పాటలు రాయడం వెనుకగల నేపథ్యం, అవి రూపుదిద్దుకున్న వాతావరణం, ఆ పాటలకు సంబంధించిన సంగీతపరమైన రాగతాళ విశేషాలు, సంగీత దర్శకులు, గాయనీ గాయకులు, ఆయా పాటలు రాసిన సందర్భాలలో నిర్మాత, దర్శకులతో గల జ్ఞాపకాలు వివరిస్తూ పాట రచనలోని కృత్యాద్యవస్థల నుండి కృతకృత్యమైన ఘనవిజయాల వరకూ ఎంతో పఠనయోగ్యంగా రచించారు. ఎన్ని పాటలు! అవి రూపొందడంలో ఎన్ని పాటులు! పాటవంతో వాటిని కొనుగోట మీటి, దాటి, ధాటీగా సాధించిన వెన్ని విజయాలు!

కథానుగుణంగా, పాత్రోచితంగా, సన్నివేశాన్ని అనుసరించి, సందర్భశుద్ధితో నవరసభరితమైన గీతాలు అనేకం రూపొందడం వెనుక డా॥ సి.నారాయణరెడ్డిగారు వివరించిన కథనాలు చదువుతుంటే ఆయన వెంట నడుస్తూ, ఆ కబుర్లు వింటూ

ఒక రసమయ లోకంలో విహరిస్తున్న అనుభూతి కలుగుతుంది. అంతేకాదు ఈ గ్రంథం చదవడం వలన గాయనీ, గాయకులు, సంగీతాభిమానులు సాహిత్య సంగీత సమలంకృతమైన ఒక వాణీ స్వరూపాన్ని సాక్షాత్కరించుకొని సంతోషాంతరంగితులవుతారు.

సాంఘిక చిత్రాలు, జానపదాలు, చారిత్రాత్మకాలు, పౌరాణికచిత్రాలు ఇలా ఆయన రాసే కాలంలో చలనచిత్రాలలో ఎన్నో వైవిధ్యభరితమైనవి, ప్రయోగాత్మకమైనవి కూడా రూపొందింపబడ్డాయి. అవకాశాలను అందిపుచ్చుకుని తన ప్రతిభను ఆవిష్కరించి జనం గుండెల్లో నిలిచిపోయే పాటలనెన్నిటినో ఆయన అందించారు. సినీగీతానికి సాహిత్యస్థాయిని నిలిపిన కవుల్లో నారాయణరెడ్డిగారొకరు. అదే సమయంలో నిరక్షరాస్యులైన పామరుల గుండెలను కూడా ఊయలలూపే హుషారైన గీతాలు ఎన్నో రాశారు. నిజానికి జానపదం పలుకుకు తన గీత రచనతో సాహిత్య స్థాయినిచ్చి గుబాళింపచేసినది సినారె.

'నన్ను దోచుకొందువటే' అంటూ తానే సినీగీత సరస్వతి హృదయం దోచుకున్న పాటలరేడు తాను. 'పగలే వెన్నెల జగమే ఊయల' అన్నా, 'దాచాలంటే దాగదులే దాగుడు మూతలు సాగవులే' అన్నా, 'నీటిలోనా నింగిలోనా నీవె వున్నావులే' అన్నా అది ఆయన కీర్తికాంత వైభవమే! వలపు గీతాలకు, వగలరాణి పట్ల భావుకతకు, ప్రణయోన్మీలనానికి ఆయన కలమే సాటి! 'నీ చేయి తాకగానె ఏదొ హాయి రగిలెను' అని వలపు పాటలు సినారె ముందు సిగ్గుపడతాయి. 'ఎవరికి తెలియదులే ఇంతుల సంగతి', 'నాంపల్లి స్టేషన్ కాడ జాంపండ్లు బాగుంటాయే', 'పలకరించితేనే ఉలికి ఉలికి పడతావు', 'ఊc! అను, ఊc ఊc! అను. ఔనను ఔనౌనను', 'అంతగా ననుచూడకు. మాటాడకు' అంటూ మామూలు మాటల్లో అంత ప్రణయభావనలు పలికించిందాయనే. 'ఈ నల్లని రాలలో ఏ కన్నులు దాగెనో' అని శిల్పప్రకృతిని చెక్కిందాయనే.

యుగళగీతాల్లో ఆంగిక సాత్త్వికాభినయాలను ప్రవేశపెట్టడం, శాస్త్రీయ నృత్య గీతాలను సన్నివేశ కల్పన చేయడం జరిగినప్పుడు వాటికి నారాయణరెడ్డిగారు అందించిన పాటలు అనితర సాధ్యాలనిపిస్తాయి. నటభైరవి రాగచ్ఛాయలో 'పెదవులపైన సంగీతం– హృదయంలోన పరితాపం' వంటి విషాదగీతం, 'ఎవరికీ తలవంచకు ఎవరినీ యాచించకు' అనే వ్యక్తిత్వ వికాసగీతం, 'అన్నయ్య సన్నిధి అదే

నాకు పెన్నిధి' అనే అనురాగ గీతం, 'అయ్యయ్యో బ్రహ్మయ్య అన్యాయం చేశావేమయ్యా' వంటి తమాషా గీతం, 'ఇదేనా మన సంప్రదాయమిదేనా' అనే ప్రబోధగీతం, 'మానవ జాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ' అంటూ స్త్రీ ఉదాత్త చిత్రణ గీతం వంటి పాటల వెనుక విశేషాలు ఈ సంపుటిలో చదువుకోవచ్చు. అలాగే సినారె మాటలు పాటలూ కూడా రాసిన 'ఏకవీర' చిత్రగీత విశేషాలు అలరిస్తాయి. 'జగమే రామమయం అగణిత తారక నామమయం' వంటి భక్తి గీతం, 'వలచిన మనసే ఆలయం' వంటి సుహృద్భావగీతం కబుర్లున్నాయి.

ఇలా చెప్పుకుంటూ పోతే ఈ సంపుటిలోని ప్రతి గీతాన్నీ పేర్కొనాలనే లౌల్యంలో పడే ప్రమాదం వుంది. పాట రాయడం ఓ ఎత్తు! ఆ పాట రాసిన నేపథ్యం వివరించ గలగడం ఓ ఎత్తు! ఏ చిత్రాలలో ఏఏ పాటలను ఏఏ సందర్భాలలో, ఏఏ రీతులలో రాసినదీ, ఆ పాటల్లోని విశేషాలు కథాగతంగా, పాత్రగతంగా, సన్నివేశంగా ఎలా ఇమిడిపోయి రాణించిందీ ఇందులో వివరించారు. 1974 తరువాత చిత్రగీత విశేషాలతో మరో సంపుటి వెలువడింది. కానీ ఈ ప్రథమ సంపుటిలోనే రచనా ప్రణాళికకు బీజావాపనం జరిగింది. వివరించే ఒక ప్రవాహ సదృశ శైలి ఏర్పడింది. భావి పరిశోధకులకు, వర్ధిష్ణు గాయనీ గాయకులకు, పాటల రచనాభిలాషులకు ఈ సంపుటి ఒక ఆకర గ్రంథం. చలనచిత్ర గీతాభిమానులందరికీ ఒక సాహిత్య ఉపాయనం.

('నిరంతర సాహితీమూర్తి, సినారె', గ్రంథం- జూలై 2010)

❖

(26) గోరాశాస్త్రి నుంచి ఎం.వి.ఆర్. శాస్త్రి వరకు

చాలామంది అనే మాటే కావచ్చు. కానీ ఒక వ్యక్తికి యాభై సంవత్సరాలు అనే విషయం కన్నా, ఒక సంస్థకు అందునా ఒక దినపత్రికకు నిరంతరాయంగా యాభై సంవత్సరాల మనుగడ అనేది సామాన్యమైన విషయమేమీ కాదు. ఆంధ్రభూమి దినపత్రికకు యాభై ఏళ్లు అంటే అది ఒక ఆనందదాయకమైన అభ్యుదయకరమైన విషయం.

తెలుగులో దినపత్రికలు అంటే కేవలం ప్రభ, పత్రిక మాత్రమేగా చెలామణి అవుతున్న రోజుల్లో అదీ మద్రాసు కేంద్రంగా కాక, తెలుగుల రాజధాని హైదరాబాద్ నుండి ఆంధ్రభూమి 1960 ల్లో ప్రారంభమయింది. అప్పటికి నా వయస్సు తొమ్మిదేళ్ళు. విద్యార్థి దశలోనే సాహిత్యాభిరుచి కలిగించేలా ఆ రోజుల్లో పాఠశాలలు, తెలుగు ఉపాధ్యాయుల బృందం, లైబ్రరీ పిరియడ్స్ అనేవి వుండేవి. హైస్కూలు ప్రభుత్వోన్నత పాఠశాల మలక్‌పేట హైదరాబాద్ గ్రంథాలయానికి పుస్తకాలు కొనడం మాత్రమే కాక, ఒకటి రెండు దినపత్రికలు తెప్పించగా వచ్చేవి. అందులో ఆంధ్రభూమి ఒకటి.

ఆ రోజుల్లో రచయితలు ఇంట్లో కూర్చుని రాసి, పత్రికలకు పోస్ట్ చేయడమే ఎక్కువ. ఎవరో కొందరు ప్రసిద్ధ రచయితలకు తప్ప పత్రికా సంపాదకులతో పరిచయాలు అవీ కూడా తక్కువే. ఇంట్లో ఇచ్చిన ప్యాకెట్‌మనీతో యాభై పైసలు మించని కవర్లు రెండో మూడో కొనుక్కుని– వేసిన కార్టూనో, రాసిన కవితో పత్రికలకు పోస్టు చేయడమే. అప్పటికి మా మలక్‌పేట కాలనీ ఊరికి దూరం క్రిందే జమ. సంచారక తపాల కేంద్రం (మొబైల్ పోస్ట్ ఆఫీస్) వ్యాన్ రోజూ నాలుగూ నలభైకి వచ్చి ఓ ఇరవై నిముషాలు వుండి వెళ్లిపోయేది. కార్డులు, కవర్లు అక్కడ కొంటూండే వాళ్లం. కానీ ఆ సమయానికి ఉద్యోగస్తులు ఆఫీసుల నుండి తిరిగి వచ్చే అవకాశం లేనందువలన– గృహిణులు, యువకులు మాత్రమే కార్డులు, కవర్లు కొనడానికి

వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడ నుంచి ఆ వ్యాన్ సుల్తాన్‌బజార్ (కోఠీ) వెళ్లి 6.20 నుండి సాయంకాలం ఓ ఇరవై నిముషాలు వుండేది. సుల్తాన్‌బజార్ ఎప్పుడూ జనసమ్మర్దం కలిగినదే కనుక మలక్‌పేటకు వచ్చే సమయాన్ని సుల్తాన్‌బజార్‌కు మార్చి, ఆ సంచారక తపాలా వాహనం– ఆరు తరువాత మలక్‌పేటకు వస్తే కాలనీవాసులకు ప్రయోజనం, తపాలా శాఖకు అమ్మకం బాగుంటుందని ఆంధ్రభూమి దినపత్రిక 'జనవాణి' (ఇప్పుడు ఉత్తరాయణం) కి అల్లంరాజు వెంకటరావుగా నేను రాసిన ఉత్తరం 1968 మార్చి 16 శనివారం అచ్చుపడింది. ఆంధ్రభూమితో అచ్చు మచ్చు అనుబంధానికి అది శ్రీకారం. స్థానిక అంశం కనుక స్థానిక దినపత్రికకు రాసాను. ఆ తరువాత ప్రాచ్య కళాశాల విద్యార్థిగా కళాశాలలోనే 'లహరి' సంస్థ పెట్టి సమావేశాలు చేస్తూ, ఆ వార్తాంశాన్ని అందివ్వడానికి మిత్రుడు కీ॥శే॥ మాడభూషి రంగాచార్య మోటర్ బైక్ మీద తొలిసారి ఆంధ్రభూమి కార్యాలయం గేట్ దాకా వెళ్లి, టైం ఆఫీసులో ఇచ్చి రావడం గుర్తు.

ఆంధ్రభూమికి అప్పుడు గోరాశాస్త్రిగారు సంపాదకులు. అప్పుడు జంట నగరాలలో ప్రముఖ సాహితీ సంస్థ అంటే యువభారతియే. 1970 ల్లో దానికి సహకార్యదర్శిగా వుండగా విద్యార్థులకు కథల పోటీ నిర్వహించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ కథలతో 'విద్యార్థి సాహితి' పేర యువభారతి వారి కథాంజలి–2 ఎమెస్కో ప్రచురణగా వెలువడింది. 1970 నవంబర్ 17 న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరిగిన యువభారతి సప్తమ వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించింది నాటి ఆంధ్రభూమి సంపాదకులు గోరాశాస్త్రిగారు (అనాటి సభ నా ప్రార్థనా గీతంతో మొదలైంది).

నేటి కథలలో ప్రేమ జీవితం తప్పితే సామాజిక స్థితిగతులు లోపించాయని ఆ సభలో గోరాశాస్త్రిగారు అభిప్రాయం వ్యక్తం చేస్తూ, రచయిత నాలుగు గోడల మధ్య కూర్చుని రాసేకంటే, వివిధ ప్రదేశాలు పర్యటించి, వివిధ వ్యక్తుల జీవన విధానాన్ని సాకల్యంగా అర్థం చేసుకుని, అనుభవం గడించి రచనలు చేయాలని ఆయన సూచించారు. కథలు కేవలం మానసిక వికాసానికే కాకుండా జాతి వికాసానికి తోడ్పడాలని ఆయన అన్నమాట బాగా గుర్తు. వివిధ సంస్థలు, పత్రికలు నిర్వహించే కథల పోటీలను ప్రస్తావిస్తూ– పోటీకై కథలను ముందుగా ఆహ్వానించే కంటే ఆ సంవత్సరంలో ప్రచురణ పొందిన కథలలో ఉత్తమమైన వాటికి బహుమతులివ్వాలని ఆయన సభలో సూచించారు. కథా రచయితలలో పోటీ మనస్తత్వం కన్నా స్వేచ్ఛగా, సృజనాత్మకంగా, వాస్తవ రచనలు సాగించే అవకాశం ఉంటుందని ఆయన

వివరించారు. అప్పట్లో అది ఒక విలక్షణ భావనే. ఆంధ్రభూమిపై ఆయన సంపాదక ముద్ర కనిపించేది. 'యువమిత్ర' అనే సచిత్ర లిఖిత మాసపత్రికకు నేను సంపాదకుడిగా జంటనగరాల్లో పలు లిఖిత పత్రికల ఆవిర్భావానికి స్ఫూర్తినిచ్చి, 'జంటనగరాల లిఖిత పత్రికల సమాఖ్య' స్థాపించి, లిఖిత పత్రికల్లో ఆ ఏడాది వెలువడిన సంచికలన్నింటిలోకీ ఉత్తమకథలను ఎంపిక చేసి, ఆ రచయితలకు విలువైన గ్రంథ రూపంలో బహుమతులివ్వడం చేసేవాడిని. లిఖితపత్రికే అయినా 'యువమిత్ర'కు పేరుండేది. సభ చేసిన, బహుమతులిచ్చిన వార్తను తన భావసరణి ననుసరించినట్లనిపించే కాబోలు ఆంధ్రభూమి దినపత్రికలో– వార్తను కార్డుమీద రాసి పంపినా, ప్రముఖంగా ప్రచురించారు.

అయినా ఏమిటో గోరాశాస్త్రిగారి మీద అభిమానమూ, గౌరవమే గానీ, వారి సంపాదకీయమూ, కాలమ్స్ పట్ల అభిరుచేగానీ, అప్పట్లో 'ఆంధ్రభూమి' దినపత్రిక పట్ల, ప్రభ, పత్రిక, తర్వాత ఆంధ్రజ్యోతి పట్ల కలిగిన మమకారమంతగా పెరగలేదు. యువభారతి 'మారుతున్న విలువలు– రచయితల బాధ్యతలు' గురించి నిర్వహించిన సెమినార్ 'రచన' వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ సందర్భంగా– గోరా శాస్త్రిగారు వచ్చినప్పుడు, ఆయన అవసరాలు చూసే వాలెంటరీగా వారితో అనుబంధం, వారి అవ్యాజ ప్రేమ కలిగాయి. రేడియోకు ఆయన రాసిన నాటికలు నచ్చేవి. గోరాశాస్త్రిగారు పోయాక ఆంధ్రభూమికి పలువురు సంపాదకులు మారారు. నేను కాలేజీ లెక్చరర్‌గా కరీంనగర్‌లో రెండేళ్లు, 1978 లో ఆకాశవాణిలో చేరి ఆ తర్వాత ప్రమోషన్‌పై 1990 లో విజయవాడ వెళ్లడం జరిగాయి. 1978 ఆంధ్రభూమి దిన, వార పత్రికల్లో కార్టూన్లు కొన్ని వేశాను. గోరాశాస్త్రిగారి తరువాత ఆంధ్రభూమి వివిధ సంపాదకుల ఆధ్వర్యంలో వ్యాపారాత్మకంగా ఎంత అభివృద్ధి చెందిందో తెలియదు గానీ, విలువల దృష్ట్యా అందునా సీరియస్ సాహిత్య విలువల దృష్ట్యా, అంతగా చెప్పుకునేవారం కాదు. కానీ సమాజంపై మంచికో, చెడుకో ఓ బలీయమైన ముద్రతో 'ఆంధ్రభూమి' ఖ్యాతి పొందిందనడంలో సందేహం లేదు.

విజయవాడ నుండి హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రానికి కార్యక్రమ నిర్వహణాధికారిగా 1995 లో బదిలీపై తిరిగి వచ్చాను. 'రచయితను అనిపించుకోవడం కన్నా పత్రికా రచయితను అనిపించుకోవడమే నాకు ఇష్టం. కారణం పత్రికా రచయిత నిత్య యాత్రికుడు' అంటాడు గిల్బర్ట్. ఈ మాట నాకు చాలా ఇష్టం. అలా నిత్య యాత్రికునిగా వుండగల అవకాశం అందరికీ రాదు, పత్రికలో

నిరంతరాయంగా ఒక 'కాలమ్' రాసే కాలమిస్టులకు తప్ప. 1998 లో దసరాల వేళ అప్పటి, ఇప్పటి 'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకులు శ్రీ ఎం.వి.ఆర్ శాస్త్రిగారు నాకా అవకాశం కల్పించారు. 'సుధామ చిలికించే కొత్త శీర్షిక. మామూలయిన అలవరుసలలో... ఇల వరుసల ఇంటింటి సరదా' అన్న నిర్దేశంతో సం.సా.రా.లు. (సంస్కృతి- సాహిత్యం, రాజకీయాలు) ఎడిట్ పేజి మిడిల్ కాలమ్‌గా నవంబర్ 16, 1998 లో మొదలైంది. మధ్యలో కొన్ని నెలలు విరామం వచ్చినా జనవరి 2008 నుండి నేటికీ కొనసాగుతోంది. 'సం.సా.రా.లు'లో వ్రాసిన యాభై వ్యాసాలతో ప్రచురించిన గ్రంథానికి 2004 లో 'ఇతరాలు' విభాగంలో ఉత్తమ గ్రంథంగా తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం లభించింది. ఒక దినపత్రిక కాలమ్ పుస్తకంగా అచ్చయి, తెలుగులో బహుమతి అందుకోవడం ఆంధ్రభూమి విశిష్టతే మరి.

శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగారిది పదునైన కలం. హాస్యం, వ్యంగ్యం ఒక అంచు కాగా గాఢత, లోతయిన అధ్యయనం- ఆ కలం మరో అంచు. పత్రికా సంపాదకులు అందరూ 'కాలమిస్టు'లు కావాలనీ, అయి రాణించాలనీ రూలేం లేదు. మన చదువులు, ఏది చరిత్ర, కాశ్మీర్ కథ, మన మహాత్ముడు వంటి రచనలు చేసిన కలమే జంతర్ మంతర్, వీక్‌పాయింట్ వంటి రచనలు చేసిందంటే ఆశ్చర్యమూ, ఆనందమూ కలుగుతాయి. గోరాశాస్త్రిగారి సంపాదకీయాలు ప్రజల సామాజికాంశాలపై అధిక ప్రాధాన్యత నిస్తూ, ప్రజలలోని నిరాశా నిస్పృహలను ప్రభుత్వానికి విశదపరుస్తూ తమ బాధ్యతను నిర్వహించేవి. గోరాశాస్త్రిగారి 'వినాయకుడివీణ' కాలమ్ కోసం జనం ఎదురు చూసేవారు.

కొద్దికాలం ఆంధ్రభూమి సంపాదకులుగా ఉన్న గజ్జెల మల్లారెడ్డిగారూ శీర్షిక రాసేవారు. ఇప్పుడు ఎం.వి.ఆర్.శాస్త్రిగారి 'వీక్ పాయింట్' పాపులర్. ఆయన సంపాదకీయం ఒకటి ఇటీవల యథాతథంగా నల్లమల అడవుల్లోని తీవ్రవాది ఒకరి పేరిట మరో దినపత్రికలో అచ్చు అయిందంటే, శాస్త్రిగారి కలం ప్రభావం ఎంత గాఢంగా వుందో గమనించవచ్చు.

సర్క్యులేషన్ కోసం పోటీపడి, వ్యాపార విలువలే ప్రధాన ఆరాటమైపోతూ, కేవల సంచలనాలకై ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్న ఈ రోజుల్లో రూపాయిన్నరకే దినపత్రికను అందిస్తూ- సామాజిక బాధ్యతతో, మానవీయ విలువల కోసం, సమ్యక్ దృష్టితో ఆరాటపడుతున్న దినపత్రికగా ఆంధ్రభూమిని నేడు విజ్ఞులైన పాఠకులు గుర్తిస్తున్నారు. ఎంత ప్రచారం పొందినా- జనాదరణ లభించిన శీర్షికలూ,

సంపాదకులూ ఆయా పత్రికలో భాగాలే. యాజమాన్యందే పై చేయిగా వ్యాపార విలువల వర్తమాన సమాజంలో సంపాదకునికి ఒక గుర్తింపునూ, సమాజంలో గౌరవాదరణలనూ నిలబెడుతున్న ఆంధ్రభూమి దినపత్రిక స్వర్ణోత్సవం అందుకే బహుధా అభినందనీయం. 37 ఏళ్ళ క్రితం 1972 లో స్వాతంత్ర్య రజతోత్సవాల ప్రతిబింబంగా యువభారతి ప్రచురించిన 'మహతి'లో కె.రామలక్ష్మి (ఆరుద్రగారి శ్రీమతి అని చెప్పాలా!) పత్రికల్లో శీర్షికల గురించి రాస్తూ–

'ఈనాడు అతి విస్తారంగా ప్రచారం పొందుతున్నవి 'ప్రశ్నలు– జవాబులు' శీర్షికలు. వాటిలో పాఠకులు కూడా పాల్గొనడం వుంటుంది. కనుక వాటి ప్రచారాన్ని మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు. రిపార్టీకి, విజ్ఞానం పంచడానికి, అనుమానాలు తొలగించుకోవడానికీ అచ్చులో పేరు చూసుకోవడానికి ఇవి చాలా ఉపయోగపడుతున్నాయి. అందుకే బహుళ జనాదరణకి నోచుకుంటున్నాయి' అన్నారు. ఒక తెలుగు దినపత్రికలో సంపాదకుడు పాఠకుల ప్రశ్నలకు సమాధానాలిస్తూ ఆదివారం అనుబంధాన్ని 'మనలో మనం'గా పాఠకులకు దినపత్రికను అంత ఆత్మీయంగా నేటికీ చేసి చూపుతున్నది బహుశా 'ఆంధ్రభూమి' ఒక్కటేనేమో!

అడుగంటి పోతున్న ఉదాత్తవిలువలు, ఉత్తమ పాత్రికేయ సంస్కారాల అభ్యుత్థానానికి ఆంధ్రభూమి స్వర్ణోత్సవం అసలు సిసలు స్వర్ణోత్సవం. 'మై న్యూస్, మై స్టోరీస్' అని తన తనాన్నీ– మంచితనాన్నీ, మనిషితనాన్నీ దిన దిన ప్రవర్ధమానం చేసే సంకల్పంతో పురోగమిస్తున్న దినపత్రిక 'ఆంధ్రభూమి'కి స్వర్ణోత్సవ శుభాకాంక్షలు.

(ఆంధ్రభూమి దినపత్రిక స్వర్ణోత్సవ సంచిక– 2010)

❖

(27) 'పుచ్చ'పువ్వు నవ్వుకు నిండు నూరేళ్ళు

పుచ్చా పూర్ణానందం చేసింది వకీలుగిరీ. సంపాదించింది హాస్యపుసిరి. "మనిషి అంటేనే హాస్యపదార్థం. భగవంతుడికి నవ్వాలానిపించి మానవుణ్ణి సృష్టించి పకపక నవ్వుకుంటున్నాడు. ఆనందస్వరూపుడైన దైవాన్ని ఉపాసించడానికి హాస్యం దగ్గరదారి. మనుషులంతా కనుక మానవాళి మొత్తం హాస్యానురక్తులైతే ప్రయాణం తేలిక" అంటారు. ఏ అంశం తీసుకున్నా చెరకుగడలో సారం మొత్తం పిండినట్లు, హాస్యరసం మొత్తం తీసిగానీ వదల్లేదు! కథలు– కలంపోట్లు అని టాగ్‌లైన్‌తో 'కవినియంత' పుస్తకం ఖరనామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమికి ప్రచురణ చేశారు. ఆ రోజుల్లో దానిధర రూపాయి పావలా!. పదిహేనేళ్ళ తరువాత రెట్టింపు ధరతో 'వయసు మళ్ళిందంటావా!' 'ఆవకాయ–అమరత్వం' కథలు అదనంగా చేర్చుకుని, బాపుగారి బొమ్మలతో మళ్ళీ వచ్చింది.

పూర్ణానందంగారు మొదట్లో ఆంగ్లంలో రచనలు సాగించేవారే! 'ఎప్పటికైనా ఈ దేశం నుంచి ఇంగ్లీషు పోయేదే కనుక నాలుగు కాలాల పాటు వుండే తెలుగులో వ్రాయండి' అని 1932 లో మిత్రులు భమిడిపాటి కామేశ్వరరావుగారు సలహా ఇస్తే, తెలుగు వెలిగించడం మొదలెట్టారుట. వాసిరెడ్డి వెంకట సుబ్బయ్యగారి 'మహతి' పత్రికలో, యల్.వెంకటేశ్వర్లుగారి 'జోక్స్' పత్రికలో, సాధన, మన్నవ గిరిధర్‌రావ్ ప్రోత్సాహంతో జయశ్రీ పత్రికలో హాస్యరచనలు చేస్తూ వచ్చారు ఆయన షష్టిపూర్తి సందర్భంగా 1971 లో 'ఆషాడపట్టి' హాస్యరచనల సంకలనం మూడు రూపాయల ముచ్చటైన గ్రంథంగా రాగా, 1984 లో వెలువడిన పదిహేను హాస్య రచనల సంపుటి 'మీసాల సొగసులు' పూర్ణానందంగారి హాస్యపూర్ణ ప్రజ్ఞకు ఎత్తిన ధ్వజస్తంభంగా నిలుస్తోంది!

అందులో ఆకాశవాణి శ్రోతలను అలరించిన ప్రసంగ మూర్తిమత్వమూ వుంది. 'చి॥ భట్టుగారి సలహా, సంప్రతింపు, సహకారం లేకుండా వుంటే ఈ గ్రంథం రెండేళ్ళ

క్రిందటే బయటకు వచ్చేది. అసలు నేను అచ్చే వేయించకపోతే ఆలస్యం అనే కొశ్చెనే లేదు' అని చమత్కరిస్తూ, ఆ పుస్తకానికి రాసిన 'మున్నుడి'లో పూర్ణానందం గారు చేసిన హాస్యరస విశ్లేషణ ఓ సిద్ధాంతగ్రంథ సారమంతటిది. 'నీ జీవితం కామిడీయో, ట్రాజిడీయో నీకు తెలియదు. ఆథర్ నీవు కాదు కనుక. అంచేత నీ కల్పన, నీ రచన నీ చేతిలో పనికాబట్టి హెచ్చుగా కామెడీలే వ్రాసి నవ్వి, నల్గురికీ నవ్వులు పంచిపెడితే మంచిది. భూపతనం కాగానే జీవుడు రోదన సంచిక విప్పుతాడు. మధ్య కాలంలోనైనా హాయిగా, సమష్టిగా నవ్వుకుందాం' అని సందేశిస్తారాయన. 'పెక్కు దుఃఖమొస్తే ఫక్కున నవ్వాలి' అని వారి తల్లిగారంటూండే వారట. 'నేను ప్రొఫెషనల్ రైటర్ని కాదు. కమర్షియల్ రచయితనీ కాదు, అంచేత నా కంట్రిబ్యూషన్ అల్పం' అని వినయంగా అన్నారు గానీ, అచ్చమైన తెలుగుదనానికి మచ్చలేని హాస్య రచనలు చేసిన వారు పుచ్చా పూర్ణానందంగారు.

'నవ్వు సదా పూర్ణమే. ఎందరు నవ్వులు పంచినా, ఎందరు నవ్వులు పంచుకున్నా, నవ్వులన్నీ టోటల్‌చేసి నవ్వుల్లోంచి సబ్‌ట్రాక్ట్ చేసినా శేషం పరిపూర్ణహాసమే! నవ్వులోంచి ఒక ముక్క విడతీసి చూచినా అదీ నిండునవ్వే. ఎంచేతంటే నవ్వే దైవం. నవ్వుపాసన, నవ్వు తృష్ణ పెరగాలి. అన్ని ఆటలలోకి నవ్వులాటే కష్టం. నవ్వేశక్తి, నవ్వే మనఃప్రవృత్తి వుంటేగానీ ఈ క్రీడ ఆడరు' అని నిర్ధారించారు పూర్ణానందంగారు.

కీ॥శే॥ జంధ్యాలగారి ఆనందభైరవి, రెండురెళ్లు ఆరు, శ్రీవారి శోభనం, మదన గోపాలుడు, హైహై నాయికా చిత్రాలలో పుచ్చాపూర్ణానందంగారు మంచి పాత్రలే ధరించారు. తెల్లటి పండుమీసాలతో వెండితెరమీద ఆయన రూపు ప్రేక్షకుల కళ్లముందు కదలాడుతూంటుంది. రాజమండ్రిలో పూర్ణానందంగారు బి.ఏ. చదివే రోజుల్లోనే భమిడిపాటి కామేశ్వరరావుగారి నాటికల్లో వేషాలు వేశారు. ఈయనను దృష్టిలో పెట్టుకునే భమిడిపాటి వారు కొన్ని పాత్రలూ సృష్టించారు. పద్యనాటకాలు విస్తారంగా వేయలేదు గానీ, దీర్ఘాలు తీయకుండా భావయుక్త పద్యగానంతో భీష్ముడి పాత్ర ద్రౌపదీ వస్త్రాపహరణంలో వేశారట! అనార్కలిలో సలీం, ఇంకా– వాపస్, ఆడది, పుట్ట, సంభవామి యుగే యుగే, టీ కప్పులో తుఫాను, దంతవేదాంతం వంటి రంగస్థల సాంఘిక నాటకాల్లో, రేడియోలో– గణపతి, కంఠాభరణం, వయొలిన్ మాస్టారు, ఇంటినెంబరు, మృచ్ఛకటికం వంటి పలునాటకాల్లో నటించి బందా, కాశ్యప, రామన్న పంతులు, బళ్లారి రాఘవ, స్థానం, డి.వి. నరసరాజు వంటి వారికీ ఆప్తమిత్రులుగా మెలిగి ఉన్నారు.

1910 ఆగస్టు 10 న గుంటూరు జిల్లా పెద్దకొండూరులో పుట్టిన పూర్ణానందం గారు ఎస్.ఎస్.ఎల్.సి. వరకు దుగ్గిరాలలో చదివి, గుంటూరులో ఇంటర్, రాజమండ్రిలో బి.ఏ. చేసి, మదన్‌మోహన్ మాలవ్య వి.సి గా వుండగా బెనారస్‌లో ఎం.ఏ.,ఎల్.ఎల్.బి. చదివారు. ఆంధ్రమహాసభ ఉద్యమంలో పాల్గొన్నారు. టంగుటూరి ప్రకాశంగారితో పరిచయం, స్నేహం వున్నా వీరసావర్కర్ అంటే గౌరవం వల్ల, గాంధీ సిద్ధాంతాలకు దూరంగానే వుండేవారు. తెనాలిలో న్యాయవాద వృత్తిలో ఖ్యాతి పొందారు. త్రిపురనేని రామస్వామి చౌదరిగారితో నిత్యం కలిసేవారు. గోపీచంద్ పూర్ణానందంగారికి సహాధ్యాయి. 1944 లో పుచ్చా పూర్ణానందంగారు విజయవాడ వచ్చి న్యాయవాద వృత్తి కొనసాగించారు. భార్య, అయిదుగురు కొడుకులు, ఒక కుమార్తెతో ఆయన సంసారం 'నవ్వుల జడిలో పువ్వుల పడవగా' సాగేది.

ఆయన భోజన ప్రియత్వం గొప్పది. ఎనభై ఏళ్ల పైబడిన వయస్సులోనూ చారు అన్నంలో నిమ్మకాయంత వెన్నముద్ద వేసుకుని నంజుకు తినడం వారింటికి వెళ్లినప్పుడు స్వయంగా నేను చూసిన దృశ్యమే! అటు పానుగంటి, చిలకమర్తి తరానికీ, ఇటు మునిమాణిక్యం, ముళ్లపూడి తరానికీ మధ్య వారధిలాంటి హాస్యం పుచ్చా పూర్ణానందం గారిది! ముతకతనం, వెకిలితనం ఎక్కడా కనబడవు. 'బూతు, తిట్టు, దూషణ, మోటుతనం హాస్యాన్ని కలుషితం చేస్తాయి. జోక్– రూడ్, క్రూడ్, న్యూడ్ అయితే డోకు పుడుతుంది. సెన్స్ ఆఫ్ హ్యూమర్ కీ, స్పోర్ట్స్‌మెన్ స్పిరిట్‌కీ దగ్గర చుట్టరికం వుంది' అనే ఆయన తదనుగుణంగానే తన హాస్య రచనలు చేశారు. 'హ్యూమర్ విస్తరించాలి. అయితే సరసం తమలపాకుతో. తలుపు చెక్కతో కాదు. పూలచెండుతో. దుడ్డు కర్రతో కాదు. పన్నీరు జల్లుతో. పల్లేరు కాయతో కాదు, హాస్యస్పర్శతో ఆనందపాదోదధి విస్తరిస్తుంది' అని నిరూపించిన వారాయన.

ఆయన హాస్య రచనా వస్తువులు అచ్చ తెలుగు మధ్యతరగతి జీవితాల్లోవి. అందునా ఇరవయ్యో శతాబ్దపు నడిమి కాలానివి. 'కవి నియంత' ఆయన తొలి హాస్య రచనల సంకలనం. 'నేను కవినీ కాదు, నియంతనూ కాదు. మంచి బిరుదులన్నీ అయిపోతేను, నేనే ఇది ఆలోచించి మంచిరోజు చూసి తగిలించుకున్నా. ఐనా నా పోటీ మీకేమీ ఉండదు. నాదంతా నఫ్రీమేళం'.

'నఫరి' అంటే బాకా అని నైఘంటికార్థం. దాన్ని 'నఫ్రీమేళం' అని బాకా గాళ్లుగా, పేకాటరాయుళ్లుగా, సరదాల స్నేహబృందంగా కబుర్లనెన్నింటినో రాసారాయన! భార్యతో బజారు గురించీ, భోజన పుష్టి గురించీ, అల్లుళ్ల గురించీ,

అతిథుల రాక గురించీ, తాంబూలం గురించీ, నశ్యం గురించీ, లోభుల మహిమల గురించీ, పిల్లి శకునాల గురించీ, కాకిగోల గురించీ, నిద్రాజగత్తు గురించీ, తమవృత్తి నల్లకోటు గురించీ, మీసాల సొగసుల గురించీ ఏది చెప్పినా ఆ వ్యాసాల్లో పండిన జోక్‌లు ఎన్నెన్నో! ఆయనది హాస్యంలో ఓ చెరగని చిరునామా!

(ఆంధ్రప్రభ దినపత్రిక, 11 అక్టోబర్ 2010)

❖

(28) సమాధి'గత'మైన సత్యసాయి

'బిలీఫ్ ఈజ్ యువర్ గాడ్' అంటాడు టాల్‌స్టాయ్.

విశ్వాసమే దేవుడు.

ఒక మనిషిని మరో మనిషి సంపూర్ణంగా విశ్వసించడమే అరుదు. తమను తామే విశ్వసించలేని నైజమూ కొందరిది. అటువంటప్పుడు కోట్లాది మంది విశ్వాసాన్ని చూరగొని, భగవత్స్వరూపంగానో, సాక్షాత్తూ భగవంతునిగానో, ఒక మనిషి దైహికంగా ఆరాధింపబడడం, మామూలైన సంగతి కాదు. 'అదీ దైవికమే' అని విశ్వసించడమూ– విశేషమేమీ కాదు!

విగ్రహాలు, మూర్తులుగా ఆరాధింపబడే దైవభావనకూ, దైహికంగా– మన మధ్యనే సంచరించే వ్యక్తిని, దైవభావనతో దర్శించి, సేవించుకోవడానికీ తేడా వుంది! గుడులూ, గోపురాలలో చేసే పూజలూ, అభిషేకాలూ, అర్చనలూ, నైవేద్యాలూ నేరుగా భగవంతుడిని చేరి, తమ ప్రార్థనలనాలకించి, ఆ దైవం తమ కోర్కెలు తీరుస్తాడనేది భక్తుల విశ్వాసం! దైవానికి చేరే మార్గం– తన ప్రబోధాలతో, సేవలతో, తన మార్గాను సరణంతో చూపే సద్గురువే సాక్షాత్తు భగవత్స్వరూపునిగా విశ్వసించి, కొలుచుకోవడం, సమకాలీన సద్గురువును పట్టుకోవడం ద్వారానే– ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించి, భగవంతుడ్ని చేరుకోగలమనే విశ్వాసమూ ప్రబలంగా వున్న ప్రజలున్నారు!

ఒక మనిషి దేవుడనుకోవడం, దైవంగా విశ్వసించి పూజించడం, ఆయన దర్శన, స్పర్శనలకు, మాటలకు తహతహలాడటం, ఆయన ప్రబోధాలననుసరించి, ఆయన మాటే వేదవాక్కుగా అనుసరించి, లౌకికంగానూ, అలౌకికంగానూ కూడా ఆనందానుభూతులు పొందగలగడం గాఢమైన 'విశ్వాసం' ద్వారానే సాధ్యం! విశ్వాసం కూడా తర్కానికి లొంగాలని తర్కించే వారున్నారు. హేతుపూర్వకంగా నిరూపణ

అయితేనే విశ్వసించాలనీ, అలా కానప్పుడు అది మూఢ విశ్వాసం అవుతుందనీ వాదించేవారున్నారు.

విశ్వాసం ఎవరికి, ఎప్పుడు, ఎందుకు, ఎలా, ఎవరిమీద, ఎంతకాలం ఏర్పడుతుందన్నది మనం చెప్పలేం! అది ఎవరికి వారు, అనుభూతి చెంది, అనుభవంలో గ్రహించే విషయమే.

అయితే వ్యష్టినుంచి సమష్టికి, సమష్టి నుండి పరమేష్టికి చేరడమే జీవిత లక్ష్యమనే ధర్మసూక్ష్మాన్ని ఆచరించి, మార్గదర్శి అయిన మహనీయుడు సాక్షాత్తూ దైవస్వరూపునిగా తలంపబడడం కొందరి విషయంలోనే సాధ్యం! అలా కోట్లాది భక్తుల విశ్వాసాన్ని ఈ యుగంలో చూరగొన్న మహితాత్ములలో సత్యసాయి ఒకరు. 'దైవం మానుష రూపేణ' అన్న విశ్వాసానికి ప్రతీకగా మనుగడ సాగించి, ప్రపంచవ్యాప్తంగా తానే భగవంతుడనే భావన కలిగించగలిగిన ఎందరి ఆరాధ్యమూర్తియో ఆయన. ఆయనే సత్యసాయి.

అయితే దేవునికీ దేహరూపధారియైనప్పుడు మరణం తథ్యం. రాముడు, కృష్ణుడు వంటి అవతారాలన్నింటికీ ఒక పరిసమాప్తి ఎలా వుందో, అలా కోట్లాదిమంది గుండెల్లో దైవమనే విశ్వాసంతో కొలువైనవాడూ అవతారసమాప్తి గావించక తప్పదు. తొంభై ఆరేళ్ల కాలం జీవిస్తానని చెబుతూ వచ్చి 85 వ ఏటనే ఇటీవలే శివైక్యం చెందిన పరమాత్మ స్వరూప భావకుడు సత్యసాయిబాబా.

'బాబా' అనగానే చాలామందికి షిరిడీసాయి గుర్తుకు రావడం జరుగుతూంటుంది. కానీ తానే షిరిడీసాయి అపరావతారంగా, సత్యసాయి– 'బాబా'గా అత్యంత ప్రసిద్ధ లయ్యారు. షిరిడీసాయి కాలధర్మం చెందిన ఎనిమిదేళ్లకు 23 నవంబర్ 1926 లో అనంతపురం జిల్లా పుట్టపర్తిలో తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, పెద్ద వెంకమరాజు రత్నాకరంలకు నాలుగో సంతానంగా జన్మించి సత్యనారాయణరాజు పేరిట పెరిగిన వ్యక్తి ఆయన. బాబాగా ఆయనలో మార్పు 1940 మార్చి8 న తేలు కుట్టడంతో సంభవించింది. విషం ఎక్కకుండా ప్రవర్తనలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయట! డాక్టర్లు దానిని ఉన్మాదంగా కూడా భావించారు. ఆ ఏడే– మే 23 న సత్యనారాయణరాజు తాను సత్యసాయిబాబానని కుటుంబ సభ్యుల ముందు ప్రకటించి, తాను షిరిడీసాయి అవతారమని పూలు, పంచదార కణికలు వంటివి గాలిలోనే చేతితో సృష్టించి అబ్బుర పరిచారు! గ్రామంలోని అనేకులు ఆయన

దైవస్వరూపుడని భావిస్తూ 1944 లో ఆయనకొక గుడికట్టించారు. పాతగుడిగా ఇప్పటికీ అది ప్రాచుర్యంలో వుంది. 1948 లో పుట్టపర్తిలో 'ప్రశాంతి నిలయం' నిర్మాణం ప్రారంభమై 1950 లో పూర్తయింది. 1954 లో ఒక చిన్న ఉచిత వైద్యాలయం సత్యసాయి నెలకొల్పారు, 1957 లో ఉత్తర భారత తీర్థయాత్రలు చేశారు.

1963 లో సత్యసాయికి పక్షవాతం, నాలుగుసార్లు గుండెపోటు వచ్చినా నిలదొక్కుకున్నారు. తానే స్వయంగా వాటిని నయం చేసుకున్నాననీ, తాను శివస్వరూపుడననీ, కర్నాటకలోని మైసూరులో భవిష్యత్‌లో తాను పునర్జన్మ నెత్తి ప్రేమసాయిబాబాగా, శక్తిస్వరూపునిగా భక్తులను సముద్ధరిస్తాననీ అప్పుడే చెప్పారట.

సత్యసాయి అచ్చమైన తెలుగులోనే మాట్లాడే వ్యక్తిగా వుంటూనే, ప్రపంచ వ్యాప్తంగా నూట డెబ్భై ఎనిమిది దేశాలలోని అనేకులను ఆకర్షించి, వారిని భక్తులను చేసుకోవడం నిజంగా విశేషమే!

2011 'వాటికన్స్ రివ్యూ'లో ప్రపంచ వ్యాప్తంగా ఆధ్యాత్మికంగా ప్రభావితం చేసిన వందమంది మహితాత్ములలో, సత్యసాయిబాబా ఒకరుగా చోటు చేసుకున్నారు. అది భారతీయతకి గర్వకారణమే.

సత్యసాయి తన జీవితకాలంలో ఒకే ఒక్కసారి 1968 జూన్ 29 న విదేశ పర్యటన చేసారు. 'ఉగాండా' దేశంలో బాబాగా ఆయన చేసిన పర్యటన అది. అదే సంవత్సరం ముంబయ్‌లో 'సత్యం' పేరిట మందిరాన్ని స్థాపించారు. దానికే 'ధర్మక్షేత్ర' అనే వ్యవహారం కూడా ఉంది. అలాగే 1973 లో హైదరాబాద్‌లో 'శివం'– సాయి నెలకొల్పిన మందిరమే! 1981 జనవరి 19 న చెన్నైలో 'సుందరం' పేరిట మందిరాన్ని నెలకొల్పి, సత్యం–శివం–సుందరం– సాయిమందిరాలుగా దేశంలో భక్తులకు దర్శనావాసాలయ్యాయి, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలయ్యాయి.

ఎవరి మత విశ్వాసాలు వారు కలిగివుంటూనే, షిరిడీసాయికి వలెనే హిందూ ముస్లిం ఆచార వ్యవహారాలు కలవారయినా కూడా, సత్యసాయిని– భగవద్రూప సద్గురువుగా, సాక్షాత్తు భగవంతునిగా భావించేవారు– ఆయన ప్రబోధించే సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసల ద్వారానే నేటి సంక్షుభిత సమాజంలో భగవదనుగ్రహం పొంది తరించగలమని సంభావిస్తూండడం ఆయన ప్రబోధాల ఫలితమే.

సేవే మంత్రం:

'మానవసేవే మాధవ సేవ' అన్న సూత్రాన్ని ప్రబలంగా నమ్మిన సత్యసాయి అందుకే– తాడిత, పీడిత జనావళి కోసం, పేదలకోసం అనేక సేవలను– విద్య, వైద్య, సాంఘిక, ఆధ్యాత్మిక రంగాలలో ప్రచోదనం కావిస్తూ జీవించారు. ప్రభుత్వాలు, రాజకీయాలు చేయలేని ప్రజాసేవను చేసి చూపించారు. 1995 మార్చిలో అనంతపురంలోని క్షామపీడిత రాయలసీమలో 1.2 లక్షలమంది ప్రజల దాహాన్ని తీర్చే నీటి ప్రాజెక్టును సాయి ప్రారంభించారు. అలాగే 1999 లో తమిళనాడులోని మధురైలో ఆనందనిలయాన్ని, 2001 లో పేద ప్రజలకై బెంగుళూరులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పారు. సత్యసాయి సేవా సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా మానవాళి కోసం రూపుదాల్చాయి.

సత్యసాయి భక్తులు ప్రతినిత్యం, లేక వారంలో గురువారమో, ఆదివారమో లేక రెండు దినాల్లోనూ కూడా బృందాలుగా ఏర్పడి, భజనలు, కీర్తనలు చేయడం జరుగుతూంటుంది. ధ్యానం, అభ్యాసం, సేవలలో నిమగ్నులై జీవించాలని భక్తులకు సాయి ప్రబోధం. సత్యసాయి బాబా మార్గానుయాయులు పాటించవలసిన నియమావళి అంటూ ప్రత్యేకించి ఏమీ ప్రచులితమై లేదన్నది గుర్తించదగిన అంశం!

సత్యసాయి విశ్వవిద్యాలయం ఒక్కటే యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ ఏర్పరచిన 'నేషనల్ అసెస్‌మెంట్ మరియు అక్రిడిషన్ కౌన్సిల్' చేత దేశంలో 'ఏ–ప్లస్‌ప్లస్' స్థాయిలో గుర్తింపబడింది. కర్ణాటక ముద్దెనహెళ్లిలోనూ సత్యసాయి విద్యాసంస్థలు పేరు పొందాయి. సత్యసాయి విద్యా సంస్థలు 33 దేశాల్లో వున్నాయి. కెనడాలోని సత్యసాయి స్కూలు అక్కడి విద్యా సంస్థలలో ప్రాచుర్యం పొందిన విద్యాలయం. 1999 నవంబర్ 23 న భారత ప్రభుత్వం– గ్రామీణ పేదలకు స్వచ్ఛమైన త్రాగునీటి సదుపాయం కలిగించినందుకు గౌరవ పురస్సరంగా తపాలా బిళ్లలను, పోస్టల్ కవర్‌ను విడుదల చేసింది, వరల్డ్ స్పేస్ ఆర్గనైజేషన్ ద్వారా 2001 నవంబర్ 23 న 'రేడియో సాయి గ్లోబల్ హార్మనీ' పేర డిజిటల్ రేడియో నెట్‌వర్క్‌ను ఏర్పరచి, ఆయన శాంతి సందేశాలను విశ్వవ్యాప్తంగా చేయాలని సమకట్టింది.

విమర్శల వర్షం:

'ఫలించిన వృక్షమునకే రాతిదెబ్బలు' అంటారు. అలా ఒక వంక తన బోధనలు, సేవా కార్యక్రమాల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది భక్తులను ఏర్పరచుకోగలిగిన

సత్యసాయికి, మరోవంక వ్యతిరేకత, విమర్శలు కూడా ఎదురయ్యాయి. ముఖ్యంగా ఆయన సన్నిధిలో ముఖ్యమంత్రులు, ప్రధానులు, రాష్ట్రపతులు, శాస్త్రజ్ఞులు, వివిధ రంగాల ప్రముఖులు, దేశవిదేశీ ప్రతినిధులు ఎందరెందరో చేతులు మోడ్చి నిలిచినా, పాదాభివందనాలు చేసినా, ఆయన గాలిలో నుండి విభూతి సృష్టించి ఇవ్వడం, ఉంగరాలు, గొలుసులు, చేతివాచీలు వంటివి సృష్టించి ఇవ్వడం, నోటినుండి శివలింగాలు, రుద్రాక్షలు తెప్పించడం, కుంకుమ, పసుపు, విబూది, పవిత్రజలం ఆయన పటాల నుండి రాలిపడుతున్నాయనడం, పువ్వులు, పండ్లు, విలువైన మణిరత్నాలు వంటివి సృజించి ఇచ్చారన్నట్లుగా ద్యోతకం కావడం– భక్తుల దృష్టిలో ఆయన మహత్యాలు, లీలలుగా ప్రాచుర్యం పొందగా, హేతువాదులూ, నాస్తికులూ బాబా ఒక మోసగాడనీ, గారడీలతో మోసగించి భక్తి పేరిట వశపరుచుకుంటున్నాడనీ ఆరోపణలు చేయడం, ఆయనకే సవాళ్లు విసరడం, కోర్టు కెక్కడం వంటి సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. పత్రికలలో, టీవీలలో ఆయన తన మహిమలుగా, ఆధ్యాత్మిక శక్తులుగా ప్రదర్శిస్తున్నవి– పచ్చి మోసాలనే కథనాలు ప్రచురితం కావడం, దృశ్యాలుగా ప్రసారం కావడమూ తక్కువేమీ కాదు!

ముఖ్యంగా 'హోవర్డ్ మర్ఫెట్' అనే విదేశీయుడు తొలిసారిగా 'సాయిబాబా– మ్యాన్ ఆఫ్ మిరకిల్స్' అనే పుస్తకాన్ని 1971 లో ప్రచురించాడు. 1976 లో బాబా మహిమలను సవాలు చేస్తూ– హేతువాది, ఫిజీసిస్ట్, బెంగళూర్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ హెచ్.నరసింహయ్య బాబాకు నేరుగా ఉత్తరాలు రాసి, తమముందు ఆ మహత్యాలు చేసి నిరూపించుకోమన్నాడు. సత్యసాయి అశాస్త్రీయతనూ, మౌఢ్యాన్నీ పెంచుతున్నారని నరసింహయ్య కమిటీ ఆ రోజుల్లో పెద్ద సంచలనం సృష్టించింది. అలాగే డాక్టర్ కోవూర్ కూడా– ఇంద్రజాలికుడు చేసే గారడీలు తప్ప, బాబావి మహిమలు ఏవీ కావనీ, ఉంగరాలు, గొలుసులు ఆయన లేనివి ఏవీ సృష్టించి ఇవ్వడం లేదనీ, తాను స్వయంగా సృష్టించినవైతే వాటిమీద 'మేడ్ ఇన్ ఫలానా చోట' అనే అక్షరాలు ఎందుకుంటాయనీ నిలదీసాడు. ఆ సవాళ్లను వేటినీ సత్యసాయి పట్టించుకోలేదు. వారు పెట్టే పరీక్షలకు సిద్ధం కాలేదు. వాటిని అన్నింటినీ త్రోసిపుచ్చాడు. 'పెద్ద ఏనుగు మీద దోమ వాలి కుట్టినట్టే' అని నవ్వుతూ 'నన్ను అర్థం చేసుకోలేని వాళ్లు చెప్పే మాటలు పట్టించుకోకండి. అవతారపురుషుడికి సమీపంలో నివసిస్తున్న భక్తులు వారి బ్రతుకులనే వారు బ్రతుకుతుంటారు. ఎవరిని అదృష్టం ఎప్పుడు, ఎలా, వరిస్తుందో వారెరుగరు! నన్ను విశ్వసించని వాళ్లమీద నా సమయాన్ని వృథా చేయనవసరం నాకుండదు' అనేవారట.

2004 లో బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ బిబిసి 'దీ సీక్రెట్ స్వామి' అనే డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. 'ప్రపంచానికి కనబడని బాబా భాగోతం' అంటూ అందులో 'అలయారహం' అనే విదేశీయుడు 1969 నుంచి 25 సంవత్సరాల పాటు సత్యసాయిబాబా సన్నిధానంలో భక్తుడిగా వుండి, బాబా శృంగార చేష్టలకు రోసి, బయట పడినట్లుగా 'మార్క్ రోచె'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. అలాగే డెన్మార్క్ నేషనల్ టెలివిజన్ అండ్ రేడియో బ్రాడ్‌కాస్ట్ కంపెనీ కూడా– 'సెడ్యూస్‌డ్ బై సాయిబాబా' అనే మరో డాక్యుమెంటరీని సత్యసాయి సెక్స్ ధోరణుల గురించి ప్రసారం చేసింది. 'ఏషియన్ వాయిస్' అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యు.కె లోని సాయిట్రస్టు ట్రస్టీ శ్రీ అశోక్ భగని– 'సీక్రెట్ స్వామి' డాక్యుమెంటరీ అభూత కల్పన అనీ, భక్తులెవరూ విడిగా ఏకాంతంగా సాయిబాబాతో గడపడం అసలు జరగదనీ త్రోసిపుచ్చారట! 2009 మార్చి 31 న 'ది పయనీర్' పత్రిక ఇంటర్వ్యూలో సంధ్యాజైన్ సత్యసాయిబాబాగానీ, ఆయన తాలూకు ఏ సంస్థగానీ సెక్స్ వంటి, లేక నేరం వంటి ఏ ఆరోపణలనూ కోర్టులో ఎదుర్కోలేదని చెప్పారు. కాలిఫోర్నియా కోర్ట్‌లో 2005 జనవరి ఆరున 'అలయారెహం' సత్యసాయిపై కేసు వేసినా, 2006 ఏప్రిల్‌న అది ఎలాగూ నిరూపితం కాదని గ్రహించి కేసు విత్‌డ్రా చేసుకున్నారట. అందుకు తనకు పెద్ద మొత్తంలో డబ్బు ముట్టిందని ఓ కథనం. అదేమీలేదని మరో కథనం.

పత్రికలు, మీడియా ఒక దశలో సత్యసాయి గురించిన వ్యతిరేక కథనాలను విస్తృతంగా వ్యాప్తిలోకి తెచ్చాయి. 2001 డిసెంబర్‌లో అప్పటి భారత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్, మాజీ సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పి.ఎన్.భగవతి, మానవ హక్కుల సంఘం ఛైర్‌పర్సన్ శ్రీరంగనాథ్ మిశ్రా, నజ్మాహెప్తుల్లా, శివరాజ్‌పాటిల్ (ఎం.పి) తమ సంయుక్త సంతకంతో 'సత్యసాయిబాబా మీద నిరాధార ఆరోపణలు జరుగుతున్నాయనీ, వాటికి మీడియా ప్రాచుర్యం కల్పించడం శోచనీయమనీ, బాధ్యతాయుతంగా వ్యవహరించాలనీ, ప్రేమకు, సేవాతత్పరతకు ప్రపంచానికే ఆదర్శవంతుడైన మానవతామూర్తిని మీడియాలోని ఒక వర్గం పనిగట్టుకుని అనైతికంగా వ్యవహరిస్తూండడం వల్ల, ప్రజలకు నేరుగా మేం ఈ లేఖ రాస్తున్నామనీ' వెలువరించడం జరిగింది. సత్యసాయి తనపై వ్యతిరేకతను– జీసస్‌కు ఎదురైన కష్టాలతో పోల్చుకుంటూ, 'జుడాస్' క్రీస్తుకు వ్యతిరేకంగా నాడు పనిచేస్తే నేడు వేలాదిమంది జుడాస్‌లు, వెన్నుపోటు దారులు, వ్యతిరేకులు తనకు ఎదురవుతున్నారని

అన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా ఈ విషయాన్ని 26 డిసెంబరు 2000 సంచికలో వెల్లడించింది.

ట్రస్టుపై వివాదాలు:

అయితే 'సత్యసాయి' ఎదుగుదలలో– డబ్బు, అధికారం, పరపతి, కీర్తి ఇవన్నీ చోటుచేసుకోవడంతో, సహజంగానే అంతర్గత కలహాలు సత్యసాయిబాబా ట్రస్టులో చోటుచేసుకున్నాయనీ, ఒక దశలో 'ట్రస్టును రద్దు చేస్తున్నా'నని బాబా స్వయంగా ప్రకటించినా, ట్రస్టులోని ఇందూలాల్ షా అడ్డు చక్రం వేసి ఆపాడనీ, ఛైర్మనే అయినా సత్యసాయి పాత్ర క్రమేపీ నామమాత్రమవుతూ వచ్చిందనీ, ప్రపంచవ్యాప్తంగా వస్తూండే విరాళాలు బూడిదలో పన్నీరవుతూ, వివాదాల ట్రస్టు, గూడుపుఠాణీల కూటమిగా సాక్షాత్తు సత్యసాయికే విసిగిపోయే స్థితి కల్పించిందనీ– ఒకప్పటి సాయి సన్నిహితుడు 'రాబర్ట్ పిడ్రీ' నార్వే ప్రొఫెసర్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో వెల్లడించిన కథనాలొచ్చాయి. ట్రస్ట్‌లో కీలకపాత్ర పోషించిన 'పిడ్రీ' ప్రశాంతి నిలయంలోని సంఘటనలు, వ్యవహారాలు గిట్టక బయటపడి, ట్రస్టులో జరుగుతున్న రహస్య కార్యకలాపాల మీద పుస్తకం కూడా రాశారు. 18 ఏళ్లపాటు సాయిభక్తుడిగా, నార్వేలో సాయి ట్రస్ట్‌కు నేతృత్వం వహించాననీ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపులో ఎడిటర్‌గా చేసిన నరసింహన్ మిత్రత్వంతో నాకు ట్రస్టులో ఎంత నియంతృత్వం, స్వార్థం, అవినీతి వుందో తేట తెల్లమైందనీ, నిధుల మళ్లింపులు జరుగుతున్నాయనీ, వ్యక్తిగత ఖాతాల్లోకి ఎంతో డబ్బు తరలిపోయిందనీ, ఒకసారి ఆరువేల పౌండ్ల విరాళం ఇచ్చిన తనకు, సాయిబాబా 'వజ్రం' అంటూ ఒక ఉంగరాన్ని ఇచ్చారనీ, 2002 లో డెన్మార్క్ రాణి ఆభరణాలు చేసే నిపుణుడు అది జాతి రాయి కాదని నిరూపించి చూపాడనీ 'రాబర్ట్ పిడ్రీ' వెల్లడించారు.

ఏమయినా 2005 నుంచి సత్యసాయి ఆరోగ్యంలో మార్పు వచ్చింది. ఆయన 'వీల్‌ఛైర్‌కే' పరిమితమయ్యారు. ఎక్కువగా భక్తులకు దర్శనాలు ఇవ్వడమూ తగ్గింది. 2006 లో ఇనుపస్టూల్ మీద నిలుచున్న ఓ పిల్లవాడు పట్టు తప్పి స్టూల్‌తో సహా సాయిబాబా మీద పడటంతో– ఆయన తుంటి ఎముక విరిగింది. సాయిబాబా చాలాకాలంగా డిప్రెషన్‌లోకి వెళుతున్నారనీ, మాటలు సరిగ్గా మాట్లాడలేని పరిస్థితీ, విచిత్రమైన మాటలు మాట్లాడటం జరిగిందనీ, అయితే వీటిని బయటకు పొక్కకుండా జాగ్రత్త వహించారనీ అన్నారు. ఆయన ఆరోగ్యం బాగా క్షీణించి, అవయవాలు

పనిచేయడం మానేస్తూండడంతో, ఆసుపత్రిలో వుంచి, డాక్టర్లు ప్రత్యేక వైద్య చికిత్సలు చేసినా ప్రయోజనం లేక, 28 రోజులపాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి శయ్యమీద వున్న 'సత్యసాయిబాబా' 24 ఏప్రిల్ 2011 ఆదివారం ఉదయం 7.40 కు మహాప్రస్థానం చెందారు. బాబా పరిస్థితి తెలిసో లేక ఊహించో, ఇరవై రోజుల ముందుగానే శవపేటిక కూడా ప్రత్యేకించి తయారు చేయించారట. భక్తులతో తాను 96 సంవత్సరాలు బ్రతుకుతానన్న సాయి ఇలా మహాభినిష్క్రమణం చెందడం గొప్ప విషాదమే!

పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోనే– ప్రముఖులూ, అశేషభక్తుల సందర్శనా నంతరం, అదే 'కుల్వంత్ హాలు'లో సాయిని సమాధి చేసారు. షిరిడీ తరహాలో ఆ సమాధి నుండే ఆయన భక్తులకు ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు నడిపించి సముద్ధరిస్తారని ఆయన బోధనలతో, సేవాకార్యక్రమాలతో సత్యసాయి పథం పురోగమిస్తుందనీ విశ్వాసుల ఆకాంక్ష.

బహుశా 22 నవంబర్ 2010 న ఆయన తన జన్మదిన వేడుకల్లో డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో చేసిందే ఆఖరి ప్రసంగం అనుకోవచ్చు. యువతను ఉద్దేశించి అందులో ఆయన ప్రసంగించారు. 2001 లో 'ది వాంకోవర్ సన్' పత్రిక సత్యసాయి తన భక్తులను ఇంటర్నెట్ బ్రౌజ్ చేయవద్దన్నారని రాసింది. ఇంటర్నెట్ ద్వారా వ్యతిరేక కథనాలు ప్రచురితమై, ప్రభావితమొనర్చి మనసులను కలుషితం చేస్తున్నాయని అంటూ ఆయన– "వేదప్రవచనాలు అతి పవిత్రమైనవి. వేదం పట్ల విశ్వాసం లేకుండా, నేడు జనం టెలివిజన్‌లోనూ, ఇంటర్నెట్‌లోనూ వస్తున్న విషయాలను విశ్వసిస్తున్నారు. ఇంటర్నెట్ ఒక చెత్తబుట్ట అని గ్రహించండి. 'ఇన్నర్‌నెట్'ను అనుసరించండి" అన్నారట సత్యసాయి తన చివరి ప్రసంగంలో.

"కుటుంబ జీవన వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఆ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటేనే, జాతి పటిష్ఠంగా ఉంటుంది. ప్రతి ఒక్కరిలోనూ దైవత్వం ఉంది. చరాచర జగత్తులో దేవుడు ఒక్కడే! ఎల్లప్పుడూ నచ్చీలుర హృదయంలోనే భగవంతుడు వుంటాడు. సృష్టిలో ఓంకారానికి మించిన శక్తి మరోటి లేదు. సీత, సావిత్రి, దమయంతి, ద్రౌపది, చంద్రమతి ఇలా ఎంతోమంది పతివ్రతలు, శీలవతులను ఆదర్శంగా భారత స్త్రీ జీవనం సాగించాలి. ధర్మపత్ని సీతను శ్రీరాముడు అడవులకు పంపినా, సీతకోసం రాముడు, రాముడి కోసం సీత పరితపించారు. అటువంటి లక్షణాలు ప్రస్తుతం భార్యాభర్తల్లో లోపించాయి. భార్యాభర్తలు అవగాహనతో కలిసిమెలిసి జీవించాలి.

ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవాలి. దేశప్రతిష్ఠ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే మహిళ పాత్రే కీలకం. సీతారాములు ఇద్దరూ ఒక్కటేనని, ప్రేమ, శాంతి, సుహృద్భావ వాతావరణం పెరిగేలా కృషిచేయాలి. దేశ ప్రజల నడుమ ఐక్యత లేకపోతే శత్రువుల బలం పెరుగుతుంది. అలాగే... మార్కులు చూస్తే ర్యాంకులు... గుణం చూస్తే బ్లాంకులు, జీరోలు అన్నట్లుంది నేటి విద్యావ్యవస్థ. డిగ్రీలు పొందటం తోనే విజయాన్ని సాధించామనే భ్రమలో పడరాదు. నీతి నియమాలు పాటిస్తూ త్యాగగుణంతో, ఆత్మవిశ్వాసం, స్థైర్యం పెంపొందించుకున్నప్పుడే ఆ డిగ్రీలకు సార్థకత ఏర్పడుతుంది" అని తన చివరి ప్రసంగంలో యువతకు ప్రబోధించారు సత్యసాయి.

విశ్వసించిన వారికి ఆయన దేవుడు. ఆయనను విశ్వసించని వారయినా– ఆయన చేసిన సమాజహితచింతనా కార్యక్రమాలనూ, మానవాళికి అందించిన సేవలనూ విస్మరించలేరు.

ఎందరో కుహనా స్వాములు, బాధక గురువులు, విలాసవంతమైన జీవితాలు గడుపుతూ, అనుగ్రహ భాషణలకూ, పాదపూజలకూ వెలలు నిర్ణయించి సొమ్ము చేసుకుంటున్న కపట ఆధ్యాత్మిక వేత్తలూ, భక్తిప్రబోధం పేరిట వ్యక్తిజీవనాన్ని రక్తిమయం చేసుకుంటున్న ముక్తిప్రచారకుల కంటే, సత్యసాయి బాబా అనేకరెట్లు ఆమోద యోగ్యులు. ఒక సమకాలిక సద్గురువు నిష్క్రమించారు.

ఇక ఆయన సమాధి'గత'మయ్యారు. నిజానికి ఆధ్యాత్మికంగా 'సమాధి' సమాదరణీయ స్థితి! భజన, ధ్యాన, అభ్యాసాలతో తనలోని పరమాత్మను చేరుకునేందుకు జీవుడు సమాధి స్థితినుంచే పరంజ్యోతి వైపు ప్రయాణించగలుగుతాడు.

ముందు చెప్పుకున్నట్లు–

వ్యష్టి నుంచి సమష్టికి, సమష్టి నుంచి పరమేష్టికి చేరడమే జీవితలక్ష్యం. జీవిత ప్రయోజనం. విశ్వాసులు సంభావించినట్లుగా– సంసారమనే చీకటి గుయ్యారపు బావి నుండి, ముక్తి అనే విశాల కాంతిధామంలోకి బాహాటమవ్వడమే 'బాబా!' సత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రయాణ సూచిక. కోరుకున్న వారి దారిదీపం. సమాధి'గత'మైనా దీపం వెలుగుతూనే ఉంటుంది. దీపకాంతులు ప్రసరించకపోవు.

(ఆంధ్రభూమి వారపత్రిక, 19 మే 2011)

(29) తక్కువేమి మనకు... బాపు ఒక్కరుండు వరకూ...

'ఈ బొమ్మలు కూడూ గుడ్డా పెట్టవురా' అని ఆయనతో ఒకప్పుడు వాళ్ల నాన్నగారు అన్నారు. కానీ బొమ్మలు వేస్తూ, తీస్తూ, ఐజెన్‌బర్గ్-గాడ్‌ఫాదర్‌గా, ముళ్లపూడి- గ్రాండ్ ఫ్రెండ్‌గా ఆయన ఇవాళ ఆంధ్రదేశంలో తనను కాపీకొట్టి పైకొచ్చిన ఎందరికో కూడా, కూడూ గుడ్డా ఆ చిత్రకళే పెట్టేలా చేసిన ఘనుడు! నిరంతర సృజనధనుడు.

వ్యంగ్య చిత్రాలు, రేఖాచిత్రాలు, పెయింటింగ్‌లు, దేవుళ్ల బొమ్మలు- ఆయన ఏవి వేసినా, అవి కాగితం మీద కాదు, తెలుగువారి గుండెలమీద ముద్రితమై శోభలీనాయి! ఆయన 'లా' చేసినా అలా వెళ్లకుండా- ఇలా బొమ్మల వైపు రావడం, చిత్రకళారంగం చేసుకున్న అదృష్టం! తాను తెలుగువాడిగా పుట్టడం, పేరు ప్రఖ్యాతుల విషయంలో తన దురదృష్టం అని ఆయనెప్పుడూ అనుకోకపోవడం, తెలుగువాళ్ల అదృష్టం!

పత్రికల్లో కార్టూన్లు ఆయన గీసినవి నవ్వులు కురిపించాయి. కథలకు గీసిన బొమ్మలు రచయితల- ఆ కథలను మెరిపించాయి. వెరసి ఆయన బొమ్మలు మనల్ని మురిపించాయి, మరపించాయి.

'చిత్రకారులు' ఎందరో వుండచ్చు! 'చలన చిత్రకారులూ' ఎందరో వుండచ్చు! 'కార్లు' కొందరికి ఉండచ్చు, ఉండకపోవచ్చు.

మనిషి నిరాడంబరం! మాట- మౌన ముద్రాంకిత ప్రధానావరణం.

కానీ ఆయన బొమ్మలు మాట్లాడతాయి. 'అది మాట యన్న మాటయా, మాణిక్యముల మూట... మకరంద ప్రవాహపు దేట' అని పానుగంటి తెలుగు పలుకును గురించి అన్నట్లు 'తెలుగు బొమ్మ' అంటే ఆయనే! ఒకరా! ఇద్దరా! సమాజంలోనికి, సజీవ పాత్ర లెన్నింటినో తన బొమ్మలతో ప్రాణప్రతిష్ఠ చేశారాయన. ఆబాల గోపాలాన్ని అలరించే 'క్యారెక్టర్లు'కు రేఖాకృతి నిచ్చింది ఆయనే!

అలాగే– తెలుగు పల్లెల అందాలు, నదులు, ముఖ్యంగా కృష్ణా, గోదావరీ తీరప్రాంతాల సొబగులు, మొత్తం ప్రకృతినే తన కెమెరా కన్నుతో మనకి చూపిస్తారు. 'స్త్రీ' ఆయన కుంచెలో రూపుదిద్దుకున్నంత అందంగా నిజజీవితంలో తారసపడాలని తపించేవారు లక్షలాదిగా వున్నారు! స్త్రీ శారీరక, మానసిక లక్షణాలను రేఖల్లో అద్భుతంగా, రమణీయంగా, రూపుకట్టించిన ఆయన రేఖలు, అందరికీ ఆనంద రేఖలు! అందమైన అమ్మాయికి పర్యాయపదం 'బాపు బొమ్మ!'. ఇంకో విషయం వుంది! గుండ్రంగా, మూసపోసినట్లుండిన తెలుగు అక్షరాలను వంపు సొంపుల్లోకి మరల్చి, తెలుగు 'లిపి'నే, అందగింపచేసిన ఒకే ఒక్క 'లిపి రూపశిల్పి' ఆయన!

ఆయన– సత్తిరాజు లక్ష్మీనారాయణ. అంటే తెలియకపోవచ్చు కదూ! ఔను!– ఆయనే 'బాపు'. మిత్రుడు ముళ్లపూడి లేక గోడలేని చిత్తరువునయ్యానన్న బాపు.

'బాపు' గీత లేని, తెలుగు చిత్రకళా స్వరూపాన్నీ, తెలుగు అక్షరం కొత్త అందాలనీ ఊహించడం కష్టం! ఎన్ని కథలు చదివి, ఆ కథలకు తన బొమ్మలతో ఆత్మను నెలకొల్పారో చెప్పడం అంత ఈజీ వ్యవహారం కాదు! 'ఇలా ఎలా వేస్తారా' అని మామూలు పాఠకవీక్షకులే కాదు, చేయి తిరిగిందనుకునే చిత్రకారులు సైతం ఉత్కంఠతో, ఆ 'ఫణితి'ని అందుపుచ్చుకోవాలన్న ఆకాంక్షతో, ఆయన బొమ్మలకు ఎగబడతారు. చూడటానికే కాదు– అనుకరించటానికీ, అనుసరించటానికీ కూడా ఉత్సాహ పడతారు.

'బాల' పత్రికలో బాలచిత్రకారునిగా మొదలుపెట్టి, నేడు దేవస్థానాలలో సైతం అలంకరించుకునే పరిణత భక్తిభావ శబలత గల చిత్రాలను అందించే గొప్ప చిత్రకారునిగా– ఎదిగిన చిత్రకారుడు బాపు. అరవై ఏళ్లకు పైగా చిత్రకళను, అందునా తెలుగుతనంతో తొణికిసలాడే చిత్రకళాకృతులను సుసంపన్నం చేస్తున్న 'గీతాసారం' బాపు! ఇంటికి ముఖ్యమైన అలంకరణం పుస్తకం అని విశ్వసించి, ఆ పుస్తకానికే 'అలంకరణం' తెస్తున్న, అద్భుత చిత్రకారుడు ఆయన! ఎమెస్కో సంప్రదాయ సాహితికీ, ఈతరం– విశ్వనాథకు ఓవంకా, శ్రీశ్రీకి మరొక వంకా, అలాగే శ్రీపాద, వేంకట పార్వతీశ్వర కవులు, నోరి, కందుకూరి, పిలకా గణపతిశాస్త్రి, పానుగంటి, అడవి బాపిరాజు, గోపీచంద్, బుచ్చిబాబు, బలివాడ కాంతారావు, పాలగుమ్మి పద్మరాజు, మునిమాణిక్యం, గురజాడ, లత, భానుమతి, వాసిరెడ్డి సీతాదేవి, ఆనందారామం, సౌరీస్, ఆరుద్ర, మాలతీచందూర్, శేషేంద్ర, దాశరథి, సినారె ఇలా చెప్పుకుంటూ పోతే... తెలుగు సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో దిగ్దంతులైన వారి దగ్గర నుండి,

ఆంధ్రజ్యోతి వంటి వారపత్రికలో 'కొత్తకలాల'కు సైతం అనేకానేక రచనలకు తన బొమ్మలతో వైభోగాన్నిచ్చి, పఠనీయతను పెంచిన వ్యక్తి బాపు! 'ముళ్లపూడి రాత– బాపుగీత' ఏకాత్మవంటివి! 'బడే గులాం అలీఖాన్' సంగీతానికి వశుడైన 'బడా– గులామ్' తానంటారు గానీ, మెహదీహసన్‌కు 'మహామోజు' చూపిస్తారు గానీ, వారిని వింటూ– ఆయన గీసిన బొమ్మలకూ, వాటి అందాలకూ, అర్థాలకూ, పరమార్థాలకూ, పరవశించి, వశులై, బాపుబొమ్మకు మోజు చూపేవారూ, ఆ బొమ్మల ముందు తామూ వెలవెల బోతున్నామని ఈసు చెందేవారూ ఇబ్బడి ముబ్బడిగా వున్నారు! ఇది నిజం!!

'కార్టూన్'కు ఒక వ్యంగ్యచిత్ర పరిభాషను పరికల్పన చేసిందాయెనే! ఏ బొమ్మ గీసినా, అది అర్థవంతంగానూ, 'ఆనందవర్ధనం'గానూ, భాసింపచేయగల నైపుణ్యం– బాపు కుంచె మహిమే!

బుడుగు, సీగాన పెసూనాంబ, రాధ, గోపాళం, లావుపాటి పక్కింటి పిన్నిగారు, అప్పుల అప్పారావు, తుకారాం ఇలాంటి ముళ్లపూడి కథాగత పాత్రలను సజీవం చేసిన ఘనత, గిరీశం, బారిస్టర్ పార్వతీశం, కాంతం, భానుమతి అత్తగారు వంటి పాత్రలను సమాజంలో సజీవంగా నిల్పింది– ఆ రచనలకు ఆయన కల్పించిన రేఖా కృతుల కారణంగానే!

ఆయన చిత్రించిన 'లోగో'లు, రామాయణ, భారత, భాగవతాది పురాణ గత పాత్రల చిత్రకల్పన, నవరసాలు, నాట్యరీతులకు కల్పించిన చిత్రగత శాశ్వతత్వం, వేంకటేశ్వర వైభవ చిత్రాలు ఏవి చూసినా అందం, ఆనందం పరమావధిగా అశేష హృదయాలను రంజింపగల ప్రజ్ఞాని ఆయన

క్రిందటి నెల (జూన్) 4,5,6 తేదీలలో హైద్రాబాద్ మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన 'బాపు బొమ్మల కొలువు' పురజనుల కోరికపై 11,12 తారీఖుల లోనూ కొనసాగింది. వేలాదిగా నిత్యం బాపుబొమ్మలు చూడడానికి తరలి వెళ్లారు. ప్రారంభోత్సవంనాడు తోటి కార్టూనిస్టులు, చిత్రకారులతో సమావేశం, బొమ్మల కొలువు ప్రారంభోత్సవం తర్వాత జరిగిన సభలో 'రేఖా చిత్ర కళా చక్రవర్తి' బిరుదు ప్రదానం.

అంతటి అసమాన కళాకారుడిని గౌరవించుకోవడం చంద్రునికో నూలుపోగు చందమే. నిజానికి బాపుబొమ్మలకు ఒక శాశ్వత మ్యూజియం ఏర్పరచాలన్న ప్రగాఢ కాంక్షను చాలామంది వ్యక్తపరిచారు. ఆ దిశగా ప్రభుత్వమే సముచిత చర్యలు చేపట్టడం విధాయకం!

బాపుహాస్యం, బాపు రేఖాచిత్రాలు, బాపు క్యారికేచర్స్, వంశీ, నామిని వంటి వారి కథాపరంపరలకు వేసిన బాపు చిత్రాలు, పురాణపాత్రల చిత్రాలు, ఇవన్నీ ఎంత చూసినా తనివి తీరనివి! బాపు బొమ్మల కొలువుకు అందుకే అభిమానులు అన్నిరోజులూ ఆనందంగా తరలి వెళ్లారు.

బాపు బొమ్మలకొలువు 'ప్రత్యేక సంచిక' ఈ సందర్భంగా పదిలపరుచుకోదగిన గొప్ప ఉపాయనంగా వెలువడింది. బాపు కార్టూన్ పుస్తకాలూ, బుడుగు వంటి గ్రంథాలూ అమ్మకానికి పెట్టారు. చిత్ర కళాభిమానులు వాటిని స్వంతం చేసుకున్నారు. బాపుగారు ఓపికగా, అడిగిన వారికల్లా కొన్ని పుస్తకాల మీద శ్రీరామ చుట్టి, తన సంతకం తేదీతో సహా వేస్తూ, ఎంతో సమయం అభిమానులకు వెచ్చించారు. బాపు బొమ్మలకు సమ్మోహితులు కానివారు లేరు. బాపు చిత్రాల రసాస్వాదనా స్థాయితో– ఒక అలౌకిక తాదాత్మ్య భావనలు కలుగుతాయి. అది అనుభవైక వేద్యం మాత్రమే!

బొమ్మలోనే కాదు, తన సంతకంలో కూడా కాలానుగుణంగా ఒక పరిణామాన్నీ, నవ్యతనూ, క్లుప్తతనూ, గాఢతనూ బాపు చూపుతూ వస్తున్నారు. బాపు బొమ్మలు కేవలం చూడడానికే కాదు– పఠించడానికి, పరవశించడానికి, తాదాత్మ్యం చెందడానికి!

పూజామందిరాల్లో దేవతామూర్తులను కూడా బాపుగారు చిత్రించిన బొమ్మలనే పెట్టుకునే గొప్ప గొప్పవారున్నారు. అక్కినేనిగారి ఇంట్లో ఆయన ఫోటో బాపు గీసిన బొమ్మగానే నిలిచి వుందిట.

బాపు బొమ్మలు, కార్టూనులు దాచుకోవడం కొందరి హాబీ! అలా బైండింగులు చేయించుకున్నవారు ఎందరో!

బాపు ఒరిజినల్‌గా గీసిన బొమ్మలు చూడడం ఒక అనుభవం! ప్రేక్షకులకు కనువిందొనరిస్తూ సాగిన 'బాపు బొమ్మల కొలువు' అలాంటి అపురూప అనుభవాన్ని జంటనగర వాసులకు ఇచ్చింది. బాపు బొమ్మలకు ప్రేక్షకుల హృదయాలతోబాటుగా, ఆర్ట్ గ్యాలరీ గోడలమీద శాశ్వత స్థానం కల్పించాల్సిన బాధ్యత పాలకులు వహిస్తే, అంతకన్నా ఆనందమేముంది!

బాపు 'మనవాడు' అని చెప్పుకోవడం తెలుగువారి నోముల పంట! తెలుగు తనానికి తిరుగులేని సృజన చిత్ర పతాక– బాపు.

ఆ బాపుకి జేజేలు!

(ఆంధ్రభూమి మాసపత్రిక, జులై 2011)

❖

(30) 'ముళ్ళపూడి మార్కు' కథల జడి

సాహిత్యంలో ఒక పాత్రను సజీవం చేయడం అనేది ప్రతిభావంతులైన రచయితలకే సాధ్యం. జీవితం గురించిన ఒక విశాలమైన కాన్వాస్‌లో రాయబడే నవలలో అలాంటి చిరస్మరణీయపాత్రను సృజించడం ఒక మేరకు కుదిరేపనే. బుచ్చిబాబు చివరకు మిగిలేదిలో 'దయానిధి', గోపీచంద్ అసమర్థుని జీవయాత్రలో 'సీతారామారావు'లు మనకు గుర్తుండిపోతారు. వేయిపడగల్లో 'ధర్మారావు'నో, బాపిరాజు 'నారాయణరావు'నో, ఉన్నవ మాలపల్లిలో 'వెంకటదాసు'నో మరిచిపోలేం. హాస్య నవలలాగానే రాసి మొక్కపాటివారు 'బారిస్టరు పార్వతీశా'న్ని సజీవం చేశారు. నవలలో కాకుండా నాటకం ద్వారా గురజాడ కన్యాశుల్కం– 'గిరీశం'ను సజీవపాత్రను చేసింది. వ్యాసాలలో ఆ పని పానుగంటివారు 'జంఘాలశాస్త్రి'ని ముందు నిలబెట్టి చేశారు. మునిమాణిక్యం కథల 'కాంతం', భానుమతి 'అత్తగారు' అలా నిలిచిపోయిన పాత్రలే.

కేవలం ఒక పాత్రను కాక అలా అనేక పాత్రలను తన సాహిత్యంతో సజీవం చేసి సమాజగత పాత్రలుగా నిలబెట్టిన ఘనత ముళ్ళపూడి వెంకటరమణదే. ఆయన సృష్టించిన బుడుగు, రాధ, గోపాలం, అప్పారావు, పక్కింటి పిన్నిగారు ముఖ్యంగా మధ్యతరగతి జీవితాల సజీవపాత్రలు. అంతేకాదు గురజాడ గిరీశాన్ని సృష్టించి వదిలేస్తే ఆ పాత్రచేత లెక్చర్లు ఇప్పించి, ఆ పాత్రను పెంచి పెద్ద చేసి, సమాజంలో 'గిరీశం సంస్కృతి' ఒకటి పరివ్యాప్తమైన దాఖలాను నిలిపింది ముళ్ళపూడి వారే. హాస్యంలో 'ముళ్ళపూడి మార్కు' అనేది స్థిరీకరించిన గొప్ప కథకుడు తాను.

ముళ్ళపూడి వారి కథారమణీయంలో సీతాకళ్యాణం, ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ, జనతా ఎక్స్‌ప్రెస్, రాజకీయ బేతాళ పంచవింశతి, బుణానందలహరి, కానుక, రాధాగోపాలం, సాక్షి, ఆకలీ– ఆనందరావు, విమానం కథ ఇలా అనేకం ఉన్నాయి. 'విక్రమార్కుని మార్కు సింహాసనం కథలు' అని సినీజగత్తు కథలూ రాశాడాయన.

కందుకూరితో సహా హాస్యరచనల్లో మునిమాణిక్యం, మొక్కపాటి, అంతకుముందే చిలకమర్తి, పానుగంటి, తదనంతరం భమిడిపాటి వీరందరూ వున్నా– వారందరూ సృజించిన హాస్యరచనలకూ ముళ్ళపూడి హాస్యరచనకూ తేడా ఉంది. తెలుగు కథా సాహిత్యంలో ముళ్ళపూడిది ఒక విశేష స్థానం. కేవలం హాస్యకథకునిగానే కాదు, సీతాకళ్యాణం, కానుక, సాక్షి, ఆకలీ ఆనందరావు వంటి కథలు చదివినప్పుడు ఆయన కథా విశిష్టత మరీ ప్రత్యేకించి గోచరిస్తుంది. కథ చెప్పడంలో తనదైన ఒక సొబగును సాధించిన కథకుడాయన. హాస్యం, వ్యంగ్యం, పేరడీలతో బాటు భాషను వినూత్న పదాల పోహళింపుతో రసరమ్యం చేసిన రామణీయకత రమణగారిదే.

సమాజాన్ని– ముఖ్యంగా మధ్యతరగతి సమాజాన్నీ, అలాగే రాజకీయరంగాన్ని కథల్లో సాక్షాత్కరింపచేయడంలో ఆయన చూపిన విన్నాణం గొప్పది. ఒక 'అప్పు' అనే అంశాన్ని సర్వోతోముఖంగా విస్తరించి కథల్లో చెప్పడం ఆయనకే చెల్లింది. అలాగే టీనేజీ యువతీ యువకుల ఆలోచనలు ఆయన పట్టుకున్నట్లు, వాటిని అభివ్యక్తీరించినట్లు, సరసరమణీయంగా మరొకరు చేయలేదేమో! ముళ్లపూడి కథల భాష, కథనం తీరు ఆ తరువాత చాలామందికి ఒరవడి అయింది. నాలుగు అయిదు దశాబ్దాల క్రితం రాసిన కథలు ఆయనవన్నీ. మధ్యతరగతి బ్రతుకులకు అద్దంపడుతూ, నేటి మిడిల్‌క్లాస్ మెంటాలిటికీ కూడా సజీవసాక్ష్యాలుగా సజీవంగా నిలచి ఆ కథలు అలరిస్తూనే వుంటాయి. 'అప్పారావు' అనే పాత్ర ఆర్థిక వ్యవస్థ ఎన్ని పరిణామాలు చెందినా ఎప్పటికీ నిలచివుంటూనే ఉంటుంది. ఆయన ఊహలు, శైలి, పాత్ర చిత్రణం, భాషాకేళీవిలాసం కారణంగానే వాటికి విలక్షణత వచ్చింది. ఆ కారణంగానే 'ముళ్ళపూడి మార్కు' అనేది ఒకటి సాహిత్యంలో స్థిరమైంది.

'బుడుగు' పాత్ర బాలసాహిత్యానికే మకుటాయమానమైంది. 'ఇంటింటా ఒక బుడుగు', 'మా ఇంట్లో బుడుగు' అని నేటికీ కుటుంబాలు చెప్పుకునే సంవిధానానికి ప్రాతిపదికలు వేసి రూపకల్పన చేసింది ముళ్ళపూడి వెంకటరమణే. పిల్లల అల్లరికీ, అల్లరి పిల్లలకూ ఒక ఆమోదముద్ర వేసి అందులో ఒక ఆనందదాయకమైన సారస్యాన్నీ, స్వారస్యాన్నీ సృజించారు ఆయన. ముళ్ళపూడి పద విన్యాసం కథల్లో కమనీయంగా కదనుతొక్కుతుంది. అవి వెలార్చే అర్థాలు భాషా సరస్వతికే నవ్యాభరణాలు. బాపు ముళ్ళపూడి ఒక జమలిక. బాపు బొమ్మలు ముళ్ళపూడి పాత్రలను సాక్షాత్తూ మనముందు నిలబెట్టాయి. భాష, భావం, ప్రయోగం ఏదైనా కానీయండి ముళ్ళపూడిది బహుముఖీన ప్రతిభ.

ఆంధ్ర సచిత్రవారపత్రిక, జ్యోతి మాసపత్రిక ముళ్ళపూడి రచనలను ఆనాడు తెలుగు పాఠకలోకం మీదికి ప్రధానంగా సంధించి సమ్మోహన పరిచాయి. వార, మాస పత్రికల ప్రత్యేక సంచికలకు ముళ్ళపూడి కథ ఒక వన్నె తెచ్చేది. ముళ్ళపూడి కథల గురించి ఎమ్వీయల్ 'కానుక' పేర ఒక సిద్ధాంత గ్రంథం లాంటిదే రాయగా, 'ముళ్ళపూడి వెంకటరమణ సాహితీ సర్వస్వం' విశాలాంధ్ర ప్రచురణల సంపాదకత్వం వహించిన ఎమ్బీయన్ ప్రసాద్ ఆ సంపుటాల్లోని అంశాలకు కరదీపికలందించే మంచి కృషి చేశాడు.

'మరల ఇదేల రామాయణమటన్న' అని విశ్వనాథ వారన్నట్లు అందరికీ తెలిసిన 'సీతాకళ్యాణం' ఘట్టమే ముళ్ళపూడి చేతిలో హృదయాహ్లాది కథగా వెలుగొందింది. అలాగే రమణను కథకుడిగా ఒక ఉదాత్త స్థాయిలో నిలబెట్టిన కథ 'కానుక'. కృష్ణుడికి ఒక చక్కని వేణువును తయారు చేసి ఇద్దామనుకున్న గోపన్న ఆరాటం, తీరా అన్నీ చక్కగా కుదిరాయనుకున్న వేణువును పిల్లవాడు అటకమీద మిగతావాటితో కలిపేయడం, కృష్ణుడికి అందించాల్సిన వేళ ముంచుకురావడం, అటకమీద దాచిన వేణువులన్నీ ఒక్కొక్కటీ దించి అసలుదేదో పరీక్షించే ప్రయత్నం... పుట్టిన రోజు పండుగ అయిపోకుండా– చీకటిపడే వేళకు కృష్ణుడికి వేణువును పంపడానికి, చివరకు మిగిలిన ఒక్కదాన్నీ ఇది అయి ఉంటుందని పంపడం... ఒక గొప్ప అనుభూతి రమ్యమైన పౌరాణిక స్థాయి కథ అది.

"తాను పని ముగించాడా... భగవంతుడికి సరియైన శ్రుతిబద్ధమైన వేణువును పంపాడా! ఇన్ని సంవత్సరాలు కృషి చేసి ఇన్నివేల పరీక్షలు జరిపి, చివరకు పంపించిన వేణువును పరీక్షించుకోలేదు. అది కిష్టయ్యకే వదిలేశాడు. శ్రుతి సరిలేకపోతే ఆయన సరిచేసుకుంటాడు. అయినా శ్రుతిబద్ధంగా ఉందో లేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా!... సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా?" గోపన్నకు నవ్వు వచ్చింది.

కథ చివర్లో– తీరా కిష్టయ్య మురళి వాయించేసరికి, పనికిరాదనుకున్న సహస్ర వేణువులూ భువనమోహనంగా ఆ కుటీరంలో గానం చేయడం జరుగుతుంది. చిన్న గోపన్న తండ్రి దగ్గరకు తిరిగివచ్చి అంటాడు "అయ్యా అయ్యా! కిష్టయ్య నీ మురళి వాయించాడే. నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. అయ్యా మరేం కిష్టయ్య నీ మురళి వాయించాడే కానీ, మరే! ఎంత వాయించినా ఏమీ వినబడలే. అస్సలు పాటే రాలేదే... కాని కిష్టయ్య మంచోడు నన్నిక్కడ ముద్దెట్టు..."

'గోపన్న తలతిప్పి గదినిండా పడివున్న వేణువులను చూశాడు. ఇంతసేపూ గానం చేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా సగర్వంగా చూసి ఒకటి తీసి ముద్దు పెట్టుకున్నాడు గోపన్న' అని కథ ముగుస్తుంది.

ఈ కథ భాషలో, భావంలో, అనుభూతిలో మల్లాది రామకృష్ణశాస్త్రి గారిని దరిచేరి అధిగమించినట్లుంటుందన్న మాట వాస్తవం. ఇదేమీ హాస్య కథ కాదు. కానీ ముళ్ళపూడి అనుభూతి పరిణతికి ఈ కథ ప్రతీక. మురళి ఒక జీవాత్మకు ప్రతీక అయితే, ఉపయుక్తమయ్యే మురళికై అన్వేషణ ఒక జీవుని వేదన. కృష్ణుడు వాయించగల మురళి నిర్మాణం అంటే జీవుడు తన బ్రతకును మలుచుకోవడమే ననిపిస్తూ– ఒక సార్వకాలిక సత్యాన్ని ప్రతీకాత్మకంగా అనుభూతి రమ్యం చేసే కథ 'కానుక'. సాహిత్య అకాడమీ వారు ఆంగ్లంలోకి అనువదింప చేసిన కథల్లో ముళ్ళపూడి హాస్యకథలేవీ గాక ఇది వుండడం అనేది, ఏ భాషవారికైనా కదిలించగల అనుభూతి కథనం కావడం వల్లనే అన్నమాట సత్యం.

కథలు రాయడంలో ముళ్ళపూడి కలం వెలుగులు నిజంగా జగజ్జేగీయ మానాలే! పెళ్ళి కాకుండానే, బ్రహ్మచారిగా వుండగానే ముళ్ళపూడి కుటుంబ జీవన మధురిమలను తెలిపే 'రాధాగోపాలం' కథలు రాయడం విశేషమే. ప్రణయ కలహాలనూ, కొత్త దాంపత్యాన్నీ, మధ్యతరగతి ఇంట్లో చుట్టాల బెడదలనూ మనోహరంగా రాశారాయన. పదచమత్కారాలు, భాషాచమత్కారాలు, సంఘటనాగత చమత్కారాలు ఇలా ఎన్నెన్నో ఆయన కథల్లో కనిపిస్తాయి. యువతీ యువకుల ప్రేమకథలకు ముళ్ళపూడి మంచి గుడికట్టారు. అలాగే ముందే చెప్పుకున్నట్లు అప్పుల గురించి రాసిన విస్తృత 'పన్'డితుడు తానే. ముళ్ళపూడి పేర అచ్చయిన తొలి కథ 1953 లో బాపు రాసింది. "కథలు రాస్తానని బెదిరించడమే కానీ, నేను కాగితం మీద కలం పెట్టుకపోవడంతో నాకు ధైర్యం చెప్పడానికి నా పేర బాపుయే కథ రాసి బొమ్మ వేసి పెట్టాడు. ఇడ్లీ కన్న పచ్చడే బాగుందంటూ సంపాదకులు వేసుకున్నారు" అని ఆంధ్రప్రభ జనవరి 7, 1953 సంచికలో 'లక్ష్మి' కథ గురించి చెప్పుకున్న ముళ్ళపూడి రాసిన తొలి కథ 'ఛాయలు' 1953 మార్చిలో, తర్వాత 'ఆకలి–ఆనందరావూ' జూలై 1953 లో ఆంధ్రపత్రికలో వచ్చాయి.

ఆంధ్రపత్రికలో ఉద్యోగంలో చేరాక ముళ్ళపూడి కలం విజృంభించింది. కథా రచనలోనే కాదు, సినిమా సమీక్షలకూ తనదైన బాణీని చూపింది ముళ్ళపూడి. సినిమా మంచిని మెచ్చుతూ, లోపాలను చమత్కారంగా ఎత్తి చూపుతూ, ఆ సినిమా సమీక్షలను కూడా రంజయిన కథలుగా చదివించింది ముళ్ళపూడియే. సినిమాలను తిట్టి

సినిమాలను తీసే స్థాయికి ఎదిగిందాయనే. మొదటి సినిమా 'సాక్షి' 1959 అక్టోబర్‌లోనే కథగా రాసుకుని 1967లో సినిమా తీసారు... తాష్కెంట్ ఫిలిం ఫెస్టివల్‌కు అది ఎన్నికయింది అంటే ఆ కథ అంతర్జాతీయ స్థాయిదని వేరే చెప్పాలా?

ముళ్ళపూడి కథలు వివరించి చెప్పడం కంటే ఎవరికి వారు చదువుకున్నప్పుడూ, కనీసం ఒకరు చదువుతుంటే మరొకరు శ్రద్ధగా విన్నప్పుడూ ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి. వంగూరి ఫౌండేషన్ అమెరికా వారు వంశీసంస్థ సహకారంతో హైదరాబాద్‌లో నెలనెలా వెన్నెల కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మే నెల 2010 లో 'నాకు నచ్చిన కథ' సమావేశంలో ముళ్ళపూడి 'రాధమ్మ బాకీ' కథ నేను చదివి వినిపించినపుడు, శ్రోతలు ఆసాంతం కదలక శ్రద్ధగా విని ఆనందించడం గమనించాను. మంచి కథలు చదవడం, చదివి వినిపించటం అనే మంచి సంస్కృతి పరివ్యాప్తమైతే నిజంగా బాగుంటుంది.

నిజానికి పరిశోధన చేయదగినంత విపుల విషయసంచయం ముళ్ళపూడి కథల్లో వుంది. ఆయన కథల్లోంచి వాచవిగా కొన్ని వాక్యాలు మాత్రం ఉటంకిస్తాను. వాటిల్లోని సొబగులు, అర్థాలు మీరే అందుకోగలరు.

- ☆ ఊహకందే సంగీతంలో పాట కందేది శతసహస్రం ఉండదు. (కానుక)
- ☆ నిశ్శబ్దం తీవ్రంగా ఉపన్యసించింది.
- ☆ జోరీగల జోడు ఊరుని 'జో' కొడుతోంది. (సాక్షి)
- ☆ ఇరుగు పొరుగులను ప్రేమించడం, మధ్య ఇంట్లో కాపురం వున్న వారి విద్యుక్త ధర్మం. (వరలక్ష్మి వ్రతం)
- ☆ బాకీ తీరితే గుండెమీద రాయి దిగినట్టుంటుంది. అదేమిటో ఆ రాయి లేకపోతే నాకు నిద్రేపట్టదండి.
- ☆ అప్పిస్తానని ఒప్పించాక వాడివ్వబోయే అప్పు మనదృష్టిలో వాడివ్వవలసిన బాకీగా తయారయిపోతుంది.
- ☆ "నా మొహంలా వుంది మీ ప్రతిపాదన". "ఏదో నీ అభిమానం కొద్దీ అలా మెచ్చుకుంటావు".
- ☆ దివాలా ఎత్తినవాడి పరువులా సినిమా క్యూ చితికి చెల్లాచెదరైపోయింది.
- ☆ అప్పుల వాళ్ళకు అందకుండా– వాన చినుకులమధ్య నకులుడు గుర్రం తోలినట్టు చేతిలో డబ్బు పట్టుకెళ్ళడం.
- ☆ బడిపంతుళ్ళ చేబదుళ్లులాగా చిందరవందరగా ఉండే జుట్టూ, అప్పు తెచ్చిన విచ్చు రూపాయిలా మెరిసే కళ్ళూ, బాకీల వాళ్ళకి కోపిష్ఠివాడి జవాబులా

పొట్టిగా, టూకీగా, అప్పారావు ఉంటాడు. (బుణానందలహరి).

☆ తసాబుసామంటూ నాలికలు కొరుక్కుని, కోటికి పడగెత్తి, దోబూసలాడు కోవడం, కడుపారా గాలి భోంచేసి బుస్సున తేన్చడం, గాలి పుట్టలు కట్టడం– ఇది పాము భాష.

☆ జీడి పెట్టాను కాబట్టి గోళీ తన్నినా దీక్షితులు కృతజ్ఞతాభావంతో ఊరుకోవాలి. (కృతజ్ఞత)

☆ ఏవిడోళంల్డి – ఇడ్లీ నవులుతూ అనే పదం (ప్రాప్తి) ఏవిటోనండి.

☆ పాపం... ఎవళ్దో... ఒదిగి చేళిళవాళయి యుళ్దోడు. (కృతజ్ఞత)
– ఆవలింత భాష (పాపం ఎవరో బతికి చెడ్డవాడయి వుంటాడు).

☆ త్మకుమార్డు, జన్మ కావలెను (తమ కుమారుడు– జన్మ కావలెను).

☆ నిర్ఘాంతపోయాడు. మళ్ళీ రాలేదు (జలప్రళయం).

ఇలా ఆయన అభివ్యక్తి చమత్కారాలు చెప్పుకుంటూ పోవాలంటే కోకొల్లలు. భాషచేత తన భావాలకు తగినట్లుగా ఎన్నిరకాల ఊడిగం చేయించుకోవాలో అంతా తెలివిగా చేయించుకున్నవాడు ముళ్ళపూడి వెంకటరమణ. అసలు ఒక సరికొత్త భావవినిమయ సాధనా భాషనే సృజించి– గిలిగింతలు పెట్టిన రచయిత ఆయన. ఇటీవల తన ఆత్మకథను 'కోతికొమ్మచ్చి'గా రాసినప్పుడు కూడా రచనా సంవిధానంలో ఆ ఫణితిని అలాగే నిలబెట్టుకున్న వాడాయన. ముళ్ళపూడి వెంకటరమణ, ఎస్.పార్థసారథి, సి.వి. విజయలక్ష్మి, సి.వి.వి.లక్ష్మి, ఏసుదాసు వంటి కలం పేర్లు తన రచనలకు ఉపయోగించారు. పిల్లలకోసం విమానం కథ (1959 లో) దక్షిణామూర్తి పేరుతో రాసిందీ ఆయనే.

శబ్దాశ్రయంగా, అర్థాశ్రయంగా అద్భుతమైన రచనలెన్నో చేశారు. అక్కినేని నాగేశ్వరరావు జీవితకథను, సినిమా వెండితెర నవలను కూడా కథగా చెప్పారు. కథ చెప్పడంలోని ఆనందం, ఆహ్లాదం ముళ్ళపూడి కథల నుండి ఎంతయినా అందుకోగలం. తెలుగు కథా సాహిత్యంలో 'ముళ్ళపూడి మార్క్' చెదరిపోనిది, చెరిగిపోనిది, అందం, ఆనందం దాని పరమావధి.

(ఆంధ్రభూమి దినపత్రిక,
'కథకు శతమానం' 'గన్నమరాజు ఫౌండేషన్, వరంగల్ వ్యాసపంపుటి– జనవరి 2012)

❖

(31) నవ్వుల లోకం

పుట్టినట్టు గుర్తు ఏడుపు.

కానీ బతికి బట్టకట్టినట్టు గుర్తు నవ్వు.

బోసినవ్వులు చిందించే పిల్లల్ని చూసినప్పుడే తల్లిదండ్రులకు ఆనందం. వాళ్ళు ఆనందంగా పెరిగి పెద్దవుతూంటేనే తాము గొప్పగా పెంచామని గర్వం. అంటే ఏమిటన్నమాట– నవ్వులు పెంచడం, నవ్వులు పంచడం ఈజ్ ఈక్వల్టూయే గర్వించదగ్గ బతుకు.

ఇవాళ ఏడిపించడాలు ఎక్కువైపోయాయి. నవ్వడాలు, నవ్వించడాలు కష్టమైన పనిగా మారాయి. అందుకోసం క్లబ్బులూ, పబ్బులూ పెట్టుకోవాల్సి వస్తోంది. కానీ కలంనిబ్బులతో నల్ల ఇంకులో ముంచి తెల్లటి పలువరుస కనబడేలా నవ్వించే చాకచక్యం జోకిస్టులదీ, కార్టూనిస్టులదే. నిజానికి హాస్య రసోత్పాదక సామగ్రి స్టాకిస్టులు వాళ్ళు. ఒకప్పుడు పత్రికకు (ఆ మాటకొస్తే ఇప్పటికీ లెండి) జోకులు, కార్టూన్లూ ఓ ముఖ్య సరుకుగా వుండేవి. కార్టూన్లు అంటే కారుట్యూన్లు తెలిసిన తెల్లదొరలే ముందు అందిపుచ్చుకున్నారని పదిహేడు వందల డెబ్భైలో తొలి కార్టూన్ వచ్చిందని ఓ పరిశోధక మిత్రుడి ఉవాచ. నవ్వించే బొమ్మలు గుహల రాతిగోడల మీద మన దేశంలోనే కనబడ్డాయని మరో చారిత్రకుడి ఉవాచ. ప్రతి అంశానికీ ఐతరేయ బ్రాహ్మణం దగ్గరకు వెళ్లిపోయే సిద్ధాంత గ్రంథకర్తల సంగతి అటుపెట్టేద్దాం. మనం మన తెలుగు సంగతికే వద్దాం. రాంభట్ల కృష్ణమూర్తిగారు బతికుండగా 'నేనే ఫస్టు పొలిటికల్ కార్టూన్ వేసానబ్బాయ్' అని నాతో ఓ రేడియో ఇంటర్వ్యూలో అన్నారు. నిజమే కానీ తొలి తెలుగు కార్టూనిస్టు సోషల్ యాస్పెక్ట్‌లో మాత్రం కచ్చితంగా 'తలిశెట్టి రామారావు' గారే! ముద్దా విశ్వనాథంగారి పత్రికకు ముద్దు ముద్దుగా వేసేముందు భారతిలో

'కల్లుగీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కి కల్లు గీయడం పిల్లాడికి నేర్పిస్తున్న బొమ్మ వేస్తూ 'గీతాబోధన' అని పేరు పెట్టిన ఘనత ఆయనదే! అంతేకాదు 'విజన్ ట్వంటీ ట్వంటీ'లాగా భవిష్యత్ సమాజం సంప్రదాయాల్లో, నాగరికతలో ఎలాంటి వెర్రిమొర్రులకు లోనవుతుందో భవిష్యద్దర్శనం చేసి రేఖలలో వ్యంగ్యంగా ప్రతిఫలింప చేసిందీ ఆయనే! అన్నింటిలోకీ ఆ రోజుల్లో అందర్నీ విపరీతంగా ఆకట్టుకున్నది 'ప్రబంధ సుందరి' అనే చిత్రం. చేపల వంటి కళ్ళు, సంపెంగ వంటి ముక్కు, దొండపండు వంటి పెదాలు అనే ప్రబంధ వర్ణనను యథాతథంగా గీస్తే అ 'సుందరి' ఎలా అఘోరిస్తుందో నవ్వించేలా గీసి చూపించిందాయనే!

తలిశెట్టి వారికి కూడా కొన్ని ఆంగ్ల కార్టూన్లు ఆధారం అయితే అయ్యుండచ్చు గాక– గానీ వాటిల్లోకి నేటివిటీని, తెలుగుతనాన్ని తెచ్చి మన పంచెకట్టులు, పిలకజుట్టుల నుండి నవనాగరీకం ముదిరిన క్రాఫ్‌ల, సూటుబూటు వేషభాషల మన అరువు తెచ్చుకున్న సంస్కృతి అగచాట్ల గురించి కొరడా చరుపుల్లా రేఖలతో విసుర్లు విసిరింది ఆయనే. మే 20 తలిశెట్టి రామారావుగారి జయంతి. తెలుగు హాస్యానికి గీతాన్వయం చేసి తెలుగులో వ్యంగ్యచిత్రం అన్నదానికి వైభవ ప్రాభవాలనిచ్చింది ఆయనే. ఆ రోజుల్లో త.రా. అని పొడి అక్షరాలతో కూడా– నవ్వులతో తడిబారిన కళ్లతో పాఠకులు పిలుచుకున్నది కూడా తలిశెట్టి రామారావుగారినే. ఆయన జయపురం సంస్థానం వారి ఆదరణ పాత్రమయ్యారు. అడ్వొకేట్‌గా రాణించారు. కానీ ఆయన వృత్తి ఏదయినా ప్రవృత్తి అంతా నవ్వుల జల్లే! అంత అధిక సంఖ్యలో ఆ రోజుల్లో అనేక సాంఘిక, సాంసారిక అంశాల మీద కార్టూన్లు గీసిందాయెనే!

పొలిటికల్ కార్టూన్ గీతలకు రాంభట్ల వారు కూడా తలిశెట్టి గీతల ఒరవడినే తీసుకున్నారు. అయితే పొలిటికల్ కార్టూన్లు అంటే చాలామందికి ఆ రాజకీయ నేత ముఖాలు, హావభావాలు, వెనుక రాజకీయ వాతావరణం వేయడమేననే భావనే ఎక్కువ. కానీ రాజకీయ అంశాల మీద అందునా వర్తమానఅంశాల మీద కూడా ఆ నేతల ముఖాలేవీ వాడకుండానే పొలిటికల్ కార్టూన్లు కూడా గీయవచ్చని తలిశెట్టి ఆనాడే నిరూపించారు. 'బాపు'గారు కూడా రాజకీయ లోకం పోకడ తెలిపే అద్భుత కార్టూన్లు కూడా ఎన్నో వేశారు. 1970 ప్రాంతాల్లో ఆంధ్రప్రభ వారపత్రికలో బాపుగారి పొలిటికల్ కార్టూన్లలో నేతల ముఖారవిందాలు వేసినవీ ఉన్నాయి. అవేవీ లేకుండానే నాటి రాజకీయ సమస్యల మీద అద్భుతంగా సంధించిన రేఖాస్త్రాలూ వున్నాయి.

పొలిటికల్ కార్టూనిస్టులు రోజూ పేపర్లో ఏదో ఒకటి వేయక తప్పని ఉద్యోగ ధర్మంతో, తమ హాస్య సృజనను నిలుపుకోవడం నిజంగా గొప్ప సంగతే. సురేంద్ర, శేఖర్, శంకర్, మృత్యుంజయ, శ్రీధర్ లాంటి వాళ్లు ఈ రోజువారీ పోరులో వీరయోధులుగా కుంచె ఝళిపిస్తూనే వున్నారు. ఇవాళ దినపత్రికల్లో ఒకప్పటిలా పెద్దసైజు కార్టూన్లు రాజకీయంగానైనా మొదటి పేజీలో రావడం మానేసి, పాకెట్ సైజులోకి దిగి, రెండో పేజీలోకి ప్రాధాన్యత తగ్గిన దశ కూడా వచ్చిందనేది వాస్తవమే.

నిజానికి కార్టూన్‌ది ఒక పరిమిత రంగం కాదు. పరిధి బోలెడు విశాలం. ఏ అంశం మీద నుండయినా ఫ్రీలాన్స్ కార్టూనిస్టు నవ్వులు పంపిణీ చేయగలడు. 'మన మీదేనర్రోయ్' అంటూ 'సరసి' లాంటి కార్టూనిస్టు పొలిటికల్ జోలికి పోనందువల్లనే బహుశా ఇప్పటికీ తాజాతాజాగా ఆలోచించగలుగుతున్నాడు. సత్యమూర్తి, జయదేవ్, శంకు, చంద్ర, బాలి, రామకృష్ణ, మల్లిక్, బాబు, రాగతి పండరి మూడు దశాబ్దాలకు పైగా అయినా ఇంకా కార్టూన్లు గీస్తూనే ఉన్నారు. నిజానికి కొత్తకొత్త కార్టూనిస్టులు కూడా ఎందరో వచ్చారు. కానీ తమ కార్టూన్లతో తమ పేర్లు గుర్తుపెట్టుకునే స్థాయికి కొందరే వస్తున్నారు. గాంధీ, బాచి అంటూ లిస్టు మొదలెడితే– నా పేరు చెప్పి నా పేరు చెప్పలేదు అనుకునే అలకలు పెరిగే జనాభా ఉండవచ్చు. పుక్కళ్ల రామకృష్ణ అంతర్జాలానికి కార్టూన్ కళను ఎక్కించాడు. తెలుగు కార్టూనిస్టుల డాట్‌కామ్ మాత్రమే కాదు, ఫేస్‌బుక్ 'తెలుగు కార్టూనిస్టుల గ్రూపు', 'నవ్వులు పువ్వులు' గ్రూపు రోజూ బోలెడు పోస్టింగులతో అలరారుతున్నాయి. ఉష, జ్యోతిర్మయి, దేవగుప్తం చక్రవర్తి, రాసే సమయానికి గుర్తుకు రావడం లేదు గానీ అబ్బో! ఎందరెందరో తమ కార్టూన్లతో, కామెంట్లతో గ్రూపుగా నవ్విస్తున్నారు. ఎం.వి.అప్పారావు అనే 'సురేఖ' డెబ్భై ఏళ్ల పైబడిన వయసులోనూ కార్టూనిస్టుగా ఎంత యాక్టివో!

అస్త్రసన్యాసం చేసిన కార్టూనిస్టులు, పరమపదించిన కార్టూనిస్టులు కూడా తమ కార్టూన్లు మాత్రం నవ్వుకోవడానికి ఆస్తులుగా మిగిల్చారన్నది వాస్తవం. తలిశెట్టి వారి కార్టూన్ల సంకలనం రెండవ భాగం రమణారెడ్డి ఏర్చి కూర్చి, ఇప్పుడు సరికొత్తగా అందిస్తున్నారు. ముఖీమీడియా, ఆంధ్రప్రదేశ్ క్వోక్విల్ అకాడెమీ, హాస్యానందం వీరంతా కలిసి మే 20 తెలుగు కార్టూనిస్టుల దినోత్సవంగా జరుపుకుందామని ఏడాది క్రితమే ప్రతిపాదించారు. అది ఈ రోజు సాకారమవుతోంది.

పత్రికల్లో కార్టూన్లు వున్నాయంటే వున్నాయన్నట్టు గాక నాణ్యమైన వాటి కోసం సంపాదకులు శ్రద్ధ పెట్టాలి. కార్టూనిస్టులు అందుకోసం తమ బుద్ధికి, కుంచెకు పదునుపెట్టాలి. ఛానెల్స్‌లో యానిమేషన్ చిత్రాలు వచ్చేసాయి గానీ, 'ప్రసారంలో అంతరాయం' అని ఓ నిముషం పాటు క్యాప్షన్ చూపించే బదులు కనీసం ఆ సమయంలో ఓ కార్టూన్ చూపించి, ప్రేక్షకుడికి అసహనం కలగకుండా ఉత్సాహ పరచవచ్చు. కార్టూనిస్టుగా పత్రికల్లో ఉద్యోగంచేస్తున్న వారి పరిస్థితి అందరిదీ ఘనంగా ఉందని చెప్పలేం. కానీ వారికి 'ఐడియా' ఘనంగా వచ్చే వాతావరణం ఉండాలి. రమణీప్రియదూతిక తెచ్చి ఇచ్చే కప్పురపువిడేలు అక్కర్లేదు కానీ, వేసిన నాలుగింటిలో నచ్చిందేదో చెప్పి, 'మిగతావి నువ్వే దాచుకో' అని చెత్తబుట్టలో పారేయకుండా ఇస్తే చాలు అనుకునేవారూ వున్నారు.

అసలు ఫ్రీలాన్స్ కార్టూనిస్టు పని హాయి! తనకు నచ్చిన అంశాల మీద నచ్చిన కార్టూన్లు గీసుకుంటూ పోవచ్చు. ఓ పత్రిక వారికి నచ్చకపోతే ఇంకొకరికి నచ్చవచ్చు. నిజానికి కార్టూనిస్టులకు అంటూ ఓ ప్రత్యేక పత్రిక వుంటే బానే వుంటుంది. 'హాస్యానందం' వంటివి కొంత ఆ కొరత తీరుస్తున్నా, నన్నడిగితే ఇవాళ్టి తరాన్ని దృష్టిలో పెట్టుకుని ఇంటర్నెట్ కార్టూన్ పత్రిక కూడా ఒకటి నెలకొల్పవచ్చు. కార్టూన్లు అన్ని భాషల్లోనూ అన్ని దేశాల్లోనూ వున్నాయి. నిజానికి 'సైలెంట్ కార్టూన్లు' అంటే మూకీలు వేయడం నిజంగా గొప్ప. ఏ భాష వాడయినా, ఏ దేశం వాడయినా చూసి నవ్వుకుని ఆనందించగల కార్టూన్లను మన తెలుగువాళ్లు ఇంకా విరివిగా సాధించాల్సే ఉంది. మూకీలు టాకీలుగా మారినప్పుడు ఛార్లీచాప్లిన్ 'ప్రపంచ భాష అయిన మౌనం ముక్కలై పోతోందని' బాధపడ్డాట. కానీ ముక్కలు కాని ఏకత్రిత హాస్యాన్ని కార్టూన్‌గా పండించగల ప్రజ్ఞ కార్టూనిస్టులదే! క్యాప్షన్‌లెస్ కార్టూన్ల విలువ వాటికదే! అలాగే వ్యాఖ్యాగత కార్టూన్లయినా ఆ వ్యాఖ్యల్లో అచ్చమైన మన తెలుగుతనాన్ని చూపగల కార్టూన్లు బాపుగారే ఎన్నో మనకు వేసి చూపించారు. ఆ తెలుగుతనం తెలివిని నిలబెట్టుకోవాల్సిన అవసరం కూడా తెలుగు కార్టూనిస్టుల మీదనే ఉంది.

'తెలుగు పత్రికల్లో కార్టూన్లు' అనే అంశం మీద నిజానికి పిహెచ్.డి.యే చేయచ్చు. కానీ విశ్వవిద్యాలయాలు ఇలాంటి అంశాల పట్ల శ్రద్ధ వహించాలి కదా! చిత్రలేఖనం కోర్సుగాగల తెలుగు విశ్వవిద్యాలయం వంటి వారు ఇలాంటి మంచి పనులకు పూనుకోవాలి. ఏటా కథావార్షికలు, కవితా వార్షికలు వెలువడుతున్నట్లు

కార్టూన్స్ వార్షికలు వెలువడాలి. జోక్స్ సంకలనాలు ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నాయి గానీ కార్టూన్స్ సంకలనాలు వ్యక్తిపరంగా, వస్తుపరంగా, గ్రూపుపరంగా వెలువడ వలసిన అగత్యం ఉంది. మిగతా ఏ పుస్తకాలకన్నా, తీసిపోక, తక్కువ సమయలో ఎక్కువ ఆనందాన్నీ, ఆహ్లాదాన్నీ, పంచగలవి కార్టూన్లు, జోక్స్ సంకలనాలే. అంచేత మరోమారు మే 1 ప్రపంచ కార్మిక దినోత్సవం నాడు నినదించిన తీరులో మే 20 న 'తెలుగు కార్టూనిస్టులారా ఏకం కండు' అని నినదిద్దాం! 'నవ్వేజనా సుఖినో భవంతు' కనుక– నవ్వుల పువ్వులు రువ్వే కార్టూన్ ప్రపంచం వర్ధిల్లాలి. సదా హాస్య సుధా మధురంగా– ప్రకృతీ, మానవ ప్రకృతీ కూడా తేజరిల్లాలి. అదీ ఆకాంక్ష!

(ఆంధ్రభూమి దినపత్రిక, ఆదివారం అనుబంధం, 20 మే 2012)

❖

(32) అధిక్షేపాక్షర సంచారి

పత్రికా రచయిత ఒక నిత్య యాత్రికుడు. స్థలకాలాలు మారిపోతూంటాయి. నేపథ్యాలు మారిపోతుంటాయి. అయినా యాత్ర ఆగకూడదు. అంతేకాదు. తన యాత్ర తనకే కాదు, ఆ యాత్రానుభవజ్ఞానం పదుగురికీ ఉపయుక్తం కాగలగాలి. వ్యష్టి దర్శనంలో సమష్టి ప్రతిఫలించాలి.

ఒకప్పుడు పత్రికకు సంపాదకుడు అంటే యాజమాన్య సారథియో, పెట్టుబడి దారుడో కాదు. సమాజ దిశానిర్దేశకులుగా భాసించిన రచయితలయిన పత్రికా సంపాదకులుండేవారు. ఎడిటోరియల్ అంటే రియల్‌కు డిటోగా గోచరించేది. సత్యశోధన, చిత్తశుద్ధి సాధన గోచరించేవి. పెట్టుబడికి కట్టుకథకు పుట్టిన విష పుత్రికలుగా శ్రీశ్రీ పత్రికలను అపహాస్యం చేసాడంటే, రాను రాను వాటి అస్తిత్వం, ఆ విలువలు సంఘంలో అలా దిగజారుతూ రావడమే కారణం.

ఒకప్పుడు సంపాదకుడి పేరు మొదటి పేజీలో పత్రిక పేరు క్రింద ప్రస్ఫుటంగా కనిపించేది. ఇవాళ అది ఆఖరుపేజీ అడుగులైన్లలో అట్టడుగుకు చేరిపోయింది. పేరుకోసం ప్రాకులాడని రోజుల్లో, వారు నిజమైన పాత్రికేయ ధర్మం నిర్వర్తించినందు వల్లే పతాకశీర్షికపైన సంపాదకుడి పేరు కనిపించేది. ఇవాళ సంపాదకులు అనే వారి వైఖరే మారిపోయింది. పేరు కోసం ప్రాకులాడే గుర్తింపు తాపత్రయాల వ్యక్తులు ఎక్కువయ్యారు. పత్రికల్లో విశ్వసనీయత, సత్యదృష్టి కొరవడ్డాయి. యాజమాన్య భావాల కొమ్ముకాసే బోయీలుగా మాత్రమే, వ్యక్తిత్వాలకు తిలోదకాలిచ్చిన నామకః సంపాదకులు ఎక్కువగా కానవస్తున్నారు.

అయితే పత్రికారంగంలో అంతా ఇంత శోచనీయస్థితియే చెలామణీ అవుతోందనలేం. ఇవాళ పత్రికా సంపాదకులు అంటే గౌరవభావంతో, చిత్తశుద్ధితో, సత్యసంధతతో, నిర్భయంగా చెప్పుకునే పేర్లలో ఎం.వి.ఆర్.శాస్త్రిగారు ప్రథమ

గణ్యులవుతున్నారు. కేవలం సంపాదకుడుగా కాక ఒక నిత్యచైతన్య యాత్రికుడైన రచయితగా ఆయన కొనసాగుతూ వుండడమే దానికి కారణం.

ఆయన విద్యావేత్తకాదు. కానీ, మన విద్యావిధానపు తీరు తెన్నులను 'మన చదువులు' గ్రంథంలో విశ్లేషించిన తీరు విద్యాసంస్కర్తలకే ఆలోచనీయమైంది. ఇప్పటికీ మనదేశ చరిత్రలో సమస్యాత్మక కుంపటిలా రగులుతున్న సంక్లిష్ట కాశ్మీర్ సమస్యపై సమగ్ర అవగాహనను ప్రోది చేస్తూ రాసిన 'కాశ్మీర్ కథ', ఆక్రమిత వాస్తవాల చిత్రణమైన 'కాశ్మీర్ వ్యథ' గ్రంథాలు పొలిటికల్ సైన్స్ పాఠాల ప్రోదిగా భాసించాయి. ఆయన చరిత్రకారుడు కాదు. కానీ శాస్త్రిగారు ఒక చారిత్రక పరిణత, అవగాహన, అధ్యయనం, పరిశోధనగల రచయితగా– ఆర్యులనుంచి ఔరంగజేబు దాకా భారత చరిత్రగతిని, మెకాలేమార్కు చరిత్రకారుల చేతుల్లో జరిగిన దారుణ వక్రీకరణలను తూర్పారబడుతూ రాసిన 'ఏది చరిత్ర', మొగలాయిల తర్వాత మరాఠా సామ్రాజ్య ఉత్థాన పతనాల నుంచి కుట్రలూ, కుహకాలతో ఆంగ్ల రాజ్యస్థాపన వరకూ విశదపరచిన 'ఇదీ చరిత్ర', అలాగే '1857' స్వాతంత్ర్యోద్యమ భిత్తిక– ఆయనను గొప్ప చారిత్రక సత్యశోధకునిగా నిలబెట్టాయి.

అన్నింటికన్నా మరో సంచలనం 'మన మహాత్ముడు'. అది ఆయన సంచలనం సృష్టించడం కోసం పనిగట్టుకుని రాసింది కాదు. కానీ, దక్షిణాఫ్రికా నుండి సహాయ నిరాకరణ వరకూ– అసహాయ గాంధీ లీలలను బట్టబయలు కావిస్తూ మహాత్ముని మాయాజాలపు మత్తును చిత్తు చేసిన గ్రంథం అది. ఇప్పటికీ దానిని ఖండించే ప్రతికూలాస్త్రాలు ఎవరిదగ్గరా లేకపోయాయి. అలాగే తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున వున్న సమయంలోనే నూరేళ్ల ఆంధ్రోద్యమం వెలుగు నీడలనీ, ఆంధ్ర రాజకీయాల అసలు స్వరూపాలను బట్టబయలొనరిస్తూ రాసిన 'ఆంధ్రుల కథ' తలపండిన రాజకీయ విశ్లేషకులకు సైతం అబ్బురమయింది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా– సమకాలీన రాజకీయ, సామాజిక పెడధోరణులపై ఆదివారం ఆంధ్రభూమిలో ఆయన ఝళిపించిన కొరడా చురకలు 'ఉన్నమాట' గ్రంథంగా, అలాగే 'సాక్షి' కలం పేరున శనివారం మొదటి పేజీల్లో ఆయన రాసిన 'వీక్‌పాయింట్' కాలమ్‌లోని స్ట్రాంగ్‌డోస్‌లు పాఠకులు పదే పదే తలుచుకునే సంకలనంగా రూపుదాల్చాయి. ఇక ఇటీవలే సరికొత్తగా స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు జాతీయ ప్రాముఖ్యాన్ని సరిగా గుర్తించి, ఆ కోణం నుంచి అతడి చారిత్రాత్మక పోరాటాన్ని మదింపుచేసే గొప్ప కృషి. అద్భుత

విషయ సేకరణతో, వాస్తవాల విశ్లేషణతో, జాతీయ దృక్కోణం నుంచి అల్లూరి ప్రతిభా ప్రాభవ దర్శనంతో వెలువడిన గ్రంథం 'విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు'.

సంపాదకునిగా వుంటూనే రచయితగా ఇంత విస్తారమైన విశేషకృషి చేసినవారు ఇటీవలి కాలంలో చాలా అరుదు. బహుశా శాస్త్రిగారికే అది చెల్లింది. ఆయన కలం బలం గొప్పది. ఆయన ఏది రాసినా దేనికదే ఒక ప్రత్యేకత సంతరించు కోగలిగిందంటే– దానికి కారణం ఆయన రచనాశైలి. వ్యంగ్యం, అధిక్షేపం, పరిహాసం ఆయనకు నల్లేరుమీద బండినడక. సత్యశోధన ఆయన లక్ష్యసాధన. మెరమెచ్చులూ, మొహమాటాలూ లేని నిశితమైన కలం ఆయనది. అదే సమయంలో సంపాదకీయం రాసినా, వీక్‌పాయింట్ రాసినా, పరిశోధనాత్మక అంశంతో ధారావాహిక రచన చేసినా దేనికదే ఒక విలక్షణతతో సూటిగా, దీటుగా పాఠకుడికి చేరవేసే రచనాదక్షత ఆయనది.

శాస్త్రిగారి రచనలు అనేక గ్రంథరూపం దాల్చాయి. నిజమే! కానీ ఆయన సంపాదకీయాలు, సాహిత్య వ్యాసాలు, అలాగే కొంతకాలం పాటు ఒక కాలమ్‌గా గతంలో ఆయన రాసిన 'జంతర్ మంతర్' పుస్తకాలుగా వెలువడవలసిన అవసరం వుంది.

1998 లో అనుకుంటా ఆయన 'జంతర్ మంతర్' పేరిట కాలమ్ నిర్వహించారు. సమకాలీన సామాజిక, రాజకీయ సంఘటనలపై వినిర్మించిన వ్యంగ్య రచనలే అవి. నిజానికి 'జంతర్ మంతర్' అంటే గణకయంత్రం అని అర్థం. 18 వ శతాబ్దపు సవాయి జైసింగ్ జైపూర్ మహారాజు ఢిల్లీ, ఉజ్జయిని, వారణాసి, మధుర, జైపూర్లలో నిర్మించిన వేదశాలలు జంతర్‌మంతర్లుగా బహుళ ప్రాచుర్యం పొందాయి. పనితీరులోనే కాక నిర్మాణశైలి పరంగానూ జంతర్‌మంతర్‌లు వాటికి అవే సాటి. పరికరాలు వుంచే భవనాలుగా కాక, ఆ భవనాలే ఖగోళ పరికరాలుగా ఉపయోగ పడేటట్లు జైసింగ్ వాటికి రూపకల్పన చేసాడు. అర్ధగోళాలు, విలువంపులు, ఘనాలు, స్థూపాలు, త్రికోణాలు ఇలాంటి రకరకాల రేఖాగణిత ఆకృతుల మేళవింపులు జంతర్ మంతర్‌లు. ఉపగ్రహాలు వచ్చేవరకూ ఖగోళ సంఘటనల కాలాన్ని లెక్కించడానికి ఉపకరించినవి జంతర్‌మంతర్‌లే! నిజమైన అబ్జర్వేటరీలవి. 1724 లో కట్టిన ఢిల్లీ 'జంతర్ మంతర్'– నేటికీ పర్యాటకులకు గొప్ప ఆకర్షణగా ఉంది. అన్నాహజారే వంటి వారి ధర్నాలకు కూడలి స్థలంగా, సంచలనంగా వార్తల్లో దృగ్గోచరమవుతోంది.

శాస్త్రిగారు తన కాలమ్‌కు 'జంతర్ మంతర్' అని పేరు పెట్టడంలోనే గొప్ప చాతుర్యం కనిపించారు. సామాజిక రాజకీయ సమకాలీన అంశాల 'అబ్జర్వేటరీ'గా

ఆ కాలమ్‌ను తీర్చిదిద్దారు. ఆ రచనల తీరు, నిర్మాణశైలి నిజంగా విలక్షణమైనవి. 'జంతర్ మంతర్' అనడంలో వివిధ ఆకృతుల ఒక తమాషా, గందరగోళం కూడా నిబిడీకృతమై వుంది. జంతువులను పాత్రలుగా నిలిపి 'పంచతంత్రం' కథలు రూపు దాల్చినట్టు 'జంతర్ మంతర్' కాలమ్‌లో శాస్త్రిగారు పురాణ పాత్రలను రాజకీయాలకు జోడించి, అందునా నాటి సమకాలీన రాజకీయాలను, సామాజిక ఘటనలను గొప్ప వ్యంగ్య వైభవంతో రచించారు. చింతపట్ల సుదర్శన్ వంటి కాలమ్ రచయితలు ఆ పురాణ పాత్రలతో రాజకీయ విశ్లేషకుల ఒరవడిని అందిపుచ్చుకున్న దాఖలాలూ ఉన్నాయి. అలాగే 'కంగాళీ కళాపీఠం' అంటూ రాజకీయ నేతల్లోని అసలు కంగాళీ తనాన్ని ద్వంద్వ వైఖరులను, రెండు నాల్కల ధోరణులను సప్రామాణికంగా తూర్పార బట్టారు.

'దేవుడి గుళ్లో దయ్యాలు' అని రాసిన జంతర్ మంతర్ కాలమ్‌లో గుడులలో దేవుళ్ల నగలే మాయమవుతున్న దుస్థితులనూ, గుళ్లలో పెరిగిపోతున్న అవినీతి, అక్రమాలనూ, రకరకాల కుంభకోణాలు, దౌర్జన్యాలనూ ప్రస్తావిస్తూ– మళ్ళీ అవతారం ఎత్తవలసిన అగత్యాన్ని విష్ణుమూర్తికి సకల దేవతలూ, మునులూ మొరపెట్టుకోగా 'నిజమే! పాపం పండిపోయింది. దుష్టులకు పట్టపగ్గాలు లేవు. శిష్టులకు రక్షణ లేదు. గత యుగాల్లో మీరు అలాగే వచ్చి వేడుకుని నా చేత ఆయుధం పట్టించినప్పటికంటే తీవ్రమైన పరిస్థితులే ఈనాడు వున్నాయి. అయినా నేను అవతారం ఎత్తను, కనీసం కలుగజేసుకోను కూడా' అంటాడాయన.

సహజంగానే 'ఎందుకిలా' అనే విస్మయం పాఠకుడికీ కలుగుతుంది. మార్పు రావల్సింది ప్రజల్లోనే అని సామాజిక బాధ్యతను గుర్తెరిగింపజేస్తూ విష్ణుమూర్తి చేతే ఇలా చెప్పించడం శాస్త్రిగారికే చెల్లింది.

'నేనైనా మీరైనా అసలు ఎందుకు కలగజేసుకోవాలి? ఎవరికోసం బాధపడాలి? గతంలో ఒక్క రాక్షసుడు పేట్రేగిపోతేనే పీచమణచడానికి నేను భూమ్మీదకి వెళ్లాను. ఇవాళ వందల వేల రాక్షసులు చెలరేగుతున్నారు. అయినా పట్టించుకోను, ఎందుకంటారా? గతంలో శివుడో, బ్రహ్మదేవుడో పరాకున వరమిస్తే రాక్షసులు విజృంభించే వారు. వరాల బలంతో ప్రజలను చెండుకు తినేవాళ్లు. నిష్కారణంగా వాళ్లకు జరుగుతున్న అన్యాయాన్ని సరిద్దిడానికి నేనో, మరొకరో కదలి వెళ్లేవాళ్లం.

'కానీ– ఇవాళ పరిస్థితి వేరు. ఇప్పుడు చెలరేగుతున్న రాజకీయాసురులకు వరాలిచ్చింది మనం కాదు. ఈ ప్రజలే! ఓట్లేసింది వారే, అధికార వరమిచ్చి నెత్తిన

ఎక్కించుకున్నదీ వారే. వాళ్లు అడ్డగోలుగా తమను ఆరడిపెడుతున్నారని ఆక్రోశిస్తున్నదీ వారే. ఆ స్వయంకృతాపరాధానికి మనమెందుకు జాలిపడాలి? పోనీ– నేరక తప్పు చేసి బొందలో పడ్డారనీ, మనం ఆదుకుంటే తప్ప బయటపడడం వారి వల్లకాదనీ అనుకుందామా? బయటపడే ఉపాయం వారి చేతుల్లోనే వుంది. వెనకటి రాక్షసుల్లా వందలేసి ఏళ్లు నిరాఘాటంగా చెలరేగడానికి ఎవరికీ ఇప్పుడు వీలులేదు. ఐదేళ్లకోసారో అంతకంటే ముందో ప్రతి పాలకాసురుడూ జనం ముందుకు వెళ్లి చేతులు కట్టుకు నిలబడవలసిందే. ప్రజలు ఏవగించుకునే పనులు చేయడానికి ఇవాళ ఏ పాలకుడూ సాహసించలేడు. దేవతలమైన మనకు జరుగుతున్న అపచారాలకు గుడ్లప్పగించి చూస్తూ, ఓటు వజ్రాయుధం చేతిలో ఉంచుకుని కూడా సక్రమంగా దాన్ని వాడకుండా మిన్నకుంటూ, దేవాలయాల ఆస్తులను, దేవుడి సొమ్ములను కాపాడుకోవలసిన భారం దేవుళ్ళదే అయినట్టూ, తమకేమీ బాధ్యతలేనట్లూ, తాము కొట్టే కొబ్బరికాయకో, హుండీలో వేసే రూపాయికో బ్రహ్మానందపడి, తాము కోరే అడ్డమైన కోరికలన్నీ తీర్చడానికి మనమున్నట్లు అపోహపడే అసమర్థ ప్రజలకు మనమెందుకు కొమ్ము కాయాలి? ముందు వారిని కళ్లు తెరవమనండి' అని విష్ణుమూర్తి చేత సత్యాన్నే కాదు, సందేశాన్నీ సంకలింపచేస్తారు.

నేడు హిందూ ధర్మానికి జరుగుతున్న చ్యుతి గురించి ఎవరికీ పట్టదన్న ఆర్తి శాస్త్రిగారి కలంలో బలీయంగా కనబడుతుంది.

'ఎవరు? పీఠాధిపతులు, స్వాములూ, బాబాలా? చెప్పక చెప్పక వాళ్ళ సంగతే చెప్పాలి. వాళ్ళు లోకులను మించిన లౌక్యులు. డిప్లమేట్లను తలదన్నిన డిప్లమేట్లు. రాజకీయ నాయకులకే రాజకీయం నేర్పగలిగినవాళ్లు. కాషాయం కట్టినా కౌపీనం పోదు. ధర్మం తెలిసినా మాట్లాడరు, అపచారం జరుగుతున్నా వారించరు. ధనం మీద ఉన్న ప్రేమ ధర్మంమీద చూపరు. గుళ్ళూ దేవుళ్ళూ ఏమై పోయినా వారికి పట్టదు. పెదవి విప్పరు' అని ఆనాడే కలం చురక వేశారాయన.

పధ్నాలుగేళ్ళ క్రితం రాసిన 'జంతర్ మంతర్' రచనలు ఆనాటి నేతల పేర్లతో వున్నాయేమోగానీ రాజకీయ వైఖరులు మాత్రం అలానే సజీవంగా వున్నాయి. కాలమూ, సందర్భమూ, వ్యక్తులూ మారారు కానీ, జంతర్ మంతర్ వైఖరులు అలానే ఉన్నాయి. అంతకన్నా దిగజారాయి కూడాను. నాటి రాజకీయాలను నేటితో తులనాత్మకంగా పరిశీలించుకునేందుకయినా ఆ రచనలు రికార్డు కావలసిన అవసరం ఉంది. కనుకనే వాటికి గ్రంథరూపం కలిగించడం ఎంతయినా సముచితం అనడం.

ఎం.వి.ఆర్.శాస్త్రిగారి శైలికి పాఠకుడు ఆకర్షితుడు కాకుండా వుండలేడు. ఆయన వాక్యనిర్మాణం, వ్యంగ్య చమత్కార ఘణితి, నిజాలను నిర్భయంగా వ్యక్తీకరించే తీరు, ఆయన సప్రామాణికంగా వెల్లడించే వాస్తవాలకు తిరుగులేని తనం ఎంతగానో ఆకట్టుకుంటాయి. నిజంగానే ఆయనది ఒక 'జంతర్ మంతర్' శైలి. వర్తమాన, సామాజిక, రాజకీయ అంశాల భిన్న ఆకృతుల 'అబ్జర్వేటరీ'గా ఆయన 'కాలమ్స్' పాఠకులకు చైతన్యోద్దీపకాలు, స్ఫూర్తిదాయకాలు, ఆలోచనాత్మకాలు, పఠనానంద సంధాయకాలు. నిరంతరం పత్రికా రచయితగా ఆయన ప్రతి రచనోద్దేశంలో లోతుగా తరచి చూడనంత సేపూ– పైకి ఒక 'తిక్క' వుంది. కానీ దానికి ఖచ్చితంగా ఒక 'లెక్క'వుంది. లెక్కించదగిన మంచి రచయిత, సంపాదకులు శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగారు.

('వాక్యవిహారం'–ఎం.వి.ఆర్. శాస్త్రి షష్టిపూర్తి సంచిక, నవంబర్ 2012)

(33) అమృతోత్సవ సత్యమూర్తి

భావరాజు వెంకట సత్యమూర్తి–

కార్టూన్ 'భావా'ల 'రాజు' అయిన ఆయన వెంట– 'సత్య'ముగా నిత్యం అభిమానుల 'మూర్తి' మత్వం, ఎన్నేళ్ళుగానో సాక్షాత్కరిస్తూనే వుంది.

కార్టూన్ రంగంలో బాపుగారి తర్వాత అంతటి సీనియర్‌మోస్ట్ కార్టూనిస్ట్ ఆయనే! రేడియో అన్నయ్యగారి ఏ 'బాల' పత్రికలో బాపుగారు పుట్టారో, అలానే కార్టూనిస్టుగా 1956 లో 'సత్యమూర్తి'గారూ పుట్టారు. రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారు 'బాల'లో కార్టూన్లు, బొమ్మల కథలు, అట్టమీద బొమ్మలు ఎన్నో సత్యమూర్తితో వేయించారు.

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో శివలెంక రాధాకృష్ణగారు యువ సత్యమూర్తిని ఎంతో ప్రోత్సహించారు. కథలకు బొమ్మలు, ముఖచిత్రాలు కూడా ఎన్నో సంతరింప చేశారు. ఆ రోజుల్లో 'చదువులరావ్' కార్టూన్‌స్ట్రిప్ అంటే పాఠకులకు తెగ క్రేజ్. ముఖ్యంగా కాలేజీ పిల్లలు అత్యంత అభిమానించినది ఏదయినా ఉందంటే– పత్రికలో అదే! కొంచెం మందపాటి కళ్ళద్దాలతో, సన్నని మీసకట్టుతో, ఒత్తయిన జుట్టుతో, టై కట్టుకున్న 'చదువులరావ్' రూపం– ఎందరి గుండెల్లోనో హత్తుకుపోయింది. అలాగే అమ్మాయి 'జయశ్రీ' పెద్ద బొట్టుతో, అందంగా, నాజూగ్గా ఆకర్షించేది. వాటిని ఎవరూ వట్టి కార్టూన్ బొమ్మలు అనుకోలేదు. తమకు బాగా పరిచిత వ్యక్తులు అనుకున్నారు. అదీ సత్యమూర్తిగారి కుంచె ప్రతిభ. అలాగే 'అల్లాటప్పయ్య' కూడా సత్యమూర్తి సృష్టే!

ఆ రోజుల్లో సత్యమూర్తిగారి కార్టూన్లు లేని తెలుగు పత్రిక లేదంటే అతిశయోక్తి కాదేమో! ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, జ్యోతి, యువ, జయశ్రీ, రచన వంటి పత్రికలన్నీ ఆయన గీతలతో పాఠకులను నవ్వులజల్లులతో అలరించాయి.

ముఖ చిత్రాలను కూడా కార్టూన్లతో అలంకరించిన ఘనత ఆయనదే! పైకి గంభీరంగా కనబడే సత్యమూర్తియేగానీ, ఆయనలో ఎంతో హాస్యస్ఫూర్తి!

1967 ప్రాంతంలో ఓ ఫార్మాస్యూటికల్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో మూడేళ్ళు ఉద్యోగం చేసినా, కంపెనీలోని రాజకీయాల్లో ఇమడలేక, ఫ్రీలాన్స్ కార్టూనిస్టుగా వుంటూనే– తాము నేర్చిన గ్రాఫిక్ డిజైనింగ్‌నే కెరీర్‌గా చేసుకుని 'శ్రీ సత్యసాయి డిజైనింగ్ స్టూడియోస్' అనే అడ్వర్టయిజింగ్ ఏజెన్సీ ప్రారంభించి, దాన్ని ఒక ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ స్థాయికి నేడు అభివృద్ధి చేశాడు. ఫార్మాస్యూటికల్ కంపెనీలకు, బ్యాంకులకు కమర్షియల్ వర్క్స్ చేస్తూ, కార్టూన్లను ప్రకటనల రంగంలోకి దించి కొత్త ఒరవడికి మార్గదర్శకులయ్యారు.

కార్టూన్లతో తెలుగు క్యాలెండర్ తొలుత రూపొందించింది సత్యమూర్తిగారేననాలి. ప్రకటనలకే కాకుండా– మెడికల్ కంపెనీల విజువల్ ఎయిడ్స్, క్యాచ్ కవర్లు, బ్రోచర్లు, సీడ్స్ కంపెనీల వారికి, వాల్‌పోస్టర్లకు, గ్రీటింగ్ కార్డులకు, అలాగే ఫ్యామిలీ ప్లానింగ్, గర్ల్‌చైల్డ్, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, వివాహ వయసు వంటి ప్రభుత్వ సంక్షేమ సందేశాలకు బొమ్మలు సంతరించారు, బొమ్మలకథల పుస్తకాలు రూపొందించారు. సినిమా ప్రకటనలనూ రూపొందించారు. అంతేకాదు బంగారు నంది గెలుచుకున్న 'సుడిగుండాలు' చిత్రం ఆర్ట్ డైరెక్టర్ సత్యమూర్తి గారే! ఆయన కృషి గురించి వింటేనే ఆశ్చర్యంతో 'అవాక్కు' కావాల్సిందే!

బి.వి.సత్యమూర్తిగారు 1939 జనవరి 1 న జన్మించారు. ఈ ఏడాది ఆయన అమృతోత్సవ సంవత్సరం. నాన్నగారు రావుసాహెబ్ భావరాజు సత్యనారాయణగారు, తల్లి వెంకాయమ్మగారు. జన్మస్థలం కాకినాడ. సత్యమూర్తిగారు కాకినాడ పి.ఆర్.హైస్కూలులోనే పాఠశాల విద్య చదివి, హైదరాబాద్ నిజాం కళాశాలలో ఉన్నత విద్య చేశారు. సత్యమూర్తిగారి శ్రీమతి జోగేశ్వరిగారు కూడా చిత్రకారిణి. మంచి పెయింటర్. గ్రాఫిక్ డిజైన్స్ చేశారావిడ కూడా. సత్యమూర్తిగారి అమ్మాయి డాక్టర్ పద్మావతి సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్. అబ్బాయి సత్యసాయి భాస్కర్ బి.కామ్., ఎమ్.బి.ఏ. చేసి ప్రస్తుతం సత్యమూర్తిగారు నెలకొల్పిన 'శ్రీ సత్యసాయి డిజైనింగ్ స్టూడియో ప్రైవేట్ లిమిటెడ్'కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వున్నారు.

తాను స్వయంగా కార్టూనిస్టు, చిత్రకారుడూ కావడం మాత్రమే కాక, ఎందరెందరినో కార్టూనిస్టులుగా తీర్చిదిద్దిన ఘనత సత్యమూర్తిగారిదే. 'కార్టూన్లు వేయడం ఎలా?' అని ఆంధ్రభూమిలోనే గతంలో ధారావాహికంగా కార్టూన్ పాఠాలు

అందించి, దానిని పుస్తకంగా ప్రచురించి, ఎందరికో గురువుగారయ్యారు. 1989 లో అది పుస్తకంగా వెలువడింది. ఆ తరువాత పుస్తకమహల్ వారు 'హౌటు డ్రా కార్టూన్స్' అని ఆంగ్లంలో దానిని ప్రచురించారు.

అంతేకాదు, భగవాన్ సత్యసాయి చెప్పిన కథలు 'భవన్స్ జర్నల్‌లో' సత్యమూర్తి గారి బొమ్మలతో ప్రచురితమయాయి. పన్నెండు సంపుటాలుగా ఆ బొమ్మల కథలు పుస్తకాలుగా వెలువడి, ఎందరినో ఆకట్టుకున్నాయి. 'లలిత కళా అకాడమీ'కి అయిదేళ్ళు కౌన్సిల్ మెంబర్‌గా వున్నారు సత్యమూర్తి. 1986 లో వంశీ బర్కిలీ కార్టూనిస్టు అవార్డు అందుకున్నారు. అక్కినేని చేతులమీదుగా ఉగాది పురస్కారం, ఢిల్లీ ఆంధ్రప్రదేశ్ భవన్‌లో మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుగారి చేతుల మీదుగా, బాపుగారి చేతుల మీదుగా ఎ.పి.జర్నలిస్టుల ఫోరం అవార్డు అందుకున్నారు. రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కారం, ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం, ఢిల్లీ తెలుగు సంఘం అవార్డు, ఖమ్మం కళాపరిషత్తు అవార్డు వంటి అనేక బహుమతులు, అవార్డులు అందుకున్నారు.

1987 లో ఢిల్లీ ఆంధ్రప్రదేశ్ భవన్‌లో సత్యమూర్తిగారి కార్టూన్ల ప్రదర్శన జరిగింది. 2013 అంటే గత సంవత్సరం బెంగుళూరులో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్ట్స్ వారు ఇండియన్ కార్టూన్ గ్యాలరీలో సత్యమూర్తిగారి కార్టూన్ల ఎగ్జిబిషన్ మార్చి 9 నుంచి పదిహేను రోజులపాటు నిర్వహించారు. ముందు ఏడాదే 'సమైక్య భారతి'– వారి తెలుగు కార్టూనిస్టుల కాన్ఫరెన్స్‌లో సత్యమూర్తిగారిని సన్మానించింది.

ఎందరో చిత్రకారులకు మంచి ఇండియన్ ఇంక్‌నిబ్బులు, బ్రష్‌లూ, పెన్నులూ వంటి డ్రాయింగ్ సామగ్రిని ఉదారంగా ఇచ్చేసే గొప్ప దానకళా గుణం కూడా సత్యమూర్తిగారిదే!. అవి పుచ్చుకున్నవారు ఆనందంగా ఆ విషయం చెబుతుంటారు.

1984 లో జరిగిన ఒక సర్జరీ వలన సత్యమూర్తిగారికి పెరాలసిస్ వచ్చినా దాని నుంచి 'ఫిజియోథెరఫీ'తో పట్టుదలతో కోలుకుని, మునుపటిలా బొమ్మలు వేయగలగడం నిజంగా ఆయన ఆత్మవిశ్వాసానికీ, పట్టుదలకీ, కృషికీ దాఖలా! ఇప్పటికీ నిరంతరంగా బొమ్మలు వేస్తూ, పనులు చేస్తూ, పుస్తకాలు చదువుతూ, సంగీతం వింటూ, హుషారుగా వుండే సత్యమూర్తిగారికి అప్పుడే 75 ఏళ్లంటే నమ్మశక్యం కాదు. 'చదువుల్రావ్' నాటి యువచైతన్యమే ఆయనది. ఆంధ్రభూమి వారపత్రికలో జోక్స్ బాక్స్/ నవ్వుల వల్లరిని ఎన్నో ఏళ్ళుగా ఆయన పాఠకాదరణతో నిర్వహిస్తున్నారని వేరే చెప్పాలా?

సత్యమూర్తిగారి అమృతోత్సవ జన్మదినవేళ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సత్యమూర్తిగారు ఇలాగే తెలుగువారిని అలరించాలని మనసారా కోరుకుందాం!

చదువులరావ్ బహద్దూర్ సత్యమూర్తిగారికీ జై!

(ఆంధ్రభూమి వారపత్రిక, 6 ఫిబ్రవరి 2014)

(34) ఆకాశవాణిలో భరద్వాజ

పుట్టి బుద్ధెరిగాక ముప్పైరెండు సంవత్సరాలు ఆకలినీ, దరిద్రాన్నీ తట్టుకుంటూ, చిన్నా చితకా ఉద్యోగాలతో బతుకుబండి నెట్టుకుంటూ, బాధలూ, కష్టాలూ, అవమానాలూ, ఈసడింపులే మూలకందంగా- రచయితగా తనను తాను తీర్చిదిద్దుకుంటూ, పాఠశాలలో చదివింది ఏడుతరగతులే అయినా, బ్రతుకు పాఠశాలలో ఆకలి, అవసరమే డిగ్రీలుగా రాణించి వచ్చిన- రావూరి భరద్వాజను అక్కున చేర్చుకుని ఆదరించిందీ, ఒక స్థిరత్వాన్ని ఆర్థికంగా కల్పించి పోషించిందీ ఆకాశవాణియే!

అయితే ఆయన ఆకాశవాణి ప్రవేశం కూడా అంత సులభంగా జరిగిందేమీ కాదు. ప్రభుత్వోద్యోగానికి అప్పట్లోనే నిజానికి మెట్రిక్ అయినా పాసయి వుండాలి. ముప్ఫైఏళ్లు దాటిపోవడం కూడా నిజానికి ఉద్యోగం పొందడానికి ప్రతిబంధకమే! అయితే ఆ రోజుల్లో స్టేషన్ డైరెక్టర్లకు కొన్ని అధికారాలుండేవి. ఒక స్థాయి ఉద్యోగ నియామకాలకు తలుచుకుంటే వారి మాట చెల్లుబాటు అయ్యేది. తాను ఆకాశవాణి ఉద్యోగిని అవుతానని భరద్వాజగారు కూడా ముందేనాడూ అనుకుని వుండరు. రేడియోలోకి చేరకముందు రేడియోతో ఆయనకు పరిచయం లేదా అంటే, అది కొద్ది మేరకే!

1950-52 మధ్యలో ఆయన రాసిన 'నికషం' అనే నాటిక ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి ప్రసారమైంది. కడుపు నింపుకోవడం కోసం, తన కడుపు ఎలాగోలా నింపుకుందామనుకున్నా- 1948 మే, 28 న కాంతంగారిని వివాహం చేసుకుని సంసార బాధ్యతలను నెత్తికెత్తుకున్నందుకు వాటిని నిర్వర్తించడం కోసం, చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తూ 1956 జనవరి మొదటివారంలో మద్రాసులో కాలుమోపి, అక్కడ ఓ మూడేళ్లు ధనికొండ హనుమంతరావుగారి పత్రికల్లో, కె.వి. రత్నంగారి 'రాశీ అండ్ కంపెనీ' అనే కలాల కంపెనీలోనూ స్థిరత్వం కోసం కిందా మీదా పడుతున్న కాలంలోనే- 1956 లో మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుండి

ప్రసారమైన ఒక నాటికలో తొలిగా పాత్రధారిగా పాల్గొన్నారు. చక్రపాణిగారు 'యువ' మాసపత్రికను హైదరాబాద్‌లో ప్రారంభించుతూ, భరద్వాజగారి గురించి ఈదర లక్ష్మీనారాయణగారు చెప్పగా విని భరద్వాజను హైదరాబాద్ వెళ్ళమన్నారు. అలా 1959 ఏప్రిల్ నెలలో మద్రాసు నుండి భరద్వాజ హైదరాబాద్ వచ్చిపడ్డారు. ఆ వచ్చిన కొత్తలోనే తొలిసారిగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి 'నా పుస్తకాల బీరువా' అన్న ప్రసంగాన్ని చేశారు. ఆకాశవాణిలో చేరకముందు ఆకాశవాణితో ఆయన అనుబంధం అది.

అప్పట్లో గోపీచంద్‌గారు హైదరాబాద్ ఆకాశవాణిలో రూరల్ విభాగం ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్నారు. తెనాలిలో వుండగా ఆయనతో భరద్వాజకు కొంత పరిచయం వుంది. హైదరాబాద్ ఆకాశవాణిలో చేరేంతవరకూ ఆయన చేసిన 'బ్రతుకు సమరం' అంతా ఇంతా కాదు. చారెడు గంజికోసం, పొగాకు బారన్‌లో బొగ్గువేసే కూలీగా, కలప అడితిలో రంపంలాగే కూలీగా, కమ్మరి దగ్గర సమ్మెట వేసే, తిత్తివూదే వానిగా, ప్రెస్‌లో కంపోజిటర్‌గా, మిల్లులో ఆయిల్‌మెన్‌గా, పేపర్‌బాయ్‌గా ఎత్తిన అవతారాలతో– చిత్తంలో ప్రతిదెబ్బా సుత్తిదెబ్బగా, మానవమూర్తిగా ఆయన మహిత శిల్పంగా తనను తాను చెక్కుకున్నారు. 1945-46 లలో గుడ్లనీరు కుక్కుకుంటూ కటిక దరిద్రాన్ని అనుభవించారు. అది పగవాడికి కూడా వద్దనిపించేంత దుర్భర దారిద్ర్య వేదన.

ఆకలి మంటల్ని బలవంతాన అణచిపెట్టడం వల్లా, అదీ కుదరనప్పుడు మంచినీళ్ళతో ఆ మంటల్ని చల్లార్చడం వల్లా, ఆయన ఆరోగ్యం పాడయ్యింది. తెనాలిలో ఆత్మీయులనుకున్నవారూ తనలాంటి పేదవారే! దానికితోడు నిండైన ఆత్మాభిమానం మటుకు, 'దేహీ' అని చేయిచాచి ఒకర్ని దేబిరించే నైజాన్ని ఇవ్వలేదు. 1947 ఆగస్టు 15 న మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజున నెల్లూరు 'జమీన్‌రైతు' పత్రికలో చిరు ఉద్యోగం చేస్తూండిన భరద్వాజ– 'సుప్రభాతం' అన్న పుస్తకాన్ని వీధి వీధి తిరిగి అమ్మగా వచ్చిన డబ్బులన్నీ ప్రచురణకర్తకిచ్చి, పెన్నానదిలో నీళ్ళు తాగి, ఆ వొడ్డునే కాలే కడుపుతో నిద్రపోయాడు. మాట పట్టింపుతో 'జమీన్‌రైతు' ఉద్యోగం మాని, ఆ తర్వాత కొన్నాళ్లకు 'దీనబంధు' వారపత్రికలో పనిచేసారు. పెళ్లయ్యాక ఆలపాటి రవీంద్రనాథ్‌గారి పుణ్యమా అని, తెనాలిలో– జ్యోతి, రేరాణి, సినిమా పత్రికలకు పనిచేసే వీలు చిక్కింది. పాతిక రూపాయల ఉద్యోగంతోనే బ్రతుకు బండి నెట్టారు. ఆలపాటి వారితోనూ మాటపట్టింపు వచ్చి అదీ మానేసారు. కథలు రాసుకుంటూ

వచ్చే పావలా డబ్బులతోనే కొన్నేళ్లు గడిపారు. 'సమీక్ష' పత్రికలో, 'నలందా ప్రెస్'లో పనులు చేసే కాలంలోనే– వృత్తి చేసుకునే లక్ష్మి, జైబూన్, చిత్రలతో పరిచయాలు అయ్యాయి. వారి గోడులనే కథలుగా రాసారు. భరద్వాజకు కళ్ళకు జబ్బు వస్తే, వారే చికిత్స చేయించి, నాలుగు రూపాయల ఎనిమిదణాలు ఖర్చుపెట్టి కళ్ళజోడు కొనిపెట్టారు. కోగంటి రాధాకృష్ణమూర్తిగారి 'నలందా పబ్లికేషన్స్‌లో' పనిచేస్తూ, ఆయన జీతంగా కనీసం 60 రూపాయలు కూడా ఇవ్వననడంతో– అదీ మానేసారు. 1955 డిసెంబర్‌లో ధనికొండవారి ప్రోత్సాహంతోనే మద్రాసులో అడుగు పెట్టారు. రచయితగా భరద్వాజ– డబ్బుల కోసమే ఆ రోజుల్లో విరివిగా సెక్స్ కథలూ, అపరాధ పరిశోధక రచనలూ చేసారు. మద్రాసులో వుండగానే ఆ మహానగరం నుండీ, అక్కడ మనుషుల నుండీ, వాతావరణం నుండీ చాలా పాఠాలు నేర్చుకున్నారు. వందలాది మంది రచయితలతో, కవులతో, పత్రికా సిబ్బందితో, సినిమా వారితో పరిచయాలయ్యాయి. ఊహాతీతమైన సందర్భాలనూ ఎదుర్కొన్నారు. నేడు జ్ఞానపీఠ పురస్కారానికి యోగ్యమైన 'పాకుడురాళ్ళు' నవలకు అక్కడే బీజావాపనం జరిగింది. అక్షరాలకు అందని బాధలు, క్షోభలు మద్రాసులోనూ చవిచూసారు. 1959 లో చక్రపాణిగారి మాటపై హైదరాబాద్ వచ్చిన భరద్వాజ 'యువ' మాసపత్రికలో చేరారు. హైదరాబాద్‌లో భరద్వాజగారికి 1950 నుండి పరిచయం వున్న త్రిపురనేని సుబ్బారావు వచ్చి కలిశారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో భరద్వాజ ఎరిగిన గోపీచంద్, బుచ్చిబాబు, భాస్కరభట్ల, మునిమాణిక్యం, స్థానం, కృష్ణశాస్త్రి, శ్రీవాత్సవ, జనమంచి, నండూరి విఠల్ ప్రభృతులంతా అప్పుడు పనిచేస్తున్నారు.

హైదరాబాద్ రేడియో కేంద్రం గ్రామీణ విభాగంలో అసిస్టెంట్ స్క్రిప్ట్ రైటర్ ఉద్యోగం ఖాళీగా వుందని తొలిసారిగా భరద్వాజకు చెప్పింది నండూరి విఠల్. భరద్వాజ ఆ ఉద్యోగంకై ప్రయత్నించారు. త్రిపురనేని సుబ్బారావు, నర్రా కోటయ్య భరద్వాజ గురించి గోపీచంద్‌గారికి గట్టిగా సిఫార్సు చేశారు. గ్రామీణ విభాగం ప్రొడ్యూసర్‌గా వున్న గోపీచంద్‌గారు అప్పటి హైదరాబాద్ ఆకాశవాణి స్టేషన్ డైరెక్టర్ జి.పి.యస్. నాయర్ గారికి భరద్వాజ రచనా ప్రతిభ గురించి చెప్పారు. భరద్వాజగారి తండ్రి చినకోటయ్యగారికీ బాగా తెలిసిన అయ్యదేవర కాళేశ్వరరావుగారు కూడా డైరెక్టర్‌గారికి భరద్వాజ గురించి బాగా చెప్పారు. దానితో 180 రూపాయల జీతంతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం గ్రామస్తుల కార్యక్రమ విభాగంలో స్క్రిప్ట్ రైటర్‌గా 1959 నవంబర్ 25 తేదీన భరద్వాజ అడుగు పెట్టారు. సంస్థ వల్ల వ్యక్తి రాణిస్తాడా? వ్యక్తి

వల్ల సంస్థ రాణిస్తుందా? అంటే అది పరస్పరాశ్రితంగా, ఆకాశవాణిలో రాణించిన భరద్వాజ– ఆకాశవాణినీ రాణింపచేశారు. అది ఒక చిరబంధం!

ఆకాశవాణి నుండి తానెంతో నేర్చుకున్నానంటారాయన:

మనుషుల్లో ఎలాంటి ఉత్తములుంటారో, ఎలాంటి అధమాధములుంటారో అక్కడే ఆయన సోదాహరణంగా గ్రహించారు. డిగ్రీలు లేని చదువు కారణంగా యాతనలకూ గురి అయ్యారు. కొన్ని పనులు చేయడానికి అర్హత లేకపోయింది. ఏ పనీ రానివారు పీఠం అధిరోహించగా, వారికి సహాయకునిగా పనిచేయాల్సి వచ్చింది. బాలానందం, బాలవినోదం కార్యక్రమాలను అయిదేళ్ళపాటు చిన్నపిల్లలకోసం దిగ్విజయంగా నిర్వర్తించిన భరద్వాజ గొప్ప బాలసాహితీవేత్త అన్న విషయం వేరుగా చెప్పనక్కరలేదు. గ్రామస్తుల కార్యక్రమాలకోసం ఆయన తొలిరోజుల్లో ఆకాశవాణిలో చేసిన రచనలు ఎన్నో! వ్యవసాయ సంబంధిత అంశాలను అనేకం అధ్యయనం చేసి, రైతులకోసం, గ్రామీణులకోసం ఎన్నో స్క్రిప్టులు రాసారు. గొప్ప కథకునిగా, నవలారచయితగా పేరు తెచ్చుకున్న భరద్వాజ రేడియోకోసం వైవిధ్యభరితమైన రచనలు ఉద్యోగరీత్యానే చేసినా, మనసుపెట్టి శ్రోతలను ఆకట్టుకునేలా చేసారు. స్క్రిప్టురైటర్ ప్రొడ్యూసర్‌గా పదోన్నతి పొందే అవకాశం వున్నా, భరద్వాజగారికి రచయితగా గొప్ప అర్హతలున్నా, డిగ్రీల చదువులేని కారణంగా ఆ పదోన్నతిని కల్పించకుండానే అధికారులు ఆయనచేత రేడియోకి చాలా ఏళ్ళు బోలెడు సేవ చేయించుకున్నారు.

రచయితగా భరద్వాజ గ్రామీణ విభాగం పనులకే పరిమితం కాలేదు. ఎన్నో ప్రసంగాలు, రూపకాలు రాశారు. ఎందరో ప్రముఖుల్ని రేడియోకి పరిచయం చేశారు. తండ్రిగారి రాజకీయరంగ ప్రవేశం కారణంగా ఎందరో రాజకీయ నాయకులతో కూడా భరద్వాజగారికి పరిచయమే! భరద్వాజగారు కూడా నాటి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలోని మహామహుల్లో ఒకరుగా వెలుగొందారు. కృష్ణశాస్త్రి, మునిమాణిక్యం, స్థానం, నాయని సుబ్బారావు, దాశరథి, గొల్లపూడి, వేలూరి సహజానంద వంటి వారెందరో దిగ్దంతులు ఆనాడు. భరద్వాజగారికి అప్పట్లో రేడియో సంక్షిప్త శబ్దచిత్రాల పరిచాలకుడుగా పేరొందిన వాడ్రేవు పురుషోత్తం, మంచాళ జగన్నాథరావుగార్లతో మంచిమైత్రి!

నిజానికి ప్రతిభావంతులను ఆకాశవాణిలో కార్యక్రమాల సలహాదార్లుగా, ప్రొడ్యూసర్లుగా నియమించే వైఖరి వుండేది. మూడేళ్ళ కాంట్రాక్టు పద్ధతిపై నెలకు అయిదువందల రూపాయల వేతనంపై సంగీత, సాహిత్య, నాటక విభాగాల్లో ఆ

నియామకాలుండేవి. వారికి 'కనీస విద్యార్హత' అన్న నిబంధనా వుండేది కాదు! అయితే 1965-75 మధ్యకాలంలో అలాంటి నియామకాలన్నీ నిలిపివేశారు. ఇందిరాగాంధీ ప్రధాని అయ్యాక అంతకుముందు ఆవిడ సమాచార ప్రసారాల శాఖామంత్రిణిగా కూడా చేసినవారు కావడంవల్ల, ప్రొడ్యూసర్ల నియామకం పునరుద్ధరించబడింది. అయితే విద్యార్హతలు ప్రాముఖ్యం వహించకుండా ఎలా వుంటాయి? స్క్రిప్ట్ రైటర్‌గా వున్న భరద్వాజగారి ప్రమోషన్‌కూ అదే అవరోధం కాసాగింది. భరద్వాజ ఎంతో క్రుంగిపోయారు. మంచాళ జగన్నాథరావు, వాడ్రేవు పురుషోత్తంగారూ భరద్వాజగారికి నచ్చచెప్పారు.

1974 వ సంవత్సరంలో భరద్వాజగారూ, పురుషోత్తంగారూ ఢిల్లీ వెళ్ళారు. అప్పట్లో కేంద్రంలో రాజకీయంగా హోదాలో వున్న పెండేకంటి వెంకటసుబ్బయ్యగారిని కలిసి, జరిగిన సంగతంతా చెప్పారు. సుబ్బయ్యగారు అప్పటి సమాచార ప్రసారశాఖా కార్యదర్శి ఎ.జె.కిద్వాయ్‌గారికి చెప్పగా, భరద్వాజ ఆయనను కలిసారు. భరద్వాజ తాను దామోదరం సంజీవయ్యగారికి అంకితమిచ్చిన 'ఫాంటమీ క్వింటెట్' అన్న ఇంగ్లీషు పుస్తకాన్ని కిద్వాయ్‌గారికి ఇచ్చారు. దానికి కె.ఎ.అబ్బాస్ అద్భుతమైన పీఠిక రాశారు. ఆ అంకితోత్సవంలో ఐ.కె.గుజ్రాల్ కూడా పాల్గొన్నారు. కిద్వాయ్‌గారిని భరద్వాజగారు కలసినప్పుడు- గుజ్రాల్‌గారే సమాచార ప్రసారశాఖా మంత్రి! కిద్వాయ్‌గారు గుజ్రాల్‌ను కలవమనీ, తాను చేయగలింది చేస్తాననీ అన్నా భరద్వాజ గుజ్రాల్‌గారిని కలవనేలేదు.

అయితేనేం! 1975 మే లో రావూరి భరద్వాజగారిని ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్పోకెన్‌వర్డ్ విభాగానికి ప్రొడ్యూసర్‌గా నియమిస్తూ డైరెక్టర్ జనరల్ నుండి ఉత్తర్వులు వచ్చాయి. అలా 1975 మే లో ప్రొడ్యూసర్‌గా చేరిన భరద్వాజ 1987 జూలైలో రిటైరయ్యేంతవరకూ ఓ పుష్కరకాలం ఆకాశవాణి వైభవ ప్రాభవాలకు ఎంతో దోహదం చేశారు. కేవలం సాహితీపరులనే కాదు. వివిధ రంగాలకు చెందిన అనేకులను రేడియోకి పరిచయం చేసారు. వారిచేత అనేక కార్యక్రమాలు చేయించారు. ఆయన ఇరవైఏడేళ్ళ ఆకాశవాణి వృత్తిజీవితంలో ప్రొడ్యూసర్‌గా చేసిన పన్నెండేళ్లూ తనదైన ముద్రను రేడియో కార్యక్రమాలలో భరద్వాజ వేయగలిగారు. కార్యక్రమాల రూపకల్పన, ఆయా కార్యక్రమాలకై కళాకారులను, వక్తలను ఎంపిక చేసుకోవడం, వారి ద్వారా ఆయా కార్యక్రమాలను నిర్వహింపజేయడం అనే గురుతర బాధ్యత ప్రొడ్యూసర్లకు వుంటుంది. ప్రసంగశాఖ ప్రొడ్యూసర్‌గా భరద్వాజ మంచిపేరు తెచ్చు

కున్నారు. దిగ్దంతులైన సాహితీవేత్తలచే సాహితీ కార్యక్రమాలు రూపొందింపచేసి ప్రసారం చేసారు. అలాగే రాజకీయరంగ ప్రముఖులెందరినో ఆకాశవాణికి రావించారు. ఆ రోజుల్లో రేడియోనే ప్రసారమాధ్యమంగా చాలా ప్రాచుర్యంలో వుండేది. అప్పటికి దూరదర్శన్ కూడా ప్రబలలేదు.

ప్రొడ్యూసర్స్ మూడు నెలలకొకసారి షెడ్యూల్ వేస్తారు. డైరెక్టర్ ఆమోదం తీసుకుని దానిని ఆచరణలో పెడతారు. తదనుగుణంగానే కార్యక్రమాలు రూపొందుతాయి. సుభాషితాలు, చర్చలు, ఇంటర్వ్యూలు, ప్రసంగాలు, కథలు, కవితలు, సంచికా కార్యక్రమాలు ఒకటేమిటి? ఎన్నో వైవిధ్య భరితమైన కార్యక్రమాలూ, అలాగే ఉగాది వంటి పర్వదినాల వేళ– స్టూడియోలోనే కాదు, ఆహ్వానితుల సమక్షం లోనూ రసజ్ఞులైన ప్రేక్షకులను అలరించే కార్యక్రమాలూ నిర్వహించడం వుంటుంది. రోజువారీ తమ విభాగానికి సంబంధించిన కార్యక్రమాలను సమయానికి రికార్డు చేసి, ప్రసారానుగుణంగా మలచి, ముందుగా అందించడం, అనుకున్నంత సులభం కాదు! అందుకు ఎంతో శ్రమ, సమన్వయమూ అవసరం! సహజంగానే పని ఒత్తిడి, మానసిక ఒత్తిడి వుంటాయి. చిత్తశుద్ధితో, నిజాయితీతో, నిబద్ధతతో పనిచేసే వారికి ఆకాశవాణిలో ఉద్యోగమే సర్వస్వంగా అనిపిస్తుంది.

భరద్వాజగారు నిర్వహించిన 'ధ్వని' సాహిత్య సంచికా కార్యక్రమాలకు ఎంతో శ్రోతృజనాదరణ వుండేది. అలాగే ఆయన చేసిన పరిచయ కార్యక్రమాలు ప్రత్యేకంగా భాసించేవి. 'స్వాతంత్ర్యవాణి', 'జాతీయజ్యోతి' వంటి శీర్షికలతో ఆయన ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల, రాజకీయ ప్రముఖుల గళాలను ధ్వని ముద్రితం చేసారు. మాట్లాడటంలో ముక్తసరిగా వుండేవారి నుండి వారి మనసులో మాట, తన ప్రశ్నలతో రాబట్టడంలో ఆయన సిద్ధహస్తులు. భరద్వాజ ప్రసంగశాఖకు విలువపెంచారు. ముఖ్యమంత్రి హోదాకలిగి వున్న వారు కూడా స్టూడియోకి వచ్చి, కార్యక్రమాలలో పాలుపంచుకోవడంలో, భరద్వాజగారి కృషి వుంది. బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య వంటి రాష్ట్రముఖ్యమంత్రులంతా ఆకాశవాణికి తరలి వచ్చి కార్యక్రమాల్లో పాలుపంచుకున్నవారే! అధికారపార్టీ వారే కాదు, ప్రతిపక్ష నేతలెందరో కూడా భరద్వాజగారి కృషివల్ల ఆకాశవాణి ప్రాసంగికులుగా రాణించినవారే. పెండేకంటి వెంకటసుబ్బయ్య వంటి కేంద్రమంత్రి భరద్వాజ పట్ల ప్రత్యేకించి అపేక్ష కనబరచేవారు.

ఉద్యోగ నిర్వహణలో భరద్వాజ నిత్యచైతన్య శీలి. ప్రసంగకర్త ఉదయం ఏ ఎనిమిదిన్నరో, తొమ్మిదింటికో మాత్రమే తనకు రికార్డింగుకు రావడం

కుదురుతుందంటే ఆఫీసువేళలు అన్న పట్టింపు లేకుండా, ఆ సమయానికే తరలి వచ్చి, రికార్డు చేసేవారు. రావూరి భరద్వాజగారి వద్ద కొన్నేళ్లు సహాయకునిగా పనిచేసే అవకాశం ఈ వ్యాసరచయిత సుధామకు సమకూరడంవల్ల– ఆయననూ, ఆయన పనిచేసే విధానాన్నీ సామీప్యంగా చూసే వీలు చిక్కింది. అనంతరకాలంలో అదే విభాగానికి కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసేందుకు ప్రాతిపదికలు వేసింది. ప్రాసంగికుల నుండి విషయం రాబట్టడంలో భరద్వాజ లౌక్యం కలవారు కూడానూ! ఆకాశవాణి నియమావళికి విరుద్ధంగా, ఎవరి స్క్రిప్ట్‌లోనైనా ఏ అంశాలైనా దొర్లితే, ఆ ప్రాసంగికులు నొచ్చుకోకుండా, ఆ అంశాలను పరిహరింప చేయడంలో, ఆయన వచోనైపుణి, ప్రముఖులతో వారికిగల పరిచయాలు ఎంతో దోహదం కలిగించేవి. ప్రభుత్వ విమర్శకు తావులేకుండా, ప్రాసంగికుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రసంగాలను ప్రసారం చేయించేవారు. ఎర్ర పెన్సిల్‌తో స్క్రిప్ట్‌లో అక్కరలేని వాటిని గుర్తించి, రికార్డు కాకుండా పరిహరింపచేసేవారు.

ఎందరినో వరుసలతో పిలవడం ఆయనకు అలవాటు. రాజకీయ ధురంధరు లైన ప్రముఖులను సైతం, కొందరు అమాత్యులను సైతం 'బావా' అనే పిలుపుతో భరద్వాజ కట్టిపడవేసేవారు.

ఆకాశవాణి ప్రసంగకర్తలకు, కళాకారులకు పారితోషికాలను రికార్డింగు జరిగిన వెంటనే అందచేయడంలో నాటికీ నేటికీ ముందే వుంది. రికార్డింగు అయిన వెంటనే వారికి పారితోషికం చెక్ ఇప్పించడానికి, తానే వెంటబెట్టుకుని డ్యూటీ రూమ్‌కు వచ్చి, రికార్డింగ్ సర్టిఫై చేస్తూ, పారితోషికం అందుకుంటున్న వారు రెవెన్యూస్టాంప్ మీద సంతకం చేయాలి కనుక, వారి దగ్గర రెవెన్యూస్టాంప్ లేకపోతే, తానే స్వయంగా ఎందరికో ఆ స్టాంప్ ఇవ్వడమో, ఆ స్టాంప్ తాలూకు ఇరవై పైసలు తానే చెల్లించడమో చేయడం భరద్వాజగారికే చెల్లింది! ఆర్టిస్టు ఇబ్బంది పడకూడదనీ, అదే సమయంలో ఆకాశవాణి సిస్టం దెబ్బతినకూడదనీ, గాఢంగా విశ్వసించి పనిచేసిన వాడాయన. అలా తన చేతి డబ్బుతోనే వారికి టీ కాఫీలు త్రాగించేవారు. తన బిస్కెట్ ప్యాకెట్టులోంచి ఓ బిస్కెట్టూ పెట్టేవారు.

ఆకాశవాణి ఏటా జాతీయకవి సమ్మేళనానికి ఒక తెలుగు కవిని హైదరాబాద్ కేంద్ర ఆధ్వర్యంలోనే నిర్ణయించి పంపే కార్యక్రమ అనుసంధానం కావిస్తుంది. ఢిల్లీలో తుది నిర్ణయం జరుగుతుంది. 1983 లో జాతీయ కవిసమ్మేళనానికి ఈ వ్యాసకర్త సుధామ ఎంపికై, ఒక ఆకాశవాణి ఉద్యోగి అలా ప్రాతినిధ్యం వహించే ఘనత తెలుగులో తొలిసారి దక్కించుకోవడానికి, భరద్వాజగారి కృషియే కారణం!

ప్రసారనిమిత్తం కవితాపఠనానికి రావలసిన శేషేంద్ర అనివార్య కారణాల వలన రికార్డింగుకు రాలేకపోతే, ప్రసారం కోసం సుధామచే కవిత రాయించి ప్రసారం చేసి, అప్పటి స్టేషన్ డైరెక్టర్ శ్రీ రాజారాంగారి సూచన మేరకు, దానిని జాతీయ కవిసమ్మేళనం పరిశీలనకు పంపడంలో ముఖ్యభూమిక భరద్వాజగారిదే! ఇలా ఎందరో యువకులను ప్రోత్సహించారాయన. వరంగల్, నిజామాబాద్ వంటి తెలంగాణ జిల్లాలలో ఆహూతుల సమక్షంలో కవి సమ్మేళనాలను భరద్వాజ నిర్వహించారు. వృత్తిలో వుంటూనే– తన రచనా ప్రవృత్తికి వన్నెవాసి తెచ్చుకున్నారాయన. 'పాకుడురాళ్లు' ఆకాశవాణిలో స్క్రిప్ట్‌రైటర్‌గా పనిచేస్తున్న కాలంలో రాసిందే. అలాగే ఆయనకు పేరు తెచ్చిన మరో అద్భుత రచన 'జీవనసమరం'. రేడియోలో కూడా బూట్‌పాలిష్ వాడినీ, తోపుడుబండి వాడినీ, పూలమ్మినీ, పెళ్లి ఊరేగింపులో పెట్రోమాక్స్‌లైట్లు నెత్తిన పెట్టుకుని నడిచే మనిషినీ, సైకిల్ రిపేరర్‌నీ ఇలా... అధోజగత్సహోదరు లెందరినో ఇంటర్వ్యూలు చేసి ప్రసారం చేసారు భరద్వాజ. ఆకాశవాణిని అలా సామాన్యుడి గళంగా మలిచారు.

ఎన్నికల ప్రసంగపాఠాలు సరిచూడడం అనేది కత్తిమీద సాములాంటిది. 1983లో ఎన్నికలు వచ్చినప్పుడు, జాతీయపార్టీలకు రెండువిడతలుగా రేడియోలో ప్రసంగించే వీలు కల్పించింది ఎన్నికల కమీషన్. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రసంగ పాఠాల్ని ముందుగా సరిచూసి, అభ్యంతరకర విషయాలున్నా, ఎదుటి పార్టీపై దూషణలున్నా తొలగించవలసి వుంటుంది. సి.పి.ఐ.యూ. అభ్యర్థి మాకినేని బసవ పున్నయ్యగారు వచ్చినా – 'బావగారూ! మీ స్క్రిప్టులో అభ్యంతరాలేముంటాయి లెద్దురూ' అంటూనే, 'చూడవోయ్' అని వారి చేతనే అనిపింపచేసుకుని, '[ప్రసంగ వ్యవధి మించిపోయేలా వుంది. ఈ పేరాలు తొలగిస్తే సరిపోతుంది సుమండీ!' అంటూనే భరద్వాజగారు అభ్యంతరకర వాక్యాలను రౌండాఫ్ చేసి తీసివేసి ఆయనచేత చదివించి, రికార్డు చేయడం... ఇలా ఎన్నో ఇబ్బందికర సన్నివేశాలను చాకచక్యంగా పరిష్కరించడం ఆయనవల్లా, ఆయనకు ప్రముఖులతో గల సన్నిహిత పరిచయాలవల్లే సాధ్యమైందనాలి! పి.వి.వంటి వారి ప్రసంగాలను కూడా సమర్థవంతంగా తనకున్న చనువుతో ప్రసార నిబంధనల కనుకూలంగా– చిత్రిక బట్టి, ప్రసారం చేయించిన ఘనత భరద్వాజగారిదే!

తెలుగు ప్రసంగ విభాగం ఆధ్వర్యంలోనే వుండే 'గాంధీమార్గం' కార్యక్రమంలో– గాంధీ ఆత్మకథా భాగాలను భరద్వాజగారే స్వయంగా చదివేవారు. ఎం.ఎన్.శాస్త్రి గారి తర్వాత 'గాంధీ మార్గం' కార్యక్రమానికి తన గళంతో ఆ గంభీరతనూ, ఉదాత్తతనూ

కలిగించింది భరద్వాజగారే. భరద్వాజగారి 'పాకుడురాళ్ళు' రేడియో నాటకంగా, 'నవలాస్రవంతి' పఠనంగానూ కూడా ప్రసారమైంది. అలాగే ఆయన 'కాదంబరి' నవల కూడా ఆయన రిటైరైన తర్వాత 'నవలాస్రవంతి'లో ధారావాహికంగా వచ్చింది. రిటైరయినా, రేడియోలో 'భావన' వంటి కార్యక్రమాల్లో ఆయన భావాల రవ్వలు వెలుతురు చినుకులుగా ప్రసారితమయ్యాయి. రికార్డింగుకు ఎప్పుడొచ్చినా అందరినీ ఆప్యాయంగా పలుకరించి, పలుకరింప జేసుకునే ఆత్మీయులాయన.

రేడియోపట్ల ఆయన ఎప్పుడూ కృతజ్ఞతా భావాన్నే ప్రకటించారు. 1976 లో ఒకసారి, 1983 లో ఆకాశవాణిలో మరోసారి ఆయనకు గుండెపోటు వచ్చింది. 1983 లో ఆకాశవాణిలో వుండగానే జరిగిన సంఘటన అది! అప్పట్లో లీలాబొడేకర్ అనే మరాఠీ అవివాహిత స్త్రీ, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం డైరెక్టర్‌గా వుండేవారు. 'తెలుగుశాఖ షెడ్యూల్ ఇంకా ఎందుకు ఇవ్వలేదని' ఆ రోజు ఉదయం మీటింగ్‌లో పదిమంది మధ్యా భరద్వాజగారిని జరిగిన ఆలస్యం గురించి, ఆవిడ రెట్టించి అడిగారు. ఆయన ఒత్తిడికి గురై, సొమ్మసిల్లిపోయారు. ఆఫీస్ కార్లోనే హుటాహుటిని ఆయనను 'నిమ్స్' హాస్పిటల్‌కు తరలించి, వెంటనే చికిత్స అందించడంతో, వారం పదిరోజుల తర్వాత ఆయన కోలుకున్నారు.

ఇంకో ఏడాదిలో రిటైరవుతారనగా 1986 ఆగస్టు ఒకటవ తేదీన భరద్వాజ గారు తమ జీవనసహచరి 'కాంతం'గారిని పోగొట్టుకున్నారు. ఆయనే స్వయంగా డ్యూటీ రూంకి ఫోన్‌చేసి తాను ఆఫీసుకు రాలేకపోతున్నానంటూ, ఆ విషయం చెప్పారు. నిజానికి కాంతం ఆయన సర్వస్వం! ఆ వేదననూ తనలోనే ఇముడ్చుకుని, తెలుగు సాహిత్య ప్రపంచానికి అద్భుతమైన 'స్మృతిపంచకం' అందించిన మహానుభావు డాయన! ఆకాశవాణికి రావూరి భరద్వాజగారు అందించినది కేవలం ఉద్యోగరీత్యా కూడిన సేవలనడానికి వీల్లేదు. రేడియో వైభవప్రాభవాలకు తన శక్తియుక్తులను వెచ్చించారాయన. ఆకాశవాణి వల్లనే తాను జీవితంలో ఇంత ఎత్తులకు ఎదగగలిగానని కృతజ్ఞతతో సదా వినమ్రులయ్యే కారుణ్యమూర్తి భరద్వాజ. రావూరి భరద్వాజ అంటే చాలామంది రేడియో భరద్వాజగారేనా? అంటారంటే– ఇంక వేరేమి కావాలి!

('రావూరి భరద్వాజ రచనలు–ఒక పరిశీలన'–విశాలాంధ్ర ప్రచురణల సంకలనం, మార్చి 2014)

❖

(35) బొమ్మల బ్రహ్మ అవతారం చాలించాడు

బాపుగారు పోయారు...

అందుకు కళ్ళమ్మట నీళ్ళెట్టుకుని ఏడ్చినవారూ, 'ఇంతమంది బాపు గురించి ఎంతో గొప్పగా ఫీలై, అటువంటివాడు, పోయాడని ఏడ్వడమా?' అని ఏడ్చిపోయిన వాళ్ళూ– వున్నారు.

'బాపు' అజాతశత్రువేమీ కాదు. రమణతో బాటు స్నేహానికి 'ఐకాన్'గా ఆయన నిలిచినా, ఆయన తమవాడు కాదనీ, తమకేమీ చేయలేదనీ, శత్రుభావనతో ఏడ్చి పోయేవారుంటే ఉండవచ్చు. పోనీయండి.

శ్రీరాముడు గొప్పవాడే– రావణాసురుడు ఒకడుండడం వల్లనే మరింతగా!

'ఒక వర్గం ఒక మతం ప్రయోజనాల కోసం జీవితకాలం పనిచేసిన బాపుగారికి ప్రభుత్వ లాంఛనాలతో కర్మకాండలు జరగాలని కోరుతున్నారు. గొప్ప తెలుగు జాతి కళాకారుడు... యావత్ తెలుగుజాతి సమాజానికి సాంస్కృతిక ప్రతినిధిగా శ్రుతిమించి పొగుడుతున్నారు'.

'There is no single Telugu culture at all. There are Telugu cultures. In that hundreds of cultures one culture people say Bapu represents whole Telugu culture' అని 'బాపు' గురించి తక్కువ చేసి భావించినవారూ, అదే 'ఎక్కువ' అని భావించిన వారూ ఉన్నారు.

ఆయన పార్థివశరీరం మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన పూలగుచ్ఛం ఉంచడం తప్ప, ప్రభుత్వ ఆధికారిక లాంఛనాలతో, 'గన్ సాల్యూట్'తో ఆయనకు అంత్యక్రియలేమీ జరగలేదు. నిజమే! ఆ 'తుపాకీ పేలుళ్ళూ' అవీ, ఆయనకు నచ్చవు. సభల్లో దండలు వేసి దండాలు పెట్టడాలే ఆయనకి అంతగా మనస్కరించేవి కావు.

'కృషితో నాస్తి దుర్భిక్షం/ జపతో నాస్తి పాతకం/ మౌనినః కలహో నాస్తి/ నాస్తి జాగరతో భయమ్' అన్నదాన్ని విశ్వసించినట్లుగా– తాను వేసే, తీసే బొమ్మల కృషే

ఆయనకు వేరే దరిద్రాలేవీ మనసుకు అంటకుండా నిల్పింది. శ్రీరామనామ జపమే– 'ఆయనకు పద్మశ్రీ మాత్రమే వచ్చింది పాపం!' అనే పాపాన్నయినా అంటకుండా చేసింది! మౌనంగా వుండడమే ఆయనకు పదిమందిలో ఇష్టం. ఆయన ఎవరితోనూ కలహించలేదు. తనకు నచ్చకపోతే బొమ్మ వేయకుండా చెక్కు వెనకాల 'రామరామరామ' అని రాసి, 'రామాయణ విషవృక్షాని'కైనా బొమ్మ వేయకుండా పంపేసారే గానీ, దేనికీ 'వాదు' పెట్టుకోలేదు. ముళ్ళపూడి వెంకటరమణకు మధ్యాహ్నం భోంచేశాక కాసేపు కునుకుతీసే అలవాటుంది గానీ, బాపు మెలకువతోనే వుండి పనిచేసుకునే వారు. తనకు గుర్తింపులు రావేమోననీ, గొప్పగా ఆస్తులు కూడబెట్టలేనేమోననీ ఆయనేం భయపడలేదు. ఎందుకంటే అంతటి ఆరాటాలూ, పోరాటాలూ తన నైజం కాదు.

చెన్నయ్ శ్మశానవాటికలో బాపు అంత్యక్రియలకు పాతికమంది మించి లేరంటే బాధపడడం అనవసరం! ఎందుకంటే లక్షలాది మంది గుండెల్లో 'చిరంజీవి'గా నిలిచేవాడికి, భౌతిక అంత్యక్రియలు చేయగలం తప్ప, ఆయనను లేకుండా చేయడం సాధ్యం కాదు. 'బాపు' తుడిచిపెట్టలేని గుండెకింద చిరునామా! తెలుగువారి 'హృదయ వాసి'.

వ్యంగ్య చిత్రకారుడిగా, కవితలకు, కథలకు, నవలలకూ ఆ సృజనకారుల భావాలకు ఉద్దీపన కలిగించే రేఖాచిత్రకారునిగా, 'తామింత అందంగా వున్నామా' అని దేవీదేవతలే మురిసేలా, వారిని రూపు కట్టించి ఇళ్ళ, గుళ్ళ పూజా మందిరాల్లో సుప్రతిష్ఠితం చేయగల వర్ణ చిత్రకారునిగా, కథా కథనాలనూ, సంఘటనలనూ, పాత్రలనూ ప్రతి 'ఫ్రేమ్'లో అద్భుతంగా బంధించి సహజత్వంతో అందంగా చూపించే, చలన చిత్రకారుడైన దర్శకునిగా 'బాపు' సజీవుడే! అస్తమించని 'చిత్ర' భానుడే!

తెలుగు సంస్కృతి, తెలుగుతనం అనేక పార్శ్వాలలో వుంటుందనీ, బాపన పుట్టుకవల్ల మాత్రమే తాను 'బాపు' అయ్యాడనీ, మరో 'కాపు'గానో, 'మాపు' గానో కాలేదనీ– అంటే అనేవారుంటే వుండనీయండి! కానీ ఆయన బొమ్మలూ, ఆయన తీసిన చిత్రాలూ 'తెలుగుతనం' ప్రతీకలుగా భావించే సమాజం ప్రపంచ వ్యాప్తంగా వుంది.

ఆయన ఆస్తికుడే! నాస్తికుడు కాదు. కానీ కమ్యూనిస్టు భావజాలపు శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గీతాలకు బొమ్మలు సంతరించాడు. ఆయన హిందువే కానీ– దాశరథి 'గాలిబ్ గీతాలు'కు ఆయన గీసిన బొమ్మలు చూసి ఆ షాయిరీ, గజల్స్‌ల, అలాగే ఆరుద్ర 'అరబ్బీ మురబ్బా'ల మూలాలను కేవలం బాపు బొమ్మ చూసి వల్లించిన

అన్యమతస్థులున్నారు. దిగంబర కవితా సంపుటికీ బొమ్మ గీశాడు బాపు. సత్యం శంకరమంచి 'అమరావతి కథలు', వంశీ 'పసలపూడి కథలు', నామిని సుబ్రహ్మణ్యం నాయుడి 'పచ్చనాకు సాక్షిగా', 'మిట్టూరోడి కథలూ' ఆయన బొమ్మలతో వన్నెవాసికి ఎక్కాయి.

సచిత్ర వారపత్రికల్లో ఎందరో రచయితలూ, రచయిత్రులూ (వారంతా ఏదో ఒక కులంవారో, మతంవారో కాదు సుమా!) తమ కథలూ, సీరియల్ నవలలూ బాపు బొమ్మలతో రావాలని పరితపించేవారు. అలా వేసిన బొమ్మలూ వున్నాయి. రంగనాయకమ్మ 'బలిపీఠం' బాపు బొమ్మలతోనే వచ్చింది. ఆయన బొమ్మల వైవిధ్యం, వైశాల్యం, గాఢత, సాంద్రత అపూర్వం... అనితర సాధ్యం!

'బాల' పత్రికలో 'కవ్వం చిలికే అమ్మాయి' బొమ్మతో శ్రీకారం చుట్టి, 'శ్రీరామరాజ్యం' చలనచిత్ర దర్శకత్వం వరకూ– 'బాపు' జీవన ప్రస్థానం సాగింది. 'బొట్టులేని అమ్మాయిబొమ్మ బాపు ఎప్పుడైనా వేశాడా?' అని అమాయకంగా ప్రశ్నించిన వారున్నారు. 'కరుణామయుడు'గా పేరుగాంచిన విజయచందర్‌తో క్రిస్టియన్ ఇతివృత్తంతోనే 'డిక్లోనింగ్ ఆఫ్ గాడ్ బై ద డెవిల్' గా 'రాజాధిరాజు' సినిమా చూసి మాట్లాడాలి!. చలన చిత్రం స్క్రిప్ట్ మొత్తం షాట్స్ డివిజన్‌తో సహా– బొమ్మలు వేసుకుని తయారు చేసుకునే ఒకే ఒక్క తెలుగుదర్శకుడు 'బాపు' (సత్యజిత్ రే ఒక్కడే అలా రూపొందించుకునేవాడు). ఆ బొమ్మలు చూసి మాట్లాడాలిగా! కానీ మాటలు రాక అప్రతిభులమవుతాం మరి!

–తన దగ్గరున్న ఓల్డ్ క్రిస్టియన్ బిబ్లికల్ పెయింటింగ్స్ మీద టైటిల్స్ సూపరింపోజ్ చేయించి– 'స్టార్‌వార్స్' థీమ్ మ్యూజిక్ యథాతథంగా వాడేసుకున్నాననీ, తన దగ్గరుండే ఫ్యాంటసీ లొకేషన్స్ పుస్తకాలలోంచి నల్లగా వుండే చోట్లు మాస్క్ చేసి– నూతన్ ప్రసాదూ, విజయచందరూ అక్కడ నడుస్తున్నట్లు 'రాజాధిరాజు' చిత్రం కెమెరామాన్ 'లోకేసింగ్' మాయాజాలం చేశాడనీ బాపు స్వయంగా చెప్పారు (చూ॥ కొసరు కొమ్మచ్చి). అవును... ఆయన చిత్రకారుల్లో 'రాజాధిరాజు'.

ఒకరెవరో ఆరోపించినట్లు– కేవలం ధనిక సంస్కృతికే కొమ్ముకాసే పనులు 'బాపు' చేసివుంటే, ఒక 'అందాల రాముడు' రూపొందేదా అటువంటి కథా కథనంతో...? నిజమే! ప్రధానంగా మధ్యతరగతి జీవన ప్రతిబింబంగానే– తన 'కళ'ల్లో 'బాపు' ద్యోతకమవుతాడు. అది సహజం! ఒక కళాకారుడు తాను ఏ కులంలో, ఏ ప్రాంతంలో, ఏ మతంలో పుట్టాడు అన్నది కేవలం అతని చేతుల్లో లేదు. ఆ జీవితం

నుంచి ఎదుగుతూనే, ప్రతిఫలిస్తూనే, సమష్టిగా, విశ్వజనీనంగా, మానవీయంగా రూపొందగలగాలి!. 'బాపు' తెలుగు వారందరివాడు.

కేవలం గుండ్రంగా వుండే తెలుగు అక్షరాన్ని తన వంపు సొంపులతో వేగంగా రాసుకునే 'లిపి'గా, సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న సమాజానికి ఎంతో ఉపయుక్తంగా మలిచి, 'బాపు ఫాంట్' అనేది రూపొందడానికి హేతువయ్యాడు. ఇదొక్కటి చాలదూ! తన ప్రతిభా పాటవపు చిరంజీవత్వానికి!

తెలుగు అక్షరాలు బాపు 'దస్తూరీ'తో అంద చందాలద్దుకున్నాయి. ఆకర్షణను సంతరించుకున్నాయి. ఎందరో చిత్రకారులకు బాపు 'ఏకలవ్య' గురువై, వారి జీవికకూ, భుక్తికీ కూడా కారకుడు, ప్రేరకుడు అయ్యాడు. బాపు 'స్ఫూర్తి' అంతరించేది కాదు. ముఖచిత్రాలు వేసి పెట్టడానికి రచయితల పుస్తకాలకు– కొందరు చిత్రకారులు వేలకు వేలు ఆశిస్తున్నారు ఇవాళ. రచయితలను ప్రోత్సహించడం కోసం, వారు స్వయంగా పుస్తకం వేసుకుంటే వాటికి ముఖచిత్రాలను ఉచితంగా, శుభాకాంక్షలతో 'బాపు' చిత్రించి పంపిన వైనాలు అనేకానేకం! చాలాకాలం క్రితం ఒక మిత్రుడి పక్షాన అతని పేరనే బాపుగారికి నేను లేఖ రాసి, అతని కవితా సంకలనానికి బొమ్మ వేయమని కోరగా, పంపిన చెక్కు వెనక 'శుభాకాంక్షలతో' అని రాసి పంపుతూ, అందమైన బొమ్మ ముఖచిత్రంగా పంపిన సహృదయత స్వయంగా నేనెరుగుదును! (జి.కుమారస్వామి నాయుడు– 'పువ్వులు నవ్వుతున్నాయి' కవితా సంకలనం– యువభారతి ప్రచురణ) అలా ఆయన సమాదరించిన వారెందరో!

కథకు బొమ్మ వేసినందుకు ఎంత తీసుకుంటారు అని అడిగితే– మూడు వందల రూపాయలన్నారట ఒకసారి బాపు. 'అమ్మో! అంతా!' అని అంటే– 'అది బొమ్మ వేసినందుకు కాదు, కథ ఆసాంతం చదివినందుకు' అని సమాధానమిచ్చే చతురత ఆయన సొంతమే! దటీజ్ బాపు!

31 ఆగస్టు 2014 ఆదివారం బాపు అస్తమించాడు.

సరే! అసలు 15 డిసెంబర్ 1933 లో బాపు పుట్టకపోయి వుంటే... అందమైన అమ్మాయి 'బాపు బొమ్మ' అనిపించుకునేది కాదు.

తెలుగు అక్షరం కాపీరైటింగ్ పుస్తకంలాగానే వుండిపోయేది.

ఒక బుడుగు, సీగాన పెసూనాంబ, రాధాగోపాళం, లావుపాటి పక్కింటి పిన్నిగారు, గిరీశం, అప్పారావు మన జీవితాల్లో ఇలా పెనవేసుకు పోయేవారు కాదు.

'సాక్షి' నామ సంవత్సరంతో బాపు 'దర్శకుడు' కాకపోయుంటే– తెలుగు ఫార్ములా కమర్షియల్ సినిమాకు కూడా ఇంత సౌందర్యం అబ్బేది కాదు. 'కెమెరా కన్ను' గల 'బాపు ఫ్రేమ్'లు అంటూ చలనచిత్ర జగత్తులో ఏర్పడేవి కావు!

రామాయణ, భారత, భాగవతాది పురాణ పాత్రలు ఇంత నయన మనోహరంగా మన హృదయాలకెక్కి, ఆస్తికతకు మరింత ప్రోది కలిగేది కాదు. కవులూ, కథకుల భావాలు బాపు బొమ్మల్లో వారికే అచ్చెరువు కలిగేలా ప్రతిఫలించి, పాఠకులను ఆకట్టుకునేవి కావు.

తెలుగుభాష ఆడియో వీడియో పాఠాలుగా ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఆసక్తికరంగా అందేది కాదు.

ఒక చిరంజీవి, శ్రీధర్, రావుగోపాలరావు, మాడా, ఏ.వీ.యస్. వంటి నటులూ, సంగీత, దివ్యవాణి, ఈశ్వరీబాయి, ఆమని, నయనతార వంటి నటీమణులు సినిమా ప్రేక్షకులను ఇంతగా ఆకట్టుకునేవారు కారు.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక, జ్యోతి, యువ వంటి మాసపత్రికలు తెలుగు సాహిత్య ప్రపంచంలో అంతలా రాణించేవి కావు.

ఇవన్నీ అతిశయోక్తులో, ఊహలో కావనీ, యథార్థాలనీ అంగీకరించే వారున్నారు. 'బాపు ఏమయినా 'తోపు'నా! ఈయన కాకపోతే మరొకరు వుండేవారు' అనేవారికి నమస్కరించడం తప్ప చేయగలిగిందేమీ లేదు!

'తక్కువేమి మనకూ బాపు ఒక్కరుండు వరకూ' అని అభిమానించే వారు ఎందరెందరో ఉండేవారు, ఉన్నారు, ఉంటారు.

'ఎవరు గీస్తే బొమ్మ కలిగి మైండ్, హార్ట్ రెండూ... 'బ్లోయింగో' ఆయనే బాపు'.

'బొమ్మగా బ్రతికితే బాపు యుగం–
మనము తెలుగుతనమున వుంటే బాపు జగం'.

సత్తిరాజు లక్ష్మీనారాయణ (బాపు), ముళ్ళపూడి వెంకటరమణ (రమణ) ఇక శివైక్యం చెందారు. రాముడు 'శివం' అయ్యాడు. 'బాపూరమణీయం' ఇక 'సత్యం–శివం–సుందరం'గా నిలిచిపోతుంది. 'అనంతం'లో బాపు కూడా ఇప్పుడొక 'చినుకు'.

(చినుకు మాసపత్రిక, సెప్టెంబర్ 2014)

❖

(36) ఇక తిరిగిరాని జానకీరాణి!

మనుషులు జ్ఞాపకంగా మాత్రమే మిగిలే క్రమంలోకి తానూ తరలి వెళ్ళిపోయారు. జీవితం తనను చాలా అల్లరి పెట్టింది. ఈ కష్టం తనకు ఎందుకు రావాలని కుంగిపోయేంతలా సతాయించింది.

కానీ... కళ్ళకు కాటుక రేఖ... పెదవులపై దరహాస రేఖ... గుండెల్లో నిబ్బరం... మనుషుల మీద ప్రేమతో కూడిన అబ్బురం... మూర్తీభవించిన రూపసి, హృదయవాసి ఆవిడ.

1950-60 దశకాల్లో తన కథలతో పాఠకుల అభిమాన రచయిత్రి. 70 వ దశకపు ఉత్తరార్ధం నుండి శ్రోతృజన హృదయనేత్రి.

పత్రికలు, రేడియో, సమాజసేవ ముప్పేటలుగా అల్లుకున్న కార్యరంగం. తొలితరం వారికి న్యాయపతి కామేశ్వరి కాగా- మలితరం వారికి 'రేడియో అక్కయ్య' తురగా జానకీరాణి.

ఆవిడ కృష్ణాజిల్లా దివిసీమ మందపాకలో 1936 ఆగస్టు 31 న పుట్టారు. కథారచయిత్రిగా, ఆకాశవాణి ప్రొడ్యూసర్‌గా ఆవిడ వేసుకున్న 'పాక'లో అభిమానులుగా చేరిన 'మంద' చాలానే వుంది.

అల్లరిచేసే పిల్లలతో బాలానందం, బాలవినోదం అంటూ తాను అల్లరి పిల్లగా వుంటూనే- ఎందరో పిల్లల, వారి తల్లుల ప్రతిభా సామర్థ్యాలను గుర్తించి, ప్రోత్సహించి వారి ఎదుగుదలకూ, సమాజంలో ఓ గుర్తింపుకూ బాసటగా నిలిచిన వారావిడ. 'బాలజాగృతి' నొనర్చి- 'మహిళా సమాజం'లో అభ్యుదయ 'రంగవల్లి' దిద్దిన ప్రతిభామతి.

'సంతోషంతో సకల ప్రపంచం పకపక లాడాల'న్నది ఆమె ధ్యేయం. అందుకోసం దుఃఖపు తుఫానులను నిజజీవితంలో ఎదుర్కొన్నా- చలించక, చలించినా

నైరాశ్యంతో చరించక, బ్రతుకుపై తీపిని పంచి, పెంచి, తన పథంలో కదం త్రొక్కిన ఆమే ఒక సైన్యం.

'మా తాతయ్య చలం' అని ఆవిడ పుస్తకం రాస్తే సంచలనం కోసం అనుకున్న వారున్నారు. చలం చెల్లెలు దుల్లా వెంకటరమణమ్మ జానకీరాణిగారి అమ్మమ్మ. చలమే స్వయంగా జానకీరాణితో 'నువ్వు ఫీల్ అయ్యేదే వ్రాయి. నువ్వు నమ్మేదే వ్రాయి' అన్నారు. ఆవిడ ఆ పనే చేశారు. ఆఖరికి చలం గురించి రాస్తూ– తాతయ్యగా తనను మనుమరాలిగా ముద్దుపెట్టుకున్నప్పుడు కూడా ఆయన భావనలో 'అందమైన అమ్మాయి' అనేదే వుందని అందుకే చెప్పగలిగారు. చలాన్ని అర్థం చేసుకోవడానికి ఆయనలోని లోపాలతోబాటు తెలుసుకుని అర్థం చేసుకోవాలనీ, ఆయన తాత్వికత, దృక్పథం అర్థం కావడానికి ఉపకరించాలనే– చలం తనకు రాసిన లేఖలతో బాటుగా ఆ పుస్తకం ప్రచురించానన్నారు.

దివిసీమ తుఫానుకన్నా ముందే ఆవిడ జీవితంలో– భర్త తురగా కృష్ణమోహన రావు కృష్ణాఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభోత్సవం నాడు ఎక్కవలసిన రైలు తప్పి, అందుకోవడానికి వెడుతూ, జీప్ ప్రమాదంలో మరణించడం ఓ పెద్ద తుఫాను.

మొన్నటి హుద్‌హుద్ తుఫాను కంటే ముందే కొద్ది నెలలక్రితం తనకు కలిగిన వయసులోనే సుమారుగా తన పెద్దకూతురు ఉషారమణి భర్తను కోల్పోవలసి రావడం, అలా తన అల్లుడు రేవల్లి నరేందర్ అనారోగ్యంతో మరణించడం– మరో పెద్ద తుఫాన్!

భర్త పోయినప్పుడు పసివారయిన తన ఇద్దరు కూతుళ్ళు ఉష, వసంత శోభలను పెంచే బాధ్యతతో– గుండెనిబ్బరంతో జీవించి, వారిద్దరినీ సమాజంలో ఒక మంచి స్థాయిలో నిలబడేలా పెంచి పెద్దచేసారు. కానీ... అల్లుడు పోయాక పెద్దవారయిన ఇద్దరు కూతుళ్ళూ ఒంటరివారవుతున్నారన్న దిగులుతోనే– గుండెలోని పేస్ మేకర్ ఆవిడ కాలి బాధను చూడలేక మొరాయించడంతో, అక్టోబర్ 15, 2014 న బుధవారం సాయంత్రం కన్నుమూసారు.

ఆమెకు ఇష్టులైన వారిలో నేనూ ఒకడిని కావడం, తనను కోల్పోయిన కష్టాన్ని మరీ పెంచుతోంది. ఇలాంటి భావనకు లోనవుతున్న నావంటి వారెందరో... నేనెలా చెప్ప(గల)ను.

ఆవిడ ఆకాశవాణిలో ప్రొడ్యూసర్‌గా చేరిన రెండేళ్ళకు అనుకుంటా, నేను ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా 1978 లో జూన్ 1 న చేరాను. 1979

అంతర్జాతీయ బాలల సంవత్సరంగా ప్రకటన రావడం తరువాయి జానకీరాణిగారే నా చేత రేడియోకి మొదటిసారిగా పాట రాయించారు.

'ఎల్లలెరుగని వాళ్లమూ– కల్లలెరుగని వాళ్ళమూ– బాలలం మేమొక్కటే– లోకమూ మాకొక్కటే' అంటూ నేను రాసిన ఆ పాట అంతర్జాతీయ బాలల గీతంగా చిత్తరంజన్‌గారి సంగీత దర్శకత్వంలో రూపొందింప చేసినది ఆవిడే. ఇవాళ సంగీత దర్శకులుగా రాణకెక్కిన కె.రామాచారి, బంటి ఆనాడు బాలలుగా ఆ పాట పాడిన బృందంలోని వారే.

అది మొదలు పిల్లల కార్యక్రమాలతో, స్త్రీల కార్యక్రమాలతో ఆవిడ చేసిన 'బాల జాగృతి' వంటి అనేక కార్యక్రమాలతో నన్నూ అనుసంధానం చేశారు. పాటలు, నాటికలు రాయించారు. బొమ్మలు గీయించారు. పబ్లికేషన్ డివిజన్ ప్రచురించిన జానకీరాణిగారి పిల్లల కథల సంపుటి 'మిఠాయి పొట్లం'కు ముఖచిత్రం నేనే వేశాను. 'బాలజాగృతి'కి కూడాను. ఆవిడ ఆహూతుల సమక్షంలో పలు జిల్లాలలో నిర్వహించిన కార్యక్రమాలకు డ్యూటీ ఆఫీసర్‌గా నన్నూ తీసుకుపోయేవారు. రవీంద్రభారతి వేదికపై ఆవిడ రాసిన 'వివాహము సంభవించును' వంటి నాటకాలలో నా చేత వేషం కూడా కట్టించారు.

ఎన్ని జ్ఞాపకాలు! ఎన్నెన్ని తీపి సంగతులు!! ఎంతటి కాలరేఖలు!!

భర్త కీ॥శే॥ తురగా కృష్ణమోహన్‌రావుగారి పేరుమీద నెలకొల్పిన పురస్కారం ఒక ఏడాది నాకూ అందించిన ఆ ఆత్మీయతా గౌరవం మరిచేది ఎలా? ఆవిడ కన్నా పదిహేనేళ్ళు చిన్నవాడినయినా నా గురించి ఇతరుల దగ్గర చెప్పేటప్పుడు ఆత్మీయంగా ఏకవచనంలో చెప్పేరేమోగానీ, నన్నెప్పుడూ 'మీరు' అంటూనే గౌరవించడం అబ్బురమనిపించేది.

తన బ్రతుకు అల్లకల్లోలాన్ని హృదయదఘ్ను భావాలతో అభివ్యక్తీకరించిన ఆవిడ కవిత్వ సంపుటి 'చేతగాని నటి' కి నా చేతనే పీఠిక వ్రాయించుకోవడం అనూహ్య గౌరవం.

మూడు కథాసంపుటాలు, నవలలు, రేడియో నాటకాలు, అనువాద రచనలు, ముప్ఫయ్‌కి పైగా బాలసాహిత్య గ్రంథాలు, కొద్దికాలం క్రితమే వెలువరించిన 'తురగా జానకీరాణి కథలు' సమగ్ర సంపుటం– రచయిత్రిగా ఆవిడ బహుముఖీన ప్రక్రియా రచనకు దర్పణాలు. ఆవిడ గొప్ప డ్యాన్సర్ అన్న సంగతి చాలామందికి తెలియక

పోవచ్చు. ఆకాశవాణి క్లబ్ వార్షికోత్సవంలో ఓ మాటు 'జపాన్ స్త్రీ'గా ఆవిడ వేషధారణ ఇప్పటికీ తలుచుకుని మురిసిపోయేవారున్నారు.

ఆవిడ సంభాషణా వైచిత్రి, హాస్య చతురత, వక్తగా వారి ఉపన్యాస పటిమ ఎందరికో తెలుసు. జయప్రకాశ్ నారాయణగారి 'లోక్‌సత్తా'లో కూడా ప్రధాన కార్యకర్తగా దక్షత చూపిన రాజకీయసత్తా ఆవిడది. గృహలక్ష్మి స్వర్ణకంకణం, తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ రచయిత్రి పురస్కారం, కందుకూరి శివానందమూర్తిగారిచే ప్రతిభాసత్కారం ఇలా జానకీరాణిగారందుకున్న పురస్కారాలెన్నో వున్నాయి. జ్ఞానపీఠాలు, పద్మశ్రీలు వరించదగిన ప్రతిభా సామర్థ్యాలున్న శేముషీ సంపద గలవారు గానీ, లోకం పోకడ తెలియనిది కాదుకదా!

ఆవిడ పేరుతో నాకు స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లోనే పరిచయం. ఆంధ్ర పత్రిక, యువల్లో ఎన్ని కథలు రాశారో! ఒకసారి దీపావళి సంచిక గురించిన ప్రకటనలో కాబోలు ఆవిడ పేరు 'తురక దా నాకీ రాణి' అని అచ్చుతప్పులతో అచ్చయినప్పుడు పగలబడి నవ్వుకోవడం గుర్తుంది. విద్యార్థి దశలోనే ఆవిడకు పరిచయం అయిన కృష్ణమోహన్‌రావు గారిని ఇంట్లోవారికి నచ్చకపోయినా పట్టుబట్టి పెళ్లాడటం గురించి ఆ పెళ్ళికి సాక్షిగా నిలిచిన కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌ల మాజీ గవర్నర్ కీ॥శే॥ రమాదేవిగారు సభాముఖంగా చెప్పడం కూడా గుర్తుంది.

14 వ ఏట కృష్ణాపత్రికలో మొట్టమొదటి కథ రాసిన జానకీరాణికి పేరు తెచ్చిపెట్టిన– 'స్నేహం', 'అగమ్యస్థానం' అలాగే 'పరిష్కారం' కథలు ఆ రోజుల్లో అందరికీ బాగా గుర్తు. 1971 సెప్టెంబర్ తరుణ మాసపత్రికలో 'మీతో మీ అభిమాన రచయిత్రి' శీర్షికలో తురగా జానకీరాణిగారు రాసిన రచనా గుర్తుంది. అందులోనే ఒకచోట ఆవిడ– "కథాశిల్పంలో కూడా ఎంతో వైవిధ్యం కనబడుతోంది. పదాల ప్రయోగంలో, కథ చెప్పడంలో కొత్తసొగసులు చాలామంది చూపిస్తున్నారు. పదాలు ముఖ్యంగా బాధ, మనస్సు, మమత వంటివి వాడివాడి వాటి ప్రభావాన్ని కోల్పోయాయి. 'బాధ' అని వ్రాస్తే అది 'బాధ'గా పాఠకునికి వెంటనే స్ఫురించడం లేదని నాకనిపిస్తుంది. కొంత మార్పులు, కొంత చేర్పులు, రంగులు వేస్తేగానీ కొన్ని పదాలకి పూర్తి ప్రభావం ఉండటం లేదు" అని రాశారు.

అంతేకాదు "... నేను ఏమైనా వ్రాస్తేగా? వ్రాసేటప్పుడు కూడా కలం పరుగులెత్త నివ్వను. పదునుకోసం చూస్తాను. మాటల బరువు కోసం శ్రమిస్తాను. పదాల పొదుపు కోసం ఆగుతాను. ప్రణయం పరవళ్ళు తొక్కనివ్వను. దుఃఖం కూడా– తలబాదుకొని,

గగ్గోలుగా పేజీలకొద్దీ ఏడవనివ్వను. ఆదర్శాలు వల్లె వేయించడం తగ్గిస్తాను. కాబట్టి గిలిగింతల కోసం, కడివెడు కన్నీళ్ళకోసం, ఉద్రేకపడే ఉపన్యాసాలకోసం ఉత్సాహపడే పాఠకులకి నేను నచ్చను– పోనీ నచ్చనేమోనని నా అనుమానం" అని కూడా పేర్కొంటారు.

'తురగా' అన్నందుకు ఆవిడ గుర్రంలాగే ఎప్పుడూ 'త్వరగా' అన్నంత ఉత్సాహ శీలురిగానే జీవించారు. ఆవిడలోని 'హార్స్‌పవర్' ఎందరికో పంచారు. ఎందరినో తీర్చిదిద్దారు. నిజంగా 'మహిళా సాధికారత' కు నిదర్శనంగా– కృష్ణమోహన్‌రావుగారు అర్ధాంతరంగా వెళ్ళిపోయినా, ఆడపిల్లలిద్దరినీ ఎంతో ఇదిగా పెంచారు. ఆకాశవాణి న్యూస్ రీడర్‌గా, ప్రముఖ పాత్రికేయురాలిగా ఉషారమణి, గర్వించదగిన ఆర్కిటెక్ట్‌గా వసంతశోభ, నేడు స్వయం శక్తియుతులై, సామాజికంగా రాణిస్తున్నారంటే ఆవిడ దీక్షాదక్షతలే మూలాధార నాడి.

'ఎంతొ ఆరాటపడుతు జీవింతు మొర
మృతియె లేకున్న రుచి ఏది బ్రతుకులోన'

అని గాలిబ్ అన్నట్లు– ఆవిడ బాధే సౌఖ్యమనే భావనతోనే బాధ తెలియనీయకుండా జీవించి, రాణించి దాటిపోయారు. ఆ కలం జీవిని, గళం జీవిని కాలం తనలో కలిపేసుకుంది. కలకాలం గుర్తుండే జ్ఞాపకంగా ఆవిడ మిగిలి పోయింది.

అంతమైపోయిన 'జానకితో జనాంతికం' ఇంకేమీ లేకపోయినా రోజు తెల్లవారుతూనే వుంటుంది. ఉషారమణీయమైన వసంతశోభలు తరగలెత్తుతూనే వుంటాయి. అదే జీవితం...!

పి.ఎస్: ప్రస్తుతం ఆకాశవాణి హైదరాబాద్ (సి.బి.ఎస్.) లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా వున్న నా శ్రీమతి పేరు ఉషారాణి. ఆకాశవాణిలో జానకీరాణిగారి తర్వాత పిల్లలు, స్త్రీల కార్యక్రమాన్ని ఉషయే నిర్వహించింది. ఆవిడ ఉషను 'మా అమ్మాయే' అని చెప్తుండేవారు అందరితో. అందువల్ల– మా ఆవిడ పేరు ఉషారాణి, జానకీరాణిగారి పెద్దమ్మాయి పేరు ఉషారమణి కావడంతో మా ఆవిడ జానకీరాణిగారి కూతురే అనుకునే వారు. జానకీరాణిగారి మృతికి మాకూ ఎన్నో సంతాప సందేశాలు అందాయి. జానకీరాణిగారి అల్లుడు కీ॥శే॥ రేవల్లి నరేందర్ జన్మదినం నా పుట్టిన తేదీ అయిన 25 నవంబరే!– ఇదో తమాషా!

(చినుకు మాసపత్రిక, నవంబర్ 2014)

❖

(37) చిరునవ్వుల సద్గతి చిరంజీవి రాగతి

ప్రపంచంలో మొట్టమొదటి ఆఫ్రికన్–అమెరికన్ మహిళా కార్టూనిస్ట్‌గా 'జాకీ ఓమ్స్' 1940 ప్రాంతాల్లో ఎంత ప్రసిద్ధురాలో, ప్రసిద్ధి చెందిన అంతటి తొలి తెలుగు మహిళా కార్టూనిస్టుగా చెప్పుకోదగిన వ్యక్తి కుమారి రాగతి పండరి.

1911 ఆగస్టు 11 న పెన్సిల్వేనియా– మోనోన్‌గహేలా పట్టణంలోని, పిట్స్‌బర్గ్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో 'జెల్డా మావిన్ జాక్సన్'గా జన్మించిన 'జాకీఓమ్', నల్లజాతి మహిళా కార్టూనిస్టుగా తన పదకొండవ ఏటనే బొమ్మలు గీయడం మొదలెట్టి ప్రూఫ్ రీడర్‌గా చేరి 1937 లో 'టార్చ్‌బ్రౌన్' అనే వ్యంగ్య పాత్రతో, కార్టూన్ స్ట్రిప్‌ను మొదలెట్టింది. 1942 లో చికాగోకు తరలి వెళ్ళిన ఈ అమెరికన్, 'కొరియర్'లో పదకొండేళ్లు నిరాఘాటంగా 'పెద్దక్క–చిన్న చెల్లెలు' అనే రెండు పాత్రలతో అద్భుత హాస్యాన్ని అందించింది. 1947 లో ఆమె సృష్టించిన లిటిల్ సిస్టర్ పాత్రతో 'ది పాటీ జో డాల్' అనే బొమ్మను టెర్రీలీడాల్ కంపెనీ తయారు చేసి, ఆ ఏడాది క్రిస్మస్‌కు మార్కెట్లోకి తెస్తే– తొలి 'అమెరికన్ బ్లాక్ ఆల్' గా అది విపరీతంగా అమ్ముడు పోయింది. 1950 లో 'ది కొరియర్' పత్రిక ఎనిమిది పేజీల కలర్ కార్టూన్ అనుబంధం వెలువరించి నప్పుడూ– జాకీఓమ్స్ 'టార్చ్ ఇన్ హార్ట్ బీట్స్' అని సాధికారిత గల ఒక మహిళా కార్టూన్ పాత్రను వెలువరించింది. 1956 లో కార్టూన్ రంగం నుండి రిటైరయినా, పెయింటింగ్‌లూ అవీ వేసేది. తన 74 వ ఏట 1985 డిసెంబర్ 26 న చికాగో ఇల్లినాయిస్‌లో 'జాకీఓమ్స్' మరణించింది.

'ది గార్డియన్' పత్రికకు చెందిన నాన్సీగోల్డ్ స్టిన్– జాకీ ఓమ్స్‌పై ఒక పుస్తకం కూడా రాసింది.

మన రాగతిపండరిని తెలుగు 'జాకీ ఓమ్స్' అనచ్చు. నిజానికి అంతకన్నా ప్రతిభాశాలి! యాభై ఏళ్లు కూడా పూర్తిగా నిండలేదు కానీ నూరేళ్ల కీర్తి ఆమె సొంతం.

1965 జూలై 22 న జన్మించిన ఈ పండరీబాయి తనకు పోలియో కారణంగా ఏర్పడిన అంగవైకల్యాన్ని కూడా అధిగమించి, తెలుగు పత్రికలన్నింటిలో పాతిక వేలకు పైగా కార్టూన్లు వేసి, తొలి తెలుగు మహిళా కార్టూనిస్టుగా ఎనలేని ఖ్యాతి పొందారు. మామూలు స్కెచ్‌పెన్‌తో సునాయాసంగా బొమ్మలు గీసి కార్టూన్లు సృష్టించగల ఈ వ్యంగ్య చిత్రకారిణి 'జయదేవ్ బాబు'గారిని తన కార్టూన్లకు గురువుగా తలచేవారు. 'అమ్మా! నీకు గురువు నీవే' అని జయదేవ్‌గారు అన్నా, 'జయ్‌దేవ్‌గారే నా గురువు' అని ఎప్పుడూ వినమ్రంగా చెప్పుకునేది రాగతి పండరి. రాగతి గోవింద రావు– శాంతకుమారి దంపతులకు విశాఖలో జన్మించిన పండరి, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. చేతికర్ర సాయంతో స్కూల్‌కు వెళ్లి పాప చదవడం కష్టమని, ఇంట్లోనే ప్రైవేట్ ఏర్పాటు చేసి పండరీబాయిని చదివించారు తల్లి. రాగతి పండరి ఎనిమిదేళ్ల వయసులోనే గీసిన కార్టూన్– 1972 ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. అప్పుడందుకున్న నాలుగు రూపాయల మనియార్డర్ ఆమెకు స్వశక్తి మీద అపారమైన విశ్వాసాన్ని కలిగించింది. అంతే! అన్ని పత్రికలకూ తన కార్టూన్లతో నవ్వులను పంచి, నిజంగా తనదైన ఒక నవ్వుల సమాజమే స్థాపించి, ఎందరికో అభిమాన కార్టూనిస్టుగా మారింది.

రెండు దశాబ్దాల క్రితమే విశాఖ జిల్లాకలెక్టర్ దయాచారిగారి నుండి కళాకారులకిచ్చే పురస్కారాన్ని అందుకున్న రాగతి పండరి, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అయిన ఆనాటి రంగరాజన్‌గారి నుండీ, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిగారి నుండి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వం నుండి హంస పురస్కారాన్ని అందుకున్న కార్టూనిస్టు రాగతి పండరియే. అలా 'కళారత్న'గా గౌరవింపబడ్డారు. రాగతి పండరి తన ఆత్మకథను 'నా గురించి నేను' పేరిట వెలువరించారు. అలాగే 'నవ్వుల విందు– కార్టూన్ల పసందు' అనే పుస్తకం వెలువడింది. 'రాజకీయ చెదరంగం' వంటి కార్టూన్ శీర్షికలు తనకు మంచి పేరు తెచ్చాయి. తాను మహిళయే అయినా అప్పుడాల కర్ర కార్టూన్ నుండి, మహిళామణుల పైనా కార్టూన్లు వేస్తూనే, మరో వంక– మహిళా సమస్యల మీదా కార్టూన్లు సంధించారు. మహిళల సాధికారికత కోసం తన కుంచెనూ ఝళిపించారు. రాగతి పండరి కార్టూన్ పడని తెలుగు పత్రిక లేదేమో!

సామాజిక పరిస్థితులకు దర్పణమనదగిన తన కార్టూన్లతో ఉత్తరాంధ్రలో ఆమె కార్టూన్ల ప్రదర్శనలు కూడా జరిగాయి. చక్కటి గీతలతో, చిక్కటి వ్యాఖ్యలతో

నవ్వుల పువ్వులు పూయించిన ప్రతిభామతి రాగతి పండరి. 'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా' అన్న మాటను త్రోసిరాజనేలా– రాగతి పండరి నిండుగా, మెండుగా, దండిగా అందరి అభిమానాన్నీ అందుకున్నారు. బాపు వంటి ప్రముఖ చిత్రకారులు కూడా రాగతి పండరి కార్టూన్లలోని తెలుగుతనాన్ని మెచ్చి అభినందించారు. ఆమె కార్టూన్ ఒక దానిని తిరిగి గీసి, కార్టూన్ కళను ఎలా మెరుగు పరుచుకోవచ్చో బాపుగారు స్వయంగా ఆమెకు లేఖలు రాశారు.

కొద్ది నెలలుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన రాగతి పండరి 19 ఫిబ్రవరి 2015 న ఇంకో అయిదు నెలల్లో రానున్న పుట్టినరోజును చేసుకోకుండానే అశేష అభిమానులను శోకతప్తులను చేసి కన్నుమూశారు.

తొలి మహిళా కార్టూనిస్ట్ 'జాకీ ఓమ్స్'– 'బిగ్‌సిస్టర్– లిటిల్ సిస్టర్' అనే మహిళాపాత్రల లాగానే రాగతి పండరి 'నవగ్రహం– అనుగ్రహం' పేరున ఇద్దరమ్మాయిల పాత్రలను సృష్టించి నవ్వించడం యాదృచ్ఛికమే కావచ్చు. శ్రీమతి పేర మహిళామణి స్ట్రిప్‌కార్టూన్ కూడా రాగతి పండరి సృష్టించారు. అలాగే తెలుగు పత్రికల పండగల ప్రత్యేక సంచికలు అంటే, రాగతి పండరి కార్టూన్లు లేకుండా నిండుదనం సంతరించు కోలేవు అన్నంతగా వ్యంగ్య చిత్రాల మకుటంలేని మహారాణిగా ఆమె రాణించారు.

మరణంలోను తనదైన విశిష్టతను నిలుపుకున్న మనీష రాగతి పండరి. తన నేత్రాలను, తన అవయవాలను కూడా దానం చేస్తూ, తన పార్థివ శరీరాన్ని వైద్యం కోసం ఇచ్చేసింది పండరీబాయి.

ఆమె సృష్టించిన నవ్వులు చితిని కాలవు సరికదా చింతలను మరిపిస్తాయి. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ భూస్థాపితం కావు. అభిమానుల గుండె కింద సంతకంగా ఆమె చిరంజీవి.

(ఆంధ్రభూమి వారపత్రిక, 19 మార్చి 2015)

❖

(38) కాలానికి నిలిచే 'కామన్‌మేన్'

'కామన్‌మేన్' సామాన్య మానవుడు. అందునా దేశపౌరుడు.

తన కార్టూన్స్‌లో ఒక మౌనసాక్షి అయిన పాత్రగా అతనిని నిలిపి ప్రజాస్వామ్య నిర్మాణంలో ఒక అనుపమానమైన పాత్ర పోషణ చేసిన ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు ఆర్.కె.లక్ష్మణ్ ఈ ఏడాది దేశ గణతంత్ర దినోత్సవంనాడు తన 93 వ ఏట అస్తమించారు. ఆయన 'కామన్‌మేన్' ఆమ్ ఆద్మీగా నిజంగా ప్రజాస్వామ్య ప్రేమికుల హృదయాల్లో పట్టం కట్టుకున్నాడు.

ఒక కార్టూన్ పాత్రగా లక్ష్మణ్ సృష్టించిన 'కామన్‌మేన్'కు పుణెలో ఒక శిలావిగ్రహం నిర్మాణమైందంటే అదెంత ప్రభావోపేతమయిందో వేరే చెప్పాలా? ఒక కార్టూనిస్టు పద్మవిభూషణ్ స్థాయి గౌరవాన్ని అందుకోవడం సామాన్యమైన సంగతి కాదు. సామాన్యుడిని అసామాన్యుడిని చేసిన ఘనత ఆయనకే దక్కింది. సాబ్ టీ.వీ. ఛానెల్లో 'ఆర్.కె.లక్ష్మణ్‌కీ దునియా' అనే ధారావాహిక ఆయన కార్టూన్లను ఆధారం చేసుకుని 28 నవంబర్ 2011 నుండి 29 మార్చి 2013 వరకూ రెండు వందలకు పైగా ఎపిసోడ్లతో ధారావాహికగా నడిచింది.

'యు సెడ్ ఇట్' అంటూ ఆర్.కె.లక్ష్మణ్ వేసిన పాకెట్ కార్టూన్లు దశాబ్దాల తరబడి దేశ ప్రజలను అలరించాయి. 'పైడ్‌పైవర్ ఆఫ్ ఢిల్లీ' గా ఆర్.కె.లక్ష్మణ్ పాఠకులను మంత్రముగ్ధుల్ని చేసాడు. ఒక కార్టూనిస్టుగా ఇంత సుదీర్ఘకాలం చరిత్రలో రాణించింది ఒక్క ఆర్.కె.లక్ష్మణ్ మాత్రమే అనవచ్చు. సుదీర్ఘ సంపాదకీయాలు, రాజకీయ వ్యాసాలు చేయలేని విశ్లేషణ, వేయగల ప్రభావం ఆర్.కె.లక్ష్మణ్ కార్టూన్లు చేశాయి, వేసాయి. స్వతంత్ర భారతావనిలోని రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిణామాలన్నింటికీ అద్దంపడుతూ వ్యంగ్య వైభవంతో హెచ్చరికలు, సూచనలు చేస్తూనే తన కార్టూన్లలో 'కామన్‌మేన్'ను ఒక మౌనసాక్షిగా చిత్రిస్తూ లక్ష్మణ్ వేసిన వేలాది కార్టూన్లు నిజంగా ఒక రేఖాత్మక చరిత్ర.

ఆర్.కె.లక్ష్మణ్ పూర్తి పేరు రాశిపురం కృష్ణాస్వామి లక్ష్మణ్. 1921 అక్టోబర్ 24 న మైసూర్‌లో జన్మించిన లక్ష్మణ్– ఆరుగురు కొడుకుల్లో ఆఖరివాడు. ఒక చెల్లెలు కూడా ఉంది. తండ్రి స్కూల్ హెడ్మాస్టర్. చదువుకునే రోజుల్లోనే చిత్రలేఖనం పట్ల ఆసక్తి కలిగింది. ది స్ట్రాండ్, పంచ్ మ్యాగజైన్స్‌లో వచ్చే బొమ్మలకు ఆకర్షితుడై తన ఇంట్లో నేలమీదా, గోడలమీదా, తలుపుల మీదా బొమ్మలేసేవాడు. క్లాసులో కూర్చుని టీచర్ల బొమ్మలు గీసేవాడు. లక్ష్మణ్ గీసిన ఒక రావి ఆకు బొమ్మను చూసి టీచర్ మెచ్చుకుని ప్రోత్సహించడంతో తానొక చిత్రకారుడిననే భావన ఏర్పడింది. 'ది హిందూ' పత్రికలో అప్పట్లో తరచుగా వస్తూండే బ్రిటిష్ కార్టూనిస్టు సర్ డేవిడ్‌లో బొమ్మలు తనపై ప్రభావం చూపాయట (డేవిడ్ సంతకంలోని Low అనే దానిని చాలానాళ్ళు Cow అనుకునేవాడినని తనే చెప్పుకున్నాడు లక్ష్మణ్).

తన గది కిటికీలోంచి బయట కనబడే దృశ్యాలను బొమ్మలుగా గీసేవాడు. ఆ మనుషులు, పక్షులు, వంటలు చేస్తున్న మనుషులు, ముఖ్యంగా ఎదురుగా ఉండే భవనం మీద వాలుతుండే కాకుల వివిధ భంగిమలు బొమ్మలుగా వేయడం చేస్తుండేవాడు. ఆర్.కె.లక్ష్మణ్‌కు చాలా ఇష్టమైన పక్షి కాకి. కాకులను అన్ని రకాలుగా, అంత అందంగా, అంత భావస్ఫోరకంగా చిత్రించిన మరో చిత్రకారుడు లేడేమో.

ఆర్.కె.లక్ష్మణ్ 91 వ ఏట మూడేళ్ళ క్రితం అంటే అక్టోబర్ 2012 లో ఆయన ఇంట్లోనే సన్నిహితుల మధ్య జరిగిన పుట్టినరోజు వేడుకల్లో లక్ష్మణ్ గీసిన కార్టూన్ల ఆధారంగానే కాకి జీవితంపై తీసిన 'ది బ్రెయినీ క్రో' అనే ఒక డ్యాకుమెంటరీ డివిడిని ఆయన అభిమాని రాజవర్ధన్ పాటిల్ లక్ష్మణ్ చేత కేక్ కట్ చేయించాక 91వ పుట్టినరోజు కానుకగా అందించాడట.

తండ్రికి పక్షవాతం వచ్చి ఆ తరువాత ఏడాదికే మరణించడం ఆర్.కె.లక్ష్మణ్ బాల్యంమీద పడిన ఒక పెద్ద ప్రభావం. అన్నయ్యల పెద్దరికంలో చదువు సాగించాడు. హైస్కూల్ తరువాత ముంబయ్‌లోని జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో తనకు ఇష్టమైన డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో విద్య నేర్వాలని ఉబలాటపడి దరఖాస్తు చేసాడు. కానీ ఆ సంస్థ డీన్– ఆర్.కె.లక్ష్మణ్ బొమ్మల్లో, తమ కళాశాలలో విద్యార్థిగా చేర్చుకునేంత ప్రజ్ఞ లేదని సీటు నిరాకరించాడు. దానితో ఆర్.కె.లక్ష్మణ్ మైసూర్ యూనివర్సిటీలో బి.ఏ. చేసాడు. తన స్వయంకృషితోనే కార్టూన్లు, బొమ్మలు వేసేవాడు. అప్పట్లో వస్తూండిన స్వరాజ్య పత్రికలో, బ్లిట్జ్ పత్రికలలో ఫ్రీలాన్సర్‌గానే కార్టూన్లు, బొమ్మలు గీసేవాడు. మహరాజా కాలేజీ ఆఫ్ మైసూర్‌లో బి.ఏ. చేస్తూనే స్థానికంగా

వచ్చే 'స్వతంత్ర' వార్తాపత్రికలో పొలిటికల్ కార్టూన్లు వేసేవాడు. అలాగే మైసూర్‌లో 1942 లో డాక్టర్ ఎమ్.శివరాం అనే అల్లోపతి వైద్యులు బెంగుళూరు మెజిస్టిక్ ప్రాంతంలో క్లినిక్ నడుపుతూనే తాను స్వయంగా వ్యంగ్య చిత్రాలు గీస్తూ, హాస్యం కోసం నెలకొల్పి నడిపిన కన్నడ మాసపత్రిక 'కొరవంజి'లో ఆర్.కె.లక్ష్మణ్‌కు ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు. అప్పట్లోనే 'నారద' అనే పౌరాణిక యానిమేషన్ చిత్రానికి ఫ్రీలాన్సర్‌గా బొమ్మలు గీసాడట.

ఆర్.కె.లక్ష్మణ్ తొలి ఉద్యోగం ముంబైలోని 'ది ఫ్రీ ప్రెస్ జర్నల్'లో పొలిటికల్ కార్టూనిస్టుగా చేరడంతో మొదలైంది. అంతకుముందు వేసవి రోజుల్లో మద్రాస్‌లోని జెమినీ స్టూడియోలోనూ తాత్కాలికంగా పనిచేసాడు. 'ది ఫ్రీ ప్రెస్ జర్నల్ ఆఫ్ బాంబే'లో ఆర్.కె.లక్ష్మణ్ ఉద్యోగం చేస్తున్నప్పుడే బాల్‌థాకరే సాటి కార్టూనిస్టుగా ఉండేవాడు. బాల్‌థాకరే ఆ తర్వాతి కాలంలో శివసేన పార్టీ అధినేత అయ్యాడు. ఆ తరువాత ఫ్రీ ప్రెస్ ఉద్యోగం నుంచి ఆర్.కె.లక్ష్మణ్ 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'లో పొలిటికల్ కార్టూనిస్టుగా చేరాడు. అంతే! దాదాపు యాభై సంవత్సరాలకు పైగా 'టైమ్స్ ఆఫ్ ఇండియా' కార్టూనిస్టుగా ఇక వెనుదిరిగి చూడనంత ఎత్తులకు ఎదిగాడు. 'ది కామన్‌మేన్' పాత్రను సృష్టించిందీ, 'యూ సెడ్ ఇట్' అంటూ అలరించిందీ, వ్యంగ్య చిత్రకారునిగా తన ప్రతిభా పాటవాలను దేశానికి వెలార్చిందీ అక్కడే.

'కామన్‌మేన్' కాక ఆర్.కె.లక్ష్మణ్ సృష్టించిన మరో పాత్ర ఏమిటో తెలుసా? ఏషియన్ పెయింట్స్ వారి కోసం తను సృష్టించిన బొమ్మ 'గట్టు' అనే పాత్ర. ఆర్.కె.లక్ష్మణ్ ఒకటీ రెండు నవలలు రాసిన సంగతి చాలామందికి తెలియదు. 'ది హోటల్ రివేరా' అన్నది తన నవలే. అయితే ఆర్.కె.లక్ష్మణ్ తన అన్నగారైన ఆర్.కె. నారాయణగారి కథలకు హిందూ పత్రికలో బొమ్మలు వేసాడు. ఆయన కథలు, నవలలు ఎన్నో లక్ష్మణ్ బొమ్మలతోనే వచ్చాయి.

ఆర్.కె.నారాయణ్ టీవీ సీరియల్ 'మాల్గుడి డేస్'కు లక్ష్మణ్ వేసిన స్కెచ్‌లు ఎంతో ప్రాచుర్యం పొందాయి. అలాగే హిందీ చిత్రం మిస్టర్ అండ్ మిసెస్ 55, తమిళచిత్రం 'కామరాజ్'లో ఆర్.కె.లక్ష్మణ్ కార్టూన్లు కనిపిస్తాయి. ఆయన గీసిన క్యారికేచర్లలో డేవిడ్‌లో, టి.ఎస్.ఇలియట్, బర్ట్రెండ్ రసెల్, జె.బి.ప్రీస్ట్లీ, గ్రాహంగ్రీన్‌లవి ఎంతో ఖ్యాతి చెందాయి.

ఆర్.కె.లక్ష్మణ్ మొదటగా– భరతనాట్యం కళాకారిణి, సినిమా నటి అయిన స్త్రీని పెళ్లాడాడు. బేబీ కమలగా బాలనటిగా మొదలై, కుమారి కమలగా ఎదిగిన

కమలతో విడాకులు తీసుకున్నాక, ఆర్.కె.లక్ష్మణ్ పెళ్ళాడిన ఆమెపేరు కూడా కమలయే. బాలసాహిత్య రచయిత్రిగా కమలా లక్ష్మణ్ పేరొందారు.

మొదటి భార్యతో లక్ష్మణ్‌కు పిల్లలు లేరు. తరువాతి వివాహంతో శ్రీనివాస్ అనే కుమారుడున్నాడు. ఫిలింఫేర్ సినిమా పత్రికలో ఆర్.కె.లక్ష్మణ్ 'ది స్టార్ ఐ నెవర్ మెట్' అనే కార్టూన్ సీరియల్ వేసాడు. అందులో భాగంగానే తన భార్య కమలా లక్ష్మణ్‌ను 'ది స్టార్ ఐ ఓన్లీ మెట్' పేరుతో బొమ్మగా గీసాడు. ఆర్.కె.లక్ష్మణ్ కుమారుడు శ్రీనివాస్ కూడా కొన్నాళ్ళు 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'లో పనిచేయడం విశేషం. తండ్రీ కొడుకులిద్దరూ ఒకే సంస్థకు చెందినవారయ్యారు కొన్నాళ్ళు.

ఆర్.కె.లక్ష్మణ్ కార్టూన్ల విశేషప్రాచుర్యం గురించి వేరే చెప్పాలా? రాజకీయాలను, మంత్రులను, అవినీతిని తను ఉతికి ఆరేసినంతగా మరొకరు చేయలేదేమో!. 'కామన్‌మేన్' ను సాక్షిగా నిలబెట్టి దేశ రాజకీయ పరిస్థితులను, సమాజ స్థితిగతులను తన కుంచెతో, వ్యంగ్య వైభవంతో ప్రభావోపేతంగా దృశ్యీకరించాడు. తన కృషికి గుర్తింపుగానే 1984 లో ఆర్.కె.లక్ష్మణ్‌కు ప్రతిష్ఠాత్మకమైన రామన్ మెగసెసె అవార్డు లభించింది. అలాగే భారత ప్రభుత్వం 1973 లోనే పద్మభూషణ్ అవార్డు నిచ్చింది. 2005 లో ఆర్.కె.లక్ష్మణ్ పద్మవిభూషణ్ అందుకున్నారు. 2004 లో మైసూర్ యూనివర్సిటీ తనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, 2008 లో సిఎన్ఎన్, ఐబిఎన్, టీవీ 18 జర్నలిజంలో జీవితసాఫల్య పురస్కారాన్ని ఇచ్చి గౌరవించాయి. ఆర్ట్ అండ్ మ్యూజిక్ ఫౌండేషన్ 2012 లో స్కాలర్ ఆఫ్ పుణె (పుణే పండిట్ అవార్డు) తో సత్కరించింది.

ఆర్.కె.లక్ష్మణ్‌కు 2003 సెప్టెంబర్‌లో మొదటిసారి గుండెనొప్పి వచ్చింది. అప్పుడే ఎడమవైపు పక్షవాతం వచ్చినా దానినుంచి కొద్దిగా కోలుకున్నారు. ఆ తరువాత 2010 జూన్ 20 న పూణె నుంచి అంబులెన్స్ విమానంలో ముంబై తరలించగా బ్రీచ్‌కాండీ హాస్పిటల్‌లో చేరి కోలుకున్నారు. అక్టోబర్ 2012 లో పుణెలో 91 వ జన్మదినాన్ని సన్నిహితుల నడుమ ఇంట్లో ఆనందంగా జరుపుకున్నారు. ఈ ఏడాది జనవరి 23 న మూత్ర కోశ సంబంధించిన సమస్యతో పుణెలోని దీనానాథ్ మంగేష్కర్ హాస్పిటల్‌లో చేరిన 93 ఏళ్ల ఆర్.కె.లక్ష్మణ్‌కు క్రమంగా అవయవాలు పనిచేయడం మానివేసి 26 జనవరి 2015 న గణతంత్ర దినోత్సవం నాడు భారత జనులందరినీ వదిలి శాశ్వతంగా కన్నుమూశాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధికార

లాంఛనాలతో ఆర్.కె.లక్ష్మణ్ అంత్యక్రియలకు ఆదేశించారు. కామన్ మేన్ శిలావిగ్రహం ఉన్న సియోసిస్ ఇనిస్టిట్యూట్‌లోనే పుణెలో ఆర్.కె.లక్ష్మణ్ పేర ఒక శాశ్వతస్మారక చిహ్నం ఏర్పాటు కానుంది.

భారతీయ పత్రికారంగాన్ని, జర్నలిజాన్ని, కార్టూన్ ప్రపంచాన్ని తనదైన ముద్రతో ప్రతిభాకాంతులతో ప్రకాశింపజేసిన ఆర్.కె.లక్ష్మణ్ చిరస్మరణీయులు. 'కామన్‌మేన్', 'సామాన్యుడు', 'ఆమ్ ఆద్మీ' వున్నంతకాలం ఆర్.కె.లక్ష్మణ్ కోట్లాది గుండెల మీద చెరగని ఓ సంతకం.

(ఆంధ్రభూమి మాసపత్రిక, మార్చి 2015)

❖

(39) ఆధ్యాత్మిక శిఖరం–అపర శివావతారం!

'శక్తి' ఏదయినా ఒక 'రూపధారణ'తో 'గోచర'మవుతుంది. వస్తురూపాలు 'దృష్టిపథం' నుంచి 'కనుమరుగు' కావచ్చు. కానీ 'శక్తి' అనంతం, అప్రతిహతం.

'కన్నతల్లి' కనుమరుగయినా, ఆమె పంచిన 'అమ్మతనం' గుండెల్లో సదా గూడుకట్టుకుని నిలిచిపోయేటట్లు, మహాత్ములు 'దేహ'మనే 'ఉపాధి'లో వసించిన కాలంలో– పరివ్యాప్తం చేసిన మహనీయ– మానవీయ, మాననీయ, దైవిక శక్తులు ఏవయినా– వారు దేహయాత్ర చాలించినంతనే సమసిపోయేవి కావు. సరికదా, ఆ 'నిజధార' అనాహతంగా, విశ్వాసులందరిలో 'సుపథ'గామియై విస్తరిస్తూనే వుంటుంది.

'దైవం' కూడా 'దేహం'గా కాలధర్మం చెందక తప్పదు.

'అవతారసమాప్తి' అనంతరం 'దైవాంశదీప్తి' ఉజ్జ్వలమయ్యే దైవాంశ సంభూతులు పలువురు భారతీయ సమాజంలో, సనాతన ధర్మ పరిరక్షణలో ప్రభవించి, కారణజన్ములుగా తమ సంకల్పాన్ని ఈడేర్చి, కనుమరుగవుతూనే వున్నారు. జ్యోతిర్దేహులుగా 'హృదయవాసులు'గా కీర్తికాయులవుతున్నారు.

'వేదభూమి' అయిన భారతదేశపు ఆధ్యాత్మిక సంస్కృతికి– ప్రబోధకులుగా, ప్రచోదకులుగా ప్రభవించిన దైవికశక్తి స్వరూపులు సద్గురు శివానందమూర్తిగారు జూన్ 10, 2015 న దేహయాత్ర చాలించి శివైక్యం చెందారు. సద్గురుమూర్తిగా కందుకూరి శివానందమూర్తిగారు ఊరూరా తిరిగి ఉపన్యాసాలు చెప్పకపోవచ్చు. టీవీ ఛానెళ్ళలో నిరంతరం భక్తి ప్రచారోద్బోధలు చేసి వుండకపోవచ్చు. కానీ అత్యంత ప్రేమమూర్తిగా, సాత్విక గుణపూర్ణులుగా, తెలుగునాటనే కాదు, దేశమంతటా– భక్తి, జ్ఞాన, కర్మాచరణ, యోగ మార్గ 'దీపధారి'గా నిలిచినవారు. 'దైవభక్తి'తో సమానంగా 'దేశభక్తి'ని ప్రబోధించినవారు. దరిచేరిన వారందరికీ– జీవితంలో అనుక్షణం గొప్ప ఆసరాగా వెన్నంటి నిలిచినవారు. లీలలు, మహత్తులు అంటూ గారడీల బాబాతనాన్ని

ఏనాడూ ప్రదర్శించిన వారు కారు. ఆయన 'మాహాత్మ్యం'– ఆయన శిష్యకోటి అనుభవంలోనికి రాని సందర్భాలంటూ లేవనేమాట మాత్రం వాస్తవం!

స్థితిలోకన్నా– సృష్టి, లయల్లోనే అసలు సిసలు 'ఆనందం' వుంది. కనుకనే 'బ్రహ్మానందం', 'శివానందం' అనే పదాలు లోకంలో ప్రచులితాలుగానీ, విష్ణుపరంగా ఆ మాట వినబడదు. కానీ జీవుల స్థితిగతులను 'శివం' అనగా మంగళమయంగా, సంతతానందంలోకి మలచిన దైవస్వరూపులు... శివానందమూర్తిగారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక రంగాలకు వారు ఇచ్చిన ఊతం అనుపమానమైనది. మతం, వేదాంతం కన్నా– సంస్కృతి పరిరక్షణే అసలైన ధర్మమనీ, సనాతన సంస్కృతిని కాపాడుకుంటూ, అధునాతనాన్ని అనుసంధానం చేసుకోవాలని దీక్షవహించిన ధార్మిక పరులాయన. ఏటా ఎందరో ప్రతిభామూర్తులను స్వయంగా సత్కరించి, సంగీత సభలను నిర్వహింప చేసేవారు. 'రామాయణం' అంటే వారికి అత్యంత ప్రీతి. 'కఠోపనిషత్తు'కు సరళ వ్యాఖ్యానం చెప్పారు. యోగుల చరిత్రలను ప్రపంచించారు. ఇతిహాసాలను గురించీ, ధర్మశాస్త్రాలను గురించే కాదు– ఆధునిక జీవనపు మౌలిక విలువలను గురించీ, జర్నలిజం నైతికతలను గురించీ– జిజ్ఞాసువులకు అనేక సందర్భాల్లో తేటతెల్లం చేసిన జ్ఞాన స్వరూపులు శివానందమూర్తిగారు.

కృష్ణాపత్రిక సంపాదకులు కీ।।శే।। పిరాట్ల వెంకటేశ్వర్లుగారు– గతంలో పాత్రికేయ సమాచారరంగ ప్రముఖులతో భాగ్యనగరంలో ఏర్పాటుచేసిన ఒక వినూత్న సదస్సులో స్వయంగా శివానందమూర్తిగారి సమక్షంలో కొద్దిసేపు ప్రసంగించగలగడం, ఆయన ఉదాత్త ప్రవచనాన్ని వినగలగడం, ఈ సుధామకు మరపురాని ఒక సందర్భం!

వరంగల్‌లోనూ, భీమిలిలోనూ తెలుగువారి రెండు రాష్ట్రాలలోనూ– శివానంద మూర్తిగారి 'ఆశ్రమాలు' జీవుల శ్రమతీర్చే, కల్పవృక్షఛాయలుగా ప్రసిద్ధాలు! భీమ్లీలో శివానందమూర్తిగారు సంతరించిన గ్రంథాలయం– ఒక విశ్వవిద్యాలయ స్థాయికి సరితూగగలిగిందిగా అనేకులు పేర్కొనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. చరిత్రపట్ల వారికి మక్కువ ఎక్కువ. భీమ్లీ గ్రంథాలయంలో మరెక్కడా కానరాని పురాచరిత్ర, వాస్తు, దేవాలయ, సంస్కృతీ గ్రంథాలు, లలిత కళలు, భారతీయ విజ్ఞానం సమస్తం భద్రపరచబడ్డాయి.

శ్రీ శివానందమూర్తిగారి మాట, మనసు, స్మిత వదనపు రూపు, దర్శకుల మనఃఫలకాలమీద శాశ్వత ముద్ర వేసుకున్నవి. ఆయనవంటి 'సద్గురువు' ఆయనే.

ఆయన ఒక అనన్వయాలంకారం. శివకేశవ అభేదంగా– మహాశివరాత్రినే కాదు శ్రీరామ నవమిని కూడా అత్యంత వైభవంగా నిర్వహింపచేసేవారు. ఆయన దర్శించని, భక్తులకు వారి మానసాలలో దర్శింపజేయని క్షేత్రమంటూ లేదు. సకల తీర్థ, క్షేత్ర సంగమ దర్శనానందం– ఆయన దర్శనంతో పొందిన భక్తజనులకు లోటేలేదు. బ్రహ్మజ్ఞానం, లోకజ్ఞానం, ప్రపంచజ్ఞానం ముప్పేటలుగా పంచిపెట్టిన ఆధ్యాత్మిక శిఖరం శివానందమూర్తిగారు. సంపన్న కుటుంబంలో పుట్టినా– విశాల జన జీవనంలో మమేకమై, పోలీసు కొలువు చేసినా– హైందవ ధర్మరక్షక భటునిగా భరతజాతి అభ్యున్నతికై, తన శక్తియుక్తులను వెచ్చించిన విశుద్ధ హృదయుడాయన. దేశభక్తులకు, ధర్మచింతకులకు, జిజ్ఞాసువులకు సద్గురువుగా శివానందమూర్తిగారు ఎప్పటికీ జ్యోతిస్వరూపుడు. 'తనువులేని ధార్మిక మనువు'గా – ఆయన చిరంజీవి! భారతీయ ధార్మిక ఇతిహాసంలో ఆ ఉజ్జ్వల ప్రకరణం శాశ్వతమై నిలుస్తుంది. శివోహం!

(ఆంధ్రభూమి వారపత్రిక, 2 జూలై 2015)

❖

(40) అస్తమించిన సురభారతి చంద్రుడు

ఆయన మహామహోపాధ్యాయుడు!

సమున్నత సంస్కృత శిఖరం!

సాహిత్యంలోనే కాదు వ్యాకరణ, వేదాంత, అలంకార శాస్త్రాలలో ఆయనకున్న వైదుష్యం గొప్పది. ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, యావద్భారతం ఆయన పాండితీ గరిమకు పొంగిపోయింది. సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలలో సుమారు రెండువందలకు పైగా గ్రంథాలు వెలువరించిన ఆ మహనీయుడు సంస్కృత భాషా ప్రచారంలో, తద్భాషాసేవలో తరించిన విశిష్టవ్యక్తి. భారత ప్రభుత్వం 2011 లో పద్మశ్రీతో ఆయనను గౌరవించుకుంది. ఆయనే తన 88 వ ఏట– 24 జూన్ 2015 న అస్తమించిన గీర్వాణభాషా చంద్రుడు పుల్లెల శ్రీరామచంద్రుడు.

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం దగ్గర ఇందుపల్లి గ్రామంలో 1927 అక్టోబర్ 24 న జన్మించిన శ్రీరామచంద్రుడు తొలుత వ్యాకరణశాస్త్ర విద్యార్థిగా విద్యాభ్యాసం చేసి, అనంతర కాలంలో ప్రతిష్ఠాత్మక బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్ మూడింటిలోనూ పట్టభద్రులయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి సంస్కృతంలో డాక్టరేట్ పిహెచ్.డి. పట్టాని పొంది ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృతశాఖలో ఇరవై ఏడేళ్లు పనిచేశారు. ఆ శాఖకు అధిపతిగా, గొప్ప సంస్కృత ఉపన్యాసకులుగా ఆచార్య పుల్లెలవారిచే తీర్చిదిద్దబడిన శిష్యప్రశిష్యు లెందరో. వారంతా సంస్కృత భాషా సేవలో తరిస్తున్న వారే. శ్రీమతి శశిరేఖ, శ్రీ నీలకంఠం– విశ్వవిద్యాలయం సంస్కృతశాఖలో వారి శిష్యులుగా సేవలందించినవారే. అలాగే మాజీ డి.జి.పి. అరవిందరావుగారు సంస్కృత భాషాధ్యయనం చేయడానికీ, శ్రీమతి అరుణావ్యాస్ వంటి విదుషీమణికీ పుల్లెలవారే స్ఫూర్తి. సంస్కృత సారస్వత సమార్చన పుల్లెలవారి నిత్యకృత్యం. ఆయన

మహామహోపాధ్యాయులు, కవి, విమర్శకులు, వ్యాసకర్త, వ్యాకరణకర్త, సృజనాత్మక అనువాదకులు.

వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా ప్రతిపదార్థంతో విశ్లేషిస్తూ, వ్యాఖ్యానిస్తూ పదివేల పేజీలకు పైగా వచన రచనానువాదం చేసిన వైభవ కీర్తి ఆయనకే దక్కుతుంది. అలాగే మహాభారత సారసంగ్రహాన్ని అందించారు. 1980 నుంచి దశాబ్దకాలం సంస్కృత అకాడమీకి డైరెక్టర్‌గా ఎనలేని సేవ చేశారు. అలాగే 'సురభారతి' సంస్థ ఆయన దీక్షాదక్షతలతో వెలుగొందింది. 'సుధర్మ' సంస్కృత మాసపత్రికకు బాసటగా నిలిచింది వారే.

ఆకాశవాణిలో మీ ఈ సుధామ కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేస్తున్న కాలంలో నాలుగైదు సంవత్సరాలు సంస్కృత విభాగానికీ అధికారిగా ఉన్నప్పుడు పుల్లెలవారి సౌమనస్యాన్ని, సౌజన్యాన్ని సన్నిహితంగా పొందగలిగే భాగ్యం అబ్బింది. ఆకాశవాణిలో సంస్కృత పాఠాలకు శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారు బీజావాపనం చేశారు. "కేయూరాని న భూషయంతి పురుషం హారాన చంద్రోజ్జ్వలాః" అంటూ మొదలయ్యే సంస్కృతపాఠాల సిగ్నేచర్‌ట్యూన్ జనజీవితంలోకి ఆ రోజుల్లో చొచ్చుకుపోయింది. ఆకాశవాణిలో సంస్కృత పాఠాలను హైదరాబాద్ కేంద్రం నుండి బోధించిన ప్రసార వేత్తల్లో శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారూ ఉన్నారు. ఆయన చేత ఆ పాఠాలు చెప్పించుతూ స్వయంగా రికార్డు చేసిన సందర్భాలు అనేకం. అలాగే 'అమరవాణి' సంస్కృత కార్యక్రమాల రూపకల్పనలోనూ, వాత్సల్యంతో ఆయన మార్గనిర్దేశకం చేశారు. అమరవాణిలో పూర్తిగా సంస్కృతంలోనే ప్రసంగాదులు ప్రసారం చేయమనీ, ముందుగా ఒకటి రెండు నిముషాలు తెలుగులో ఆ కార్యక్రమం పరిచయ వాక్యాలు ఉండవచ్చనీ, ఆయన ఇచ్చిన సలహా మేరకే– నా హయాంలో అంతకు ముందులా కాక– సంస్కృత సాహిత్యం గురించి 'అమరవాణి'లో సంస్కృతంలోనే ఇంటర్వ్యూలు, ప్రసంగాలు, చిన్న చిన్న నాటికలు కూడా ప్రసారం చేశాం.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో నేను సంస్కృతవిభాగ కార్యక్రమ నిర్వహణ అధికార బాధ్యతలు తీసుకునే నాటికి సంస్కృతపాఠాలు గురు, శనివారాల్లో ఉదయం ప్రసారమవుతూ– సీనియర్లకు రఘువంశం, జూనియర్లకు పంచతంత్రం నుండి పాఠాల బోధన ప్రసారమవుతుండేది. జూనియర్ల పాఠాలు సరళ సంస్కృత పాఠాలుగా ఉండాలనీ, నిత్య వ్యవహారంలో సంస్కృతంలో సంభాషించుకునే తీరున ఉండడం

ఔచిత్యమనీ సంభావించి– శనివారం పాఠాలను సరళ సంస్కృత పాఠాలుగా మలచడాన్ని ఆయన ఎంతో అభినందించారు. రైల్వే స్టేషన్లో, కూరల మార్కెట్లో, ఇంట్లో బంధువులతో మాట్లాడుకునేలా సరళసంస్కృతం నేర్పించడం జరిగింది. ఈ పాఠాలను విన్న తరువాత రేడియోలో ప్రసారం అయ్యే సంస్కృత వార్తలను బాగా అర్థం చేసుకునే స్థాయి సమకూరుతోందని శ్రోతలు ప్రశంసాలేఖలు రాయడం గుర్తుంది.

ఆకాశవాణిలో సంస్కృత వార్తలు 30 జూన్ 1974 ఉదయం 9 గంటలకు మొదటిసారిగా ప్రసారమయ్యాయి. ఏడు సంవత్సరాలు పార్లమెంట్‌లో తర్జనభర్జనలు జరిగాక కానీ ఆ నిర్ణయం తీసుకోలేదు. సంస్కృతం మృతభాష కాదనీ, కారాదనీ అమృతభాషగా వర్ధిల్లాలనీ పరితపించి కృషి చేసిన మహనీయులలో పుల్లెల శ్రీరామచంద్రులు సదా స్మరణీయులుగా ఉంటారు. "ఇయం ఆకాశవాణి సంప్రతి వార్తాः శ్రూయంతాం ప్రవాచకः బలదేవానంద సాగరः" అంటూ సంస్కృత వార్తలకు దేశంలో ప్రాచుర్యం వచ్చింది. నేటికీ ఉదయం 6.55 కు సాయంకాలం 6.10 కు అయిదు నిముషాల వ్యవధిలో ప్రసారమవుతూనే ఉన్నాయి. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారవేళల్లో మార్పులు చేసినా– సంస్కృత పాఠాలు, అమరవాణి వినిపిస్తూనే ఉంది. తెలుగు, తమిళం వంటివి మూలద్రావిడ భాషల నుంచి జనించినవే అయినా 'జనని సంస్కృతము సమస్త భాషలకు' అన్న నమ్మిక చాలామందిలో బలీయంగా ఉందంటేనూ, తెలుగులో సంస్కృత పదాలు తత్సమాలు, తద్భవాలు అనేకం స్థిరమై వ్యవహారంలో ఉన్నాయంటేనూ, సంస్కృత భాషా ప్రభావం తిరుగులేనిదని అంటూ ఆ భాషా ప్రాచుర్యానికి పుల్లెల శ్రీరామచంద్రుడుగారు అవిరళ కృషి చేశారు.

ఆయన యువభారతికి ఉపనిషత్సుధాలహరి ప్రసంగం అందించారు. యువభారతి ప్రధాన సంపాదకునిగా ఆయనతో ఆ గ్రంథావిష్కరణ వేదికను పంచుకోవడం, ఆంధ్రభూమి దినపత్రిక పూర్తిపేజీ గ్రంథసమీక్ష ప్రారంభించిన తొలిరోజుల్లో పుల్లెల వారి 'కౌటిల్యుని అర్థశాస్త్రం' గ్రంథంపై సమీక్ష చేయడం (సమీక్ష అనడం కంటే వారి పుస్తకానికి పరిచయం అనడం ఔచిత్యం) మరపురాని సుధామధుర క్షణాలే.

సంస్కృతభాషా ప్రచారసమితి పక్షాన పుల్లెల వారు సోమదేవుని నీతిసూత్రాలను 'నీతి వాక్యామృతం'గా వెలువరించిన గ్రంథం– 32 ప్రకరణాలతో 1550 సూక్తులతో నీతి అనగా నడవడికను సర్వులకూ అందించే ఉపయుక్త గ్రంథం. అలాగే కౌండిల్యశిక్ష,

సాహిత్య రత్నాకరం, దమ్మపథం, పదమంజరి, సంస్కృత కవిజీవితం, కాదంబరి కథాసారం, ఆయుర్వేదబ్ధిశరః, సూర్యదండక, అభినవ వాసవదత్త వంటి ఆయన గ్రంథాలు, 'హిందూమతం' గురించి సాధికారికంగా వెలువరించిన గ్రంథం, ఆచార్యుల వారి సమాజహిత చింతనాభిలాషకూ ప్రబల నిదర్శనాలు.

ఆయన మృతితో సంస్కృతాంధ్ర ఆంగ్లాలలో– సాహిత్య, వ్యాకరణ, వేదాంత, అలంకార శాస్త్రాలలో మేరునగం ఒకటి కూలిపోయినట్లయింది. పూర్ణచంద్రుడు అస్తమించినట్లుంది. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడిగారి మృతికి ఆంధ్రభూమి నివాళులర్పిస్తోంది.

(ఆంధ్రభూమి వారపత్రిక, 16 జులై 2015)

❖

(41) నేలరాలిన మోదుగుపూవు

"అన్న' వస్తాలే తమ్ముడు కోరుకుంటాడు'.

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నిజాం రాజును జన్మజన్మాల బూజుగా 'ముసలినక్కకు రాచరికంబు దక్కునే' అంటూ తెలంగాణ ఉద్యమానికి కవిగా ఊపిరిలూదింది దాశరథి కృష్ణమాచార్యులు కాగా– 'తిమిరంతో సమరం' జరిపిన ఆ కవి 'దాశరథి'కి తమ్ముడుగా, నవలా రచయితగా ఖ్యాతి గడించినది దాశరథి రంగాచార్యులు. 'దాశరథి' అనగానే అన్నగారే కవిగా, సినీ గేయరచయితగా 'చిరయశస్వి' అయినా, ఆయన సోదరుల్లో తమ్ముడిగా 'రంగాచార్య' అన్నవల్ల తనకు వ్యక్తిగతమైన స్ఫూర్తేమీ లభించలేదు అనీ, ఆయన సహాయ సహకారాలు తానెప్పుడూ అడగలేదనీ, తనకు 'పరోక్షస్ఫూర్తి' అనీ పేర్కొన్నా, 'అక్షర వాచస్పతి'గా– అన్న తరువాత అంతే మిన్నగా ఖ్యాతి నందుకున్నది ఈ రంగాచార్య. 'దాశరథి'గా అన్న కీర్తిలో తమ్ముడూ జనజీవితంలో అంతగానూ మమేకమయ్యారు.

'చిల్లరదేవుళ్ళు', 'మోదుగుపూలు', 'జనపదం', 'అమృతంగమయ' వంటి నవలలు రాసిన దాశరథి రంగాచార్య తెలంగాణ జనజీవితాన్ని చిత్రించిన, ప్రభావితం చేసిన రచయితగా తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక స్థానం చేజిక్కించుకున్నారు. 1938 వరకూ తెలంగాణ జనజీవితం ఎలావుందో 'చిల్లరదేవుళ్ళు'లో కనబడుతుంది. ఉద్యమం ఏ దశలో సాయుధమవుతుందో, ఎప్పుడు నిరాయుధమవుతుందో స్పష్టంగా విశదీకరించిన 'మోదుగుపూలు' నవల సుమారు తన ఆత్మకథ అని ఆయనే చెప్పుకున్నారు.

తాను నిరంకుశత్వాన్ని ఎదిరించాను కానీ ఒక మతాన్ని, ఒక కులాన్ని కాదనీ, తానెన్నడూ ఉద్యమకారుణ్ణి అనీ, తనది సాహిత్యోద్యమమనీ, వేదాన్ని హరిజనులతో, గిరిజనులతో, స్త్రీలతో చదివించాను అనీ, సాహిత్య చరిత్రలో అదీ విప్లవమేననీ,

తాను రాజకీయాలకు దూరంగా వున్నాను గానీ ఉద్యమాలకు దూరంగా లేను అనీ ప్రకటించుకున్న రచయిత ఆయన. మార్క్సిజమూ మతమూ పరస్పర వైరుధ్యాలు కావన్నట్లు విశ్వసించి అక్షరయానం చేశాడాయన. 87వ ఏట జూన్ ఎనిమిదవ తేదీ తనువు చాలించి నేలరాలిన ఈ 'మోదుగుపూవు' 'ఉత్తుంగ సాహితీ నగం'గా కీర్తింప బడింది. "వేదాలు అపౌరుషేయాలు, అగ్రవర్ణ ఆధిపత్యంలో చిక్కుకున్నవి" అనే అపప్రథను తొలగించడానికే తేటతెలుగు వచనంలో ప్రజల దగ్గరకు తెచ్చిన తొలి రచయితను తానే అని ప్రకటించుకున్నారాయన.

భారతదేశపు అనేక పుణ్యక్షేత్రాల, తీర్థాల సందర్శనం చేసి ఆ యాత్రా విశేషాల నన్నింటినీ రంగాచార్య అక్షరబద్ధం చేశారు. రామాయణ, భారత, భాగవతాలను సులభవచనంలో గ్రంథస్థం చేసిన రంగాచార్య 'శ్రీ రామానుజ చరితామృతం' కూడా రచించారు. తెలంగాణ తొలితరం ఉద్యమ రచయితగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, సంస్కర్తగా, ఆధ్యాత్మిక వాదిగా, అభ్యుదయ సాహిత్యోద్యమ ప్రాపుగా, నాలుగు వేదాలను వచనంలో పొదిగించిన కలం కారునిగా రంగాచార్య తెలంగాణలోనే కాదు అంతటా, కీర్తికాయులే. 'దాశరథి' అన్న పేరు అన్నదమ్ములిద్దరికీ అభేదంగా ఈ తరంలో పరివ్యాప్తమయ్యింది. షష్టిపూర్తి చేసుకున్న ఒకటి రెండేళ్ళకే అన్న దాశరథి అస్తమిస్తే, ఈ తమ్ముడు దాశరథి సహస్రచంద్ర దర్శనం చేసుకుని ఎనభై ఏడేళ్ళ బతుకు పుస్తకం పండించుకున్నాడు. అనుకున్నది నిర్భయంగా ప్రకటించడంలో అన్నదమ్ములిద్దరూ ఎవరికెవరూ తీసిపోలేదు. ఆంధ్రప్రదేశ్ చివరి ఆస్థానకవిగా అన్న దాశరథి వెలుగొందారు. ప్రత్యేక తెలంగాణ 'కల' సాకారమవ్వడం తమ్ముడు దాశరథి కళ్ళారా చూసారు.

అయితే "ప్రత్యేక తెలంగాణ మాత్రమే ప్రజల అభ్యున్నతికి కారణం అవుతుందని నేను నమ్మడం లేదు. రాజకీయ పోరాటాలు మాత్రమే ప్రజలకు మేలు చేస్తాయి. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్నది రాజకీయ ఆర్భాటమే అని నా నమ్మకం. అందువల్ల ప్రజల భాగస్వామ్యం లేదు. రాజకీయ కీచులాటలే కనిపిస్తున్నాయి" అని 2004 లోనే 'నేటి నిజం' పత్రికకు శ్రీనాళేశ్వరం శంకరానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని ప్రకటించిన దాశరథి రంగాచార్య తనవి విషయ ప్రధానమైన నవలలు అనీ, భాషా ప్రధానమైన నవలలు కావనీ, తెలంగాణ జనజీవితాన్ని అందరికీ అందించాలనే తన ధ్యేయం కానీ, "నాది ప్రాంతీయ భాషావాదం కాదు" అనీ స్పష్టంగా ప్రకటించుకున్నారు. పాశ్చాత్య రచయితల్లో గోర్కి, డికెన్స్, మామ్, భారతీయ

రచయితల్లో ప్రేమ్‌చంద్, కిషన్‌చంద్ తనను ప్రభావితం చేశారు అనీ, తనను ప్రభావితం చేసిన సంప్రదాయ కవులు వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు అనీ, ద్రవిడ సాహిత్యానికి సంబంధించినంత వరకూ ఆండాళ్ గోదాదేవి నా మీద ప్రభావం వేశారనీ అనేవారాయన.

"ముఖ్యంగా ప్రభావం ఉద్యమాలది. ఒక ఉద్యమం వందరచనల ప్రభావం వేస్తుంది. వంద రచనల అనుభవం కలిగిస్తుంది. నాకు రచనలు కూడా ఉద్యమమే. ఈ ప్రభావాలు నా రచనల్లో ఎక్కడా కనిపించవు. నాది స్వతంత్రమైన మార్గం, శైలి, నడక, విషయం. ప్రభావం ఏదయినా నా మీద వుంది కానీ, నా రచనల మీద లేదు" అంటూ తన స్వేచ్ఛాయుత రచనాధోరణి గురించి చెప్పుకునేవారు.

అందువల్లే కమ్యూనిస్టు రచనలు చేసిన కలం నుంచే– ఆయన ఆధ్యాత్మిక రచనలు, వేదాలను వచనంలో రాయడం వంటి విలక్షణ మార్గాలను అనుసరించారు. ఆయన రచనలేవయినా ప్రజలు సమాదరించారు. 'అక్షర వాచస్పతి' అని ఆయనను అభినందించారు. కొంతమేరకు కొందరి దృష్టిలో నిజాలను నిర్భయంగా ప్రకటించే వైఖరితో వివాదాస్పదుడయినా, ప్రజాభిమానం చూరగొన్న దాశరథి రంగాచార్యకు అందుకే తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వర్తింప చేసింది.

దాశరథి రంగాచార్య 'జీవనయానం' ఎందరినో స్ఫూర్తిమంతులను చేసింది. "విప్లవం నుండి వేదం దాకా రంగాచార్య జీవితం– సాహిత్యం"పై విజయ ప్రకాశ్ అనే విద్యార్థి పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. దాశరథి రంగాచార్య సమగ్ర సాహిత్యం అంతా విశాలాంధ్ర దాదాపుగా వెలువరించింది. హైదరాబాద్ నగరశాఖ అరసం తొలి అధ్యక్షులు దాశరథి రంగాచార్యగారే.

వచన రచనలో తనదైన వైశిష్ట్యాన్ని చాటుకున్న సాహితీ దిగ్దంతుడు దాశరథి రంగాచార్య మరణం తెలుగు సాహిత్యానికి ఒక తీరని లోటే!

(ఆంధ్రభూమి మాసపత్రిక, జూలై 2015)

❖

(42) కాలాతీత వ్యక్తి కలామ్

వివేకానందుడి తరువాత భారతదేశపు యువతకు తన సందేశాలతో చైతన్యదీప్తిగా, ఆదర్శవేత్తగా నిలిచిన మహనీయుడు అబ్దుల్ కలాం. నిరంతర కృషినే వినోదంగా భావించిన 'శ్రామికుడు'. దేశపు అత్యున్నత పౌరునిగా రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ఒక సామాన్యుడు.

ఎంత స్నాప్పికుడో– అంతటి కార్యశీలి.
ఎంతటి శాస్త్రవేత్తయో– అంతటి పారమార్థికుడు
అణ్వస్త్రాల నుండి– సామాన్యుడి అన్నవస్త్రాల వరకూ
దేశ ఔన్నత్యానికై తపించి శ్రమించిన దేశభక్తుడు.
రాజకీయం అంటని మేధావి.

ఎనభై నాల్గవ ఏట తనకు ఇష్టమైన విద్యార్థి బృందాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూనే కుప్పకూలి నింగికెగసిన 'మిస్సైల్ మ్యాన్', ధ్రువతార కలాం!

మానవీయ విలువలకు మకుటధారి! భారత రాష్ట్రపతిగా ఆ పదవిని అలంకరించిన మొదటి శాస్త్రవేత్త ఆయనే. తొలి అవివాహిత రాష్ట్రపతీ ఆయనే. స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణులకు రూపకల్పన చేసిన శాస్త్రకోవిదుడు. ఆరోగ్య రంగంలోనూ సామాన్యుడి కోసం కరోనరి స్టెంట్‌ను, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య భద్రతకై టాబ్లెట్‌ను రూపొందించిన ఘనత ఆయనదే. ఆయన శ్రమించే తత్వం, నిత్యవిద్యార్థిగా జ్ఞానసముపార్జనం, చెదరని ఆత్మవిశ్వాసం, ఉదాత్తలక్షణాలు– ఈ దేశపు యువతకు ఆదర్శవంతాలు.

"కల అంటే నిద్రలో వచ్చేది కాదు. కల అంటే మిమ్మల్ని నిద్రపోనివ్వకుండా చేసేది. కల ఆలోచనలను రేకెత్తిస్తుంది. ఆలోచన మనలను కార్యోన్ముఖుల్ని చేస్తుంది. కలలు కనండి– వాటిని సాకారం చేసుకోండి".

అన్న ఆయన సందేశం– ఈ దేశ యువతలో కలిగించిన కలకలం గొప్పది.

ఆయన మాటలు కలకాలం స్ఫూర్తిమంతాలుగా నిలిచేవి. కలాంలో శాస్త్రవేత్త మాత్రమే కాదు ఓ కవి, స్నాప్పికుడు, సాహితీవేత్త వున్నారు.

స్ఫూర్తిదాయకమైన 'వింగ్స్ ఆఫ్ ఫైర్' గ్రంథం ఆయన జీవిత చరిత్రే. దేశం ఎదుర్కొంటున్న సమస్యలు, యువత వాటిని ఎదుర్కోవాల్సిన తీరు– 'ఇగ్నైటెడ్ మైండ్స్' అనే గ్రంథంగా రాశారు. అలాగే తన ఎనభై ఏళ్ళ జీవితంలో చదివిన పురాణాలు, మతగ్రంథాలు, పుస్తకాలు, సాహిత్యం నుండి ప్రేరణాత్మకమైన అంశాలను 'ద గైడింగ్ లైట్' పుస్తకంగా వెలువరించారు. 'ఫోర్జ్ యువర్ ఫ్యూచర్' అనేది యువతలో స్ఫూర్తినింపే మరో అద్భుత రచన. తనకు వచ్చిన అవకాశాలు, తను పడిన శ్రమ, నేర్చుకున్న పాఠాలను, 'మై జర్నీ' అనే గ్రంథంగా రాసిన కలాం– అనేక సందర్భాల్లో తాను పిల్లలతో మాట్లాడిన విషయాలను 'చిల్డ్రన్ ఆస్క్ కలాం' అనే పుస్తకంలో పొందుపరిచారు. భవిష్యత్తులో వచ్చే వాతావరణ వాయు పరిణామాలను– 'రి ఇగ్నైటెడ్' గ్రంథంగా రాశారు. 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ', 'ద రైటియస్ లైఫ్', 'స్క్వేరింగ్ ద సర్కిల్' తదితర పుస్తకాలను కలాం తన కలంతో జాలువార్చారు. అన్ని మతాల్లోని గొప్పదనాన్ని వివరిస్తూ కలాం చివరగా రాసిన పుస్తకం 'ట్రాన్స్‌సెన్స్'.

భారతదేశపు ఓ గొప్ప ముస్లిం, హిందువుల పవిత్ర పర్వదినమైన తొలి ఏకాదశి రోజు (27.7.2015) షిల్లాంగ్‌లోని క్రిస్టియన్ హాస్పిటల్ 'బెతానీ'లో చివరి శ్వాస వదిలేయడం కాకతాళీయమే అయినా, ఆమరణాంతం ఒక సెక్యులరిస్ట్‌గా, మానవతా వాదిగానే ఆయన చిరస్మరణీయం కావడం యథార్థం.

తమిళనాడులోని జ్యోతిర్లింగ క్షేత్రమైన రామేశ్వరంలో పేద ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15 న జైనులబ్దీన్, ఆషియమ్మా దంపతులకు 'అవుల్ ఫకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం'గా జన్మించిన కుర్రవాడే– తొలుత చింతగింజలు సేకరించి అమ్మడం, తెల్లవారుజామునే లేచి ఇంటింటికీ పేపర్ వేయడం ద్వారా తొలి సంపాదన చేశాడు. ప్రాథమిక విద్యాభ్యాసం నుండే తెలివైన విద్యార్థిగా వుంటూ, తిరుచినాపల్లిలోని సెయింట్ జోసఫ్ కళాశాల నుండి 1954 లో భౌతికశాస్త్రంలో పట్టభద్రుడు అయ్యాడు. 1955 లో మద్రాసులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విద్యనభ్య సించారు. భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ డి.ఆర్.డి.ఓ.తో 1960 లో తన కెరీర్‌కు శ్రీకారం చుట్టిన కలాం, 1969 లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ

'ఇస్రో'లో చేరారు. 1970 నుండి 1990 వరకు ఇస్రో చరిత్రలో కలాం పనిచేసిన కాలం ఓ 'సువర్ణ అధ్యాయం'. 1980 లో ఎస్.ఎల్.వి.3 ప్రయోగానికి రూపకర్త ఆయనే. 1990 లో తిరిగి డి.ఆర్.డి.ఓ.లో బాధ్యతలు స్వీకరించిన ఆయన నాయకత్వం లోనే– అగ్ని, పృథ్వి వంటి భారతదేశ క్షిపణులు విజయవంతంగా ప్రయుక్తాలయ్యాయి. 1992 నుండి 1999 వరకు రక్షణ మంత్రిత్వశాఖ శాస్త్ర సాంకేతిక సలహాదారుగా వుండి పోఖ్రాన్–2 అణుపరీక్షల్లో ప్రధానపాత్ర వహించారు. 1999 నుండి 2001 వరకు భారత ప్రభుత్వ ముఖ్య శాస్త్ర సాంకేతిక సలహాదారుగా పనిచేసిన ఆయన– కె.ఆర్.నారాయణన్ తరువాత 2002 లో 11 వ భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.

1981లో పద్మభూషణ్, 1990 లో పద్మవిభూషణ్, 1997 లో దేశపు అత్యున్నత అవార్డు 'భారతరత్న'ను అందుకున్న అబ్దుల్ కలాం నిజంగా భారతరత్నం. ప్రపంచంలో మరే వ్యక్తీ పొందనన్ని గౌరవ డాక్టరేట్లను– సుమారు నలభై విశ్వవిద్యాలయాల నుండి ప్రపంచవ్యాప్తంగా అందుకున్నారు. వివేకానంద జయంతిని 'యూత్ డే'గా సంభావించేటట్లుగానే, అబ్దుల్ కలాం జన్మదినమైన అక్టోబర్ 15 ను ఐక్యరాజ్యసమతి 2010 లో 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం'గా ప్రకటించింది. ఆ గౌరవం ఆయనకే దక్కింది. అది మనదేశానికి గర్వకారణం!

1994 వరకు హృద్రోగులకు గుండెలో ఏర్పడిన బ్లాక్‌లను క్లియర్ చేయడానికి విదేశాలనుంచి వచ్చే స్టెంట్‌లను మాత్రమే వాడేవారు. వాటి ఖరీదు ఎక్కువగా ఉండి, సామాన్యులకు అందుబాటులో వుండడం లేదని అబ్దుల్ కలాం, డాక్టర్ సోమరాజు గారితోబాటు యోచించి, 1994 లో 'కలాం రాజు స్టెంట్' మార్కెట్‌లోకి తేవడంతో, పేదలపాలిటి పెన్నిధిగా విదేశీస్టెంట్‌ల ధరలు కూడా లక్ష నుంచి యాభైవేల వరకూ తగ్గిపోయాయి. వికలాంగుల కోసం తేలికైన కాలిపర్స్, ఫ్లోర్ రియాక్షన్ ఆర్థోసిస్ కూడా కలాం ఆవిష్కరణలే! బరువులేని కేవలం 150 గ్రాములుండే కాలిపర్స్– వికలాంగులకు అందుబాటులోకి రావడానికి కలాం కృషియే కారణం! ఆయన రాష్ట్రపతి కాకముందు 'కేర్ ఫౌండేషన్' ఛైర్మన్‌గా వ్యవహరించారు.

అబ్దుల్ కలాంగారి చిన్నప్పటి ఒక సంఘటన:

ఒకరోజు పగలంతా ఎక్కువగా పని ఉండటంతో అబ్దుల్ కలాంగారి అమ్మ బాగా అలిసిపోయింది. ఆ రోజు రాత్రి– వంట పూర్తయిందనీ భోజనానికి రమ్మనీ ఆమె పిలవడంతో, కలాం తన తండ్రితో కలిసి భోజనానికి కూర్చున్నారు. తన

తండ్రి ముందు ఒక ప్లేటులో పెట్టిన రొట్టెలు బాగా మాడిపోయి వుండటాన్ని చూసిన కలాం, తన తండ్రి వాటిని తినే ముందు తల్లిని ఏమయినా కోప్పడతారేమో ననుకున్నారు. కానీ తండ్రి ఆ రొట్టెలను తిని, ఆమెను ఏమీ అనకుండా లేచి వెళ్లాడు. కొద్దిసేపటికి ఆమె తన భర్త వద్దకు వెళ్ళి రొట్టెలు మాడిపోయినందుకు క్షమించమని కోరింది.

వెంటనే తండ్రి "నాకు మాడిపోయిన రొట్టెలంటే చాలా ఇష్టం" అని ఎంతో ప్రేమగా ఆమెతో అన్నారట. ఇదంతా గమనించిన అబ్దుల్ కలాం కొంతసేపటి తర్వాత తన తండ్రి దగ్గరకు వెళ్ళి– "మీకు నిజంగా మాడిపోయిన రొట్టెలంటే అంత ఇష్టమా?" అని అడిగారు. ఆయన అబ్దుల్ కలాం తల నిమురుతూ "మీ అమ్మ పగలంతా కష్టపడి ఎంతో అలసిపోయింది. అంత అలసటలో కూడా విసుగులేకుండా వంట చేసింది. ఒక పూట మాడిపోయిన రొట్టెలు తింటే మనకేమీ కాదు. కానీ ఆ రొట్టెలు మాడిపోయాయని విమర్శిస్తే, ఆమె మనసు ఎంతగానో బాధపడుతుంది. అలా బాధపెట్టడం నాకిష్టం లేదు. జీవితంలో ఎవరైనా కొన్ని సందర్భాలలో పొరపాట్లు చేయడం సహజం. ఆ పొరపాట్లను ఆధారంగా చేసుకుని విమర్శించడం మంచిది కాదు" అన్నారట. ఈ సంఘటనను ఉటంకిస్తూ అబ్దుల్ కలాంగారు చెప్పిన విషయం–

"ఎదుటివారు చేసిన పొరపాట్లను చూసి తొందరపడి విమర్శించి వారి మనసులను బాధపెట్టకండి. బంధాలను బలపరుచుకుంటూ జీవితాలను కొనసాగించండి".

కలామ్ రాష్ట్రపతి పదవిని అలంకరించే స్థాయికి ఎదగడం చూసి నచ్చనివారు కలామ్‌ను విమర్శించవచ్చు. కానీ సామాన్య ప్రజలు హర్షించగల వ్యక్తిత్వంతో, పాలకులకి ఏ మాత్రం ఇబ్బంది కలిగించని వైఖరితో, చాలా లౌక్యుడుగా ఆయన అత్యున్నత శిఖరాలు అధిరోహించగలిగారు. నీతులు, ఆదర్శాలు చెప్పారు గానీ, ప్రజల్లో మార్పులు ఆశించారు గానీ, ప్రభుత్వాల్నీ, పాలకుల్నీ ఏనాడూ నొప్పించలేదు. భారత క్షిపణి మహాత్మునిగా పేరొందిన ఆయన– యుద్ధ ఆర్థిక వ్యవస్థకి మేధస్సు ధారపోసారు. పొరుగు దేశాలను భయభ్రాంతులను చేసే ఆయుధ సంపత్తితో ఈ దేశ పేదప్రజలకు పనికొచ్చేదేమిటనీ, వ్యవస్థీకృత దోషాలను ప్రశ్నించకుండా పాలకుల కనుసన్నల్లో మెలిగారనీ వ్యాఖ్యానించినవారున్నారు.

రాజకీయవ్యవస్థకి రాష్ట్రపతిపదవి రబ్బర్‌స్టాంప్‌గా అలుసైన దేశంలో–

అసలయిన మార్పు ప్రజల ఆలోచనా విధానాల్లోంచే వస్తుందనీ, అవినీతితో భ్రష్టుపడుతున్న వ్యవస్థను యువతే మార్చగలరనీ గాఢంగా నమ్మి అందుకు సమాయత్తం చేసిన వ్యక్తి, జీవన వికాస సందేశాలనూ, మానవీయ విలువల ప్రబోధాలను అందించిన నిస్వార్థ, నిరాడంబర, నిజాయితీపరుడు కలాం. రంగుటద్దాల్లో చూసేవారికీ, విమర్శించడమే గొప్ప అనుకునేవారికీ చెప్పగలిగేదేమీ లేదు. ఆయనది 'నిష్క్రియాపరత్వ ఆదర్శం' కాదు. తన జీవన గమనంలో ఆయన ఎందరిపట్లో చూపిన కారుణ్యభావన, ఉపకార క్రియాశీలత కానవస్తూనే వున్నాయి.

అపజయాలకు క్రుంగిపోక, విమర్శలకు వెరపొందక, లక్ష్యసాధనలో వెనుదిరగక, ఉత్థాన పతనాలను స్థితప్రజ్ఞతతో స్వీకరిస్తూ, విరామమెరుగక పరిశ్రమిస్తూ–ముందుకు పొమ్మని ప్రబోధించిన 'అబ్దుల్ కలాం' తన శక్తిమేరకు దేశానికి సేవ చేశారు. దేశపౌరులకు, ముఖ్యంగా, యువతకు క్రియాశీలురుగా స్ఫూర్తినందించారు. ఆయన దేశ ప్రథమ పౌరునిగా దేశభక్తితో జీవించారు. రాష్ట్రపతిగా ఆయనేమీ ఆస్తులు కూడబెట్టుకోలేదు. నిరంతరం విద్యార్థి అయిన ఒక టీచర్‌గా, మానవతావాదిగానే అస్తమించారు. నిజంగానే కీర్తిశేషులయ్యారు.

(ఆంధ్రభూమి వారపత్రిక, 20 ఆగష్టు 2015)

❖

(43) రమణీయ భావనం

ఆయనను మొదటిసారి ఎప్పుడు, ఎక్కడ, చూశానో, కలిసానో గుర్తు లేదు కానీ, ఆయనను ఎప్పుడు చూసినా, కలిసినా, అది మొదటిసారి అన్నట్లుగా కాక, ఎప్పటినుంచో 'ఎఱుక' అన్న భావన ఆత్మీయంగా కదలాడుతుంది! ఇది నా ఒక్కడి భావనే కాదు. అలాంటి వందలాది మందిలో నేనొక్కడిని అని నాకు తెలుసు. మనం పలకరించడానికన్నా ముందే, మనలనుచూడగానే పలకరించే సహృదయత ఆయన సొత్తు. మనం ప్రేక్షకుల్లో కూచున్నా ,ఆయన సభావేదిక నుండి ప్రసంగిస్తున్నా– సందర్భం వస్తే మన పేరు ప్రస్తావించక మానరు. ఆ మాటకొస్తే ఒకానొక సభలో ప్రసంగిస్తూ ప్రేక్షకుల్లో కూచున్న తనకు పరిచితమైన పేర్లు ఆయన ప్రస్తావిస్తూపోతే, ఆ నామావళి శతమానంగా సాగి, ప్రేక్షకుల కరతాళ ధ్వనులు ఆ ప్రాస్తావిక సుమనస్కతకే మారుమ్రోగాయంటే– ఆయన తనకు తెలిసిన వారెవరినీ, ఎప్పుడూ, మరచిపోయిన సందర్భం లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆయనకు అందరూ గుర్తే! ఆయన అందరికీ ఒక 'గుర్తు'.

ఆయనకు అతిశయం లేదా? అంటే ఒక ఐ.ఏ.ఎస్. ఆఫీసర్‌గా తన విద్యుక్త ధర్మ నిర్వహణలో నిజాయితీగా, చిత్తశుద్ధిగా నిలవడంతో– ప్రయుక్త పరచడానికి అభివ్యక్తం చేయాలనుకున్నా, ఆయన నైజంలో అది ఇమిడేది కాదు. 'ఆత్మ విశ్వాసమే' తప్ప, అహంకరించని నైజం ఆయనది.

నాకు బాగా గుర్తుండిపోయిన ఆయనతోటి తొలినాళ్ళ సమావేశం– ఎన్నాళ్లగానో కవిత్వం రాస్తున్నా, యువభారతిలో ఇరివెంటి కృష్ణమూర్తి, చక్రవర్తి వేణుగోపాల్, వంగపల్లి విశ్వనాథం గార్లతో కలసి 'వీచికలు' కవితా సంకలనం, ఆ తరువాత 1974 లో మిత్రుడు డా॥ నాగినేని భాస్కరరావుతో కలిసి 'మేం' కవితా సంకలనం ప్రచురించినా, నాదంటూ పూర్తిగా నా కవిత్వంతో తొలిసారిగా 1990

లో 'అగ్నిసుధ' కవితా సంకలనం వేసుకున్నాను. అయితే దానికి 'ఆవిష్కరణ' వంటి తతంగం ఏమీ చేయలేదు. కానీ 1990 లో వెలువడిన వచన కవితా కావ్యాలలో 'అగ్నిసుధ'కు, కలహంసి సాంస్కృతిక సంస్థ మొట్టమొదటగా అవార్డు ప్రకటించి, ఆ అవార్డుప్రదానోత్సవ సభను 5 మే 1991 న బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించింది.

అలా నా మొదటి కవితా సంకలనానికి మొట్టమొదటి అవార్డును జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, అప్పుడు తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ అయిన డా॥ సి.నారాయణరెడ్డి చేతులమీదుగా అందుకున్నప్పుడు ఆ సభకు శ్రీ కె.వి.రమణాచారిగారే 'అధ్యక్షులు'. అలా అప్పట్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాలశాఖ సంచాలకులుగా వున్న రమణాచారిగారు సభాధ్యక్షత వహిస్తూ " 'అగ్నిసుధ' కవితా సంపుటి మొదట ఎర్రపుటలతో కొట్టవచ్చినట్లున్నప్పటికీ, మంచి కవిత్వంతో ఎదపుటల్ని తట్టేదిగా వుందనీ, సుధామ 'అగ్నిసుధ' అంతరాంతరాలను తట్టిలేపే 'సత్కావ్యసుధ' " అనీ ప్రశంసించం నా ఎదలో ముద్రించుకున్న వారి తొలి అభినందన!. డాక్టర్ ఎన్.గోపి ఆ సభలో 'అగ్నిసుధ' కావ్య పరిచయ ప్రసంగం చేయడమూ, కలహంసి ప్రధాన కార్యదర్శిగా శ్రీ వడ్డేపల్లి కృష్ణ అలా 'అగ్నిసుధ'కు తొలి అవార్డు ప్రదానోత్సవ సభా నిర్వాహకుడు కావడమూ జరిగింది. ఆ తరువాత ఆయన సభాధ్యక్షులుగా, ముఖ్య అతిథులుగా పాల్గొన్న అనేక సభలలో రమణాచారిగారితో బాటు పాల్గొనే అవకాశ వేదికలు ఎన్నో లభించాయి నాకు!. ఆ ఏడే 'అగ్నిసుధ'కు కడపలో 'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు' ఈ శుభ శ్రీకారంతోనే వరించింది.

ఆయన ఏ పదవిలో వున్నా ఆ పదవులు ఆయనవల్ల రాణించాయని నేను కొత్తగా చెప్పక్కర్లేదు. అది లోకం కోడై కూసే వైతాళిక ప్రశంసయే! అటువంటి వ్యక్తిత్వం, ఏతాదృశ గుణగణ భూషితుడు కావడం ఆయనకు సహజోక్తులు. ఆయన వచోనైపుణి క్రమక్రమానుగతంగా పెరుగుతూ వచ్చింది. ఆనంద, ఆహ్లోద సదృశం మాత్రమే కాదు, ఏ విషయంపై మాట్లాడినా అందులో ఒక సాధికారత, విషయ వివరణం, వికాసవంతమైన, అందుకోదగిన ఒక జ్ఞానాంశం ఆ వాగ్భూషణం లోని 'దీధితి'. రమణాచారి అని ఉటంకించకుండా కె.వి.రమణగా తన పేరును ఏనాడో స్థిరీకరింపచేసుకున్న విశాల మానసం తనది. ఆయనవల్ల మేలు పొందినవారు 'వేలు'. ఆయన తన 'వేలు' పట్టించి నడిపించిన సంస్థలూ అనేకం. మా యువభారతి సంస్థ

అన్నా ఆయనకు ఎంతో అభిమానం, ఆదరణం. యూత్ సర్వీసెస్ డివిజన్‌లో ఒకానొక వర్క్‌షాప్‌కు నన్ను పిలిపించినప్పుడు ఆయన ఒకప్పటి యువభారతి వైభవాన్ని పునరుజ్జీవింప చేయాలనీ, దానికి పూనిక వహించమనీ కోరి ప్రోత్సహించడం గుర్తుంది. యువభారతి 'వేదవిజ్ఞానలహరి', 'ఉపనిషత్సుధాలహరి' వంటి కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించగలిగిందంటే ఆయన వెన్నుదన్నులే దానికి హేతువులు. ప్రస్తుతం యువభారతి ప్రచురణల ప్రధాన సంపాదకునిగా ఆయనకు కృతజ్ఞతలు తెల్పడం నా ధర్మం.

ఆయన ఎవరినుంచి ఎటువంటి కృతజ్ఞతలూ ఆశించకుండానే ఎన్నో మంచి పనులు చేశారు. ఎందరిచేతో చేయించారు. అది గతమే కాదు. నిరంతర వర్తమానం కూడాను. ఐ.ఏ.ఎస్. ఆఫీసర్‌గా రిటైరవడానికి ముందుగానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి ప్రవృత్తిలోనే కాదు, వృత్తిలోనూ తన విలక్షణతనూ, వ్యక్తిత్వాన్నీ చాటుకున్న నిబ్బరం ఆయనది. నేడు సాంస్కృతిక శాఖ సలహాదారుగా సీమిత క్షేత్రం నుండే అపరిమిత ఉపయుక్త కార్యశీలతను చూపుతున్న తృప్తహృదయుడాయన. షష్టిపూర్తి అయినా ఇష్టపూర్తిగా జీవించడమే ఆయన గమన విధానం. ఆయన రాజకీయాల కతీతంగా నిజానికి అందరివాడు. 'అందరి బంధువయా' అన్న ఆత్మీయతను సంపాదించుకున్న వాడు. సాహిత్య, కళారంగాల పట్ల ఆయన ఆసక్తి, దేవాదాయశాఖతో ముడిపడిన భక్తి, సమాజంలో మంచి విలువల పట్ల ఆయన గాఢానురక్తి– ఆయనను ఒక విలక్షణ ప్రభుత్వాధికారిగా నిలిపాయి.

ఏ బాధ్యత ఆయన తలకెత్తినా దాన్ని భారం అనుకోకుండా అందులో నుండి ప్రజా ప్రయోజన సారం లక్ష్యించి, దానినే పిండి అందించిన వితరణశీలమైన పిడికిలి ఆయనది. అందులో శక్తి వుంది. జనహితాసక్తి వుంది. ముప్ఫైఅయిదేళ్లు ప్రభుత్వసేవలో వుండి తనదైన ఒక భవంతినైనా నిర్మించుకోని నిజాయితీ ఉద్యోగి ఆయన. హైదరాబాద్ పాతబస్తీ ప్రజల మనస్సును అంతలా దోచుకున్న మరో అధికారి లేడేమో! తనపై విమర్శలు వెల్లువెత్తిన సందర్భాల్లోనూ జడియక నిలచి, మొక్కవోని దీక్షతో కర్తవ్యపాలనం చేసిన కార్యశీలు డాయన. కుడా, ఖాదీ గ్రామోద్యోగం, దేవాదాయశాఖ, గృహనిర్మాణ శాఖ, టి.టి.డి. వంటి పలుచోట్ల ఆయన నిర్వహించింది ఉద్యోగధర్మం ఒకటే కాదు, ఆయా శాఖల ద్వారా ప్రజలకు మేలొనగూర్చే పరమధర్మానుష్ఠానం. అందుకే సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలతో రమణాచారిని కొందరు ఉపమిస్తూ ఉండేది!

మెదక్‌లో పాఠశాల, సిద్ధిపేటలో డిగ్రీ, పీ.జీ. పూర్తయ్యాక జగదేవ్‌పూర్‌లో కొంతకాలం ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్. ఈ ప్రస్థానంలోంచే ఆయన సాంస్కృతికాభిలాషా వికసించింది. చిన్నప్పుడే నాటకాలు ఆడి, పాటలు పాడిన వారు కనుకనే నాటకరంగానికి ఆయన చేసిన సేవలు తులలేనివి. 'సురభి' వంటి ప్రాచీన నాటక సంస్థలకు ఆయన సమకూర్చిన మేళ్ళు మరపురానివి. 1966 లో తెలంగాణ ఉద్యమంలో– విద్యార్థి నేతగా కొంతకాలం సంగారెడ్డి జైలు జీవితం అనుభవించిన నేతృత్వ పటిమా ఆయనలో వుంది. ఏ పనిచేసినా ఒక ఉద్యమస్ఫూర్తితో 'అతడే ఒక సైన్యం' అన్నంత దీక్షాదక్షతలతో చేయగల చేవ ఆయన సొంతం. సమాచార శాఖ కమీషనర్‌గానూ చేసినా– ప్రభుత్వం ఆ పదవిలో ఆయన నుండి ఎంత లబ్ధిపొందాలో అంత పొందలేక పోయిందనుకుంటారు చాలామంది. ఎందరో వృద్ధ కళాకారులకు జీవనభృతి ఏర్పడడానికి హేతువైన వదాన్యుడాయన.

సాహిత్య సంగీతాలకే కాదు, నాటకరంగానికి ముఖ్యంగా ఆయన సేవలు గొప్పవి. అందువల్లే ఆయన షష్టిపూర్తి సందర్భంగా నాటక ప్రదర్శనలు విరివిగా జరిగాయి. అలాగే అంతరించిపోతున్నాయనుకుంటున్న 'హరికథలు' వంటి ప్రక్రియల పునరుజ్జీవనానికి ఎంతగానో తోడ్పడ్డారాయన. రమణగారు మంచి కార్యదక్షుడైన ప్రభుత్వ అధికారిగా, సాంస్కృతిక సేవాబంధువుగా, చక్కని వచోనైపుణి గల వక్తగా చాలామంది ఎరుగుదురు. కానీ ఆయనలోని రచయిత కోణమూ బహు దొడ్డది.

నిజానికి కెమిస్ట్రీ చదివిన కె.వి.రమణాచారికి తెలుగు భాషా సాహిత్యాల కెమిస్ట్రీ బాగా తెలుసు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఎంత పని ఒత్తిడుల్లో వున్నా పుస్తక పఠనం ఆయన విస్మరించలేదు. ఆధునిక పద్య సాహిత్యంపై తెలుగులో ఆయన డాక్టరేట్ చేసి సిద్ధాంత గ్రంథం వెలువరించడం, అది కూడా ఉద్యోగ విరమణకు ఒకటి రెండేళ్లు ముందుగా చేయడం ఎందరికో ఆశ్చర్యం కలిగించే విషయం. ఆయన సిద్ధాంత గ్రంథం వెయ్యేళ్ల తెలుగు పద్యం యొక్క వారసత్వాన్ని, పద్య వైభవ ప్రాభవాలను తెల్పుతూ ఆధునిక పద్యకవులను, వారి కావ్యాలను ఎన్నింటినో సమగ్ర విశ్లేషణం చేస్తూ, ఆదరణ తగ్గుతోందనుకుంటున్న పద్యప్రక్రియకు గొప్ప ఊతంగా చక్కటి విశ్లేషణతో సాగిన గ్రంథం. 'విద్యలో అభివృద్ధి ఏదయినా విత్తం కోసమే' అన్న కెరీరిస్టిక్ ఆలోచనలు పెరుగుతున్న ఈ తరాన, వృత్తి ఉద్యోగాలతో, ప్రమోషన్లతో సంబంధం లేని, తెలుగు సాహిత్యంలోని– అందునా పద్యసాహిత్యంలోని ప్రతిభా

ప్రాభవాల గురించి పరిశోధన చేసి, గ్రంథం వెలువరించడం నిజంగా అభినందనీయం. సిద్ధాంత గ్రంథ రచనే కాదు డా॥ కె.వి.రమణ ఆకాశవాణికి అనేక ప్రసంగాలు చేశారు. సాహిత్యాంశాల మీద మాత్రమే కాదు భక్తి, వేదాంత, నైతిక విషయాలపై ఆయన చేసిన ప్రసంగాలు శ్రోతలను అలరించాయి. రచన మాసపత్రికలో 'అమృతవర్షిణి' పేర రమణ గారు రాసిన వ్యాసాలు ఆ ఒరవడిలోనివే.

రమణగారి రేడియో ప్రసంగాలు అంటే నాకో విషయం గుర్తుకు వస్తోంది. ఆకాశవాణిలో నా సహోద్యోగి మిత్రుడు మంత్రవాది సుధాకర్‌కు వారితో చనువు ఎక్కువ. నేను ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి మీద ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి 1991 లో విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి వెళ్లి అక్కడ పనిచేసి 1995 లో తిరిగి హైదరాబాద్ కేంద్రానికి బదిలీ మీద వచ్చాను. రాగానే నాకు తెలుగు విభాగం బాధ్యతలు అప్పచెప్పారు. నాకన్నా ముందు ఆ విభాగాన్ని నిర్వహించిన చలపతిరావుగారు ఎంతో నిష్ఠతో కార్యక్రమాలు రూపొందిస్తూ ఆ విభాగాన్ని తీర్చిదిద్దారు. అప్పట్లో ఉదయం 6-30 కు సూక్తి ముక్తావళి వంటి కార్యక్రమం రోజూ వివిధ పేర్లతో ప్రసారమయ్యేది. అంటే సోమవారం 'మహనీయుల మహితోక్తులు', మంగళవారం 'సాహితీసుధ', బుధవారం 'జ్యోతిపథం', శుక్రవారం 'ఆలోచనామృతం', శనివారం 'ఏరిన ముత్యాలు' అలాగ. గురువారం 'వేదపఠనం', ఆదివారం 'బైబిల్ సూక్తులు' ప్రసారమయ్యేవి. 'మహనీయుల మహితోక్తులు'లో ప్రముఖుల మహిత భావాలను, 'సాహితీసుధ'లో ప్రాచీన ఆధునిక కావ్య మధురిమలను, 'జ్యోతిపథం'లో ఆధ్యాత్మిక, భక్తి, జ్ఞాన, వేదాంత, నైతిక ప్రాముఖ్య అంశాలను అలా ప్రసారం చేస్తుండే వాళ్ళం (వీటన్నింటినీ 'భావన' అనే ఏక వేదిక క్రింద ప్రసారానుకూలంగా నేను మార్పు చేశాను. ప్రస్తుతం 'భావన' పేరు మీదే ఆ ప్రసారం సాగుతోంది).

రమణగారికి 'జ్యోతిపథం' కార్యక్రమం అంటే, అందులో ప్రసంగించడం అంటే ఇష్టంగా వుండేదని సుధాకర్ చెప్పేవాడు. నేను చలపతిరావుగారు ఈ కార్యక్రమాల విషయంలో పాటించిన నిష్ఠకు ముగ్ధుడినయ్యాను. నేనూ అదే ఒరవడిని కొనసాగించేవాడిని. 'చెప్పేవాడికి వినేవాడు లోకువ' అన్న చందాన కాక- ఆయా ప్రసంగకర్తల వ్యక్తిత్వాలకు, వారి చిత్తశుద్ధికి కూడా ప్రాధాన్యం ఇచ్చి, ఆయా అంశాలకు తగిన వారనిపించే ప్రసంగకర్తలనే పిలిచేవాళ్లం. నేను అప్పట్లో ఆయనను ఎప్పుడూ

'జ్యోతిపథం' కార్యక్రమం సమర్పించడానికి కాక 'మహనీయుల మహితోక్తులు' కార్యక్రమానికే ఆహ్వానిస్తుండేవాడిని. సుధాకర్ ఆయనకు 'జ్యోతిపథం' వేయమని గుర్తు చేస్తూండేవాడు.

ఒకసారి నేను ఏదో సభకు వెళ్లినప్పుడు రమణగారు ఆ సభకు తన అర్ధాంగితో బాటు వచ్చారు. 'సుధామగారూ! నేను మా ఆవిడతోనే వచ్చానండీ!' అని ఆయన నవ్వుతూ అన్నారు. అది నాకు చురుక్కున తగిలింది. లోకంలో మంచివారికీ, సత్కార్యాచరణ శీలురకూ కొన్ని ఎదురుదెబ్బలు తగులుతూండవచ్చు. 'ఫలించిన వృక్షమునకే రాతి దెబ్బలు' అని కందుకూరి వీరేశలింగంగారన్నట్లు– తమ నిమిత్తం లేకుండానే అపప్రథలకూ, నీలాపనిందలకూ కొందరు గురి అవుతూండవచ్చు. శ్రీకృష్ణుడు అంతటి వాడే నీలాపనిందలు పొందక తప్పలేదు. చందమామను మబ్బు కమ్మినట్లు, లేక చందమామలో మచ్చ తోచినట్లు, తాత్కాలికమైన భ్రమ ప్రమాదాలకు మంచి మనుషులనుకునేవారూ లోనుకావచ్చు.' ఆ విషయం గ్రహించాక అందునా రమణగారు తనకొక వివరణలా ఆ మాట అన్నాక, నేను ఆ తరువాత ఆయనకు 'జ్యోతిపథం' కార్యక్రమం కాంట్రాక్ట్ పంపించి ప్రసంగించమని కోరాను. ఆలోచనకూ, ఆచరణకూ పొంతన వుండాలని విశ్వసించి కర్తవ్యపాలన చేసే వ్యక్తి రమణగారని ఆలస్యంగానైనా గ్రహించాననే చెప్పాలి.

ఆయన ఔదార్యం గొప్పది. బలహీనతలను అధిగమించగల సామర్థ్యం కూడా అందరికీ వుండదు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన సేవలను వినియోగించుకుందంటే ఆయనకు భగవదనుగ్రహం వుండబట్టేనని తానే స్వయంగా చెప్పుకునే వారాయన. యువభారతి గౌరవాధ్యక్షులు అయిన శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యగారి అన్నగారి కొడుకు రమణగారని నాకు చాలాకాలం తెలియనే తెలియదు. శ్రీనివాసాచార్య గారు అత్యంత ఆప్తులు. నేనంటే ఆయనకూ అవ్యాజ అనురాగం. అదే అవ్యాజ అభిమానం రమణగారి నుండీ పొందగలగడం సుకృతమే!

ప్రముఖ నటులు, దర్శకులు, నాటక రచయిత, జానపద కళాప్రయోక్త అయిన శ్రీ మొదలి నాగభూషణశర్మగారికి 75 సంవత్సరాలు నిండిన అమృతోత్సవం సందర్భంగా కె.వి.రమణగారు అధ్యక్షులుగా వున్న 'రసరంజని' హైదరాబాద్ వారు 2011 జూన్ 25 నుండి 29 వరకు రవీంద్ర భారతిలో నాటకోత్సవాలు నిర్వహించి శర్మగారిని సన్మానించింది. ప్రతిరోజూ హాస్యనాటికా ప్రదర్శనలు జరిగాయి. మొదలి

వారి రెండు నాటక సంపుటులు, శ్రీ పురాణం సూరిశాస్త్రిగారి 'నాట్యాంబుజము', 'నాట్య అశోకము' అనే రెండు అపురూప గ్రంథాలు ఆ సందర్భంలోనే విడుదల అయ్యాయి. ఆ నాటకోత్సవాల ఆహ్వాన పత్రం విలక్షణంగా వుండాలని రమణగారు నన్ను పిలిపించుకుని, నా చేతి రాతలోనే ఇరవై పేజీల ఆ నాటకోత్సవాల బులిటెన్‌ను రాయించి ప్రచురించడం మరచిపోలేని విషయం. ఆ అపురూప సభావేదికపై నన్ను సత్కరింపజేయడమూ మరపురాని మధురానుభూతియే! రమణగారి సౌహార్దం వల్ల సాధ్యమైన సంగతే అది.

డా॥ కె.వి.రమణ తెలుగు వారందరికీ ఆత్మీయమైన వ్యక్తిగా ఎదిగారు. ఎంత ఎదిగినా ధర్మకర్మానుసరణంతో మంచితనంతో ఒదిగారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక సభలకు తన ఉనికితో ఒక రమణీయతనద్ది, సుమనస్సౌరభాలు వెదజల్లారు. అది నేటికీ కొనసాగిస్తూనే వున్నారు. నిజానికి ఆయన గురించి రాయగల ఉపజ్ఞ కలవాడిని కాను.

(అక్షరం ప్రచురణలు 'మా రమణ' గ్రంథం– ఆగస్టు 2015)

❖

(44) పూర్ణ సాహితీ శశాంక

నిజానికి ముందు నా పరిచయం ఓలేటి వెంకటసుబ్బారావుగారితో. అంటే ఓలేటి పార్వతీశం వాళ్ళ నాన్నగారితో. సుబ్బారావు అంటే ఎవరికి తెలుస్తుంది? ఆయన 'శశాంక'గా సుప్రసిద్ధులు. కవిగా ఒక 'నయాజమానా'లో కీర్తిచంద్రికలు వెదజల్లినవారు. ఆయన వాత్సల్యాన్ని చూరగొన్న యువకవుల్లో నేను అగ్రగణ్యుడిననే చెప్పుకోవాలి. నా కంటే మూడేండ్ల తొమ్మిదినెలలే చిన్నవాడయినా పార్వతీశంతో అప్పట్లో నాకు పరిచయం లేదు. శశాంకగారు మా ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘానికి అధ్యక్షులు. నేను సహకార్యదర్శిని. ఆ రోజుల్లో జరిగే కవి సమ్మేళనాల్లో వారితో బాటు యువకవిగా పంచుకున్న వేదికలు ఎన్నో వున్నాయి. అయిదవ అఖిలభారత రచయితల మహాసభలు జరిగినప్పుడు వెలువడిన సాహిత్య సంచికలో 'కొంతమంది విద్యార్థి కవులు' అని శశాంకగారు వ్యాసం రాస్తూ, నా గురించే తొలుత పేర్కొని– 'సుధామ విద్యార్థిగా వుండి కవిత్వం రాస్తున్నాడు కాబట్టి విద్యార్థికవి అని కర్మధారయసమాసం చేసి చెప్పవలసివస్తోంది గానీ, కవిత్వ గుణాన్ని బట్టి చూస్తే నేడో రేపో మహాకవుల లిస్టులో చేరకపోడు' అంటూ అవ్యాజ ప్రశంసలందించారు.

చెప్పవచ్చేదేమంటే నాన్నగారు 'శశాంక'గారు వుండగా, పార్వతీశం గురించి నాకేమీ తెలియకపోవడం చిత్రంగానే తోస్తుంది. కృష్ణశాస్త్రిగారి అంతటి ఉన్నతిని కవిగా అందుకుంటున్న దశలో 'శశాంక' అకాల మరణం మమ్మల్ని అఘాతానికి గురిచేసింది. ఓలేటి పార్వతీశం శశాంకగారి పెద్దబ్బాయి అనీ, అటు పితామహులు ఓలేటి వంశ వైభవం. ఇటు మాతామహులు కందుకూరి రామభద్రరావుగారి పాండిత్య–వంశ వైభవం, రెంటినీ జమలికగా తన సొంతం చేసుకుంటూ ఎదిగాడనీ తర్వాత తర్వాతే తెలుస్తూ వచ్చింది. నాకు లాగానే పార్వతీశం ఆకాశవాణిలో ముందు ట్రాన్స్ మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. అలా నిజంగా తమ్ముడయ్యాడు. తర్వాత తాను

దూరదర్శన్‌లో చేరి తమ్మి పూరేకులా వికసించాడు. సాహిత్య సుగంధాలు వెదజల్లాడు. 'పుత్రాదిచ్ఛేత్ పరాజయం' అన్నట్లుగా, శశాంకగారి కుమారుడు తండ్రిని మించిన తనయుడిగా గణనకెక్కాడు. కవిగా, పండితుడిగా, వక్తగా, ప్రయోక్తగా, దూరదర్శన్ కార్యక్రమ నిర్వహణాధికారిగా ఓలేటి పార్వతీశం తెలుగు సాహితీ ప్రపంచంలో కీర్తి చంద్రికల నార్జించాడు. పూర్ణశశాంకుడయ్యాడు.

ఇటీవల మేము కలిసి పాల్గొన్న ఒక సభలో తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు పార్వతీశాన్ని 'ప్రసంగ శశాంకుడు' అని సంబోధించడం నాకు ఎంతో ముచ్చటేసింది. నిజంగా పార్వతీశం శశాంకను తలదాల్చాడు, అంటే తప్పులేదు. కీర్తిలో నేడు తండ్రి తలదన్నాడు. శశాంక గారి స్వరంలో కొంత స్త్రీత్వం వుండేది. పార్వతీశం గళంలో ఆ సౌకుమార్యం, లాలిత్యం గళగాంభీర్యంలో మిళితమయ్యాయి. ఏ విషయాన్నయినా మృదువుగా, తాపీగా, సరళంగా, సాధికారికంగా, సాహిత్యోద్దీపకంగా ప్రసంగించడంలో పార్వతీశం తనకు తానే సాటి. ప్రసంగంలో ఆవేశపడడం ఏనాడూ నేనెరుగను. దూరదర్శన్ తొలి ప్రసారాల రోజుల్లో శ్రోతల ఉత్తరాలకు జవాబులు చెప్పే కార్యక్రమం లేఖావళి ప్రసార మయ్యేది. ప్రేక్షకుల నుంచి అందుకున్న ఉత్తరాలను చదివే ఆ కార్యక్రమానికి ఒక విశేష ప్రాచుర్యం వచ్చిందంటే దానికి పార్వతీశం 'ప్రెజెంటేషనే' ప్రబల కారణం అనాలి. కడప ఆకాశవాణి వైభవ ప్రాభవాలకు ఊపిరులూదిన ప్రసార ప్రముఖుల్లో పార్వతీశం పేరు ఉటకించకుండా ఉండలేరెవ్వరూ.

దూరదర్శన్ కార్యక్రమ నిర్వహణాధికారిగా తాను నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలు అనేకం. ముఖ్యంగా– సంప్రదాయ సాహితీ సుగంధాలను వెదజల్లే అవధానాల వంటి కార్యక్రమాలకు, దృశ్యమాధ్యమం ద్వారా విస్తృతప్రాచుర్యం కల్పించారు. 'మా తెలుగు తల్లికి' అనే కవి సమ్మేళనం కృష్ణానదిలో నౌకా విహారంతో అనుసంధానం చేశాడు. అలాగే తిరుమల బ్రహ్మోత్సవాల ప్రసారాలు, పద్యాల తోరణం వంటి కార్యక్రమాలు నిర్వహించాడు. సాహిత్య, సంగీత దిగ్దంతుల నెందరినో దూరదర్శన్‌లో ఇంటర్వ్యూ చేశాడు.

తండ్రి శశాంక వలెనే పార్వతీశానికి పాటల రచనా పాటవం వంశతః అలవడిం దనాలి. పార్వతీశం రాసిన లలిత గీతాలు అనేకం ప్రముఖ గాయనీగాయకులు ఆలపించారు. పార్వతీశం 'అంకితం' అనే సినిమాకు సంభాషణలు రాశాడనీ, 'శ్రీ తాతావతారం' సినిమాకు పాటలు వ్రాశాడనీ కొందరికి తెలియకపోవచ్చు. ప్రసార

కళాప్రవీణ, మధుర వచోధురీణ, ఉపన్యాస సుధాకర, సాహిత్యరత్న, గేయ కళాప్రపూర్ణ, వక్తృత్వ విశారద వంటి బిరుదులెన్ని పొందినా– అవన్నీ చంద్రునికో నూలుపోగు చందానివే. తెలుగునాట అనేక సాహితీ, సాంస్కృతిక సంస్థలతో గట్టి అనుబంధం వుంది తనకు. పులికంటి కృష్ణారెడ్డిని సాహిత్యోపజీవిగా ఆయన మరణానంతరమూ సంస్థాగతంగా నిలబెడుతున్న ఘనతా మా పార్వతీశానిదే. నిజానికి పార్వతీశం సేవలను ప్రసార భారతి మరింత సద్వినియోగం చేసుకునే ఉన్నత స్థితులను ఏనాడో కల్పించ వలసింది. ముప్ఫైఅయిదేళ్ళ ఉద్యోగజీవితంలో ఎన్నో ఉన్నత సోపానాలు అధిరోహించవలసిన ప్రతిభామతి, కార్యక్రమ నిర్వాహణాధికారిగా పదవీ విరమణ చేస్తుండడం వృత్తి మాధ్యమంలోని లోపమే. తన ఉద్యోగ ధర్మాన్ని నిష్ఠగా, సంతృప్తిగా నిర్వర్తించి తన వల్ల సంస్థకూ, సంస్థ వల్ల తనకూ గౌరవ ప్రతిష్ఠలు తెచ్చి చూపిన కర్మచారి ఓలేటి పార్వతీశం.

పార్వతీశం నిబ్బరం గొప్పది. జీవితంలోని ఆటు పోట్లకు స్థితప్రజ్ఞుడిగా నిలచిన నిశ్శబ్దయోగి. తండ్రిని, తల్లిని, తమ్ముడిని, ధర్మపత్నిని కాలం నిర్దాక్షిణ్యంగా తన నుండి దూరం చేసినా, ధీరచిత్తంతో తనకుటుంబాన్నీ, తన తమ్ముడి కుటుంబాన్ని కూడా నిలబెట్టి పిల్లలను ప్రయోజకులను చేసిన మహోదాత్తుడు. స్నేహశీలమైన తన వ్యక్తిత్వం ఎందరికో ఆకర్షణ. అర్ధాంగి కృష్ణకుమారి స్మృతిలో ఆమెకు ఇష్టమైన సంగీత రంగంలో స్మారక పురస్కారాన్నీ, ఏటా స్మృతి సమీర సభనూ నిర్వహిస్తున్నాడు.

పార్వతీశంకు అరవై ఏళ్ళు నిండి ఉద్యోగ విరమణ చేస్తున్నాడంటే కాలం 'వడి' ఆశ్చర్యపరుస్తోంది. తన శ్రమశక్తులను ఉద్యోగ బాధ్యతల్లో ఇంతకాలం వినిమయ పరచిన తమ్ముడు, ఉద్యోగ విరమణ తరువాత సాహిత్య సాంస్కృతిక రంగాలకు మరింత వెచ్చిస్తూ– తన రచనా వ్యాసంగాన్ని సుసంపన్నం చేస్తాడనీ, శశాంక జ్యోత్స్నలు మరింతగా విస్తరింపజేస్తాడనీ ఆశిస్తున్నాను. కిన్నెర సంస్థ మద్దాళి రఘురామ్, షష్ట్యబ్ది పూర్తి సందర్భంగా ఓలేటి పార్వతీశంకు ఘనసత్కారం తలపెట్టి, విశేష సంచికను వెలువరిస్తున్నందుకు ఎంతగానో ఆనందిస్తున్నాను. తమ్ముడు పార్వతీశానికి ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి ఆకాంక్షిస్తున్నాను. శుభాభినందనలు.

(ఓలేటి పార్వతీశం షష్ట్యబ్ది ఉత్సవ సంచిక, 2015)

❖

(45) స్వరసాహితికి నోబెల్ పట్టం

ప్రజాగాయకుడిని గుర్తిస్తూ, పాటకు పట్టం కట్టడం ఈ ఏటి నోబెల్ సాహిత్య పురస్కార విశేషం! అమెరికాలో వర్ణవివక్ష 1960 ల వరకూ చాలా దారుణంగా వుండేది. ముఖ్యంగా దక్షిణ అమెరికాలో మరీను. అటువంటి సమయంలో పౌరహక్కుల కోసం ఎలుగెత్తిన స్వరం డిలన్‌ది. అతను సృజించింది ప్రజాస్వామిక సాహిత్యం. అది కూడా ఒక ప్రజా వాగ్గేయకార సంవిధానం. మన వంగపండు, గద్దర్ వంటివారు ఎలానో అలా అని చెప్పుకోవచ్చు. సంగీతకారులు తమకు తామే పాటలు రాసుకుని పాడే సంప్రదాయం అమెరికాలోనూ కొత్త కాకపోయినప్పటికీ, బాబ్‌డీలన్ రాకతో అక్కడి సమాజంలో అది ఊపందుకుంది. వర్ణవివక్షకు వ్యతిరేకంగానూ, పౌరహక్కుల సంరక్షణకోసమూ మాత్రమే కాక యుద్ధ వ్యతిరేకతనూ, మారవలసిన ప్రభుత్వ విధానాలనూ అమెరికన్ బడుగు బలహీన వర్గాలకు దన్నుగా, పాటలు రాసి పాడిన ప్రభంజనం బాబ్‌డీలన్.

1941 మే 24 న అమెరికా మిన్నసోవా డులుత్‌లో జన్మించిన బాబ్‌డీలన్ జన్మనామం రాబర్ట్ అలెన్ జిమ్మర్‌మన్. నివాసం కాలిఫోర్నియాలోని మలిబు. క్రిస్టియానిటీలో జుడాయిజం పట్ల విశ్వాసి. గాత్రంలో, గిటార్, హార్మోనికా, కీబోర్డ్స్ వాద్యాలలో మంచి పేరొందినవాడు.

1960 ల నుంచి సంగీతరంగాన యాక్టివ్‌గా నిలచిన డిలన్ వెలువరించిన మ్యూజిక్ ఆల్బమ్స్‌కు అమెరికాలో విపరీతమైన ఆదరణ వుంది. వంద మిలియన్లకు పైగా అతని రికార్డులు అమ్ముడుపోయాయి. సంగీతరంగాన ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకునే గ్రామీ అవార్డులను పదకొండుసార్లు తీసుకున్న ఘనత తనకే దక్కింది. అలాగే 'గోల్డెన్ గ్లోబ్ అవార్డు' అతనిని వరించింది. 2008 లో పులిట్జర్ ప్రైజ్ జ్యూరీ వారు అమెరికా సంగీత, సంస్కృతుల మీద తనదైన ప్రభావం వేసిన విశిష్ట వ్యక్తిగా బాబ్‌డిలన్‌ను

ప్రత్యేకంగా గుర్తించి సత్కరించారు. 2012 లో అమెరికా అధ్యక్షుడు ఒబామా నుంచి 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం'ను అందుకున్నారు బాబ్‌డిలన్.

గాయకునిగా, వాద్యకారునిగా పేరొందినా స్వయంగా తను పాటలు కట్టి పాడిన కవి బాబ్‌డిలన్. అంతేకాదు. తానొక చిత్రకారుడు కూడాను. 1994 నుంచి డ్రాయింగ్ మరియు పెయింటింగ్స్‌కు సంబంధించిన ఆరు పుస్తకాలు డిలన్ ప్రచురించారు. ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలలో అతని చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. 1960 ల నాటి తొలిరోజుల్లోనే అతను రాసి పాడిన పాటలు 'బ్లోయిన్ ఇన్ ద విండ్', 'ది టైమ్స్ దె ఆర్ ఎ ఛేంజిన్' అమెరికన్ పౌరహక్కుల సమాజాన్ని ఉర్రూతలూపాయి. యుద్ధవ్యతిరేక గీతాలతో ప్రజాస్వామ్య శాంతికాముకునిగా నిలిచాడు.

అర్ధశతాబ్దం అమెరికన్ సమాజాన్ని ఫోక్, బ్లూస్, రాక్, కంట్రీ, గాస్పెల్ సంగీతంతో తన పాటలతో ఆకట్టుకుని ఆ పాటల సాహిత్యంలో ఒక గాఢతను, సాంద్రతనూ, ఒక సువ్యవస్థ గూర్చిన ఆరాటాన్నీ, యుద్ధోన్మాద ప్రభుత్వం పట్ల వ్యతిరేకతనూ బలీయంగా అభివ్యక్తీకరించాడు బాబ్‌డిలన్.

మార్టిన్ లూథర్‌కింగ్ ఆగస్టు 1963 లో వాషింగ్టన్ డి.సి.లో నల్లజాతి హక్కులకై నిర్వహించిన మహాప్రదర్శన ఒక చారిత్రాత్మక ఘట్టం. 'ఐ హావ్ ఎ డ్రీమ్' అని మార్టిన్ లూథర్‌కింగ్ తన ప్రసంగంతో చైతన్యపరచిన ఆ వేదిక మీద నుంచే– బాబ్‌డిలన్ జానపదగాయని జోన్ బయాజ్‌తో కలిసి నాటి పౌరహక్కుల ఉద్యమనేత మెద్గర్ ఎవర్స్ హత్యను వ్యతిరేకిస్తూ, దాని వెనుకగల తెల్లవారి కుట్రను బహిర్గతం చేస్తూ కవితాత్మకంగా పాడి తొలిసారి ఒక ప్రభంజనంగా అందరిదృష్టినీ ఆకర్షించారు. పౌరహక్కుల ఉద్యమంలో సీటోసీగర్, జోన్ బయాజ్ వంటి ఉద్దండ సంగీతజ్ఞుల సరసన చేరి, అదేవిధంగా నాటి బీట్ కవులు, అలెన్ గింస్‌బర్గ్, డేనియల్ క్రేమర్, పీటర్ ఆర్లాస్కీ వంటి సాహిత్యకారులకు సన్నిహితంగా మసలి, మునుపెరుగని పాటల చైతన్యాన్ని విస్తరింపజేశాడు బాబ్‌డిలన్.

నిజానికి పాటలతో ప్రజాచైతన్యం ఎక్కువగా ముడిపడి వుంటుంది. జనమమేకంగా తాము రాసి పాడే పాటలతో ఆ గాయక కవులు రాణిస్తారు. అయితే ముందునుంచీ మౌఖిక సాహిత్యానికి– గ్రంథస్థమైన సాహిత్యానికి ఇచ్చే విలువనివ్వక పోవడం పరిపాటిగా వుంటున్నదే. బాబ్‌డిలన్ తాను రాసిన పాటలను పుస్తకాలుగా ఎక్కువగా అచ్చొత్తించలేదు. అదీకాక తన పాత పాటే అయినా సరికొత్త ప్రదర్శనలో పాడుతున్నప్పుడు ఆ సాహిత్యంలో కొత్త విరుపులు, కొత్త సంగతులతో ఆ పాటను

నవనవోన్మేషితం చేయడం అతని అలవాటు. అమెరికన్ జానపద పునరుజ్జీవన ఉద్యమంలో ప్రజాపోరాటాల పక్షాన గళమెత్తిన వాడిగా తన పాటల్లోని సాహిత్యం ఎంతో విలువైనది, గాఢమైనది, ప్రభావోపేతమైనదనడంలో సందేహం లేదు.

'హార్డ్‌రైన్ ఇజ్‌గానా ఫాల్' అనే బాబ్‌డిలన్ సుదీర్ఘగానంలో ఒక కవి గాయకుడుగా, ప్రపంచమే యుద్ధరంగంగా మారిపోతున్న భీకర పరిణామాల గురించీ, మనుషుల దుఃఖతీవ్రత గురించీ, తాను వెల్లడించిన భావాలు సంగీత సాహిత్య సమలంకృతాలు. ఆ పాటలోని చివరి పంక్తులు టాగూర్ గీతాంజలిలోని 'ఎక్కడ మనుషులు తలలెత్తుకుని నడుస్తారో' ఆ స్వేచ్ఛాస్వర్గాన్ని ఆశించిన రీతిలోనే వ్యష్టిని సమష్టిగా రూపుకట్టించే అద్భుత అభివ్యక్తి చేశాడు.

'ఎక్కడ జనం ఎందరెందరో వున్నారో
వారి చేతులు రిక్తమై వున్నాయో
ఎక్కడ విషపు మాత్రలు
జలాలను సైతం ముంచెత్తుతున్నాయో
ఎక్కడ లోయల్లోని ఇల్లు
తడిసిపోయిన జైలుతో రూపుకడుతుందో
తలారి వాడి ముఖం ఎక్కడ ఎప్పుడు అదృశ్య మవుతుందో
ఎక్కడ ఆకలి అసహ్యమవుతుందో
ఎక్కడ ఆత్మలు మరపులో వుంటాయో
ఎక్కడ నలుపు ఒక్కటే అసలు రంగవుతుందో
శూన్యమే ఒక సంఖ్యగా నిలుస్తుందో
అక్కడ
భీకర వర్షం కురువకముందే బయటకెళ్లి పోతాను
లోతైన నల్లని అరణ్య గర్భాల్లోంచి అనుగమించి పోతాను
నేను చెబుతాను
నేను ఆలోచిస్తాను
నేను మాట్లాడుతాను
నేను ఊపిరి పీలుస్తాను
పర్వతాలపై నుంచి ప్రతిధ్వనిస్తాను
అందరూ చూస్తుండగానే

మునిగిపోయేదాకా సముద్రంపై నిల్చుంటాను
నేను పాడే ముందు
నా పాటను లోతుగా అవగతం చేసుకుంటాను

ఇది జడివాన
ఇది అలజడివాన
కురువబోతోందిక
భీకరమైన వర్షం'

"ఏం చూశావు నువ్వు నా నీలికనుల బాబూ! నువ్వేం చూశావ్ నా గారాబుపట్టీ"– అంటూ ప్రశ్నతో మొదలై, దానికి ఒక సమాధానపరంపరగా సాగే ఈ గీతం బాబ్‌డిలన్ పాటల సాహిత్యంలో ఒక ప్రతిభావంతమైనదిగా అలెన్ గిన్స్‌బర్గ్ వంటి ప్రముఖ అమెరికన్ సాహితీవేత్తలు ప్రశంసించారు.

బాబ్‌డిలన్ ఒక రాజకీయ చట్రానికి లోబడినవాడు కాదు. ప్రతిఘటనా సంగీతాన్ని ఎంతగా పలికాడో, అంతగా మానవీయ విలువలనూ చాటాడు. ప్రేమ గురించీ, ఒంటరితనం గురించీ, స్త్రీ పురుష సంబంధాల గురించీ పాటలల్లి పాడాడు. జానపద వేదిక మీద– బాబ్‌డిలన్ ఎలక్ట్రిక్ గిటార్ ఉపయోగించి పాడడం, జానపద సంగీతకారులు కొందరి ఆగ్రహానికి కారణమైనా పట్టించుకోలేదు. 'ఐ ఇన్ అనదర్' 'నేను మరొకడిని' అన్న ఆర్థర్ రింబా మాట డిలన్‌కు చాలా ఇష్టం. జానపద సంగీత వాద్యం అకూస్టిక్ గిటార్‌ను వదిలేసి, రాక్ సంగీతానికి చెందిన ఎలక్ట్రిక్ గిటార్‌తో ప్రదర్శనలిచ్చి సంచలనం సృష్టించాడు. సామాజిక సమస్యలపైన అనేక పాటలల్లాడు. తన పాటల్లో ఒక కథాకథన పద్ధతి ప్రదర్శించిన విలక్షణ గాయకుడు తను. తాను ఇచ్చే ప్రతి ప్రదర్శననూ ఒక కొత్తదనంతో, జవజీవాలతో, నిత్యనూతనంగా నింపుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగించడం అతని ప్రత్యేకత. ఒక ఆశావహ దృక్పథాన్ని విస్తరింప చేయడం అతని లక్షణం.

'ఈ నీలాకాకాశపు ఆలింగనంలో
ఇంకా సచేతనమై జీవించడం గొప్పగా ఉంది
ఈ వేకువ కిరణాల వేళ, తొలి కాంతులతో
ఈ నవోదయాన్ని

నీతో కలిసి పంచుకోవడం మహదానందంగా ఉంది
ఈ నవోదయాన...'

అంటూ పరస్పర మైత్రీజీవన మాధుర్యాన్ని వెలారుస్తాడు బాబ్‌డిలన్. సంగీతమే తన మతమూ, ఆధ్యాత్మికతా అంటాడు తను. 'లెట్ మి రెస్ట్ ఇన్ ది పీస్‌ఫుల్ మౌంటెన్', 'ఐ సా ది లైట్' వంటి పాటల్లో ఆ అనుభవ గాఢత తెలుస్తుంది. మతప్రవర్తకులు, ప్రవచనకర్తలు, బోధకులకన్నా పాటలే తమకు జీవితపు విలువలను నేర్పించాయంటాడు. 'పాటే నా ప్రాణం, పాటే నా ఆత్మ' అంటాడు బాబ్‌డిలన్.

బాబ్‌డిలన్‌కు స్వీడిష్ అకాడమీ 2016 సంవత్సరానికి నోబెల్ సాహిత్య పురస్కారం ప్రకటించడం పాటకుదక్కిన గొప్ప సాహిత్య గౌరవమే! ప్రజావాగ్గేయ కారుని గుర్తించి నోబెల్ తన విలక్షణ ఉత్కృష్టతను స్థాపించుకుంది. ఈ ముదావహ పరిణామాన్ని స్వాగతిద్దాం. అక్షరంతో సమానంగా ఈ స్వర సాహిత్య విజయాన్ని అభినందిద్దాం.

(ఆంధ్రభూమి వారపత్రిక, 17 నవంబర్ 2016)

❖

(46) 'జీవనశైలి'కి కాలరేఖల కాలమ్

కథలూ, నవలలూ, వ్యాసాలూ రాయడం వేరు, వారంవారం ఓ కాలమ్ రాయడం వేరు. కాలమిస్టు విషయపరిజ్ఞానం, ప్రాపంచిక జ్ఞానం, సమకాలీనత, ప్రతివిషయంపైనా అవగాహన, పటుత్వం కలిగి– ముఖ్యంగా ఖచ్చితమైన అభిప్రాయం, కుండబద్దలు కొట్టే సాహసం కలిగి వుండాలి. జర్నలిస్టుకు పరిశోధన ఎక్కువ అవసరమేమో గానీ, కాలమిస్టుకు అనుకున్న అభిప్రాయాన్ని తనదైన శైలిలో పాఠకులకు ప్రభావోపేతంగా అందించగలిగే ప్రజ్ఞ ముఖ్యం. పఠనీయత కలిగి వారంవారం ఈ వారం ఏ అంశాన్ని గురించి కాలమిస్టు చెప్పబోతున్నాడన్న ఉత్కంఠ పాఠకులకు కలిగించగలిగినప్పుడు, ఆ 'కాలమ్' చాలాకాలం కొనసాగే అవకాశం వుంటుంది.

సాధారణంగా దినపత్రికలలో ఎడిట్ పేజీలో మిడిల్ కాలమ్స్‌గానో, ఆదివారం అనుబంధాలలో కాలమ్స్‌గానో ఇలాంటి రచనలు చేయమని పత్రికాధిపతులు కొందరు సాహితీవేత్తలనూ, ఆయా రంగాల ప్రముఖులనూ కోరుతుంటారు. అలా కాలమ్స్‌గా రాసి కాలమిస్టుగా రాణకెక్కిన వారెందరో ఉన్నారు. పానుగంటి వారి 'సాక్షి' (వ్యాసాలు) ఆంధ్రపత్రిక తొలిరోజుల 'కాలమ్' వంటిదే. ముట్నూరి కృష్ణారావు, దాసు వామనరావు, సురవరం ప్రతాపరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, గో.రా.శాస్త్రి, రావూరు వేంకట సత్యనారాయణరావు, విద్వాన్ విశ్వం, గజ్జెల మల్లారెడ్డి, ఎం.వి.ఆర్.శాస్త్రి, డి.వి.నరసరాజు, గొల్లపూడి మారుతీరావు, పురాణం సీత, గోపాల చక్రవర్తి, తంబు, భరాగో, చలసాని ప్రసాద్, కాకాని చక్రపాణి, అమ్మంగి వేణుగోపాల్, బుద్ధా మురళి, జయధీర్ తిరుమలరావు, మృణాళిని, శారదా అశోకవర్ధన్, పొత్తూరి విజయలక్ష్మి, ఎన్.ఆర్. నంది, కె.బి.గోపాలం ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగు పత్రికల కాలమిస్టుల సంఖ్య తక్కువదేమీ కాదు. ఒకరిపేరు చెప్పి ఒకరిపేరు మర్చిపోయే ప్రమాదాలూ, తమ పేరు పేర్కొనలేదని కొందరు నొచ్చుకోగల ప్రమాదాలూ కూడా వుంటాయి. తెలుగులో కాలమిస్టుల గురించి నిజానికి ఒక సమగ్ర పరిశోధన చేయగల అవకాశమే వుంది.

భవదీయుడు మీ సుధామ కూడా ఆంధ్రభూమి దినపత్రికలో– ఎడిట్ పేజ్ మిడిల్ కాలమ్‌గా కొద్దిపాటి విరామాలతో, దాదాపు పదిహేను సంవత్సరాలు నిరంతరాయంగా సం.సా.రాలు (సంస్కృతి– సాహిత్యం–రాజకీయాలు) అనే 'కాలమ్' నిర్వహించిన వాడే. అంతే కాదు! కాలమ్ ప్రారంభించిన నాటి రోజుల్లోని ఓ యాభై వ్యాసాలతో ప్రచురించిన 'సం.సా.రాలు' కాలమ్ పుస్తకానికే 2004 లో తెలుగు విశ్వవిద్యాలయం 'ఇతరాలు' విభాగంలో ఉత్తమ సాహితీగ్రంథంగా పురస్కారం లభించింది. ఇది గొప్పకు చెప్పడం కాదు. ఓ 'కాలమ్'కు కూడా అంతటి సాహితీగౌరవం దక్కే వీలుందని చెప్పడానికి మాత్రమే!

కాలమిస్టుగా కథా, నవలా రచయితలందరూ రాణించగలరనుకోవడం సరికాదు. ఎందుకంటే 'కాలమ్'లో చెప్పబడే అంశాలు కేవలం కల్పనా చమత్కారాలు, సంఘటనాత్మకాలు అయి వుండవు. వర్తమాన సామాజిక అంశాలు, సమస్యలు, ఆయా కాలాల్లో జరిగే సద్యో విషయాలు అన్నీ పరిగణలోనికి కాలమిస్టు తీసుకుంటాడు. ఒక సంపాదకీయ వైఖరి కాదు గానీ, తనదైన ఖచ్చితమైన ఒక అభిప్రాయాన్ని అభివ్యక్తీకరించడానికీ, లోకవృత్తంలోని దేనినయినా తన కాలమ్ పరిధిలోనికి తీసుకు వ్యాఖ్యానించడానికీ అతనికి అవకాశం వుంటుంది. ఆ 'కాలమ్'ను నిర్వహించడంలో ఆ 'కాలమిస్టు'కు తనదైన ముద్ర వుంటుంది. 'కాలమ్' నిర్వహించడం అంటే– అందునా క్రమం తప్పకుండా, పరిమిత పరిధిలో, అనుకున్న అంశం రాసి పాఠకులను మెప్పించడం అంటే– అది ఒక విధంగా కత్తిమీద సాములాంటిదే!

'అంపశయ్య' అనే నవల రాసి, తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసి, ఆ నవలపేరే తన ఇంటిపేరుగా మారిన నవీన్– ప్రతిభామతి అయిన కథా, నవలా రచయిత మాత్రమే కాదు, సమాజంపై తన రచనలతో ప్రభావం వేసిన అభ్యుదయశీలి. రచనకు ఒక ప్రయోజనాన్నీ, పాఠక జనాదరణనీ సమానంగా సాధించిన విశిష్ట రచయిత. వృత్తిరీత్యా ఆయన కళాశాల ఉపన్యాసకుడే అయినా తన కలం బలంతో పత్రికలకు పుష్టినీ, పాఠకులకు తుష్టినీ కలిగించి కమర్షియల్ రైటర్ల పాపులారిటీని సొంతం చేసుకున్న వాడు. ముఖ్యంగా యువతను తన రచనలతో ఆకట్టుకున్న రచయితలలో అంపశయ్య నవీన్ స్థానమూ పదిలమైనది.

కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు స్థాయికి ఎదిగిన అతి కొద్దిమంది తెలుగు రచయితలలో ఆయనొకరు. నవీన్ కలం– ప్రయోజనాన్నీ, పాపులారిటీనీ మిళితం చేసుకున్న విశిష్టతను సాధించింది. 1982 లోనే ఆంధ్రజ్యోతి వారపత్రికలో నాటి

సంపాదకులు పురాణంగారి సూచన మేరకు 'చాయ్- పానీ' అనే కాలమ్ నిర్వహించారు అంపశయ్య నవీన్. ఆరునెలలే సాగినా నవీన్ కాలమిస్టు 'ఆరిందా'తనం అందులో ద్యోతకమైంది. ఆ తరువాత 'ఆహ్వానం' మాసపత్రికలో 'ఇదీ జీవితం' పేరుతోనూ కాలమ్ నిర్వహించిన నవీన్- ఆ తరువాత 2001 లో మొదలు పెట్టి దాదాపు నాలుగైదు సంవత్సరాలు ప్రజాశక్తి దినపత్రిక ఆదివారం అనుబంధంలో వెలువరించిన కాలమ్ 'జీవనశైలి'. జీవనశైలి పాఠకులను ఆకట్టుకుని జనరంజకంగా సాగింది.

పాత్రల సంభాషణా సరళిలో సాగిన ఈ 'కాలమ్'లో కాలమిస్టు నవీన్‌దే ప్రధానపాత్ర. ఇద్దరువ్యక్తులు మాట్లాడకునే ధోరణిలో- దైనందిన జీవితంలో సామాన్యులు, ముఖ్యంగా మధ్యతరగతివారు ఎదుర్కొనే సమస్యలను నవీన్ ఈ 'కాలమ్'లో చర్చించారు. సహజంగా కథకుడు కావడం వల్ల ఈ జీవనశైలిలో పాత్రలు, సంభాషణలు ఎంతో సహజంగానూ, సరళంగానూ, పఠనీయంగానూ ఒదిగాయి. పక్కింటి పుల్లారావులు అత్యంత పరిచితితో వీటిల్లో తారసపడతారు. వారి నైజాలు, వైఖరులూ దృశ్యమానం చేస్తూ, అనేక అంశాల పట్ల తమ భావాలను నిర్ద్వంద్వంగా నవీన్ వీటిల్లో ప్రకటించారు. ఒక కాలమిస్టుకు ఉండవలసిన ఆ నిక్కచ్చితనం, సూటివైఖరీ వీటిల్లో కనబడుతుంది. 7 జులై 2002 న రాసిన 'రచయితల్లారా! మీరేమిట్లు?' అనే వ్యాసంలో-

"మీరేమన్న చెప్పండిసార్! నాకు ఈ ఆంధ్రావాళ్ళంటే చాలా అసహ్యం. వాళ్ళు అనుక్షణం మనవాళ్ళను చిన్నచూపు చూస్తూనే వుంటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరిస్తే తప్ప మనం తలెత్తుకుని బతకలేమనిపిస్తుంది" అని విక్రమ్‌కుమార్ అనే పాత్ర అంటే-

"ప్రత్యేక రాష్ట్రమనేది రాజకీయాలతో ముడిపడిన సమస్య. దానికి సాహిత్యంతో సంబంధం ఏమిటి? సాహిత్యం విశ్వమానవులందర్నీ కలిపే గొప్ప సాధనం" అన్న నేను- అంటూ రచయిత పాత్రను చూపారు. ఆ కాలమ్ వ్యాసం ముగింపులో ఇలా అంటారు-

"ఒకప్పుడు సాహిత్యంలో భావ కవిత్వమనీ, అభ్యుదయ సాహిత్యమనీ, విప్లవ సాహిత్యమనీ ఉంటుండేవి. వాటి వెనుక ఒక తాత్విక భూమిక ఉండేది. కానీ ఇవాళ్టి రచయితలు ప్రాంతం పేరుతో, కులం పేరుతో విడిపోతున్నారు. ఇవాళ ఓ రచయిత సృష్టించిన సాహిత్యాన్ని ఆ రచయిత ఏ ప్రాంతంవాడు, ఏ కులంవాడు అన్న

ప్రాతిపదికపై బేరీజు వేస్తున్నారు. ఎంత బాధాకరమైన పరిణామం". కొనసాగితే అది మరింత బాధాకరం అనిపించక మానదు మరి!

నవీన్ 'జీవన శైలి' లో చేసిన సునిశిత వ్యాఖ్యలు సమాజాన్ని ఆలోచింపచేసి ప్రగతిశీల పథంలో నడిపించేవిగా వున్నాయి. అత్యల్పమనుకునే అంశాలనుండి అనల్ప సందేశాలను సంధానం చేసి, మానవీయ విలువలకు పట్టంకట్టడం 'జీవనశైలి' కాలమ్ ప్రత్యేకత. 'పుస్తకాన్ని కొని చదువుతారా?', 'నవలల్ని చదివేదెవరు?', 'నవలగా చరిత్ర', 'బాలల సాహిత్యం', 'మంచి నవల బతుకుతుంది' వంటి సాహిత్య అంశాల గురించీ, నాటకరంగం, టీవీ, సినిమాల గురించీ, విద్యా వైద్య పరమైన అంశాల గురించీ, స్త్రీలు, పిల్లల గురించీ, భాష గురించీ, క్రికెట్ గురించీ, సెల్‌ఫోన్స్ గురించీ ఇలా వైవిధ్యభరితమైన అంశాలను వీటిల్లో చర్చించారు. ఆదివారం అనుబంధంలోని 'కాలమ్' కావడం వలన కాబోలు ఎక్కువగా రాజకీయాల జోలికిపోలేదు. అలాగని వాటి ప్రస్తావన, వాటి నేపథ్యం లేకుండా పోలేదు. 'సంస్కృతి నాశనం అయ్యేది కాదు', 'భవిష్యత్తు పట్ల బలహీనత', 'అపోహలూ– అభూత కల్పనలూ' వంటి రచనలు మౌఢ్యాలను వదిలించేవిగా వున్నాయి.

'జీవనశైలి' లో రచయిత స్వీయముద్ర, వైయక్తిక విషయ వివరణ ద్యోతకమౌతూ, పాఠకులకు ఆయనతో, ఆయన సాహిత్యాంశాలతో ఒక పరిచితిని పెంచుతూ పోవడం ఒక విశేషం! అలా నవీన్ 'కాలరేఖలు' గురించీ, వారి 'వ్యాసాల' రచనా వైఖరుల గురించీ కూడా తెలుసుకోగలుగుతాం. 'నవలగా చరిత్ర' అన్న వ్యాసం పూర్తిగా అలాంటి స్వీయ రచనా ప్రకటనయే! 'రెండూ కావాలండీ...' అనే రచన (30.11.2003) టీవీ యాంకరింగ్ ధోరణిపై ఒక పేరడీలా వుంది. 'జీవనశైలి' లోని కొన్ని రచనలు కాలమిస్టు వ్యాసాల్లా కాక, ఓ కథ చదువుతున్నట్టో, ఓ ప్రసంగం వింటున్నట్టో, ఒక సంభాషణను ఆలకిస్తున్నట్టో సాగిపోవడం కూడా జనరంజకాభిలాష వల్ల పొడచూపిన వైవిధ్యమే!

నవీన్ ఈ కాలమ్‌కు 'జీవనశైలి' అని సహేతుకమైన నామకరణం చేశారు. మన బతుకు తీరుతెన్నులనే వీటిల్లో చిత్రించారు. కేవలం సమస్యలను చిత్రించి వదిలేయడం కాదు. రచయితగా తనదైన అనుభవ సంపత్తితో ఆలోచనాత్మకంగా ప్రస్తావించిన ప్రతిఅంశం గురించీ వివరించారు. మంచిముత్యాలలాంటి ఆ మాటల్లోంచి మచ్చుకు కొన్ని–

"చదువు పిల్లల్లోని సహజమైన ప్రతిభను వెలికి తీయాలి. చదువువల్ల ప్రతి వ్యక్తి తానేమిటో తాను తెలుసుకోవాలి. సమాజం పట్ల తన బాధ్యతలేమిటో తెలుసు కోవాలి. చదువు ప్రతివ్యక్తినీ ఒక పరిపూర్ణ మానవుడిగా తయారుచెయ్యాలి. నేర్చుకోవడమనే దానికి అంతం అనేది వుండకూడదు. జీవితమంతా నేర్చుకుంటూనే వుండాలి. చదువు యొక్క ఈ లక్ష్యాలను మనం మరిచిపోయాం".

☆ ☆ ☆

"ప్రతీ అతి చిన్న పొరపాటుకు కూడా పోలీసులు సామాన్య పౌరుల్ని వేధిస్తూనే ఉంటారు. వాళ్ళ చేతులు తడిపితే అన్నీ సర్దుకుంటాయి... ఈ దేశంలో పోలీసు వ్యవస్థను సంస్కరించడానికి, వాళ్ళల్లో మానవీయ విలువల్ని పెంపొందించడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయని చెప్తారు. కానీ వాళ్ళల్లో ఎలాంటి మార్పులూ కనిపించడం లేదు– హ్యూమన్ ఫేస్ వున్న పోలీసు వ్యవస్థను ఈ దేశంలో ఎప్పుడైనా మనం చూడగల్గుతామా అన్నది సందేహమే".

☆ ☆ ☆

"రచయితల్నీ, కళాకారుల్నీ సమాజం వాళ్ళు బతికున్నప్పుడు గౌరవించడం నేర్చుకోవాలి. పూర్వం మనపెద్దలు 'నా నృషిః కురుతే కావ్యం' అన్నారు. ఋషి కానివాడు కావ్యం రాయలేడు అని. ఆ మాటలో చాలా నిజముంది. కళ అనేది ఓ తపస్సులాంటిది. ఎంతో సాధనతోతప్ప ఓ కళాకారుడు కళాసృజన చెయ్యలేడు. అదో కావ్యం కావచ్చు. లేదా ఓ పెయింటింగ్ కావచ్చు. వాటి సృజన జరుగుతున్నప్పుడు కళాకారుడో గొప్ప తపస్విగా మారిపోతాడు. నిజమైన కళాకారుడెవ్వరూ ధనం సంపాదించాలని కోరుకోడు. కానీ కళాకారుడిక్కూడా కడుపుంటుంది కదా!"

☆ ☆ ☆

"ఒక్క యుద్ధాల వల్లనే ప్రజలు చనిపోతారనుకోకూడదు... స్వార్థం, పగ, ద్వేషం, అసహనం లాంటి విధ్వంసక శక్తులు మనిషిలో వున్నంత కాలం మనిషిని మనిషి చంపుకుంటూనే ఉంటాడు".

☆ ☆ ☆

"వాస్తవ జీవితంలో ప్రేమ లభించకపోవడమే ప్రేమ కథల్ని ప్రజలు ఇంతగా ఆదరించడానికి కారణం".

☆ ☆ ☆

"మన పత్రికలవాళ్ళు రాజకీయ సమావేశాలకిచ్చినంత ప్రాధాన్యం సాహిత్య సమావేశాల కివ్వరు. మరో విషయం ఏమిటంటే ఇప్పుడన్నీ జిల్లా ఎడిషన్స్ వచ్చాయి కదా... సాహిత్య సమావేశాల వార్తల్ని జిల్లాపేజీల్లో మాత్రమే వేస్తున్నారు. ఇది చాలా అన్యాయంగా కనిపిస్తుంది నాకు. ఎందుకంటే సాహిత్యమనేది విశ్వవ్యాప్తమైనటు వంటిది. తెలుగుసాహిత్యానికి సంబంధించిన వార్తలు కనీసం రాష్ట్రంలో వున్న తెలుగువాళ్ళందరికీ తెలియాలి".

☆ ☆ ☆

"మనలోవున్న ఒక చెడ్డ అలవాటేమిటంటే మంచి జరిగినప్పుడేమో దానిక్కారణం నేనే అనుకోవడం. చెడు జరిగితేనేమో అందుక్కారణం మరెవరో అనుకుని ఆ మరెవరినో నిందించటం".

☆ ☆ ☆

"టీవీ సీరియల్స్ త్వరలోనే చాలా రొటీన్‌గా మారి, వాటిమీద ప్రేక్షకులకు మొహం మొత్తుతుంది. మంచి నవలకు తప్పకుండా మళ్ళీ మంచిరోజు లొస్తాయని నాకు నమ్మకం వుంది".

☆ ☆ ☆

–ఇలా ఉదాహరించుకుంటూ పోతే అనేకం! ఏమయినా అంపశయ్య నవీన్ 'జీవనశైలి' కాలమ్ ఈ తరం తమ 'జీవనశైలి'ని ఉపయుక్తంగా మలుచుకునేందుకు దోహదపడే వ్యక్తిత్వ వికాసకాలమ్ అయిన గ్రంథం. ఇంటింటా గ్రంథాలయంలో ఉంచుకుని పరామర్శించుకోవాల్సిన కాలానికి నిలిచే కాలమ్.

(పాలపిట్ట మాసపత్రిక, నవంబర్–డిసెంబర్ 2016)

❖

(47) ఆరిపోయిన అక్షరదీపం

కవులు ఎందరో ఉండవచ్చు. కానీ సామాన్యుల నుంచి సాహిత్యాభిమానుల వరకు అసంఖ్యాకుల్ని తన కలం సేద్యంతో అలరించి, అభిమానధనాన్ని అంతు లేనంతగా కైవసంచేసుకున్న కవివరేణ్యుడు సి.నారాయణరెడ్డి. తన అమేయ అక్షరశక్తితో తెలుగుభాషకే కమ్మదనాన్నీ, నిండుదనాన్నీ సంతరింపజేసిన సాహితీ ధురంధరుడు సినారె. అలతిఅలతి కావ్యాలల్లినా, మధురాతి మధురమైన సినీగీతాలందించినా, తెలుగులోనే తొలిసారిగా గజళ్లను వెలయించి... గానం చేసినా, అనన్యసామాన్య భావగర్భిత కవితలల్లినా అది సినారెకే చెల్లింది. రూపులోను, వస్త్రధారణలోను అసలు సిసలు తెలుగువాడిగా ఆదర్శప్రాయంగా నిలిచి, భాగ్యనగరంలోను, ఇతరత్రా కూడా సాహితీ సభలకు ఓ ప్రత్యేక శోభను చేకూర్చిన సంస్కారాధునికుడు సినారె. 'విశ్వంభర' కావ్యంతో జ్ఞానపీఠ్‌ను సొంతం చేసుకొని, తెలుగు వారి కీర్తి పతాకాన్ని దశదిశలా రెపరెపలాడించిన సినారె మరలిరాని లోకాలకు తరలి వెళ్లిన సందర్భంగా ఆయనకు నివాళిగా ఈ అక్షరాంజలి.

"రాస్తూ రాస్తూ పోతాను సిరా ఇంకేవరకు
పోతూ పోతూ రాస్తాను వపువు వాడే వరకు"

అంటూ కవిత్వమే శ్వాసగా జీవించిన మహోన్నత సాహితీమూర్తి, తెలుగుల జ్ఞానపీఠం, 'విశ్వంభర' కవి– డా॥సి.నారాయణరెడ్డి వియత్తలానికి తరలిపోయాడు. కవికుల గురువు దివికేగాడు. నిత్య చైతన్య శీలిగా, నిరంతర సాహితీమూర్తిగా సదా స్ఫూర్తి ప్రదాతగా నిలచిన కవివతంసుడు నారాయణరెడ్డి. ఒక సందర్భంలో కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారన్నట్లు...

"ఆయన హృదయం 'నాగార్జున సాగరం'
ఆయన యశస్సు 'కర్పూర వసంతరాయలు'

ఆయన నీడ 'వెన్నెలవాడ'
ఆయన కవితా కుమారి 'అజంతా సుందరి'
ఆయన నివాసం 'మధ్యతరగతి మందహాసం'
ఆయన ఆవేదన 'మంటలూ మానవుడూ'
ఆయన భావాలు 'అక్షరాల గవాక్షాలు"

తెలుగు భాషా, సాహిత్యాలకు వైభవప్రాభవాలు కూర్చిన మహోదాత్తుడు సినారె. 'పాతకొత్తల మేలు కలయిక క్రొమ్మెఱుంగుల్ చిమ్మగా' అన్న గురజాడ వాక్కుకు నిదర్శనంగా సత్సంప్రదాయాన్ని విడువక, నవసమాజపు విప్లవాత్మక భావాల్ని వస్తువులో, కవిత్వరచనా ఫణితిలో సంతరించుకుని పద్యాన్ని, గేయాన్ని, గజల్‌ని, వచనకవితను వాడిమితో, మేలిమితో పఠితృలోకానికి అందించి ఖ్యాతిగాంచిన వాడాయన.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, ఆచార్య దివాకర్ల వేంకటావధాని వంటి గురువుల వద్ద విద్యనేర్చి, ఆ గురువులను మించిన శేముషీ సంపన్ననిగా... వారిచేతనే ప్రశంస లందుక్కు ప్రతిభామతి సినారె. పాఠం చెప్పి విద్యార్థిలోకాన్నీ, పాటలు రాసి ప్రేక్షక సమూహాన్నీ రంజింపచేసిన రససిద్ధుడాయన.

మాటలాడితివేని మందార కుసుమ ని
స్పువద మంద మరంద రసములోడు
కవిత చెప్పితివేని కల్హార మాలికో
ద్గత సౌరభమ్ములు కడలుకొనును
గేయమల్లితివేని గాయనీ గాయక
గాత్ర సంతతికి నుత్కర్ష గూర్చు
చదువు చెప్పితివేని ఛాత్ర సంఘముల త
త్పరచిత్తములకు తాదాత్మ్యమొసగు
పావదూకోత్తముండవు, వరకవీంద్ర
సంతత శిరోమణివి, గురుసత్తముండవు
చిత్రగేయ విధాతవు, శిష్యవర్య!
ఖ్యాతి తెచ్చితివి మాకు విఖ్యాతుడవయి

అంటూ ఆచార్య దివాకర్ల వారు, సినారెపై గురువైవుండీ కవితనల్లారంటే సినారె

వైశిష్ట్యం ఏమిటో విశదమవుతోంది. వందలాదిమంది శిష్యులను తీర్చిదిద్దిన సినారె వేలాది సినీగీతాలను రాసి, లక్షలాది హృదయాలను దోచుకున్న అక్షర కోటీశ్వరుడు. ఎందరినో ప్రభావితమొనర్చి కవులుగా మలచినవాడు. ఆయన చేతులమీదుగానే తమ పుస్తకం ఆవిష్కృతం కావాలని ఆకాంక్షించిన కవులు, రచయితలు కొల్లలు. ఎందరికో కవిత్వరచనకు స్ఫూర్తి ప్రదాతయై, ఎందరికో కవితావస్తువుగా కూడా రూపెత్తినవాడు సినారె.

"కవిత్వమే తపస్సయి, కవిత్వమే శ్వాసై, కవిత్వమే ఊపిరై" తనను తాను ఎవరూ సరికాని ఓ విలక్షణమైన గొంతుగా శిల్పించుకున్నవాడు అతను...

ఒకసారి గాలిలో తేలి ఒక పాటై వస్తాడు. మరోసారి కాగితాల్లో అక్షరాలను చల్లుతూ కావ్యమై వస్తాడు. ఇంకోసారి సాహిత్యామృతాన్ని నేలపై విత్తనాలు విత్తనాలుగా చల్లుతూ ఋషై వస్తాడు. అందరి గుండెల్లోకి పుస్తకాలుగా విస్తరిస్తాడు. అతనే... అసలును మించి పర్వతమై ఎదిగిన దడ్డీ... సి.నారాయణరెడ్డి. తెలుగుపాటకు చిరునామా తెలుగుతనానికి ఎనలేని ధీమా"– అంటాడు కవి రామా చంద్రమౌళి. ఇలా కవులచే కీర్తించబడ్డ కవిశ్రేష్ఠుడు సినారె.

డా॥ సింగిరెడ్డి నారాయణరెడ్డి కరీంనగర్ జిల్లా వేములవాడ మండలం హనుమాజి పేట గ్రామంలో 29.7.1931 శ్రీమతి బుచ్చమ్మ– మల్లారెడ్డి దంపతులకు జన్మించారు. తొలుత వీధిబడిలో, ఆపై సిరిసిల్లలో ఉర్దూ మాధ్యమంలో, ఆపై కరీంనగర్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉన్నత విద్యనేర్చారు. ఏడవ తరగతిలో వుండగానే–

"ఒకనాడు ఒక నక్క ఒక అడవిలోపల పొట్టకోసమెటో పోవుచుండె"

అంటూ ఛందస్సంటే తెలియని దశలోనే, సీసపద్య ఫణితిలో పద్యంరాసి, శ్రీ దూపాటి వేంకట రమణాచార్యులుగారి నుండి ఛందో మెలుకువలను గ్రహించారు తొమ్మిదో తరగతిలో వుండగా...

"మారుటెన్నడో విషంపు గుండెలీ జగాన మారుటెన్నడో"

అంటూ తొలి గేయరచన చేశారు. ఉన్నతవిద్య దశలో పాటలు, గేయాలు అల్లడం అలవోకగా మారింది.

"వెన్నవంటి మనసున్నవానికి అన్నమేమొ కరువాయె
ఉన్నవానికింతన్నమిడుదా మన్న గుండెలేదాయె"

అంటూ పదవతరగతిలోనే సామాజికస్పృహతో, ఆదర్శ భావజాలంతో కలం కదిలించారు.

నారాయణరెడ్డిగారు హైదరాబాద్ ఛాదర్‌ఘాట్ కళాశాలలో ఉర్దూ మీడియం లోనే ఇంటర్మీడియట్ పాసయ్యారు. అప్పుడే శ్రీ జువ్వాడి గౌతమరావుగారి సంపాదకత్వంలో వెలువడుతున్న 'జనశక్తి' పత్రికలో నారాయణరెడ్డిగారి తొట్టతొలి కవిత ప్రచురితమైంది. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం గ్రంథాలయ సభ్యులైన సినారె-రాయప్రోలు, గురజాడ, కృష్ణశాస్త్రి, జాషువా, శ్రీశ్రీ, కరుణశ్రీ వంటివారి రచనలనూ, అనేక గ్రంథాలనూ చదివారు. ఉస్మానియా యూనివర్సిటీలో 1952 లో ఉర్దూ మాధ్యమంలోనే బి.ఏ. పూర్తి చేశారు. ఆర్ట్స్ కళాశాల సాహితీసంచిక 'శోభ'కు సినారె సంపాదకత్వం వహించి, అందులో 'రోచిస్', 'సింహేంద్ర' అన్న కలం పేర్లతోనూ రచనలు చేశారట! 1954 లో ఎం.ఏ. తెలుగు చేసి, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నిజాం కళాశాలల్లో ఉపన్యాసకులుగా పనిచేశారు. ఖండవల్లి వారి పర్యవేక్షణలో 'ఆధునికాంధ్ర కవిత్వము- సంప్రదాయములు, ప్రయోగములు' అనే అంశంపై 1962 లో పిహెచ్.డి. పట్టాను పొంది, డాక్టర్.సి.నారాయణరెడ్డి అయ్యారు. ఒక సిద్ధాంత గ్రంథం జనాకర్షక గ్రంథంగా పఠనీయతను పొంది, నేటికీ సాహితీ విద్యార్థులకూ, సాహితీ ప్రియులకూ ఆకరగ్రంథంగా ఉండడం సినారె సిద్ధాంత గ్రంథానికే చెల్లిందనాలి!. 1963 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో రీడర్ అయ్యారు. 1976 లో ఆచార్యులై 1981 వరకూ బోధనచేశారు. ఎందరో శిష్య ప్రశిష్యులు ఆయనవద్ద రూపొందారు. సినారె 1981-1985 లో అధికారభాషా సంఘం అధ్యక్షులుగా తెలుగుభాషా సేవ చేశారు. ఆపై దేశంలోనే తొలి ఓపెన్ యూనివర్సిటీ అయిన డా॥బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఉపాధ్యక్షులుగా 1985-1989 లో విధులు నిర్వర్తించి, ఏభైఏడు జిల్లా అధ్యయన కేంద్రాలతో, యాభైవేలకు పైగా విద్యార్థుల సంఖ్యతో అది విస్తరిల్లేలా చేశారు.

21.6.1989 న ఆచార్య సి.నారాయణరెడ్డిగారు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ బాధ్యతలు చేపట్టి, 4.11.1992 వరకూ ఆ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేశారు. యు.జి.సి. గుర్తింపు లభించింది. నూతన భవననిర్మాణం కూడా ఆయన హయాంలోనే జరిగింది. 5.11.1992 న సినారె

భాషా సాంస్కృతిక వ్యవహారాల ప్రభుత్వసలహాదారుగా సమున్నత పదవి నధిష్ఠించారు. ఆపై 1997 జూలై నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులై– 12.7.2004 వరకు కేబినెట్‌హోదాలో ఎనలేని కళాసేవ చేశారు. సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా ఉన్న కాలంలోనే, భారత రాష్ట్రపతిచే రాజ్యసభ సభ్యులుగా కొనసాగారు. దక్షిణ భారతదేశపు కవి– రాజ్యసభ సభ్యుడైన వైశిష్ట్యం సి.నా.రె. కే దక్కింది. తమకు కేటాయింపబడిన ఎం.పి. నిధులను, కళా సాహిత్య రంగాలకు సముచితంగా ఖర్చుచేసిందాయనే!

1953 లో 'నవ్వని పువ్వు'తో మొదలుపెట్టి, ఎనభైకి పైగా గ్రంథాలను తన 85 ఏళ్ల జీవితకాల పరిమితిలో వెలయించిన కవి, రచయిత సినారె. తన పుట్టిన రోజును తన నూత్న కావ్య సంకలన ప్రచురణతో ఏటేటా జరుపుకున్న కవి బహుశా ఆయనేనేమో! పద్దెనిమిది ప్రక్రియలలో ఆయన తన గ్రంథాలను వెలువరించారు. 'మంటలూ–మానవుడూ' కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 'విశ్వంభర' కావ్యానికి అత్యున్నత జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న శేముషీసంపద ఆయనది. 1976 లో మీరట్ విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, 1978 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ', అలాగే నాగార్జున, కాకతీయ, డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయాల గౌరవ డాక్టరేట్లు ఆయన్ను వరించాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులతో సత్కరించింది. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జపాన్, రష్యా, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయిలాండ్, యుగోస్లేవియా, గల్ఫ్ దేశాలు, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, మారిషస్ దేశాలను పర్యటించి, కవిగా తెలుగు బావుటాను ఎగురవేసిన అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన తెలుగుకవి సినారె!. ఆయన గ్రంథాలపై ఎందరో పరిశోధనలు చేసి ఎం.ఫిల్, పిహెచ్.డి. పట్టాలను సంపాదించుకున్నారు. సినారె వ్యక్తిత్వ సాహిత్యాలపై వెలువడిన గ్రంథాలు కూడా తక్కువేమీ కాదు. ఇవన్నీ వారి బహుముఖీన ప్రతిభకూ, మహిత వ్యక్తిత్వానికీ దర్పణాలు!

1962 లో శ్రీ నందమూరి తారకరామారావుగారి ఆహ్వానంపై చలనచిత్ర జగత్తులోకి అడుగిడిన 'సినారె'– 'గులేబకావళి కథ' లో 'నన్ను దోచుకొందువటే వన్నెల దొరసాని' అంటూ తొలి సినీగీతం రాసి, తదాదిగా మూడువేలకు పైగా పాటలు రచించిన సినీకవిగా ప్రేక్షక హృదయాలను దోచుకున్నారు. 'గులేబకావళి కథ' సినిమా నుండి ఇటీవలికాలపు ప్రేమించు, అరుంధతి, మేస్త్రి సినిమాల వరకు– సాహితీ విలువలు గుబాళించే పాటలెన్నింటినో రచించిన సినీగేయకవి సినారె. 'పాటలో

ఏముంది, నా మాటలో ఏముంది' పేరిట... తమ సినిమా పాటలకు చెందిన అనేక విషయాలను వివరిస్తూ రెండు వ్యాఖ్యాన గ్రంథాలు కూడా వెలువరించారాయన. 'ఏకవీర', 'అక్బర్ సలీం అనార్కలీ' చిత్రాలకు పాటలేకాక, చలనచిత్ర సంభాషణలు కూడా సంతరించారు. మూగజీవులు, శభాష్ పాపన్న, మొగుడా పెళ్లామా, తూర్పు పడమర వంటి సినిమాలలో కావ్య సంబంధ పాత్రలలో వెండితెరపై కనిపించారు కూడాను. తెలుగు గజళ్లను స్వయంగా పాడి రికార్డులుగా వెలువరించారు.

"ఎన్ని తెన్నుల కైతకన్నె విహరించినను– పాటలోనే నాదు ప్రాణాలు గలవందు" అని సూటిగా పలికి, 'పల్లె నాకు పాటనిచ్చింది. పట్నం నాకు మాట ఇచ్చింది' అని చెప్పుకున్నారాయన. జానపదం మూలకందంగా ఎదిగి, జ్ఞానపథంలో అడుగిడి, 'జ్ఞానపీఠం' కైవసం చేసుకున్న సాహితీ కృషీవలుడు సి.నారాయణరెడ్డి.

ఆకాశవాణిలో లలితగీత రచయితగా అడుగిడి, గేయనాటికలు, సంగీత రూపకాలు రచించిన కవిగా, అసంఖ్యాక శ్రోతల ప్రశంస లందుకున్నారు సి.నారాయణ రెడ్డి. 'నేను ఆకాశవాణిలోనే పుట్టాను– కవిగా' అని రాజ్యసభలో గర్వంగా ప్రకటించిన కవి ఆయన.

ఎందరో యువకవులను వెన్నుతట్టి ప్రోత్సహించి, వారిలోని ప్రతిభను ప్రశంసించి, వారికి సాహితీలోకంలో ఒక గుర్తింపు కలిగే స్థాయికి ఎదిగేలా చేసిన వారాయన. ఆయన దగ్గర చదువుకున్న శిష్యులే ఆయన అనంతరం విశ్వవిద్యాలయ ఆచార్యులుగా, వైస్ ఛాన్సలర్స్‌గా రాణించిన వారున్నారు. దేశవిదేశాలనెన్నింటినో తన సాహితీ సుగంధాలతో పరిమళభరితం చేసిన సినారె–జంటనగరాల సాహితీ సాంస్కృతిక సంస్థలకెన్నింటికో పెద్ద దిక్కు! ప్రతిరోజూ సాయంకాలం... ఒక్కోరోజు రెండు, మూడు సభల్లో కూడా ముఖ్య అతిథిగా వేదికలెక్కి పాల్గొని, ప్రేక్షక జనాకర్షక సాహితీమూర్తిగా, వక్తగా రాణకెక్కినవారు నారాయణరెడ్డిగారు. స్వయంగా తన భార్య కీ॥శే॥ సుశీలగారి పేరిట సుశీలా నారాయణరెడ్డి అవార్డుతో రచయిత్రులను సత్కరిస్తూ వచ్చారు. యువభారతి, వంశీ, కిన్నెర, రసమయి, యువకళా వాహిని, అభినందన, వంటి ఎన్నెన్నో సంస్థలూ, రవీంద్రభారతి, త్యాగరాయ గానసభ వేదికలూ ఆయనతో పులకితమూ, పునీతమూ అయ్యాయి!

1943 లో హైదరాబాద్‌లో స్థాపించిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు నారాయణ రెడ్డిగారితో అయిదు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉంది. శ్రీ దేవులపల్లి రామానుజ

రావుగారు కాలధర్మం చెందాక– ఆయన రాసిన వీలునామా ననుసరించే, 27.6.1993 నాడు డా॥ సి.నారాయణరెడ్డిగారు ఆ సంస్థకు అధ్యక్షులయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం– 'ఆంధ్ర సారస్వత పరిషత్' పేరు, 'తెలంగాణ సారస్వత పరిషత్'గా మార్పు చెందింది. 'పరిణతవాణి' పేర వయోధికులైన ప్రముఖుల ప్రసంగాలను పరిషత్ ఏర్పాటు చేసి, వాటిని గ్రంథస్థం చేసింది. 5.3.2010 నాడు 'పరిణతవాణి' స్వర్ణోత్సవ ప్రసంగాన్ని స్వయంగా సి.నా.రె కావించి– తమ జీవిత సాహిత్య విశేషాలను సభానురంజకంగా వివరించాడు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులుగానే ఆయన కన్నుమూశారు. ఆయనతో గడిపిన క్షణాలు ఎవరికైనా మధురానుభూతులే! ఈ అక్షర నివాళినందిస్తున్న మీ సుధామ ఆయన 'ఋతుచక్రం' కావ్య సంకలనాన్ని తన తండ్రిగారి నుండి పదవతరగతిలో పుట్టినరోజు బహుమతిగా అందుకుని, అలా కవిత్వ రచనా స్ఫూర్తినీ అందుకున్నట్లయింది. యువభారతి సంస్థ తన సభ్యులు నలుగురి కవితా సంకలనం 'వీచికలు' వెలువరించినప్పుడు సి.నా.రె దానిని ఆవిష్కరించి, ఆ సంకలనంలో తన కవిత్వమే కాక పుస్తక ముఖచిత్రాన్ని కూడా సంతరించిన సుధామను... 'కవితలో బొమ్మ గీస్తాడు, బొమ్మలో కవిత రాస్తాడు' అని ప్రశంసించారు. అలాగే యువమిత్ర లిఖిత మాసపత్రిక సుమారు 8 ఏళ్లు సుధామ సంపాదకత్వంలో వెలువడింది. 18.1.74 న సి.నారాయణరెడ్డిగారు ఆ పత్రిక గూర్చి "నేటి ముద్రిత పత్రికలు ముఖం చూసుకోదగ్గ అద్దం ఈ లిఖిత పత్రిక. ఇందులో ఉన్నవన్నీ చిత్రశబ్దాలు, శబ్ద చిత్రాలు... శేముషి+కృషి= సుధామ' అని ప్రశంసించారు. స్వహస్తాలతో సంచికలో లిఖించారు.

ఇక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. (తెలుగు), ఎం.ఫిల్. పరిశోధనా పాఠాలను శిష్యునిగా స్వయంగా నారాయణరెడ్డిగారి నుండి నేర్చుకోవడం, ఆయన 'మంటలూ–మానవుడూ' కావ్యానికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా డా॥ జి.వి.సుబ్రహ్మణ్యంగారు నిర్వహించిన సెమినార్‌లో 'మంటలూ–మానవుడూ' కావ్యంలో 'ఇమేజరీ'పై ప్రసంగించడం, ఆ తర్వాత ఉస్మానియాలో ఎం.ఫిల్ పరిశోధనకు 'తెలుగు అభ్యుదయ కవిత్వంలో (ఇమేజరీ) భావచిత్రాలు' అనే అంశాన్ని ఎన్నుకుని నేను ఎం.ఫిల్ పట్టా పొందడం ఓ ఆనంద స్మృతి వీచికయే! అలాగే 1990 లో నా 'అగ్నిసుధ' కావ్యానికి కలహంసి అవార్డు ఆయన చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. 2004 లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని కూడా సినారె సాన్నిధ్యంలోనే అందుకున్నాను.

సి.నారాయణరెడ్డిగారు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పలు సాహితీసభలకు వక్తగా, విశిష్ట అతిథిగా వెళ్లి వేదికను పంచుకోవడమే కాక, పలు సభలకు అధ్యక్షత వహించిన మంచి జ్ఞాపకాలు నారాయణరెడ్డిగారితో వున్నాయి. ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా మీ సుధామ సి.నారాయణరెడ్డిగారి 'ఋతుచక్రం' కావ్యాన్ని వారి గళంలోనే మొత్తం రికార్డుచేయడం జరిగింది. జాతీయ కవి సమ్మేళనంలో ఏటేటా సి.నా.రె. చేత వివిధ భాషా కవితలకు తెలుగు అనువాదాలు చేయించి, వారి గళంలో ప్రసారంచేసే సదవకాశమూ లభించింది. సినారె ప్రేమాదరాలను పొందగల్గిన వారి శ్రేణిలో వుండడం– నిజంగా ఒక గొప్ప భాగ్యమే మరి!

85 వసంతాలు పూర్తి చేసుకుని, వచ్చేనెల జూలై 29 కు 86 వసంతాలు పూర్తిచేసుకునే దశలో గత కొద్దిరోజులుగా అస్వస్థులై, డా॥ సి.నారాయణరెడ్డి 12.6.2017 సోమవారం ఉదయమే కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చివరి శ్వాస విడిచారు.

'భూగోళమంత మనిషి బొమ్మ' కనుమరుగయ్యింది. 'కలిసి నడిచే కలం' తో– 'జ్వాలగా జీవించాలని', 'రెక్కల సంతకాలు' తో 'సమూహం వైపు' నిలచి, 'కవిత నా చిరునామా' అంటూ, 'దూరాలను దూసుకొచ్చి', ఎందరెందరి హృదయాలకో దగ్గరై, అందరి మన్ననలను బడసిన కవి– 'విశ్వం నాలో వున్నప్పుడు' 'మనిషిగా ప్రవహించాలని' 'దృక్పథం' కలిగి, 'ఆరోహణ' చేస్తూ 'కాలం అంచుమీద' శాశ్వతంగా అదృశ్యమయ్యాడు. 'విశ్వంభర' కవి వియన్మండలం చేరిపోయాడు.

"కవిత్వమంటే కర్రుమొనలోంచి మట్టి పలికినట్టుండాలి. చెమట ఆవిరిలోంచి మబ్బుపట్టినట్టే ఉండాలి. వెయ్యి పిడికిళ్లు ఒక్క లయలో ఉరిమితే అది నినాదం. నగ్న నినాదం శబ్దచైతన్యాన్ని తొడుక్కుంటే అది కవిత్వం"– అన్న మానవీయ మహోదాత్త కవివతంసుడు. నడక సంస్కృతిలాంటిదనీ, పరుగు నాగరకితలాంటిదనీ తలపోసి–

"నడక నా తల్లి, పరుగు నా తండ్రి, సమత నా భాష, కవిత నా శ్వాస, నా వాదం సామ్యవేదం– కవిత్వం నా మాతృభాష"– అని పలికిన తెలుగువారి వెలుగు కవి– యువకవుల దారిదీపం డా॥ సి.నారాయణరెడ్డి అస్తమయం, ఒక ఉజ్జ్వల సాహిత్యశకానికి ముగింపు వంటిదే.

వేనవేల ప్రాణాలను హరించి విసుగేసిందేమో మనిషిగా క్షణం జీవించాలని మరణానికి దాహం. దాహార్తి తీరిన మృత్యువ్యు– సినారెను శాశ్వత పరిష్వంగంలోకి

తీసుకుంది. కాలశిఖరం మీద విశ్వచైతన్యాన్ని ముద్రించి కవి శాశ్వతంగా నిష్క్రమించాడు. ఆయన పేర అవార్డులు నెలకొల్పుకున్నా, ఆయన శిలా విగ్రహాలు స్థాపించుకున్నా, గుండెనిండుగా వుండిపోయే కవికి– అసలు నివాళి ఆయన ఆశించిన తెలుగు భాషా, సాహిత్య వికాసాలను పరివ్యాప్తం చేసుకోవడమే!

కవికుల గురువుకు, విశ్వంభరామూర్తికి బాధాతప్త హృదయంతో అశ్రునివాళులివి, అక్షర బాష్పాలివి!

(వార్త దినపత్రిక, ఆదివారం ముఖచిత్ర కథనం, 18 జూన్ 2017)

(48) సాహితీ కీర్తిశిఖరం

వదులవుతూ జారిపోతున్న పంచెను వేదిక మీదనే సవరించి కట్టేసుకుంటూ, అధ్యక్షస్థానం నుంచి మైకులో ప్రసంగిస్తూండే ఆయన రూపం ఇప్పటికీ కనులముందు కదలాడుతూనే వుంది.

అప్పట్లో పదహారేళ్ళ ఈ యువకుడికి మొదట్లో ఆయనంటే గౌరవంతో కూడిన ఓ భయం. ఆ తరువాత ఆయన ప్రేమతో ఏర్పడిన కొద్దిపాటి చనువు. ఇంత కుర్రాడినీ ఆయన గౌరవంగా సంబోధిస్తూ చూపిన ఆప్యాయత, సాహిత్య పరమైన అవకాశాలు కల్పిస్తూ ఆదరణతో అభ్యున్నతికి తోడ్పడిన వాత్సల్యం. అన్నీ మరపురానివే!

1967- మీ సుధామ ఆంధ్ర సారస్వత పరిషత్తులో ప్రాచ్య కళాశాలలో డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్ (డిప్.ఒ.ఎల్.) లో విద్యార్థిగా చేరిన రోజులు. సైన్సు, లెక్కలు లేని చదువు చదువుతానంటూ ఇంట్లో పట్టుబట్టి, వివేకవర్ధనీ కళాశాల పి.యు.సి. కోర్సు నుండి చివర్లో విరమించుకుని, ప్రాచ్యవిద్య గురించి తెలిసి, అప్పటికే తెలుగు మీద ఏర్పడిన అమితాభిలాషతో, అందునా నల్లకుంటలోని ప్రాచ్య కళాశాల కన్నా, తిలక్‌రోడ్‌లోని అందమైన, ఎత్తైన విశాల భవనపు సారస్వత పరిషత్తు మీద మోజుపడి, అక్కడి సాయంకళాశాలలోనే చేరడం జరిగింది. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రిగారు అప్పుడు ప్రాచ్యకళాశాల ప్రిన్సిపాల్. సారస్వత పరిషత్తుకు అధ్యక్షులు దేవులపల్లి రామానుజరావుగారు. పరిషత్ సామ్రాజ్యానికి ఆయనే రారాజు అన్నట్లు ధీమాగా, హుందాగా కనబడేవారు.

మేడమీద మా కళాశాల. ఆయన అధ్యక్ష 'ఛాంబర్' కిందనే వుండేది. వాడుక రిక్షాలో ఆయన పరిషత్‌కు వచ్చేవారు. ప్రాంగణంలో ఆయన తిరుగుతుంటే పులి సంచరిస్తున్నట్లుండేది. అంతటి రాజసం! మనసుమాత్రం మెత్తన. పరిషత్ ప్రాంగణంలోకి అడుగు పెడుతూనే కుడివైపు పఠనాలయం వుండేది. ఎడంవైపు

మెట్లెక్కి మా కాలేజి తరగతి గదుల్లోకి వెళ్ళేవాళ్ళం. కింద ఆయన ఉన్నారంటే ఒద్దికగా నడుచుకునేవారం.

'ఏమీ సుధామగారూ! బాగున్నారా!' అని ఆయన పలకరింపు లభించిన రోజు–కొండెక్కినంత సంతోషంగా ఉండేది! ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి అప్పుడాయన కార్యదర్శి, బెజవాడ గోపాలరెడ్డిగారు అధ్యక్షులు. గోపాలరెడ్డిగారు పొడుగు. రామానుజరావుగారు పొట్టి కాదు గానీ, ఆయన ఈయన కలిసి కనబడితే– కమనీయ దృశ్యంగానే ఉండేది.

ఆ రోజుల్లో జంటనగరాల్లో ప్రముఖ సాహితీ సంస్థ అంటే యువభారతి యే! 1967లోనే శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరిగే పక్ష సమావేశాల ద్వారా యువభారతితో పరిచయం, ఆ సంస్థ సభ్యత్వంతో క్రమేపీ సహ కార్యదర్శకత్వం లభించాయి. తొలుత యువభారతి కార్యాలయం సికింద్రాబాద్ 5, కింగ్స్ వే లోని శ్రీ వంగపల్లి విశ్వనాథంగారింట్లోనే ఉండింది. దేవులపల్లి రామానుజరావుగారి ప్రేముడి కారణంగానే– సారస్వత పరిషత్తు 'మగ్‌డీ'లలో ఒకటి యువభారతి కార్యాలయం అయింది. యువభారతి ప్రచురణల అమ్మకాల స్టాల్‌గా కూడా అది వుండింది. పరిషత్తు అరుగుల మీద కూర్చునే యువభారతి కార్యవర్గం కార్యక్రమాల ప్రణాళికలు వేసుకునేది. మా చర్చలన్నీ ఆ అరుగులమీదే సాగేవి. "వీళ్ళు మా అరుగుల మీద కూర్చుని మిర్చి బజ్జీలు, చాయ్‌లు తాగుతున్నారనే అనుకున్నాగానీ, ఇంతటి సాహిత్య కృషి చేస్తున్నారు." అని వేదిక మీద నుండే ఆయన నవ్వుతూ యువభారతిని అభినందించిన సన్నివేశం గుర్తుంది.

యువభారతి లహరి సమావేశాలకు పరిషత్తే ప్రాంగణం... 'బొగ్గులకుంట షాదీఖానా' అంటేనే– అప్పట్లో రిక్షావాలాలకు తెలిసేది. తిలక్‌రోడ్‌లోకి బస్సు సౌకర్యం లేదు. అయినా పరిషత్తు ఎన్నో వేదుకలకు వేదిక. రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతి ప్రదాన సభలూ అక్కడే జరిగేవి. అంతెందుకు? – అకాడమీ సభలు జరిగినప్పుడు అప్పట్లో దిగంబర కవులు, మరికొన్ని వామపక్ష సంఘాలు కరపత్రాలు పంచడానికీ, నిరసనలు తెలిపినా– అక్కడకు వస్తూనే వుండేవారు. 'ఈ పంచెగాళ్ళు, ఈ పిలకగాళ్ళు' అంటూ వారు నిరసన పత్రాలు పంచినా, రామానుజరావుగారు మొక్కవోని ధీరతతోనే కనబడేవారు. అంతెందుకు?– విరసం మహాసభలకు కూడా పరిషత్ ప్రాంగణం వేదిక అయింది. అఖిల భారత రచయిత్రుల మహాసభలూ అక్కడ జరిగాయి.

చాలాకాలం దాకా రామానుజరావుగారి సాహితీ విరాడ్రూపం తెలియలేదు. మా నాన్నగారికి (కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు) సన్నిహితులైన పులిజాల హనుమంతరావుగారి ద్వారానూ, ఆంధ్రా బుక్‌హౌస్ అధినేత వై.నారాయణరావు (నాటి ఎం.ఎల్.ఏ.గా చేసిన శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారిగారి భర్త) గారి ద్వారాను రామానుజరావుగారి గొప్పతనం మొదట్లో విన్నాను.

నేటి ఈ శతజయంతి సాహితీమూర్తి శ్రీరామానుజరావుగారు 1917 ఆగష్టు 25 న వరంగల్ దగ్గర్లోని దేశాయిపేటలో అండాళ్ళమ్మ, వేంకట చలపతి గారలు అమ్మానాన్నలుగా తొలిబిడ్డగా జన్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయం పట్టభద్రత నిచ్చింది. నాగపూర్ యూనివర్సిటీ నుండి ఎల్.ఎల్.బి. సాధించారు. తెలంగాణ విముక్తి పోరాటంలో ఆయనొక అక్షరయోధుడు. తెలంగాణ నుండి వెలువడిన శోభ, గోలకొండ పత్రికలకు సంపాదక బాధ్యతలు నిర్వర్తించినవారు. 1945-46 ల్లో వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వుండి, అనంతర కాలంలో ఒక సాహితీమూర్తిగానే 1960-62 ల్లో రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన వైనం ఎక్కువ మందికి తెలియదు నేడు!. సురవరం ప్రతాపరెడ్డిగారి ఆహ్వానం మేరకే 'గోలకొండ' పత్రిక ఉపసంపాదకులుగా చేరారు. ఇరవైరెండేళ్ళు గోలకొండ పత్రికలో ఆయన సంపాదకీయాలు రాశారు. ఉస్మానియా యూనివర్సిటీ (1950 నుండి 1979 దాకా), హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికీ, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికీ కూడా ఆయన సెనేట్‌సభ్యుడిగా పనిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం స్థాపన తరువాత కొంతకాలం దానికీ ఆయన సెనేట్ సభ్యులే. 1990 లో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ నిచ్చింది.

సాహితీకారుడిగా రామానుజరావుగారి కీర్తి ఎనలేనిది. ఆయన గ్రంథాలు రాశిలో ఎక్కువ లేకపోయినా వాసిలో ఖ్యాతిగాంచాయి. సారస్వత నవనీతం, తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం, తెలంగాణలో జాతీయోద్యమాలు, ఉపన్యాస తోరణం, వేగుచుక్కలు, తెనుగు సాహితి, తెలుగుదేశము, తలపుల దుమారము, పంచవర్ష ప్రణాళికలు, బంకించంద్ర చటర్జీ జీవితము, హైదరాబాద్‌లో స్వాతంత్ర్యోద్యమం, మనదేశం- తెలుగు సీమ, జవహర్‌లాల్ నెహ్రూ, గౌతమ బుద్ధుడు, కావ్యమాల, నా రేడియో ప్రసంగాలు, 1929 నుండి 1979 వరకు- 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' ఆయన గ్రంథాలుగా వెలువడ్డాయి. గురజాడ, రవీంద్రనాథ్

టాగూర్ శతవార్షిక సంచికలకూ, 1981 లో తెలుగు మహాసభల ప్రత్యేక సంచికకూ ఆయనే సంపాదకత్వ బాధ్యతలు వహించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ 'స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత' ను ఆయన సంపాదకత్వంలోనే 'కావ్యమాల' సంకలనంగా వెలువరించింది. అప్పుడు నేను పరిషత్ ప్రాచ్యకళాశాల బి.ఓ.యల్. విద్యార్థిగా వుండి కవిత్వం రాస్తున్న యువకవిని. శ్రీకె.కె.రంగనాథాచార్యులు అప్పుడు మా కళాశాల ప్రిన్సిపాల్. కళాశాల వార్షిక సంచికగా 'నెలవంక' ప్రచురింపబడుతూండేది. రెండేళ్ళు 'నెలవంక'కు ఉప సంపాదకుడిగా నేను వ్యవహరించాను. మా కళాశాల వార్షిక సంచికకై నేను రాసిన 'ఈ దీపం వెలుగదు... జ్వలిస్తుంది' అనే కవిత దేవులపల్లి రామానుజరావుగారు సంపాదకులుగా కేంద్ర సాహిత్య అకాడమీ వెలువరించిన ఆ స్వాతంత్ర్యానంతర తెలుగు కవితా సంకలనం 'కావ్యమాల' లో చోటు చేసుకోవడం విద్యార్థికవిగా నాకు దక్కిన గొప్ప గౌరవం. అందుకు రామానుజరావుగారికీ, కె.కె.రంగనాథాచార్యులు గారికీ నేను అధమర్ణుడిని!

దేవులపల్లి రామానుజరావుగారి అధ్యక్షతలో జరిగిన పలుసభల్లో పాలు పంచుకునే అదృష్టమూ కలిగింది. ముఖ్యంగా చెప్పుకోదగింది 23.8.1969 సాయంకాలం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ– కళాభవన్ హాలులో, నవ్యసాహితీ సమితితో నిర్వహించిన 'చందమామ' పై కవి సమ్మేళనం. చంద్రునిపై మానవుడు తొలి అడుగు మోపిన సందర్భంగా ఏర్పాటైన ఆ కవి సమ్మేళనానికి రామానుజరావు గారే అధ్యక్షులు. అకాడమీ కార్యదర్శి ఆయనే. దాశరథి, శేషేంద్ర, సినారె, బోయి భీమన్న, శశాంక, అరిపిరాల, కేశవపంతుల, దివాకర్ల, పోతుకూచి, నాయని కృష్ణకుమారి వంటి వారి సరసన యువకవిగా నేను (మీ సుధామ) పాల్గొనడం, 'చంద్రావలోకనం' అనే నా సుదీర్ఘ కవిత అందరి ప్రశంసల నందుకోవడం, ముఖ్యంగా రామానుజరావుగారు అభినందించడం మరిచిపోలేను. బహుశా ఆయన అధ్యక్షతలో నేను పాల్గొన్న మొట్టమొదటి కవిసమ్మేళన సభ అదే. ఆ తరువాత మా యువభారతి సభలకూ, ఇతరత్రా పలు సాహిత్య సభలకూ ఆయన ఆధ్వర్యంలో వేదిక పంచుకోగలిగే సదవకాశాలు లభించాయి.

సారస్వత పరిషత్తులో సభలు జరిగినప్పుడు గేట్ దగ్గర నల్లబోర్డుపై నా చేతి రాతతో సమావేశ వివరాలు రాసి ప్రదర్శించిన సందర్భాలున్నాయి. అలా నా చేతిరాత

చూసి అభినందించిన రామానుజరావుగారు పరిషత్ ప్రచురణ చేసే గ్రంథాలలో ఒకసారి ఏ పుస్తకంలోనో గుర్తులేదు కానీ, తెలుగు లిపి గురించిన ఓ వ్యాసంలో ప్రచురణ నిమిత్తం– ఆ లిపి పరిణామ అక్షరాలను నా చేత రాయించి, బ్లాక్ చేయించి ప్రచురించారు (ప్రాచ్య కళాశాల 'నెలవంక' వార్షిక సంచిక ముఖచిత్ర అక్షరాలంకరణ కూడా నేను చేశాను). రామానుజరావుగారు ఆ పుస్తక ప్రచురణ అయ్యాక– తమ ఛాంబర్‌కు నన్ను పిలిపించి, ఆప్యాయంగా గడియారం రామకృష్ణ శర్మగారిచేత విశ్వనాథ వారి 'కావ్య పరీమళము', మరి రెండు అకాడమీ ప్రచురిత గ్రంథాలను పారితోషిక కానుకగా అందించడం మరచిపోలేను!. ఆయన పరిషత్ ప్రాంగణంలో రిక్షా ఎక్కుతూనో, దిగుతూనో వున్నప్పుడు ఎప్పుడు నేను తారసడినా చిరునవ్వుతో నా నమస్కారానికి ప్రతిగా 'ఏమి సుధామగారూ!' అంటూ 'గారు' చేర్చి పలకరించేవారు. తమకంటే ఎంత చిన్నవారినయినా దివాకర్లవారు కూడా అలా 'గారు' అనీ, 'ఏమండీ' అనీ సంబోధించడం నాకు అచ్చెరువు కలిగించేది!

ఆయన సాహిత్య అకాడమీ కార్యదర్శిగా వున్న రోజుల్లోనే మా యువభారతి అధ్యక్షులు ఇరివెంటి కృష్ణమూర్తిగారిని ఎంతో సమాదరించే వారు. అనంతర కాలంలో రాష్ట్రసాహిత్య అకాడమీకి ఇరివెంటి వారు కూడా కార్యదర్శి అయ్యారు. రామానుజరావు గారి కాలంలోనే రాష్ట్ర అకాడమీ ఎన్ని ఒడుదుడుకులు పడ్డా, ఒక్క రూపాయికే ప్రాచీన సాహిత్య గ్రంథాలను అందించడం ఒక మహత్తర సాహిత్య సేవ. అలాగే అకాడమీ నిర్వహణ ఒక కత్తిమీద సాములా సాగించవలసిన పరిస్థితులూ ఎదురయ్యాయి. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యాకే, నార్ల వంటి వారి సలహాల వల్ల, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రద్దయి, తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమైంది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రి కె.సి.ఆర్.గారు తెలంగాణ సాహిత్య అకాడమీని పునరుద్ధరించడం ఒక మంచి సాహిత్య పరిణామం.

రామానుజరావుగారు 1993 జూన్‌లో అస్తమించినప్పుడు ఉద్యోగ రీత్యా విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా వుండినాను. ఒక నివాళి కార్యక్రమం చేసే అవకాశం మాత్రమే ప్రాప్తమయ్యింది. నేను 1995 సెప్టెంబర్‌లో హైదరాబాద్ కేంద్రానికి బదిలీపై వచ్చి, 2005 లో వరంగల్లులో ఓ ఏడాదిపాటు ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేశాను. 'పచ్చతోరణం' కావ్యంలో ఓరుగల్లుపై రామానుజరావుగారి పద్యం– అప్పుడే కాదు, ఇప్పటికీ నాకు మనసులో మెదులుతూనే వుంటుంది–

కాబోలు నియ్యది కాకతీయులొకప్డు
కరకు నెత్తుట కత్తి కడుగుచోటు
కాబోలు నీ ద్వార కళ్యాణ వేదిక
అలికి ముగ్గులు పెట్టె తెలుగు పడుచు
కాబోలు నీ జీర్ణ కమనీయ సౌధాన
సుకుమార శిల్పముల్ సొంపులొలికె
కాబోలు నీ వీధి కాపురం బొనరించె
పైడి మేడలలోన భాగ్యలక్ష్మి

ఇచటనే నిల్చి కాబోలు నిందుముఖులు
ఆయుధంబులు పూజించి యరుగుదెంచు
ఆంధ్రసేనకు కపురంపుటారతులను
ఇచ్చి వారల శౌర్యంబు మెచ్చినారు

తెలంగాణ సాహితీ తేజోమూర్తిగా తెలుగువెలుగు దీధితులను పరివ్యాప్తం చేసిన మహామనీషి రామానుజరావుగారు. ఆ శతజయంతి సమాపన సాహితీవేత్తకు నివాళులు. తెలుగు సాహితీ ప్రపంచానికి చిరస్మరణీయంగా ఆయన ఒక శాశ్వత కీర్తిశిఖరం అనడంలో సందేహం లేదు.

(పాలపిట్ట మాసపత్రిక, ఆగష్టు 2017)

❖

(49) సెరిబ్రల్ పాల్సీకి-కవి భిషక్కు

'కవి భిషక్కు'- ఈ మాట ఒకప్పుడు చాలా ప్రాచుర్యంలో వుండేది. ఆయుర్వేద వైద్యానికీ, కవిత్వ రచనకూ అవినాభావ సంబంధం వున్నట్లుగా బాగా దాఖలాలున్న ఆ రోజుల్లో- అలాంటి మహనీయులను 'కవి భిషక్కు' లనేవారు. సాహిత్య సృష్టిలోనూ, వైద్య చికిత్సలోనూ ఆరితేరినవారు 'కవి భిషక్కు'లు. ఆధునికంగా అలాంటి 'కవిభిషక్కు' అనడానికి నిలువెత్తు నిదర్శనంగా వుండేవారు డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తి.

గత నెల ఆగస్టు 17వ తేదీన కాలధర్మం చెందిన శ్రీరామమూర్తిగారు వైద్యంలో, సాహితీ సేద్యంలో రెండింటిలోనూ నిష్ణాతులు. జూన్ ఒకటిన సప్తతి పూర్తి చేసుకుని రెండు నెలలయినా కాకముందే తొందరపడి వెళ్ళిపోయారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలోని ధేనువకొండ గ్రామానికి చెందిన ఆయన రామసుబ్బారావు, ఆదిలక్ష్మమ్మ దంపతులకు 1947లో జన్మించారు. చీరాల స్థిరనివాసంగా సంగీత సాహిత్యాల కుటుంబ నేపథ్యంలో ఎదిగి, ఒంగోలు సి.ఎస్.ఆర్.శర్మ కళాశాలలో పి.యు.సి. చదివి, అనంతరం హైదరాబాద్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో బి.ఎ.ఎమ్.ఎస్. (బ్యాచులర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసన్ అండ్ సర్జరీ) పట్టా పొందారు. మూడు దశాబ్దాలపాటు భారతీయ వైద్యశాఖలో వివిధ హోదాలలో పనిచేసి, 2002 లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత హైదరాబాద్‌లో 'శ్రియం' పేర (సిద్ధేశ్వరి రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద మెడిసన్స్) సంస్థను ఏర్పాటు చేసి ఆయుర్వేద వైద్యవిధాన విస్తృతికి అపారమైన కృషి చేశారు. కవిగా, కథకునిగా, వ్యాసకర్తగా తనదైన సాహితీ సృజనతో విమర్శకుల మన్ననలు కూడా సమాంతరంగా అందుకున్న ప్రతిభామతి ఆయన. అంతేకాదు 'స్నిగ్ధఛాయ' అనే నవల, 'కామరూప' అనే నవ్య ధారావాహిక నవలికలతో నవలాకారునిగా కూడా వాసికెక్కారు.

గురజాడ అన్నట్లు 'కొత్తపాతల మేలుకలయిక క్రొమ్మెరుంగుల్ చిమ్మగా' భాసించిన రచయిత ధేనువకొండ. ఎంత సంప్రదాయ అభిజ్ఞులో అంత ఆధునికత సంతరించుకున్న సృజనశీలి.

శ్రీలలితా సహస్రనామ వైశిష్ట్యమ్ 2003 లో వ్యాసాలుగా రాసిన సంప్రదాయం ఒకవంకా, తన వృత్తి అయిన ఆయుర్వేద వైద్య విషయాలు రచనలుగా చేసిన శాస్త్రీయ దృక్పథం మరోవంకా ధేనువకొండ శ్రీరామమూర్తిగారి సొత్తు. హైదరాబాద్‌లో నివసిస్తున్నా– ఒంగోలులోని వాడరేవు ప్రాంతంలో నాలుగు దశాబ్దాలకు పైగా ఆయుర్వేద వైద్యునిగా తన సేవలు అందిస్తూనే వచ్చారు. ప్రతినెలా అక్కడికి విధిగా వెళ్లి అక్కడి ప్రజల యోగక్షేమాలు చూసేవారు. ముఖ్యంగా వైద్యునిగా 'సెరిబ్రల్ పాల్సీ' చికిత్సలో ఆయన వైద్య విధానం ఎంతో ప్రశస్తి పొందింది. శిశువు ఎదుగుదలలో మెడ నిలపలేక పోవడం, కూర్చోలేకపోవడం, చూపు నిలపలేకపోవడం, మాటలు అస్పష్టంగా రావడం, నడక సరిగ్గా లేకపోవడం, బుద్ధిమాంద్యం, చిన్న శబ్దానికే ఉలిక్కిపడడం, ఫిట్స్, చొంగకార్చడం, గ్రహణశక్తి లోపం, తొందరగా అన్నం నమిలి మింగలేకపోవడం వంటి లక్షణాలు కొందరి పిల్లల్లో పూర్తిగానూ, మరికొందరిలో కొన్ని లక్షణాలే వుండటం గమనిస్తూంటాం. ఈ లక్షణాల కలయికనే 'సెరిబ్రల్ పాల్సీ' అంటారు. తన ఆయుర్వేద విధానంలోని కొన్ని ప్రత్యేక చికిత్సలతో ఆయన విజయవంతమైన ఫలితాలు సాధించి కొద్ది వారాలలోనే అటువంటి పిల్లలను ఆరోగ్యవంతులుగా చేశారు. 'సెరిబ్రల్ పాల్సీ' కి మూలకారణం మెదడులో వుంటుంది. ఆయుర్వేద వైద్య రసాయనాలతో, తైలాలతో, లేపనాలతో చేసే క్లిష్టతర చికిత్సలలో అందెవేసిన చేయిగా, ఎందరో శిశువులకు కొత్త జీవితం ఇచ్చిన ఆయన– వ్యక్తిగా పసిహృదయుడే. తన ఆధ్యాత్మిక, సాహిత్య జ్ఞానంతో కూడా చికిత్సచేసే నిజమైన కవిభిషక్కు ఆయన.

కవిమిత్రుడు, మంచి విమర్శకుడు గుడిపాటి, ధేనువకొండకు మంచి స్నేహితుడు. గుడిపాటి వార్త దినపత్రిక ఆదివారం అనుబంధానికి ధేనువకొండ శ్రీరామమూర్తి– ఆయతనమ్, ఐలాండ్ విల్లా, కోర్టు సెంటర్, క్రౌంచవియోగం, జలయజ్ఞ సమిధలు, దక్షిణపొలం, పశుర్వేతి, పశ్యంతి వంటి అద్భుతమైన కథలు రాశారు. తమ ఒంగోలులోని టంగుటూరి ప్రకాశం పంతులుగారు నివసించిన ఇల్లు భూమికగా ఆయన రాసిన 'ఐలాండ్ విల్లా' కథల సంపుటి ఆయనకు ఎంతో ఖ్యాతి తెచ్చింది. ఆ సంపుటికే 2009 లో ఆయన శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సేవా సమితి

నుండి కుర్రా కోటా సూర్యమ్మ స్మారక సాహిత్య పురస్కారం అందుకున్నారు. 'ఐలాండ్ విల్లా' ఆడియో కథాసంపుటిగా కూడా రూపొందడం ఒక విశేషం. అలాగే మరో కథాసంపుటి 'మోహతిమిరం' కూడా కథకునిగా ఆయన స్థానాన్ని తెలుగు కథా ప్రపంచంలో చాటి చూపింది.

కథకునిగా ఆయన కథలు మానవ జీవన పార్శ్వాలను మహోన్నతంగా కనులముందు నిలుపుతాయి. శంకరాభరణం శంకరశాస్త్రిలా ధేనువకొండ శ్రీరామమూర్తి గారి 'ఆయతనమ్' కథలోని చయనులు ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర అనీ, తాను విశ్వసించిన సంస్కృతీ సంప్రదాయాలకు అంకితమైన చయనులు విశ్వనాథవారి ధర్మారావు కంటే ఉన్నతుడిగా గోచరిస్తాడు అనీ– కె.పి.అశోక్‌కుమార్ 'ఆయతనమ్' కథ ఒక్కటి చాలు కథకునిగా ధేనువకొండ శిఖర స్థాయిని తెల్పడానికి అని చెప్పడం అతిశయోక్తి అనలేము. ఆధునికత పేరుతో బ్రాహ్మణ కుటుంబాలలో విచ్ఛిన్నమవుతున్న సంప్రదాయరీతుల పట్ల ఆర్తి, ఆవేదన, సంస్కృతి సంప్రదాయాల పట్ల కథకుని వల్లమాలిన అపేక్ష 'ఆయతనమ్', 'యజ్ఞోపవీతం', 'జలయజ్ఞ సమిధలు' వంటి కథలలో కానవస్తుంది. 'క్రౌంచ వియోగం' కథలోని శేషయ్యతాత భోజన ప్రియత్వం 'మిథునం' సినిమాలోని బాలసుబ్రహ్మణ్యం పాత్రను తలపిస్తుంది. ధేనువకొండలోని తాత్త్విక, ఆధ్యాత్మిక చింతన– 'ముఖమల్ గులాబీ', 'దక్షిణ పొలం' వంటి కథల్లో తొంగి చూస్తుంది. నేటి కార్పొరేట్ రంగపు యువతీ యువకులు చదివి తీరాల్సిన కథ– 'డబ్ల్యు. డబ్ల్యు. డబ్ల్యు. డాట్‌కామ్'. అలాగే 'మోహతిమిరం' కథ చదివితే– వివాహేతర సంబంధాల వల్ల ఒనగూడే అనర్థాలు కనువిప్పు కలిగించేలా తెలుస్తాయి. ముందు చెప్పుకున్న డాక్టర్‌గా ఆయన చికిత్స చేసే 'సెరిబ్రల్ పాల్సీ' నేపథ్యంలోనే 'చిగురించిన శిశిరం' అనే అద్భుతమైన కథను రాశారు. వృత్తినీ, ప్రవృత్తినీ అందంగా ముడివేసిన కలంనైపుణి అది. సంగీతం పట్లగల ఆసక్తితో రాసిన కథేతివృత్తాలు కూడా కానవస్తాయి. ఆయన కథల్లో కవిత్వభాష వుంది. అందుకు మౌలికంగా ఆయన 'కవి భిషక్కు' కావడమే కారణం.

కవిగా ధేనువకొండ శ్రీరామమూర్తిగారు వెలువరించిన తొలి కవితా సంపుటి 'ఆశల సముద్రం'. అలాగే 'అమ్మ ఒడి' అనే దీర్ఘకవితా సంపుటి వెలువరించారు. స్వల్ప వ్యవధిలోనే రెట్టింపు ముద్రణలు పొందింది ఆ కావ్యం. అలాగే 'వల్మీకం', 'చింతయామి' కవితా సంపుటులు ప్రశంసలను ఉత్తాలంగా సమకూర్చి పెట్టాయి. ఎంపిక చేసిన కొన్ని కవితల ఆంగ్లానువాదాలతో 'సమ్ సైలెంట్ మెలోడీస్' అనే

సంపుటి వెలువడింది. హిందీ కవితల అనువాదంతోనూ ఒక గ్రంథం వెలువడింది. భోపాల్‌లో జరిగిన 'కవిభారతి' కార్యక్రమంలోనూ, కేంద్ర సాహిత్య అకాడమీయే 2014 లో నిర్వహించిన దక్షిణ భారతీయ భాషల కవితోత్సవంలోనూ తెలుగు కవిగా ధేనువకొండ శ్రీరామమూర్తి పాల్గొన్నారు. తన సేవాతత్పరతతో 'పాలపిట్ట' సాహిత్య పత్రికకు, స్పైడింగ్ లైట్స్ వంటిసంస్థ సేవాకృషికి బాసటగా నిల్చిన వదాన్యత వారిది.

ఈ కవిభిషక్కు కవిత్వంలో తనదైన విలక్షణతను ముద్రవేసుకున్నాడు. 'అమ్మఒడి' కావ్యం తమను కవిత్వ ప్రేమికులను చేసిందని ప్రకటించిన వారున్నారు. కవిగా తన సొంత గొంతుకను నిలుపుకుంటూ– అఖిల భారత సమ్మేళనాలకు బెంగుళూర్, గోవా, కొచ్చిన్, భోపాల్‌లకు తెలుగు కవిత్వ ప్రతినిధిగా కేంద్ర సాహిత్య అకాడమీ పంపున వెళ్లి ప్రశంసలందుకున్న వారాయన. 'చింతయామి' కవితా సంపుటికి నాలుగేండ్ల ఆయన మనుమడు 'అచ్యుత్' ముఖచిత్రాన్ని సంతరిచ్చి ఇచ్చాడు. కన్న తల్లినీ, ఉన్న ఊరునీ మరువని– మట్టి పరీమళం, ఒక సంప్రదాయభిజ్ఞతతో కూడిన తాత్త్విక చింతన ఆయన కవితల మూలాధారనాడి. 'జీవితంఒకటి జ్ఞాపకాలు అనేకం', 'పురాతన శబ్దమాలికలు', 'మా కశ్చిత్ దుఃఖమాగ్భవేత్', 'మాజిక్ రియాలిటీ', 'మృత్యుముఖం నవ్వుతోంది', 'విశ్వాత్మ', 'ఒక్కసారి కళ్ళు తెరు' వంటి కవితా ఖండికలు ఆయన కవితా గరిమకు అరచేతి కంకణాలు.

కనుల మూయకనే స్వప్నం.
స్నాప్షిక ట్రాన్స్‌లో
నడుస్తూ ఈదుకుంటూ ఎగురుకుంటూ
నెమ్మదిగా సాహసంగా అమాయకంగా
శాశ్వతంగా శిథిలమైన
జలసమాధిలోనే గ్రామాన్నీ
మునిగిపోయిన మనిషి జాడనూ వెతుక్కుంటున్నాను

– అంటారొకచోట.

ధేనువు తిరుగాడిన కొండ ధేనువకొండ అయింది. ఆ స్వచ్ఛత, పావనత హృదయంలో నిలుపుకుని సమాజహిత చింతనతో సేవాభావంతో జీవిక సాగించిన వారాయన. మానవ జీవితపు అనేక కోణాలను, అనేక పార్శ్వాలను చిత్రిస్తూ ఆయన రాసిన నవల 'స్నిగ్ధాయ'. అనేక అవరోధాలను ఎదుర్కొంటూనే– లక్ష్యాన్ని సాధించడానికి మొక్కవోని జీవిత ప్రస్థానాన్ని సాగించిన స్త్రీ పాత్ర రేవతి, విమానంలో

అమెరికా వెళుతూ తన జీవితాన్ని నాస్టాల్జియాగా మననం చేసుకోవడంతో మొదలయ్యే 'సిగ్ధాయ' నవల ఆద్యంతం ఆసక్తిగా చదివిస్తుంది. రచయిత తొలి నవలకు ఇచ్చే పదివేల రూపాయల నగదును 'అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు', 'స్నిగ్ధాయ' కు ప్రదానం చేసింది. 2015 ఏప్రిల్‌లో ఆవిష్కృతమైన 'స్నిగ్ధచ్ఛాయ' పాఠకుల, పత్రికల, విమర్శకుల ప్రశంసలను అందుకుంది. అలాగే గత సంవత్సరం నవ్య వారపత్రిక, లక్ష్మీనారాయణ జైని మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన నవలల పోటీలో డాక్టర్ ధేనువకొండ శ్రీరామమూర్తిగారి 'కామరూప' నవలకు ద్వితీయ బహుమతి లభించింది. ధారావాహికగా పాఠకులను ఆకట్టుకుంటూ ఉత్కంఠభరితంగా సాగిన నవల ఇది. సరోగసీ, ఐఫీ పద్ధతుల్లో సంతానప్రాప్తి పొందటం వంటి నవీన వైద్య అంశాల భిత్తికపై మానవజీవన పరిణామ విశ్లేషణను తాత్త్వికంగా చేయడం అందులో కానవస్తుంది. 'అతడి ధాతువును తన క్షేత్రంలో పోషించడం తప్పు కానప్పుడు అతన్ని కోరుకోవడంలో తప్పేంటి' అని నీలాంబరి పాత్ర తన మనసునిండా రామచంద్రుడిని నిలుపుకోవడం, ఆమె ఏం చేయబోయింది? అనే ఉత్కంఠతో సాగే ఈ నవలలో మరో ప్రధాన ఆలోచనాధార ఏమిటంటే– 'మానవాతీత శక్తుల్ని కొట్టిపారేయలేం. కానీ ఒక వైద్యుడు వైద్యపరంగా పరీక్షలు జరిపి, శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారణ చేసిన విషయాన్ని, ఎక్కడో దూరంగా ఒక పల్లెటూర్లో కూర్చున్న నరసింహం పంతులుగారు సిద్ధయోగమార్గం ద్వారా చెప్పగలిగారు. ఇదెలా సాధ్యమైంది? అదేవిధంగా వెంకట్రామన్ కూడా సియాన్స్ ప్రయోగం ద్వారా ఎక్కడో అపార్ట్‌మెంట్‌లో ఉరివేసుకుంటున్న వ్యక్తి ప్రాణాలు కాపాడాడు! ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి?' ఈ విషయాలన్నీ సంతరించుకున్న 'కామరూప' నవల– పాఠకులను పఠనాసక్తితో అలరింపజేసింది.

ధేనువకొండ శ్రీరామమూర్తి ధన్వంతరి జయంతి పాటించేవారు. ఆయుర్వేద వైద్యాన్నీ, సాహిత్యక్షేత్రంలో నవల, కథ, కవితా, వ్యాసరచనా సేద్యాన్ని ప్రతిభావంతంగా నిర్వర్తించిన సవ్యసాచి ఆయన. ఆయన మరణం వైద్యరంగానికే కాదు సాహిత్య ప్రపంచానికీ ఒక తీరని లోటు.

(ఆంధ్రభూమి దినపత్రిక, 4 సెప్టెంబర్ 2017)

❖

(50) తొలినాళ్ళ సాహిత్య జ్ఞాపకాల బాటలో...

హైదరాబాద్ నగరమే తీర్చిదిద్దిన జీవితం నాది. ఒకటోతరగతి నుంచి ఎం.ఫిల్. పోస్టు గ్రాడ్యుయేషన్ పరిశోధనావిద్య వరకూ అంతా ఇక్కడే. ఒక కవిగా, కార్టూనిస్టుగా, రచయితగా, విమర్శకునిగా, వక్తగా, పజిల్స్ నిర్మాతగా ఎలా ఎదిగాననుకున్నా– పెరిగిన వాతావరణం, ఏర్పడ్డ పరిచయాలు, పడిన ప్రభావాలు అవే కదా హేతువులు!

మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి చదువుతున్నప్పుడే పాఠశాల సాహిత్యసమితి వార్షికోత్సవానికి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి అధ్యక్షతన డా॥ దివాకర్ల వేంకటావధానిగారు వసుచరిత్రలో గిరిక బాల్యం గురించి చేసిన ఉపన్యాసం– పిల్లవాడిగా నన్నెంతో ఆకట్టుకుని, తెలుగుపట్ల మమకారం పెంచింది. పల్లా దుర్గయ్య ప్రభృతులు విన్పించిన కవితలు ఆ సభలోనే ఆకట్టుకున్నాయి. పదవ తరగతిలో వుండగనే మా నాన్నగారు అల్లంరాజు కామేశ్వరరావుగారు నా పుట్టినరోజు కానుకగా అందించిన డాక్టర్ సి.నారాయణరెడ్డిగారి 'ఋతుచక్రం' కావ్యం నన్ను అలరించి, పఠనానందం అందించిన పుస్తకం. ఇక తొలి సాహితీప్రముఖునితో పరిచయం అంటే కుందుర్తి ఆంజనేయులుగారే! వచనకవితా పితామహుడు అన్పించుకున్న ఆయన– సమాచార శాఖలో పనిచేస్తూ, మేం నివసించే మలక్‌పేట కాలనీ క్వార్టర్స్‌లోనే యం.యస్. 19 లో వుండేవారు. మేం యం.సి. 270 లోనూ ఆ తర్వాత యం.యస్. 86 లోనూ నివసించేం.

హెచ్.ఎస్.సి. పాసయ్యాక వివేకవర్ధిని కళాశాలలో పి.యు.సి.లో చేరాను. ఒకేసారి ఆంగ్ల మాధ్యమంలోకి బదిలీతో– కళాశాలలో, నిడదవోలు సర్వేశ్వరరావుగారి తెలుగుక్లాస్ తప్ప, మిగతా అంతా బిక్కుబిక్కుమన్నట్లుండేది. సైన్స్, లెక్కలు లేని విద్య చదువుతానని హఠం వేసి, చివరకు ఆంధ్ర సారస్వతపరిషత్ ప్రాచ్య కళాశాలలో

డిప్లమో ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్‌లో చేరిపోయాను. అప్పుదక్కడ సరిపల్లె విశ్వనాథ శాస్త్రిగారు ప్రిన్సిపాల్. పరిషత్ అధ్యక్షులు దేవులపల్లి రామానుజరావుగారు, మాది సాయంకళాశాల కనుక, సాయంత్రం కాలనీలో బస్సెక్కి వెళ్ళేవాడిని. కోఠీలో దిగి సుల్తాన్ బజార్ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం మీదుగా నడచుకుంటూ, రాయల్ టాకీస్ ఎదురుగా ఉన్న 'చుక్కాని' పక్షపత్రిక ఆఫీసు మీదుగా తిలక్‌రోడ్‌లోని మా కాలేజీకి వెళ్ళేవాడిని. కాలనీ బస్సుస్టాండ్– కుందుర్తిగారి ఇంటి ఎదురుగానే వుండేది. ఆయన ఇంటివసారా ఎత్తుఅరుగుమీద కూర్చుని కనబడేవారు. తరచూ పిలిచి పలకరించేవారు. నేను ప్రాచ్యవిద్య చదువుతున్నానని తెలిసి– అలా ఒకసారి పిలిచి 'చిత్రప్రకృతి' అనే కావ్యం ఒకటి నా చేతికిచ్చి, దీనిని చదివి సమీక్ష రాయమన్నారు. నేను చేసిన తొట్టతొలి పుస్తకసమీక్ష అదే. కుందుర్తిగారు సంపాదక బాధ్యతలు వహిస్తున్న 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికలో దాన్ని నవంబర్ 1970 సంచికలో ఆయనే ప్రచురించారు. అప్పటికే అయిదేళ్ళుగా కార్టూనిస్టుగా, కవిగా నా ఎదుగుదలనూ, కవిసమ్మేళనాలు కొన్నింటిలో వారితోబాటు యువకవిగా పాల్గొని ప్రశంసలు అందుకుంటూండడం సన్నిహితంగా గమనించే– నన్ను సమీక్షకుని స్థాయికి పెంచారు కుందుర్తిగారు.

స్కూల్లో చదువుతున్న రోజుల్లోనే 'బాలబంధు' పిల్లల పక్షపత్రికలో 1 డిసెంబరు 1965 లో అచ్చులో మొదటిసారిగా నా పేరు చూసుకున్నాను. అది ఒక కథ. ఆ తర్వాత బాలబంధులోనే 1965 ఏప్రిల్ 15 సంచికలో 'పానుగంటి విశిష్టత' అని నేను రాసిన మొట్టమొదటి వ్యాసం అచ్చయింది. ఇక కవిత్వం విషయానికి వస్తే 1967 అక్టోబర్ 17 న నవ్య సాహితీ సమితి– వై.యం.సి.ఎ. నారాయణగూడలో నిర్వహించిన రచయితల సమావేశంలో 'నే రాస్తా' అంటూ నేను చదివిన కవిత 'నవ్యవాణి' మాసపత్రిక ఫిబ్రవరి 1968 సంచికలో అచ్చయిన తొలి కవిత. తెన్నేటి హేమలత సంపాదకత్వంలో విజయవాడ నుండి అప్పట్లో వెలువడిన 'లత' మాసపత్రిక జనవరి 1968 సంచికలో నేను గీసిన మొదటి కార్టూన్ అచ్చయింది.

ఇవన్నీ నా అసలు పేరు అల్లంరాజు వెంకటరావుగా వచ్చినవే. 1967 మే నెలలో 'యువమిత్ర' అనే లిఖిత మాసపత్రికను ప్రారంభిస్తూ సంపాదకునిగా 'సుధామ' అనే కలంపేరు ఏర్పరుచుకుని, అది మొదలు నా రచనలన్నీ ఆ పేరునే సాగించాను. 'ప్రతిభ' అనే వారపత్రికలో 'పాడిందే పాట' అనే స్ట్రిప్ కార్టూన్లు, 'కనీస కోర్కెలు' అనే కవిత సుధామ పేరుతో వెలువడిన తొలి రచనలు. 1967లోనే యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థతో పరిచయం ఏర్పడింది. కాళోజీ నారాయణరావు, ఇరివెంటి

కృష్ణమూర్తి, వంగపల్లి విశ్వనాథంగార్లతో అనుబంధం ఏర్పడింది. యువభారతి సభ్యుడిగా నాడు చేరిన నేను, నేటికి– సహాయ కార్యదర్శి, ఉపాధ్యక్షుల పదవులనుంచి ఎదిగి, నేడు యువభారతి ప్రచురణల ప్రధాన సంపాదకుడిని అయ్యాను. ఆ రోజుల్లో సాహితీసంస్థ అంటే యువభారతికే మంచి పేరు. 'లహరి' సమావేశాల ద్వారా ఎంతో ప్రాచుర్యం. 'మహతి' ప్రచురణతో ప్రసిద్ధం. సంస్థతో మమేకమై ఎందరో ప్రముఖుల పరిచయాలు లభించాయి. అలాగే మరోవంక ప్రాచ్య కళాశాలలో శ్రీ కె.కె.రంగనాథాచార్యులు గారు ప్రిన్సిపాల్‌గా వారి ప్రోత్సాహంతో అభ్యుదయ పథగాములం కాగలిగాం. యువభారతి సమ్యక్‌దృష్టిని అలవర్చింది. కె.శివారెడ్డి, సుధామ, గులాం యాసీన్, గంధం జోయల్ మేమంతా యువకవులుగా నాడు బహుధా చెలామణీ!

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థిరచయితల సంఘం 1970 లో ఏర్పడినప్పుడు నేను సహాయ కార్యదర్శిని. శ్రీ శశాంక, వేలూరి సహజానంద, దివాకర్ల, బోయి భీమన్న ప్రభృతుల సమాదరణ తద్వారా లభించింది. అలాగే 1969 లో చంద్రునిపై మానవుడు కాలూనిన సందర్భంలో– ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిర్వహించిన 'చందమామ' కవి సమ్మేళనంలో, దేవులపల్లి రామానుజరావుగారి అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనంలో– నే చదివిన కవితతో ప్రాచుర్యం లభించింది. యువభారతి సభ్యుల కవితా సంకలనంగా 1968 లో 'వీచికలు' వెలువడి ఆ నలుగురు కవులలో ఒకడిగా, ఆ సంకలనం ముఖచిత్రకారుడిగా– 'కవితలో బొమ్మ గీస్తాడు, బొమ్మలో కవిత రాస్తాడు' అని డాక్టర్ సి.నారాయణరెడ్డిగారితో సభలో కవిగా, చిత్రకారునిగా ప్రశంసలందుకోవడం, ఆ తరువాత యువమిత్ర లిఖితపత్రికను ప్రశంసిస్తూ 'నేటి ముద్రితపత్రికలు ముఖం చూసుకోదగిన అద్దం' అంటూ 'శేముషి+కృషి= సుధామ' అనడం సినారె గారికి నాపై ఏర్పడిన తొలిప్రేముడి సంకేతాలు.

అలాగే పోతుకూచి సాంబశివరావుగారితో 'విశ్వరచన' పత్రిక ద్వారా ప్రోత్సాహం లభించింది. వారు మా నాన్నగారి బాల్యస్నేహితులు కూడాను. పోతుకూచి వారి ఆధ్వర్యంలోనే అయిదవ అఖిలభారత రచయితల మహాసభలు జరిగినప్పుడు వెలువడిన సావనీర్‌లో 'కొంతమంది విద్యార్థికవులు' అని శశాంక వ్యాసం రాస్తూ మొదటగా పేర్కొన్నది సుధామనే. 'సుధామ ఇవాళ విద్యార్థిగా వుండి కవిత్వం రాస్తున్నాడు కనుక విద్యార్థికవి అని కర్మధారయసమాసం చేసి చెప్పవలసి వస్తోంది

గానీ, కవిత్వగుణాన్ని బట్టి చూస్తే నేడో రేపో ఇతను మహాకవుల లిస్టులో చేరకపోడు' అన్నారాయన. కళాశాల నుండి రేడియో ప్రోగ్రాంకు వెళ్ళినప్పుడు ఆకాశవాణితో ఏర్పడిన అనుబంధం– వేలూరి సహజానందగారి ప్రోత్సాహంతో అక్కడ ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా చేయడం, జాతీయ కవి సమ్మేళనం తెలుగు అనువాదకునిగా పాల్గొనడం నుండి 1978 లో అక్కడ ఉద్యోగిగా చేరేంతవరకూ ప్రయాణం చేసింది.

ప్రాచ్యకళాశాలలో ఎం.ఓ.ఎల్. చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఎం.ఏ.లో 1974 లో చేరడంతో దివాకర్ల, బిరుదురాజు రామరాజు, సినారె, నాయని కృష్ణకుమారి, పల్లా దుర్గయ్య, జి.వి.సుబ్రహ్మణ్యం, రవ్వా శ్రీహరి వంటి ప్రముఖుల శిష్యుడయ్యే భాగ్యం, నేరుగా వారి పాఠాలు వినే అదృష్టం లభించాయి. వై.యం.సి.ఏ. వక్తృత్వ సాహిత్య సమితి, తారక ఆర్ట్‌నైజర్స్, మిత్ర సాహితి సంస్థలతో బాటు, ఏ.జీ.ఆఫీస్ రంజనితో కూడా సాహిత్య సంబంధాలు ఏర్పడ్డాయి. రంజని–కుందుర్తి అవార్డులకు న్యాయనిర్ణేతగా పలుమార్లు వ్యవహరించడం, ఆరుద్ర చేతుల మీదుగా జ్ఞాపిక తీసుకోవడం మరువలేనిది. విద్యార్థిగా వుండగానే కేంద్ర సాహిత్య అకాడమీ దేవులపల్లి రామానుజరావుగారి సంపాదకత్వంలో వెలువరించిన స్వాతంత్ర్యానంతర తెలుగుకవిత 'కావ్యమాల'లో నేను రాసిన కవిత 'ఈ దీపం వెలుగదు జ్వలిస్తుంది' చోటు చేసుకోవడం ఓ మధురఘట్టం. 1975–1977 లో కరీంనగర్‌లో బిషప్ సాల్మన్ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న రోజుల్లో అంపశయ్య నవీన్, వడ్డేపల్లి కృష్ణ ప్రభృతుల సాన్నిహిత్యం, విశాలాంధ్రలో పుస్తక సమీక్షలు, కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో విశ్వనాథ సాహిత్యపీఠం నెలకొల్పుతూ కళాశాల ప్రిన్సిపాల్ కె.వై.ఎల్. నరసింహారావుగారు నాతో శ్రీశ్రీపై ప్రసంగం ఏర్పాటు చేయడం మరపురాని మధురస్మృతి.

1978 లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా ఉద్యోగంలో చేరాను. ఉస్మానియాలో ఎం.ఫిల్. చేస్తున్న నేను 1982 లో 'అభ్యుదయ తెలుగు కవిత్వంలో భావచిత్రాలు' అనే అంశంపై పరిశోధన చేసి ఎం.ఫిల్. పట్టభద్రుడ నయ్యాను. 1983 జనవరిలో ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనంలో పాల్గొన్న తొలి ఆకాశవాణిఉద్యోగిగా జాతీయ కవి సమ్మేళనంలో తెలుగుకవిగా ఎంపికై పాల్గొన్నాను. నా కవిత అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమై ప్రసారమయింది. 1982 లోనే దుందుభి ఉగాదికి మహాకవి శ్రీశ్రీతో వివిధభారతి జనరంజని కార్యక్రమానికై నేను చేసిన గంటన్నర పరిచయ కార్యక్రమం ఒక చారిత్రక సందర్భమే నాకు. ఆ ఇంటర్వ్యూ

పూర్తి పాఠం వి.ర.సం. ప్రచురించిన 'శ్రీశ్రీ ప్ర.జ' సంపుటిలో వుంది. ఆకాశవాణి ద్వారా ఎందరో సాహితీప్రముఖుల పరిచయాలూ, దాశరథి, శేషేంద్ర, జ్వాలాముఖి, నగ్నముని, నిఖిలేశ్వర్ వంటి పెద్దల సన్నిహితత్వం లభించాయి.

1990 లో ఆకాశవాణిలో కార్యక్రమనిర్వహణ అధికారిగా పదోన్నతి పొంది విజయవాడ, హైదరాబాద్, వరంగల్ కేంద్రాలలో తెలుగుశాఖ కార్యక్రమాలు నిర్వహించి 2008 లో ఆకాశవాణి హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం కార్యక్రమ నిర్వహణాధికారిగా స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేయడం జరిగింది. యువభారతి, ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆకాశవాణి నాలుగు మూలస్తంభాలుగా రూపొందిన 'సుధామ(ం)' తొలినాళ్ళ సాహిత్య జ్ఞాపకాలివి. పంచుకునే సందర్భం కల్పించిన 'రంజని'కి అభివందనాలు.

('రంజని' దసరా దీపావళి సంచిక, 2017)

❖

(51) నానా రుచిరార్థ రుబాయీ పరమ కవీశ్వరుడు

నలభై నాలుగేళ్ళ క్రితం 1973 లో ఆకాశవాణి స్వాతంత్ర్య దినోత్సవ కవి సమ్మేళనాన్ని ఆహూతుల సమక్షంలో రవీంద్రభారతిలో ఆగస్టు మాసంలో నిర్వహించి నప్పుడు వేదిక మీద నుంచి–

కళ్లెం ఉన్నది మన చేతిలో
గుర్రం మాత్రం పడె గోతిలో
దప్పి తీరదని నేనంటాను
నీళ్ళే లేని మన నూతిలో

అని మహాకవి దాశరథి చదవగానే రవీంద్రభారతి అంతా కరతాళ ధ్వనులతో మారుమ్రోగిపోయింది. ఉరుదూ, ఫారసీ భాషలకు చెందిన ఛందానికి– కవి తన అమృతహస్తాలతో తెలుగుదనమిచ్చిన సందర్భం అది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుడు రాష్ట్రపతి పాలనలో ఉంది. 1973 జనవరి 10 వరకు శ్రీ పి.వి. నరసింహారావు ముఖ్యమంత్రిగా వున్నారు. 'జై ఆంధ్రా' ఉద్యమ తీవ్రత నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ననుసరించి కేంద్రం జనవరి 11 నుంచి మొట్టమొదటిసారి రాష్ట్రపతిపాలన విధించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపతి పాలనలో 1973 డిసెంబర్ 10 వరకు ఉండింది. ఆపై జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన హయాంలోనే 1977 ఆగస్టులో దాశరథి ఆస్థానకవిగా నియమితులై– శ్రీ మర్రి చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి తదనంతరం ముఖ్యమంత్రులయినా– ఆస్థాన కవిగా కొనసాగి, 1983 జనవరిలో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయి ఆస్థానకవి పదవిని రద్దు చేసే వరకూ ఆ గౌరవపీఠంపై తేజరిల్లారు. రాష్ట్రపతిపాలన వున్న దశలో కవిగా వ్యంగ్యవైభవంతోనూ, కవితల్లో ధ్వనితోనూ దాశరథి తెలుగులో శ్రీకారం

చుట్టిన కవితాభివ్యక్తి నవ్యరూపం రుబాయీ. దాశరథి రంగప్రవేశం చేయించిన రుబాయీని-రంగరంగ వైభవంతో విస్తరింపచేసి ఒక విరాడ్రూపం ఇచ్చింది డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు గారు.

ఒకనాటి సాయంసంధ్యా సమయంలో హుసేన్‌సాగర్ తీరంలో విహరిస్తూ దాశరథిగారు శ్రీనివాసాచార్యులుగారి కోరిక మేరకు రుబాయీలను వినిపించి, స్థూలంగా వాటి రచనావిధానాన్ని తెలిపారు. అలా రుబాయీ కవితాభివ్యక్తి మంత్రోపదేశంలా పొందిన ఆచార్యులవారు తెలుగువారి గుండెల్లో 'రుబాయీల కవిసమ్రాట్'గా పదిలమైన తావును సంపాదించుకున్నారు. సాహితీసుధానిధిగా నేటికి ఇరవై సంకలనాలు రుబాయీ ప్రక్రియలోనే వెలువరించి, వేలాది రుబాయీలు రాసిన ఏకైక తెలుగుకవిగా సాహిత్య చరిత్రలో నమోదవుతున్నారు.

నిజానికి పదకొండవ శతాబ్దంలో ప్రభవిల్లి నీతి గణిత వేదాంత శాస్త్రాదులలో తన పాండితీగరిమతో ఖ్యాతి నార్జించిన ఉమర్‌ఖయ్యాం తన కవితలన్నీ రుబాయీలుగా అందించాడు. ఫ్రిట్జ్ జిలార్డ్ అనే ఆంగ్లేయుడు వాటిని ఇంగ్లీషులోకి అనువదించి, ఫారసీ రానివారికి మహోపకారం చేసిన వాడయ్యాడు. ఆ ఆంగ్లానువాదాల ఆధారంగా తెలుగులో- ఉమర్ అలీషా, రాయప్రోలు, ఆదిభట్ల నారాయణదాసు, దువ్వూరి, కరుణశ్రీ, బూర్గుల, మడిపడగ బలరామాచార్య వంటివారు పద్య వృత్తాలలో వాటి భావాలను పొదిగారు. దువ్వూరి మూలాభిధేయంగా అనువదించి పేరొందినా, ఉర్దూ ఫారసీలలో ప్రచురమైన రుబాయీ ప్రక్రియను తెలుగులోకి దాశరథి అవతరింప జేయగా, జంటనగరాల ప్రముఖ సాహితీసంస్థ యువభారతికి ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తూ- అప్పటికే కవిగా, విమర్శకునిగా, తెలుగులో గేయనాటికలపై సిద్ధాంత వ్యాసంతో డాక్టరేట్ పొందిన విద్వాంసులుగా వన్నెకెక్కిన తిరుమల శ్రీనివాసాచార్యులు గారు- తాము రాస్తూ, కవి సమ్మేళనాలలో పఠించి శ్రోతలను అలరింపజేస్తూ వచ్చిన తన రుబాయీలను ముక్తక మంజరి అంటూ 'తెలుగు రుబాయీలు' గ్రంథంగా నవంబర్ 1988 లో గ్రంథస్థం చేశారు. యువభారతి 124 వ ప్రచురణగా వారి రుబాయీల తొలిగ్రంథం వెలువడింది.

నిజానికి రుబాయీ అరబ్బీ భాషా పదం. రుబా అంటే ఏదైనా ఒక వస్తువుకు సంబంధించిన నాలుగవభాగం అని అరబ్బీలో అర్థం. రుబాయీ అంటే శబ్దార్థం నాలుగు భాగాలు. అంటే మన పరిభాషలో నాలుగు పాదాలు, లేక చరణాలు కలిగి వుండటం. అలా నాలుగు పాదాల మాత్రా గేయం 'రుబాయీ' సంకేతాన్ని పొందిందను

కోవచ్చు. కానీ రుబాయీ ప్రక్రియకూ అరబ్బీ భాషకూ ఏమీ సంబంధం లేదనీ, ఫారసీలో రుబాయి ప్రక్రియ వికసించిన తరువాతే, అరబ్బీ సాహిత్యంలో కూడా రుబాయీలూ వెలువడ్డాయనీ యువభారతి అధ్యక్షులైన కీ॥శే॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు విశదీకరించడం గుర్తుంది.

రుబాయీ సమాన మాత్రలుగల నాలుగు 'మిస్రా'లతో లేక రెండు 'షేర్ల'తో రూపొందేది. ఈ నాలుగు మిస్రాలు (పాదాలు) సమతూకంతో వుంటాయి. నాలుగు మిస్రాలలో మూడవమిస్రాకు ప్రాస అనవసరం గానీ, మిగతావాటికి 'ఖాఫియా' అనగా అంత్యప్రాస అనివార్యం. కేవలం అంత్యప్రాసలు పెట్టి నాలుగు పాదాలతో నడిపిస్తే చాలదు. ఛందోనియతి పాటిస్తూనే– ఏ రసాన్నయినా, ఏ భావాన్నయినా, ఎంతటి చక్కటి విషయాన్నయినా అలతి అలతి మాటల్లో పరిమళింప చేయగలగడం రుబాయీ ప్రత్యేకత. తిరుమల శ్రీనివాసాచార్యులుగారు– ఇరివెంటి వారు మొదట్లోనే అన్నట్లు 'అతి ప్రాచురమైన శబ్ద జాలాన్ని, వినపడగానే మనసుకెక్కే వాక్య విన్యాసాన్ని, భావచమత్కార పేశలతనూ, సమున్నత భాష ప్రసరణాన్ని ఈ రుబాయీలలో ప్రదర్శించ గలిగినారు'.

సమమాత్రలతో సాగే నాలుగుపాదాల రుబాయీ ఛందాన్ని 'మాట్లాడితే రుబాయి' అన్నంత శ్వాసగా చేసుకుని, ఆచార్యులువారు మూడు దశాబ్దాలకు పైగా ఈ ప్రక్రియలో వేలాది రుబాయీలను– కొన్ని సందర్భాలలో కొన్నింటిని మాత్రలను పెంచి, తగ్గించి, లయకూ– తూగుకూ– తూకానికీ భంగం కలుగని విధంగా– స్వచ్ఛందంగా రాస్తూ, మూడవ పాదంలో కూడా కొన్నింటిలో అంత్యప్రాసను సంతరిస్తూ, కొన్ని మార్పులను భావాభివ్యక్తి కనుకూలంగా స్వతంత్రించి చేస్తూ, నవనవోన్మేషంగా భాసింప చేశారు.

'పరిణతవాణి' ప్రసంగంలో ఆచార్యులవారే పేర్కొన్నట్లు–

ఎన్ని పూలు పూచిందో చెట్టుకేమి గుర్తు
ఎన్ని నీళ్ళు పారినవో ఏటికేమి గుర్తు
వేదనతో వ్రాస్తూనే పోతున్నది కానీ
ఎన్ని కృతులు కూర్చినదో ఎడదకేమి గుర్తు

1988 లో 'తెలుగు రుబాయిలు' గ్రంథంతో మొదలుపెట్టి ఇంతవరకూ రుబాయిలలోనే అనేక కృతులు వెలయించిన తిరుమల శ్రీనివాసాచార్యులుగారు పాతిక

సంవత్సరాల కాలంలో వెలయించిన ఎనిమిది రుబాయీసంపుటాల వైవిధ్యాన్నీ వైశిష్ట్యాన్నీ ఈ వ్యాసంలో పరామర్శించే ప్రయత్నం చేస్తున్నాను. ఇది ఒక విహంగ వీక్షణం మాత్రమే.

ఆచార్యులవారి తొలుతటి రుబాయీలు– స్వభావరీత్యా సాంఘిక జీవనానికి సంబంధించినవిగా రూపెత్తాయి. లలిత శృంగార పోషకంగానే మొదట్లో కానవచ్చే ఈ ప్రక్రియలో– సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, విద్యా, కళారంగాల వర్తమాన సామాజిక సమస్యలకు స్పందించి రాసే వ్యాఖ్యలుగా రుబాయీలను వెలార్చారు ఆయన. అందుకే సూక్తులు, నిర్వచనాలు, నినాదాలు, ప్రశంసలు, ప్రశ్నలు, ప్రహేళికలు, వ్యంగ్యోక్తులు, వ్యాజోక్తులు, పరిహాసోక్తులు ఇలా సామాజిక సంసక్తిని శక్తిగా కూర్చే నేర్పును వెలార్చారు. వారి అధ్యయనం, హృదయస్పందనం, పాండిత్యం, వచోవిన్యాసం, ఛందఃసౌందర్య ప్రదర్శన ఈ రుబాయీల్లో తొంగి చూస్తాయి. తన తొలిసంపుటిని సర్దార్‌పటేల్ కళాశాలలోని సహ ఉపన్యాసకులు, ఆర్థికశాస్త్ర ఉపన్యాసకులు సాయం బసవలింగప్పగారికి అంకితం ఇచ్చారు.

తొలిసంపుటి 'తెలుగు రుబాయీలు' లోని తొలి రుబాయీ ఇలా సాక్షాత్కరిస్తుంది.

పొదిగాను హిమగిరులను నా హృదిలో
అదిమాను జలనిధులను నా హృదిలో
నదులన్నీ నా నరాల పారుతుండగా
నిలిపాను విశ్వాన్నే నా గదిలో

నిజంగానే వారి వేలాది రుబాయీల్లో విశ్వదర్శనం చేయించగలిగారందుకే–

చలికాలం వచ్చిందని రగ్గు కొనేశాను
చలికాగక కాశ్మీరు శాల్వ కొనేశాను
పెళ్ళయి నా ప్రియభామిని దరిచేరగానే
రగ్గూ శాల్వా బైటకు విసిరేశాను

అని లలిత శృంగారపోషకంగా ప్రయోగించే ప్రతిభవున్నా, తొలి సంపుటిలోని మొత్తం మూడువందల ఇరవై రుబాయీలలో ఇటువంటివి ఓ పదికిమించి లేనేలేవు. అంటే ఆచార్యులవారి ప్రధాన దృక్పథం సమాజహిత చింతనే అన్నది యథార్థం. మానవీయవిలువలకు పట్టం కడుతూ, సాహిత్యాన్ని సాత్త్విక సాధనంగా ప్రయుక్తం

చేసిన బాధ్యతాయుతమైన కవిగా రుబాయీలు చేపట్టిన వాడాయన. అందుకే స్మరణీయులైన మనీషీ వతంసుల ప్రశస్తి, దేశభక్తి, కళాసౌందర్య తృష్ణ, అవ్యవస్థ తీరులపై అధిక్షేపం, హాస్యం అన్నీ ఆయన రుబాయీల సామగ్రి అయ్యాయి.

మీ ఉదయం మాకు వ్యాసపూర్ణిమ
మీ హృదయం సంస్కృతాంధ్ర మధురిమ
మీ వదనమే ఒక భారతి అవధానీ
ఒలికించెను నవరసాత్త భంగిమ

అని ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారినీ–

ఆర్ద్రతకొక సింధువు నీ నిర్మల చిత్తం
కన్నీటికి బంధువు నీ జీవన వృత్తం
విశ్వానికి వినిపించిన 'నా గొడవ'లో
మహాకవీ! మానవత్వమితివృత్తం

అని కాళోజీనీ, అలాగే పలు రుబాయీల ద్వారా అన్నమయ్యాది పదకర్తలనూ, శ్రీనాథుడు, పోతన, నన్నయాదులను, విశ్వనాథ, శ్రీశ్రీ, వేటూరి ప్రభాకరశాస్త్రి, సురవరం, శివశంకర స్వామి, వానమామలై వరదాచార్యులు, కుందుర్తి, ఖండవల్లి లక్ష్మీరంజనం, దాశరథి, బోయి భీమన్న, దేవుపల్లి రామానుజరావు, సి.నారాయణరెడ్డి, ఉత్పల సత్యనారాయణాచార్యులు, ఆరుద్ర, శేషేంద్ర, జి.వి.సుబ్రహ్మణ్యం, జె. బాపురెడ్డి వంటి సాహితీమూర్తుల ప్రశంసా రుబాయీలు ఈ సంపుటిలో ప్రధానంగా వున్నాయి. ప్రాచీన, ఆధునిక సాహిత్య సంప్రదాయాలన్నీ సమాదరణీయాలే అంటూ ఆచార్యుల వారు–

మిఠాయిలు ఏవైనా చక్కెర ఒకటే
యంత్రాలు ఏవైనా విద్యుత్తొకటే
ఛందస్సులు ఏవైనా కవిత్వమొకటే
కవుల దారులేవైనా గమ్యం ఒకటే– అని తీర్పరించారు.

'తెలుగు రుబాయీలు' గ్రంథం ప్రచురించిన యువభారతిని గ్రంథాంతంలో ఇలా ప్రశంసించారు.

పారిజాత పరిమళాలు పంచే సత్కీర్తి
మల్లెపూల తావులు వెదజల్లే విస్ఫూర్తి

పాలాశ ప్రసవాగ్ని ద్యుతులు చిమ్ముతుంది
పాతకొత్త లెరుగుదులే 'యువభారతి' స్ఫూర్తి.

శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యగారి రెండవ రుబాయీ సంపుటి 'దీపాల చూపులు' సుదర్శనం ప్రచురణలుగా (అయిదేళ్ళ తరువాత 1993 లో నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుగారికి అంకితంగా వెలువడింది) 2017 లో దీని ద్వితీయముద్రణ వెలువడడం ఈ సంపుటి పాఠకసమాదరణకు తార్కాణం.

"వస్తువు వైవిధ్య విలసితం, అభివ్యక్తి చమత్కార భరితం, ఇక రక్తి కట్టకేమవు తుంది" అంటూ సినారె అభినందన అందుకున్న ఈ సంపుటి– 'ఈ తరం తరానా' అని ఆరుద్ర ప్రశంసలనూ అందుకుంది. 'ఈ దీపాల చూపుల్లోని కొన్ని 'మిస్రాలు' మనస్సులోని తమిస్రాలను దూరం చేస్తాయి. కొన్ని 'ఖాఫియా'లలో రాజకీయ మాఫియాల గుట్టురట్టు చేస్తాయి' అంటూ సంపుటిలోని రుబాయీల సారాన్ని తన అభినందనాక్షరాల్లో ఆరుద్ర ప్రసారాన్ని చేయటం చూడగలం. సాధుగీతులు, సాదారీతులు, సీదా కవితలు అని ఈ రుబాయీలను ఆరుద్ర పేర్కొన్నారు. 'వేమన్నకు ఆటవెలదిలా ఆచార్యులవారికి తెలుగురుబాయీ సొంతగొంతుక పలికే సహజ కవిత అయిపోయింది' అని జి.వి.ఎస్.గారు 'మనసుతో మననం చేసుకునే మానవ జీవిత గీతం– శ్రీనివాస రుబాయీల చాటూక్తి సంగీతం' అని కొనియాడారు. ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య 'దీపాల కాంతులు' పేర ఈ రెండవ సంపుటికి సంతరించిన మున్నుడి ఒక గొప్ప విశ్లేషణాత్మక యోగ్యతాపత్రం. 'భావన, విశ్లేషణ తదభివ్యక్తితో సమంగా ఛందఃపరంగానూ శ్రీనివాసాచార్యులుగారి చేయి తిరిగిన దశని ఈ సంకలనం అడుగడుగునా వ్యక్తీకరించింది' అని అభినందించారు ఆయన. స్వాతంత్ర్యానంతరం సంభవించిన మార్పును ఇలా ఎత్తిపొడిచారు కవిగా శ్రీనివాసాచార్యులు–

ఒక బుద్ధుడు ఏడ్చాడు జనమంతా నవ్వారు
ఒక గాంధీ ఏడ్చాడు ప్రజలంతా నవ్వారు
స్వాతంత్ర్యం వచ్చింది తారుమారు అయ్యింది
ప్రజలంతా ఏడ్చారు– నాయకులే నవ్వారు

ఈ సంకలనంలో గతానికీ వర్తమానానికి గల భేదాన్ని పట్టి చూపే రుబాయీలు ఎక్కువగా వున్నాయి. అదే సమయంలో భవిష్యత్ జీవనవికాసానికి అందించే సందేశాలూ వున్నాయి.

దైనందిన హింసాత్మక ఘటనల పట్ల ఆర్తి చెందుతూ, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాల్లోని పోకడల పట్ల అసహనత ప్రకటించారు.

ప్రతికంఠం రక్తమే ముట్టలేను నేను
వార్త నిండ నెత్తురే వినజాలను నేను
కలర్ టీవీ తెచ్చాను రంగులన్ని ఏవి
టీవీ నిండ నెత్తురే చూడలేను నేను

పండితులకు కావాలి శబ్దం అర్థం
భక్త తతికి కావాలి భగవత్తీర్థం
దేశచరిత్ర పుటలలో వెలగాలంటే
నాయకులకు కావాలి అతి నిస్వార్థం

అని సందేశించిన 'దీపాల చూపులు' 1996 లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి 'ఉత్తమ కవితా పురస్కారాన్ని' అందుకుంది. ద్వితీయ రుబాయీ సంపుటి అద్వితీయంగా పునర్ముద్రణకు నోచుకుంది. ఇదొక కీర్తిపతాకం. ఈ సంకలనంలో హైదరాబాద్ నగరవైశిష్ట్యాన్ని, ముఖ్యంగా రాజకీయ అంశాలనీ స్పృశించడం చూస్తాం.

ఇది హైదరాబాద్ ఇది హైదరాబాద్
ఇది భిన్న సంస్కృతులు ఎదిగి పూచిన పాదు

అన్న సినారె మాటే ఆచార్యులవారి ఓ రుబాయీగా రూపెత్తింది–

దక్షిణాన్ని ఉత్తరాన్ని కలిపినట్టి నగరం ఇది
బహుభాషలు బహుమతులు కలిసినట్టి నగరం ఇది
పలు రకాల సంస్కృతులను పిలిచిందీ హైదరాబాద్
దేశానికి నాభి వోలె నిలబెట్టినట్టి నగరం ఇది

భాష జ్వాల వంటిది మరి– ఇళ్ళు తగులబెట్టకు
భాష సుత్తి వంటిది మరి– నెత్తి పగులగొట్టకు
భాష మల్లె వంటిది మరి– నేల కాలరాయకు
భాష తల్లి వంటిది మరి– ద్రోహం తలపెట్టకు

అని భాష గురించి చెబుతారు.

తుపాకీల హతం చేసి కృపాకీల వెలిగించమని దాశరథిగారన్నట్లుగానే–

గన్ను పట్టుకుంటేనే విప్లవమా?
గళం చించుకుంటేనే విప్లవమా?
ఓ మనిషీ! చందనమై ముందుకురా
విషం కక్కుతుంటేనే విప్లవమా?

తుపాకితో భయపెట్టకు జనాన్ని
తుచ్ఛులతో జమ కట్టకు జనాన్ని
జనమంటే ప్రభంజనం జాగ్రత్త!
భీరులుగా తలపెట్టకు జనాన్ని

అని హెచ్చరిస్తారు.

'దీపాల చూపులు' తర్వాత తిరుమల శ్రీనివాసాచార్యులుగారి మూడవ రుబాయీ కవితాసంపుటిగా 'రవ్వల పతాక' 1999 జనవరిలో అంటే రెండవ సంపుటం వెలువడిన ఆరేళ్లకు– సుదర్శనం ప్రచురణగా, ఆచార్య సినారెగారికి అంకితంగా వెలువడింది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు రవ్వల పతాకకు పీఠిక సంతరిస్తూ తిరుమల వారిని 'రుబాయీల వేమన' అన్నారు. సహజోక్తిని చమత్కారంతో ప్రౌఢంగా వ్యంగ్యోక్తిగా, శ్లేషోక్తిగా మార్చడం ఆచార్యులవారి కవితాశిల్పం అన్నారు. ఆయనే అన్నట్లు 'రవ్వల పతాక' పేరు రవ్వలాగా కుదిరింది. ఒక్కొక్క రుబాయీ ఒక్కొక్క రవ్వ. విలువకు రత్నం. వెలుగుకు నిప్పురవ్వ. కాంతితో జిగేలుమనిపిస్తుంది. తాకితే చురుక్కుమనిపిస్తుంది. 'పతాక' ఎత్తుగా ఎగిరే జెండా. రుబాయీ ప్రక్రియలో రవ్వల కీర్తిపతాక ఈ సంపుటి. ఇందులో 293 రుబాయీలు వున్నాయి.

మంచు గుండెలకు జ్వాలా శలాకగా
వేడి వెల్గులకు సమతా ప్రతీకగా
ప్రగతి పథాంకితమౌ నా హృదయాన్నే
ఎత్తానిదిగో! రవ్వల పతాకగా

అని కవి ఎలుగెత్తాడీ సంపుటిలో. ఇందులో శాంతి కాముకత్వం, ఆస్తిక మానవతా వాదం ప్రధానంగా కానవస్తాయి. దృష్టాంతాలను, అర్థాంతరన్యాసాలనూ పాలూ నీరులా కలిపి సరికొత్త అభివ్యక్తిని ఆవిష్కరించడం చూస్తాం.

మంచుగడ్డ మండుతోంది చూశారా
మన 'కుంకుమ' రగులుతోంది చూశారా
పొలిమేరలు కాపాడే భటరక్తం
ప్రతిదినమూ పారుతోంది చూశారా?

అంటూ నాటి కాశ్మీర్ సమస్యను కవితామయం చేసిన ధ్వనికేతనం 'రవ్వల పతాక' లోనిదే!. రవ్వలపతాక- తిరుమల శ్రీనివాసాచార్యగారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంగా వెలువడడం ఓ ప్రత్యేకత.

పూలను ప్రేమించు చాలు- చెట్టు పేరు ఏదైతేం
నీటిని సేవించు చాలు- ఏటి పేరు ఏదైతేం
పాటలనుభవించు చాలు- భాష పేరు ఏదైతేం
గుణం ప్రశంసించు చాలు- కులం ఏదైతేం.

మూడవ పాదం రుబాయీలో అంత్యప్రాస రహితం అయినా ఈ సంపుటిలో కవిగారు నాలుగుపాదాలూ తుల్యప్రాసల రుబాయీలు ప్రయోగించారు. ఉర్దూలో నాలుగు పాదాల తుల్యప్రాసల రుబాయీలను గానయోగ్యమనీ, 'రుబాయీ తరానా' అనడం వుంది. అయితే వాటికి కూడా తదనంతరకాలంలో రుబాయీ అన్న మాటే స్థిరమైందన్న విషయం గమనీయం. అరవయ్యో ఏట వెలువడిన గ్రంథం అయినా-

ప్రతి క్షణం నూతనమే మనిషి జీవితాన
ప్రతి భాగం ప్రధానమే మనిషి శరీరాన
పూర్వకవుల కల్పనలకందనట్టి కొత్త
ప్రతిభావం విలువైందే కవికి కవిత్వాన

అంటూ నవతను ఆహ్వానిస్తారు.

'పడవ నడపలేని వాడు నావికుడు
పాట పాడలేనివాడు గాయకుడు
అందుకోసమే వేదనతో నేనంటాను
ప్రజల నడపలేనివాడు నాయకుడు'

అని దాశరథిగారు రుబాయీగా అంటే-

'గానంలో జీవిస్తే గాయకుడు
నావపైన పయనిస్తే నావికుడు

కష్టాలకు కన్నీళ్ళకు భయపడక
నీతి కొరకు కృషి చేస్తే నాయకుడు'

అని ఆచార్యులవారి రుబాయీ పలుకుతుంది.

కవి శాంతికాముకుడు కనుకనే హింసాధోరణులను వీడి, జనజీవన స్రవంతిలో కలిసిపొమ్మని ఉగ్రవాదులకయినా హితవు చెబుతాడు–

కరదీపిక పట్టుకో, ఖడ్గాలను పారేసెయ్
మనస్సులను నమ్ముకో, మరతుపాకి విసిరేసెయ్
ఎన్నాళ్ళని మిత్రమా! అజ్ఞాతంగా ఉంటావ్?
అందరిలో కలిసిపో! అరణ్యాలు వదిలేసేయ్.

మూడవసంపుటి వెలుడిన మరి ఆరేళ్లకు తిరుమల ఛారిటబుల్ ట్రస్ట్ పక్షాన తిరుమల శ్రీనివాసాచార్యగారు తొలి సంపుటి వెలువరించినప్పుడు పేర్కొన్న 'ముక్తక మంజరి' అనే ట్యాగ్‌లైన్‌తోనే 'రుబాయీ గులాబీలు' అనే తమ నాల్గవ రుబాయీ సంపుటిని 2005 లో వెలువరించారు. ఈ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యనిర్వాహక సభ్యులు కె.వి.రమణగారు. ఎందరో పెద్దలు, కవులు, పండితులు, నిరాదరణకు గురౌతున్న వ్యవస్థలో ఏ కొద్దిమందినైనా గుర్తించి గౌరవించాలనే సత్సంప్రదాయానికి నాందిగా తిరుమల సోదరులతో ఏర్పడిన ట్రస్ట్ పక్షాన వెలువడిన, ఈ రుబాయీ సంపుటిలో రెండువందల రుబాయీలున్నాయి. వెయ్యి రుబాయీలను వ్రాయాలన్న తన సంకల్పం ఈ సంపుటితో పదకొండువందలను దాటిందన్న తృప్తి వెలార్చారు కవిగారు. సమకాలీన భారతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలూ, భారతీయ సంస్కృతీ నాగరికతలూ, మానవీయ ప్రగతి మూల్యాలూ, ప్రకృతి సౌందర్య సందేశాలూ ఈ సంపుటిలోని వస్తు విశేషాలు. ప్రముఖ చలన చిత్ర దర్శకులు శ్రీ వి.వి.వినాయక్‌గారికి దీనిని అంకితం చేయడం ఓ విశేషం!

ఈ దేశం ఎత్తైంతో హిమాలయం చెబుతుంది
ఈ దేశం లోతైంతో హిందు జలధి చెబుతుంది
తరతరాల భరతజాతి యుగయుగాల చరిత్రలను
గగనం దిగి వచ్చినట్టి గంగానది చెబుతుంది

అని ప్రారంభమై–

చందనగంధాలు గుబాళించేదాకా
చంద్రకాంతి దెసలను ప్రసరించే దాకా
గాంధీ జీవన జ్యోతి వెలుగుతుందిలే
కాల మహావాహిని ప్రవహించేదాకా

అని ముగిసే ఈ సంపుటి దేశభక్తి ముక్తకాలను, ప్రకృతిగత సౌందర్య వర్ణనలను ఎక్కువగా సంతరించుకుంది.

మంచి నుడుగులు పంచిపెట్టోయ్
వెలుగుదారుల అడుగు పెట్టోయ్
తిప్పికొట్టోయ్ తిమిర శక్తుల
బడుగువాళ్లకు గొడుగు పట్టోయ్

వంటి ముక్తకాలు గురజాడ 'ముత్యాల సరపు' పోహళింపుకు సమీపంగా గోచరిస్తాయి.

సకల వస్తుమయ ప్రకృతి స్తవనీయం
నవరసమయ కావ్యకం అనుభవనీయం
ప్రతిభా పూర్ణుడైన రసజ్ఞునికి
ప్రపంచాన ప్రత్యణువూ కవనీయం

అంటూ తన రసజ్ఞతను వెల్లడిస్తారు. అలాగే భాష ప్రాధాన్యతను గురించి చెబుతూ–

వత్తిలేక దీపమెలా?
పత్తిలేక దారమెలా?
ఎంతమంది ఊహైనా
భాషలేక కవిత ఎలా?

అని ప్రశ్నించి, తామే మళ్ళీ–

నేలలోని నీటిలా
నీటిలోని నిప్పులా
భాష అన్నిటా వుంది
దేహంలో ఆత్మలా–

అని సమాధానిస్తారు.

ఆచార్యులవారి అయిదవ రుబాయీల సంపుటి 'పలుకరించే పరిమళాలు'గా ఈ మారు నాలుగేళ్ళ వ్యవధిలోనే 2009 లో వెలువడింది. సుదర్శనం ప్రచురణలుగా

ఇది వెలుగు చూసింది. తమకు ఆప్తులు, ఆత్మీయులు అయిన మిత్రులు రసమయి సంస్థ వ్యవస్థాపకులు డా॥ ఎం.కె.రాముకు దీనిని అంకితం చేశారు. నేటి మన స్వాతంత్ర్య స్థితినీ, ప్రజాస్వామ్య గతినీ, అలాగే– సమత, త్యాగం, ఆశావాదం వంటి అంశాలు, తెలుగు భాషా కవిత్వాలు, అవధానం వంటి విషయాలపై తమ అభిప్రాయాలను రుబాయీలుగా కవిత్వీకరించారు. మూడువందల నాలుగు రుబాయీల మంజూష ఈ సంపుటి.

కాలం ఒక కాగితం ఒక బొమ్మను గీసిపో
కాలం ఒక సచ్చరిత్ర ఒక మంచిని చేసిపో
ఈ దేహం శాశ్వతం కాదని నీకూ తెలుసు
కాలం దేవుని రూపం ఒక పువ్వును వేసిపో

అనే రుబాయీతో మొదలయ్యే ఈ సంపుటిలో తొలిపాదంలో 'కాలం ఒక కాగితం ఒక కవితను రాసిపో' అనకుండా– 'ఒక బొమ్మను గీసిపో' అనడంలోనే తమ మాటలతో బొమ్మ కట్టే కవిత్వ నైపుణ్యాన్ని చూపారనుకోవాలి.

అందరు బాగుండనీ
అన్నీ బాగుండనీ
కవిగా నా ధ్యేయమిది
అందరు సుఖముండనీ

అని చివరగా కూడా పలుకరిస్తుంది ఈ సంపుటి.

ధనం చూసి కొందరు నను పిలిచారు
గుణం తెలిసి కొందరు నను తలిచారు
ఏ టెక్కూ ఏ దిక్కూ లేదనీ
ప్రతిభ చూచి కొందరు నను వలచారు

అని ఆయనే అన్నట్లుగా– ప్రతిభామూర్తిగా డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులుగారు ఏ టెక్కూ లేక, అందరినీ మక్కువతో ఆదరిస్తూ, ఆత్మీయతా గంధాన్ని పంచే వారిగా రాణిస్తున్నారు. ఈ సంపుటిలోని రుబాయీలూ– మరీ అలతి అలతి మాటలతో, పిల్లలకు సైతం అర్థమయ్యేలా వుండి, అలరించేవిగా రాశారు. ఎక్కడా పాండిత్య ప్రకర్ష చూపాలనే ఉబలాటం లేదు.

నిలువు పాఠశాలగా
వెలుగు పూలమాలగా
బ్రతుకు ఇంపుసొంపుగా
కులుకు బాల లీలగా

అన్ని భాషలలోన ముందు
విన్న చెవులకు మంచి విందు
అందచందాలున్న తెలుగిది
డెందముల తేనియలు చిందు

అంటూ సరళ గమనంతో సాగిపోతుంది.

అయిదవ సంపుటి వెలువడిన ఏడాదికే 2010 లో వెలువడిన డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారి ఆరవ రుబాయీసంపుటి ఇంతవరకూ వెలువడిన సంపుటి లన్నింటిలోనే విలక్షణమైనదీ, విశిష్టమైనదిగా వెలువడింది. అధికార భాషగా తెలుగు– పల్లెనుంచి పట్నం దాకా, సామాన్యుని నుండి సచివాలయం దాకా వాడుక జరగాలన్న సదాశయ దీప్తిగా సంతరించబడిన ఉదాత్త సంపుటి ఇది. తెలుగులో తగిన పదజాలం వున్నా– ఆంగ్లభాషా పదాలవాడుక ఎక్కువై పోవడం, ఇంగ్లీషువిద్యే మోజుగానూ, విధాయకంగానూ మారుతూండడం, ముఖ్యంగా ఈ తరం పిల్లల మాతృభాష తెలుగు కాకుండా ఆంగ్లమే అన్నట్లుగా మారిపోతూండడం, వాడుతున్న తెలుగులో కూడా– ప్రచార ప్రసార మాధ్యమాల్లో అపశబ్దాలు, వికృత రూపాలు, సంకర సమాసాలు ప్రయుక్తమవుతూండడం, ప్రేమించవలసిన తెలుగు, అభిమానించవలసిన తెలుగు, అగౌరవం పాలవుతూ, తరతరాల తెలుగు భాషకూ, తెలుగు జాతి సంస్కృతికీ ఎంతో నష్టం కలుగుతోందన్న ఆర్తితో 'తెలుగులో మాట్లాడుకుందాం' అనే ఈ రచన చేశారు.

'దీపాల చూపులు' సంపుటి సందర్భంలో కోవెల సంపత్కుమారాచార్యగారు తమ అభిప్రాయ 'దీపాల కాంతులు' ప్రసరిస్తూ చివరలో– 'ఒక ప్రయోజనకరమైన కథా వస్తువుతో, ఛందోవైవిధ్యంతో ఒక ఉత్తమ కావ్యాన్ని మిత్రులు శ్రీనివాసాచార్యులు గారు రచించటానికి ఇదంతా ఒక రంగ నిర్మాణమా? ప్రస్తుతానికి నేను అదే విధంగా అనుకుంటాను. నేననుకునేది సరయినదే అని నిరూపించే బాధ్యత– మిత్రులు గదా– శ్రీనివాసాచార్యుల వారిపైనే వుంది' అని రాశారు.

ఇంతకు మునుపు వెలువడిన రుబాయాల సంపుటులన్నీ ముక్తక మంజరులే! అయితే 'తెలుగులో మాట్లాడుకుందాం' ఏకవస్తుగతంగా రూపొందిన విలక్షణ రుబాయీ సంపుటి. ఈ కావ్య స్వీకర్త పద్మభూషణ్ డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డిగారు.

గ్రంథాన్ని స్వీకరిస్తూ ఆయన పేర్కొన్నట్లు–

... 'తెలుగు పరిస్థితి నానాటికీ తీసికట్టయి, చక్కటి తెలుగు మాట్లాడేవాడు వింత మానిసిలా తోస్తున్నాడు. 'మీరు తెలుగు బాగా మాట్లాడుతారే' అని అనిపించుకున్నప్పుడు కించిత్తు బాధ కలుగుతుంది. తెలుగువాడికి తెలుగేమైనా పరాయి భాషా?– ప్రావీణ్యం సంపాదించేశామని భుజకీర్తులు తగిలించుకోవడానికి.

ఇప్పుడున్న స్థితిగతులు మారకపోతే ఇంకో పాతికేళ్ళలో భుజకీర్తులు తగిలిద్దామన్నా తగిలించుకునే అర్హత గల వ్యక్తులు కనబడకపోవచ్చు. పరాయి భాష అయిన ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతే కించపడుతున్నాం గానీ, మాతృభాషలో తబ్బిబ్బు పడినప్పుడు అదేదో గొప్పగా చెప్పుకుంటున్నాం...

భావాన్ని వ్యక్తీకరించాలంటే భాష అత్యంత ఆవశ్యకం.

... మనం మాట్లాడే తెలుగు భాషను మెరుగు పరుచుకోవడం చాలా అవసరం. తెలిసో తెలియకో దొర్లే తప్పులను పరిహరించుకోవడం, సవరించుకోవడం మన తక్షణ కర్తవ్యం. అన్ని సందర్భాల్లో తెలుగే మాట్లాడదాం– ఛందోబద్ధంగా శ్రీనివాసాచార్యగారు చెప్పిన హితవు విందాం' అని పేర్కొన్నారు.

'తెలుగులో మాట్లాడుకుందాం' అనే తిరుమలవారి ఈ రచన తొలుత ధారావాహికగా 'ఆంధ్రభూమి' దినపత్రికలోనూ, ఆపై 'వార్త' దినపత్రికలోనూ ప్రచురిత మయింది. మాతృభాషాభిమానులందరికీ ఆచార్యుల వారందించిన గొప్ప ఉపాయనం ఈ గ్రంథం. గ్రంథాంతంలో తెలుగులో వ్రాస్తున్న మాట, రాయవలసిన మాట అనే పట్టికను కూడా చేర్చి ఆచార్యులవారు విషయానికి పరిపుష్టతను కూర్చారు. టీవీ ఛానెల్స్‌లో ఉపయుక్తమవుతున్న అనవసర ఆంగ్లపదాలకు సమానార్థకాలైన తెలుగు పదాలను సూచించారు.

తెలుగు సభలను జరుపుకుందాం
తెలుగు వాళ్లను పిలుచుకుందాం
కలసి మెలసీ కష్టసుఖములు
తెలుగులో మాట్లాడుకుందాం

అని ఆచార్యులవారి ఆశయానికి అనుగుణంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012 లో తిరుపతిలో తెలుగుసభలు జరుగగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత 2017 డిసెంబర్‌లో 15 నుండి 19 వరకు హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి.

ఎల్ల భాషల మాట విందాం
తల్లి భాషను నేర్చుకుందాం
తేనె సోనలు జాలువారే
తెలుగులో మాట్లాడుకుందాం

అంటూ 111 పేజీల ఈ సంపుటిలోని అనేక రుబాయీల్లో తెలుగు భాష వైభవాన్నీ, అనేక తెలుగుపదాల ఉపయుక్తం చేయవలసిన సాధురూపాలనూ వివరించారు.

మహా నగరాలన్నిటా మన మహాకవులను నిలుపుకుందాం
వీధి వీధుల కవి ప్రముఖుల విగ్రహాలను నిలుపుకుందాం
సభామందిర ప్రాంగణాలకు ప్రభామూర్తుల పేర్లు పెడుతూ
తెలుగు వెలుగులు పరిమళించగ తెలుగులో మాట్లాడుకుందాం

అంటూ సందేశమిచ్చారు. ఈ పుస్తకం పాఠశాల విద్యాప్రణాళికలో చేర్చి భావితరాలకు పఠనీయ గ్రంథంగా నియుక్తం చేయదగినది.

డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారి ఏడవ రుబాయీ సంపుటి 2012 లో ధ్వన్యనుకరణ సమ్రాట్ డా॥ నేరెళ్ళ వేణుమాధవ్‌గారికి అంకితంగా వెలువడిన 'నాదేశం నా ఆదేశం' అనే సంపుటి. దీనిని కవితాసంపుటి అని పేర్కొన్నారు గానీ, ఇది కూడా రుబాయీ ప్రక్రియలో వెలువడినదే!

'కలం పట్టుకున్నప్పుడల్లా నా దేశం, నా దేశంలోని సంఘర్షణలూ, ప్రగతి ప్రయత్నాలూ, శాంతి సమన్వయాలూ, జరుగుతున్న పరివర్తనలోని తీరు తెన్నులూ అన్నీ నాలో ఒక ఆవేశాన్ని ఉద్గమింపజేస్తాయి. ఆ ఆవేశం కవితగా కాగితంపై ప్రసరిస్తూ తరగెత్తుతుంది. అలా విభిన్నవేళల్లో ఎగిసిన ఆవేశతరంగాలే ఈ రుబాయీలు. వాటి సంకలనమే ఈ సంపుటి' అని చెప్పుకున్నారు ఆచార్యుల వారు.

ప్రజాధనం తమకోసం వాడేస్తారు
ప్రజావనం పెరుగకుండా తీసేస్తారు

నేటి నాయకులు నూటికి తొంభైపాళ్ళు
సేవ పేర కాళ్ళు చేతులాడిస్తారు

అన్న ఆవేశంతో మొదలయ్యే ఈ సంపుటి చివరకు-

నా దేశం నా లోపల వికసించే ఉద్దేశం
నా దేశం ప్రత్యణువును వెలిగించే ఆవేశం
నాకు పదార్థాలన్నీ చెంత ఉండి అందించే
నా దేశం నిరంతరం నా పాలిట పదకోశం

అని ముగుస్తుంది.

ఈ సంపుటిలో వైయక్తిక అవలోకనం చేసుకున్న తావులు కనబడడం ఒక విశేషం.

మహాకవుల కృతుల కొన్ని చూశాను
కవిత పేర ఎంతో కొంత వ్రాశాను
వాణీకృప వచ్చిన ఉద్యోగ శ్రీ
కావ్యముద్రణలకు ఖర్చు చేశాను

సంసారం సంగతియా! శ్రీమతి వంతు
ప్రతి విషయం 'స్వరాజ్యమే' సతిని నుతింతు
నా తపస్సు నా యశస్సు ఆమె వల్లనే
ఆమెను పచ్చగ ఉంచుట దేవుని వంతు

అని రాసుకున్నారు. తిరుమల శ్రీనివాసాచార్యగారు ధర్మపత్ని పేరున ధర్మనిధి పురస్కారాన్ని కూడా నెలకొల్పి కవి, పండిత సత్కారాలు చేసినవారు. స్వరాజ్యలక్ష్మిగారు 2016 లో కన్నుమూయడం కవిగారి జీవితంలోని తీరని విషాదం!

నా హృదయం నాకు తోడు
నా ధ్యేయం నాకు తోడు
ఒంటరిగా ఉన్నప్పుడు
నా కవనం నాకు తోడు

అన్నట్లుగానే సాగిపోతున్నారాయన.

పాతిక సంవత్సరాల రుబాయీ పంటగా 2013 లో వెలువడిన ఎనిమిదవ సంపుటి 'న్యాయం నా ధ్యేయం' అనే రుబాయీల సంపుటి. నాలుగువందల

ఇరవైమూడు రుబాయీలున్న బృహద్గ్రంథంగా ఇది రూపుదాల్చింది. కవి డా॥జె.బాపురెడ్డి గారికి అంకితం చేయబడిన సంపుటి ఇది. ఈ సత్కృతి స్వీకృతిలో–

'నిఘంటువులు చెబుతాయి మాటలకు అర్థాలు
పంచదార నుంచి పుడుతాయి తీయని పదార్థాలు
తిరుమల రుబాయీలు ఆవిష్కరిస్తాయి
అద్భుతమైన యథార్థాలు'

అంటూ ప్రశంసిస్తారు బాపురెడ్డిగారు.

"నా మనోగగనంలో మెరిసిన భావతటిల్లతలకు కల్పించిన శబ్దరూపాలే రుబాయీలు. నా నిరంతర తపనకూ, వేదనకూ అక్షరాకృతులివి. జాతీయ, సాంఘిక, మానసిక, సామాజిక, సాంస్కృతిక, కవితా, భాషా, కళా, సంస్కరణాత్మక భావాలు ఈ రుబాయీలలో చోటు చేసుకొన్నవి. అలా వస్తు భావ రచనా వైవిధ్య విలసితాలు ఈ రుబాయీలు" అని మరోమారు ప్రకటించుకున్నారు కవి.

ప్రసూనాలు ప్రవచించే పాఠాలను నేర్చుకోండి
తరుజాలం వినిపించే ధర్మాలను నేర్చుకోండి
జీవనదులు ఆలపించు చిత్ర గీతికా మాలిక
చెవులారా చవులారా మనసారా నేర్చుకోండి

అనే రుబాయీతో ఆరంభమైన ఈ సంపుటి–

ఉరుముతున్న నిరాశపై యుద్ధభేరి మ్రోగించు
చదువుకున్న సాహిత్యం జనతకు ఉపయోగించు
కురుక్షేత్ర సంగ్రామం జరిగినప్పుడు గుండెలో
తరతరాల చరిత్రలను తలచి యాత్ర సాగించు

అని ఉద్యమస్ఫూర్తి నింపుతారు. న్యాయంకోసం కలంపట్టిన వారు కనుకనే నిర్భయంగా–

ప్రతిభను గుర్తించలేని ప్రభుత ఎందుకు
రసికత నాహ్వానించని రాజ్యమెందుకు
మహామహామణులెన్నో మట్టిని కలిసె
శక్తిని సమ్మానించని జాతి ఎందుకు?

అని నిలదీసి ప్రశ్నిస్తారు.

రక్షక భటులకు జీతం ఉన్నది
అధ్యాపకులకు జీతం ఉన్నది
జాతి నీతి సంస్కృతులను చాటే
కవులకు జీతం ఎక్కడున్నది.

అంటూ కవులను గౌరవించుకోవడం, వారి జీవికకు అండగా నిలవడమూ ప్రభుత్వ బాధ్యతగా పేర్కొనడం– సామాజికన్యాయంలోని ధ్యేయంగా రూపుకట్టించారు.

డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారి వలె ఒక కవితా ప్రక్రియకు ఇంత విరాడ్రూపం సంతరించిన మరోకవి ఈ ఆధునికయుగంలో లేరనవచ్చు. రుబాయీలను ఇన్ని వేల సంఖ్యలో ఇంత వైవిధ్యంతో, వస్తు విస్తృతితో సంతరించినవారు కానరారు. రుబాయీల సంపుటుల్లోని అంకితాలను కూడా రుబాయీల్లోనే– ఆ కృతిభర్తల వ్యక్తిత్వ జీవన మహత్తులను– కళ్ళకు కట్టేలా రాయడం ఆయనకే చెల్లింది. దాశరథి ఆచార్యుల వారిలో లయమై, రుబాయీల పట్ల తన అనురక్తిని ఇంత విరాడ్రూపంలో వ్యక్తీకరించుకున్నారా అనిపిస్తుంది. 'తిరుమల' అన్న ఇంటిపేరు 'తిరుబాయీ' అయిపోయినంతగా– ఆచార్యులవారు అడుగు తీసి అడుగు వేస్తే రుబాయీ, మాటాడితే రుబాయీ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలే రుబాయీలు అన్నంతగా తన కవితారచనను ఈ ప్రక్రియా పరం చేశారు. ఆయన స్మరణం, ధ్యానం, ప్రాణం, ప్రణవం అంతా రుబాయీ. అదే ఆయనకు హాయి.

తెలుగు కొరకు విక్రమించు
తెలివి ప్రజకు విక్రయించు
నిశ్చిత హితమాచరించి
నెమ్మదిగా నిష్క్రమించు

ఎవరు నీకు పోటిలేరు
ఎవరు నీకు సాటికారు
నీ పయనం నీదే మరి
ఎవరూ నీ తోటిరారు

అంటూ తన రుబాయీ తాత్త్వికతలో తానే పరిపూర్ణుడిగా పండిన కవివతంసులు డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులుగారు.

2018 జనవరి ఒకటి నూతన సంవత్సరం నాడు అశీతిపూర్ణ వయస్కులవుతున్న డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులుగారు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ప్రతిష్ఠాత్మకమైన ఎన్నో గుర్తింపులు బడయాలనీ, తెలుగుజాతి తేజోమూర్తిగా రాణించాలనీ మనసారా అభినందిస్తూ...

శతమానం భవతి
శతాయుః పురుషశ్శతేంద్రియే
ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి
శుభం భూయాత్
స్వస్తి.

(పాలపిట్ట మాసపత్రిక, జనవరి 2018)

❖

(52) బతుకు పుస్తక భద్రగ్రంథాలయం

నిజమే! మాదిరాజు లక్ష్మీనరసింహారావు అంటే వెంటనే స్ఫురణకు రాకపోవచ్చు. కానీ ఎం.ఎల్.నరసింహారావుగారంటే వెంటనే తెలుస్తుంది. అసలు ఆయన సన్నిహితవర్గంలో కేవలం 'ఎం.ఎల్.' అనే అక్షరాలతోనే సుప్రసిద్ధుడు. తెలంగాణ వైతాళికులలో ఒకరనదగిన ఎం.ఎల్. స్వాతంత్ర్య సమరయోధునిగా, ప్రముఖ రచయితగా, అందునా జీవితచరిత్ర రచనాకారునిగా, అన్నింటికి మించి గ్రంథాలయోద్యమశీలిగా వన్నెకెక్కినవాడు. హైదరాబాదులో నూటపదిహేనేళ్ళ చరిత్ర కలిగిన సుప్రసిద్ధమైన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం అనగానే గుర్తుకొచ్చే పేరు ఎం.ఎల్.నరసింహారావుదే. ఆ సంస్థ కార్యదర్శిగా, గౌరవ కార్యదర్శిగా ఆయన రెండు మూడు దశాబ్దాలకు పైగా అందించిన సేవలు చిరస్మరణీయమైనవి. భాషానిలయం వైభవ ప్రాభవాలకు ఊపిరులూదిన తేజోమూర్తి ఆయనే.

అటువంటి మహనీయునితో నా యౌవన ప్రాదుర్భావ కాలంనుండీ ప్రత్యక్ష పరిచయం, సాంగత్యం కలిగివుండడం ఒక విధంగా పురాకృత శుభాధిక్యమే! నేను మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో మా స్కూల్ పక్కనే ఉండిన ముంతాజ్ కాలేజీలో ఆయన అధ్యాపకునిగా ఉండేవారు. 1958 నుండి 1968 వరకు వారు ఆ కళాశాలలో పనిచేశారు. ఆయనతో అక్కడ కాదు గానీ, నా పరిచయం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలోనే జరిగింది. భాషానిలయం నిర్వాహకులలో నాటినుంచే ఆయన ముఖ్యులుగా ఉండేవారు.

పాఠశాల రోజుల్లోనే 'విజ్ఞానజ్యోతి' అనే లిఖిత పత్రిక నడిపిన నేను 1967లో వివేకవర్ధినీ కళాశాలలో పి.యు.సి. చదువు నుండి ఆంధ్రసారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాలలో డిప్లమా ఇన్ ఓరియంటల్ లాంగ్వేజెస్ ప్రాచ్యవిద్యాభ్యాసానికి మరలడంతోనే, సుధామ అన్న కలం పేరు పెట్టుకుని, 'యువమిత్ర' అనే సచిత్ర

లిఖిత మాసపత్రికను నా సంపాదకత్వంలో ప్రారంభించాను. ఆ రోజుల్లో బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని నా ప్రాచ్యవిద్యా కళాశాలకు వెడుతూ ప్రతిరోజూ ఓ అరగంట, గంటయినా సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో పత్రికలతో, పుస్తకాలతో గడపడం అలవాటుగా ఉండేది.

1967 మే లో 'యువమిత్ర' సచిత్ర లిఖిత మాసపత్రికను ప్రారంభించడం జరిగింది. అది కేవలం ఒక్క ప్రతియే. దానిని నెలనెలా పదిరోజుల పాటు పాఠకులు చదువుకునేందుకు భాషానిలయంలో పెట్టడం గురించే– మొదటిసారిగా భాషా నిలయంలో ఎం.ఎల్.నరసింహారావుగారిని కలిసిన జ్ఞాపకం. ఖద్దరు పైజమా, లాల్చీతో, సన్నగా, కొంచెం పొడుగ్గా, దరస్మితవదనంతో దర్శనమిచ్చే ఆయన రూపు మనసులో ముద్రితమైపోయింది. ఎంతో ఆత్మీయంగా, ఆదరణగా వారు మాట్లాడి, మా లిఖిత పత్రికను భాషానిలయంలో ఉంచడానికి అంగీకరించారు. అంతేకాదు! అన్ని పత్రికలకూ అంటే అచ్చు పత్రికలు ఉంచడానికి సమకూర్చే ఫోల్డర్– మా యువమిత్రకూ సమకూర్చి, సంచిక మీద భాషానిలయం స్టాంప్ వేసి, పాఠకుల పఠనార్థం ఉంచేవారు. పదిరోజుల తర్వాత ఆ ప్రతిని తీసుకుని, మరో పదిరోజులు నారాయణగూడలోని గాంధీస్మారక నిధి గ్రంథాలయంలో ఉంచేవాడిని. అలా దానిని రొటేషన్ పద్ధతిలో గ్రంథాలయ పాఠకులకు అందుబాటులో ఉంచేవారం. పత్రిక చివరలో కొన్ని ఖాళీపుటలో, లేక చిన్న తెల్లకాగితాల పుస్తకమో అనుసంధించి ఉంచేవారం. పాఠకులు తమ అభిప్రాయాలు ఆ పుటలలో రాసేవారు. వాటినే మరునెల సంచికలో పాఠకుల ఉత్తరాలుగా ప్రచురించుకునే వాళ్ళం. లిఖితపత్రికే అయినా అది గ్రంథాలయ పాఠకుల అభిమానాన్ని ఎంతగానో చూరగొంది. నెలనెలా అయిదో తేదీలోగా గ్రంథాలయంలో దానిని పెట్టకపోతే– ఎం.ఎల్.గారు కూడా ఊరుకునేవారు కాదు. ఆయన అందించిన ఉత్సాహం, ప్రోత్సాహం, 'యువమిత్ర' లిఖిత మాసపత్రిక పట్ల వారు చూపిన ఆదరణ మరిచిపోలేనివి. అలా ఎనిమిదేళ్లపాటు 'యువమిత్ర' వెలువడింది.

అదేవిధంగా భాషానిలయంలో జరిగే కవిసమ్మేళనాల్లో ఎన్నోమార్లు నన్ను కవిగా ఆహ్వానించి, వెన్నుతట్టి నిలబెట్టిన వారాయన. యువభారతి సంస్థ పక్ష సమావేశాలు భాషానిలయం మేడపై గల పరామర్శవిభాగంలో జరిగేవి. అలా యువభారతి పరిచయం కావడానికీ ఆ సంస్థలో సభ్యునిగా, ఉప కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, నేడు యువభారతి ప్రచురణల ప్రధాన సంపాదకునిగా ఎదగడానికీ వెనుక ప్రాతిపదికలు– భాషానిలయంతో ఏర్పడిన అనుబంధమే.

ఎంత నిరాడంబరంగా, సౌమ్యంగా కనబడేవారో అంత దీక్షాదక్షతలు, పట్టుదల గల వ్యక్తి ఆయన. బహుశా తెలుగులో ఆయన రాసినన్ని జీవితచరిత్ర గ్రంథాలు మరొకరు రాయలేదేమోననిపిస్తుంది. గొట్టిపాటి బ్రహ్మయ్యగారి తర్వాత జీవిత చరిత్ర రచనల విషయంలో ఎం.ఎల్.దే అగ్రస్థానం అనాలి. ఎం.ఎల్.నరసింహారావుగారితో నా సాన్నిహిత్యానికీ, సామీప్యానికీ అందిన గొప్ప అవకాశం– ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంవారు ఆర్కైవల్ రికార్డింగ్స్ చేస్తూ, కొందరు మహనీయుల సమగ్ర జీవన రేఖలను ఒక్కొక్కరిదీ సుమారు మూడు గంటలపాటు ఇంటర్వ్యూ చేస్తూ, ఆ రికార్డింగ్‌లు భద్రపరిచే ప్రణాళికలో భాగంగా– నేను 2008 లో ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేసినా, 2012 లో తెలుగువిభాగం చూస్తున్న శ్రీ మంత్రవాది మహేశ్వర్– శ్రీ ఎం.ఎల్.నరసింహారావుగారి జీవనరేఖలను ఆర్కైవల్ రికార్డింగ్ చేసినప్పుడు, పరిచయకర్తగా ఎం.ఎల్.గారి అభీష్టంతో నన్ను నిలిపి, వారి సమగ్ర జీవనరేఖలను ధ్వని ముద్రితం చేయడం– అవిస్మరణీయ మధురానుభూతి. 2012 మార్చి పన్నెండో తేదీ ఆకాశవాణి కేంద్రంలో ఆ రికార్డింగు జరిగింది. దానికోసం ఆయన కోరగా ముందురోజుల్లో ఒకటి రెండు రోజులు శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయంలోనే కలుసుకుని– ఎం.ఎల్.గారూ, నేనూ రికార్డింగు నిమిత్తం అనేక విషయాలు ముచ్చటించుకున్నాం. ఎన్నెన్ని కబుర్లు! ఎన్నెన్ని విశేషాలు!! ఆయన జీవితం, ఆ అనుభవాలు, ఆ ఉద్యమస్ఫూర్తి, ఆ సాహిత్య రచనా పిపాస, సాంస్కృతిక, సామాజిక రంగాలలో వారి కృషి... అదొక తరగని గని!!

రికార్డుల ప్రకారం ఆయన జన్మించింది 1928 నవంబర్ 7. కానీ ఒక సంవత్సరం ఎక్కువ వయస్సు నమోదయింది. నిజానికి తాను 1929 నవంబర్ 5 శుక్లనామ సంవత్సర కార్తీక శుద్ధ మంగళవారం నాగులచవితి రోజు జన్మించానని ఆయనే స్వయంగా చెప్పారు.

నేటి ఖమ్మంజిల్లా పండితాపురం గ్రామంలో శ్రీమతి లక్ష్మీబాయమ్మ, శ్రీ మాదిరాజు నారాయణరావుగార్లకు మూడవసంతానంగా జన్మించారు మాదిరాజు లక్ష్మీనరసింహారావుగారు. అప్పుడు పండితాపురం– వరంగల్‌జిల్లా గార్ల జాగీరులో ఉండేది. ఆరుగురు కుమారులలో ఆయన రెండవవారు. ఆయనకు ఒక అన్న, ఒక అక్క, నలుగురు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు. తండ్రి నారాయణరావు సంపన్న కుటుంబానికి చెందిన భూస్వామి అనే చెప్పాలి. ఆ రోజుల్లోనే ఆయన రెండు గ్రామాలకు పతందారు. అంటే పోలీస్ పటేల్. గొప్ప అధికారం ఉన్న వ్యక్తి. కానయితే

ఆయన సంపన్నత గానీ, అధికారం గానీ ఎప్పుడూ పేదవారు ఫిర్యాదు చేసేందుకు కారణం కాలేదు. సరికదా సామాన్యులలో సామాన్యునిగా, అధికారులలో అధికారిగా వర్తించేవారు. ఎం.ఎల్.నరసింహారావుగారికి కూడా తండ్రి నైజమే వచ్చింది. గొప్ప స్నేహశీలిగా, అందరినీ సమాదరించే మర్యాదస్తునిగా ఎం.ఎల్.ను అందరూ సంభావిస్తారు. ఎం.ఎల్. ప్రారంభవిద్య స్వగ్రామంలోనూ, ఉన్నతపాఠశాలవిద్య ఖమ్మంలోనూ, కళాశాలవిద్య హైదరాబాద్‌లోనూ జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎం.ఎ. తెలుగు చేశారాయన. చిన్ననాడే స్వగ్రామం పండితాపురంలో– నిజాం పరిపాలన నెదిరించే వామపక్ష రాజకీయ చైతన్యం, భూస్వామ్య వ్యతిరేక పోరాట ఉద్యమశీలత్వం అందిపుచ్చుకున్నాడాయన.

ఇక ఖమ్మంలో– తక్కిన తెలంగాణ ప్రాంతాలలో కన్నా స్వాతంత్ర్యోద్యమ ప్రభావం ఎక్కువగా ఉండేది. అది కూడా ఆయనపై ప్రసరించింది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషలలో ఆయనకు మంచి పాండిత్యం అలవడింది. ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నప్పుడే, హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. 1946–47 లో ఖమ్మం హైస్కూల్ విద్యార్థియూనియన్ కార్యదర్శిగా పనిచేశారు. తెలంగాణ నుండి ఆ రోజుల్లో వెలువడిన ఏకైక తెలుగు దినపత్రిక గోలకొండ పత్రికకు 1948 లో ఖమ్మం విలేకరిగా నియమితులై జర్నలిస్టుగా పనిచేశారు కూడాను. వినోబాభావేగారి భూదానయాత్రలో వారివెంట ప్రయాణించి వార్తలు పంపించిన వ్యక్తి ఎం.ఎల్.. 1946 లో మహాత్మాగాంధీని– గాంధీ మద్రాసు నుండి వార్ధా రైలులో ప్రయాణించి, ఖమ్మం బహిరంగ సభలో పాల్గొన్న సందర్భంగా ఎం.ఎల్. తెల్లని ఖద్దరు దుస్తులతో కాంగ్రెస్ వాలంటీరుగా సందర్శించుకున్నారు.

దేశ స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ విమోచనోద్యమంలో రామానంద తీర్థగారి నాయకత్వంలో ప్రవేశించిన ఎం.ఎల్. ఖమ్మం, మహబూబాబాద్ ప్రాంతంలో తిరిగి– అక్కడ పన్నుల ఎగవేతల గురించీ, సహాయనిరాకరణ గురించీ ప్రచారం చేయడంతో పోలీసులు అరెస్టుచేసి, రెండురోజులు నిర్బంధించి ఆపై విడుదల చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో హయగ్రీవాచారిగారి నాయకత్వాన వారి ఆదేశాల మేరకు ఆయుధాలు ఉపయోగించే పద్ధతిలో కూడా ఎం.ఎల్. శిక్షణ పొంది, రజాకారులను ఎదుర్కొనడానికి పంపబడ్డారు. సాయుధపోరాటంలోనూ క్రియాశీలక కార్యకర్తగా నిలిచారు.

పోలీసు చర్య అనంతరం ఎం.ఎల్. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. చేస్తూ తెలుగు విద్యార్థిసంఘానికి అధ్యక్షులుగా కూడా వ్యవహరించారు. తెలుగు జాతీయ విద్యార్థి సంఘానికి 1951-53 లలో కార్యదర్శిగా పనిచేసి పండిత నరేంద్రజీ అనుయాయిగా మెలిగారు. హైదరాబాద్ ఛాదర్‌ఘాట్ కళాశాలలో చదువుకునే రోజుల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న డా॥ సి.నారాయణరెడ్డిగారిని ఆ రోజుల్లో వారి యాసబాస విషయంలో సరదాగా వెక్కిరిస్తూ, ఆయనలో పౌరుషాన్ని ప్రజ్వలింపచేసి, బి.ఏ.లోకి వచ్చేసరికి సినారె యాస సాంతం తొలగిపోయేలా చేసుకునే పరిణామానికి మూలకారకుడైనది ఎం.ఎల్. నరసింహారావే! సినారె స్వయంగా ఈ విషయాన్ని చెబుతుండేవారు.

ఎం.ఏ. పట్టభద్రులయ్యాక- ఉస్మానియా అనుబంధ కళాశాల 'ముంతాజ్ కాలేజీ'లో పనిచేసిన ఎం.ఎల్. కొంతకాలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధాల శాఖలో చేసి వదిలేసి, 1970 నుంచి 1987 వరకు హైదరాబాద్ తెలుగు అకాడమీలో రీసెర్చి ఆఫీసర్‌గా పనిచేసి 1989 లో ఉద్యోగ విరమణ చేశారు.

ఇరవయ్యో ఏటనే ఎం.ఎల్. నరసింహారావుగారికి సాహిత్యం పట్ల మంచి అభిరుచి ఏర్పడింది. దాశరథి, ఎం.ఎల్. ఎంతో ఆత్మీయ మిత్రులు. దాశరథికే గుర్తులేని ఆయన పద్యాలనెన్నింటినో ఎం.ఎల్. ధారణ చేసి వినిపించేవారు. పద్యం అంటే ఆయనకు చాలా ప్రీతి. దాశరథి ఖండకావ్య సంపుటాల నుంచి అవలీలగా ఎన్నెన్నో పద్యాలను ఎం.ఎల్. గళమెత్తి విన్పించేవారు. ఎల్.ఎల్.బి. చదివారు గానీ పూర్తి చేయలేదు. పదిహేనేళ్ళు దాదాపు తెలుగుఅకాడమీలో పనిచేసినా, తన ఆత్మగౌరవాన్నీ స్వతంత్ర ప్రతిపత్తినీ ఏనాడూ వీడలేదు. తెలుగులో జీవిత చరిత్రలు రాయాలన్న సంకల్పం కలగడం వారి జీవితంలో గొప్ప మలుపు.

ఎం.ఎల్.నరసింహారావుగారి రచనలలో మొట్టమొదట పుస్తకరూపంలో వచ్చింది-'సత్యాగ్రహశాస్త్రం' అనేది. ఆనంద్ గాంధీమహాత్ముని రచనలనుంచి టి.హింగోరాని సంకలనం చేసిన సూక్తులకు తెలుగు అనువాదం అది. గాంధీజీ ఆశయాలను సర్వాత్మనా విశ్వసించిన అక్షరాకృతి అది. గాంధీ సాహిత్య ప్రచురణాలయం వెలువరించింది. ఆ తరువాత 'తెలంగాణ వైతాళికులు' వెలువరించారు. ఒక శతాబ్దపు తెలంగాణ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్య దర్పణమా గ్రంథం. పదిమంది ప్రతిభావంతులైన తెలంగాణ వైతాళికులను పరిచయం చేసింది ఆ గ్రంథం. 1977 లో

సర్వోదయ సిద్ధాంతాలకు, సార్థక కార్యక్రమాలకు నిబద్ధతతో ఎం.ఎల్. రెండు పుస్తకాలు వెలువరించారు. "వినోబాజీ జీవితం– ఉద్యమం" ఒక మంచి గ్రంథం. అప్పుడే 'లోకనాయక్ జయప్రకాశ్ జీవితచరిత్ర' రచించి వెలువరించారు.

స్వామి రామానంద తీర్థ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, మొరార్జీ దేశాయ్, ప్రధానమంత్రి శ్రీ పి.వి.నరసింహారావు, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, తెన్నేటి విశ్వనాథం, నేతాజీ సుభాష్ చంద్రబోస్, శ్రీమతి ఈశ్వరీబాయి, ప్రజా సేవాపరాయణ శ్రీ కొత్తూరి సీతయ్యగుప్త, పండిట్ నరేంద్రజీల జీవిత చరిత్రలను పఠనీయ గ్రంథాలుగా రాసి ప్రచురించిన ఎం.ఎల్.నరసింహారావు జాతీయోద్యమ నిర్మాతలు, గాంధీకథ, షిరిడీసాయిబాబా, స్వాతంత్ర్య సారథులు, చిరస్మరణీయులు, నల్గురు తెలుగు ప్రముఖులు, హైద్రాబాద్ స్వాతంత్ర్య ఉద్యమం–తెలంగాణ, సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరవీరులు, వందేమాతరం ఉద్యమం, నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షులు, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం వందేళ్ళ చరిత్ర– వంటి విలువగల గ్రంథాలను వెలువరించి తెలుగుపాఠకులకు అందించారు. 'గత అర్ధశతాబ్దంలో ఆంధ్రదేశం' అనే గ్రంథం అముద్రితంగా వుందిట!

అలాగే ఎం.ఎల్.నరసింహారావుగారి సంపాదకత్వంలో కొన్ని అపురూప గ్రంథాలు వెలువడ్డాయి. గాంధీ శతజయంతి సందర్భంగా నూర్గురు కవుల కవితలతో రెండు సంపుటాలుగా 'కావ్యాంజలి' వారి సంపాదకత్వంలో వచ్చిందే. అలాగే పి.వి. నరింహారావుగారిపై అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారు వెలువరించిన 'ప్రతిభా వైజయంతిక' గ్రంథానికి వారిదే సంపాదకత్వం. పి.వి.నరసింహారావుగారి నవలల మీద అందులో నా చేత ఒక వ్యాసం రాయించారాయన. గాంధీ అనుయాయి ప్రభాకర్‌జీ స్మృతి గ్రంథానికీ, కోదాటి నారాయణరావు, కాళోజీ నారాయణరావు, ఉమ్మెత్తల కేశవరావు, సాధు సుబ్రహ్మణ్యం, కె.వైద్యనాథంగార్ల షష్టిపూర్తి విశేష సంచికలకూ ఎం.ఎల్. సంపాదకత్వం వహించారు. గాంధీజీ, కందుకూరి వీరేశలింగం, మాడపాటి హనుమంతరావు, కె.వి.రంగారెడ్డి వంటి వారిపై వెలువడిన ప్రత్యేక సంచికలకు సారథ్యం వహించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'తెలుగు వెలుగులు' జీవిత చరిత్రల కోశానికి సంపాదకవర్గ సభ్యులుగా వ్యవహరించారు.

ఎం.ఎల్. చేసిన కృషి చాలా విస్తారమైనది. గాంధీభవన్ ట్రస్టు బోర్డు మెంబరుగా, హైదరాబాద్ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ గౌరవ కార్యదర్శిగా, అలాగే భాషా నిలయం గౌరవ కార్యదర్శిగా, కాకతీయ విజ్ఞాన సమితి అధ్యక్షులుగా, గాంధీభవన్

గ్రంథాలయ గౌరవ కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రధాన కార్యదర్శిగా, గాంధీ పీస్‌ఫౌండేషన్ సెంటర్ సెక్రటరీగా, తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ట్రెజరర్‌గా, బూర్గుల రామకృష్ణారావు స్మారక ట్రస్టు సభ్యులుగా, సర్వోదయ సమితి సభ్యులుగా, అకాడమీ ఆఫ్ గాంధియన్ స్టడీస్ సెక్రటరీగా (1983–1993), ఆకాశవాణి, దూరదర్శన్ హైదరాబాద్, మద్రాస్ సలహామండలి సభ్యులుగా, 1992–1995 హైదరాబాద్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులుగా, ఉర్దూఅకాడమీ తెలుగు–ఉర్దూ డిక్షనరీ సభ్యునిగా, దక్షిణ భారత హిందీప్రచార సభ కార్యవర్గ సభ్యునిగా (1958–1968), ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యునిగా (1968–1970) ఆయన చేసిన సేవలు అనుపమానాలు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఆయనవి ఎన్నో ప్రసంగాలు, పరిచయ కార్యక్రమాలు ప్రసారం అయ్యాయి. అలాగే ఆయన తన రచనలతో అనేక తెలుగు పత్రికలకు వెలుగునిచ్చారు.

1984 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ– జీవితచరిత్ర రచనాకారునిగా ఎం.ఎల్.నరసింహారావుగారికి అవార్డునిచ్చి గౌరవించింది. 1993 లో అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయోద్యమ పురస్కారాన్ని తెలుగు విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. 1991 లో విశ్వసాహితీ సంస్థ ఆయనకు సాహిత్య పురస్కారాన్ని ఇచ్చింది. భోపాల్ అఖిల భారతీయ భాషాసాహిత్య సమ్మేళనం 'సాహిత్యశ్రీ' గౌరవాన్నిచ్చి సత్కరించింది. అలాగే 1992 లో అయ్యంకి శతజయంతి పురస్కారం, 1997 లో సమైక్య భారతి పురస్కారం, ఖమ్మం జిల్లా ప్రజాపరిషత్ పురస్కారం, 1999 లో నాటి ప్రధాని ఐ.కె.గుజ్రాల్ చేతులమీదుగా ఆర్య ప్రతినిధి సభ స్వాతంత్ర్యయోధ పురస్కారం, ఫ్రీడంఫైటర్స్ అసోసియేషన్ పురస్కారం, 1999 లో జీవిత చరిత్రల రచయితగా తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, వాసవీ సేవాకేంద్రం వారి గాంధీయ ఉద్యమ పురస్కారం, సద్గురు శివానందమూర్తిగారిచే 2002 లో సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్టు పురస్కారం ఆయనను వరించాయి. 2005 లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు డి.లిట్ పట్టానిచ్చి గౌరవించింది.

ఎం.ఎల్.నరసింహారావు పేరు తెలుగువారి వైభవ ప్రాభవాలకు దోహదపడిన మహనీయులలో పేర్కొనదగింది. నిజానికి భారత ప్రభుత్వంచే పద్మవిభూషణ్ స్థాయి సత్కారం అందుకోదగిన ప్రతిభామతి ఆయన. అయితే ఎప్పుడూ గుర్తింపు కోసమో, కీర్తి ప్రతిష్ఠల కోసమో అర్రులు చాచినవాడు కాదాయన. ప్రచారార్భాటాలకు వశుడయ్యే నైజం కాదాయనది. నిరంతరం అధ్యయనశీలిగా, మౌనకార్యకర్తగా, నమ్మినదానికి

అనుగుణంగానే నడుచుకుంటూ వెళ్ళిన నిర్మల హృదయుడాయన. గాంధీయవాదిగా అనిపించుకోవడానికే ఇష్టపడినవాడు. గ్రంథాలయమే ఊపిరిగా జీవించినవాడు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి వైభవ ప్రాభవాలు కలగడానికే కాదు, నూతన నిర్మాణం ఏర్పడడానికీ శ్రమించినవాడు. ఎందరో సాహితీవేత్తలకు, కవులకు, రచయితలకు, రాజకీయ ధురంధరులకు సన్నిహితమై వారందరి ఆదరాభిమానాలు, గౌరవాలు పొందిన సౌజన్యమూర్తి ఆయన.

తన 87వ ఏట 2016 ఫిబ్రవరి 12 న ఎం.ఎల్.గారు తుదిశ్వాస విడిచి కీర్తిశేషులయ్యారు. అదేరోజు కవి అరుణ్‌సాగర్ మృతిచెందడంతో ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ఎం.ఎల్. మరణవార్త కూడా 'లోప్రొఫైల్'లోనే ఉండిపోయింది. జీవిత చరిత్ర రచయితగా, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం గ్రంథాలయోద్యమ ప్రముఖునిగా, ఎం.ఎల్. నరసింహారావు చరితార్థుడు. తెలంగాణ వైతాళికునిగా, తెలుగులో మహనీయమూర్తిగా చిరస్మరణీయుడు.

(పాలపిట్ట మాసత్రిక, ఫిబ్రవరి-మార్చి 2018)

❖

(53) నాటకీయ వెలుగుల కవి అమ్మంగి

రంగస్థల నాటకానికీ, రేడియో నాటకానికీ తేడా వుంది. రేడియో నాటకం శ్రవ్య ప్రధానం. రంగస్థల నాటకంలో ఆహార్యమూ, వేషభాషలు వుంటాయి. కానీ రేడియో నాటకంలో పాత్రధారుల గళమే ప్రధానంగా నాటకానికి జీవం పోస్తుంది. అందువల్ల రేడియో నాటకాల రచనలో సంభాషణలకే ప్రథమస్థానం. శ్రోతలలో విశేషప్రాచుర్యం సంపాదించుకున్న రేడియో నాటకాలు అనేకం ఉన్నాయి. అదొక విశిష్ట ప్రక్రియగా, ప్రత్యేకంగా గుర్తించదగిన సాహిత్య ప్రక్రియగా ఎదిగింది. రేడియో నాటక రచనలో పావుగంట నాటిక రాయడానికీ, ఓ గంట నాటకం రాయడానికీ తేడా వుంది. ప్రతి సంభాషణా కథను ముందుకు నడిపించేదిగా వుండాలి. స్తబ్ధగానూ, అనవసర లాగివేత ధోరణిలోనూ ఉండకూడదు. రేడియో నాటకంలో ధ్వనులకు అంటే ఎఫెక్ట్స్‌కూ ప్రధాన పాత్ర వుంది. ఏ ఎఫెక్ట్ (ధ్వని) ఎక్కడ ఏ మేరకు రావాలో రేడియో నాటక రచయిత సూచించగలగాలి. నాటకం వింటూనే శ్రోత అందులో లీనమై రసానుభూతిని శ్రవణం ద్వారానే పొందగలగాలి. నిజానికి రంగస్థలం మీద ప్రదర్శించడానికి అనువుకాని– ఓ విమానం హైజాకింగ్‌నో, రైలు ప్రమాదాన్నో, సముద్ర యానాన్నో, వరద బీభత్సాన్ని కూడా రేడియోలో నాటకంగా రాసి మెప్పించగల వీలుంది. అదేవిధంగా అరవైఏళ్ళ వయస్కుడైనా అతని గళం బాలునిదిగానో, యువకునిది గానో వుంటే, రేడియో నాటకంలో ఆ పాత్రకు గళధారణతో మెప్పించడం కుదురుతుంది గానీ, రంగస్థలంపై ఎంత మేకప్ వేసినా సాధ్యం కాదు.

ఒక రంగస్థల నాటిక యథాతథంగా రేడియోకి ఎలా పనికిరాదో, రేడియో నాటకాన్ని రంగస్థలం మీద ప్రదర్శించాలన్నా మార్పులు అనివార్యం. కొందరు నాటక రచయితలు ఈ విషయాన్ని గ్రహించినట్లు తోచదు. మహాకవి శ్రీశ్రీ రంగస్థల నాటక రచయిత కాదు. కానీ రేడియో నాటకాలు రాసి మెప్పించారు. గోరాశాస్త్రి రేడియో

నాటకాలు ప్రసిద్ధి చెందాయి. రేడియోకి నాటకాలు రాసి మెప్పించిన నాటక రచయితలు ఎందరో వున్నారు. శ్రవ్య మాధ్యమం మీద పట్టువుండి రచన చేసినవారు రాణకెక్కడం సుగమం.

పచ్చబొట్టు పటంచెరువు, భరోసా, మిణుగురులు వంటి కవితా సంపుటులతో కవిగా ప్రసిద్ధులై, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొట్టతొలి కాళోజీ పురస్కారాన్ని అందుకున్న శ్రీ అమ్మంగి వేణుగోపాల్ కవిగానే కాక, నవలా రచయిత గోపీచంద్‌పై సాధికారిక పరిశోధన చేసిన సిద్ధాంతగ్రంథ రచయితగా, సాహిత్య వ్యాసకర్తగా, పత్రికా కాలమిస్టుగా పేరొందినవారు. 'మీరు కవిత్వమే కాదు ఇతర ప్రక్రియలూ రాయగలరు' అనీ, 'నాటికా రచన ప్రయత్నించండి' అనీ– ఒకప్పుడు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో పనిచేసిన డా॥ పాలకుర్తి మధుసూనరావు, డా॥ కె.బి.గోపాలం గారల ప్రోత్సాహంతో కలం సారించారు అమ్మంగివారు. అలా 1993–2000 సంవత్సరాల మధ్యకాలంలో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుండి ఆయన రాయగా ప్రసారమైన అయిదు నాటికలు 'అమ్మంగి వేణుగోపాల్ నాటికలు' పేర 2008 లో జయమిత్ర సాహితీ సాంస్కృతిక వేదిక ప్రచురణగా గ్రంథరూపంలో వెలువడింది.

1993 లో 'ప్లాట్లు అమ్మబడును' ఆయన తొలి రేడియో నాటిక. ఒకరకంగా హాస్యనాటికయే! ఈ ప్లాట్లు గృహనిర్మాణానికి సంబంధించినవి కావు. సృజనాత్మక రచనకు అంటే కథకు, కవితకు, నవలకు, నాటకానికీ, సినిమాకూ పనికొచ్చే వస్తువన్నమాట. 'ఇప్పుడు ఇంటికో రచయిత్రి, కాలనీకో విమర్శకుడు, అపార్ట్‌మెంట్‌కో కథకుడు వెలిగిపోతున్నారు. ఇక వచనకవిత్వం పుణ్యమా అని కవులసంగతి చెప్పనే అక్కరలేదు' అని నాటికలో అక్క ద్వారా అన్పించిన ఓ సంభాషణలా, సాహిత్య రచనా తీరుతెన్నులపై సెటైర్‌గా సాగే నాటిక ఇది. ఎనిమిది పాత్రలతో సాగే ఈ నాటికలో ప్రధానపాత్ర రామమూర్తి కథనం ద్వారా వ్యాపార సాహిత్యాన్ని నిరసించి 'ఈ ప్లాట్లూ అమ్మను. నీ ప్లాట్లూ అమ్మను. కళ్ళు తెరిపించే సాహిత్యం సృష్టించి ప్రజలను చైతన్యపరుస్తాను' అని ఇళ్ళ స్థలాలు అమ్మే వ్యాపారి– సామెతల సత్తెయ్యతో అనడంతో నాటిక 'నా వోటు మీకే' అని భార్య కమల సమర్థింపుతో ముగుస్తుంది.

1997 లో ప్రసారమైన మరో హాస్యనాటిక 'ఆపరేషన్ వంకాయ'. ఇందులో కూడా ఎనిమిది పాత్రలు. వంకాయ అంటే వెంకట్రాజుకు ఇష్టం. ఆయన భార్యకు మాత్రం నేతిబీర ఇష్టం. బీరకాయలు తెమ్మంటే వంకాయలు తెచ్చినందుకు ఆవిడ

ఇంట్లోంచి వెళ్ళగొడితే, ఆత్మాభిమాన రక్షణకు తిరుపతి బయలుదేరిన అతన్ని బస్సులో పోలీసులు గజదొంగ గంగులుగా భ్రమిస్తారు. బ్యాంకు దోపిడీదారువని ఇంటరాగేట్ చేస్తారు. మొగుడు తిరిగొస్తే వంకాయలతో తులాభారం చేయిస్తానని మొక్కుకుంటుంది ఆ భార్య. తానే ఆమె భర్తనని వచ్చిన గజదొంగ గంగుల్ని చివరకు గుర్తించి అరెస్టు చేయడం, వాడిమీద వున్న పాతికవేల రివార్డు ఆమెకు దక్కడం కొసమెరుపు. ఈ నాటిక 'పరిశోధనలో పదనిసలు' పేర ప్రసారమైంది. 'ఆపరేషన్ వంకాయ' అని విషయాన్ని ముందే బట్టబయలు చేసే వీలు కల్పించక ఆకాశవాణి పేరు మార్చడం సబబే. 2000 సంవత్సరంలో ప్రసారమైన 'పూవులమ్మినచోట' నాటిక అదే పేర ప్రసారం కాగా, అమ్మంగి వేణుగోపాల్ నాటికారచనకే తలమానిక మనదగిన తెలంగాణ జీవద్భాషలో 1998 లో ప్రసారమైన నాటిక 'వికృత శిశువు' ఆ పేరున కాక 'పునాదిరాళ్ళు' పేరిటా, అలాగే 1994 లో 'జంతువు' అని రచయిత నామకరణం చేసిన నాటిక 'మార్గదర్శి' పేరుతోనూ ప్రసారమయ్యాయి.

ఈ రేడియో నాటికలను గ్రంథస్థం చేస్తున్నప్పుడు నాటికకు తాను సూచించిన పేరునే (ఆకాశవాణిలో మార్చిన సందర్భంలోనూ) వుంచడం, అలాగే అరగంట కాలవ్యవధి దాటే సందర్భాలలో– వారు సంక్షిప్తీకరించినప్పుడు తొలగిపోయిన భాగాలను తిరిగి చేర్చటం జరిగింది. వీటినే రంగస్థలంపై వేస్తే బాగుంటుందన్న అభిలాషతో కాబోలు అక్కడక్కడా మార్పులు చేశారు. అలాకాక పూర్తిగా రేడియో నాటికలుగానే ప్రచురించి వుంటే మరింత ఔచితీమంతంగా భాసించేది.

'వీటిని స్టేజిమీద ప్రదర్శించడంలో అడ్డంకులు వుంటాయి. అయితే శ్రమించే స్వభావం వున్న దర్శకుడు, నటీనటుల బృందం తలచుకుంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీటిని అధిగమించవచ్చు' అని తన ముందుమాటలో స్వయంగా పేర్కొన్నారు రచయిత.

ఈ అయిదు నాటికల సంకలనంలో రెండు– ముందే పేర్కొన్న హాస్యనాటికలు కాగా, మిగతా మూడూ సందేశాత్మకాలు, సమాజహిత చింతనాగమ్యాలు అనాలి. ఒక నాటకరచయితగా అమ్మంగి సామాజిక ప్రయోజనం కోసం రూపొందించిన నాటికలు ఆ మూడూ. కానయితే వీటిలో 'పూవులమ్మినచోట' నాటిక చెట్లను సంరక్షించాల్సిన అంతర్గత ప్రబోధాన్ని అందిస్తూనే– 'ఉన్న ఊళ్ళో ఉప్పు పుట్టనప్పుడు మరో వూరు వెతుక్కోక తప్పదు' అంటూ అమ్మాయి భవిష్యత్తయినా బాగుంటుందని

సాంబయ్య, లక్ష్మి ఊరు విడిచి వలసపోవటాన్ని చూపడం చిత్రంగా తోస్తుంది. 'అప్పులతో వున్న ఊళ్ళో బతికేకన్నా పస్తులతో పరాయి ఊళ్ళో బతకటమే మంచిది' అని సాంబయ్య చేత అనిపిస్తారు. 'గ్రామీణాభివృద్ధి పథకం కింద ఈ వూరికో సహకార బ్యాంకు రాబోతోంది' అన్న కాంట్రాక్టర్ స్వగతం– ఉన్నవాడు లాభపడడానికే గానీ నిరుపేదకు ఆసరా కాబోదన్న నెగిటివ్ భావనను ప్రోది చేయడం సరికాదేమో! తొలిగిపోయిన భాగాల పునఃచేర్పువల్ల ఇలాంటి స్థితి ఏర్పడవచ్చునేమో!

1994 లో శ్రీమతి శారదా శ్రీనివాసన్‌గారి నిర్వహణలో ప్రసారమైన అమ్మంగి వేణుగోపాల్ 'జంతువు' పేరిట రాయగా, 'మార్గదర్శి' పేర శ్రోతల నలరించిన నాటిక జంతుసంరక్షణా సందేశరచన. ఒక తల్లి కుక్కా, దాని పిల్లలూ లారీకింద పడగా ఒక చిన్న కుక్కపిల్ల మాత్రం బతికి మిగతావి చనిపోగా– మేడిచెట్టు కింద ముక్కుతూ మూల్గుతూ పడివున్న ఆ కుక్కపిల్లను, ఓ కొండముచ్చు చేరదీసి పాలిచ్చి సాకడం– మోహన్, లలితలకు మార్గదర్శకత్వం కావడం దీని ఇతివృత్తం. మాతృత్వంలోని గొప్పదనాన్ని కూడా బోధపరుస్తుంది.

"మనిషికి చదువుందీ, నాగరికత వుందీ, జంతువుకవేవీ లేవు. మనిషి మరో మనిషిని ఆదుకోలేని స్థితిలో వున్నాడు. జంతువేమో తన జాతిది కాకపోయినా ఆపదలో వున్న మరో జంతువును ఆదుకునే స్థితిలో వుంది" వంటి ఆకట్టుకునే సంభాషణలున్న ఈ నాటిక జంతువుల్నీ, పక్షుల్నీ కూడా ప్రేమించమని చెబుతుంది.

స్వతహాగా కవి కావడంవలన అమ్మంగి వేణుగోపాల్ నాటికల్లోని సంభాషణలు కొన్ని మరీ మరీ ఆకట్టుకునేలా వుంటాయి. ఈ నాటికల సంపుటికే మకుటాయమానమైనదీ, విలక్షణమూ, విశిష్టమూ అయినది తెలంగాణ జీవద్భాషలో, తెలంగాణ మాండలిక సంభాషణలతో ఆసాంతం సాగే 1998 లో ప్రసారమైన నాటిక. 'పునాదిరాళ్ళు' పేరిట ప్రసారమైన ఈ నాటికకు రచయిత పెట్టిన పేరు 'వికృత శిశువు'. పర్యావరణ పరిరక్షణ ఈ నాటిక అందించే విలువైన సందేశం. 'పచ్చబొట్టు–పటం చెరువు' కవితా సంకలనాన్ని వెలువరించిన అమ్మంగి వేణుగోపాల్ రాసిన పర్యావరణ నాటిక ఇది. పటాంచెరువు కాలుష్యం మీద 'మనుష్యుల ప్రాణాలను పణంగా పెట్టే పారిశ్రామిక ప్రగతి అవసరం లేదు. పారిశ్రామికీకరణ అనే ఉన్మాదపు పరుగులో మనం ఎక్కడో మనిషిని మరిచిపోయాము' అన్న హైకోర్టు తీర్పు మూలకందంగా రాయబడిన ఈ నాటకం అమ్మంగి నాటకరచనా శేముషికి దర్పణం.

ప్రణాళికా రహిత పారిశ్రామిక విధానాల ఊతంగా పాతవృత్తులు నశించి అట్టడుగు బడుగు వర్గాల వారు జీవనోపాధిని కోల్పోతున్న తీరుకు, పర్యావరణాన్ని చేజేతులా నాశనం చేస్తూ ధనసంపాదనే లక్ష్యంగా, భౌతిక విజయాల ఆరాటంలో మానవత్వమే మరచిపోతున్నప్పుడు పర్యవసానం వికృతంగా వుంటుందని హెచ్చరించే నాటిక ఇది. ఆశయ్య– పోశమ్మల జీవన భిత్తికపై– రోళ్లు అమ్ముకునే వాళ్ళ నోళ్ళు కొడుతూ మిక్సీలు రావడం అనే ఒక పరిణామ సూచికను ఆధారం చేసుకుని, పారిశ్రామికీకరణ దుష్ఫలితాలను, చివరకు పోశమ్మ ఒక వికృత శిశువుకు జన్మ నివ్వడంతో షాకింగ్‌గా ముగుస్తుంది. ఈ నాటికలో సంభాషణలు అన్నీ సహజ తెలంగాణ మాండలీకపు సొబగులతో సాగాయి. 'గాలి కరాబాయె– నీల్లు కరాబాయె– యవసం జేస్తమంటె బూమిల యిసమాయె', 'యవసం మూలకు బడ్డది. కూలిగైకిలి లేక శ్యాతనైనోల్లంత ఫ్యాక్టరీలకో పట్నాలకో పొయ్యిండ్రు', 'పెద్ద పెద్ద మిషిన్లతోటి దినాం నూర్లకొద్ది ఆవ్లను యెడ్లను బర్లను కోసి దేశ దేశాలకు పంపిచ్చి అల్‌జహీరోడు కోట్లు కమాయిస్తున్నడు' అంటూ నిష్ఠుర సత్యాలను విడమరిచి చెబుతుందీ నాటిక.

రేడియో నాటికే అయినా దృశ్యాన్నీ, శ్రవ్యాన్నీ మిళాయించి సూచించడం అమ్మంగి రచనలో కానవస్తూంటుంది. (ఆశయ్య మెల్లగా లేచి పోశమ్మ బొడ్డులో చెక్కుకున్న చెక్కుడుసంచీ లాగి, అందులోనుంచి వందరూపాయల నోటు తీసి నర్స్‌కిస్తాడు. నర్స్ డాక్టర్‌కిస్తుంది. వాళ్ళిద్దరూ నిష్క్రమిస్తారు. వికృతంగా వున్న రబ్బర్ బొమ్మ పెద్ద నీడతో నడుస్తూ అర్థంలేని ధ్వనులు చేస్తుంది. ఆ ధ్వనులు అంతం కాగానే 'వికృత శిశువు' అంటూ తీతువు గుడ్లగూబ అరచినట్లు వినిపిస్తుంది) అంటూ నాటిక ముగింపును పేర్కొనడంలో– తొలిభాగంలో దృశ్యతనూ, మలిభాగంలో శ్రవ్యతా సూచికనూ గ్రహించగలుగుతాము. రేడియో నాటికలుగా ప్రసారమైన ఈ అయిందింటినీ రంగస్థలంపై కూడా వేస్తే బాగుంటుందన్న కామనతో, తదనుగుణమైన మార్పులు జొప్పించి అమ్మంగి వేణుగోపాల్ నాటికలుగా పుస్తకరూపంలో వెలువరించారు. ఇదొక ఆశావహ యత్నం.

గోపీచంద్‌పై పరిశోధనాపత్రం సమర్పించి ఆ సిద్ధాంత గ్రంథ రచనతో డాక్టరేట్ పట్టా పొందిన అమ్మంగి వేణుగోపాల్ గోపీచంద్ రాసిన 'గతించిన గతం' నవలికను కూడా నాటకీకరణం చేశారు. దాని లిఖితప్రతి పరిశీలనకు అందుకుని చదివే అవకాశం కలిగింది. పుస్తకరూపంలోగానీ, ప్రదర్శన రూపంలోగానీ, ప్రసార రూపంలో

గానీ ఆ నాటకీకరణ ఇంకా వెలుగు చూడలేదు. 'గతించిన గతం' నవలికను యథాతథంగా కాక, స్వేచ్ఛానుసరణంగా నాటకీకరణ చేశారు అమ్మంగి. హైదరాబాద్ విమోచనోద్యమం మూలకందంగా సాగిన రచన ఇది. తెలంగాణలో నిజాం పాలన, ప్రజల మానప్రాణాలకు రక్షణ కరువైన నాటి పరిస్థితులను, రజాకార్ల ఆగడాలను, కాశీంరజ్వీ నాయకత్వాన చెలరేగిన మారణకాండ స్థితినీ రూపు కట్టిస్తుందీ నాటిక.

హిందువులు ముస్లింలు ఉయ్యాలో
ఒక తల్లి బిడ్డలమ్మ ఉయ్యాలో
మతధర్మమే వేరు ఉయ్యాలో
బతుకులంతా ఒకటి ఉయ్యాలో
ఊపిరొక్కటె వేరు ఉయ్యాలో
ఊరూ వాడా ఒకటె ఉయ్యాలో
మా నిజాము రాజు ఉయ్యాలో
మంచి పనులే జేసె ఉయ్యాలో
రాజ్యకాంక్షతోటి ఉయ్యాలో
కాశీమురజ్వీని ఉయ్యాలో
చేరదీసెనమ్మ ఉయ్యాలో

అంటూ గ్రామీణ స్త్రీలు బతుకమ్మ లాడుతుంటే– తమ నాయకుడు కాశీంరజ్వీని తిడతారా అంటూ అతని అనుచరులు హుస్సేన్ జాన్ వంటివారు పైశాచికంగా ఆ గ్రామీణ స్త్రీలను వివస్త్రలను చేసి బతుకమ్మ లాడించటం, పద్దెనిమిదేళ్ళ ఓ యువతి పార్వతిని అతను బలాత్కరించటం, దానయ్య అనే యువకుడు హుస్సేన్‌ను ఎదిరించటం, పరాభవించి ప్రాణం తీయక వదిలేయటం, హైదరాబాద్‌లో నిజాం రాజ్యం పోయి కాంగ్రెస్ రాజ్యం వస్తుందన్న వార్తతో హుస్సేన్– దౌలత్‌ఖాన్ వద్ద తన సంపద దాచిపెట్టి పాకిస్తాన్‌కు వెళ్ళడం, గర్భిణి అయిన పార్వతిని పంచాయితీలో పెట్టి ఊరి నుంచి దొర వెలివేయడం, ఫాతిమాబీ– పార్వతిని మతం వేరయినా తన బిడ్డలా దరిచేర్చుకోవడం అనే ఘట్టాలను అమ్మంగి వేణుగోపాల్ 'మతం కన్నా మానవత్వం గొప్పద'న్న గోపీచంద్ కథనానికి నాటకీకరణం చేశారు. రజాకార్ల ఆగడాలు, పార్వతిపై అత్యాచారం వంటివి షాడోప్లేగా రంగస్థలం మీద చూపవచ్చు గానీ, ఇది కూడా నిజానికి రేడియో నాటికగానే రాణించగల గుణాలను కలిగివుంది.

నిజాం పేరిట రజాకార్లు, కొందరుదొరలు ప్రజాకంటకులుగా మారిన వైనాన్ని నిజంగా చూపే ఓ వాచవికథనం ఈ నాటకీకరణం. 'గతించని గతం' అవగతం చేసుకుని, అమ్మంగి కలం తొంగిచూసిన చారిత్రక యథార్థ సత్యరూపం ఈ నాటిక.

కవిగానే కాక అమ్మంగి వేణుగోపాల్ ఒక సంభాషణల రచయితగా, శ్రవ్య నాటికా రచనా వైదుష్యం వెలార్చిన ఈ వైఖరి బహుధా అభినందనీయం. ఆ సప్తతి మూర్తికి, ఆత్మీయంగా సుధామధుర శుభాకాంక్షలు...!

(పాలపిట్ట మాసపత్రిక, ఫిబ్రవరి 2018)

❖

(54) పదబంధ ప్రహేళికలు

భాష భావ వినిమయసాధనం. సాహిత్యం లేకపోయినా భాష ఉంటుంది. కానీ భాష లేనిదే సాహిత్యసృజనేకాదు, మనుషుల మధ్య పరస్పర భాషణమే సాధ్యం కాదు. భాషమీద పట్టు ఉన్నప్పుడే, పదసంపద బహుళంగా తెలిసివున్నప్పుడే, సమయోచితమైన, ఔచితీమంతమైన సమర్థ మౌఖికసంభాషణ, పాఠకజనామోదంగా రచనా పాటవం సాధ్యమౌతాయి.

లోకంలో సగం అనర్థాలకు అసలుకారణం అపార్థాలు. ఆ అపార్థాలకు హేతువు– అనుకున్నది అనుకున్నట్లుగా అవతలివారికి అర్థమయ్యేలా, అభివ్యక్తం చేయలేకపోవడం. ఒక్క అపశబ్దం ప్రయోగించినా అది అనర్థానికి దారితీయవచ్చు. మాటలోనయినా, రాతలోనయినా అందుకే సముచిత పదప్రయోగం భావవినిమయం లోని నిర్దేశిత లక్ష్యానికి ఉపయుక్తమవుతుంది. తమ మాటలద్వారా వక్తలు, తమ రాతల ద్వారా కవులు, రచయితలు ఖ్యాతి గాంచుతున్నారంటే, వారికి భాషమీద, దాని సమర్థ వినియోగం మీద పట్టు ఉండడమే మూలకారణం.

మాతృభాషమీద సాధికారత కలిగినవాడే అన్యభాషలు నేర్వడంలోనూ ముందంజ వేయగలడు. ప్రపంచ భాషలన్నింటిలోనూ తెలుగుకు ఒక విశిష్టత ఉంది. భాష ఏదయినా ఒక సజీవస్రవంతి. కాలానుగుణంగా మార్పులు అనివార్యం. తత్సమాలు, తద్భవాలు, అన్యదేశ్యాలు అయిన పదాలు భాషలో మిళితంకావడం, ఒకప్పుడు విరళంగా వ్యవహారంలో ఉన్న మాటలు కాలక్రమేణా చ్యుతం కావడం జరగవచ్చు. అలాగే అర్థవిపర్యాలు, అర్థవిపరిణామాలు సంభవించవచ్చు. ఒకప్పటి రూఢ్యర్థాలు నిలచివుండకపోవచ్చు. భాష పరిణామశీలమైనదన్నమాట నిజమే! కానయితే భాషను సంరక్షించుకోవడం, భాషావికాసం అనే మాటలు నేడు వింటున్నాం. తెలుగు మృతభాషగా మారుతోందన్న కొందరి ఆర్తినీ గమనిస్తున్నాం. అందుకు కారణం

నేటి యువతరం, రూపొందుతున్న భావి బాలతరం– తెలుగుకి దూరమవుతున్న పరిస్థితి. తెలుగులో మాట్లాడుతున్నా, ఆ వాగ్వ్యవహారంలో ఆంగ్లపదాలు ఎక్కువగా దొర్లడం కానవస్తోంది. ఆంగ్లమాధ్యమంలో చదువుకోవడం వలన మాత్రమే కాదు, ఇంట్లో కూడా కుటుంబసభ్యుల సంఖ్య తగ్గిపోవడం, కుటుంబాల్లోనూ భాష వినిమయం మందగించడం జరుగుతోంది. అదీకాక విద్యావ్యవస్థలోని లోపం ప్రధానకారణంగా– తెలుగులో చదవడం, రాయడం అనే రెండు ప్రాథమిక పార్శ్వాలు బలహీనమవుతూ పోతున్నాయి.

మాట్లాడటం, చదవటం, రాయడం, ఆలోచించడం అనే నాలుగూ సరిసమానంగా వికసించి, అభివృద్ధి చెందినప్పుడే, ఏ భాషకయినా సమగ్ర అస్తిత్వం వుంటుంది. ఆ భాషీయుల జీవనవికాసం, ఉన్నతి నిలుస్తుంది. అందుకే ప్రభుత్వాలకు భాషావిధానం, ప్రణాళిక వుండి తీరాలి. విద్యారంగాన్ని మాతృభాషకు దూరం చేసే ఎటువంటి చర్యలూ సమర్థనీయాలు కాదు. అభివృద్ధి చెందుతున్న శాస్త్రసాంకేతిక విషయాలనన్నీ మాతృభాషకు అనుసంధానం చేయాలి. తెలుగులో చదువుకుంటే ఉపాధి, ఉద్యోగాలు లభించవన్న మాటను పరాస్తం చేయాలి. ప్రభుత్వోద్యోగాలకు తెలుగులో మాట్లాడటం, చదవడం, రాయడం, ఆలోచించడం అనివార్యం చేయాలి. ఈ పని ప్రభుత్వాలే చేయగలవు. ప్రభుత్వంచేత ఆ పని చేయించేలా ప్రజలు జాగృతమవాలి. అలాంటి ప్రభుత్వమునే ప్రజలు తమ పాలనకు ఎన్నుకోవాలి. ఇది విధాయకం.

సరే! భాషను పరిరక్షించుకోవడం, భాషావికాసం అనేవి మౌలికంగా ప్రతి ఒక్కరూ తమదైన జీవనసంవిధానంగా చేపట్టడం కూడా నేటి అవసరం. ఇవాళ చాలామంది పెద్దలు కూడా– తెలుగు చదవడానికీ, రాయడానికీ దూరమవుతున్నారంటే ఒకరకంగా అది స్వయంకృతాపరాధమే. తమ పిల్లలనూ, పిల్లల పిల్లలనూ కూడా తెలుగు భాష పఠనానికీ, లేఖనానికీ అపరిచితులుగా మారుస్తున్న దుస్థితికి కొందరు తామే హేతువులయ్యామన్న విషయాన్ని ఆలస్యంగానైనా గ్రహించడం మంచిది. విద్యావ్యవస్థ మీద యావత్తు నేరాన్ని నెట్టివేయవచ్చుగానీ– వాస్తవానికి ఇల్లే మొదటి బడి. తల్లిదండ్రులే తొలి గురువులు. బడిలో గురువులున్నా, ఇంట్లోవారు శ్రద్ధపెడితే పిల్లలకు తమ భాష మాట్లాడటం, చదవటం, రాయటం– క్షుణ్ణంగా నేర్పించి నిష్ణాతులను చేయగలరు.

విద్యా, విజ్ఞానం అనేవి కేవలం పాఠ్యాంశాలకు, పరీక్షలకు పరిమితమైనవి కావు. మౌఖికంగా వుండే జానపద సాహిత్యం మొదలుకొని, జ్ఞానపథగాములను చేసే రామాయణ, భారత, ప్రబంధ, శతక సాహిత్యాల నుండి ఆధునిక సాహిత్యం వరకు– పద్యం, గేయం, కథ, కవిత, నవల, నాటకం ఇలా అనేక ప్రక్రియాపరమైన అద్భుత సాహిత్యం మన సొత్తు. భాష చదవడం వచ్చినప్పుడు ఆ పాఠ్యేతర గ్రంథాలు చదవడం, తెలుగు రాయడం వచ్చినప్పుడు– తమకు నచ్చిన వాటిని రాయడం కూడా సాధ్యమే! అలా చేసి లాభపడిన తరాలు వున్నాయి. నిరంతరం భావితరాలకు ఆ వైఖరి ఎలాంటి అవాంతరం ఏర్పడకుండా అందేందుకు అభ్యంతరాలు వుండని స్ఫూర్తి నిలచి సాగాలి.

సంఖ్యలో తగ్గినా– నేటికీ తెలుగు దిన, వార, మాసప్రతికలు, తెలుగులో సాహిత్య, సాహిత్యేతర గ్రంథాలూ అనేకం వెలువడుతూనే వున్నాయి. అయితే భాషకు ఇవి ఎలా తోడ్పడుతున్నాయనేది కూడా ప్రధానంగా ఆలోచించుకోవాల్సిన అగత్యం వుంది. తెలుగు చదవడం వచ్చినవారు, అక్షరాస్యులు మాత్రమే– పత్రికలయినా, పుస్తకా లయినా చదవగలుగుతారు. అయితే ఆ చదివేవారిలో కూడా భాషపట్ల పట్టూ, ఆసక్తి వున్నప్పుడే ఎలాంటి రచననయినా అర్థంచేసుకుని రసానందం పొందగలుగుతారు. కవులూ, రచయితలూ కూడా పఠితృలోకంలో భాషపట్ల, సాహిత్యంపట్ల అనురక్తినీ, అభినివేశాన్ని పెంచే కృషిచేయాలి. సీరియల్ నవలలూ, కథలూ వంటివి తెలుగు పత్రికలలో చదవని పాఠకులు సైతం– చిన్నవిగా వుండే వివిధ శీర్షికా రచనలను చదవడం చేస్తూంటారు. అలాగే కాలక్షేపం కోసమే అయినా, మెదడుకు మేత పెట్టే సుడోకు, క్రాస్‌వర్డ్ పజిల్స్ పూర్తి చేస్తూంటారు. నిజానికి క్రాస్‌వర్డ్ పజిల్స్ అనబడే పదబంధ ప్రహేళికలు తెలుగులో ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆ కారణాన్నే ఇప్పటికీ అనేక తెలుగు దిన, వార, మాసపత్రికల్లో ఈ పదబంధ ప్రహేళికలు పాఠక జనాదరణ పొంది, పత్రికల అమ్మకాల విస్తృతిలో కూడా తమవంతు కర్తవ్యాన్ని పరోక్షంగా చూపిస్తున్నాయి.

సుడోకు వంటి అంకేళి ప్రహేళికలకన్నా, విస్తృత ప్రయోజనాన్ని, భాషా సేవను పదబంధ ప్రహేళికల ద్వారానే– ఇచ్చిన ఆధారాలననుసరించి గడులలో పదాలు నింపడం ద్వారా, తెలుగు భాషలో తమకు గల పట్టునూ, పదసంపదనూ, పరీక్షించుకోవడం, తమ భాషా సాహిత్య పరిజ్ఞానాన్ని పునర్మూల్యాంకనం చేసుకోవడంద్వారా కలిగించడం సాధ్యమవుతుంది. మరుగునపడిన ఎన్నో

భాషాపదాలను గుర్తు చేసుకోవడం, గడులను సరియైన పదాలతో పూరించడం కోసం నిఘంటువులను తిరగవేయడం అనేది పాఠకులు చేస్తున్న ఏకైక సందర్భంగా– ఈ పదబంధ ప్రహేళికలు ఉపయుక్తమవుతూ భాషాసేవ చేస్తున్నాయి. పదబంధ ప్రహేళికల గడులు కూర్చడంలోనూ, నింపడం లోనూ కూడా భాష దోహదం చేస్తుంది. తెలిసిన పదాలను పునశ్చరణ చేసుకోవడానికీ, తెలియని పదాలను నిఘంటువుల వంటివి శోధించి, తెలిసినవారిని సంప్రదించి తెలుసుకోవడానికీ, భాష మెరుగుపరచుకోవడానికీ, అభివృద్ధి చేసుకోవడానికీ కూడా దోహదమవుతుంది. మెదడుకు మేతగా ఒక మేధోక్రీడగా వుంటుంది. కనుక చురుకుగా వుండేందుకు వీలవుతుంది. కొంత తికమక, కొంత చమత్కారం, కొంత సరసం, కొంత హాస్యం, కొంత నానార్థాల అన్వేషణం– ఇచ్చే ఆధారాలను బట్టి వుంటుంది కనుక, వినోదమూ, వికాసమూ, విషయపుష్టిని అనుసరించి సాహిత్య, సామాజిక, సమకాలీన జ్ఞానానికి తోడ్పడే అవకాశమూ, పుష్కలంగా కలిగివుంది ఈ పదబంధ ప్రహేళిక.

పిల్లలకు గళ్ళనుడికట్టులు నింపే అభిరుచిని కలిగిస్తే వారికి మన భాషపట్ల ఆసక్తి, అభినివేశమూ కలిగే వీలుంది. అందుకే నేడు అచ్చుపత్రికలలో మాత్రమే కాకుండా, అంతర్జాలంలోనూ పిల్లలకూ, యువతకూ ఇవి అందుబాటులోకి వస్తున్నాయి. అంతర్జాల పత్రికలు, వెబ్‌పేజీలు, మొబైల్ ఆప్‌లు వీటిని అందిపుచ్చుకుంటున్నాయి. ఈ పదబంధ ప్రహేళికలు అనే గళ్ళ నుడికట్టులు– శిష్టాక్షర పదబంధము, పదసమస్య బోధిని, పదబంధ ప్రహేళిక, గడి–నుడి, పదచంద్రిక, నుడిక్రీడ, పదప్రహేళిక, పదవినోదం, పదరంగం, పదచదరంగం, పదరసం, నుడికట్టు, పదశోధన, పదబంధం, పదనిసలు, మాటాట, మాటలకొలువు, పదవ్యూహం, పజిలింగ్ పజిల్, పదక్రీడ, పదగారడి, పదవిన్యాసం, పదప్రజ్ఞ, పదకేళి, పదబంధ పారిజాతం, పదకిరణం, అక్షరన్యాసము, మెదడుకు మేత ఇలా రకరకాల పేర్లతో తెలుగు పత్రికలలో ఎనిమిది దశాబ్దాలకు పైగా విరాజిల్లుతున్నాయి.

పదునైన ఊహాశక్తి, చురుకైన మేధ, భాషాపాటవం వీటిని నింపడానికి అవసరం. నిజానికి క్రాస్‌వర్డ్ పజిల్ అనే ఆంగ్లపజిళ్ళ మూలకందంగానే మన తెలుగు లోనూ ఇవి రూపొందాయంటారు. ఆంగ్లంలో 1913 డిసెంబరు 21 న మొదటిసారిగా 'న్యూయార్క్ వరల్డ్' దినపత్రిక తన ఆదివారం అనుబంధంలో దీనిని ప్రవేశపెట్టింది. 1930 లో 'టైమ్స్' పత్రిక ఫిబ్రవరి 1 సంచికలో మొదలు పెట్టింది. 'ద హిందు'

ఆంగ్ల దినపత్రికలో దీనిని నింపడం శ్రీశ్రీ వంటివారికి ఒక వ్యసనంగా వుండేది. నేటికీ 'ద హిందూ' క్రాస్‌వర్డ్‌పజిల్ కొనసాగిస్తూండడం విశేషం!

మన తెలుగులో మొదటిగా 1937 లో ఆంధ్రభారతి పత్రికలో తొలి తెలుగు అపరాధ పరిశోధక నవలారచయితగా మనం చెప్పుకునే– దేవరాజు వేంకట కృష్ణారావు గారు 'పదసమస్య బోధిని' పేరిట ఈ గళ్ళ నుడికట్టును కూర్చారట! తెలుగు గళ్ళ నుడికట్టును 'శిష్టాక్షర పదబంధము'గా ప్రారంభించి, 1945 లో ఆంధ్రజ్యోతి మాసపత్రిక జూలై సంచిక నుంచి పజిల్ కూరుస్తూ, ఆపై 'జ్యోతి' మాసపత్రికలో 'పదబంధ ప్రహేళిక' పేర 1970 ల్లో గొప్ప విస్తృతిని కలిగించింది మహాకవి శ్రీశ్రీయే!. ఆపై ఆరుద్ర ఈ ప్రక్రియను అందిపుచ్చుకున్నారు. నిగూఢ ఆధారాలతో కూడుకున్న ప్రామాణిక పజిల్ ప్రక్రియ భాషాక్రీడ మాత్రమే కాదు, ఏ సాహిత్య ప్రక్రియకూ తీసిపోని ప్రక్రియ. భాషను మెరుగుపరచుకోగల సాధనం, మేధోమథనం, మానసికానందం వీటివల్ల లభిస్తాయి. గళ్ళ నుడికట్టులు నింపడం ఓ వ్యసనంగా మారే వీలుంది. కానీ అది హాని కలిగించదు సరికదా– 'అల్జిమర్స్' వంటి మతిమరుపు వ్యాధి బారిన పడకుండా రక్షిస్తుందని వైద్య పరిశోధకులే తేల్చారు.

ప్రహేళికలు పూరించేటప్పుడు భాషలో ఆధారానికి సరిపడే సరియైన పదం అన్వేషించాల్సి వుంటుంది. పర్యాయపదాలకోసం ఆలోచించాలి. అవసరమైతే నిఘంటువుల్లో వెతకాలి. అందువల్ల కొత్తకొత్త పదాలను ఎన్నింటినో నేర్చుకొని, భాషను అభివృద్ధి పరుచుకోవచ్చు. జవాబులుచూసి, తెలియని (భాషలోని) కొత్త సొబగులను గ్రహిస్తాం. మెదడుకి వ్యాయామం కలిగిస్తాం కనుక, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఆధారాలను తయారుచేసే పద్ధతిలోనే కూర్పరి ప్రజ్ఞ వుంటుంది. ఆ ప్రజ్ఞను యథారీతి పజిల్ నింపే పాఠకుడు పట్టుకోగలగాలి. ఆధారాలను గొప్ప వైవిధ్యంతో, వైచిత్రితో ఇవ్వడానికీ, ఇచ్చినవాటిని గ్రహించడానికీ భాష బాగా రావాలి. ఆధారాలలోని రహస్యాన్ని విడుపు చేయగలిగే మేధా, ఊహాశక్తి అవసరం. ఒక ఆధారాన్ని ఆకళింపు చేసుకుని సరైనపదాన్ని రాబట్టి గడి నింపినతరువాత– పాఠకునికి కలిగే ఆనందం, సంతృప్తి అనిర్వచనీయాలే! అవి ఎందరికో అనుభవైక వేద్యాలే! అసలు తెలుపు, నలుపు గడుల చదరంగం చూడగానే ఒక నిర్మాణ సౌష్ఠవం, సౌందర్యం వుండి పదబంధప్రహేళిక నింపాలన్న ప్రేరణ కలిగించాలి. అలాగే నేరుగా ఉండే ఆధారాలు– ఒకటే పదం ఇచ్చినా, దాని సమానార్థక పదం సమాధానంగా భాషలో అన్వేషించుకునేదిగా తోడ్పడుతుంది. నిగూఢార్థాలు వాక్యరూపంలో వుండి– కొంత

తికమకపెట్టి ఒక్కోసారి ఆధారంలోనే సమాధానం దాగివుండి, మరికొన్ని జటిలంగా అనిపించినా, సమాధానం స్ఫురించగానే గొప్ప కేరింత అందిస్తాయి. ఆనందంలో, సంతృప్తిలో తేలియాడిస్తాయి.

పదబంధ ప్రహేళికలను కూర్చడంలో శ్రీశ్రీ, ఆరుద్రల పజిళ్ళూ, గొప్ప ప్రామాణికతతో నేటికీ ఎలనాగ సంతరిస్తున్న పజిళ్ళూ– అలాగే పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సుధామ, నిశాపతి, అదృష్టదీపక్, ఎన్.సురేంద్ర, ఘంటసాల నిర్మల, వాడ్రేవు ఉమాశంకర్, గొరుసు, జె.ఎస్.ఎన్.మూర్తి (విహారి), బాలు, వాణిశ్రీ, నిర్మల, నీరజ, కావూరి వెంకటసుబ్బారావు, హుమయూన్ సంఘీర్, జి.శుభాకరరావు, మణికుమారి, కె.బి. గోపాలం, ప్రదీప్, వెలివల సాంబశివరావు, పెన్నా శివరామకృష్ణ, సత్యసాయి కొవ్వలి, భైరవభట్ల కామేశ్వరరావు, కన్నోజు లక్ష్మీకాంతం, త్రివిక్రం, పప్పు నాగరాజు, రామనాథరెడ్డి, సిముర్గ్, చదువరి, కంది శంకరయ్య, కొల్లూరి కోటేశ్వరరావు, ఎం.దత్తాత్రేయశర్మ మొదలైనవారు ఎందరెందరో ఈ పజిల్స్ నిర్మాతలుగా వున్నారు. ఎవరి పేరయినా పేర్కొనకపోతే తెలియనితనమే తప్ప, విస్మరించే ఉద్దేశం కాదని గ్రహించాలి మరి!

శ్రీశ్రీ కూర్చిన పదబంధ ప్రహేళికలు విరసం ప్రచురించిన వారం వారంలో, మనసు ఫౌండేషన్‌వారి శ్రీశ్రీ కదంబప్రస్థానం మూడో సంపుటిలోనూ, నమోదయ్యాయి. తెలుగులో గళ్ళ నుడికట్టులు గ్రంథరూపంలో వచ్చినవి సంఖ్యలో తక్కువ అనే చెప్పాలి. శ్రీయుతులు పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సత్యసాయి కొవ్వలి, ఎలనాగ తమ గళ్ళ నుడికట్టు గ్రంథాలను ఇటీవలికాలంలో వెలువరించారు. మీ సుధామ పీఠికతో ఎలనాగ వెలువరించిన ప్రామాణిక తెలుగు గళ్ల నుడికట్టు గ్రంథం 'నుడిక్రీడ'లో– పాత తెలుగు క్రాస్‌వర్డ్‌లలోని ఉత్కృష్ట ఆధారాలు వ్యాసరూపంలో సంతరించబడడం ఒక విశేషం! శ్రీశ్రీ పదబంధ ప్రహేళికలలోని భాషా చమత్కారాలనూ, సొగసులనూ ఆ వ్యాసంలో గ్రహించగలం. తెలుగు పత్రికలతోబాటు– అంతర్జాలంలో ఈ మాట, వాకిలి, పొద్దు, కౌముది, మాలిక వంటి అంతర్జాల పత్రికలు తెలుగు భాషావికాసానికీ, ఈతరం యువత ఆసక్తికీ ఈ ప్రహేళికల ద్వారా దోహదపడుతున్నాయి.

పదబంధ ప్రహేళికలు భాషలోని చమత్కారాలకూ, సొగసులకూ ఆధారాలతో ఎలా భిత్తికగా నిలుస్తాయో, పదాలను గ్రహించడానికి ఎలా భాషలో, భాషతో ఆటలాడిస్తాయో వాచవిగా కొన్ని ఉదాహరణలు చెప్పుకుందాం. శ్రీశ్రీ పదబంధ ప్రహేళికల్లోని కొన్ని ఆధారాలు ఇలా వుంటాయి.

☆ కష్టజీవికి ఇరువైపులా ఉండేవాడు(2)

–ఇది శ్రీశ్రీ పేర ప్రసిద్ధిచెందిన ఆధారం. 'కష్టజీవి'లోని మొదటి, చివరి అక్షరాలను కలిపితే కవి వస్తుంది. కవి అన్నవాడు ప్రజలపక్షం వహించాలని భాషలోని చమత్కారం.

☆ విరోధాలు రాత్రికి కావచ్చు (3)

–విరోధాలుకి సమానార్థకం పదం తెలుగు భాషలో– పగలు (శత్రుత్వాలు), పగలు అన్నది రాత్రికి విరుద్ధం. ఇదే ఈ ఆధారంలోని భాషాచమత్కారం.

☆ పండు, నీళ్ళలో కొట్టేది (2)

– దీనికి ఈత సమాధానం. ఈతపండు ఉంటుంది. నీళ్ళల్లో కొట్టేది ఈత.

☆ కల కతన మారిన పసిడితీగ (3, 2)

– కల కతన ను సరిచేస్తే వచ్చే 'కనకలత' దీని జవాబు.

☆ పిల్లిలేని పినతల్లి వికారంతో కూడితే గరుత్మంతుని తల్లి.

– పినతల్లిలో పిల్లి అనే అక్షరాలు తీసేస్తే, నత. దానికి వికారం చేరిస్తే వినత. గరుత్మంతుని తల్లిపేరు వినత. ఈ ఆధారం భాషా చమత్కారంతోబాటు పురాణ పరిజ్ఞానాన్ని కలిగించేదిగా వుందని వేరే చెప్పాలా! ఇలా ఉదాహరించాలంటే అవి అనంతాలు.

శ్రీశ్రీ బాటలోనే ఎందరో పదబంధప్రహేళికా కూర్పరులు– భాషతో ఆటలాడుకునేలా, మెదడుకు మేతగా, చమత్కారభరితంగా, కొంత జటిలంగా, నిఘంటువులు వెతుక్కునేలా, పర్యాయ పదకోశాలు పరామర్శించేలా, పెద్దలను సంప్రదించేలా– తాము ఆధారాలు ఇస్తూ వివిధ పత్రికలలో ఈ నుడికట్టులను కూరుస్తూ భాషా, సాహిత్య సేవ చేస్తున్నారనక తప్పదు. కొన్ని పత్రికలు– ఈ ప్రహేళికలు సరిగ్గా సమాధానాలు రాసి పంపినవారి పేర్లను తదుపరి సంచికలలో ప్రకటిస్తూ వుండగా, మరికొన్ని పత్రికలు ఒక పోటీలాగా నడుపుతూ– నగదు బహుమతులనూ, పుస్తకరూప బహుమతులను కూడా అందిస్తున్నాయి. పజిల్ సరిగ్గానింపి సరైన సమాధానాలు రాసిన వారి పేర్లలో అచ్చులో తమపేరు చూసుకుని పొంగిపోయేవారూ, అలాగే బహుమతులు పొంది ఆనందించేవారు అసంఖ్యాక పాఠకులున్నారు.

ప్రముఖ కథకులు శ్రీ కాశీపట్నం రామారావుగారు తొంభైవపడి దాటి కూడా నేటికీ ఈ ప్రహేళికలు నింపుతూంటారు. తన మెదడుకు మేత అని ప్రశంసిస్తూంటారు. వి.ఏ.కె. రంగారావుగారు ప్రహేళికల అచ్చులో చిన్నపొరపాటు దొర్లినా నిలదీస్తూంటారు. పొద్దున్న కాఫీ తాగగానే దినపత్రికలోని 'మాటాట' తాము, తమ డాక్టరుగారు కలసి నింపుతామని ప్రముఖ కార్టూనిస్టు సురేఖగారంటూంటే– వయోధిక సమాజాల వారు కొందరు– తమ సభ్యుల మధ్య వీటి పోటీ నిర్వహించి బహుమతులిస్తూంటామని చెప్పారు. నిజానికి పాఠశాలల్లో గ్రంథాలయ తరగతి పెట్టి, పుస్తకాలు చదవడంతోబాటు విద్యార్థులు ఈ ప్రహేళికలు నింపేలా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులూ వున్నారు. టీవీ మాధ్యమాలు కూడా వీటిని అందిపుచ్చుకుంటే ఎంత బాగుంటుందో కదా! పదబంధ ప్రహేళికలపై ఏ విశ్వవిద్యాలయంలోనయినా, ఎవరయినా, డాక్టరేట్ పట్టానికై సిద్ధాంత గ్రంథం రాయదగినంత సమాచారంతో ఎందరో కూర్పరులు ఇచ్చే ఆధారాల ననుసరించి– పదబంధ ప్రహేళికలు తెలుగు భాషాసేవలో ఎలా ఉద్యుక్తమై ఉపయుక్తమవుతున్నాయో పరిశోధించవచ్చు. 'పదబంధ ప్రహేళికలు' భాషా వికాసానికి తెరిచిన వాకిళ్ళు. ఆబాల గోపాలాన్నీ అలరించగల లోగిళ్ళు.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ స్వర్ణోత్సవాల సందర్భంగా– రాష్ట్రసృజనాత్మకత మరియు సంస్కృతి సమితి, విజయవాడ వారి 'దేశభాషలందు తెలుగులెస్స' గ్రంథం: 10 ఫిబ్రవరి 2018)

❖

(55) కవి తల పోతగా ఉగాది

'కవిత్వంలో పదాలను కాదు, పరీమళాన్ని అనుభవించు' అంటాడు శ్రీరాళ్ళబండి కవితాప్రసాద్. ఉగాది గురించీ, వసంతం గురించీ కవిత రాయని కవి అంటూ లేడేమో!

పండుగ ప్రత్యేక సంచికల్లో– ఉగాది గురించి ఏటికేడాదిగా పత్రికల్లో ఒక్క కవితయినా ప్రచురించకుండా ఉండడం అరుదు. వసంతం ఎప్పుడొచ్చినా కోయిల పాట ఒక్కటే! ఆ 'కుహూకుహూ' రవాలలో– మనసు రసపరిమళాలను ఆఘ్రాణిస్తుంది అంతే!. ఉగాదిని ఆలంబన చేసుకునే– అనుభూతి నుండి అభ్యుదయ, విప్లవ భావ చైతన్యాల వరకూ కవులు వెలార్చిన వైనాలున్నాయి. మునుపు 'ఉగాది' అనగానే పంచాంగశ్రవణంతో బాటు, కవిసమ్మేళనమూ విధాయకం అన్నట్లుండేది. అదే విధంగా ఆ రోజుల్లో– 'రేడియో' ఒక్కటే ప్రసార మాధ్యమంగా వెలుగొందిన రోజుల్లో, ఉగాది కవిసమ్మేళనం వినడానికి శ్రోతలు రేడియో సెట్లముందు ఆసీనులయ్యేవారు. విశ్వనాథ సత్యనారాయణ వంటి సంప్రదాయవాద కవీ, శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవీ– ఉగాది కవిసమ్మేళనమనే ఒకే వేదికను పంచుకుని ప్రేక్షకులను పరవశింప చేసేవారు.

ఉగాది కవిసమ్మేళనానికే ఎందుకంత ప్రాముఖ్యం? అంటే– అది తెలుగుల 'వత్సరాది' కావడమే!. కొత్త సంవత్సరం, కొత్త కోరికలు, ప్రకృతిలో కొత్త శోభ– అంతా నవనవోన్మేషం.

'కొత్త సంవత్సరం వచ్చిన మూడో నెలలోనో, నాలుగో నెలలోనో ఉగాది పండుగ వస్తుందని' ఈ తరం– జనవరితో ప్రవేశించే ఆంగ్ల సంవత్సర కొలమానంతో గణించుతోంది కానీ, నిజానికి ఇప్పటికీ 'శుభకార్యాలంటే'– తెలుగింట ఉగాదితో మొదలయ్యే పంచాంగాల ప్రాముఖ్యం దీపిస్తూనే ఉన్నందుకు సంతోషించాలి.

డిసెంబర్ 31 పోయి, జనవరి ఒకటి రావడం– నిజానికి ఓ రాత్రి మళ్ళీ పగలు కావడమే.

కానీ ఉగాది ఆగమనం అలా కాదు. అది ప్రకృతిలో మార్పుని దృశ్యమానం చేస్తుంది.

క్షితిపయి వట్టి మ్రాకులు చిగిర్ప వసంతుడు తా రసోప గుం
ఫిత పదవాసనల్ నెఱప, మెచ్చక చంద్రుడు మిన్ననం బ్రస
న్నతయును, సౌకుమార్యముఁ గనుబడ ఱాల్ గరఁగంగఁ జేసె నే
గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా!

అంటాడు 'విజయవిలాస' ప్రబంధకర్త చేమకూర వేంకట కవి. వట్టిమ్రాకులు చిగిర్చడమే కాదు, చైత్ర మాసపు మార్పుతో చంద్రుని వెన్నెలలకీ విలువ హెచ్చుతుంది. నిజానికి పోటీ పడినట్లుగా– పువ్వుల వికసనం, గాలుల పరిమళం, పక్షుల కలస్వనం, కోకిలల విశేషగానం, వేపపూత, చెఱుకు పంట, కొత్త బెల్లం అన్నీ ఉగాది కాలానికే. 'స్పర్ధయా వర్ధతే విద్యా' అన్నట్లుగా ఒక దానిని మించి మరొకటి ప్రకృతిలో తమ ఆధిక్యతనీ, విశేషమైన వైభవాన్నీ చూపే తరుణమది. 'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా!' అని కవి అన్న మాట ప్రత్యక్షర సత్యం.

– ఉగాది అంటే కృష్ణశాస్త్రి పాట అన్నమాటా, ఎందరి జ్ఞాపకాల పూదోట లోనిదో వేరుగా చెప్పనక్కరలేదు. 'ఆమని' గురించి ఆయన రాసినన్ని పాటలూ వాసి గలవే!

నవ వసంత శుభోదయానంద వశతఁ
బ్రకృతి నూతన జీవలావణ్యమొంద
ఱాయి అప్పయుఁ గంఠస్వరంబు దాల్చి
నైజగుణముఁ ద్యజించి గానంబు సేయఁ
బికమ, పాడకుమని శపించినారు

అంటూ 'కృష్ణపక్షము'లో 'శాపము' అనే దేవులపల్లి వారి ఖండిక వారి గళం మూగవోయిన దైన్యానికి ద్రష్టసూచిక అనిపిస్తుంది!. 'ఉగాది' అనగానే– ఉల్లాస హాసాలే కాదు, బ్రతుకు 'తీపి చేదుల పచ్చడి' ప్రతీకగా, విషాద స్పృహలూ, సమస్యల కళవళలూ, కవులు అందుకే కవితా వస్తువులుగా స్వీకరించారు. ఉగాదిని భిత్తికగా చేసుకుని గతావలోధనమో, వర్తమాన పరిస్థితుల పరామర్శయో చేస్తూ, ఉగాది కవిసమ్మేళన కవితల్లో కోకిలపాటల గురించే కాదు, రాజకీయ రాబందుల గురించీ, సమాజ సమస్యలనూ ప్రతిబింబిస్తూ అధిక్షేపంగానో, వ్యంగ్యంగానో, తీవ్రంగానో భావప్రకటనం చేయడమూ కవుల కలాల తీరే!

"ఏడు మారినా ఈడు ముదిరినా
ఏమి మారినది ఈ లోకంలో"

అంటూ తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావుగారు 'నా గొడవ' అంటూ ఋతుక్రమంలో 'పరాభవ వసంతం' వంటి పేర్లతో తన కవితా సంపుటాలను వెలువరించారు.

'ఋతు సంహారం' పేర విశ్వనాథ, 'ఋతుఘోష' పేర శేషేంద్ర శర్మ, 'ఋతుచక్రం' పేర డా॥ సి.నారాయణరెడ్డి కాలాన్ని ఆలవాలం చేసుకుని కలం కదల్చి చేసిన రసవద్రచనలలో ఉగాదికాలపు వసంతానికే– 'ఉల్లము' రంజిల్లే పదమధురిమలు–

పరిచయానుద్రిక్త పరిరంభ సమయాన
ప్రియురాలి యెద నెమరించినంత
శీతోదక స్నాన జాత సౌఖ్యము పైని
ముకుపుటానఁ జెమర్పు పుట్టినంత
పేరంటమున కేగు సిన్న బాలిక వాలుజడ
మల్లెమొగ్గ కన్పడినయంత
వంగిన వేపకొమ్మలగాని చిగురీన పజ్జ
యీనెకు బూత పట్టినంత
ఒక దినాన హఠాత్తుగా జికిలి కుహుకుహపు
ప్రొద్దెక్కి దూరపుఁ గోననుండి
సాగి వినవచ్చినంత వసంత మరుగుదెంచెనను
మధురోహస్ఫురించెలోన

అని విశ్వనాథవారు అంటే–

చిగురు చిగురున రాగ శీకరము లొలికించి
యాకునాకున మరకతాకృతి పలికించి
పూవు పూవున మధువు పుకిలింత లొనరించి
వచ్చె కుసుమాస్త్ర భాస్వంతము వసంతమ్ము

అంటారు డా॥ సి.నారాయణరెడ్డి.

ఇరువురిదీ 'జ్ఞానపీఠ'మే! వారల కవితాశక్తి ప్రాంతాల పరిమితిది కాదు! వేయిపడగల విశ్వంభరం.

బాలభాస్కరా
అప్పుడే వచ్చితివా ఉగాది యంచు

బంగారు కిరణాల దుస్తులంగడు
మెరయుచు కులుకుచు

అంటూ బసవరాజు అప్పారావుగారు "వేపకొమ్మలార! నాల్గువేళల నా బిడ్డపైని ప్రాణవాయువులను వీచి బ్రతికించెదరనుకొంటిని" అంటూ పసిబిడ్డను కోల్పోయిన దుఃఖాన్ని ఉగాదికి ఆపాదిస్తూ–

కన్న కడుపయేమి నీకు
కలుగు నెట్టులహర్నిశలు
కసలు పొక్కజేయునాడు
కడుపుమంట వలని తపన

పోయిన వత్సరపు సుఖము
బుల్లి తల్లి తోనె పోవ
నూతన సంవత్సరంబు
నీ తీరుగ వగవనాయె

అని తల్లడిల్లుతారు. అలా ఉగాది కవితలు, బ్రతుకు చేదు జ్ఞాపకాల స్మరణకూ నిలిచిన సందర్భాలు సాహిత్యంలో ఉన్నాయి. ఉంటూనే ఉంటాయి. ఉగాది కవితలో తాము కోల్పోయిన ఆప్తుల గురించో, ఉద్యమంలో అమరుల బలిదానాల గురించో అభివ్యక్తీకరించడమూ కవి నైజంలోనిదే!

బాకాలూది పికాధిరాజు దెసలన్ పల్కించె మార్మోతలన్
చీకాకై శుకశారికా గణము విచ్చెన్ నోళ్లు నీళ్ళంచు నా
ళీకశ్రీక సరస్తటమ్ముల రసాలీపాక ధారా రసం
బాకంఠమ్ముగ ద్రావ రాగదవె బాలా! ఆమ్రపాక స్తనీ!

అంటాడు దాశరథి తన 'అగ్నిధార'లో ఒక చోట.

ఈ నాటి కవులూ పండుగ కవితలు రాస్తున్నారు కానీ అవి కేవలం ప్రకృతిగత శుకపికాల వర్ణనలతో, ఒకప్పుడు పండుగ ప్రత్యేక సంచికలకు పర్వానుభూతులద్దిన శ్రీ శనగన నరసింహస్వామి, మొవ్వ వృషాద్రిపతి వంటి వారి భావుకతల బాటల్లో కాక, అభ్యుదయ పరంపరాభివృద్ధిగా శ్రీశ్రీ, ఆరుద్ర, సోమసుందర్, జాషువా, బోయి భీమన్న వంటి ఎందరెందరో కవుల ఒరవడిలో, సామాజిక చైతన్యపు వేడితో, వాడితో అభివ్యక్తమవుతున్నాయి. పండుగ కవితలు రాయడమే రోతగా ఒక భావం ప్రబలిన

వారున్నా, అవసరార్థం ఉగాది కాలాన్ని ఆలంబనం చేసుకుని కవితాభివ్యక్తికి వెనుదీయడం లేదెవ్వరూ!

ఉగాది దేవరా– జగాల బ్రోవరా
జనాల కావరా– ఉగాది దేవరా!
ప్రతీక్షణం అనేక మంది పుడుతున్నారు
ప్రతీదినం అనేకమంది వెడుతున్నారు

గతించినట్టి వారి వంతు పావు కాగితం
జనించినట్టి వారి హక్కు గొప్ప స్వాగతం
ఉగాది దేవరా...

అదేమిటో ప్రవేశముతో సరదా నాకు
అలాగనే పలాయనాలు ఘబరా నాకు
సమాధి మీద కార్చలేను నక్రాశ్రువులు
ఉగాది మీద జల్లగలను ఊహాంశువులు
ఉగాది దేవరా...

వసంత సుందరా! ఉగాది దేవరా! దొరా!
ఉషస్సుతో తమస్సు పోరి గెల్వలేదురా
చస్తున్న వారితో జగత్తు చావబోదురా
వస్తున్న దాని రాక నాపువాడె లేడురా...
ఉగాది దేవరా...

అంటూ శ్రీశ్రీ 'జనశక్తి' ద్వైవారపత్రికలో, 1966 లో రాసినట్లు– కొత్త ఉగాది భావాల కవితలు వస్తున్నవాని రాక నెవరూ ఆపలేరు.

"నిజాన్ని కప్పి పుచ్చి
అబద్ధపు కవిత వ్రాయలేను
కవిసమ్మేళనాలలో పాల్గొని
నన్ను నేను వంచించుకోలేను

నానాటికీ దిగజారే మానవతా విలువలను
కవిగా హర్షించలేను

నేటి చేదు నిజాలపై అబద్ధపు దుప్పటి కప్పి
ప్రజలను వంచనతో నమ్మించలేను

అర్జునా... ఫల్గుణా... పార్థివా అని నిత్యం స్మరిస్తూ కళ్ళు మూసుకోలేను. ఆహ్వానం లేకనే విచ్చేసే ఉగాదికి స్వాగతం పలుకలేను" అంటాడు యస్.వివేకానంద అనే కవి (ఇంద్రధనుస్సు: కవితాసంపుటి).

"నీకు నువ్వే లక్ష్యం నీకు నువ్వే గమ్యం
దారీ నీదే నడకా నీదే
నువ్వు నువ్వుగా లేనంత వరకు
శాంతి నీ తలుపు తట్టదు
వసంతం నీ ముగింట వాలదు"

అంటాడు రొక్కం కామేశ్వరరావు (అంతర్వీక్షణం: కవితా సంపుటి)

"తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు
పంచాంగాలుగా చేసుకుని
అతను పురాణ శ్రవణాన్ని కొనసాగిస్తుంటే
ఓటు, నోటు, మద్యం, నేరం, కులాలు
వంచనాంగాలుగా చేసుకుని
రాజకీయాలు దారుణ గరళాల్ని ప్రజలచేత
మింగిస్తున్నట్టు నా కనిపించింది"

అని అంటాడు కె.ఆంజనేయ కుమార్ (మీకు దగ్గర్లోనే: కవితా సంపుటి)

"ఊళ్లకుగాదొచ్చింది. ఉర్కిరాని ఉర్కిరాని" అంటూ ఉగాది మీద తెలంగాణ జీవద్భాషలోనే యువకునిగా కవిత పలికి ఆ రోజుల్లోనే ప్రసిద్ధుడైన కవి డా॥ దేవరాజు మహారాజు 'కవితావరణం' నేడు విశ్వకవితానువాద పతాకను, రెపరెపలాడించేదిగా విస్తృతమవడం విశేషమే మరి!

రుబాయీల సంపుటాలు ఎన్నో వెలువరించిన శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యులు గారు ఉగాది గురించి వైవిధ్య భరితంగా రుబాయీలు రువ్వారు–

నీవే జనాళి పాలిటి ఆశాభవనం
నీవే భారత సంస్కృతి సుందర భవనం

ఓ ఉగాది! ప్రతి చరణం ఒక కిరణంగా
ప్రజలకు దారులు చూపే విప్లవ కవనం

నీలో ఏదో మంత్రం ఉన్నది
నీలో ఏదో తంత్రం ఉన్నది
ఓ ఉగాది! ఒక నవ విధాతగా
ఊపిరూదు స్వాతంత్ర్యం ఉన్నది

ప్రజలంతా సమానమే బడుగువాడు లేవాలి
విరులన్నీ సమానమే గిరిమల్లిక కావాలి
ఓ ఉగాది! దేశానికి అంగిరసం అభ్యుదయం
నవరసాలు సమానమే; శాంతి రసం కావాలి

అని ఉగాదిని విప్లవ కవనంగానూ, శాంతి స్థాపనా స్వాతంత్ర్య దీప్తిగానూ సంభావించడం విశేషం.

సినీకవిగా సుప్రసిద్ధులైన సిరివెన్నెల సీతారామశాస్త్రిగారు ఉగాది కాలాన్నీ, మధుమాసాన్నీ గురించి ఈ నాటికీ భావకవితాంబరాన విహరింపచేస్తూ ఇలా అంటారు–

మధుమాసమా మధుర పదకోశమా
మదనాస్త్రమా మధుపస్వర శాస్త్రమా
కమలాస్యమా విమలసుమ లాస్యమా
ప్రియపాశమా పసిడి పరివేషమా
నిదురించు హృదయాల కదిలించి ఉదయాన
మృదులీల మధుకీల రగిలించగా
మురిపాల వరబాల సవరించు స్వరహేల
సరసాల సురసాల సృజియించగా
ఇలనేలు మా కడలు ఘన కాలమా
సకల జనతోషమా ప్రకృతి దరహాసమా
సుఖమస్తు అనరయమ్ము
శుకమంత్రమా ప్రథమ పికగాత్రమా

అంటూ కాలంతో రసానుకూల కరచాలనం చేస్తారు.

ఉగాది అచ్చమైన తెలుగు పండుగ. తెలుగు వారి నూతనవత్సరాది. తలంట్లతో, కొత్తబట్టలతో, పిండివంటలతో, పంచాంగ శ్రవణంతో, కవి సమ్మేళనాలతో కళకళలాడేది ఉగాది.

పాతిక సంవత్సరాల క్రితం ఎప్పుడో 1986 లో కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు వెలువరించిన 'ఆనందలహరి'లోని 'తెలుగు వెలుగుల ఉగాది' లోని పంక్తులు నేటికీ చిరస్మరణీయాలు, ఆచరణాత్మకాలు.

ఆంధ్రులిద్దరు కలిసినప్పుడు తీయని
తెనుగులో మాటాడు కొనిన 'తీపి ఉగాది'
సతుల వెన్నాడు ముష్కర కీచకుల తలలే
చితుకగొట్టిన నాడె బ్రతుకు తెరువు ఉగాది

'మాది మే' మను స్వార్థ భేద బుద్ధి తొలంగి
'మనది మన' మను బుద్ధి గానిన మేలి ఉగాది
కోటీశ్వరులు కోట గుమ్మాలు తెరచి క్షు
ధార్తుల వ్యథ మాన్ప నదియె మేటి ఉగాది

ఒళ్ళు మైకము వదలి ఫైళ్ళు ముందుకు కదలి
ముళ్ళు విప్పిన అదే ముచ్చటైన ఉగాది
ఆరు కోట్ల తెలుంగు లన్నదమ్ముల మంచు
ముందడుగు వేయుటయె అందమైన ఉగాది

అదియె తెలుగు ఉగాది అదియె వెలుగు పునాది
అచ్చమైన ఉగాది మచ్చలేని ఉగాది.

ఉగాది కవితల్లోని కవుల భావాల ప్రోది, మానవ జీవన వికాసానికి దోహదపడాలనీ, నవజీవన భవన పునాదిగా 'ఉగాది' హృదయాంతరాళల్లో నిలవాలని కాంక్షిస్తూ... శ్రీ విజయోస్తు!

(చిత్ర మాసపత్రిక, ఏప్రిల్ 2018)

❖

(56) శ్రవ్య మాధ్యమ శకపురుషుడు

బాలాంత్రపు రజనీకాంతరావుగారి అస్తమయంతో శ్రవ్య మాధ్యమంలో ఒక శకం ముగిసింది. ఆకాశవాణి శ్రవ్య మాధ్యమ శకపురుషుడు ఆయనే! జేజిమామయ్యగా బాలసాహిత్యంలో 'ఆటలు ఆడీ- పాటలు పాడీ- అలసీ వచ్చానే- తియ్యా తియ్యని తాయిలమేదో తీసీపెట్టమ్మా' అంటూ తన పాటలతో పసిపిల్లల గుండెలలో ఎంతగా నిలిచిపోయారో, 'ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర' వంటి కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి పొందిన ఉద్గ్రంథ రచనతో, అలాగే సంగీత నాటక అకాడమీ పురస్కారాన్నీ అందుకోగలిగిన సృజనతో- ఒకవంక రేడియోలో లలితసంగీత వైభవ ప్రాభవాల మూలకందంగా, సంగీత రూపకాలతో, మరోవంక రంగస్థలంపై శోభానాయుడు వంటి ప్రముఖ నర్తకి ప్రదర్శనలకై నృత్యరూపక రచనలతో అశేష శ్రోతృజన, ప్రేక్షక జనహృదయాలలో సాటిలేని మేటి ప్రతిభామతిగా నిలిచిపోయారు.

1920 జనవరి 29 న పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో బాలాంత్రపు వేంకటరావు, వేంకటరమణమ్మలకు రెండో సంతానంగా జన్మించిన ఆయన, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఆనర్సు చేసి, పింగళి లక్ష్మీకాంతం శిష్యునిగా సాహిత్య సీమలో, వీణ సంగమేశ్వరశాస్త్రిగారి శిష్యులైన మండావారి శిష్యునిగా సంగీత వేదికపై వాగ్గేయకారుడిగా, లయకారుడిగా గణనకెక్కారు.

1941 లో ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో చేరి వృత్తిరీత్యా చివరంటా జీవనోత్సాహాన్ని నింపుకున్నవారాయన. ఆకాశవాణిలో ఆయన చేసిన ప్రయోగాలనేకం. కృష్ణశాస్త్రి-రజనిల జంట ఆనాడు ఇంటింటా శ్రవణసుభగ కార్యక్రమాలతో ఆత్మీయంగా పెనవేసుకుపోయింది. రజనిగీతాలు 'శతపత్ర సుందరి'గా నడయాడాయి. రేడియోలో 'భక్తిరంజని' అంటే గుర్తుకు వచ్చేది 'రజని'యే! అంతేకాదు లలిత సంగీత రూపకాలకు ఒరవడి పెట్టిందీ, రేడియో ద్వారా దేశభక్తిని పరివ్యాపితం చేసిందీ రజనియే!

స్వాతంత్ర్యం లభించిన 15 ఆగస్టు 1947న ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రసంగం అనంతరం మద్రాసు రేడియో ప్రసారం చేసిన గీతం రజనిగారు రాసిందే. టంగుటూరి సూర్యకుమారి గళంలో 'మాదీ స్వతంత్ర దేశం– మాదీ స్వతంత్ర జాతి', 'మోగించు జయభేరి' దేశభక్తి గీతాలు శ్రోతలను హర్షపులకాంకితులను చేశాయి. మద్రాసు కేంద్రంలో పనిచేస్తూ– కలకత్తా రేడియో విని, ఆయన రవీంద్ర సంగీతాన్నీ, బెంగాలీ రసమాధుర్యాన్నీ తెలుగులోకి తెచ్చారు. 'భువనేశ్వరా! తొలగింపుము భయమూ... ప్రభు బాపు దైన్యమూ' వంటి గీతాలు ఒక కొత్త సంగీతాన్ని తెలుగువారికి పరిచయం చేశాయి. 1956 లో 'శ్రీసూర్యనారాయణా మేలుకో హరి సూర్యనారాయణా!' వంటి భక్తిగీతాల ప్రసారంతో భక్తిరంజని కార్యక్రమాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దిన ఘనత వారిదే! బాలాంత్రపు రజనీకాంతరావుగారు తెలుగు సినిమా రంగానికి చేసిన సేవ ఎనలేనిది. ప్రభుత్వోద్యోగి అయినందువలన వెండితెరపై అనామకంగా వున్నా, నళినీకాంత్, తారానాథ్ వంటి కలం పేర్లతో తన ముద్రను చూపనే చూపారు. 'స్వర్గసీమ'– బి.ఎన్.రెడ్డిగారి చిత్రానికి సంగీతం సమకూర్చి, 'ఓహోహో పావురమా!' అని భానుమతి గళాన మ్రోగిన పాటతో ప్రముఖులయ్యారు.

పేరంటాలు, లక్ష్మమ్మ కథ, గృహప్రవేశం, రాజమకుటం వంటి సినిమాల సంగీతం రజనిదే. ఆయన సృష్టించినన్ని రాగాలు మరొకరి సృజనలో లేవంటారు. ఆంధ్రాలో మొదలిడి విశ్వదర్శన్ వరకూ కర్ణాటక, హిందుస్థానీ, రవీంద్ర సంగీత్, అరబ్బీ సంగీత్ అంటూ తను కట్టిన రాగాలతో సంగీత గంగోత్రిని ప్రవహింప చేశారు. ఆకాశవాణిలో 'కొండ నుండి కడలి దాకా' అనే సంగీత రూపకాన్ని కూర్చి అంతర్జాతీయ బహుమతిని తొలిసారిగా తెలుగు కార్యక్రమానికి సాధించి తెచ్చారు. 'విశ్రాంత గిరి శిఖరం' ఒక కార్యక్రమ మణిపూస!

సంచలన రచయిత గుడిపాటి వేంకటాచలంగారిని ఇంటర్వ్యూ చేసి, రేడియో ద్వారా ప్రసారం చేసిన ఘనత రజనిగారికే దక్కుతుంది. శ్రీశ్రీ చేత రేడియో నాటికలు రాయించినదీ ఆయనే. ప్రతిభ ఎక్కడ వున్నా గుర్తించి, ప్రోత్సహించే నైజం ఆయనది. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, పన్నాల సుబ్రహ్మణ్యభట్టు, ఎస్.బి.శ్రీరామమూర్తి, మల్లాది సూరిబాబు, ప్రయాగ రామకృష్ణ వంటి ఆకాశవాణి విజయవాడ కళాకారులకు ప్రాతఃస్మరణీయులైన గురువు ఆయనే. ఉపాధికి దోహదపడిందీ ఆయనే.

అలాగే రంగస్థలంపై రజనీకాంతరావుగారు రచించిన కళ్యాణ శ్రీనివాసం, శ్రీకృష్ణశరణం మమ, విజయోస్తుతే నారీ వంటి నృత్య రూపకాలు ప్రముఖ నర్తకి

శోభానాయుడుగారికి కీర్తి ప్రతిష్ఠలనార్జించి పెట్టాయి. పద్మశ్రీని తెచ్చి పెట్టాయి. సంగీత సాహిత్యాలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా, ఇంట్లోని పెంపుడు కుక్క స్వరంలో సైతం సంగీత రాగాలే గ్రోలుతూ, కల్మషమెరుగని హృదయంతో నిరాడంబర జీవనం సాగించిన రజనీకాంతరావుగారు 2018 ఏప్రిల్ 22 ఆదివారం అస్తమించడంతో నిజంగానే ఓ శకం ముగిసినట్లైంది. కానీ పాట వున్నంతకాలం రజనీగంధం శాశ్వతంగా వుంటుంది. 'సంస్థా వైభవం' అనేదానిని ఆకాశవాణికి సమకూర్చి పెట్టిన శ్రవ్య మాధ్యమ శక పురుషునికి కిన్నెర సంస్థ 26 న తెలుగు విశ్వవిద్యాలయంలో నివాళి సభ నిర్వహించి ఒక ఉదాత్తస్మృతిని మిగిల్చింది. కె.వి.రమణ, తనికెళ్ల భరణి, ఆర్.అనంతపద్మనాభరావు, పాలకుర్తి మధుసూదనరావు, శోభానాయుడు, ఓలేటి పార్వతీశం, కలగా కృష్ణమోహన్ వంటివారు రజని స్మృతి పరీమళాలతో నివాళులర్పించారు.

తెలుగు సాహిత్య, సంగీత గ్రంథంలో ఒక సువర్ణమయ పుటగా రజని శాశ్వతంగా నిలిచిపోతారు. ఆ ప్రతిభామూర్తికి తెలుగుజాతి కైమోడ్పులు.

(వార్త దినపత్రిక, ఆదివారం అనుబంధం, 6 మే 2018)

❖

(57) కథాభారతి ఫాలభాగపు పెద్ద బొట్టు!

మరణించాక జీవించే మహానుభావులు కొందరు... తమ జీవితంలో 'మరణం' గురించి ఆలోచిస్తూ– తాడితుల, పీడితుల బతుకు 'రణం' గురించి పట్టించుకుని, ఎందరికో 'జీవనగీత'ను ప్రబోధించే స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారు. వారి కలమైనా, బతుకు వ్యాకులమైనా ఆ సమాజహిత చింతనాభిలాష కొరకే! అలాంటివారే పెద్దిభొట్ల సుబ్బరామయ్య.

యథార్థ దృక్కోణంలో, అభ్యుదయ పథంలో జీవన వాస్తవికతలను పట్టుకుని, వాటిని కథలుగా మలచి, మానవీయ విశ్లేషణలనూ, శిల్పసదృశంగా వెంటాడే కథలనూ అందించిన మరపురాని కథకులు పెద్దిభొట్ల సుబ్బరామయ్య. ఆయన ప్రధానంగా మధ్యతరగతి జీవన చిత్రణల కథకుడే! స్వాతంత్ర్యానికి ముందూ, స్వాతంత్ర్యానంతరం తెలుగు సమాజంలో మధ్యతరగతి బతుకుల పరిణామాలూ, మానవ సంబంధాల్లో ఆర్థిక ఆధిపత్యం గురించీ, వ్యవస్థ ఎలా దిగజారుతూ వచ్చిందీ... అంత బలీయంగా చిత్రించిన కథకులు మరొకరు లేరనిపిస్తుంది. ముసలమ్మ మరణం, కళ్లజోడు, గాంధి లాంటి కథలు ఆయనే రాయగలరు. అలాగే మధ్యతరగతి పేద బ్రాహ్మణ కుటుంబాల జీవితాన్ని ప్రతిబింబించేవి– భ్రమ, దుర్దినం, శుక్రవారం, పూర్ణాహుతి లాంటి కథలు.

పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు అనగానే చాలామందికి గుర్తొచ్చే కథలు– ముసురు, గాలి, నీళ్లు, నిప్పు, పొగమంచు, పేరయ్య బావి, చింపిరి, ఇంగువ, వంటి కథలు. భారతి, ఆంధ్రపత్రికలో కథలు రాసే రచయితలంటే 1960 ప్రాంతాల్లో ఓ గొప్ప గౌరవం, గుర్తింపు ఉండేది. అలాంటి కథాభారతీయుడు పెద్దిభొట్ల.

1938 డిసెంబర్ 15 న గుంటూరులో పుట్టిన సుబ్బరామయ్యగారు, విశ్వనాథ సత్యనారాయణగారి శిష్యులంటే కొందరికి ఆశ్చర్యం. కృష్ణదేవరాయలి 'ఆముక్తమాల్యద' కావ్యం అంటే పెద్దిభొట్ల వారికి తెగఇష్టం. విశ్వనాథ శిష్యుడైనా... అభ్యుదయ

పథగామిగా, నిజంగా మధ్యతరగతి, అధోజగతి 'జీవుని వేదన'లను ఆకళింపు చేసుకుని, ఆ బతుకులను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ, మనుషుల ప్రవర్తనలకు కారణాలనూ, వాటి వెనుకగల వ్యవస్థాగత నేపథ్యాలనూ చిత్రించి చూపిన రచయిత ఆయన. విజయవాడ ఆయన జీవితానికీ, రచనా జీవితానికీ కూడా కేంద్రస్థానం. లయోలా కాలేజీ అధ్యాపకునిగా సుమారు నాలుగు దశాబ్దాల పాటు పనిచేశారు. తప్పులెక్కలు వేసి డబ్బు ఎక్కువ ఇచ్చామని ఇరవై ఏళ్ల తరువాత ఆయనను పెన్షన్ డబ్బుల నుంచి ఎదురివ్వమనడం... వృద్ధాప్యంలో ఆయనను అలజడికి గురిచేసిన ఓ అంశం.

ఆయన డబ్బు పోగేసుకోవాలనీ, ఆస్తులు కూడగట్టుకోవాలనీ ఏనాడూ అనుకోలేదు. "అవివేకులు ఇళ్లు నిర్మిస్తారని, విజ్ఞులు అందులో అద్దెకుంటారనీ" ఇంగ్లీషులోని ఓ నానుడిలాగా... ఆయన అద్దె ఇళ్ళల్లోనే జీవితాన్ని వెళ్లమార్చారు. అంతేకాదు! కర్మకాండలను వ్యర్థమని నిజమైన అభ్యుదయ దృక్పథంతో విశ్వసించి, మరణానంతరం తన శరీరాన్ని ఆసుపత్రికే ఇచ్చేశారు. అందుకోసం ముందుగానే కుమార్తెనూ, బంధువర్గాన్నీ కూడా తన బలీయమైన అభిలాషను గుర్తెరిగేలా చేస్తూ, తన శరీరాన్ని తీసుకుంటామని ఆసుపత్రి యాజమాన్యం నుంచి రిజిష్టర్ఉత్తరం పొందేవరకూ ఊరుకోలేదు. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్ ప్రతిభా పురస్కారం, గోపీచంద్ అవార్డు వంటివి పొందిన ఆయన ఆ డబ్బులతో 'పెద్దిభొట్ల సాహిత్య పురస్కారం' స్థాపించి సాటి రచయితలను సన్మానించారే కానీ, తనకు అనారోగ్యం అంటూ ఆసుపత్రి ఖర్చులకయినా దాచుకున్నవారు కాదు. నిజం! మనుషులంటే ఆయనకు ప్రాణం. పలకరింపులు అంటే ఇష్టం.

1991 లో ఈ మీ సుధామ ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి పదోన్నతిపై కార్యక్రమ నిర్వహణాధికారిగా వెళ్లినప్పుడు 1995 వరకూ అక్కడున్న రోజుల్లో పెద్దిభొట్ల వారితో గడిపిన క్షణాలు విలువైనవి. వారి కథలు ఆకాశవాణి ప్రసారం చేయడం సరేకానీ, 1994 ఫిబ్రవరి 17 ఉదయం 7.45 కు 'తలచుకునే తరుణాలు' శీర్షికన శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారిని ఇంటర్వ్యూ చేసి, 'వెంటాడే కథ' అంటూ ప్రసారం చేసిన పరిచయ కార్యక్రమం గుర్తుండిపోయిన మధురస్మృతి. ఆయన కూడా తనకు తృప్తినిచ్చిన కార్యక్రమం అని పలుమార్లు పేర్కొన్నారు.

అలాగే 2012 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఆయనకు లభించినప్పుడు ఓ పత్రికలోని సాహితీ పేజీలో 'కమనీయ కథనశిల్పి పెద్దిభొట్ల' అని మీ

సుధామ రాసిన వ్యాసం చదివి వెంటనే విజయవాడ నుండి ఫోన్‌చేసి, స్వయంగా తన ఆనందాన్నీ... కృతజ్ఞతలనూ ప్రకటిస్తూ, చాలాసేపు మాట్లాడిన సందర్భమూ ఒక చిరంతన స్మృతి!. 'ఏకో రసః కరుణ ఏవ' అన్న భవభూతికి వారసుడైన కథా రచయిత పెద్దిభొట్ల అనిపిస్తారు. తన కథల ద్వారా పఠితలలో ఆర్ద్రతనూ, బతుకు తడినీ ఉద్దీపింపచేసిన 'హృదయవాసి' కథకుడాయన!. ఆయన కథ ఏది చదివినా... ఒక 'అనుకంప' జనిస్తుంది. నిజానికి చాలాకథలు విషాదాంతాలే!. కథల్లోని ఆ సంఘటనలు, సందర్భాలు, పాత్రలు పాఠకుడిని మరిచిపోలేకుండా వెంటాడే జీవలక్షణం ఆయన కథల్లో వుంది. పాఠకుల గుండెల్ని పిండడం, కంటతడి పెట్టించడం ఆయన కథల శిల్ప రహస్యం. నేలవిడిచి సాముచేసే కథలు కావవి. ఆయన కథల్లో చాలామటుకు ఆయనే చెప్పుకున్నట్లు అవి సొంత అనుభవాలే, పరిచిత వ్యక్తులే ప్రాతిపదికలు. ఏ అనుభవాన్నీ యథాతథంగా కథగా మార్చడం సాధ్యంకానట్లే స్వీయానుభవమే ప్రతి కథకీ పునాదిగా సమకూర్చడం సాధ్యం కాదు అన్నారాయన.

అయినా 1959 లో బాపు వేసిన బొమ్మతో ఆంధ్రసచిత్ర వారపత్రికలో అచ్చయిన ఆయన మొదటి కథ 'చక్రనేమి' నుండి, రాసిన ప్రతి కథా ఒక భావ తీవ్రతతో రాసిందే! ఆయన ఎక్కువశాతం కథలు ప్రథమపురుషలోనే వుంటాయి. కొన్ని మాత్రమే ఉత్తమపురుష దృష్టికోణంలో వుంటాయి. తన కథల్లో యథార్థ జీవన ప్రతిబింబం ఆయన మక్కువగానీ, కథాకథన వైచిత్రి దృష్టికాదు. ఆయన పలు కథలు ముగింపు దృష్ట్యా మరపురాని ప్రభావంతో గుర్తుండిపోతాయి. స్వప్నభరిత నిద్రయో, మృత్యు సంచికయో, ఓ వర్ష వాతావరణమో కథల ముగింపుగా ఆయన రాసిన కథలు అందుకే బలీయమైన ముద్రవేస్తాయి.

ఆయన ఏ కథ రాసినా, అది ఏ కుల, ఏ వర్గజీవి జీవితమయినా, ఏ సామాజిక అంశం ఇతివృత్తం అయినా, వాటి మూలాల్లోకి వెళ్లి ఆ నేపథ్యంలోంచి జీవితాన్నీ, సామాజిక శక్తుల స్వభావాన్నీ, తత్కారణమైన నేపథ్యాన్నీ దర్శించి చిత్రిస్తారు. విషాదాంత కథలే రాసినా ఆయన కథలు పాఠకులకు జీవితం పట్ల ఆశను చిగురింప జేసేవే తప్ప, నైరాశ్యంలోకి నెట్టేవి కావు. కథా వస్తువు, శిల్పం చెట్టపట్టాల్ వేసుకుని సాగే కథలు ఆయనవి. జీవన బీభత్సాన్నీ, విషాదాన్నీ అంత అసాధారణంగా చిత్రించడం ఆయనకే చెల్లింది. దళిత బ్రాహ్మణ జీవన పార్శ్వాలను కథలుగా చిత్రించిన చరిత్రకారుడన్నమాట కూడా నిజం!

"కరుణ జీవలక్షణమన్నది నా నమ్మకం. అందులో కూడా గాఢమైనదైన నిజం వుందని నేను భావిస్తాను. అలాంటి కథలు నేను చాలా కోపంతో రాస్తానని చెబితే బహుశా మీరు నమ్మరు. మన సమాజం మహాక్రూరమైంది. మతం, కులం, వర్గం, జెండర్ ఏది తీసుకున్నా ఆ విషయం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. రోడ్డుమీద అడుగు పెట్టిన దగ్గర్నుంచీ అడుగడుగునా మన సామాజిక జీవనంలోని క్రూరత్వం సెవెంటీ ఎం.ఎం.లో కనిపిస్తూనే ఉంటుంది. మన మానవ సంబంధాలు బహుబలహీనమైనవి. వాటికి సొంత రంగూ- రుచీ- వాసనా వుండడం అరుదు. ఇలాంటి జీవితాన్ని ద్వేషించ కుండా వుండేవాళ్ల మానసిక ఆరోగ్యం మీద నాకు నమ్మకం లేదు. రచయితగా ఇలాంటి పరిస్థితికి, అసహాయతకి స్పందించకుండా ఎలా వుండగలమో ఊహాతీతం. అది ఆగ్రహం కాక మరోలా ఎలా వుండగలదు? అయితే కరుణ రసాన్ని వాహికగా చేసుకుని నేను నా ఆగ్రహాన్ని ప్రకటిస్తాను.

అది వాచ్యంగా వుండకపోవడం దాని బలహీనత కాదు, బలమే అనుకుంటాను. అలాంటి కథల వల్ల పాఠకుడికి ఒక్కోసారి శోకం ముప్పిరిగొనే అవకాశం ముమ్మాటికీ వుంది. కానీ అది అతగాడిని నిష్క్రియాపరత్వం వైపో, మెట్ట వేదాంతం వైపో తీసుకువెళ్తుందని మాత్రం నేను అనుకోవడం లేదు" అని స్పష్టంగా తనదైన కథారచనా వైఖరిని, దృక్పథాన్నీ ప్రకటించారాయన.

అయిదు దశాబ్దాలకు పైగా తెలుగు కథకు సమకూరిన వైభవ ప్రాభవ దీప్తులలో పెద్దిభొట్ల వారిపేరు నిస్సందేహంగా వుంటుంది. బతుకు కశ్మలాన్నీ, కల్మషాన్నీ క్షాళన చేసుకుంటూ, అమానవీయ సాంఘికాంశాలను విదుల్చుకుని, బతుకుని అర్థం చేసుకుని అర్థవంతమైన జీవనం సాగించడానికీ, జీవితంమీద విమర్శ పెడుతూనే- జీవితం మీద ఆశ కలిగించుకుని, సాటి మనిషిపట్ల ప్రేమతో, కరుణతో, సమాజగత ప్రయోజనకర వ్యక్తిగా జీవించడానికీ- పెద్దిభొట్ల సుబ్బరామయ్య తన కథల ద్వారా ఒక దీపధారిగా నిలిచిపోతారు. కథాభారతి దిద్దుకున్న నొసటి పెద్దబొట్టు పెద్దిభొట్ల సుబ్బరామయ్య 2018 మే 20 నుంచి నిజమైన సాహిత్య జీవన కీర్తిశేషులు. భౌతికత స్మృతిజీవన పరివర్తనమైంది అంతే!.

(వార్త దినపత్రిక, ఆదివారం అనుబంధం, 3 జూన్ 2018)

❖

(58) ఆగిన 'జీవన తరంగాలు'

నిజమే!

ఆవిడ అమ్మాయిలకు కలలు కనడం నేర్పించారు.

ఆరడుగుల రాజశేఖరం లాంటి అందగాడు, పడవలాంటి కారు,

మధ్యతగరతి యువతికి నాడు మధుర స్వప్నం.

కలలు కనడం తప్పెలా అవుతుంది?

వాస్తవిక ప్రపంచంలో జీవిస్తూనే, ఒక అందమైన, ఆదర్శవంతమైన ఆనంద ప్రదమైన భవితవ్యాన్ని ఊహించుకునే ఆశావహ జీవనలాలస తప్పేమీ కాదు. 'గోరంత దీపం కొండంత వెలుగు- చిగురంత ఆశ జగమంత వెలుగు' అన్నట్లు బ్రతుకు మీద ఆశను, బంధాలు-అనుబంధాల పట్ల విశ్వాసాన్నీ పెంచి, సంసారాల్లో సంతోషాలను నింపిన రచయిత్రి ఆవిడ.

ఆవిడ ఎవరినీ మభ్యపెట్టలేదు. ఆవిడ నవలలు చదివి ఎవరూ ఆత్మహత్యలు చేసుకోలేదు.

ఆ మాటకొస్తే స్త్రీలకు ఆత్మగౌరవాన్నీ, సాధికారతనూ ప్రబోధించిన రచనలు ఆవిడవి. పురుషులపై ద్వేషాన్ని పెంచినవి కాదు. అలాగని పురుషాధిక్యతకు లొంగిపోయే వైఖరులకు స్వాగతం పలికినవీ కావు.

ఇదంతా ఒక ఎత్తయితే-

కేవలం పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా, విస్తృత బ్రతుకు పాఠాలను మనుషుల మనస్తత్వాలను అవగతం చేసుకునేలా నవలా ప్రక్రియ ద్వారా పుస్తక పఠనాభిలాషను పెంచిన సాహితీమూర్తి ఆవిడ.

అక్షరాస్యులైన ఎందరినో, ముఖ్యంగా ఇంటి ఇల్లాళ్ళను గొప్ప పాఠకులుగా మలచిన అక్షర పరుసవేది ఆవిడ.

వార, మాసపత్రికల సర్క్యులేషన్స్‌ను విపరీతంగా పెంచి, ఆ పత్రికల యాజమాన్యాల వ్యాపారాభివృద్ధికి మూలధాతువుగా నిలిచిన రచయిత్రి ఆవిడ.

సాహిత్యంలో వనితల స్థానాన్ని సమున్నత శిఖరాన నిలబెట్టింది ఆవిడ.

'వంటింటి సాహిత్యం' అన్నా, వంటిల్లు లేనిదే అసలు గృహవ్యవస్థే అసంపూర్ణం అని చాటిచెప్పి కుటుంబ వ్యవస్థను కాపు కాచిన రచయిత్రి ఆవిడ.

అవును! ఆవిడకు ఆవిడే సాటి!

ఆవిడే ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి. తెలుగు లోగిళ్ళను పఠనాలయాలుగా తీర్చిదిద్దిన అక్షర దీపం.

పత్రికలు, సినిమారంగం, టెలివిజన్ రంగం–

నాటి నుండి, నేటిదాకా ఆవిడ కలం జిలుగులతో వెలుగులీనాయి. వెండితెర మీద సినిమాలుగా రాణించిన నవలలు అధికశాతం ఆవిడవే. ప్రముఖ సినీ నటుడయినా, నటి అయినా నవలా నాయకుడు, నవలా నాయిక అనిపించుకోవడానికి అక్కినేని, వాణిశ్రీలకు ఒక ప్రేక్షక జనసమ్మోహ సమాదరణను సంతరించి పెట్టిన మూలకథలావిడవే. సినీనటి విజయనిర్మల ప్రముఖ మహిళా దర్శకురాలిగా చిత్రసీమలో రాణించడానికి యద్దనపూడి నవల 'మీనా'యే నిచ్చెన మెట్టయింది. తరం మారినా నిన్న మొన్న 'అ– ఆ' గా మళ్ళీ ఈ తరం ప్రేక్షకులను అదే 'మీనా' నవల అలరించగలిగింది.

పుస్తక ప్రచురణ రంగంలో తెలుగులో అత్యధిక పునర్ముద్రణ పొందిన నవల ఏదయినా ఉందంటే అది యద్దనపూడి సులోచనారాణి 'సెక్రటరీ' నవల. కోటిదాకా ప్రతులతో ప్రజాకోటిని అలరించిన నవల అది. ఒక తెలుగు నవలకు 'స్వర్ణోత్సవం' చేసిన సందర్భమూ 'సెక్రటరీ' కే దక్కింది.

1964 లో జ్యోతి మాసపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడిన 'సెక్రటరీ', యువ మాసపత్రికలో ముందు ప్రశ్నార్థకంతో మొదలుపెట్టి, ఆ తరువాత నవలకు పేరు పెట్టమని పాఠకులకు పోటీ పెట్టినప్పుడు ఆ పోటీలో బహుమతి పొందిన పేరయిన నవల 'మీనా', ఆంధ్రజ్యోతి వారపత్రికలో వచ్చిన 'జీవన తరంగాలు', ఆయా పత్రికల అత్యధిక పాఠకాదరణకు హేతువై సీరియల్స్‌గా అసంఖ్యాకులను అలరించిన అద్భుత రచనలుగా 'కీర్తికిరీటాలు' దక్కించుకున్నాయి. 'విజేత', 'ఆరాధన' కూడా అలా పేరొందినవే.

మొదట్లో యుద్దనపూడి సులోచనారాణి కథలే రాశారు. 'చిత్రనళినీయం' అచ్చులో ఆమె తొలికథ. దానికి అందుకున్న ఆంధ్రపత్రిక వారి పదిహేను రూపాయల పారితోషికం, జీవితంలో అవిస్మరణీయ ఆనందంగా ఆవిడ నిలుపుకున్నారు. ఐ లవ్ యు, భానుమతి వంటి ఆవిడ కథలు ఆదరణ పొందాయి. ఆవిడను నవలా రచనలోకి దింపింది బాపు, రమణ, రాఘవయ్యగారలే!. జ్యోతి మాసపత్రికను ప్రారంభిస్తూ నవల రాయమన్నారు. ఆవిడ రాయనన్నారు. బాపు, రమణ 'పోన్లెండి, ఓ పెద్దకథ రాయండి' అన్నారు. 'అయితే సరే' అని ఒప్పుకుని, కథపేరు చెబితే పబ్లిసిటీ చేసుకుంటామన్నారని లోపలికి వెళ్ళి ఓ కాగితం తీసుకుని, సరస్వతీదేవికి దండం పెట్టుకుని 'సెక్రటరీ' అని రాశారు. తనకు తెలిసిన ఓ టైపిస్టు అమ్మాయిని సాటి ఉద్యోగి ఏడిపిస్తున్న తీరు కబుర్లను దృష్టిలో పెట్టుకుని మొదలెట్టిన రచన అది. అందులో జయంతి, రాజశేఖరం పాత్రలు తెలుగు వారికి ఒక 'ఐకాన్'లుగా, మారిపోతాయని ఎవరనుకున్నారు?. కానీ జరిగింది అదే!. ఇప్పటికీ ఎందరో యువతులకు జీవనాదర్శమైన పురుషుడు అంటే 'రాజశేఖరం'. అంతెందుకు? 'సెక్రటరీ' నవలను సినిమాగా తీస్తున్నట్లు చిత్రనిర్మాత రామానాయుడుగారు ప్రకటించగానే ఓ యువతుల గుంపు సులోచనారాణిగారి ఇంటికి దండువెడలి, 'మీరు ఆ రైట్స్ ఎలా ఇచ్చారు? మీకు ఆ రైట్ లేదు. వెంటనే వాపసు తీసుకోండి. సినిమా తీయడానికి వీలులేదు. ఎవరూ సూట్‌కారు దానికి. మా ఇమాజినేషన్ అంతా చెడిపోతుంది' అని గగ్గోలు పెట్టారట.

నవలలు రాయలేను అన్న యద్దనపూడి 'సెక్రటరీ' తరువాత నవలలే రాశారు. ఎమెస్కో ఎం.ఎన్.రావుగారి కోరిక మేరకు సీరియల్‌గా పత్రికకు రాయడం కాక నేరుగా రాసిచ్చిన నవల 'ఆరాధన'. దాని విజయంతో– ప్రతి ఏటా తనకొక కొత్త నవల రాసివ్వమనీ, శ్రీరామనవమికి అంటే సులోచనారాణిగారి పుట్టినరోజుకి ఆ నవల విడుదల అయ్యేలా ప్రణాళిక వేసుకుంటాననీ చెప్పారాయన. స్వాతిలో పన్నెండేళ్ళు సీరియల్స్ రాసిన సులోచనారాణిగారు తర్వాత సీరియల్స్ రాయడం మానేసి, నేరుగా నవలలు రాశారు.

తెలుగు సినిమా చరిత్రలో నవలల ఆధారంగా రూపొందినవి సుమారు ఓ 75 చిత్రాలు. తొలినాళ్ళలో శరత్‌బాబు నవలలు చిత్రాలుగా వచ్చాయి (దేవదాసు వంటివి). కోదూరి కౌసల్యాదేవి నవల 'చక్రభ్రమణం' ఆధారంగా 'డాక్టర్ చక్రవర్తి' చిత్రం రూపొంది విజయం పొందింది. 1966 లో కె.విశ్వనాథ్‌ను దర్శకునిగా తొలిసారి

నిలుపుతూ వచ్చిన 'ఆత్మగౌరవం' చిత్రానికి కథారచన గొల్లపూడి మారుతీరావు, యద్దనపూడి సులోచనారాణి. ఆమె సినీ ప్రస్థానానికి అది తొలిమెట్టు. ఆ తరువాత ఆమె రాసిన నవలల పేరుతోనే తెలుగుచిత్రాలు కొన్ని రూపొందాయి. బహుశా తెలుగు నవలా చిత్రాల అగ్రతాంబూలం ఆవిడదే. ఎందుకంటే ఒక రచయిత్రి పదిహేను నవలలు సినిమాలు కావడం ఆమె రచనలకే దక్కిన అరుదైన గౌరవం. మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, అమ్మా నాన్నా, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమలేఖలు, బంగారు కలలు, గిరిజాకల్యాణం, విచిత్రబంధం, జై జవాన్, ఆత్మగౌరవం, మధురస్వప్నం, కాంచనగంగ– సినిమాలన్నీ యద్దనపూడి వారి నవలలే. అక్కినేని, శోభన్‌బాబు, వాణిశ్రీ, విజయనిర్మల, జయప్రద, జయసుధ నవలా నాయకులుగా, నాయికలుగా వెండితెరపై వెలుగులీనడానికి సులోచనారాణి అక్షరదీప్తియే హేతువన్న మాట సత్యం.

టీనేజ్‌లో తనను బాగా ప్రభావితం చేసిన రచనల్లోవి యద్దనపూడి సెక్రటరీ, మీనా, జీవనతరంగాలు అని చెప్పుకునే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన శ్రీమతి కాత్యాయనీ విద్మహే వంటి విమర్శకులు సైతం– స్త్రీల సాహిత్య అధ్యయన అవసరాన్ని, పద్ధతిని, ప్రయోజనాన్ని వివరిస్తూ స్త్రీ రచయిత్రుల, కవయిత్రుల గురించి 'సాహిత్యాకాశంలో సగం' వంటి వ్యాససంపుటి వెలయించి కూడా, యద్దనపూడి సులోచనారాణి వంటి వారి సాహిత్యాన్ని విశ్లేషించడంలో, అర్థం చేసుకోవడంలో ప్రాధాన్యం ఇవ్వకపోవడం 'ఆధునిక స్త్రీ సాహిత్య సమగ్ర చరిత్ర'లో యద్దనపూడి ప్రాతినిధ్యతనూ, ప్రభావాన్నీ గురించి మిన్నకుండడం ఎలా అర్థం చేసుకోవాలో తెలియదు.

స్త్రీలలో– స్పృహ, చైతన్యం, ఆత్మవిశ్వాసం, నమ్మినదాని కోసం నిలబడే శక్తి, సమష్టి కృషి మీద గురి, స్త్రీల రచనల్లో వస్తువిస్తృతి, స్త్రీవాద సాహిత్యం సాధించిన విజయాలుగా వెలువడించే విమర్శకులు– ఈ ఫలాలను మధ్యతరగతి మహిళలకు అందించిన రచయిత్రిగా యద్దనపూడి సులోచనారాణిని గుర్తించకపోవడం శోచనీయం. నిజానికి అపార పాఠకాదరణ పొందిన ఆవిడ సాహిత్యం త్రోసిరాజనగల మనుకోవడం సరికాదు. విమర్శలో మనస్సు పాత్ర విస్మరించి, మేధస్సు మాత్రమే ప్రధానమనుకోవడం వల్ల వచ్చే దృష్టికోణం అది.

నిజమే! యద్దనపూడి రాసినవి ప్రధానంగా ప్రేమకథలే, కానీ ఆడపిల్లల్ని ఆమె ఆణగారిన తాడితులు, పీడితుల్లా చూడలేదు. తన రచనల్లో వారికి అందాన్నీ,

ఆభిజాత్యాన్నీ ఆభరణాలుగా తొడిగింది. వ్యక్తిత్వం సంతరించి పెట్టింది. యువతులకు ఆర్థిక స్వేచ్ఛనూ, మానసిక స్వేచ్ఛనూ కూడా తన పాత్రల ద్వారా ప్రబోధించింది. నిజానికి ఆవిడ రచనాశైలి ఆవిడ కలానికి అబ్బిన సహజాతగుణం. ఆ పఠనీయ గుణం అనితరసాధ్యం. సంభాషణలు, నాటకీయత ఆమె రచనల్లో పుష్కలంగా వుంటాయి. అందువల్లే ఆమె నవలలు సినిమాలుగా రాణించాయి. అంతెందుకు బుల్లితెర ప్రపంచాన్ని కూడా ఋతురాగాలు, రాధ-మధు వంటి సీరియల్స్‌తో ఏలిన మహారాణి- రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి.

తనమానాన తను రాసుకుంటూ పోవడం తప్ప పెద్దగా సభలకూ-సమావేశాలకు వచ్చే అలవాటు కూడా ఆవిడకు ఉండేది కాదు. 'లేఖిని' సంస్థ గౌరవాధ్యక్షురాలిగా- ప్రజల్లోకి సభావేదికలపైకి వచ్చారంతే!. హుందాగా, సంయమనంతో వున్న రచయిత్రి. తన నవలలను తమిళంలోను, కన్నడంలోనూ తమవిగా అనువదింప చేసుకుని సొమ్ముచేసుకున్న కొందరు ఘనరచయితల గురించి కూడా పల్లెత్తి పరుషంగా ఒక్కమాట కూడా మాట్లాడని సౌజన్యమూర్తి ఆవిడ.

అక్కగారైన గోవిందరాజు సీతాదేవిగారి మరణం, భర్త మరణం, ఆడబడుచు మరణం అవన్నీ కుంగదీసినా- ఒంటరిగా, ఇంట్లో ముగ్గురు పనిమనుషులే సాయంగా, వారే ఆత్మీయంగా కాలం గడిపేవారు. ఒక్కగానొక్క కూతురు-అల్లుడు, శైలజా-రవి, మనుమడు హర్ష అమెరికాలో కాలిఫోర్నియాలోనే స్థిరపడిపోయారు. అక్కడకు వెళ్ళి వారితో స్థిరపడడం వద్దనుకుని ఒంటరి జీవితాన్ని గడిపినా, ఒక సార్థక జీవనంగా మలుచుకున్నారు.

విన్ (విమెన్ ఇన్ నీడ్) అనే సేవా సంస్థను నెలకొల్పి వృద్ధులైన స్త్రీలకీ, నిరుపేద మహిళలకీ, పిల్లలకీ అవసరమైన సాయం చేశారు. ఆమె సేవాతత్పరతను హెల్పేజ్ ఇండియా వారు అభినందించి- సంస్థ కార్యకలాపాలను పెంచమనీ, భారీగా గ్రాంట్ ఇస్తామనీ కోరారు. అలాగే కూలినాలి చేసుకునే వారి పిల్లల కోసం ఒక చిన్న పాఠశాలను ఏర్పరిచారు.

ఎంతమందికి గుర్తుందో తెలియదు కానీ యద్దనపూడి సులోచనారాణిగారే ఇండియాలోనే కాదు, బహుశా ప్రపంచంలోనే మునుపు లేని కొత్త ప్రయోగం చేశారు. అది 'కోకిల' అనే ఆడియో క్యాసెట్ మేగజైన్.

ఈ అంతర్జాలం ఇంతలా విస్తరించక, క్యాసెట్ ప్రపంచం ఆధునిక సాంకేతికతతో అవతరించిన కొత్తలో- ఆమె 'కోకిల' ఎనిమిది నెలలు వెలువడింది.

నిరక్షరాస్యులకు, అంధులకు, వృద్ధులకు ఆ ఆడియో మేగజైన్ ఉద్దేశింపబడి నడిచింది. ప్రశంసల వర్షం కురిసినంతగా– పెట్టిన పెట్టుబడి అయినా రాని మార్కెటింగ్ నష్టాలవల్ల అది ఆగిపోయింది. ఆవిడ నిశ్శబ్ద వితరణశీలిగా మెలిగినవారు.

యద్దనపూడి సులోచనారాణి కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజా గ్రామంలో 1940 లో జన్మించారు. అయిదుగురు అక్కయ్యలు, ముగ్గురు అన్నయ్యలు. అమ్మా నాన్నలకి ఆవిడే ఆఖరి సంతానం. 1956 లో ఎస్.ఎస్.ఎల్.సి. పాసయ్యారు. పరికిణీ–ఓణీ వయసులోనే 1956 మే నెలలో ఆంధ్రపత్రిక వారపత్రికలో 'చిత్రనళినీయం' అచ్చయిన తొలి కథ. రామాయణ, భాగవతాలను పాటల రూపంలో చెప్పి కథల పట్ల ఆసక్తి కలిగించింది అమ్మమ్మ. అమ్మమ్మ పోయిన ఏడాది తిరగకుండా అమ్మ నెమలికంటి మహాలక్ష్మమ్మ మరణించింది. సులోచనారాణి వివాహంతో 1958 లో హైదరాబాద్ అత్తవారింటికి వచ్చారు. ఆ పై ఏడాది తండ్రి– గొంతు క్యాన్సర్‌తో మరణించారు. ఇరవైమూడో ఏట కూతురు పుట్టింది. అప్పుడే కవలపిల్ల అన్నట్లు తన 'సెక్రటరీ' నవల పుట్టిందని చెప్పుకునేవారావిడ. పత్రికా ప్రపంచం ఆవిడ రచనల కోసం అహరహం తపించింది. పాఠకులు ఆమె రచనలు చదవడానికి ఉవ్విళ్ళూరేవారు. పత్రికల ప్రెస్ ఆఫీసులలో పనిచేసే కంపోజిటర్లకు లంచం ఇచ్చి, ఆవిడ నవల సీరియల్‌గా వస్తున్నప్పుడు ఆ పేజీల గ్యాలీ ప్రూఫ్‌లను తెప్పించుకుని చదివేవారుండే వారంటే నమ్మకం కలగకపోవచ్చు గానీ, ఆంధ్రజ్యోతి సంపాదకులుగా వుండిన నార్లవారే చెప్పిన మాట అది.

దాదాపు నలభైకి పైగా నవలలు రాశారావిడ.

ఆగమనం, ఆరాధన, ఆత్మీయులు, అభిజాత, అభిశాపం, అగ్నిపూలు, ఆహుతి, ఆమడ హృదయం, అమృతధార, అనురాగ గంగ, అనురాగ తోరణం, అర్ధస్థిత, ఆశల శిఖరాలు, అవ్యక్తం, ఋతువులు నవ్వాయి, కలల కౌగిలి, కీర్తికిరీటాలు, కృష్ణ లోహిత, గిరిజాకళ్యాణం, చీకటిలో చిరుదీపం, జీవన సౌరభవం, జాహ్నవి, దాంపత్య వనం, నిశాంత, ప్రేమ, ప్రేమదీపిక, ప్రేమపీఠం, పార్థ, బహుమతి, బందీ, బంగారు కలలు, మనోభిరామం, మౌనతరంగాలు, మౌనపోరాటం, మౌనభాష్యం, మోహిత, వెన్నెల్లో మల్లిక, విజేత, శ్వేతగులాబి, సెక్రటరీ, సౌగంధి, సుకుమారి వంటి నవలలన్నీ సులోచనారాణి కలం నుండి వెలువడిన ఆణిముత్యాలే!

2016 లో 'సెక్రటరీ' నవల పుస్తకరూపంలో ప్రచురింపబడి యాభై సంవత్సరాలయిన సందర్భంగా 'లేఖిని' (మహిళా చైతన్య సమాఖ్య) సంస్థ తరఫున

డా॥ వాసా ప్రభావతిగారి పూనికతో త్యాగరాయ గానసభలో సెక్రటరీ నవల స్వర్ణోత్సవం జరిగింది. ఆ సందర్భంగా యద్దనపూడి సులోచనారాణిని సత్కరించడం, ఆ సభలో సన్మానపత్రాన్ని మీ సుధామ రచించి సమర్పించటం, ఆవిడ ఆనంద పడటం ఓ మధుర స్మృతి. అలాగే గత సంవత్సరం తురగా జానకీరాణిగారి పేరిట ఏర్పరచిన అవార్డును తురగా సోదరీమణులు ఉషారమణి, వసంతశోభ మీ సుధామ సలహా సంప్రదింపులతో యద్దనపూడి సులోచనారాణిగారికి ప్రదానం చేయటం, ఇరవైవేల నూటపదార్లు రొక్కంతో ఆవిడను సన్మానించడం, ఆవిడ ఆ అవార్డును ఎంతో ఆనందంతో స్వీకరించడం, ఆ సభలో పాలుపంచుకోవడం మరపురాని జ్ఞాపికయే!.

మనుమడు, కూతురు, అల్లుడిని చూడడానికి అమెరికా వెళ్ళి ఈ మే 26 కు తిరిగి హైదరాబాద్ వస్తానన్న ఆవిడ, కాలిఫోర్నియాలో కుపర్టినో పట్టణంలో కుమార్తె శైలజ ఇంట్లో ఆకస్మికంగా గుండెపోటుతో 2018 మే 21 న మరణించి అటునుంచి అటే తిరిగిరాని లోకాలకు తరలిపోయారు.

కృష్ణాజిల్లా కోటలో జన్మించి, కాలిఫోర్నియా కుపర్టినోలో కన్నుమూసిన
తెలుగు సాహిత్య స్వప్నాలరాణి జీవన తరంగాలు ఆగిపోయాయి.
కానీ తెలుగువారి గుండెల్లో అక్షరాలుగా తరగలెత్తే ఆవిడ రచనలు
తరాల తరబడి శాశ్వతాలే!.

(ఆంధ్రభూమి వారపత్రిక, 21 జూన్ 2018)

❖

(59) ధ్వని మాంత్రికుడి నిశ్శబ్ద నిధనము

రాముడి గొంతును– తన వైరిభక్తుడు మారీచుడు మిమిక్రీ చేసి వుండకపోతే సీతాపహరణం, రామరావణ యుద్ధం జరిగి ధర్మ సంస్థాపనం జరిగేదే కాదు. గౌతమ మహర్షిని ఏమార్చడానికి ఇంద్రుడు కోడిలా కూశాడు. నర్తనశాలలో కీచక సంహారానికి భీముడు, ద్రౌపది గొంతును అనుకరించాడు. మంచికీ, చెడుకూ కూడా ఉపయుక్తమయ్యే ఆ అనుకరణ కళను ఆధునిక కాలంలో జనాహ్లాదకరంగా ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన ధ్వన్యనుకరణసమ్రాట్ నేరెళ్ల వేణుమాధవ్. పక్షులను, జంతువులను, ప్రకృతిలోని అనేకకానేక ధ్వనులను మాత్రమే కాదు, వేనవేల స్వరాలను, ప్రముఖవ్యక్తుల గళాలను తన ఒకే ఒక్క స్వరపేటికతో అనుకరించిన అద్భుత కళాకారుడు తను. ప్రపంచ ప్రసిద్ధ రాజకీయ నేతల స్వరాలను యథాతథంగా వారినే స్వయంగా వింటున్నట్లు తన గొంతుతో రూపుకట్టించిన స్వరబ్రహ్మ తను.

జాతీయ, అంతర్జాతీయ వేదికలపైనే కాదు ఐక్యరాజ్యసమితి వేదికపై సైతం నేరెళ్ల ప్రదర్శన ఇస్తూంటే– నోరెళ్లబెట్టి ఆశ్చర్యానందాలతో అప్రతిభులయ్యేవారు ప్రేక్షకులు. వినోదాన్ని మాత్రమే కాదు, సామాజిక ప్రయోజనం కూడా రంగరించి మిమిక్రీ కళకు అత్యున్నత హోదాను, ఒక శాస్త్రీయ స్థాయిని కల్పించిన అసాధారణ ప్రతిభామతి ఆయన. టెన్ కమాండ్‌మెంట్స్, బెన్‌హర్ వంటి హాలీవుడ్ చిత్రాలలోని పూర్తి నిడివి సన్నివేశాల్ని ఆ ఆంగ్లనటుల వాచకంతో, గుర్రాల స్వారీలు, తుపాకుల మోతలు వంటి నేపథ్య ధ్వనులతో ఆయన తన గళంలో వినిపిస్తూంటే అందులో తల్లీనమై పరవశించి పోవడం ప్రత్యక్ష నిదర్శనంగా ప్రేక్షకజనం అందరికీ తెలుసు. తెలుగు విశ్వవిద్యాలయంలో మిమిక్రీని ఒక కోర్స్‌గా నిలిపి, దానికి తగిన ప్రామాణిక పాఠ్యగ్రంథాన్ని సంతరించడంలోనే కాదు, ఎందరికో తన శిష్యరికంలో మిమిక్రీ కళను ఒక జీవికగా అందించి బతుకు తెరువునిచ్చిన మహనీయుడాయన, వరంగల్లును ప్రపంచపటానికి తన కళతో ఎక్కించిన సుప్రసిద్ధ కళాకారుడు తాను.

1932 డిసెంబర్ 28 న హైదరాబాద్ సంస్థానపు వరంగల్ మట్టెవాడలో శ్రీలక్ష్మి, హరి దంపతులకు జన్మించిన వేణుమాధవ్ తండ్రి నుండి సాహిత్యాభిరుచిని అందిపుచ్చుకున్నారు. 1950 లో మెట్రిక్యులేషన్ ప్యాసై, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చేస్తున్నప్పుడు కళాశాల ప్రిన్సిపాల్ బి.వి.రామనరసు– వేణుమాధవ్ లోని ధ్వన్యనుకరణ కళను గుర్తించి ఎంతగానో ప్రోత్సహించారు. తమ గ్రామస్తులను, ఇంటికొచ్చిన వారిని వారి గొంతుతో హావభావాలతో మిమిక్రీ చేసి నివ్వెరపరచి ఆనందపరిచేవారు. హనుమకొండ మట్టెవాడ మాధ్యమికపాఠశాల టీచర్‌గా పనిచేశారు. మొదట చిత్తూరు నాగయ్య గళాన్ని అనుకరించడం మొదలిడి– ఎందరో సినీనటుల, రాజకీయ నాయకుల, వివిధ రంగాల ప్రపంచ ప్రముఖులను కూడా తన గళంలో యథాతథంగా సాక్షాత్కరింపజేసేవారు. ఆంధ్ర, ఆంగ్ల, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం, సంగీతాభిమానంగల వేణుమాధవ్, భానుమతి వంటి స్త్రీల గొంతులను వారి పాటతో సహా ముమ్మూర్తులా అనుకరించడం, నిజంగా అసమాన ప్రతిభగా కొనియాడబడ్డారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలోనూ ఆయన ప్రాచుర్యం చెందారు.

మాజీ ప్రధాని పి.వి.నరసిహారావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వుండిన కాలంలో 1972 నుండి 78 వరకు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగానూ పనిచేశారు. గూఢచారి 116 వంటి తెలుగు సినిమాల్లో ఓ పన్నెండు చిత్రాలలో ఆయన నటించారు కూడాను. 'మెకన్నాస్ గోల్డ్' ఆంగ్లచిత్రం ఆయన గొంతులో నిజంగా ఓ సంక్షిప్త శబ్ద చిత్రంలా భాసించేది.

1971 లో ఐక్యరాజ్య సమితి వేదికపై షేక్స్‌పియర్ నాటక ఘట్టాలను, అమెరికా అధ్యక్షులు కెనడీ స్వరాన్ని ఆయన ప్రదర్శించడం ఒక చారిత్రక సందర్భం మాత్రమే కాదు, మిమిక్రీ కళకే ఆయన ద్వారా దక్కిన గౌరవం. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ (1978), రాజాలక్ష్మీ ఫౌండేషన్ పురస్కారం (1981), భారత ప్రభుత్వపు పద్మశ్రీ అవార్డు (2001), గత ఏడాది 2017 లో ఆయన గౌరవార్థం భారత తంతి తపాలా శాఖవారి ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల, తెలంగాణ ఆవిర్భావ వార్షికోత్సవ పురస్కారం (2018) ఆయన అందుకున్న గౌరవ ప్రపత్తుల్లో కొన్ని మాత్రమే. లక్షలాది తెలుగు హృదయాలను తన కళతో పరవశింపజేసిన విశిష్టవ్యక్తి ఆయన.

వేణుమాధవ్ ఎంతో సహృదయులు. ఎటువంటి అభిజాత్యాలూ లేని సౌమ్యులు. స్నేహశీలురు. ఆయన భార్య శోభ, కుమారులు శ్రీనాథ్, రాధాకృష్ణ, కుమార్తెలు లక్ష్మీ తులసి, వాసంతి– కుటుంబ సభ్యులనే కాదు, ఎందరో బంధు మిత్రులను,

ఆప్తులను, శిష్య ప్రశిష్యులను, కళాభిమానులను శోక సంతప్తులను చేస్తూ 86 వ ఏట ప్రవేశించి ఆరు నెలలు పూర్తి కాకుండానే, జూన్ 19 న వరంగల్‌లోని స్వగృహంలోనే కొద్దిపాటి అనారోగ్యంతో కాలధర్మం చెందారు. ధ్వని మాంత్రికుడి నిశ్శబ్ద నిధనము కళా ప్రపంచానికి తీరని లోటు. మిమిక్రీ కళ వున్నంతకాలం, అనుకరణ కళకే ఒక అలంకరణగా, చిర'స్వర'ణీయునిగా నిలచిపోయే చిరస్మరణీయుడు నేరెళ్ల వేణుమాధవ్. వరంగల్‌లో ఓ వీధిపేరుగా, హనుమకొండలో ఓ కళాప్రాంగణంగానే కాదు, మిమిక్రీ అభిమానుల గుండెల కింద చిరునామాగా ఆయన పేరు నిలిచే ఉంటుంది.

(వార్త దినపత్రిక, 1 జులై 2018)

❖

(60) తొమ్మిది 'మెరుపులు'

స్త్రీ విద్య అనేదే ఊహాతీతమై, ఉన్నా–వారి అక్షరాస్యతా శాతమైనా– తక్కువగా ఉండిన కాలంలో, అందునా గ్రాంథిక భాష రాజ్యమేలుతున్న కాలంలో, ఆనాటి తరాన్ని, ముఖ్యంగా అక్షరాస్యులైన ఇంటి ఇల్లాళ్ళను, వారికి అర్థమయ్యే వాడుక భాషలో రాసి– గొప్ప పాఠకులుగా మలచిన రచయిత కొవ్వలి లక్ష్మీనరసింహారావు. కొవ్వలి నవలలంటే అక్షరాలా పడిచచ్చేవారు. 1912 లో తణుకులో పుట్టిన కొవ్వలి పాతికేళ్లకే అయిదువందల నవలలకు పైగా రాసి, మొత్తంమీద వెయ్యికి పైగా నవలలు రాసిన ఏకైక తెలుగురచయిత అంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు!. 'భయంకర్' పేరుతో డిటెక్టివ్ నవలలు రాసిందీ, కన్నాంబ ప్రోద్బలంతో సినీరంగాన అడుగిడి– తల్లిప్రేమ, మా గోపీ, శాంతి, బీదల ఆస్తి, రామాంజనేయ యుద్ధం, సిపాయి కూతురు వంటి సినిమాలకు కథలను సమకూర్చిందీ వారే!. జానపద బ్రహ్మ విఠలాచార్య చిత్రాలకు వెనుక అదృశ్యస్ఫూర్తి కొవ్వలివారే.

మారుమూల పల్లెటూళ్ళలో కూడా విస్తృతంగా నవలా పఠనం పెరగడానికీ, రైలుప్రయాణాల్లో దిగవలసిన స్టేషన్‌కూడా మరచిపోయేలా, నవలాపఠనంలో మునిగిపోవడానికీ– ఉత్కంఠభరితమైన, వైవిధ్యభరితమైన కొవ్వలి నవలలే కారణం.

నవలా రచయితగా కొవ్వలి సుప్రసిద్ధులు. కానీ వారి కథల గురించి చాలామందికి తెలియకపోవచ్చు. 'మెరుపులు' అనే ఆయన కథాసంకలనం వారి రెండవ కుమారులు కొవ్వలి లక్ష్మీనారాయణగారు ఇటీవలే విశేషకృషితో వెలికి తీసారు. కథావేదికలో అందుకుంటున్న ఈ తొమ్మిది కథలూ ఒక ప్రత్యేకమైన మెరుపులే! వీటిని కొవ్వలి జయంతి సందర్భంగా ఆంధ్రభూమి మాసపత్రిక కథావేదికలో అందిస్తుండడం అభినందనీయం.

మానవ స్వభావంలోని వివిధ చిత్తవృత్తుల్నీ, బ్రతుకులోని యథార్థ సంఘటనల్నీ, సమాజంలోని విశిష్ట పాత్రలనీ సాక్షాత్కరింప చేసే కథలు మాత్రమే కావవి... మానవీయ సందేశాల్నీ, ఉదాత్త సంస్కరణాభిలాషనూ, స్త్రీ చైతన్యాన్నీ 1930 దశకంలోనే ప్రభావోపేతంగా అందించిన ఒక ద్రష్ట అయిన రచయిత కథలివి. కొవ్వలి సృజనలోని కాలికస్పృహ సర్వకాలీనం కావడం ఒక విశేషం! కొవ్వలిగారి పుస్తకాలు ఆ రోజుల్లో అద్దెకు తిప్పుకుని, ఆ డబ్బుతో ఇల్లు గడపుకోవడమే కాదు యలమంచిలిలో ఓపాటి ఇల్లు కట్టుకుని దానికి 'కొవ్వలి' అని పేరు పెట్టుకున్న అప్పలకొండ గురించి ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వర్రావ్ చెప్పినప్పుడు– కొవ్వలి ఎందరికి అక్షరపఠనాభిక్షయే కాదు, 'అన్నభిక్ష' పెట్టిన మహనీయుడో కూడా తేటతెల్లమయ్యింది.

ముష్టి బ్రతుకే అయినా నైతిక జీవనానికి చిహ్నంగా కనబడే 'చిన్నమ్మిశీలం' కథ– పద్మరాజుగారి 'గాలివాన' కథకన్నా పదేళ్ళ ముందుదే అయివుండొచ్చు. పంచభూతాత్మకమైన బాహ్యశరీరాన్ని మించిన సౌందర్యం దయాంతఃకరణలతో, సత్యసంధతతో కూడిన స్త్రీది అని 'దేవకన్య' కథ చెబుతూంటే, శారీరక వికలత్వానికి గురి అయినా సహచరిని ప్రేమించి ఆదర్శంగా నిలిచిన ఉదాత్త వ్యక్తికథ 'వెర్రి ప్రేమ'. అలాగే భూతదయను ప్రబోధిస్తూ, జంతుబలుల వ్యతిరేకతను పాదుగొల్పే కథ 'ఇంత రక్తమా! ఎంత రక్తము?'. బలవంతపు వివాహాన్నుంచి 'స్త్రీ స్వేచ్ఛను' ఆనాడే చెప్పినది 'సత్య' కథ. సంఘం దోషభూయిష్టంగా ఎంచి గర్హించే వివాహేతర ప్రణయాన్ని 'ఒక ఘట్టం' కథగా కొవ్వలి ఆనాడే రాయడం– స్త్రీ పురుష సంబంధాలలోని మనోవిశ్లేషణా కోణానికి ఆవిష్కరణమే!. అనుమానం ఎంత అవివేకపు ముగింపు నివ్వగలదో లైటర్‌వీన్ కథనంలో చెప్పి– 'నాగరికులైన విద్యావంతులు భర్తపోతే ఏ పని చేస్తారో ఓబయ్య భార్య కూడా ఆ పనే చేస్తుందని ఎవరికి తెలియదూ?' అంటూ ముగిసే 'ఒద్దంటే మొగుడు' సంస్కరణాభిషకు ఊతమిచ్చేదే. అలా సంఘ సంస్కరణను ఆచరణపూర్వకంగా చూపే మరోకథ 'గౌరీ కళ్యాణము'. పెళ్ళిచూపుల పేరుతో అమ్మాయిలెందరినో చూసి తిరస్కరిస్తూపోతే కుర్రకారుకెలాంటి 'తగినశాస్తి'యో కూడా ఓ కథ హెచ్చరించింది. ఇలా కథావేదికలోని ఈ 'నవరత్న కథామాలిక' కొవ్వలి రచనా ప్రతిభకే కాదు, ఇంతకాలం తరువాత కూడా వాటిల్లోని 'సార్వకాలీనతకు ప్రత్యక్ష సత్యం. నిజంగా ఈ తరానికి ఇదొక గొప్ప ఉపాయనం!

(ఆంధ్రభూమి మాసపత్రిక, జూలై 2018)

❖

(61) తెలుగు కథానిక ప్రేమైక జీవి

18 ఆగస్టు 2018

ఒక కథా రచయిత మాత్రమే కాదు, 'కథానిక' ప్రక్రియా పరివ్యాప్తికి నిస్వార్థంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఒక ఉద్యమశీలి కనుమరుగై పోయిన రోజు. కథానికను అంతగా ప్రేమించి, అందుకోసం బతుకంతా 'జన్నియ' పట్టిన వాడతను. విజయనగరంలో జీర్ణావస్థకు చేరిన గురజాడ ఇంటిని అతనెందుకు పునరుద్ధరించాడు? వేదగిరి కమ్యూనికేషన్స్ నెలకొల్పి– ప్రముఖ కథారచయితలకు బుచ్చిబాబు పేర స్మారక పురస్కారాన్ని ఏర్పరచి, పలువురు ప్రసిద్ధ కథారచయితలకు అందించడంతో బాటు పురస్కార గ్రహీతల కథానికా సంపుటాలను స్వంతఖర్చులతో తానెందుకు ముద్రించాడు? రాజమండ్రిలోని ప్రముఖ కూడలిలో కథకచక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్ఠించాడు? గురజాడ 150 వ జయంతిని ఏడాదిపాటు తెలుగునేల అంతటా తానే ఎందుకు నిర్వహించాడు? ప్రభుత్వాన్ని సైతం చైతన్య పరచి గురజాడ రచనలన్నింటినీ తెలుగుఅకాడమీ వారిచే తన సారథ్యంలో ఒక మహాగ్రంథంగా ఎందుకు వెలయించాడు? గురజాడ డిసెంట్ పత్రాన్ని యాభై ఏండ్ల తర్వాత తానెందుకు పూనుకొని పునర్ముద్రించాడు? తెలుగు కథానిక శతజయంతి ఉత్సవాలను జిల్లాలన్నింటా నిర్వహించి– కార్యశాలలు, కథానికా సదస్సులు నిర్వహించి అన్ని జిల్లాల్లోని కథకులు రాసిన వ్యాససంకలనం ఎందుకు తెచ్చాడు? ఏటేటా కొన్నేళ్లపాటు అన్ని పత్రికల్లో వచ్చిన కథానికా సమీక్షలతో ఏల సంపుటాలు ప్రచురించాడు? విరామ రచయితల చేత మళ్ళీ కలం పట్టించి, కొత్త కథకులను ప్రోత్సహించి, బహుమతులిచ్చి బృహత్కథా సంకలనాలు ఎందుకు ముద్రించాడు?

అన్నింటికీ ఒకటే సమాధానం. 'కథానిక' అంటే అతనికి అంత పిచ్చి! అవును. ప్రేమాపిచ్చే రెండూ ఒకటే అనిపించిన 'కథానికాజీవి' అతగాడు. అతనే వేదగిరి రాంబాబు.

తన మానాన తను కథలు రాసుకుంటూ పోయినట్లయితే ఓ కథా రచయితగానే అయినా రాంబాబుకు ఇప్పుడున్నంత గుర్తింపు ఆదరం లభించేదో లేదో తెలియదు గానీ, మౌలికంగా తను రచయిత. 1952 అక్టోబర్ 14 న గుంటూరు జిల్లాలో జన్మించిన రాంబాబు మచిలీపట్నంలో చదువుకున్నాడు. యువకునిగా అందగాడయిన తాను తొలుత నాటకరంగం వైపు ఆకర్షితుడై, నటుడిగా పలు వేషాలు ధరించి సినిమాల్లో చేరాలనీ ప్రయత్నించాడు. కానయితే బందరు జిల్లా గ్రంథాలయంలో ఒకరోజు విహారిగారు జాషువాపై చేసిన సాహిత్య ప్రసంగం పట్ల ఆకర్షితుడై– ఆదివిష్ణు, సింగరాజు రామచంద్రమూర్తి, యర్రంశెట్టి శాయి వంటివారి పరిచయాలతో సాహిత్యరంగం వైపు కథానిక రచయితగా పరివర్తనం చెందాడు.

పంతొమ్మిదివందల డెబ్భైల తర్వాత రచనారంగంవైపు మరలి రాసిన తొలి కథానిక 'ఇది ఒకరాత్రి కథకాదు' 1975 లో స్వాతిలో ప్రచురితమైంది. ఒక మధ్యతరగతి కుటుంబ జీవన స్థితిగతుల చిత్రణ అది. ఒక నిస్సహాయుడైన కుటుంబ పెద్ద, ఉద్యోగం లేక కుటుంబానికి ఆసరా కాలేకపోతున్నానన్న నైరాశ్యంతో ఆత్మహత్యకు ప్రయత్నించిన పెద్దకొడుకు, జూదంలో డబ్బు గెలుచుకుని కుటుంబానికి అండగా నిలవాలనుకునే కలలహర్మ్యపు అదృష్ట పరీక్షకుడయిన చిన్నకొడుకు, ఇక తనకి పెళ్ళి కాదని లేచిపోబోయిన కూతురు– ఈ కథలో పాత్రలు. వాళ్ళ జీవితాల్లో ఒక రాత్రి జరిగిన కథ. 'ఇది ఒక్కరాత్రిలో జరిగిన కథ గానీ, ఒక రాత్రికే సంబంధించిన కథ మాత్రం కాదు' అంటాడు రచయిత. అలా మొదలయిన తన కథానికా రచనా ప్రస్థానం 1976 లోనే ఆంధ్ర సచిత్ర వారపత్రికలో బహుమతి తెచ్చిపెట్టిన మొదటి కథ 'సముద్రం'తో– పాతికేళ్ళలోపు వయసులోనే తనకెంతో గుర్తింపునీ, ప్రశంసల్నీ తెచ్చిపెట్టి రచయితగా తనను సుస్థిరం చేసింది. తన తొలి కథాసంపుటి 'సముద్రం' పేరిటనే వెలువడింది. తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం అందుకుంది. 1978 లో ఆంధ్రభూమి వారపత్రిక ఉపసంపాదకునిగా చేరి, సుమారు ఏడేండ్లు పనిచేశాడు. ఆ తరువాత 'పల్లకి' వారపత్రిక సంపాదకునిగా 1990 దశకంలో రాణించాడు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో క్యాజువల్ అనౌన్సర్‌గా, ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా పనిచేస్తూనే, అనంతర కాలంలో పూర్తిగా ఫ్రీలాన్స్ జీవితాన్నే గడిపాడు. 'కథానిక'ను భుజాన వేసుకుని తానే ఒక సైన్యం అన్నట్లు కదలి, ఎందరినో కదలించి 'నభూతో' అనిపించుకున్న అసాధారణ కార్యక్రమాలెన్నో చేశాడు.

ముందే చెప్పినట్లు మౌలికంగా రాంబాబు రచయిత. అందునా కథానికా రచయిత. ఎన్ని పనులు నిర్వర్తిస్తున్నా, ఏయే ఉద్యోగాలు చేస్తున్నా, నిమ్స్, గ్లోబల్ హాస్పిటల్స్‌లో వైద్యరంగం వైపూ తన సేవలు అందించినా– తన సాహితీ సృజనను, రచనా పటిమను నిలుపుకుంటూ వచ్చాడు రాంబాబు. నిజానికి ఒక కార్యకర్తగానో, అడ్మినిస్ట్రేటర్‌గానో వుంటున్నప్పుడు రచనాసృజనను నిలుపుకోవడం అందరికీ చేతనయ్యేది కాదు. అలా నిలుపుకోగలిగిన ప్రతిభావంతుడు వేదగిరి రాంబాబు.

అందుకే తనను ఒక కథకునిగా చూపడమే ఇక్కడ నా ఉద్దేశ్యం. ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన సముద్రం కథానిక తనను ప్రభావితం చేసిన కథానిక అని, ఒక కథానిక సదస్సులో– రాంబాబు ఎవరో తెలియకుండానే, నేటి ప్రముఖ కథారచయిత 'సలీం' పేర్కొనడం కథానిక రచయితగా రాంబాబు గుర్తింపుకు ఒక నిదర్శనం. పిల్లలతో ఎక్స్‌కర్షన్‌కు వెళ్లిన రాశి అనే ఉపాధ్యాయురాలు, పదిహేనేళ్ళ తరువాత మళ్ళీ సందర్శించినప్పుడు ఆమెను చుట్టు ముట్టిన జ్ఞాపకాల అలల రసమంచిత కథ అది. అప్పట్లో గవ్వలూ, శంఖాలూ ఏరుకుంటూ ఓ పల్లె యువకుడిని కలిసిన రాశి అతనికి పూసలదండనిచ్చి– తొలి ముద్దును, బిగి కౌగిలిని తొలి అనుభవంగా అందుకుంటుంది. నాడు తానిచ్చిన దండ, ఓ అమ్మాయి మెడలో వెలసిపోయి కన్పిస్తుంది. ఆమె పేరూ రాశి అని తెలుస్తుంది. అతనిని కలవకుండానే జ్ఞాపకాలతో వెనుదిరుగుతుంది. తనపేరే అతను తన కూతురికి పెట్టుకున్నాడన్న మధురభావన హృదయదఘ్నమవుతుంది. కథా శిల్పానికి చక్కని ఉదాహరణగా నిలిచిన కథ 'సముద్రం'.

కథానిక రచయితగా రాంబాబువి పది కథానికా సంపుటాలు వెలువడ్డాయి. సముద్రం, విముక్తి, కస్తూరి (గొలుసు కథానికలు), పేజీ/చీ కథలు, ఈ 'కాలం' కథలు, వయసు కథలు, అవయవదాన కథానికలు, వేదగిరి రాంబాబు కథానికలు, వేదగిరి రాంబాబు వ్యంగ్య కథానికలు, మరణం నుంచి మరణం దాకా– అనేవి ఆ పది సంపుటాలూ. సుమారు నాలుగువందల కథలు రాశాడు రాంబాబు. 'వస్తు శిల్పాల కలనేత కళాకృతులు రాంబాబు కథానికలు' అని శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు రాంబాబు కథలను ప్రశంసించారు. రాంబాబు 'సముద్రం' కథానిక సంపుటికి 'అమెజాన్' వారు క్లాసిక్స్‌గా కాపీరైట్ హక్కు లేనిదన్నట్లుగా, 1923 కి ముందు గ్రంథం అంటూ 'నబు పబ్లిక్ డొమైన్ రీప్రింట్స్' వారి పేరుతో 1200 రూపాయలకి అమ్ముతున్న విషయం సింహప్రసాద్‌గారు గుర్తించి– 'ఇది విషాదమే అయినా రాంబాబు

రచనా ప్రతిభకీ, ప్రతిష్ఠకీ లభించిన గౌరవంగా భావించడం సబబన్న' మాట మాత్రం వాస్తవమే!

రాంబాబు కథానికలు విభిన్న ఇతివృత్త సమన్వితాలు. వస్తు, రూపపరంగా కథానికలో బహుశా అన్ని ప్రయోగాలు చేయడమూ తనకే చెల్లిందనాలి. ప్రేమకథలు, కుటుంబ కథలు, సమస్యాత్మకాలు, పరిశోధనాత్మకాలు ఏవి రాసినా అవి నేలవిడిచి సాము చేయవు. మానవతే వాటి మూల కందం. స్త్రీల సమస్యలపైనా, మగవారి వ్యసనజీవనాలపైనా, అవయవదాన విశిష్టతల మీదా కథానికలు కూర్చాడు. భాష గొప్పదనం గురించి కూడా కథానికలుగా చెప్పాడు. కదిలేవీ, కదిలించేవీ, పరిపూర్ణపు బతుకిచ్చేవీ అయిన కథలు రాశాడు రాంబాబు. కానీ కథానికా రచయితగా కన్న ఓ కార్యకర్తగా, ఉద్యమ జీవిగానే తనకు ఎక్కువ ఖ్యాతి వచ్చింది. ఒక పేజీ కథ, టెలిఫోన్ కథ (ఆసాంతం కథానిక టెలిఫోన్ సంభాషణగానే సాగడం), కొసమెరుపు కథలు, వైద్య కథానికలు, పిల్లల కథలు రాశాడు. ఉత్తరాల కథలు అన్నాడు. గుణింతాల కథలు అన్నాడు. విపుల, సూర్య పత్రికలలో 'కథకుల ఫైల్', 'తప్పక చదవాల్సిన కథలు' పేరిట అలనాటి ప్రముఖుల ఆణిముత్యాల కథానికలను తన వ్యాఖ్యలతో ఈ తరానికి మళ్ళీ అందిస్తూ వచ్చాడు. ప్రయోగ వైవిధ్యంతో బాటు, కథానికలకు ప్రయోజన ప్రాముఖ్యం వుందని నిరూపించాడు తన కథానికలతో రాంబాబు.

'బొన్సాయ్' పరిమాణంలో అన్నట్లుగా పెద్దకాన్వాస్ మీద చూపగలిగిన అంశాలను పేజీ కథలుగా రాశాడు. వాటిల్లో 'పేచీ' పెట్టడాలు ఉంటాయి. చురకవేయడం, ఆలోచన రేకెత్తించడం తన పేజీ/ చీ కథల లక్ష్యం. అలాగే ఏకపద కథానికలు అంటాడు. కథనంలోనూ, కథనపరంగానూ ఒక పదాన్ని పునఃపునఃవాడుతూ తప్పు కదూ, ఇరుకు, పరిధి వంటి పలు కథలు రాశాడు. రాశి బట్టలు కట్టుకుంటూంటే లోనికి తోసుకువస్తాడు బాల్య వయసులోని కథకుడు. 'తప్పుకదూ!' అని హెచ్చరిస్తుంది. ఆమెకు ప్రేమలేఖ రాయగా 'తప్పుకదూ!' అని హెచ్చరిస్తుంది. ఇద్దరూ పెరిగి పెద్దయ్యాక ఆమె 'దిగజారింది' అని తెలుసుకుని, తనలోని వివేకాన్ని తట్టి లేపిన ఆమె అలా ఎందుకయిందని బాధపడి– 'తప్పుకదూ!' అని చెబుదామని వెడతాడు. ఆమె ఇంటితలుపు తట్టగా– తలుపు తెరిచిన 'రాశి' అతనిని గుర్తుపట్టి "ఇలాంటి ఇళ్ళవైపు నీలాంటివారు రావచ్చా? 'తప్పుకదూ!' అని తలుపు వేసుకుంటుంది"– ఇలాంటి శిల్పచాతురి తన సొంతం.

అలాగే గొలుసు కథానికలు అంటూ మైనంపాటి భాస్కర్, పి.ఎస్.నారాయణ, పి.వి.ఆర్. శివకుమార్, ప్రతాప రవిశంకర్, తులసి బాలకృష్ణ వంటి రచయితలతో రాంబాబు సూత్రధారియై నిలిచి కథానికలు రాశాడు. 'కస్తూరి' పేరిట ఆ కథానికల సంపుటి వెలువడింది.

విభిన్న వయస్సులలోని ఆకర్షణలు, వ్యామోహాలు, ఆలోచనలు, నైజాలు విభిన్నంగానే వుంటాయి. 'ఏ వయసుకు ఆ ముచ్చట' అనే సామెత వున్నదే. 'వయసు కథలు' పేరిట రాంబాబు ఇలా వివిధ ప్రాయపు జీవుల కథానికలను– ప్రయోగంగానూ, ప్రయోజనకరంగానూ మలిచి రాశాడు. అలాగే పత్రికలలో ఒక 'కాలమ్'లో ఇమిడిపోయే కథలు రాశాడు. వాటిని– అదృష్టం, ఆకలి, ఇష్టం, ఈర్ష్య ఇలా అక్షర క్రమంలోని శీర్షికలతో రాయడం విశేషం. అలాగే గుణింతాలతో కథానిక మొదటి అక్షరం మొదలయ్యే 'గుణింతాల కథలు' రాశాడు. రాంబాబు సుమారు 18 వ్యంగ్య కథలు రాశాడు. అందులో నేటితరం రచయితల మీద, సంపాదకుల మీద నిర్దయగా సెటైర్లు సంధించాడు. 'పిల్లర్–ఫిల్లర్' అనే కథలో రేడియోలలో పనిచేసే ఉద్యోగుల తమాషాలు రాశాడు. 'అనగనగనగా' కథానిక సినీ పరిశ్రమలలోని దరిద్రాలను తూర్పార బట్టేదిగా, డైలీ టీవీ సీరియల్స్ మీద, అలాగే– మగవాడికో నీతి, ఆడదానికో నీతి అన్నట్లుండే మగనైజాన్ని 'తప్పులెన్నువాడు'లో రాశాడు.

రాంబాబు కథానికల్లో– పెళ్ళికూతురు, కుర్రకుంక, పశువు, భయం, లక్ష్యం, తల్లి, చావలేదని చెప్పడానికే బతికున్నా– వంటి మంచి కథలెన్నో వున్నాయి. భర్త నడిపిన స్కూటర్‌కు ప్రమాదం జరిగి, కొడుకు ఇక బ్రతకడని తెలిసి, కొడుకు శరీరావయవాలను తొమ్మిదిమందికి దానంచేసి, 'తనకు ఇక తొమ్మిదిమంది పిల్లలు' అనుకుంటుందట ఆ 'తల్లి'. అవయవదానం మీద ఇలాంటి కదలించే కథలెన్నో రాశారు రాంబాబు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న విషాదాన్ని 'నబ్రూయాత్ సత్యమప్రియం' వంటి కథల్లో చిత్రించాడు. 'అర్ధాంగి' కథానికలో– భర్తకు తన కాలేయంలోని భాగాన్నే కాక, ఒక మూత్రపిండాన్ని కూడా ఇచ్చి బతికించుకుని, నిజంగా 'అర్ధాంగి' అవుతుంది సుకన్య. ఇదీ అవయవదాన విశిష్ట కథానికే!

'ఉత్తరాల కథానికలు' అంటూ ఈనాడు కనుమరుగై పోతున్న లేఖా రచన ప్రాతిపదికగా– ఉత్తరాల వైశిష్ట్యం తెలియచెప్పేలా, కథానిక ఎత్తుగడ, కొనసాగింపు, ముగింపు అన్నీ కేవలం మూడు ఉత్తరాలు ఒక కథానికలా– పన్నెండు కథలు రాశాడు

రాంబాబు. జ్యోతి మాసపత్రికలో ప్రచురితమయ్యాయి. 'మూడు ఉత్తరాలు' అనే కథలో– మధు తండ్రికి డబ్బు పంపలేని తన నిస్సహాయత చెబుతూ లేఖ రాస్తాడు. రెండో ఉత్తరం– బోనస్ వచ్చిందనీ, కొనుక్కోవాలనుకుంటున్న ఆమె నెక్లెస్ కోసం దాచాననీ భార్యకు రాస్తాడు. మూడో ఉత్తరం– తండ్రి కొడుకుకు రాసింది. 'కొడుకునని మా బాధలు నీతో చెప్పుకున్నాం. భార్య నెక్లెస్ కోసం డబ్బు దాచి మమ్మల్ని నిర్లక్ష్యం చేశావు'. కవర్లు తారుమారు అయ్యాయి. కొడుకు గుట్టు రట్టయింది. అలాగే ఉదయం వార పత్రికలో– టెలిఫోన్ సంభాషణ రూపంలో పన్నెండు కథలు రాశారు. మరణంపై రాసిన కథలు కూడా ఓ ప్రయోగం.

ఇలా కథానిక రచయితగా వేదగిరి రాంబాబు విలక్షణమైన కథలెన్నో రాశాడు. నిజానికి తను కేవలం కథానికారచన మీదనే పూర్తిగా నిమగ్నమై, ఆ ప్రక్రియా వ్యాప్తికై కార్యకర్తగా, ఉద్యమశీలిగా గడిపిన కాలాన్ని కూడా– రచనకే వినియోగించి వుంటే, అతని కలం నుండి ఎన్ని విశిష్ట కథలు రూపొందేవో తెలియదు గానీ, కేవలం రచయితగా తన స్వార్థాన్నీ, తన ఎదుగుదలనీ కాక– సాటి రచయితలనూ, వారి కృషినీ ప్రోత్సహిస్తూ, సమీకరిస్తూ, గౌరవిస్తూ కథానికా ప్రక్రియకే వెన్నుదన్నుగా, నిత్యకృషీవలునిగా జీవయాత్ర సాగించిన రాంబాబు– తెలుగు సాహితీ లోకంలో ఒక అవిస్మరణీయ కథానికా జీవి. కథానిక ప్రక్రియా అభ్యుత్థాన రథ చోదకుడు. మూర్తీభవించిన తెలుగు కథానికా ప్రేమైక జీవి. మరణించినా సదా జీవిస్తూనే వుండే కథానికా రచయిత– వేదగిరి రాంబాబు.

(పాలపిట్ట మాసపత్రిక, సెప్టెంబర్–అక్టోబర్ 2018)

❖

(62) అనుభూతుల 'ఇంద్ర'జాలకవి !

*మ*నసైనదేదో వరించిందిలా
తలపై తరంగమై తరిమిందిలా...
వలపో, పిలుపో, మురుపో... ఏమో!
అంతా వింతే! అందేదెంతో!...

ఆన్‌లైన్లో ఇటీవల ఎందరినో సమ్మోహనపరచి విశేషాదరణ పొందిన ఈ పాట 'సమ్మోహనం' చిత్రం కోసం రాసినది– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ. డెబ్భై నాలుగేళ్ళ వయసులో ఇంత రొమాంటిక్‌గా రాసి, అనుభూతి తరగలెత్తించిన కవి సాహిత్య ప్రపంచంలో ఇప్పటికే 'అనుభూతివాదకవి'గా సుప్రతిష్ఠితుడు. శ్రీకాంతశర్మ కవి పండితుడు. పండితకవి. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారి కుమారునిగా 'పుత్రాదిచ్ఛేత్ పరాజయం' అన్న స్థాయికి ఎదిగిన కవి. కేవలం కవియేనా? 'ఆతడనేక ప్రక్రియల ఆరితేరిన ఘనుడు'. కథలు, నవలలు, నాటకాలు, రూపకాలు, వ్యాసాలు, విమర్శలు, సమీక్షలు, మున్నుడులు, పరిచయాలు ఒకటేమిటి! ఆయన బహుముఖీన సాహిత్య సృజనకు అనేక పార్శ్వాలు. పద్యకవిత, గేయకవిత, వచనకవిత, లలితగీతం, యక్షగానం, సినిమా పాటలు ఇవన్నీ తన కవిత్వ రచనలే! నాలుగేళ్ళ క్రితమే ఆయన సాహిత్య 'సృజన' అంతా రెండు బహృత్సంపుటులుగా వెలువడింది.

"మనం ఎంచుకున్న మార్గాన్ని బట్టి మన జీవనక్రమం నిర్ణయమౌతుంది"– అని 'సుపర్ణ' కావ్యంలో ఆయనే అన్నట్లుగా, ఆయన సృజన ఎందరికో స్ఫూర్తిపథం అనదగినది.

శ్రీకాంతశర్మ 29 మే 1944 లో జన్మించారు. ప్రముఖ కవిగా, రచయితగా, ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా ప్రసిద్ధి చెందారు. ఆయన ఎంచుకున్న మార్గాలు వృత్తి రీత్యా ప్రధానంగా రెండు. ఒకటి పత్రికా మాధ్యమం. రెండవది

శ్రవ్యమాధ్యమం అయిన ఆకాశవాణి. ఎం.ఏ. పట్టభద్రుడయ్యాక 1969-76 మధ్య ఆంధ్రజ్యోతి వారపత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేసి, 1976 లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో అసిస్టెంట్ ఎడిటర్ (స్క్రిప్ట్) గా చేరి, ఉషశ్రీ అనుయాయిగా సంస్కృత కార్యక్రమాలు నిర్వహించి, 1994 లో కార్యక్రమ నిర్వహణాధికారిగా పదోన్నతిపై నిజామాబాద్‌లో కొన్నాళ్ళు పనిచేసి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి, ఆపై ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకులుగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు.

అనుభూతి గీతాలు, శిలా మురళి, ఏకాంత కోకిల, నిశ్శబ్దం గమ్యం వంటి కవితా సంపుటులు, పొగడపూలు గేయాలు, క్షణికం, తూర్పున వాలిన సూర్యుడు వంటి నవలలు, సాహిత్య పరిచయం, ఆలోచన వంటి వ్యాసాలు, ఆకుపచ్చని కోరికలు, అవతార సమాప్తి, మహర్షి ప్రస్థానం వంటి నాటికలు, గాథావాహిని, గంగావతరణం, శ్రీపద పారిజాతం, కిరాతార్జునీయం, శ్రీ ఆండాళ్ కల్యాణం వంటి యక్షగానాలు ఆయన సాహిత్య సృజనలోని గ్రంథాలే.

శ్రీకాంతశర్మ మౌలికంగా కవి. సుకుమార భావుకుడు, అనుభూతి ఆరాధకుడు. సంప్రదాయాన్నీ, అభ్యుదయాన్ని జమలికగా మానవీయ అనుభూతులకు ఆకృతినిచ్చిన తిలక్, ఇస్మాయిల్ వంటి వారి సరసన చేరిన అనుభూతివాద కవి. చాలామంది రచయితల రచనలు పాఠకులకు మాత్రమే చేరతాయి. పత్రికలు కేవలం అక్షరాస్యులకే కదా! కానీ సామాజికుడయిన ప్రతి వ్యక్తిలో కేవలం పాఠకుడే కాదు, ఒక శ్రోతా, ఒక ప్రేక్షకుడు కూడా వుంటారు. అందుకే రచయిత సృజన త్రిముఖంగా సాగి సామాజికులకు చేరి ఉపయుక్తమైనప్పుడే, ఆ రచయిత అత్యంత ప్రతిభావంతునిగా భాసించగలుగుతాడు. అలాంటి గొప్ప ప్రజ్ఞామతి అయిన కవి శ్రీకాంతశర్మ. శ్రీకాంత శర్మ రచనలు పాఠకులనూ, శ్రోతలను, ప్రేక్షకులనూ ఏకకాలంలో సామాజికునిలో వున్న ఆ ముగ్గురినీ కూడా అలరించి ఆకట్టుకోగలవి, ఉపయుక్తమై మెప్పించగలవి.

ఆకాశవాణి విజయవాడ కేంద్రం వైభవ ప్రాభవాలకు మూలకందమై నిలిచిన రచయిత శ్రీకాంతశర్మ. 1982-2003 వరకు ఆకాశవాణి వార్షిక జాతీయ పురస్కారాలలో ఏడు ప్రథమ బహుమతులు, మూడు ద్వితీయ బహుమతులు, పలు యోగ్యతా పత్రాలు సాధించిన ఘనత శ్రీకాంతశర్మ రచనలదే. అవన్నీ సృజనాత్మకం, సంగీత రూపకం, డాక్యుమెంటరీ, నాటక విభాగాలకు చెందిన రచనలు. 'తేనెల తేటల మాటలతో మన దేశమాతనే కొలిచెదమా' అనే ప్రసిద్ధమైన బాలల లలితగీతం

మొదలుకొని రేడియోకి అనేక లలితగీతాలు, ఈ మాసపు పాటలు, సంగీత రూపకాలు రాసిన కవిగా శ్రోతల హృదయాలను గెలుచుకున్న వారాయన. ఆయనచే నృత్య రూపకాలు రాయించుకుని, ప్రదర్శనలిచ్చి, శోభానాయుడు వంటి నర్తకీమణులు ఎంతగానో రాణించారు.

'ఇంటిపేరు ఇంద్రగంటి' పేరిట ఇటీవల తన ఆత్మకథనాత్మక గ్రంథాన్ని కూడా వెలయించారు శ్రీకాంతశర్మ. ఆయన శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల ప్రముఖ రచయిత్రి కాగా– కుమార్తె కిరణ్మయి డాక్యుమెంటరీ, లఘుచిత్రాలు తీసి అవార్డులు బడయగా, కుమారుడు మోహనకృష్ణ ఇంద్రగంటి ప్రముఖ చలనచిత్ర దర్శకునిగా గ్రహణం, అష్టాచెమ్మ, జెంటిల్‌మెన్, అంతకుముందు ఆ తరువాత, సమ్మోహనం వంటి చిత్రాలతో ఖ్యాతి పొందుతున్నారు.

శ్రీకాంతశర్మగారు కృష్ణావతారం, నెలవంక, రావుగోపాలరావు, రెండుజెళ్ల సీత, పుత్తడిబొమ్మ, చైతన్య రథం వంటి చిత్రాలకు గతంలోనే పాటలు రాసినా సినీకవిగా ఆయన స్థిరపడదలుచుకోలేదు గానీ ఆయన వైభవ ప్రాభవాలకు కొరతలేదు. కవిగా, పండితునిగా, విమర్శకునిగా, సంపాదకునిగా, ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా లబ్ధప్రతిష్ఠులైన శ్రీకాంతశర్మగారు డబ్భైనాలుగేళ్ళ వయసులోనూ తన సాహితీ వ్యాసంగాన్ని ప్రతిభావంతంగా కొనసాగిస్తూనే వున్నారు. 'ఒకానొక సుఖ స్వప్న హేమంతంలోంచి బయటకు వచ్చి నిలబడ్డాను తీర్మాన వాక్యంలాగ' అని 'సన్నికర్ష'ను తెలిపే ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ఎన్ని అవార్డులు– రివార్డులకైనా, సత్కారాలు– సన్మానాలకైనా సమార్హుడు.

(ఇంద్రగంటి శ్రీకాంతశర్మ యానాంలో
శిఖామణి అవార్డు అందుకుంటున్న సందర్భంగా)

(ఆంధ్రజ్యోతి దినపత్రిక, 28 అక్టోబర్ 2018)

❖

(63) రేడియో–తెలుగు భాషా సాహిత్య వికాసం

ఈ తరానికి 'రేడియో' అంటే– ప్రైవేట్ 'ఎఫ్.ఎం.'గా, సెల్‌ఫోన్‌లో వినే వినోద సాధనంగా, లేక కారులో వెళుతూ, వింటూ, రేడియో జాకీతో ముచ్చట్లాడుకునే వీలున్న 'వ్యవస్థ'గా మాత్రమే తెలుసు. 'ఇది చాలా హాట్ గురూ' అనే రేడియో మిర్చి, 'వినుఁవినిపించుఁలైఫ్ అందించు' అనే బిగ్ ఎఫ్.ఎం., లేదా రేడియో మిర్చి, ఎఫ్.ఎం.రెయిన్ బో, రెడ్ ఎఫ్.ఎం.– వీటినే 'రేడియో'గా తల పోస్తున్నారు. ఈ రేడియో 'వాహికలు' ప్రధానంగా యువతరానికి ఉద్దేశించినవీ, వినోద ప్రధానమైనవీ కావడమే అందుకు కారణం! నిజానికి ప్రైవేట్ ఎఫ్.ఎం. రేడియోల్లో ఇవాళ భాషా సాహిత్యాలన్న మాటే విడ్డూరంగా వుంటుంది. అధికాంశం సినిమా పాటల ప్రసారమే! ఆ పాటల మధ్య వినవచ్చే మాటల్లో– ఆంగ్లపదాల మధ్య తెలుగు పదాలు ఇమిడ్చి మాట్లాడడమే, లేదా ఇంగ్లీషు, హిందీ, తెలుగు 'సంకర భాష'. ఇంగ్లీష్‌లో ఆలోచించి, తెలుగులో మాట్లాడే వైఖరీ ద్యోతకమవుతూ ఉంటుంది. ఒక రకమైన సంకరమూ, కృతకమూ అయిన తెలుగు వినబడుతూ ఉంటుంది. అన్ని ప్రైవేట్ రేడియో ఛానల్స్‌లోనూ ఇదే ధోరణి అనలేంగానీ, తెలుగు భాషా సాహిత్యాలపట్ల శ్రద్ధ చూపడం లేదన్నది మాత్రం యథార్థం.

అయితే రేడియో ప్రసారాలలో తెలుగు భాషా సాహిత్యాల విషయానికి వస్తే– సమాజంపై ఒకప్పుడు కంఠదఘ్నంగా ప్రభావాన్ని చూపి, ఈ నాటికీ అస్తిత్వాన్ని నిలుపుకొంటున్న 'ఆకాశవాణి' దే ప్రముఖ పాత్ర! తెలుగు పలకడంలో, పలికించడంలో, భాషా విషయికంగానూ– కేవలం వినోదం మాత్రమే కాక, జీవితపు విలువను పెంచే– విద్య, విజ్ఞానాల్ని కూడా అందిస్తూ, సాహిత్య, సంగీత, సాంస్కృతిక వికాసంలో అవిరళ కృషి చేసి, నేటికీ ఆ విలువల గురించే ఆరాటపడుతున్న రేడియో మాధ్యమం– 'ఆకాశవాణి'. కేంద్రప్రభుత్వ సమాచార ప్రసార శాఖ అధీనంలో నుంచి, ప్రస్తుతం

'ప్రసారభారతి' వ్యవస్థ ఆధ్వర్యంలో వున్న 'ఆకాశవాణి' చరిత్రే– మనదేశంలో 'రేడియో చరిత్ర'.

మన దేశంలో విజ్ఞాన, వినోద, వికాసాలను అందించే ఏకైక సాధనంగా 'రేడియో' ప్రవేశించి తొంభై ఏళ్ళవుతోంది. 'రేడియో క్లబ్ ఆఫ్ బాంబే' పేరిట 1923 జూన్‌లో తొలి రేడియో ప్రసారం జరిగింది. నవంబర్ 1923 లో 'కలకత్తా రేడియో క్లబ్' తన కార్యక్రమాలు ప్రసారంచేసింది. దక్షిణభారతదేశంలో 16, మే 1924 లో 'మద్రాస్ ప్రెసిడెన్సీ రేడియోక్లబ్' ఏర్పడి 1924 జూలై 31 న రేడియో ప్రసారాలు ప్రారంభించింది. ఆ రేడియోక్లబ్‌లో మద్రాస్ నగర ప్రముఖులు ఎందరో సభ్యులుగా వున్నా, రేడియోక్లబ్ స్థాపనకూ, ప్రసారాలకూ అవిరళకృషి చేసింది సంస్థ కార్యదర్శిగా వున్న రావుబహదూర్ సి.వి.కృష్ణస్వామిసెట్టి అనే తెలుగువారు కావడం గర్వించదగిన విషయం. 1927 అక్టోబర్‌లో 'మద్రాస్ ప్రెసిడెన్సీ రేడియోక్లబ్' మూతపడినా, కృష్ణస్వామి చొరవతో 1930 ఏప్రిల్ 1 నుంచి పరిమితంగానైనా మద్రాసు నగరపాలక సంస్థ రేడియో ప్రసారాలు మొదలుపెట్టింది. ఆ ప్రసారాలలో తెలుగుపాటలు చిత్తూరు, వెంకటగిరి, విశాఖపట్టణం వరకూ వినిపించేవట.

ప్రభుత్వ అంగీకారంతో, 'ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్' అనే ప్రైవేట్ సంస్థ 23 జూలై 1927 న మనదేశంలో ప్రయోగస్థాయిలో రేడియో ప్రసారాలను 'బొంబాయి'లో, అదే ఏడు ఆగస్టు 26 న కలకత్తాలో మొదలుపెట్టింది. బొంబాయి కేంద్రానికి నాటి 'వైస్రాయ్' లార్డ్ ఇర్విన్ ప్రారంభోత్సవం చేసాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా 1930 నాటికి ఆ కంపెనీ కనుమరుగయ్యే స్థితికి వచ్చింది. కానీ ప్రజలలో అప్పటికే రేడియో కార్యక్రమాల ప్రసారాల పట్ల కలిగిన చైతన్యాన్ని పరిగణనలోనికి తీసుకుని, బ్రిటిష్ ప్రభుత్వం 1930 ఏప్రిల్ ఒకటవ తేదీన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్, లేబర్' శాఖ క్రింద 'ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్' ను చేపట్టింది. రేడియో ప్రసారాలు ప్రయోజనం, లాభసాటి అని గ్రహించి– ఆర్థిక వనరులను 1934 నుంచి కేటాయించసాగింది. పి.జి.ఎడ్మండ్స్ పర్యవేక్షణలో బొంబాయి, కలకత్తాలతో బాటు ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరుల్లో రేడియోస్టేషన్లు ఏర్పడ్డాయి. 1935 మార్చిలో 'కంట్రోలర్ ఆఫ్ బ్రాడ్ కాస్టింగ్' నేర్పరిచి, ఇండియాలో తొలి కంట్రోలర్ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్‌గా 30 ఆగస్టు 1935 న బ్రిటిష్ ప్రభుత్వం 'వియోనెల్‌ఫీల్డన్' ను నియమించింది. జనవరి 19, 1936 న మొట్టమొదటిసారిగా రేడియోలో 'వార్తలు' ప్రసారం అయ్యాయి. రేడియో ప్రసారాలకు దానితో ఒక కొత్త

జవం, జీవం వచ్చాయి. 'ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్' కు 1936 జూన్ 8 న 'ఆలిండియా రేడియో' అనే నామకరణం జరిగింది. 1937 లో 'సెంట్రల్ న్యూస్ ఆర్గనైజేషన్' ఏర్పడింది. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్' శాఖ ఆధ్వర్యంలోకి ఆనాడే నవంబర్‌లో రేడియో వచ్చింది. 1939 అక్టోబర్‌లో విదేశీ సర్వీసుకు అంకురార్పణ జరిగింది. ద్వితీయ ప్రపంచసంగ్రామ కాలంలో రేడియో సమాజంలోకి బాగా చొచ్చుకుపోయింది. 'ఆలిండియా రేడియో' వ్యవహారాలు చూసే శాఖపేరు– 1946 ఫిబ్రవరికి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ మరియు ఆర్ట్స్' కాగా, 1946 సెప్టెంబర్ 10 నుండి ఆ శాఖను 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్' గా వ్యవహరించసాగారు.

1947 లో స్వాతంత్ర్యానంతరం– దేశ విభజనతో, అప్పటికే నెలకొని వున్న రేడియో కేంద్రాలలో ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, మద్రాసు తిరుచినాపల్లి, లక్నో మన భారతదేశానివీ; పెషావర్, లాహోర్, ఢాకా రేడియో కేంద్రాలు పాకిస్థాన్‌వి అయ్యాయి. సర్దార్‌వల్లభాయ్ పటేల్ మనదేశంలో రేడియోవ్యవస్థకు కొత్త ఊపిరులూదారు. స్వతంత్ర భారత తొలి సమాచార ప్రసారశాఖ మంత్రిగా ఆయన– 1947 లోనే రేడియో ప్రసారాల భాషా సాహిత్య సేవకూ, సంవిధానానికీ దిశా నిర్దేశనం చేసారు. "రేడియో కేవలం ఒక లిటరరీ క్లబ్ కాదు. సామాన్య శ్రోతల అభిరుచినీ, అభిప్రాయాలనూ దృష్టి యందుంచుకోవాలి. ఆ శ్రోతలు డ్రాయింగ్ రూముల్లోనో, గ్రంథాలయాల్లోనో, కూచుని రేడియో వినేవాళ్లు కాకపోవచ్చు. వాళ్ళు చౌకధర రేడియో వున్నవాళ్ళో, కొనేవాళ్ళో కావచ్చు. వారికి ఇంటా బయటా జరుగుతున్న విషయాలను తెలిపేందుకు, వారి తపన తీరేలా సామాన్య శ్రోతలకు అర్థమయ్యే భాషను ప్రోత్సహించడమే ఆలిండియా రేడియో విధానం" అని ఆనాడే ఆయన ప్రకటించారు. రేడియో అక్షరాస్యులకే కాక నిరక్షరాస్యులకు కూడాను. అందువల్ల ఆ సామాన్యశ్రోతలకు అర్థమయ్యే రీతిలోనే ప్రసారాలు జరగాలి అన్నది లక్ష్యంగా ఏర్పడింది. దేశప్రగతికీ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికీ, ప్రజా జీవితంతో పెనవేసుకుని, 'రేడియో' ప్రభావోపేతంగా ఎదుగుతూ వచ్చింది.

ఈ చారిత్రక క్రమంలోనే– 1933 లో హైదరాబాద్‌లో చిరాగ్‌ఆలీ సందులో తపాలాశాఖ ఉద్యోగి 'మహబూబ్ అలీ' 200 వాట్ల శక్తిగల 'రేడియో కేంద్రం' నెలకొల్పారు. 1935 ఫిబ్రవరి 3 న అది నిజాం అధీనంలోకి వచ్చింది. 'ఫజ్లుల్ రెహమాన్' 'అష్టల్ అలీఖాన్' అనే అధికారులిద్దరిని రేడియోకేంద్ర నిర్వహణలో శిక్షణ

నిమిత్తం లండన్ పంపించి, వారు తిరిగి వచ్చాక- 'దక్కన్ రేడియో' పేర 1939 జూలై నుండి నిజాం నవాబు రేడియో కేంద్రాన్ని అభివృద్ధి పరిచారు. 'దక్కన్ రేడియో'లో తెలుగు ప్రసారాలకు మాడపాటి హనుమంతరావు వంటివారు చేసిన కృషి ఫలించి కాలక్రమాన రోజుకు గంటసేపు తెలుగు ప్రసారాలు జరిగేవి. 'కాసింఖాన్' అనే ఆయన తెలుగుకార్యక్రమాల అధికారిగా 'దక్కన్ రేడియో'లో పనిచేశారు. దక్కన్ రేడియోలో-రాయప్రోలు రాజశేఖర్ సహాయదర్శకునిగా, భాస్కరభట్ల కృష్ణారావు, దుర్గాచలం కార్యక్రమ నిర్వాహకులుగా, కురుగంటి సీతారామయ్య, మహారథి వార్తలు, సంభాషణలు వంటివి రాసేవారుగా, కె.ఎల్.నరసింహారావు గ్రామీణ కార్యక్రమాల నిర్వాహకునిగా, లలిత, వెంకటేశ్వర్లు వార్తలు చదివేవారుగా పనిచేశారు. జానపద గీతాలు 'ఎల్లిపాటలు', 'మల్లిపాటలు' వంటి పేర్లతో ప్రసారమయ్యేవి. మొదట్లో 'హిందుస్థానీ' సంగీతానికే ప్రాధాన్యం వుండినా, అనంతరకాలంలో 'కర్ణాటక' సంగీతానికి కూడా సమయం కేటాయించారు.

10 సెప్టెంబర్, 1935 న మైసూర్‌లో ఒక రేడియో కేంద్రం మొదలయింది. మైసూర్ యూనివర్సిటీ సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వి.గోపాలస్వామి ఆ కేంద్రాన్ని స్థాపించారు. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ సూచించగా, దానికి ఆయన 'ఆకాశవాణి' అనే పేరు పెట్టారట!

రేడియోలో తెలుగు కార్యక్రమాల ప్రారంభ వికాసాలు తెలుసుకునేందుకు 1938 జూన్ 16 న మొదలైన మద్రాసు రేడియో కేంద్రం చరిత్రే ఆధారమనవచ్చు. ఆనాడు మద్రాసు కేంద్రాన్ని మద్రాస్ గవర్నర్ 'లార్డ్ ఎర్‌స్కిన్', రాష్ట్ర ప్రధానమంత్రిగా నాడు వ్యవహరింపబడిన ముఖ్యమంత్రి 'సి.వి.రాజగోపాలచారి' (రాజాజీ) ప్రారంభించారు. 'ఆల్ ఇండియా రేడియో'ను రాజాజీ నాటి తన ఆంగ్ల ప్రసంగంలో 'హిందుస్థాన్ ఆకాశవాణి' అని ప్రస్తావించడం విశేషం! ఆ రాత్రి 8.15 కు 'భారత దేశము- రేడియో' అనే అంశంపై 1937 ఏప్రిల్ 1 నుంచి జూలై 14 వరకు ఉమ్మడి మద్రాసు రాజధాని ప్రధానిగా పనిచేసిన జస్టిస్‌పార్టీ నేత సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు తెలుగులో చేసిన ప్రసంగం ప్రసారమైంది. మద్రాస్ కేంద్రం నుంచి తొలి ప్రసంగం చేసిన వారుగా, అలా ఆయన చరిత్రకెక్కారు. అట్లానే 1938 జూన్ 18 న గిడుగు రామమూర్తి పంతులు- 'సజీవమయిన తెలుగు' అనే విషయంపై, 1938 జూన్ 21 న శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు 'మన ఇల్లు- దాని అందము చందము' గురించి, 1938 జూన్ 23 రాత్రి 8.15 కు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి 'రవీంద్రుడు' శీర్షికతో చేసిన ప్రసంగాలు- తొలి తెలుగు రేడియో ప్రసంగాలలోనివే!.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 'మద్రాసు' రేడియోకేంద్రం నుండే అధికంగా తెలుగు కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. మద్రాసు రేడియోకేంద్రం నుంచి తమిళంలో కన్నా తెలుగులోనే ఎక్కువ ప్రసారాలు జరుగుతున్నాయనే ప్రచారం ఒకటి ఆ రోజుల్లో వుండేదట!. 1939 లో తిరుచినాపల్లిలో రేడియోకేంద్రం ఏర్పడి, దక్షిణ తమిళ జిల్లాలకు ప్రధానంగా ప్రసారాలు చేసింది. రేడియో కార్యక్రమాల గురించి శ్రోతలకు ముందుగానే తెలియజేయడానికి 1930 జూన్ నుంచి తెలుగులో 'వాణి' పక్షపత్రిక ప్రచురణ మొదలైంది. కొన్నాళ్ల తరువాత ఆగిపోయినా, 1948 లో విజయవాడ రేడియో కేంద్రం ప్రారంభమయ్యాక 'వాణి' ప్రచురణ విజయవాడ నుంచి మొదలై, 1980 ల దాకా సాగింది. 'వాణి' లో వివిధ కేంద్రాల నుంచి ప్రసారమయ్యే కార్యక్రమాల వివరాలనూ అలాగే ప్రసారమైన తెలుగు ప్రసంగాలు, కవితలు, సంగీత పాఠాల వంటివి ఎంపిక చేసి ప్రచురించేవారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖుల ఫోటోలు కూడా అచ్చేసేవారు. మద్రాసు కేంద్రమే తొలుతగా తెలుగులో వివిధ ప్రక్రియలలో ప్రసారాలు జరిపించింది. సాహిత్య అంశాలే కాక, ఇతర విషయాలనేకం సరళమైన భాషలో ప్రసారం చేసింది. ప్రసంగాలు, నాటికలు, గేయాలు, భావగీతాలు, జానపద గీతాలు, రూపకాలు అట్లాగే పాఠశాల విద్యార్థుల కార్యక్రమాలు, గ్రామస్తుల కార్యక్రమాలు, స్త్రీలు, పిల్లల కార్యక్రమాలు ఇట్లా వైవిధ్య భరితమైన ప్రసారాలను అందించేది. అట్లాగే ఎందరో సంగీత కళాకారులు మద్రాస్ రేడియో కేంద్రం నుంచే తొలుత కచేరీలు చేసారు.

1948 అక్టోబర్ 12 న విజయవాడ కేంద్రం స్థాపితమై, డిసెంబరు ఒకటవ తేదీ నుండి ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రసారాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు కార్యక్రమాలకు ఉద్దేశించిన తొట్టతొలి రేడియో కేంద్రం 'విజయవాడ'యే! 1950 ఏప్రిల్ ఒకటి నుండి హైదరాబాద్‌లోని 'దక్కన్ రేడియో' 'ఆలిండియా రేడియో' అయ్యింది. 1955 లో నిజాం నుండి పూర్తిగా భారత ప్రభుత్వ అధీనంలోకి వెళ్ళింది. 1954 లో మద్రాసు నుండి ప్రారంభమైన 'తెలుగులో ప్రాంతీయ వార్తలు' 1956 లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారానికి తరలించ బడ్డాయి. 1957 మే 10 న హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం రాష్ట్ర శాసనసభ భవనాలకు ఎదురుగా వున్న ప్రస్తుత ప్రాంతంలోనికి తరలించబడింది.

అట్లా మద్రాసు, విజయవాడ, హైదరాబాద్ రేడియో కేంద్రాల ద్వారా తెలుగులో ప్రసారాలు సాగుతూ, తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక వికాసానికి

పాదులేర్పడ్డాయి. రేడియో ప్రసారాలు లక్షలాది శ్రోతలను ఆకట్టుకున్నాయి. ఎందరో కవులూ, రచయితలూ, కళాకారులూ రేడియో ద్వారా రూపొంది ప్రసిద్ధులయ్యారు. ఆకాశవాణిలో ఉద్యోగులుగా పనిచేసిన వారెందరో సాహిత్యరంగాన, సంగీతరంగంలో లబ్ధప్రతిష్ఠులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత హైదరాబాద్, విజయవాడ రేడియో కేంద్రాలే కాక కడప, విశాఖపట్నం, కొత్తగూడెం, ఆ పై స్థానిక రేడియో కేంద్రాలుగా క్రమంగా ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, తిరుపతి, అనంతపురం, కర్నూల్, మార్కాపురంలలో నెలకొల్పబడి, ఆకాశవాణి సేవలు విస్తృతమయ్యాయి.

హైదరాబాద్ 'ప్రాంతీయ వార్తా విభాగానికి' అదనంగా విజయవాడలో ఒక 'ప్రాంతీయ వార్తా విభాగం' 1981 నుండి పనిచేస్తోంది. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం నుండి 1966 లో ఉర్దూలో ప్రాంతీయవార్తలు ప్రసారం కాసాగాయి. 1963 లో విద్యా కార్యక్రమాలకూ, 1965 లో వ్యవసాయ కార్యక్రమాలకూ అంకురార్పణ జరిగింది. హైదరాబాద్ కేంద్రం నుండి 'యువవాణి' కార్యక్రమాలకు 1970 డిసెంబర్ 20 నుండి శ్రీకారం చుట్టడమైంది. 21 మార్చి 1971 నుండి వివిధభారతి కార్యక్రమాలు, 1973 లో కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, 1983 లో సైన్సు కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు ప్రత్యేక విభాగాలుగా ఏర్పడి, కార్యక్రమ ప్రసారాలు జరుగసాగాయి.

నేడు దేశవ్యాప్తంగా 350 కి పైగా ఆకాశవాణి కేంద్రాలున్నాయి. ఇప్పటికీ రేడియో ప్రసారాలు– ఆకాశవాణి 24 భాషల్లో, నూట నలభైఆరు మాండలికాల్లో చేస్తోంది. నూటనాలుగు మిలియన్ల ఇళ్లల్లో, నూటపదకొండు మిలియన్లకు పైగా రేడియో సెట్స్ వున్నాయి. 1982 ముందు వరకూ అసలు 'రేడియో' అంటే 'ఆకాశవాణి'యే. ఆకాశవాణి ప్రసారాలే– వైవిధ్యభరితమైన రేడియో కార్యక్రమలుగా, కోట్లాది శ్రోతలకు అందించేది 'ఆకాశవాణి'. ఇక రేడియో 'వార్తలు' విశ్వసనీయతకు మారు పేరుగా, ప్రపంచం నలుమూలల్లో ఏం జరిగినా నేరుగా వార్తలుగా అందుతుండేవి. ప్రసంగం, కథ, కవిత, నాటకం, పాట, రూపకం వంటి సాహిత్య రూపాలన్నీ వినబడుతూ, ఆయా కార్యక్రమాలపై శ్రోతల అభిప్రాయాలు కూడా 'లేఖలుగా' ప్రసారమవుతూ, ఏకైక ప్రసారమాధ్యమంగా 'ఆకాశవాణియే' వెలుగొందింది. కేవలం వినోదమే కాక, విజ్ఞానం, వికాసం, సమాచారం అందిస్తూ సమాజాభివృద్ధిలో రేడియో గణనీయమైన పాత్ర వహించింది. కర్ణాటక, లలిత, జానపద, గిరిజన సంగీతాలకు విస్తృతిని కల్పించింది. అట్లాగే సాహిత్య వికాసానికి

కవులకు, కళాకారులకు ఆదరణ నిస్తూ, ఆర్థికంగా మంచి పారితోషికాలను అందిస్తూ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాణించింది 'ఆకాశవాణి'. భాషా సాహిత్యాలకు– ఆలంబనమైన వ్యవస్థగా నేటికీ 'ఆకాశవాణి' చేసిన సేవ అనుపమానమైనది! ఆయా విశేషాలను వాచవిగా తెలుసుకుందాం.

ప్రసార భాష:

'ప్రసార భాష' అన్న పదబంధమే అసలు 'ఆకాశవాణి' వల్ల మొదట ఏర్పడింది. 'కమ్యూనికేటివ్ లాంగ్వేజ్' అన్న– భావాభివ్యక్తి భాషగా 'ప్రసార భాష' ఒక విశిష్టతను సంతరించుకుంది. రేడియోది 'శ్రవ్యమాధ్యమం'. శ్రోతకు ఏ విషయాన్నయినా– వినికిడిలోకి తెచ్చి, వినోద, విజ్ఞాన వికాసాల ప్రయోజనాన్ని అతనికి అందిస్తుంది రేడియో'. వినడానికి వున్న ప్రాధాన్యం, శ్రవ్యం ప్రభావం, గణనీయమైనవి. వినడానికి– వినే శ్రోతకు 'అక్షరాస్యతతో' సంబంధం లేదు. ఎవరయినా, ఎవరు చెప్పినా శ్రవణేంద్రియాలతో వినగలరు. రేడియో వ్యవహారం అంతా 'వినడం'తో సంబంధించింది. వినసొంపుగా లేకపోతే, 'శ్రవణాసక్తి' కలిగించకపోతే, శ్రోత విముఖు డవుతాడు. 'ఎవరేమన్ననంద్రు నిజము నాది కర్ణాట భాష' అనీ, 'దేశభాషలందు తెలుగులెస్స' అన్నీ కృష్ణదేవరాయలు అన్నాడంటే– ఆ మాటలో 'కర్ణాట' అన్నదానికి, 'కర్ణములకు' అనగా 'చెవులకు' సొంపైనభాషఅనే అర్థం అనేవారున్నారు. తెలుగు స్వతహాగా శ్రావ్యతకు పెట్టింది పేరైన భాష. వినవేడుక అయినది. వ్రాయడానికీ అందమైనదే!. అందమైన తెలుగుభాష శబ్దస్వరూపం సన్నగిల్లితే, భాషలోని జీవత్వమే మృగ్యమవుతుంది. కనుక తెలుగునకు గల సహజ శ్రావ్యసంపదను నిలపడంలో, పెంచిపోషించడంలో, 'రేడియో' పాత్ర అవిస్మరణీయమైంది. భాషకు గల శబ్దసరళి వలన, కొన్ని కొన్ని భాషలకు 'శ్రవణానందం' అనే గుణం లేకపోవడం అటుంచి, అలసటగలిగే ప్రమాదమూవుంది. కానీ 'తెలుగు' అట్లా కాదు. తెలుగు ధ్వనిసంపద, ఉచ్చారణ సుఖసంపద్వంతాలు. ఇంగ్లాండ్‌లో రేడియో ప్రభావం వలన ఆంగ్లభాష ఉచ్చారణ చాలా బాగుపడిందని అక్కడివారే అంటారు. అట్లా నిజానికి తెలుగు భాష 'ఉచ్చారణ' రేడియో ప్రసారాల ద్వారా అందిపుచ్చుకుని, ఎదిగినవారెందరో వున్నారు.

'భాష' అభివృద్ధికి– రేడియో కృషి అనన్య సామాన్యం. ఒక రాష్ట్రంలో మాట్లాడు కునే భాష ఆ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోనూ ఒకే తరహాగా వుండదు. వివిధ మండలాలలో, వివిధ మాండలిక రీతులు వాడుకలో వుంటాయి. విభిన్న స్వరూపాలు

గల ఒకే భాషకు రేడియో తన ప్రసారాల ద్వారా, ఒక సమగ్ర స్వరూపాన్ని సంతరించి పెట్టి, నిలదొక్కుకునేలా చేసింది. రోజూ ఇంట్లో రేడియో వింటూ వింటూ, ఆ వినేవారి చెవులలో సరళమైన వ్యావహారికం వినబడుతూండడం వల్ల, కేవలం 'పరిసీమిత ప్రాంతగతమైన' మాండలికాల ప్రభావాన్ని అధిగమించి, అందరూ– అందరికీ అర్థమయ్యే పరస్పరం వ్యక్తం చేసుకోగల– సరళమైన 'సమగ్ర అభివ్యక్తీకరణ భాష' వాడుకలోకి వచ్చింది. భాష స్వరూపానికి– ఒక 'విశాల స్థిరీకరణకు' రేడియో చేసిన ఈ సేవ ప్రధానమైనది. నిజానికి రేడియో ద్వారానే తెలుగుభాష శ్రావ్య స్వరూపం పటుత్వాన్ని పొందింది. చక్కటి సరళమైన వ్యావహారిక భాషను సృజించడానికీ, దాన్ని వ్యాప్తి చేయడానికీ 'రేడియో' ఎంతైనా దోహదం చేసింది. గ్రాంథికభాష రేడియో కార్యక్రమాలకు అనువైంది కాదు. ప్రత్యేక సాహిత్య కార్యక్రమాలలో కొంతమేరకు చెల్లుతుందేమోగానీ, రేడియో ప్రసారాలన్నింటినీ శ్రోతలు తమ నిత్యజీవితంలో దైనందిన వ్యవహారాల్లో మాట్లాడుకోవడానికి అలవాటుపడిన భాషలోనే వినడానికి అభిలషిస్తారు. అందుకే 'వ్యావహారిక భాషే' రేడియోకి అనువైనది. వ్యావహారిక భాషా వికాసానికి తదనుగుణంగానే 'ఆకాశవాణి' దోహదపడింది. రేడియో ప్రభావం వల్లనే– శిష్ట వ్యావహారిక భాష ఒక పటిష్ఠరూపాన్ని పొంది, విశిష్ట స్థానాన్ని సాధించిందనవచ్చు.

'ప్రసార భాషగా తెలుగు' అన్నప్పుడు దానికి ప్రామాణికత ఏమిటి? అనే ప్రశ్న రావడం సహజం. కొన్ని పత్రికలలో ఉపయుక్తమైన కొన్ని ప్రాంతాల భాషే– ఆధిపత్యం వహించిందనీ, 'రేడియో' కూడా దానికి మినహాయింపేమి కాదనీ అనేవారున్నారు. అధిక సంఖ్యాకులైన శ్రోతలు అర్థం చేసుకోగల భావాభివ్యక్తి తీరే ప్రధానం కానీ, కావ్య, సాహిత్య భాషకానీ, పరిసీమిత మాండలికం కానీ ప్రధానం కాదు.

అనివార్యంగా మనం అంగీకరించవలసిన ఒక విషయం ఏమిటంటే– సమాజంలో వివిధ స్థాయిలున్నట్టుగా, భాషలో కూడా స్థాయీ భేదాలున్నాయి, ఉంటాయి. వాటిలో చదువు, సంస్కారం వున్నవాళ్ళు, కలిమి అధికారం గలవాళ్ళు, సామాన్యంగా రోజువారీ వ్యవహారాల్లో వాడే భాష ప్రామాణికంగానో, 'శిష్ట వ్యావహారికం'గానో, గుర్తింపును పొందుతుంది. ఆ భాషను అనుకరిస్తూ మాట్లాడడం ద్వారా, తాము ఆ స్థాయికి చేరుకోగలమన్న శిష్టేతరుల భావన, భాషా విషయికంగా 'అభివృద్ధి'గా పరిపాలనలో వుంటోంది. 'వ్యావహారిక భాష' కాలానుగుణ వ్యవహారాన్ని బట్టే మారుతుంది. ఆంగ్లమాధ్యమంలో 'విద్యార్జన'కు ప్రాముఖ్యతను తెచ్చి, తల్లిదండ్రులు

సైతం తమ పిల్లలను మాతృభాషలో కన్నా, ఆంగ్లంలోనే ప్రవీణులుగా చూడగోరడంతోనూ, ఉపాధి అవకాశాలను అనివార్యంగా ఆంగ్లంతోనే ముడిపెట్టడం వల్లనూ, ఇవాళ వ్యవహారంలో 'తెలుగు' కు ఆంగ్ల పదాల నడుమే అస్తిత్వం, తెలుగు పదాల కన్నా ఆంగ్ల పదాలే తెలుగు మాట్లాడేవారిలో అధికం కావడం జరుగుతోంది. ఈ తరం శ్రోతలకు ఉద్దేశించిన కార్యక్రమాలను 'ప్రైవేట్ ఛానల్స్' పూర్తిగా ఆ ధోరణిలోనే మలచడంతో, అసలు 'ప్రసారభాష' గా తెలుగు కూడా ప్రమాదం అంచుల్లో పడుతోంది! వ్యవహార సరళి రూపొందడానికి, సమాజ పరిణామాలే హేతువు. భాషా విషయికమైనా అంతే! ఇది స్వయంకృతాపరాధమే! శుద్ధమూ, ప్రామాణికమూ అయిన 'తెలుగు' మాయమవుతూ, కృత్రిమ వాక్య నిర్మాణాలు, ఉచ్చారణ దోషాల భాషే ప్రయుక్తమవుతోందని, నేటి 'రేడియో' గురించి విజ్ఞులు వాపోతున్న మాట యథార్థమే!

'అభివ్యక్తి భాష' స్థిరీకరణకు దోహదపడిన 'రేడియో', ప్రాంతీయ భాషలూ, మాండలికాల అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడుతోందని గుర్తించే, వాటి ఉనికినీ, విస్తృతినీ సంరక్షించి దోహదపడే సంకల్పంతోనే, 'ప్రాంతీయ రేడియో' కేంద్రాలను ప్రారంభించింది. 'ఆకాశవాణి' ఆదర్శం మంచిదే అయినా, ఆచరణలో– అమలు పరచవలసిన అధికారుల అలసత్వం, వైయక్తిక వైఖరుల కారణంగా – వైఫల్యాలు వచ్చాయేమో గానీ, నిజానికి భాషకు ద్రోహం చేస్తూ, 'ఆకాశవాణి' ఏనాడూ వ్యవహరించలేదు. ఆయా 'స్థానిక కేంద్రాలు' అక్కడి భాషా సంస్కృతులను పరిరక్షించే కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేయాలన్నదే మౌలిక ఉద్దేశ్యం!

'రేడియో' కార్యక్రమాలన్నింటా– 'భాష' ఒకేలా వుంటుందనుకుంటే, అదీ పొరపాటే! ఆయా కార్యక్రమాలు– జనుల్లో ఏ వర్గానికి నిర్దేశితమై రూపాందింప బడుతున్నయో, ఆయా వర్గాలవారి అవగాహనకు అందేదిగా, భాషను ఆ కార్యక్రమాల్లో ప్రసారం చేయడం అనివార్యం. పిల్లల కార్యక్రమాలు, స్త్రీల కార్యక్రమాలు, వ్యవసాయ దారుల కార్యక్రమాలు, కార్మికుల కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థుల కార్యక్రమాలు, యువవాణి కార్యక్రమాలు, వృద్ధుల కార్యక్రమాలు ఇట్లా వైవిధ్యభరితమైన నిర్దేశిత వర్గాలకు ప్రసారం చేసే కార్యక్రమాల్లో (స్పెషల్ ఆడియన్స్ ప్రోగ్రామ్స్), వారికి అర్థమయ్యే తీరులోనే భాష, పదప్రయోగాలనే చేయడం, 'ఆకాశవాణి'లోనే ముందు నుంచీ కూడా జరుగుతోంది. తెలుగు మాట్లాడడం, తెలుగులో రాయడం, తెలుగు చదవడం, తెలుగులోనే ఆలోచించడం అన్న 'సమగ్రసంవిధానం' ఇవాళ్టి తరానికి–

ఇంకా అలవాటు చేయాల్సే వుంది! తెలుగుభాషా సమగ్రవికాసం – అప్పుడు గానీ సాధ్యం కాదు. నిజానికి శ్రవ్య మాధ్యమమైన 'రేడియో' భాషా వికాసానికి నేటికీ ఎంతగానో దోహదకారి కాగలుగుతుంది. ఆ మాధ్యమాన్ని ఆ దిశగా ఉపయుక్తం చేసుకోగల సామర్థ్యాలను పెంచుకోవాలి. అందువల్ల 'ప్రసార భాషగా తెలుగు' ఆకాశవాణిలో ఇంకా అంతగా భ్రష్టు పట్టలేదు. ఏమయినా భాషా వికాసానికి – రేడియో ప్రభావాన్ని గుర్తెరిగి, తదనుగుణంగా రేడియో ప్రసారాలను మలుచుకోవడం వర్తమాన కర్తవ్యమే.

రేడియో సాహిత్యం:

సాహిత్య రచనా ప్రక్రియల్లో 'రేడియో రచన' అనే ఒక ప్రత్యేక ప్రక్రియ ఆకాశవాణి ఆవిర్భావంతోనే చోటుచేసుకుంది. 'రేడియో రచన' అంటే '(శ్రవ్య రచనే' అయినా, ప్రసారానుగుణ్యంగా వుండడం అనేది ప్రధానం. వచన రచనలో– కథ, నవల, వ్యాసం, నాటకం, సంభాషణ, వార్తలు ఏవయినా రేడియోలో ప్రసారానికి అనుకూలంగా వున్నప్పుడే, అవి 'రేడియో రచన' లవుతాయి. ఒక పత్రికలో వ్యాసమో, ఒక రంగస్థలం మీద నాటకమో యథాతథంగా రేడియోలో ప్రసంగంగానో, రేడియో నాటకంగానో ప్రసార యోగ్యతలను కలిగి ఉండదు. అట్లాగే ఓ కవితయినా, కథ అయినా రేడియో శ్రోతకు అనుగుణంగా మలుచుకుంటేనే రాణిస్తుంది. సంగీతం ఆపాత మధురం కనుక ఒక గాత్ర సంగీతమో, వాద్య కచేరీయో, సినిమా పాటనో, లలిత గీతమో, జానపద గీతమో రేడియోలో విని ఆనందించడం వేరు, పట్టుమని ఓ పదినిముషాల ప్రసంగాన్నో, కథనో అంత శ్రద్ధగా శ్రోతలు విని ఆనందించగలగడం వేరు. వారినలా ఆనందింపచేయగలగడం సామాన్యమైన సంగతేమీ కాదు. ఒక కథ, నవల పత్రికలో చదువుకోవడానికీ, రేడియోలో వినడానికీ బోలెడు తేడా వుంది. ఒక కథలో– ప్రకృతిశోభ వర్ణనలు, శిల్పం అనేవి శ్రోతకు రసభంగహేతువులు కావచ్చు. కథలో సంభాషణలు పాత్రోచితంగా వుండాలి గానీ, మెలోడ్రామాలా కాకూడదు. మళ్ళీ అట్లాగే ప్రసంగమైనా, కథయినా ఎత్తుగడలోనే శ్రోతను ఆకర్షించి, పట్టి వుంచకపోతే, కార్యక్రమాన్ని శ్రోత వినడు. అట్లాగే పాటయినా, మాటయినా, సంభాషణ అయినా, చర్చ అయినా, సాహిత్యంలోని ఏ ప్రక్రియ అయినా, రేడియో ప్రసారానికి వచ్చేటప్పటికి శ్రోతలను దృష్టియందుంచుకుని, మలుచుకుని, రూపొందించి, ప్రసారం చేయాల్సి ఉంటుంది. అందుకే 'రేడియోకి రాయడం' అనే

విషయంలో ప్రావీణ్యత అందరికీ అబ్బేది కాదు! కానీ రేడియో ద్వారా ఎందరో సాహితీవేత్తలు, సృజనకారులు, కళాకారులు, మంచి సాహిత్య కార్యక్రమాలు అందించారు. శ్రోతల ప్రశంసలందుకున్న రేడియో సాహిత్య ప్రక్రియలున్నాయి.

'ఆకాశవాణి'కి అబ్బిన ఒక గొప్ప అదృష్టం సాహిత్య, సంగీత, నాటక కళారంగాలకు చెందిన ప్రముఖులెందరో 'ఆకాశవాణి'లో వివిధ స్థాయిల్లో ఉద్యోగులుగా పనిచేసిన (చేస్తున్న) వారున్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాల్లో, సంగీత ప్రపంచంలో ప్రముఖులైన పింగళి లక్ష్మీకాంతం, దేవుపల్లి కృష్ణశాస్త్రి, కేశవపంతుల నరసింహశాస్త్రి, బుచ్చిబాబు, జాషువా, గోపీచంద్, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, మునిమాణిక్యం, దాశరథి, జి.వి.కృష్ణారావు, ఆచంట జానకీరాం, బాలాంత్రపు రజనీకాంతరావు, శంకరమంచి సత్యం, శ్రీవాత్సవ, వేలూరి సహజానంద, అయ్యగారి వీరభద్రరావు, గొల్లపూడి మారుతీరావు, ఉషశ్రీ, తెన్నేటి హేమలత, తురగా జానకీరాణి, వి.ఎస్.రమాదేవి, రావూరి భరద్వాజ, స్థానం నరసింహారావు, బందా కనకలింగేశ్వర రావు, ప్రయాగ నరసింహశాస్త్రి, సుత్తి వీరభద్రరావు, శ్రీ గోపాల్, న్యాయపతి రాఘవరావు, ఏడిద కామేశ్వరరావు, చిరంజీవి, నండూరి విఠల్, శారదా శ్రీనివాసన్, నండూరి సుబ్బారావు, సి.రామమోహనరావు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఓలేటి వెంకటేశ్వర్లు, శ్రీరంగం గోపాలరత్నం, ఎన్‌సిహెచ్ జగన్నాథాచార్యులు, కృష్ణమాచార్యులు, అన్నవరపు రామస్వామి, దండమూడి రామమోహనరావు, ఎల్లా వెంకటేశ్వర రావు, ప్రపంచం సీతారాం, ఎన్నెస్ శ్రీనివాసన్, పాలగుమ్మి విశ్వనాథం, వింజమూరి సీత, చిత్తరంజన్, దండమూడి మహీధర్, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, సుధామ, పైడి తెరేష్‌బాబు, మంత్రవాది మహేశ్వర్, నాగసూరి వేణుగోపాల్, పి.వి.శేషారత్నం ఇట్లా ఎందరెందరో లక్షలాది శ్రోతలను అనునిత్యం అలరించిన ప్రముఖులుగా రేడియో కార్యక్రమాల రూపకల్పనలో భాగస్వాములే!

రేడియోలో ఉద్యోగం చేయకపోయినా రేడియో కార్యక్రమాల ద్వారా ప్రఖ్యాతి చెందిన కవులూ, కళాకారులూ, రచయితలకూ లోటులేదు. ప్రముఖకవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి పార్లమెంట్ సభ్యునిగా ఒకసారి సభలోనే 'నేను రచయితగా ఆకాశవాణిలోనే జన్మించాను' అని చెప్పడం– రేడియో వైభవ ప్రాభవాలకు నిదర్శనమే! వివిధ సాహిత్య ప్రక్రియలకు 'ఆకాశవాణి' అందించిన, అందిస్తున్న 'ఆదరణ' ఆయా ప్రక్రియా రచయితలకూ, కళాకారులకూ కలిగిస్తున్న

'ప్రోత్సాహం' సాటిలేనివే! నేటికీ 'రేడియో రచన' చేస్తున్న రచయితలు, కళాకారులు– పత్రికల్లోనూ, ఇతరత్రా పొందే దానికన్నా అధికంగా పారితోషికాన్నీ, కీర్తినీ పొందుతున్నారన్నది యథార్థం.

కవిత్వం:

రేడియోలో – సాహిత్య కార్యక్రమాల్లోనే కాదు, స్త్రీల కార్యక్రమాల్లో, యువవాణి కార్యక్రమాల్లో, కార్మికుల కార్యక్రమాల్లో కవితలు ప్రసారమవుతుంటాయి. 'రేడియో కవిత' కొంత దీర్ఘతతో వుండడం అవసరం. అట్లాగే శ్రోత అవగాహన నిమిత్తం ముఖ్యమైన భావపంక్తులు– కవి పునరుక్తం చేసి, చదవడం కొంతమేరకు ఆమోదయోగ్యమే! ముఖ్యంగా రేడియో 'కవి సమ్మేళనాలు' ఆహూతుల సమక్షంలో జరపడం కూడా 'ఆకాశవాణి' అనవాయితీ. ఉగాది, దీపావళి, సంక్రాంతి వంటి పర్వదినాలకు, అట్లాగే స్వాతంత్ర్య దినోత్సవం వంటి సందర్భాల్లో కవి సమ్మేళనాలు జరపడం ఆనవాయితీయే! 'ఉగాది' వంటి పర్వదినం కవిసమ్మేళనం నేపథ్యంగా వున్నా, ప్రతిభావంతులైన కవులు అద్భుతమైన సముచిత కవితలు విన్పించిన సందర్భాలు అనేకం! కవులకు ఆకాశవాణిలో ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం జాతీయ కవిసమ్మేళనం. 1956 నుండి ప్రతి ఏటా జనవరి 25 గణతంత్ర దినోత్సవం ముందురోజు రాత్రి 'ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం' ప్రసారమవుతోంది. ఒక్కొక్క భాష నుండి ఒక్కొక్క కవిని ఎంపిక చేసి, సర్వభాషా కవులను ఒకచోట సమావేశ పరచి, నిర్వహించే ఈ జాతీయ కవిసమ్మేళనం విశిష్టత–ఆయా భాషల కవితలన్నింటినీ, ఇతర భాషలన్నింటిలోకీ, ఆయా భాషల అనువాదకవులచే అనువదింపచేసి, ఏకకాలంలో ప్రసారం చేయడం. అంటే హైదరాబాద్ కేంద్రం నుండి అన్ని భాషా కవితల 'తెలుగు' అనువాదాలు ప్రసారమవుతుంటే, అదే వేళకు తమిళనాట మద్రాసు నుంచి 'తమిళం' లోనూ, కర్ణాటక బెంగుళూరు నుంచి 'కన్నడం'లోనూ అట్లా ఆయా భాషల ప్రాతినిధ్య ప్రధాన కేంద్రాల నుండి, అన్ని భాషల నుంచీ ఎంపికయిన కవితలను 'అనువదించి' ప్రసారం చేస్తారు.

గుర్తించబడిన అన్ని భాషలనుండీ ఆయా భాషలకు ప్రాతినిధ్య కవులను, ఏటా వారి 'కవిత'ను బట్టి ఎంపిక చేస్తారు. ఇట్లా 'సర్వభాషా కవి సమ్మేళనం' ఆకాశవాణికి ప్రతిష్ఠాత్మక కార్యక్రమం! జాతీయస్థాయిలో తమ భాష నుంచి తమ కవితతో, జాతీయ కవిగా ఎంపిక కావడమన్నది కవులకు ప్రతిష్ఠాత్మక మైనదే కదా!

రేడియోలో కవితాపఠన కార్యక్రమంలో ప్రసారమైన కవితల నుండే జాతీయస్థాయి కవిత పరిశీలించబడుతుంది. అట్లా కాక, స్థానిక భాషా పత్రికలలో ప్రచురితమైన కవితలను కూడా పరిశీలనకు కార్యక్రమనిర్వాహకులు తమ కేంద్రం నుండి సూచించే అవకాశం వుంది. సృజనశీలురైన కవులకు మంచి పారితోషికం లభిస్తుంది కూడాను. విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, కరుణశ్రీ, గుంటూరు శేషేంద్ర శర్మ, సోమసుందర్, శిఖామణి, నండూరి రామకృష్ణమాచార్య, మిరియాల రామకృష్ణ, ఆరుద్ర, సినారె, కె.శివారెడ్డి, సుధామ, పైడితేరేష్‌బాబు వంటి వారందరూ జాతీయ కవులుగా తెలుగుకు ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నవారే!

మూల భాషల కవితలను హిందీ, ఇంగ్లీషు అనువాదాల ఆధారంగా ఆయా భాషల్లోకి, ఆయా భాషల్లోని ప్రముఖ కవులు అనువాదం చేసి వినిపించడం కూడా ఈ కార్యక్రమంలోని విశేషమే! పద్య కవులూ, వచన కవులూ అందరికీ కవితాపఠన కార్యక్రమం, 'సరస వినోదిని' వంటి కార్యక్రమం ఎందరో పద్య కవులకు స్ఫూర్తివంతమైంది. ప్రత్యేక సందర్భాల్లో ఆకాశవాణి 'అవధానాలను' కూడా నిర్వహించి, అవధాన కవులను ప్రోత్సహించింది. దివాకర్ల వేంకటావధాని, నరాల రామిరెడ్డి, మేడసాని మోహన్, ఆశావాది ప్రకాశరావు, సి.వి.సుబ్బన్న శతావధాని, కడిమెళ్ళ వరప్రసాద్, బేతవోలు రామబ్రహ్మం, మాడుగుల నాగఫణిశర్మ, రాళ్లబండి కవితా ప్రసాద్, గుమ్మనగారి లక్ష్మీనరసింహ శర్మ, గండ్లూరి దత్తాత్రేయ శర్మ ప్రభృతులు రేడియో అవధాన కార్యక్రమాల్లో పాల్గొని, తమ పద్యవిద్యను ప్రదర్శించినవారే. సరే! కవిత్వ పరమైన ప్రసంగాలు, చర్చలు, కవులతో పరిచయ కార్యక్రమాలే కాక, డాక్టర్ సి.నారాయణరెడ్డి 'విశ్వంభర', 'ఋతుచక్రం', 'కర్పూర వసంతరాయలు' వంటి కావ్యాలను ఆమూలాగ్రం ఆయన కంఠంతోనే రికార్డు చేసి, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం భద్రపరచడం జరిగింది. విశ్వనాథ, పుట్టపర్తి, ఉత్పల, ఎన్.గోపి వంటివారి కావ్యగానాలను కూడా పూర్తి నిడివిలో రికార్డు చేసి భద్రపరిచారు. ఇదంతా కవిత్వ నిధులను భద్రపరిచే సాహిత్య సేవయే కదా!

కథ:

'తెలుగు కథ'కు రేడియో గొప్ప ఊతమిచ్చింది. ప్రముఖ కథకులందరూ రేడియోకు 'కథలు' రాసినవారే! రేడియో కథ పదిపన్నెండు నిముషాల వ్యవధి మించి

వుంటే శ్రోతలను అలరించడం కష్టం. అందువల్ల రేడియోలో ప్రసారమైనవి ఎక్కువగా 'కథానిక'లే. 'అనగనగా' పేరిట ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, కొన్నాళ్ళు రోజూ ఒక కథను ప్రసారం చేసింది. శారదా శ్రీనివాసన్ ఆ కథలు వినిపించేవారు. శ్రీశ్రీ 'ఒసే తువ్వాలు అందుకో' వంటి కథలు ముందుగా రేడియో కోసమే వ్రాసారని చెబుతారు. రేడియో కథలు సుదీర్ఘ వర్ణనలతో, ఉపోద్ఘాతాలతో ఉండవు. సంభాషణలు, సంఘటనలు శ్రోతకు హత్తుకునేలా వుండాలి. కథ 'రాయడం' కాదు, కథ 'చెప్పడం' అన్న రీతినే పాటించి, రచయిత శ్రోతను అలరించాలి. 'కథ' అందరికీ అర్థమయ్యే భాషలోనే వుండడం సబబు. ప్రాంతీయ రేడియో కేంద్రాల ద్వారా ప్రసారం చేసే కథల్లో ఆ ప్రాంత జనజీవనం, మాండలికాన్ని వినియోగించి, ఆ కేంద్ర శ్రోతలను ఆకట్టుకోవచ్చు. ఆకాశవాణి 'కథాసమ్మేళనాలు' నిర్వహించి, ఆహూతుల సమక్షంలో కథారచయితలచే కథలను చెప్పించిన సందర్భాలున్నాయి.

అట్లాగే కథానికా రచయితలతో పరిచయాలు, గోష్ఠులు నిర్వహించింది. హైదరాబాద్, విజయవాడ, ఆకాశవాణి కేంద్రాలు వార్షిక సాహిత్యసమీక్షలు ప్రసారం చేస్తూ ఆ ఏటి మేటి కథల గురించి శ్రోతలకు ఆసక్తిదాయక ప్రసంగాలను రూపొందించి ప్రసారం చేశాయి. గోపీచంద్, బుచ్చిబాబు, భాస్కరభట్ల కృష్ణారావు, చాసో, రావూరి భరద్వాజ, భరాగో, అవసరాల రామకృష్ణారావు, వి.రాజారామమోహన్ రాయ్, కేతు విశ్వనాథరెడ్డి, మధురాంతకం రాజారాం, తురగా జానకీరాణి, ఇంద్రగంటి జానకీబాల వంటి వారి కథలనెన్నింటినో ఆకాశవాణి శ్రోతలకు అందించింది. 'రాబోయే శతాబ్దంలో రాగోరే కథలు' అని మునిపల్లె రాజు, శ్రీపతి, మధురాంతకం రాజారాం 1993 లోనే విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుండి ఒక రసవత్తర చర్చలో పాల్గొన్నారు. పోరంకి దక్షిణామూర్తి, మంజుశ్రీ, శ్రీపతి వంటి కథకుల కథలనూ, అట్లాగే నగ్నముని 'విలోమ కథలను' రేడియో ప్రసారం చేసింది. మంచికథలను నాటికలుగా మలచిన సందర్భా లున్నాయి. అట్లాగే 'సైన్స్‌ఫిక్షన్ కథలు' వంటివాటికి కూడా 'ఆకాశవాణి' స్థానం కల్పించింది. మైనంపాటి భాస్కర్, పాలకోడేటి, తులసి బాలకృష్ణ, వేదగిరి రాంబాబు వంటివారు యువకులుగా వుండగానే కథలు రాసి రేడియోలో వినిపించారు. 'కథాలహరి', 'కథన కుతూహలం', 'కథావల్లరి' వంటి శీర్షికలతో కథాప్రసారాలు నిర్ణీత సమయాల్లో విన్పించడం చేసింది రేడియో.

నవల:

నవలల ప్రసారంలోనూ 'ఆకాశవాణి' తనదైన ప్రత్యేకతను నిల్పుకొంటూ వచ్చింది. విశ్వనాథ సత్యనారాయణ తమ 'బద్దన్నసేనాని' నవలను విజయవాడ కేంద్రం నుండి తామే స్వయంగా వినిపించడం రేడియో చరిత్రలోని విశేషమే! 1979 తరువాత 'నవలాస్రవంతి' పేర హైదరాబాద్ కేంద్రం ధారావాహిక నవలలు ప్రసారం చేసింది. అనేక తెలుగు నవలలు రేడియోలో ప్రసారమయ్యాయి. హైదరాబాద్ నిలయ కళాకారులైన శారదా శ్రీనివాసన్, నండూరి విఠల్, చిరంజీవి, జీడిగుంట రామచంద్ర మూర్తి నవలాపఠనం చేసిన వారిలో వున్నారు. కొడవటిగంటి కుటుంబరావు 'చదువు', కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు', 'హౌస్‌సర్జన్', మాలతీ చందూర్ 'హృదయ నేత్రి', మహీధర 'కొల్లాయి గట్టితేనేమి', దాశరథి రంగాచార్య 'చిల్లరదేవుళ్ళు', అంపశయ్య నవీన్ 'అంపశయ్య', 'కాలరేఖలు', ఘండికోట బ్రహ్మాజీరావు 'శ్రామికశకటం' యద్దనపూడి సులోచనారాణి 'ఆరాధన', అడవి బాపిరాజు 'కోనంగి', రావూరి భరద్వాజ 'పాకుడురాళ్ళు', పోతుకూచి సాంబశివరావు 'ఉదయకిరణాలు', నోరి నరసింహశాస్త్రి, మొక్కపాటి, మునిమాణిక్యం వంటివారి నవలలూ ధారావాహికంగా ప్రసారమయ్యాయి. సాధారణంగా 'బి హైగ్రేడ్' కలిగిన డ్రామా ఆర్టిస్టుల చేత 'నవలాపఠనం' చేయించడం, లేదా నిలయకళాకారులే ఎవరో నిష్ణాతులు 'చదివి వినిపించడం' జరుగుతుంది. ఇట్లా అక్షరాస్యులు కాని శ్రోతలకు కూడా తెలుగు నవలలు వినిపించి, నవలా పఠన కార్యక్రమం రాణించింది. అట్లాగే పలు నవలలను ఆ నవలా రచయిత నాటకీకరణం చేయలేకపోయినా, మరో ప్రముఖ రచయిత ఎవరిచేతయినా, ముఖ్యంగా నాటకరచయితచే నాటకీకరణ చేయించి ప్రసారం చేయడం రేడియో సేవయే!

ప్రసంగం/ వ్యాసం:

'వ్యాసం' అనే సాహితీ ప్రక్రియ రేడియోకొచ్చేసరికి 'ప్రసంగం' అవుతోంది. విషయాన్ని అనుసరించి, అనవసరమైన ఉపోద్ఘాతాలు లేకుండా, ఆసక్తికరమైన ఎత్తుగడతో, విషయంలోకి తీసుకువెళ్ళి, శ్రోతలను ఆకట్టుకునేలా ప్రసంగ రచన రూపొందించాలి. అవసరమైనమేరకే, అవసరమైన గణాంకాలను పేర్కొనాలి. నాలుగు నిముషాల కాలవ్యవధి గల – 'భావన', 'మహనీయుల మహితోక్తులు', 'సూక్తిముక్తావళి'

వంటి ప్రసంగ కార్యక్రమాలు మొదలు, పావుగంట నుండి కొన్నిసార్లు అరగంట వరకూ కూడా ప్రసంగాల కాలవ్యవధి వుంటుంది. జాతీయ ప్రసంగ కార్యక్రమాలూ వుంటాయి. నిర్దేశిత శ్రోతల కార్యక్రమాల్లోనూ ప్రసంగాలకే పెద్దపీట వేస్తూంటారు. ఏ అంశం మీదనైనా ప్రసంగాన్ని రూపొందించి ప్రసారం చేయడం సాధ్యమే! సాహిత్యం, సంగీతం, చిత్రలేఖనం, సైన్స్, వైద్యం, రాజకీయం, ఆర్థికం ఇట్లా ఏ రంగానికి చెందిన నిష్ణాతులనైనా పిలిపించి, ఆయా రంగాల అంశాలపై, ప్రసంగానికి ఆహ్వానించినప్పుడు వారు ప్రసంగ వ్యాసాన్ని తయారు చేసుకుని వినిపిస్తారు. సామాన్య శ్రోతలకు కూడా సులభ గ్రాహ్యంగా, విషయ పరిజ్ఞానానుకూలంగా ప్రసంగాలుండాలి. ఆయా రంగాలకు చెందిన పరిభాష (జార్గన్) ప్రసంగంలో వినియోగించినా, అందరికీ అర్థమయ్యే పదాలే ప్రసంగంలో ప్రయోగించటం ముఖ్యం. 'రేడియో ప్రసంగ కళ' అందరికీ అబ్బేది కాదు. వినగానే అర్థమవుతూ, కఠినమైన అన్వయంగల దీర్ఘ వాక్యాలు లేకుండా, భాష సమాసభూయిష్టం కాకుండా, సుబోధకంగా వుండాలి. మల్లంపల్లి సోమశేఖరశర్మ, కృష్ణశాస్త్రి, ఎస్వీ భుజంగరాయశర్మ, సంజీవదేవ్ వంటివారి ప్రసంగాలు రేడియోపద్ధతిలో అద్భుతంగా సాగేవని చెబుతారు.

నాటకం:

రేడియో నాటకానికి ఒకప్పుడు వున్న ప్రాచుర్యం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఆదివారం మధ్యాహ్నాలలో గంటసేపు ప్రసారమయ్యే 'రేడియో నాటకాలు' వినడం కోసం ఆ రోజుల్లో ఇంటిల్లిపాదీ రేడియో చుట్టూ చేరేవారు. రేడియో నాటకానికి వున్న 'శ్రవ్యశక్తి' చాలా గొప్పది. దృశ్యాలను, సంఘటనలను, పాత్రలను సజీవంగా శ్రోతల ముందు నిలిపి, రసావిష్కరణ చేయడం 'రేడియో నాటిక' గొప్పదనం. పావుగంట, అరగంట, గంట నాటకాలు అనేకం రేడియో నాటక విభాగం రూపొందించి ప్రసారం చేయడంలో నాటక రచయితలు, నటీనటులు, సాంకేతిక నిపుణుల పాత్ర గొప్పది. రంగస్థలం మీద ప్రదర్శన యోగ్యం కాని ఒక 'విమానం హైజాకింగ్' గురించో, 'నౌకాభంగం' గురించో, 'తుఫాను బీభత్సం' గురించో ఆ ఇతివృత్తాన్ని రేడియో నాటకంగా మలచి మెప్పించగల అవకాశం వుంది. అది రేడియోలోనే సాధ్యం. ధ్వనులు, శబ్దాలు, మాటల ద్వారానే దృశ్యీకరించగల నైపుణ్యం రేడియో నాటకానిది.

తెలుగులో ప్రసారమయిన తొలి రేడియో నాటకంగా ముద్దుకృష్ణ రచించిన 'అనార్కలి' నే చెప్పుకోవాలి. మద్రాసు రేడియో కేంద్రం నుండి 1938 జూన్ 24 వ తేదీ రాత్రి 8.30 కి ప్రసారమయిన ఆ నాటకంలో అనార్కలి పాత్రలో రేడియో భానుమతిగా ప్రసిద్ధురాలైన (మద్రాసు కేంద్రం అనౌన్సర్) పున్నావఝుల భానుమతి, నాయకుడు సలీంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి, అక్బర్‌గా డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు నటించారు. శ్రీశ్రీ రాసిన 'బలి', 'గ్రామఫోన్ రికార్డుల తిరుగుబాటు' అనే రేడియో నాటికలు 1939-40 లలో ప్రసారమయ్యాయి. 1939 నుంచి 1984 దాకా శ్రీశ్రీ రేడియో కోసమే పధ్నాలుగు నాటికలు రాసారు. 1+1=1 పేర రేడియో నాటికలను అనంతరం సంపుటీకరించారు కూడా. పి.వి.రాజమన్నార్, కొడవటిగంటి కుటుంబరావు, గోరాశాస్త్రి (ఆశఖరీదు అణా వంటివి) రేడియో కోసం నాటకాలు రాసిన వారిలో తొలితరం ప్రముఖులు. ఆ తరువాత వందలాదిగా నాటక రచయితలు, నటీనటులు రేడియో నాటకాలకు జీవం పోశారు. రేడియోనాటకాలలో పాత్రధారణ చేయడానికి ఆకాశవాణి నిర్వహించే నిర్దేశిత స్వరపరీక్షలో ఉత్తీర్ణులు కావలసి ఉంటుంది. వారికే పాత్రధారణ చేసే అవకాశం లభిస్తుంది! 'డ్రామా ఆడిషన్'లో ఉత్తీర్ణత పొందడం నాటక కళాకారులు గొప్ప గుర్తింపుగా తలపోయడం నేటికీ వున్నదే.

సి.ఎస్.రావు, రావికొండలరావు, తనికెళ్ళ భరణి, ఎల్.బి. శ్రీరాం వంటి వారెందరో రేడియో నాటకాలు రాసినవారే! రేడియో నాటకానికి వన్నె, వాసి తెచ్చిన మహనీయ కళాకారులెందరో! శారదా శ్రీనివాసన్ 'రేడియో జ్ఞాపకాలు', డి.వెంకట్రామయ్య 'ఆకాశవాణి అనుభవాలు' వంటి వాటిని చదవడం ద్వారా- రేడియో నాటిక గురించి అనేక విషయాలు తెలుసుకోవచ్చు. రేడియో నాటకంపై తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం సీనియర్ అనౌన్సర్ జ్యోత్స్న పరిశోధన చేసి, డాక్టరేట్ పట్టానందుకున్నారు. ప్రతి ఏటా మార్చి చివరివారంలో ఆకాశవాణి 'రేడియో నాటక సప్తాహం' నిర్వహించి, ప్రతి రోజూ ఒక్కో కేంద్రం సమర్పించే నాటకాలను ప్రసారం చేయడం జరుగుతోంది. రేడియో నాటక సప్తాహం సందర్భంగానే కాక, ఇతరత్రా సాంఘిక, చారిత్రక, హాస్య నాటకాలెన్నింటినో ప్రసారం చేయడం 'ఆకాశవాణి' విశిష్టతే! అట్లాగే రేడియో నాటక రచన పోటీలను నిర్వహించి, ఉత్తమ నాటకాలకు బహుమతి నిస్తూ, వాటిని రూపొందించి, ప్రసారం చేయడం 'ఆకాశవాణి' నాటకరంగానికి చేస్తున్న సేవయే!

సంగీత రూపకాలు:

రేడియోకే ప్రత్యేకమైన ప్రసార ప్రక్రియల్లో 'సంగీత రూపకాలు' గణనీయమైనవి. 1939 లో మల్లవరపు విశ్వేశ్వరరావు రచన 'బిల్హణీయం' సంగీతనాటకంగా ప్రసారమైంది. సూర్యనారాయణమూర్తి రూపొందించిన ఆ నాటకానికి బి.వి. నరసింహారావు సంగీతం సమకూర్చారు. రేడియో ప్రసారం చేసిన సంగీత నాటకాల్లో కృష్ణశాస్త్రి 'శర్మిష్ఠ', 'ఊర్వశి', 'శబరి', 'గుహుడు', 'అతిథిశాల', 'దక్షయజ్ఞం', 'కృష్ణాష్టమి', విశ్వనాథ సత్యనారాయణ రచించిన– 'కిన్నెరసాని', 'కోకిలమ్మ పెళ్ళి', 'విశ్వవీణ', తల్లావఝుల శివశంకరశాస్త్రి– 'పద్మావతీచరణ చారణ చక్రవర్తి', శ్రీశ్రీ రాసిన– 'మోహినీ రుక్మాంగద', 'వ్రేపల్లె' ప్రసిద్ధమైనవి.

1939 నుండి విజయవాడ,1950 ల నుంచి హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాలు ఇతివృత్త వైవిధ్యంతో, సంగీత మాధుర్యంతో అనేక సంగీత రూపకాలను ప్రసారం చేశాయి. కథ లేకుండా భావసంగీతమే ప్రధానంగా కృష్ణశాస్త్రి 'అతిథిశాల', 'వేణుకుంజం' వంటి సంగీత రూపకాలున్నాయి. అంతేకాదు! సంక్రాంతి, ఉగాది, స్వాతంత్ర్యదినం, ఋతువులు, చారిత్రక సన్నివేశాలు వీటిని ఇతివృత్తంగా ఎంచుకొని, వివిధ గేయరచనలతో 'సంగీత రూపకాలు' రేడియోలో ప్రసారమయ్యాయి. విజయవాడ ఆకాశవాణి– కందుకూరి రామభద్రరావు 'క్షైత్రయాత్ర', 'ప్రస్థానం', 'విజయాంబిక', 'హేమంతలక్ష్మి', 'పద్మవ్యూహం', నవశక్తి' వంటి సంగీత రూపకాలు, రజని రచించిన 'విశ్వరూపం', 'విశ్వయానం', 'కొండనుంచి కడలిదాకా' రూపకాలు, అట్లాగే పెండ్యాల సంగీత దర్శకత్వం వహించగా, వేటూరి సుందరరామమూర్తి రచించిన – 'సిరికాకొలను చిన్నది' సంగీత నాటకం, ఇవన్నీ ప్రశస్తమైనవి! జంధ్యాల పాపయ్యశాస్త్రి, పోలవరపు కోటేశ్వరరావు, ముక్కామల నాగభూషణం, కె.వి.సత్యనారాయణాచార్యులు, పాలగుమ్మి విశ్వనాథం, శశాంక, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ఇలా ఎందరో సంగీత రూపకాలు రచించారు. అబ్బూరి రామకృష్ణారావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, వింజమూరి శివరామారావు, దాశరథి, నారాయణరెడ్డి, బోయి భీమన్న ప్రభృతులెందరో సంగీత రూపకాలు రచించిన వారే! 'కొత్తకోవెల', 'వెన్నెలవాడ', 'రామప్ప', 'యశోధర', 'త్రిపథ' వంటి సంగీత రూపకాలు శ్రోతలను రసానందపరవశుల్ని చేశాయి.

రూపకాలు:

రేడియోకే ప్రత్యేకమైన ప్రక్రియ 'రూపకం'. 'ఫీచర్' అనే ఈ ప్రక్రియ రచనా, రూపకల్పనా విలక్షణమైనవే! మద్రాసు కేంద్రం నుండి తెలుగులో ప్రసారమైన తొలి

రూపకం– కృష్ణదేవరాయ వైభవం. 1941 జనవరి 15 న ప్రసారమైన ఈ రూపకం మౌలిక రచన చేసినవారు ఆకొండి వేంకటేశ్వరరావు. రేడియోకు అనువుగా రూపకరచన చేసి ప్రసారంలో ప్రాణప్రతిష్ఠ చేసినవారు– ఆచంట జానకీరాం. చరిత్రను రసవత్తరంగా విన్పించడానికి చేసిన ఆ ప్రయత్నం శ్రోతలను ఆకట్టుకుంది. రేడియోలో అట్లాగే 'డాక్యుమెంటరీ రూపకాలు' ఎన్నుకున్న ఇతివృత్తాన్ని, వ్యక్తులను, అనుసరించి రూపొందేవి. యథార్థవ్యక్తుల గళాలు, సంఘటనా స్థలంలోని ధ్వనులూ 'రేడియో డాక్యుమెంటరీ రూపకానికి' సహజతను సంతరించి పెడతాయి. రచయిత తన వ్యాఖ్యానంతో, కథనంతో రేడియోరూపకాన్ని శ్రోతలకు ఆసక్తి దాయకంగా అందించ గలుగుతాడు. రూపకాలకు నిర్వహణలో సొగసులు సంతరించబడతాయి. ఆకాశవాణి వార్షికపోటీలలో 'సృజనాత్మక రూపక ప్రక్రియ' ప్రధానమైనది. ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుండి జాతీయ స్థాయిలో రూపకాలకు బహుమతులు అందుకున్న వారిలో– ఎస్.బి.శ్రీరామమూర్తి, కలగా కృష్ణమోహన్, పన్నాల సుబ్రహ్మణ్య భట్టు వంటి వారున్నారు.

లలిత సంగీతం:

'లలిత సంగీతం' పుట్టుక, వికాసం, ప్రాచుర్యం అంతా 'ఆకాశవాణి' కే చెందుతుందని అనాలి. 'లలితసంగీతం' అనే పేరు ప్రాచుర్యంలోకి రాకమునుపే– 'గీతావళి' పేరుతో భావగీతాలు మద్రాసు కేంద్రం నుండి తొలుత ప్రసారమయ్యాయి. ఈ కార్యక్రమాల్లో పాడటానికి గాయనీ గాయకులకు కొత్త గీతాలు కావలసి వచ్చాయి. ఎందరో గీతరచయితలకు అట్లా ఆకాశవాణి అవకాశం కల్పించింది. గేయ రచయితలుగా ఆకాశవాణి ద్వారా వెలుగులోకి వచ్చిన వారెందరో, అనంతరకాలంలో సుప్రసిద్ధులయ్యారు. 1975 లోనే ఘంటసాల పాడిన రజనిగేయం 'ఘనాఘనా గర్జింపదో' ఢిల్లీ నుండి జాతీయకార్యక్రమాలలో ప్రసారమైంది. ఆకాశవాణి విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలు పోటాపోటీగా 'లలితసంగీత' గీతాలను రూపొందించి, ప్రసారం చేసేవి. సంగీత నాటకాలు, సంగీత రూపకాలు, యక్షగానాలు గేయకవులకు మంచి ఊపు నిచ్చాయి. 1955 నుంచే హైదరాబాద్ కేంద్రం ప్రతిరోజూ 'గీతావళి' పేరిట 'లలితగేయాలను' ప్రసారం చేయసాగింది. 1957 లో కృష్ణశాస్త్రి హైదరాబాద్‌లో ప్రయోక్తగా చేరి, ఎనిమిదేండ్లు ఆకాశవాణిలో ఉద్యోగం చేశారు.

'రేడియోవాళ్లు నా చేత రాయించకపోతే, నేను రాసిందాంట్లో చాలా భాగం రాసివుండేవాణ్ణి కాను' అనే వారాయన. పాలగుమ్మి విశ్వనాథం, చిత్తరంజన్‌లు ఎన్నో

లలితగీతాలకూ, సంగీతనాటకాలు, రూపకాలకూ అద్భుతమైన 'సంగీతం' అందించారు. వారు స్వరపరచిన లలితగీతాలెన్నో సుప్రసిద్ధాలై ఇంటింటా వినిపించాయి. చలనచిత్రాలలో చేరిన సి.నారాయణరెడ్డి– 'ఈనల్లని రాలలో', కృష్ణశాస్త్రి– 'పదములె చాలును రామా' వంటి పాటలు, ఆకాశవాణిలో తొలుత 'లలిత గీతాలుగా' ప్రసారమైనవే! అరిపిరాల విశ్వం రాసిన 'శివపాదమునుంచ నేను శిలనైనను కారాదా', దాశరథి– 'భూధరమోసాగరమో', కృష్ణశాస్త్రి– 'నారాయణ నారాయణ అల్లా అల్లా' వంటి పాటలు– 'పట్టిక' ఇవ్వడం మొదలు పెడితే సుప్రసిద్ధ లలితగీతాల ఉటంకింపులకు ఎన్ని పుటలైనా చాలవు. 'లలితగీతాలు' అనే రేడియో కార్యక్రమం వల్ల– ఎందరెందరో కవులు తెలుగునాట సుప్రసిద్ధులయ్యారు. ఆ విధంగా గేయరచనా ప్రక్రియకు రేడియో చేసినసేవ ఇంతింత అనరానిది. వింజమూరి శివరామారావు, కందుకూరి రామభద్రరావు, అబ్బూరి రామకృష్ణారావు, వేటూరి ఆనందమూర్తి, నార్ల చిరంజీవి, నారాయణరెడ్డి, దాశరథి, శశాంక, జె.బాపురెడ్డి, నిమ్మల అర్జునగౌడ్, వడ్డేపల్లి కృష్ణ ఇట్లా ఎందరెందరో లలితగీతాలను సుసంపన్నం చేశారు.

1950 ప్రాంతాల్లో నాటి ప్రసారమంత్రి 'కేస్కర్' ఆకాశవాణిలో సినిమా పాటలను నిషేధించి, ఒక విధంగా సాహిత్య విలువలుగల 'లలితగీతాల' ప్రసార ఆవిర్భావానికి మూలకారణమయ్యారనవచ్చు. ఆ తరువాత సినిమాపాటల కోసం శ్రీలంక ప్రసారాలవైపు ప్రజలు మొగ్గు చూపడంతో, ఆ నిషేధాన్ని సడలించడం మాత్రమే కాక, 1957 అక్టోబర్ 3 న ప్రత్యేకంగా 'వివిధ భారతి' మొదలయింది. అంతేకాక 1967 నవంబర్ 1 నుండి వాణిజ్య ప్రసారాలు మొదలైనాయి. వివిధభారతి హైదరాబాద్, విజయవాడల్లో ప్రసారమయ్యే వాణిజ్య ప్రకటనల్లో పాటలు, నాటికలు ఉపయుక్తం కావడం విశేషం! వాణిజ్య ప్రకటనల్లో 'జింగిల్స్'గా గేయపంక్తులు రూపొందించి, ప్రచారం చేసుకోవడం జరుగుతోంది. 'క్రేన్ వక్కపొడి' వంటి ప్రకటనలు అందుకు నిదర్శనం! అట్లాగే ఆకాశవాణిలో దేశభక్తి గీతాలు, ఈ మాసపు పాట, బృందగానాలు వంటి కార్యక్రమాల ద్వారా 'లలితగీతాలు' ఎందరెందరో కొత్త కొత్త కవులకు కూడా ఆస్కారాన్ని కల్పిస్తూ ప్రసారమయ్యాయి. గాయనీగాయకులు, సంగీత దర్శకులు ఎందరో 'లలితసంగీతం' ద్వారా వెలుగులోకి వచ్చి లబ్ధప్రతిష్ఠులయ్యారు.

ప్రత్యక్ష వ్యాఖ్యానాలు:

భద్రాచలంలో జరిగే సీతారామ కల్యాణం, శ్రీశైలంలో జరిగే శివరాత్రి మహోత్సవాలు, తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలు మొదలైన సందర్భాలలో ఆకాశవాణి

'ప్రత్యక్ష వ్యాఖ్యానాలు' వినిపించి, రేడియో ప్రసారాలను కొత్తమార్గం పట్టించింది. క్షేత్రాలలో జరిగే ఉత్సవాలకు సంబంధించిన ఈ ప్రత్యక్ష వ్యాఖ్యానాలలో వ్యాఖ్యాతలుగా రాణించిన పండితులు ఎందరో వున్నారు. మల్లాది చంద్రశేఖరశాస్త్రి, మైలవరపు శ్రీనివాసరావు, బేతవోలు రామబ్రహ్మం, శ్రీరంగాచార్య, రేవూరు అనంతపద్మనాభరావు వంటి వారెందరో ప్రత్యక్ష వ్యాఖ్యానాల వ్యాఖ్యాతలుగా రాణించిన వారిలో వున్నారు. అట్లాగే క్రీడలకు సంబంధించి ప్రత్యక్ష వ్యాఖ్యానాల ప్రసారాలలో ఆకాశవాణిది ప్రధాన పాత్ర. 'క్రికెట్'పై మోజును రేడియో 'కామెంటరీ'లు పెంచి పోషించాయి. క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డి వంటి క్రీడల వ్యాఖ్యానాలను తెలుగులోనూ ప్రసారం చేసిన సందర్భాలు అనేకం. అట్లాగే ప్రసిద్ధ నాయకుల అంతిమయాత్రలకు సంబంధించిన ప్రత్యక్ష వ్యాఖ్యానాల ప్రసారాలకూ ఆకాశవాణి సమకట్టిన సందర్భాలున్నాయి. పి.వి.నరసింహారావు, ఎన్.టి.రామారావు దివంగతులైనప్పుడు అంతిమయాత్రలపై ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రత్యక్ష వ్యాఖ్యానాలు అందించింది. ఈ వ్యాసంలో భాషా, సాహిత్యాల సేవలకే నియంత్రించుకోవడం వల్ల వివరించడంలేదు కానీ, వ్యవసాయాభివృద్ధికీ, రైతులకూ రేడియోచేసిన సేవ సామాన్యమైనదేమీ కాదు.

జానపదం:

జానపద సాహిత్యానికీ, జానపద కళాప్రక్రియలకూ 'ఆకాశవాణి' పెద్దపీటే వేసింది. జానపద, గిరిజన సంగీతాల్ని ప్రసారం చేయడమే కాక, అపురూపమైన జానపదగేయ సాహిత్య సంపదను సేకరించి, పదిలపరచిన ఘనత 'ఆకాశవాణి'దే. వింజమూరి సీత, అనసూయ, జానపదుల గీతాలను సేకరించి, తాము రేడియోకి వాటిని మలచి, పాడి ప్రాచుర్యం తెచ్చారు. బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణకుమారి, ఆచార్య ఎన్.గంగప్ప, చిగిచెర్ల కృష్ణారెడ్డి వంటివారు జానపద సాహిత్య ప్రసంగాలెన్నింటినో అందించారు. పల్లెపల్లెలో జానపదులను రికార్డు చేసి, వారి గీతాలను ఆకాశవాణి ప్రసారం చేయడంలో, అట్లాగే జానపద కళారూపాలను ప్రదర్శింప చేయడంలో ఎన్.వి.హనుమంతరావు, ఆరవేటి శ్రీనివాసులు, సుమనస్పతిరెడ్డి వంటివారు చేసిన కృషి ఎన్నదగినదిగా వుంది.

బాలసాహిత్యం:

బాలానందం, బాలవినోదం, ఆటవిడుపు, పాలవెల్లి, హరివిల్లు వంటి పేర్లతో పిల్లల కార్యక్రమాలను 'ఆకాశవాణి' ప్రత్యేకించి ప్రసారం చేస్తూ, బాలల్లో సాహిత్య,

సాంస్కృతిక వికాసానికి ఎంతగానో దోహదపడింది. న్యాయపతి రాఘవరావు, న్యాయపతి కామేశ్వరి మద్రాసులోనూ, అనంతరం హైదరాబాద్‌లోనూ, 'రేడియో అన్నయ్య', 'అక్కయ్య'గా సుప్రసిద్ధులయ్యారు. 'ఆంధ్రబాలానంద సంఘం' స్థాపించి వారు రేడియో ద్వారా, సంఘపరంగానూ కూడా బాలలకు అందించిన సాహిత్యం, వారికై చేసిన సేవ, అవిస్మరణీయాలు. ఏడిద కామేశ్వరరావు, రావూరి భరద్వాజ, తురగా జానకీరాణి బాలల కార్యక్రమాలకు నిండుదనాన్ని అనంతర కాలంలో సమకూర్చారు. ప్రయాగ వేదవతి, ముంజులూరి కృష్ణకుమారి, అల్లంరాజు ఉషారాణి వంటివారు రేడియోలో పిల్లల కార్యక్రమాలు నిర్వహించి, బాలకళాకారులనూ, బాలసాహితీవేత్తలనూ ప్రోత్సహించిన వారే! రేడియో అన్నయ్య, అక్కయ్యల 'బాలానందం' ద్వారా వ్యక్తిత్వ వికాసాలతో ఎదిగి రాణించిన ప్రముఖులెందరో. 'బాపురమణలు' కూడా ఆ కోవలోని వారే. వెలగా వెంకటప్పయ్య, రెడ్డి రాఘవయ్య, చొక్కాపు వెంకటరమణ వంటి బాలసాహిత్యవేత్తలు రేడియో కార్యక్రమాల్లో పాలుపంచుకున్నవారే!

స్త్రీల కార్యక్రమాలు, పిల్లలు కార్యక్రమాలు ఒక్కరే నిర్వహించే వైఖరి ఆకాశవాణిలో చాలాకాలం వుండిన సందర్భాలూ కనిపిస్తాయి. మహిళాసమాజం, రంగవల్లి, తరుణీమండలి, ప్రమదావనం వంటి పేర్లతో స్త్రీల కార్యక్రమాలు ఎందరో రచయిత్రులకూ, కవయిత్రులకూ వేదికగా నిలిచాయి. స్త్రీల కార్యక్రమాలు అంటే– కేవలం సంప్రదాయబద్ధంగా పూజలు, వ్రతాలు, వంటలు, చీరలు, నగలు అన్న మూస వైఖరుల నుండి– అభ్యుదయంవైపూ, మహిళాసాధికారతవైపు ఆ కార్యక్రమాలను రూపొందింపచేసిన మహిళా కార్యక్రమనిర్వాహకులున్నారు. స్త్రీల సమస్యలపై సంభాషణలు, చర్చలు, నాటికలు, పాటలు ఆయా కార్యక్రమాలలో మహిళాభ్యుదయానికీ, స్త్రీల జాగృతికీ, వికాసానికి దోహదం కలిగించేవయ్యాయి. స్త్రీవాద సాహిత్యమూ ఈ కార్యక్రమాల్లో వినిపించింది.

భాషాబోధన:

ప్రాథమికపాఠశాల, ఉన్నతపాఠశాల విద్యా కార్యక్రమాలతో బాటు 'భాషాబోధన' కోసం ఆకాశవాణి ప్రసారంచేసిన పాఠాలు అవిస్మరణీయాలు. కేశవపంతుల నరసింహశాస్త్రి వంటివారు చెప్పిన 'సంస్కృతపాఠాలు', 'దండమూడి మహీధర్, దయావంతి వంటివారి 'హిందీ పాఠాలు' శ్రోతలకు ఇంకా గుర్తే! అట్లాగే

1969 సెప్టెంబర్‌లో ఢిల్లీ, పాట్నా, రాంచీ, సిమ్లా కేంద్రాల నుంచి తెలుగు నేర్పే పాఠాలను ఆకాశవాణి ప్రారంభించిన సంగతి చాలా మందికి తెలియకపోవచ్చు.

తెలుగు ప్రసారాలకు సంబంధించి హైదరాబాద్, విజయవాడ కేంద్రాలు చేసిన కృషి, భాషా సాహిత్యాలకు చేసిన సేవ తక్కిన కేంద్రాలతో పోలిస్తే రాశిలో వాసిలో ఎంతో ఎక్కువ కనుకా, అన్ని తరగతుల శ్రోతలనూ అలరింపచేయడానికి అవి రూపొందించిన ఎన్నో కార్యక్రమాలు విశిష్టమైనవి గనుకా, అందునా ఆ వివరాలే చాలామటుకు లభ్యం కనుకా, ఉదాహృతులుగా వాటిల్లోని కొన్నింటిని గురించి పేర్కొనడం జరుగుతోంది కానీ, కడప, విశాఖపట్టణ కేంద్రాలు మొదలయ్యాక అవి కూడా అనేక ప్రక్రియల్లో మంచి కార్యక్రమాల్ని ప్రసారం చేస్తూ వచ్చాయి. స్థానికంగా సేవలు అందించేందుకు మొదలుపెట్టిన ఆకాశవాణి స్థానికకేంద్రాలలో జరిగిన, జరుగుతున్న కృషీ గుర్తించదగినదే! వరంగల్లులో 1990 ఫిబ్రవరి 17 నాడు ప్రారంభమైన 'ఆకాశవాణి' కేంద్రం ఆకాశవాణి వ్యవస్థలో ఏర్పడిన 'నూరవకేంద్రంగా' చరిత్రలో నిలిచిపోతుంది! వరంగల్ కేంద్రం నుండి కాళోజి, అంపశయ్య నవీన్, అనుమాండ్ల భూమయ్య, కోవెల సుప్రసన్నాచార్యులు, సంపత్కుమారాచార్యులు, గిరిజా మనోహర బాబు, జి.బాలశ్రీనివాసమూర్తి వంటి సాహితీవేత్తలు శ్రోతలకు అందించిన కార్యక్రమాలు విశిష్టమైనవి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో– హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, కడప, కొత్తగూడెం, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, తిరుపతి, అనంతపురం, కర్నూలు, మార్కాపురం కేంద్రాలు తెలుగు కార్యక్రమాల్ని రూపొందించి ప్రసారం చేస్తున్నాయి. ఆయా స్థానిక కేంద్రాలలో జరుగుతున్న కృషి కూడా గుర్తించదగిన స్థాయిలోనే వుంది.

వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల గళాలను శాశ్వతంగా భద్రపరిచే పనిని 'ఆకాశవాణి' నిర్వర్తిస్తూనే వుంది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఎందరో మహనీయుల కంఠాలు 'జాతీయజ్యోతి' పేర ప్రసారమై, భద్రపరచబడ్డాయి. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా రేడియో కోసం వివిధరంగాల ప్రముఖుల జీవిత చరిత్రలను వాళ్లతో సుదీర్ఘ సంభాషణల రూపంలో రికార్డు చేసి, నిక్షిప్తం చేయడం జరుగుతోంది. 'సాఫ్ట్‌వేర్ స్కీమ్' క్రింద అందుకోసం ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ అట్లాంటి ప్రముఖుల స్వీయజీవిత అనుభవాలు, జ్ఞాపకాలను ప్రసారం చేస్తూ, భద్రపరచడం జరుగుతోంది. సాహిత్య సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులెందరినో, అట్లాగే పద్మభూషణ్, పద్మశ్రీ

అవార్డు గ్రహీతలైన 'తెలుగు ప్రముఖులను' ఇందునిమిత్తం రికార్డు చేసే కృషి జరుగుతూనే వుంది. ఆకాశవాణి సంగీతసేవల గురించి వేరుగా ఒక ఉద్గ్రంథమే రాయవచ్చు.

ఆకాశవాణిలో కార్యక్రమాల రూపకల్పనను కేవలం ఉద్యోగధర్మంగా కాక, పవిత్రమైన కర్తవ్యంగా భావించి, నిజాయితీతో, చిత్తశుద్ధితో, నిష్ఠతో ఆకాశవాణిలో పనిచేసిన, చేస్తున్న తెలుగు ప్రముఖులు వుండడం 'సంస్థ' అదృష్టం! అంతేకాదు– వ్యక్తులవల్ల ఆకాశవాణి సంస్థా, ఆకాశవాణివల్ల వ్యక్తులూ పరస్పరం ప్రఖ్యాతులైన సందర్భం ఈ వ్యవస్థలోని వృత్తి ఉద్యోగాలకే నప్పుతుంది అనవచ్చునేమో! అట్లాగే రేడియో వార్తాపఠనంతో– జగ్గయ్య, పన్యాల రంగనాథరావు, తిరుమలశెట్టి శ్రీరాములు, ఏడిద గోపాలరావు, మాడపాటి సత్యవతి, డి.వెంకట్రామయ్య, కందుకూరి సూర్యనారాయణ, జోళిపాళెం మంగమ్మ, పి.ఎస్.ఆర్.ఆంజనేయశాస్త్రి, సురమౌళి, అద్దంకి మన్నార్, నాగమల్లేశ్వర రావు, తురగా ఉషారమణి, రెంటాల కల్పన లాంటి వారంతా తెలుగు భాష సౌందర్యాన్ని, ఉచ్చారణా దక్షతనూ శ్రోతలకు తెలియజెబుతూనే వచ్చారు. బందా కనకలింగేశ్వరరావు, స్థానం నరసింహా రావు వంటివారలు రేడియోనాటక శాఖకు కీర్తిప్రతిష్ఠలు సంతరించిపెట్టారు. అట్లాగే 1970 డిసెంబర్ 20 నుంచి హైదరాబాద్ కేంద్రంలో ప్రారంభమైన 'యువవాణి' కార్యక్రమాల ద్వారా– ఎందరో యువకులు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తూ వ్యక్తిత్వాన్ని మెరుగుపెట్టుకుని, ప్రస్తుతం ఉన్నత పదవులలో రాణిస్తున్న వారున్నారు. ఎందరో పండితులు, రచయితలు, మేధావులు, సంగీత కళాకారులు, గాత్ర సంపన్నులైన 'స్వరవాచస్పతులూ' ఆకాశవాణిలో ఉద్యోగాలు చేసి, రేడియో భాషా సాహిత్య సేవలకు దోహదం చేశారు.

బాలాంద్రపు రజనీకాంతరావు, పుల్లెల వెంకటేశ్వర్లు, అయ్యగారి వీరభద్రరావు, ఎం.ఎం.జి. శంకరనారాయణ, శంకరమంచి సత్యం, పి.శ్రీనివాసన్, పి.ఆర్.రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్.ఎ.పద్మనాభరావు, గుంటూరు రఘురాం, వై.వి.శాస్త్రి, పి.ఎస్. గోపాలకృష్ణ, ప్రయాగ వేదవతి, పి.పాండురంగ, పాలకుర్తి మధుసూదనరావు, దుర్గాభాస్కర్, మంగళగిరి ఆదిత్యప్రసాద్ వంటి తెలుగువారు ఆకాశవాణికి డైరెక్టర్లుగా– రేడియో తెలుగు భాషా, సాహిత్య వికాసకృషిలో భాగస్వామ్యం కలిగినవారే! ఎందరెందరో కవులు, రచయితలు, పాత్రికేయులు, నటీనటులు, సంగీత కళాకారులు, సాంకేతిక నిపుణులు, పాలనాధికారులు రేడియో ప్రసారాల వైభవ ప్రాభవాలకు దోహదకారు లయ్యారు.

తెలుగు భాషా సాహిత్యాలకు రేడియో చేసిన సేవ గురించి నిజంగా ఎంతో పరిశోధన చేసి, వివరాలన్నింటినీ సేకరించి, రేడియోలోని ఒక్కొక్క విభాగంపై లఘుసిద్ధాంత గ్రంథాలయినా రచించటానికి వీలుంది. రేడియో సేవలను భద్రపరచి, నిక్షిప్తంచేసే ఆ కృషి 'రేడియో అర్కైవ్స్ విభాగం' ద్వారా ప్రస్తుతం సాగుతోంది కూడాను. 'బహుజనహితాయ-బహుజనసుఖాయ' అన్న ఆకాశవాణి సందేశం ముమ్ముందు మరింత సాకారం కావాలనీ, తెలుగు వెలుగు దీధితులకు ఆకాశవాణి 'ద్యుతులు' తోడు కావాలనీ ఆకాంక్షిద్దాం.

(విజేత కాంపిటీషన్స్- 'సాహితీ సుధ' గ్రంథం- 2018)

❖

(64) కుసుమించిన సంక్రాంతి కవితాలత !

మన కవుల కావ్యాలలో, కవిత్వ రచనలో సంక్రాంతి ఒక ప్రధానేతివృత్తం. ప్రబంధాలలో ఋతువర్ణనలు అష్టాదశవర్ణనల్లో ఎలా ప్రధానంగా కానవస్తాయో అలాగే ఆధునిక పద్య, గేయ, వచన కవితాప్రక్రియల్లో సంక్రాంతిని స్పృశించని కవి లేడంటే అతిశయోక్తి కాదు.

సంక్రాంతి కాలాన్నీ, సంక్రాంతి వేడుకలనూ తమ కవిత్వ భావనల్లో కవులు ఎంతో వైవిధ్య భరితంగా వెలార్చారు. తెనుగు లెంకగా సుప్రసిద్ధులైన తుమ్మల సీతారామ మూర్తిగారు సంక్రాంతిపై ఆరు ఖండకావ్య సంపుటాలను వెలువరించారు అంటే కవి ఎంతగా ఈ పర్వంతో మమేకమయ్యారో గ్రహించగలం.

1923 లోనే జంటకవులుగా ప్రసిద్ధులైన పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగారలు 'తొలకరి' కావ్యం వెలయించారు. సంక్రాంతిని ఆమూలాగ్రం తమ కవిత్వ భావ శబలతతో దృశ్యీకరించి సాక్షాత్కరింప చేశారు. పుష్యమాస వైభవం గురించీ, హరిదాసుల గురించీ, ముంగిళ్ల ముగ్గులు, గొబ్బిళ్ల గురించీ, గంగిరెద్దుల వాని గురించీ, అత్తవారింట కొత్త అల్లుడి గురించీ, గొర్రెపొట్టేళ్లు, కోడిపందాల గురించీ, పట్నంలో చదువుకునే కుర్రాడు బొమ్మల కొలువుకై ఊరిలోని చెల్లెలకు బొమ్మలు కొనుక్కుని వెళ్లడం గురించీ, పెద్దలకు పిండప్రదానాల గురించీ అలా పౌష్యలక్ష్మిపై వారు వెలయించిన కావ్యం– సంక్రాంతి పండుగకు గొప్ప కావ్యగౌరవం సంతరించి పెట్టింది.

దినకరుడు శాంతుడై తోచె దినములింత
కుఱచలయ్యెను జలిగాలి చుఱుకు హెచ్చె
జాలములనే రేల గ్రుడ్డి వెన్నెలలోన
గుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి

పదములన్ బాడదొడగిరి పచ్చపూల
జనపచేలకు ముత్యాల సరులు గూర్చి
మిరపపండ్లకు గుంకుమ మెరుపుదార్చి
బంతిపూవుల మొగములల్లంత విచ్చి
మన గృహమ్ముల ధాన్యసంపదల నిల్పి
సరసురాలైన పుష్యమాసమ్ము వచ్చె

అంటారు పింగళి కాటూరి కవులు కాలగమనాన్ని గురించి.

సంక్రాంతి సుందరి ఎలా వచ్చిందో తుమ్మలవారు పేర్కొంటూ–

కొసరి నూరిన పచ్చి పూచైత మొగాన
గుమ్మడి పూవు మారమ్మునద్ది కండ
రేగడ నారబండి కన్పండు వై పొలుచు
మిర్యంపు బండు బొట్టువెట్టి విపమ్ము
నకు నొక్కవాసి హెచ్చైనట్టి నునుమంచు
దెరచీర నూలుకొల్పి బంతిపూవులకు
జేమంతి నెయ్యము గూర్చి కబరీభరమ్ముచక్కన కుదిర్చి...

అంటూ ఆ సొగసును ఆవిష్కరించారు.

నవ్యజీవన రాగమధువును
దివ్యచషకమునందు నిడుకొని
సంతసము కలిగింప వచ్చితివొ
సకలధాత్రికి, సంకురాత్రీ!
ముచ్చటగు ముత్యాల ముగ్గుల
ముద్దుగొలిపెడు గొబ్బి చలువల
ముంగిళుల నవకాంతులీనుచు
మంగళాహ్వానములు పలికిరి
త్వదీయాగతి నిఖిల జగతియు
వన్నెలను చెలువొందు నిత్యము
శుభము, సౌభాగ్యమ్ము, శాంతియు
సుఖములే మా కగును నిత్యము

అంటారు 'ఘట్టమరాజు' అనే కవి. 'సంక్రాంతి కాంత'ను ఉద్దేశించి పరిగి రాధాకృష్ణ అనే కవి–

'హిమకణాల హారం మెడలో ధరించి వచ్చావా!
ప్రమదలనే ధిక్కరింప పయనమ్మయి వచ్చావా!
నాలో నైరాశ్యమ్మును కరిగింపగ వచ్చావా!
ఆశల ఇంద్రధనుస్సులు వెలిగింప వచ్చావా!'

అని సంభావించగా, డా॥ సి.నారాయణరెడ్డిగారు సంక్రాంతి రోజుల 'లేత వెలుగు' గూర్చి–

కొడిగట్టిన నక్షత్రాల నీడల్లో
జడుస్తూ నడిచిన లోకానికి
శాద్వలంలా పరుచుకున్న కాంతి
స్వాగత పతాకలెత్తింది
వర్షంలా కురిసిన హిమ తమస్సులో
వణుకు పుట్టిన కాల విహంగానికి
చైతన్యంలా ఉబికి వచ్చిన సంక్రాంతి
సరికొత్త రెక్కలందించింది– అంటారు.

సంక్రాంతి వేళ గతం స్వగతంలా సుళ్లు తిరిగింది–

వర్తమానం ప్రశాంతంగా వెల్లివిరిసింది–

కనుచూపుమేర నిల్చిన భవితవ్యం...
గర్భగుడిలో జేగంటలా మోగింది.

అని త్రికాల భావకాంతిని ప్రసరిస్తారు.

మిరియాల రామకృష్ణ 'సంక్రాంతి రేఖలు'లో–

'కుప్ప నూర్చే కూలికన్నుల
ధాన్యరాశులు పలుకరించాయి!
భావి కాలపు వన్నె చిన్నెలు– పలుకరించాయి!'– అనీ

వెలుగు తెస్తూ సూర్యకాంతులు
మకరరాశిని వశం చేసుకు శాంతినిచ్చాయి!

అనీ– అభ్యుదయ భావనను ఆవిష్కరించారు.

'కోల్పోయిన ముఖం' అనే ప్రతీకాత్మక కవితలో గుంటూరు శేషేంద్ర శర్మ ఇలా అన్నారు–

హేమంత చంద్రుడు ఏడ్చి ఏడ్చి కృశించాడు
ఇటుకలు గోడల్లో నిద్రిస్తున్నాయి
వీధిలాంతర్లు కూడా ఆవులిస్తున్నాయి
చిన్న నక్షత్రం చేత్తో పట్టుకుని
అంతరాత్మ సందుల్లో ఒక రహస్యం తవ్వుతున్నాను
ఎన్నో కోట్ల రాత్రుల పొరలకింద బయటపడింది
మనిషి కోల్పోయిన ముఖం
వెయ్యి కిరణాలతో
నేనన్నాను
మా నరనరాల్లో రక్తమై ప్రవహిస్తున్న
నీ కాంతి మండలం
నిద్రిస్తున్నా ఆగదు– పద
మా ఉదయరేఖా శిఖరాల్ని అధిరోహించు
ఈ లోకం మనదే
మనిద్దరం ఒకే
ఎర్రతామర పువ్వు పంచుకుందాం
చేతిలో నక్షత్రం చెట్లకొమ్మల్లోకి ఎగిరిపోయింది
వీధిలాంతర్లో జ్వాలలు వీధుల్లోకి భోగిమంటలై దూకాయి
ఇటుకలు నిద్రలేచి పాత ఇళ్లు కూలదోశాయి
చంద్రుడు ఆకాశం నించి కిందికి దూకి
అందరికీ క్రాంతి వెన్నెల పంచిపెట్టాడు.

'ఆనంద సంక్రాంతి' అనే కవితలో కె.వి.అప్పలాచార్యులు–

పసిడి నవ్వుల బకాసురులతో నింటింట
తొంగిచూచెను పచ్చతోరణమ్ము
సింగారముల పొంగి సిరుల చిందెను రంగ
వల్లీ సముల్లసత్ ప్రాంగణమ్ము

చలిరేయి జవరాలి సరసాల గమకించి
పొగిపూచెను బంతిపూల వనము
తలిరాకుపై నిల్చి తెలి ముత్యముల గెల్చి
మహి తాండవించెను తుహినకణము
వీకమై హెచ్చు హర్షాతిరేకమునను
కొక్కొరోకో యని కాల్దువ్వె కుక్కుటమ్ము!
విశ్వకల్యాణ దిగ్వీధి విడిది సేయ
కదలిరావమ్మ మకర సంక్రాంతి లక్ష్మి!...

అని అభివ్యక్తీకరించారు.

సంక్రాంతి వేళ కోడిపందాలు ఆచారంలో భాగంగా ఈనాటికీ పల్లెల్లో సాగుతూనే వున్నాయి. ఎంత నిషేధాజ్ఞలు విధిస్తున్నా అవి అంతరించడం లేదు. గెలిచిన కోడికి సంబరాలు సాగితే ఓడిన కోడి వంటకంగా మారిపోవచ్చు.

పింగళి కాటూరి కవులు పందెపు కోడి గురించి ప్రస్తావిస్తూ–

'కుక్కుటమ! నీవు సుకృతిని, కోరి యురిని
బెట్టుకున్నను జావు లభింప దుత్త
రాయణమ్మున, నీవు సంక్రాంతి వేళ
గుత్తి దెబ్బకు శిరమొగ్గి, కదన నిహతు
లైన వీరులకే భోగ్యమై, తదన్య
దుర్లభంబగు దివిజేరుదువు గదన్న!'

అని స్తుతిస్తారు.

'ఆమనికి గోకిలాంగన యలరు భాతి,
మైమరచిపోదు శిశిరాగమమున నీవు'

అని కోడిని కొనియాడినారు వారు.

తమ్ముడా! రమ్ము గంగెద్దు దాసుడడుగొ
వెండిబిళ్లల మొలత్రాడు దండకడెము
ముక్కునన్ బైడికాడయు మోమునందు
బంగనామమ్ములను, వెంట గంగిరెద్దు

చేత మునికోల తన పేరు చెప్పుచుండ
నూరి నడువీధి నాడుచు నుండె రమ్ము
డోళ్ల చప్పుళ్లు, మంగిలి కోళ్లపాత
లదర శ్రీరామునకును సీతమ్మ నిచ్చి
పెండ్లిగావింపుచుండె నా వేడ్క చూచి
కానుకల నిచ్చి వత్తము కదలిరమ్ము

అని సంచార గంగిరెద్దుల వారి గురించి కనులకు కట్టించిన ఆ జంటకవులే–

కోడితో మేలుకొని తానమాడి నుదుటి
దిరుమణియు దిరుచూర్ణము దీర్చిదిద్ది
యొక్కకేలను దంబుఱ నొక్కకేల
జిఱుతలం బూని నున్నని శిరముపైని
తొలగకుండ నక్షయపాత్ర నిలిపి మేలు
కొలుపులంబాడి వీధి వీధులను దిరిగి
యనుపదమ్మును 'రంగరంగా' యటంచు
గడపగడపకు నేగి భిక్షమ్ము గొనుచు
జేరవచ్చెను సాతాని జియ్యరడుగొ...

అని హరిదాసును అక్షరీకరించారు.

'ఋతుచక్రం' అనే గేయకావ్యంలో డా॥ సి.నారాయణరెడ్డిగారు తన జీవితంలోని ఘటనలతో అనుసంధానం చేసి అన్ని కాలాలనూ అనుభూతి రమ్యంగా కవితామయం చేశారు.

నేడే సంక్రాంతి, ఊరి
వాడలన్ని గంగెద్దుల
కొమరాడెడు చిందులతో
'కూచిపూడు' లైపోయెను– అంటారు.

శ్రీ పిలకా గణపతి శాస్త్రిగారు...

రంగుల రంగవల్లిక హారంగుల గుమ్మడి పూల నవ్వరే
కం గిలిగింత వెట్టె జిరుకన్నెల వోలిక గొబ్బిళుల్! మనో

రంగములో మెరుంగు లెగురన్ వరికుచ్చుల బిచ్చుకల్ చెలం
గం గనుదోయి దోచెను! జగమ్మొక మోహన వర్ణ చిత్రమై

అంటూ–

విచిత్ర సంక్రాంతి నిశ్చలాంగనలపరంజి
బొమ్మల నిగారములొల్కుచు
నిల్చు మా గృహాంగణముల దీయతీయని
సన్నాయి మనమ్ముల హాయినించె

అని ఉప్పొంగుతారు.

బాలలారా! బాలలారా
కొలువు తీర్చెను బొమ్మలిట– సం
క్రాంతి పండుగ దినములందున
క్రాంతి జనులకు నిచ్చుచున్

అంటూ పాతూరి ప్రసన్నాంజనేయులుగారు 'బొమ్మల కొలువు' అనే కవితలో–

'అమ్మ అల్లిన వూలుసంచీ, అక్కకుట్టిన
డోరు కర్టెను, నాన్న తెచ్చిన రైలు బండి
అన్న చేసిన పూలచెట్టదిగో'– అంటూ

జగతిలోపల జీవితమ్మున
జరుగు వింతలు విశేషాలూ
బొమ్మలా కొలువులను చూడగ
ప్రొద్దుపోవక ముందె రండీ!

అంటూ పండగ ప్రత్యేకత అయిన బొమ్మల కొలువుకు స్వాగతిస్తారు.

ఆనంద దాయిని వీవు హేమంతమా!
అందాల ఋతురాజ్ఞి వీవు హేమంతమా!
ఏడాదికోసారి నీ రీతి నరుదెంచి
ఏలుకో మమ్మెల్ల హేమంత మిత్రమా!

అని మధురాంతకం రాజారాంగారు హేమంత సంక్రాంతిని కోరుకుంటారు.

నిజానికి పెళ్లిళ్ల సీజన్ అవగానే కొత్త దంపతులకు వచ్చే తొలి పెద్ద పండుగ సంక్రాంతియే! ధనధాన్యాలకు కొదవలేని కాలం కాబట్టి కొత్తఅల్లుళ్లను ఇంటికి పిలిచి అత్తమామలు ఘనమర్యాదలు చేసి మురిసే కాలం ఇదియే! పల్లె శోభలకు తోడు ఇంటింటా ఈ నవాగమన బంధుత్వ కళలు ఆనందాలను రాశులు పోస్తాయి.

బావను ఆటపట్టించడం మరదళ్ల హక్కు. 'బావా బావా పన్నీరు! బావను పట్టుకు తన్నేరు!' అని ఆమె పరిహాస హాస్యాలాడితే, మరదలి జడలు లాగి బావ సరసాలాడతాడు. వదినగారలు మరిదిని ఆటపట్టిస్తారు. నవవధువు భర్త ఎదుట సిగ్గుల మొగ్గవుతుంది. అల్లుడి మర్యాదలు, నవకాయ పిండివంటలతో సాగుతాయి. భోగిమంటల్లో పాత సామగ్రి వేయడం, గాలి పటాలు ఎగురవేయడం, బొంగరాలాటలు ఇవన్నీ పిల్లలకు ఉల్లము రంజిల్లజేసే వేడుకలు. 'పొంగలి' పొంగుల హంగులు ఆస్వాద మధురిమలు.

కొత్త పెండ్లికొడుకును సంక్రాంతి పండుగకు అత్తవారింటికి వెళ్లమని– 'తొలకరి' కావ్యంలో పింగళి– కాటూరి కవులు ఈ విధంగా ప్రబోధిస్తూ సమాయత్తం చేశారు–

అన్ని పండువులందు ముఖ్యమిదిగాన
నత్తవారింటి కేగుమో కొత్త పెండ్లి
కొమరుడా! యందు నీకు నెక్కుడు సుఖమ్ము
ముద్దు మరదలు నీతోడ ముచ్చటాడు
వదిన నీతోడ మాటికి వరుసలాడు
గఱువుదీరగ నినుగాంచు తెఱువు లేక
తలుపుచాటున నిలిచి నీ తరుణి నిన్ను
నోరచూపుల జూచి యుఱ్ఱూతలూచు
జిత్తమును నిన్ను జూచి యా చిగురు బోడి
పట్టజాలని సంతోషభరము చేత
నింట మాటికి నటునిటు నేగుచుండి
ముగ్ధమోహన కళ్యాణమూర్తి తోడ
సమయమగు నెడ నీకు సాక్షాత్కరించు,
నత్తవారింటి విందులటన్న, భార్య
వాలు జూపు కోపులెగాని వారు పెట్టు
పంచభక్ష్యములనుకొని భ్రాంతిపడకు

యూరివారలు నిన్నతి గారవమున
మన్ననలు సల్పుదురు, నీదు మామ కూడ
నడుగులకు నీకు భృత్యుడై మడుగులొత్తు
నత్తవారింటికేగి రావయ్య నీవు

ఉత్తరాయణ పుణ్యకాలం సద్గతులకు హేతువని విశ్వాసం. భీష్ముడు తన స్వచ్ఛంద మరణాన్ని ఈ కాలంకోసమే వాయిదా వేసుకున్నాడు. తిలసంక్రాంతి అంటే పెద్దలకు సద్గతులకై తిలోదకాలు సమర్పించే కాలం కూడా ఇదే. సంక్రాంతి పురుషుడు ఏయేటికాయేడు కొత్త వాహనాన్ని ఎక్కి వస్తాడంటారు. బ్రాహ్మణులకు దానాలు పట్టడానికి అనువైన సంపద్వంత కాలం ఇది. ఆ విషయాన్నే పింగళి, కాటూరి మహాకవులిలా వెల్లడించారు. పౌష్యలక్ష్మిని స్వాగతిస్తున్న తమ కావ్యధారలో...

బ్రాహ్మణుడ! రమ్ము! మకర సంక్రమణ పుణ్య
కాల కూష్మాండ దానముల్ గైకొనంగ
సుంత చెప్పు మీ యేడు సంక్రాంతి పురుషు
డెక్కి వచ్చెడి వాహనమేది? పుణ్య గేహిని!
పెద్ద రథమును, వాహనములు
వాకిటను మ్రుగ్గు పెట్టుము; వేకువుననె
కన్నె ముత్తైదువలు మేలుకొనుడు నేడు
తలనంటుకొనుండు, కొత్తలగు వేషములను
గైసేసికొనుడు, బొమ్మల కలంక
రించి పులగమ్ము వే నివేదించి
మీరు కడుపునిండుగ దిని యంత కలకలమని
నిలిచియుండుడు మీదు వాకిళులయందు
వచ్చు నీ దారి బలిచక్రవర్తి నేడు
వరముల నొసంగ మీకు నవ్వారిగాగ
రండు మా యింటి కీరు పేరంటమునకు
బొమ్మలెత్తును మా పిల్ల యమ్మలార!
ముద్దచేమంతి పూవులు ముడిచినట్టి
జడలతో గొత్త వల్లెతో నడుగులబడి
చిందులంద్రొక్కు పరికిణీ చెలువుతోడ

గాళ్ల బారాణి, కాటుక గన్నుగవను
దిద్దికొని మురిపెమ్మును ముద్దులొలుక
నగు మొగమ్ముల తోడు గన్యకలు నీకు
నర్చనలొసగగ నిలచిరీ వరుసనపుడు
వచ్చి పోవమ్మ! మా యింటి పజ్జకీవు
పరమ కళ్యాణి!
మా తల్లి! పౌష్య లక్ష్మి!

'ఇంతి-పూబంతి- సంక్రాంతి' అనే కవితలో దాశరథిగారు అన్నట్లు-

ఎంత హాయి! సంక్రాంతి వేళ!
బంతిపూల బంగారుమాల!
కవి కలానికి కైపెక్కె నేడు
రైతు ముఖము రంగెక్కె నేడు

హలం పట్టే రైతుకూ, కలం పట్టే కవికీ కూడా సంక్రాంతి సంతోషపర్వం. అందుకే సంక్రాంతికి పత్రికలు ప్రత్యేక సంచికలు వెలువరించడం. ఒకప్పుడు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ సంక్రాంతి సంచికలు 'కునేగా మరికొళుందు' సెంట్ వాసనలతో కూడా పాఠకులను ఆనంద పరీమళ పరవశులను చేయడం జరిగేది.

మనిషి మనిషిగా బ్రతికే లోకాన్ని
మనసునిండా మధువులు నింపే కాలాన్ని
మమతానురాగాల సరిగమల
రాగాల విందుల క్షణాన్ని
ఆహ్వానించు, అనుశాసించు
అందరికీ అది నిజం చెయ్యి
ఆ కాలం సంక్రాంతి కాలమని
నీ కవితా మహతిని మీటి నిజం చెయ్యి!

అని 'సంక్రాంతి జ్వాల' కవితలో అంటాడు ఎల్లోరా! బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో వచ్చిన సంక్రాంతిలో దాశరథి, సినారె, ఎన్.గోపీ వంటి కవులు శౌర్య సంక్రాంతిని వీక్షించారు.

'ప్రాంగణమున వెలయించెడు
రంగవల్లికలకు బదులు
గుండియల ముంగిట వెలిగెను
కొత్తగ శౌర్యపు రేఖలు'

అని, 'కొత్త సంక్రాంతి'ని దర్శించాడు ఎన్.గోపి. అలా సంక్రాంతి వేళ కవులు కాలిక పరిస్థితులకు పర్వ ఇతివృత్తాన్ని మలుచుకున్న ఘట్టాలున్నాయి.

'చిరునవ్వులోనె తన
సిరులనంతా నిలిపి
అరుదెంచు సంక్రాంతి!
అందించు నవకాంతి'

అంటాడు అందుకే వడ్డేపల్లి కృష్ణ.

సినీకవిగా పేరొందిన వేటూరి సుందరరామమూర్తిగారు 'పెను పండువు' అనే తమ ఛందోబద్ధ కవితలో వెలార్చిన భావక్రాంతి ఇది–

సంక్రాంతి వచ్చె సంసార కాసార
కల్హార పంక్తికి పూర్ణ శారద వలె
జీవిత మహా కుహా చింతా తమిస్రాన
సకియ హాస వికాస చంద్రికవలె
విధుర విరహ వ్యధా మధుర సంయోగాన
చిందు నానందాశ్రు బిందువువలె
లొచ్చు గుండియలనుల్లోలము గావించు
పుత్ర దీప మయూఖ పుంజమువలె
తరుణ భావుక కవితావతరణము వలె
మంచు కొగింటితో చలిమంటవోలె
ప్రణయ వీణా సుఖదానురాగ మధురస
ధు నది యొచు పండించె జీవితమ్ము
నాదు జీవిత రామాయణమ్ములోన
భూమిజాతకు నీడగా పౌష్యలక్ష్మి
పుడమి పండించి పండి మా ఎడదలో
పండువుల్ నించెనిదె పెనుబండువయ్యె

ఏమయినా పర్వ వాతావరణాన్ని తమ కవిత్వరచనలతో సుసంపన్నం చేసిన కవివరేణ్యులలో ప్రత్యేకంగా పేర్కొనదిన శనగన నరసింహ స్వామిగారు అన్నట్లుగా పౌష్యలక్ష్మి సంక్రాంతిని ఈమారు కవిత్వ భావనల రంగవల్లికలతో ఇలా ఆహ్వానిద్దాం.

సమసమాజ వినిర్మాణ సంవిమగ్న
భారతోర్వర శుభ పరంపర సుమింప
నొడి దుడుకులేని పథమునందుజ్జ్వలల నవ
రథ వరముపైన సర్వ సామ్రాజ్ఞి! రమ్ము

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం, 13 జనవరి 2019)

(65) తెలుగునాటక వైభవ దీప్తి!

తెలుగు నాటక వైభవ ప్రాభవాలకు– తమ ఆంధ్రాంగ్ల భాషా వైదుష్యాలతో, పాశ్చాత్య ప్రయోగ ఫణితులతో, కొత్త ఊపిరులూది– ఉన్నత ప్రమాణాలు సంతరించిన నాటక రచయిత, నటులు, అనువాదకులు, దర్శకులు, విమర్శకులు ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు తమ జీవితానికి తెరదించి, మొన్న సంక్రాంతి రోజు జనవరి 15 న శాశ్వతంగా కనుమరుగయ్యారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. ఆంగ్లసాహిత్య పట్టభద్రులైన నాగభూషణ శర్మగారు ఎనిమిదవ ఏటనే తండ్రిగారి నేతృత్వంలో రంగస్థలంపై కాలూని నాటకరంగంపై గల మిక్కిలి మక్కువతో, అమెరికాలోని ఇల్లినాయిన్ విశ్వవిద్యాలయంలో నాటక దర్శకత్వంలో ఎం.ఎఫ్.ఏ పట్టా పొందారు. నాటకమే ప్రధానాంశంగా పరిశోధన చేసి, విదేశాలలో విస్తృత పర్యటనలతో వివిధ నాటక ప్రయోగరీతుల్ని అధ్యయనం చేసి, శిక్షణ ద్వారా అనేక నవ్య నాటక ప్రయోగరీతుల్ని ఆకళింపు చేసుకొని– నాటక సాహిత్యానికీ, రంగస్థల ప్రదర్శనలకూ తెలుగునాట జవాన్నీ, జీవాన్నీ సంతరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీషు శాఖలోనూ, థియేటర్ ఆర్ట్స్ నాటకశాఖలోనూ ఆచార్యునిగా ఆయన దగ్గర సుశిక్షితులైన రంగస్థల, సినీరంగ ప్రతిభామతులైన శిష్యగణం ఎంతోవుంది. మొదలి నాగభూషణశర్మగారిని థియేటర్ ఆర్ట్స్‌లో పి.జి. డిప్లమో వంటివి చేసే విద్యార్థులు 'మొనాలిసా' అని వ్యవహరించుకునే వారట! నిజంగా ఆ చిరునవ్వు, ఆయన అందం అలాంటివి. కళాశాల రోజుల్లోనే బందరులో 'కన్యాశుల్కం'లో మధురవాణి పాత్ర వేసి ప్రసిద్ధులైన వారాయన. 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్' నుండి ఆంగ్ల భాషా బోధనలోనూ, ఉస్మానియా విశ్వవిద్యాలయం లింగ్విస్టిక్స్‌లోనూ కూడా డిప్లమో చేసి, ప్రావీణ్యం సంపాదించిన నాగభూషణశర్మగారు స్వయంగా నాటకరచయితగా, నటులుగా, నాటక విమర్శకునిగా, పరిశోధకునిగా పేరొంది,

మూడుతరాల విద్యార్థులకు పాఠాలు చెప్పి, వారిచేత విభిన్న శైలీరీతులలో నాటక ప్రయోగాలు చేయించిన అధ్యాపకులు. నాటక విద్యార్థుల కోసం, నాటకాభిమానులకోసం నాటక అధ్యాపనం, సృజనాత్మక, విశ్లేషణాత్మక గ్రంథరచన, నాటక ప్రయోగం జీవిత పర్యంతం చేసిన 'నడిచే నాటకరంగం' ఆయన. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సైతం నాటకరంగశాఖ వికాసానికి కృషిచేసిన వారాయన. 1993 లో నెలకొల్పిన 'రసరంజని' నాటకరంగసంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఆయన అందించిన సేవలు అనుపమానం. కేంద్ర సంగీత నాటక అకాడమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్.ఎస్.డి.) లకు సభ్యులుగా పనిచేశారు. 'నర్తనం' సంచిక సంపాదకులుగా వ్యవహరించారు.

ది విజిట్, ఈడిపస్, హయవదన, తుగ్లక్, మృచ్ఛకటికం, వెయిటింగ్ ఫర్ ది గోడో వంటి గ్రీకు, సంస్కృత నాటకాలకు దర్శకత్వం వహించి, హైదరాబాద్ డ్రమటిక్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రదర్శింప జేయడమే కాక– యాంటిగని, మాక్‌బెత్, డాల్స్ హౌస్, ఎనిమీ ఆఫ్ ద పీపుల్, ఎంపరర్ జోన్స్, వెయిటింగ్ ఫర్ గోడో, కాయితం పులి, హయవదన, సాంబశివ ప్రహసనం వంటి పాశ్చాత్య, భారతీయ నాటకాలను తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేసి ప్రదర్శింపజేశారు. తెలుగులో స్వయంగా– అడ్డదారి, పెళ్లికి పది నిమిషాల ముందు, మదనకామరాజు కథ వంటి నాటకాలు రచించారు. మరీ ముఖ్యంగా 'ప్రజా నాయకుడు ప్రకాశం' నాటకం రచించి దేశమంతటా ప్రదర్శించారు. విషాదాంతం, జంటపక్షులు, సంభవామి, నరజాతి చరిత్ర, మన్మథుడు మళ్లీ పుట్టాడు, అన్వేషణ, ఆగస్టు 15, జన్మభూమి, రాజదండం మొదలుగా డెబ్భైకి పైగా నాటకాలు, నాటికలు రాసి రంగస్థలంపైనే కాక, ఆకాశవాణిలో అనేక శ్రవ్యరూప నాటకాలతో రచయితగా, దర్శకునిగా వినుతికెక్కారు. 1935 జులై 24 న గుంటూరు జిల్లా ధూళిపూడి గ్రామంలో కామేశ్వరమ్మ, సుబ్రహ్మణ్య శర్మగార్లకు జన్మించిన నాగభూషణశర్మగారు తండ్రినుండే నాటకరంగ స్ఫూర్తిని పొందారు. 1954 లో 'భారతి' లో నాగభూషణశర్మగారి తొలి రచన 'అన్వేషణ' ప్రచురితమయింది. 'తెలుగు సాహిత్యం– గాంధీజీ ప్రభావం', 'లోచన' (వ్యాస సంపుటి), 'నూరేళ్ల తెలుగు నాటకరంగం' వంటి గ్రంథాలను వెలువరించారు.

మొగలిపొదల పరిమళమ్ము నాగభూషణమ్ము
అతని రక్త కణ కణమ్ము నందు నాటకమ్ము

ఆంధ్ర భాష మాటాడిన అందున గమకమ్ము
ఆంగ్లంలో మొదలిడితే చెడుగుడు చమకమ్ము

అంటూ ఆచార్య మొదలి నాగభూషణశర్మగారి వద్ద నటనలో పి.జి.డిప్లమో పొందిన సినీనటుడు, రచయిత శ్రీ తనికెళ్ల భరణి అన్నట్లుగా తెలుగునాటక ప్రయోగ పరీమళాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తెచ్చిన మహనీయుడు నాగభూషణ శర్మ.

మన తోలుబొమ్మలాట అంతర్జాతీయ ఖ్యాతి నొందడానికి ఆయన కృషి గణనీయమైనది. అలాగే జానపద కళలపై సాధికారతను పెంచే ప్రయోగాలు ఆయన చేశారు. అనేక అవార్డులను, సత్కారాలను అందుకున్న మొదలి నాగభూషణశర్మగారిని గత ఏడాది ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' అవార్డుతో సత్కరించింది. ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్న శర్మగారిని తాజాగా ఈ జనవరి 6 నే అజో-విభొ-కందాళం ఫౌండేషన్ ప్రతిభా వైజయంతి జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది. ఆ సభలో స్వయంగా పాల్గొని ఆత్మీయంగా స్పందించిన 84 ఏళ్ల శర్మగారు తమ కుటుంబ సభ్యులను ప్రేమతో పరిచయం చేశారు. భార్య మరణానంతరం హైదరాబాద్ సీతాఫల్‌మండిలోని సోదరుడి దగ్గర వుండి, ఆపై తెనాలిలో పెద్ద కుమారుడు శరత్ దగ్గరకు వెళ్ళిపోయారు. కొంతకాలంగా కొంత అనారోగ్యంగా వున్నా అజో-విభొ-కందాళం ఫౌండేషన్ సభలో పాల్గొని- జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఆ వేడుక జరిగి పదిరోజులు కాకముందే ఆయన పరమపదించడం నాటకాభిమానులైన తెలుగు వారందరిని కలచివేసిన విషాద ఘటనం.

ఆచార్య మొదలి నాగభూషణశర్మగారి జీవితానికి తెరపడినా, తరతరాలు తెలుగువారు తెరలు తెరలుగా స్మరించుకునే ఆయన నాటకరంగ కీర్తిచంద్రికలు ప్రకాశిస్తూనే వుంటాయి. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా మీ సుధామ ఆయనచే చేయించిన ప్రసంగ జ్ఞాపికలు శాశ్వత శబ్దతరంగాలు. వారికి నివాళి!

(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం, 27 జనవరి 2019)

❖

(66) నవ చేతనా వసంతం

కాలచక్ర పరిభ్రమణంలో విళంబి తప్పుకుని, కొత్త సంవత్సరాది 'వికారి'ని ప్రవేశింపచేస్తోంది. తిథి, వార, నక్షత్రాల ఊసే లేక, ఇంగ్లీష్ తేదీ, వారంతోనే కాలం గడిపేసుకునే– అలవాటయిపోయాక, ఉగాది కొత్త సంవత్సరం అంటేనే– 'జనవరి ఒకటి కదా న్యూ ఇయర్! మళ్లీ ఇదేమిటి?' అని నివ్వెరపోయే తరం స్థిరమైపోతోంది. ఇది మన తెలుగుతనం. తెలుగు వత్సరాదియే ఉగాది పండుగ. అభ్యంగన స్నానాలు, కొత్త బట్టలు, పంచాంగ శ్రవణాలు, కవి సమ్మేళనాలు, ఉదయాన్నే ఉగాది పచ్చడి సేవనం– ఇవన్నీ మన తెలుగు అస్తిత్వాలు. వాటిని క్రమేపీ మటుమాయం చేసుకుంటూ పరాయీకరణం చెందడం విషాదమే మరి!

అయితే నేటికీ మన పల్లెసీమల్లో మామిడితోరణాలతో ఇంటి ద్వారాలను అలంకరించుకుని, వాకిళ్లలో ముగ్గులు పెట్టుకుని, కోయిల కుహూరవాలతో, వేపపూలతో, మామిళ్ల గుబురులతో, పూల సౌరభాలతో, పిండివంటలతో, బంధు సమాగమంతో, ఆలయాల్లో పూజాదికాలతో, వేదపండితుల ఆశీర్వాదాలతో పండుగను నిండుగా నిలుపుకుంటున్న ఛాయలు పూర్తిగా మటుమాయం కాలేదు. మన తెలుగు సంస్కృతీ సంప్రదాయాలపట్ల గౌరవాదరాలు, మానవీయ విలువల పట్ల సమాదరణలు కలవారున్నారు.

వసంతకాలే సంప్రాప్తే
కాకం కాకః పికం పికః

అన్నట్లు కోయిలలేవో, కాకులు ఏవో– ఏమని వివరించాలా అని ఆమని సందిగ్ధ పడదు. చైత్రమాస సంరంభమే కొత్త ప్రకృతికి ఆవిష్కరణమై కాలం విలువనూ, ఉగాది ఉనికినీ ఉల్లాసభరితం చేస్తుంది. సూర్యమండల మధ్యమున శ్రీమన్నారాయణుడే హిరణ్మయ స్వరూపంలో కాలచక్రాన్ని నడుపుతున్నాడని మనవారి విశ్వాసం.

మహత్తర తపశ్శక్తి సంపన్నులైన ఋషులు నవగ్రహాలను, వాటి భ్రమణాలనూ గుర్తించి, అనంతమైన కాలస్వరూపాన్ని నిరూపిస్తూ– కాలం కొలమానానికై ఘడియలు, విఘడియలు, దివారాత్రాలు, రోజులు, నెలలు, సంవత్సరాలు అంటూ మాసాలను ఏర్పరచారనీ, ముఖ్యంగా చాంద్రమానాన్ని తెలుగువారు పాటించడం జరుగుతోందనీ అనూచానంగా మనం చెప్పుకుంటున్న విషయం. చంద్రుడు ఒకసారి భూమిని చుట్టి రావడానికి 29 రోజుల 12 గంటల 44 నిమిషాల 3 సెకన్లు పడుతుందట. అమావాస్య వెళ్లిన పాడ్యమినుండి, మరల అమావాస్య వరకూ చంద్రుడు ఒక భూప్రదక్షిణం చేస్తూ, ఒక రాశి నుండి మరో రాశికి భూమితోపాటు చేరుతూంటాడనీ, భూమి తన చుట్టూ తాను తిరగడానికి 23 గంటల 54 నిమిషాల కాలం పడుతుందనీ, భూమి సూర్యుని చుట్టివచ్చిన కాలానికే సౌరమాన సంవత్సరమని పేరు పెట్టారనీ మన జ్యోతిషవేత్తలు చెప్పే మాట.

చంద్రుడు భూమిచుట్టూ తిరిగిరావడానికి పట్టే కాలం నెల. అలాంటి పన్నెండు నెలలు ఒక సంవత్సరం. అదే చాంద్రమాన సంవత్సరం. సౌరమానానికీ, చాంద్రమానానికీ రెండింటికీ కొద్దిరోజులు తేడా వస్తుంది. మన జ్యోతిష్కులు ఋతువులతో స్పష్టంగా కానవస్తున్న సౌరయాన సంవత్సరాన్నీ, శుక్ల, కృష్ణ పక్షాలతో కానవస్తున్న చాంద్రమాన సంవత్సరాన్ని దేనినీ వదులుకోలేక, ఆ తేడా వచ్చే రోజులను సరిపెట్టేందుకే 'అధిక మాసం' సృష్టించారు. ఈ ఆచారం ఋగ్వేదకాలం నుండీ వుందని పురాణాలవల్ల తెలుస్తోంది. సంవత్సరాది పండుగ జరుపుకునే ఆచారం వేదకాలం నుంచీ ఉందట!

రాత్రింబగళ్ల కాలం సమానమయ్యే వసంతకాలమే వేదయుగంలో కూడా ఉగాదిగా పరిగణింపబడింది. యజ్ఞయాగాదులు ఆ దినాన్నే ప్రారంభించి సంవత్సరం పొడుగునా చేసేవారట! అనాది నుంచి ఈ సంవత్సరాది భిన్న ప్రాంతాల వారికీ, భిన్న భాషల వారికీ భిన్నంగానే ఉంటోంది. కర్ణాటక, మహారాష్ట్రులు ఈ ఉగాది వేడుకల విషయంలో మనకు దగ్గర. తమిళులు, బెంగాలీల సంవత్సరాది వేరు.

జీవితం షడ్రుచుల సమ్మేళనం అన్నదానికి ప్రతీకగానూ, అన్నింటినీ స్థిరచిత్తంతో స్వీకరించాలనీ, స్థితప్రజ్ఞత అవసరమనీ ఉగాదిపండుగ ఉదయాన్నే వగరు, పులుపులతో కూడిన మామిడిపిందెలతోను, పులుపు, తీపులతో మిళితమైన కొత్త చింతపండుతోనూ, చేదయిన వేపపువ్వుతోనూ, కొత్తబెల్లంతోనూ తయారయిన పచ్చడిని సేవించడం, కొన్ని పల్లెల్లోనయితే గ్రామ పురోహితుడే ఇంటింటికి వచ్చి ఆ పచ్చడిని తెచ్చి ప్రతివారికి

ఇవ్వడం జరిగేది. ఇప్పటికీ కొన్ని పల్లెల్లో ప్రజలు ముఖ్యంగా రైతులు ఉదయం నుండీ కొత్త గోగునారతో పగ్గాలను తయారు చేసుకుని, సాయంత్రం తమ నాగలికి పూజలు చేసి, సకుటుంబంగా తమ పొలంలో ఏరువాక ప్రారంభించి– పాలేళ్లకు, జీతగాళ్లకు కానుకలివ్వడం, ఒక సమష్టి జీవన సంవిధానాన్నీ, పరస్పర ప్రేమాదరాలనూ ప్రతిఫలింప చేయడమూ ఉంది. అలాగే పంచాంగ శ్రవణం ద్వారా రాబోయేకాలం ఎలా ఉంటుందో తెలుసుకుని, తదనుగుణంగా తమ జీవన విధానాలనూ, కార్యక్రమాలనూ ప్రణాళికాబద్ధం చేసుకోవడం– సంప్రదాయం పట్ల విశ్వాసానికి నిదర్శనం. పంచాంగ శ్రవణం యజ్ఞఫలంతో సమానమనే భావన వుంది.

క్రితం మాటు వికారి నామ సంవత్సరం 1959 లో వచ్చినప్పటికి– అంతకు ఎనిమిది తొమ్మిది వందల సంవత్సరాలుగా ఛిన్నాభిన్నమైన తెలుగుజాతి ఏకజాతిగా సుసంఘటితం కాగా, ఈ వికారి 2019 కి మళ్లీ– రెండు తెలుగు రాష్ట్రాలుగా విడివడివుండి అసలు దేశంమొత్తం ఎన్నికల సంరంభంతో రాజకీయ నానా వికారాలతో సాక్షాత్కరిస్తూండడం విధి వైచిత్రియే మరి!

ఏ పేరు పూని వచ్చిన
నీపై మా కోర్కులెల్ల నెలకొనునయ్యా
ప్రాపై ఏటికి యేడున్
చూపుము నీ మంచితనపు సౌరది నుగాది!

అని బొడ్డు బాపిరాజు గారన్నట్లు, పేరేదైనా తీరేదన్నదే మనకు ముఖ్యం. ఆ సౌరు బాగుండాలనే ఉగాది శుభాకాంక్షలు చెప్పుకుంటాం. అసలు ఉగాది అంటేనే వసంతం, కోకిలలు, పూలకారు ప్రకృతి అందాలు.

ఆకులందున అణగిమణగీ
కవిత కోకిల పలుకవలెనోయ్
పలుకులను విని దేశమందభిమానములు
మొలకెత్తవలెనోయ్!

అని గురజాడ వారన్నారు అంటే– కవి కోకిలలకు బాధ్యత వుందనీ, వారి కూతలు దేశానికి ప్రగతి చేతలు కావాలనీ, అలాంటి నేతలను ఎన్నుకునే చైతన్య స్ఫూర్తి నివ్వాలనీ సత్సంకల్పం. కానీ కవిత్వమూ రాజకీయమై పోయి, సమష్టి చేతన

కులాలుగా, ప్రాంతాలుగా శకలాలు శకలాలుగా ఛిద్రమై పోతుంటే ఆర్తియే కలుగుతోంది.

మావి గుమ్మ కొమ్మ మాటున
పల్లవము మెక్కి కోయిల పాడుటేల
పరుల తనియించుటకో– తన బాగు కొరకో
గానమొనరింపక బ్రతుకు గడువబోకొ?

అని కృష్ణశాస్త్రి గారన్నట్లు కవిత్వం మానవీయ విలువల శిఖరాయమానం. కవి తన గురించి తాను రాసుకున్నట్లు కనబడినా– అందులో పరహితార్థ చింతన వుంటుంది. ఉండాలి. కవిత్వమే జీవితం అన్నంత స్వచ్ఛత ఉండాలి. ఉగాదిని లక్ష్మిగా, సౌందర్య దేవతగా సంభావించడమూ వుంది.

ఉగాది లక్ష్మిని చూదాము
వసంత లక్ష్మిని కొలుతాము
రారండి! రారండి!

రంగురంగులా పూలివిగో
కమ్మని పూలా తావిదుగో
పూలను చేరే రేడిదుగో
ఝుమ్మను తుమ్మెద రవమిదిగో

గున్నమామిడి కొమ్మదిగో
కొమ్మ చివరా చివురిదిగో
చివురుల మేసే పికమిదిగో
రాగము కూర్చే స్వరమిదిగో
రారండి! రారండి!!

అని పిల్లలమర్రి హనుమంతరావుగారు పిల్లలకు కూడా సుబోధకంగా ఉగాది లక్ష్మిని ఆహ్వానించారు. మామిడులు, కోకిలలు, పూలు, తుమ్మెదలు లేని ఉగాది కవిత– అందునా సంప్రదాయ కవుల పద్యాలే లేవు.

1959 నాటి సుప్రసిద్ధ స్త్రీల మాసపత్రికగా పేరొందిన కేసరి వారి 'గృహలక్ష్మి' ఉగాది సంచికలో వికారినామ సంవత్సర 'ఉగాది కానుక' అంటూ కవి భూషణ బిరుదాంకితులైన కల్లూరు అహోబలరావుగారు రాసిన పద్యాలివి కొన్ని–

పండుగ నేడుగాది, పరిపాటిగ భామినులెల్ల, నిండు పూ
దండలు గ్రొత్త పుట్టములు దాల్చి సుభూషణముల్ ధరింత్రు; నీ
వండజయాన! ఎకరము– హాస మనోహర వేషభూషలన్
నిండుగ దాల్చి రమ్ము; తరుణీ! వలదమ్మ– వికార వేషముల్

హృదయానందకరీ! సౌ
ఖ్యదరీ! నారీ! ఒయారీ! కడు శృంగారీ!
ముదమొసగెడు, సంసారీ!
ఇదె మా స్వాగతము! స్వీకరింపు, వికారీ!

కలరుతములు బలికెను, కో
యిలగమి, మలయా నిలంబు లింపుగ వీచెన్
లలిసుమములు వర్షించెను
కొలు వింపారంగ జేసికొమ్ము, వికారీ!

జిలిబిలి పల్కులన్ తెలుగు జిన్నెలు వన్నెలు జిందులాడ, కో
కిల కలనాదముల్ వెలయఁ గిన్నెరసానులు, నట్టువాడగా
గలకలఁదెల్గు కబ్బములు, కమ్మగవ్రాయ గవీంద్రకోటి, మే
ల్కొలుపుము శ్రీ వికారి! కయికొమ్ము! జోహారులుగాది కానుకల్

1959 లో రాజుగా గురువు, సేనాధిపతి చంద్రుడు, మంత్రిగా కుజుడు వున్న వికారి వస్తే, ఇప్పుడు రాజు, సేనాధిపతి, అర్ఘ్యాధిపతి కూడా శనియేననీ, మంత్రి రవి అనీ, సస్యాధిపతి, నీరసాధిపతి కుజుడు అనీ ధాన్యాధిపతి, మేఘాదధిపతి చంద్రుడు అనీ, రసాధిపతి శుక్రుడు అనీ జ్యోతిష పండితులు అంటున్నారు. మరి ఈ 'వికారి' ప్రారంభమే ఎన్నికలవేళగా, అనేక రకాల రాజకీయ వికారాలతో అడుగు పెడుతూంటే ఏ విధమైన ఫలితాలు లభిస్తాయన్నది సందేహాస్పదమే అయినా ఆశాజీవులం కనుక మంచినే అభిలషిస్తాం. అభిలషిద్దాం.

ఉగాది సంప్రదాయవాదులకే అనుకోవడం నేడు పొడచూపుతున్న ఓ విద్రూర వైఖరి. ఉగాదిని జరుపుకోవడం కూడా వర్ణగత ఆధిపత్య భావజాలం అనే వ్యాఖ్యలు నేడు కొన్ని వినబడుతూండడం కూడా– 'ఎక్కడికి పోతున్నాం మనం? అగాధ పాతాళ కుహరాలలోకా? ఉత్తుంగ హిమవన్నగ శృంగాల వైపునకా?' అని సి.నా.రె. ప్రశ్నను వేసుకోవాల్సి వస్తోంది.

1959 నాటి గత వికారికి విశాలాంధ్ర దినపత్రికలో 'ఉదయభాను' అనే నాటి కవి– 'సమీక్ష' అని ఉగాదినిలా సంభావించారు.

ప్రేయసి ఉత్తరంలా వచ్చింది ఉగాది
పేకాటలో జోకరులా వచ్చింది
విచ్చిన ఉషస్సులా విచ్చేసింది ఉగాది
ఇరాక్‌లో ఖాసింలా వచ్చింది
ఎడద ఎడదను కొత్త కోర్కెలే పండీ
గుండె గుండెకు క్రొత్త నెత్తురులు నిండీ
వింతగా ఉంటుంది ఉగాది వేడుక
ఇది కాలం పుట్టిన రోజు పండుగ
తెలుగు సాహితీ లోకంలో శ్రీశ్రీలా
అక్షరాలా అతని మహాప్రస్థానంలా
సామ్యవాద జగతీ సంస్థాపనా
లక్ష్య సంఘటిత ప్రజాపోరాటంలా
ఈ ఉగాదిలో నిండుదనం నిండి వుంది
ఏదో నిత్యనూతనత్వం నిబిడి వుంది
ఆమని చిగురించి నేడు మామిళ్లు కాసి
వేపలు పుష్పించి నేడు వేకువలు వెలిగి
ఎదురేగి ఎదమ్రోగి హారతిచ్చాయి
సిగ్గుపడుతూ చైత్ర మనునయించింది
మనిషి మనిషికి మధ్య దూరాలు త్రెంచి
మనసు మనసుకు మధ్య వైరాలు త్రుంచి
సముజ్జ్వల భావికై బాట వేసేను
ఈ రోజు
మరో మంచి లోకానికి నాంది చేసేను
ఇది ప్రస్థాన యాత్రలో ఒక మైలురాయి
అంచేత నేడు గతాగతాల సమీక్ష వ్రాయి

అంటాడు ఆ కవి.

ఆ స్వతంత్ర స్వర్గమునకు మేలుకో భారతీయుడా
ఈ వికారి వత్సరమున ఇంపుసొంపు గులుకుచుండ
దైన్య జడత లేని మనోధైర్య స్థైర్య సహితమైన
నిశ్చలత్వమంది నీవు నిక్కి నడచు తీవి గల్గి

అంటూ డి.రాజన్న అనే కవి గృహలక్షిలోనే వికారి గేయము రాస్తూ నాటి దేశభక్తి జనితమైన భావనలను జమలికగా ఇలా అంటుకట్టాడు.

సత్యధర్మ మహింసా శాంతి దాంతులొల్కునట్టి
నిత్యమౌ ప్రభుత్వరీతి నెగడుగా వికారిలోన
దేశపిత మహాత్మాగాంధి తెలిపినట్టి విశ్వప్రేమ
దేశదేశములను నెగడి తేజరిల్లు వికారిలోన
భారత త్రిమూర్తులరయ గాంధి, టాగూరు, అరవిందులూ
వారి వేద సత్యఘోష నీ 'వికారి' లో వెలయగా
ఆటంబాంబు లలజడిని ఆత్మబల్మి నణగద్రొక్కి
పంచశీల జండా నూత్న వత్సరమున వెలయుగా
ఈ వికారి వత్సరమున నే వికారములు లేక
పాడిపంటలెల్ల భోగభాగ్యములు జేకూరుగా!

అని అఖిలషించి ఆశావహ సందేశగీతి పలికాడు. ప్రస్తుతం మహాత్మాగాంధీ 150 వ జయంతి సమాపన వేడుకలు సాగుతున్నాయి. 'గాంధీ అనేది ఒక పేరు కాదు. ఈ కాలానికి అవసరమైన ఒక జీవన విధానం' అని ప్రపంచ ప్రసిద్ధ రచయిత్రి పెరల్‌బక్ అన్నట్లు నేటి తరానికి గాంధీమార్గం గురించిన పునర్మూల్యాంకనం అవసరం. పంచశీల సూత్రాలు అప్పట్లో ప్రాచుర్యంలో వున్నాయి. నిజానికి 'దేవుడే సత్యం' అని మొదట్లో అన్న గాంధీ, ఆ తరువాతి కాలంలో 'సత్యమే దేవుడు' అని విశ్వసించి నడిచి నడిపించాడు.

తుపాకీల హతం చేసి
కృపాకీల వెలిగించుడు

అని కవి దాశరథి అన్నట్లు అణుబాంబులు కాక అహింస యొక్క ఆవశ్యకతే ఈ తరానికీ అవసరం. భోగభాగ్యాలతో, పాడిపంటలతో దేశం విలసిల్లాలంటే అన్నదాత రైతు ముందు క్షేమంగా ఉండాలి. ప్రస్తుత వ్యవస్థ పట్ల 'రోసి' నిజామాబాద్‌లో రైతులు

తామే అధికసంఖ్యలో పార్లమెంట్ నామినేషన్‌పత్రాలు వేసి, ఓ హెచ్చరికను చూపారన్నప్పుడు– నిజంగా భూమిని నమ్ముకున్న రైతు, నేలను అమ్ముకుని పోకుండా జీవించగలిగే సుఖమయ తరుణమే అభిలషణీయం కదా మరి!

విశిష్టమైన **కా**లపు **రి**క్క అనే భావనకు ఈ 'వికారి' ఓ సంకేత పదం అన్నాడో కవి. నిజంగా నక్షత్రకాంతితో కాలం వెలుగొందాలని ఈ వికారిలోని అర్థాన్ని పరిణామయుక్తం చేసుకోవడం దోషమేమీ కాదు కదా!

దేశరాజు భారతీదేవి అరవై ఏండ్ల క్రితం తన కవితలో సంభావించినట్లుగా అందుకోదగిన ఆశంసల భావశబలత ఇది–

సగుణబ్రహ్మము నీ మహామహిమచే సంజాతమై యందు నీ
జగతీ చక్రము గల్గె నీ వలననే, సర్వంబు నీ కార్యమే
యగు గాదే; నిను దప్పుకోగలుగు బ్రహ్మంబొండు మాత్రంబె, ని
త్యగుడౌనేమో, వికార శూన్యతను బెంపారన్ 'వికారీ' నమః

శుభం భూయాత్ !!

(ఆంధ్రభూమి దినపత్రిక, 31 మార్చి 2019)

❖

(67) సాహిత్య, నాటక, సినీ 'గిరీశు'డు!

గిరీశ్ కర్నాడ్!– బహుముఖ ప్రతిభాశాలి. ఒక నాటక రచయితగా, రంగస్థల, సినీరంగ ప్రముఖ నటునిగా, దర్శకునిగా, జన హృదయవాసిగా రాణించారు. ఆయన కార్యక్షేత్రం ప్రధానంగా కర్ణాటక, కన్నడ భాషలే అయినా, తన సృజనాత్మక కృషితో ప్రపంచ ఖ్యాతి పొందిన వారాయన. పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డ్, కాళిదాస్ సమ్మాన్, అమెరికా లాస్‌ఏంజెల్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా గౌరవ పట్టభద్రుడు.

గత కొంతకాలంగా సోషల్ మీడియాలో కూడా గిరీశ్ కర్నాడ్ సంచలనం ప్రస్ఫుటంగా ద్యోతకమయ్యింది. రైట్‌వింగ్ హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించి, హత్యకు గురి అయిన కన్నడ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్‌కు మద్దతుగా, అలాగే ఆమె వలెనే ధార్వాడ్‌కు చెందిన ప్రొఫెసర్ ఎం.ఎం.కల్‌బుర్గి అలాంటి మిషపైనే 2015 లో హత్య చేయబడినప్పుడు నిరసన ప్రకటించినప్పుడు– 'మీటూ అర్బన్ నక్సల్' ప్లకార్డు పట్టుకుని నిరసనర్యాలీలో తన ఆక్సిజన్ సిలిండర్‌తో సహా గిరీశ్‌కర్నాడ్ పాల్గొన్నప్పుడు– భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి, సాంస్కృతిక వైవిధ్యానికి మద్దతుగా– నిర్భయంగా ఎన్నో ప్రతిఘటనలను సైతం ఎదుర్కొంటూ, తన అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక ఆయన ఉద్యమించిన వైఖరి ఆయనకే చెల్లింది. కన్నడంలో ఆయన వలెనే జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన లోహియా సోషలిస్టిక్ భావజాలంతో వుండిన యు.ఆర్.అనంతమూర్తివలె కాకుండా, ఏ ప్రత్యేక రాజకీయపార్టీ వైఖరీ లేక, ప్రజాస్వామిక విలువలకే కట్టుబడి– వ్యవస్థలోని అన్యాయాలకు తన ప్రతిఘటనా స్వరాన్ని అవసరమైనప్పుడల్లా ఎలుగెత్తి చూపుతూనే వచ్చారు గిరీశ్‌కర్నాడ్. 'ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా'కు 1974–75 లో డైరెక్టర్‌గా వుండి గిరీశ్ కర్నాడ్ అప్పటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ రాజీనామా చేయడం గుర్తుంటే– ఆయన వ్యక్తిత్వం ఏమిటో, 1990 ల నుండీ కూడా ఆయన

మతోన్మాద వైఖరులకు నిరసనగా ఎలా, ఎందుకు, ఎప్పుడు నిలబడుతూ వచ్చారో అర్థం అవుతుంది. మరీముఖ్యంగా నాటకరచయితగా ఆయన ముద్ర విలక్షణమైనది, విశిష్టమైనది.

స్వాతంత్ర్యానంతర నాటకరంగాన్ని నవ్యతా ధోరణులతో ప్రభావితం చేసిన నటరచయిత ఆయన. బెంగాలీలో బాదల్ సర్కార్, మరాఠీలో విజయ్ తెండూల్కర్, హిందీలో మోహన్ రాకేష్‌ల వలె– కన్నడంలో గిరీశ్ కర్నాడ్ నాటక రచయితగా బలీయమైన తనదైన ముద్ర చూపి, 1998 లో అత్యున్నత సాహిత్య పురస్కారమైన 'జ్ఞానపీఠ్' అవార్డు పొందారు. 1960 లగాయితు ఓ నాలుగు దశాబ్దాలు చారిత్రక, పౌరాణిక అంశాలనే మూలకందంగా చేసుకుని సమకాలీన వ్యవస్థను, సమస్యలను దృష్టిలో వుంచుకుని చేసిన నాటక రచనలు, ప్రదర్శనలు ఒక ప్రభంజనాన్నే సృష్టించాయి. ఆయన రచనలు అనేక భారతీయ భాషల్లోకి, ఆంగ్లంలోకి అనువదింప బడ్డాయి. కొంకణి, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో అత్యంత నిష్ణాతుడయిన ఆయన స్వయంగా తన నాటకాలు కొన్నింటిని ఆంగ్లంలోకి అనువదించారు. లండన్‌లో సైతం ప్రదర్శించారు. రంగస్థలంపైనే కాక, సినిమా రంగంలోనూ– నటునిగా, దర్శకునిగా రాణించారు. దాదాపు నూరు సినిమాల్లో నటించిన ఆయన వ్యాపారాత్మక చిత్రాలలో జీవికకోసం నటించినా, కొన్ని మరపురాని మహోన్నత చిత్రాలలో కళాత్మక పాత్రలతో కీర్తి గడించారు. టీ.వీ. రంగంలోనూ 'మాల్గుడి డేస్', 'ఇంద్రధనుష్' సీరియల్స్‌లో తండ్రి పాత్రలో అశేష ప్రేక్షక జనసమాదరణ పొందారు. కొద్దికాలం క్రితమే తన జీవితచరిత్ర రాసి గ్రంథంగా వెలువరించారు.

తొలి జీవన రేఖలు:

బొంబాయి దగ్గర మేథరన్ గ్రామంలో 1938 లో గిరీశ్ కర్నాడ్ జన్మించారు. తల్లి కృష్ణాబాయి నీ మన్కీకర్. అప్పటికే ఒక కుమారుడున్న యువ వితంతువు. నర్సుగా ట్రైనింగ్ పొందుతూ బాంబే మెడికల్ సర్వీసెస్‌లోని డాక్టర్ రఘునాథ్ కర్నాడ్‌తో పరిచయం పెరిగి అదే వివాహానికి దారితీసింది. ఆ రోజుల్లో వితంతు వివాహాల పట్ల వ్యతిరేకత వుండడంవల్ల అయిదేళ్ళపాటు ఎదురుచూసాకనే వారి వివాహం 'ఆర్యసమాజ్' పద్ధతిలో జరిగింది. కృష్ణాబాయి– రఘునాథ్‌లకు కలిగిన నలుగురు సంతానంలో గిరీశ్‌కర్నాడ్ మూడవవారు. కర్ణాటక సిరిసిలో ఆయన ప్రాథమిక విద్య మరాఠీలో జరిగింది. ఆ రోజుల్లోనే బాలగంధర్వ తరానికి చెందిన నాటకాల పట్ల తల్లిదండ్రులకు కూడా ఆసక్తి వుండడం వల్ల, సంచార నాటక సమాజాలు, నాటక

మండలులతో పరిచయం కలిగింది. సిరిసికొండ గ్రామంలో నాటి యక్షగానాల ప్రభావం గిరీశ్‌కర్నాడ్‌పై అమితంగా పడింది. రంగస్థలం పట్ల ఆకర్షణకు అదే తొలి బీజమైంది. అందువల్లనే కథలవైపో, కవిత్వం వైపో కాకుండా ఆయన అభిరుచి నాటకరచన వైపు మళ్లింది. గిరీశ్‌కు పధ్నాలుగేళ్ళ వయస్సులో ఆ కుటుంబం కర్ణాటక ధార్వాడకు తరలి వచ్చింది. ఇద్దరు చెల్లెళ్లు, మేనకోడలుతో అక్కడే పెరిగాడు.

1958 లో కర్ణాటక యూనివర్సిటీ, ధార్వాడ నుంచి బి.ఏ. డిగ్రీ పొందాక ఇంగ్లాండ్ వెళ్లి రోడెస్ స్కాలర్‌గా 1960-63 లో ఫిలాసఫీ, పాలిటిక్స్, ఎకనమిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ సంపాదించారు. 1962-63 లో ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కావడం ఒక విశేషం! అయితే ఆ పాశ్చాత్య జీవన సరళిని ఎంచుకోక- భారత దేశానికి తిరిగి వచ్చి, చెన్నయ్‌లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌లో 1963-70 వరకు ఏడేళ్లు పనిచేశారు. రచనావ్యాసంగానికే పూర్తిగా కట్టుబడాలన్న సంకల్పంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. అప్పట్లో 'ది మద్రాస్ ప్లేయర్స్' అనే అమెచ్యూర్ నాటకరంగ సంస్థతో అనుబంధం పెంచుకున్నారు. 1987-88 లో యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసినా, ఆ కాలంలోనూ చికాగోలో- తాను రాసిన 'నాగమండల' నాటకం ఆంగ్లంలోకి అనువదించి ప్రదర్శించారు. ఆయన ప్రతిభా ప్రాభవాలను గుర్తించి ఆయనను వరించిన 1974-1975 ఫిలిమ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్, సంగీత నాటక అకాడమీ ఛైర్మన్, నేషనల్ అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (1988-93) బాధ్యతలను, 2000-2003 లో లండన్‌లో ఇండియన్ హై కమిషన్ సాంస్కృతిక సచివునిగా, నెహ్రూ సెంటర్ డైరెక్టర్‌గా ఎంతో సమర్థవంతంగా పనిచేసి పేరుప్రఖ్యాతులు ఆర్జించారు.

కుటుంబ జీవనం:

మద్రాస్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌లో పనిచేస్తున్న రోజుల్లోనే చెన్నయ్‌లోని పిల్లలడాక్టర్ సరస్వతీ గణపతితో పరిచయం ఏర్పడి, అదే వారి వివాహబంధానికి దారితీసింది. గిరీశ్‌కర్నాడ్‌కు బి.వి.కారత్, ఎ.కె.రామానుజన్, యు.ఆర్. అనంతమూర్తి వంటి వారితోగల సృజనాత్మక అనుబంధం గురించి చాలామంది చెబుతారు గానీ ఆయన భార్య సరస్ (సరస్వతీ గణపతి) తాను ప్రజారోగ్య సేవలో అంకితమై పనిచేస్తూ భర్త గిరీశ్ కర్నాడ్‌ను రచయితగా, నటునిగా ఎదగడానికి ఎంతో ప్రేరణగా నిలిచారు. ఆయనలోని సృజనశక్తి నిరంతరం కొనసాగాలని ఆవిడ కాంక్షించి చేదోడు వాదోడై అనవరతం నిలిచారు. వారికి రఘు, రాధ ఇద్దరు పిల్లలు. శ్రీమతి సరస్వతీ గణపతి-

బెంగుళూరు బయట కనకపురాలో పేద మహిళల కోసం ఏర్పరచి, నిర్వహిస్తున్న ట్రస్టుకు బెళకు (వెలుగు) అనే నామకరణం చేసింది గిరీశ్ కర్నాడ్‌గారే! సరస్ తల్లి పార్శీ వనిత కాగా, తండ్రి కొడవ జాతీయుడు. ఎటువంటి కర్మకాండ, జనసందర్శనం, ప్రభుత్వ లాంఛనాలు లేకుండా తన అంతిమ సంస్కారం జరగాలన్న గిరీశ్ కర్నాడ్ చివరి కోరికననుసరించే నిరాడంబర జీవిక ననుసరించిన ఆయనకు, కల్పల్లి సిమెట్రీలో అంత్యేష్ఠి కావించారు. అయితే కర్ణాటక ప్రభుత్వం గిరీశ్ కర్నాడ్ మరణానికి ఆ రోజు సెలవు దినాన్ని, మూడురోజుల సంతాప దినాల్నీ ప్రకటించింది. ఆయన మరణానికి అన్ని వర్గాల నుండి సంతాపం వెల్లువలై పారింది.

నాటక రచనా వైభవ ప్రాభవం:

1951 లో కన్నడంలో ప్రచురితమైన రాజాజీ మహాభారతం (సి.రాజగోపాలాచారిగారి గ్రంథం) తనపై అత్యంత ప్రభావం చూపిందనీ, ఆ మహాభారత పాత్రలు తనతో కన్నడంలో సంభాషించిన అనుభూతి ఒక సమయంలో పొందాననీ, చెవుల్లో మార్మోగిన ఆ మాటలనే తొలుత రాసాననీ చెప్పుకున్న గిరీశ్ కర్నాడ్ 'మానిషాద' అనే ఏకాంకికను రాసారు. 23 వ ఏట రాసిన 'యయాతి' నాటకంతో ఆయన కీర్తి మొదట ఇనుమడించింది. శుక్రాచార్యుని శాపంతో ముసలివాడైన యయాతి తన అకాల వృద్ధాప్యాన్ని తీసుకుని యౌవనం ఇవ్వమని తన కుమారులందరినీ అభ్యర్థిస్తాడు. ఆఖరికి శర్మిష్ఠ ద్వారా కన్న 'పురు' అందుకు అంగీకరిస్తాడు. ఈ జీవనసౌఖ్యాలు తుచ్ఛమైనవనీ, అగ్నిలో నెయ్యి వేసినకొద్దీ అది జ్వలించినట్లు యౌవనభోగాలు శాశ్వత సుఖానందకారకాలు కావనీ, దేహానికి జరామరణాలు సహజమనీ ఆ సహజ పరిణామాలను కాదనుకోవడం అవివేకం అనీ చివరకు యయాతి జ్ఞానం పొందుతాడు. గిరీశ్ కర్నాడ్ 'యయాతి' నాటకం ఎంతో ప్రాచుర్యం పొంది అనేక భారతీయ భాషల్లోకి అనువాదమైంది.

తన నాటక రచనకు చారిత్రక, పౌరాణికాల నుండి మూలాలను గ్రహించి ఆధునిక మానవుడి సమస్యలనూ, మానసిక సంఘర్షణలనూ ఆ భిత్తికపై నుండి సామయికంగా మలచడం ఆయన సాధించిన నవ్యత. 1964 లో రాసిన 'తుగ్లక్' నాటకం 14 వ శతాబ్దపు ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ విచిత్ర ఆదర్శ మనస్తత్వం ఆధారంగా రచించింది. 26 సంవత్సరాల వయసులో కర్నాడ్ ఆ రచన– దేశంలోనే ఒక ఆశావహ గొప్ప నాటక రచయితగా ఆయనకు ఖ్యాతి తెచ్చింది. తుగ్లక్ నాటకం 1962 లో లండన్‌లో జరిగిన 'ఫెస్టివల్ ఆఫ్ ఇండియా'లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వారిచే ప్రదర్శింపబడి కొనియాడబడింది.

1971 లో గిరీశ్ కర్నాడ్ రాసిన మరో అద్భుతనాటకం 'హయవదన'. 11 వ శతాబ్దపు సంస్కృత కథాసరిత్సాగరం మూలంగా 1940 లో థామస్‌మన్ రాసిన 'ది ట్రాన్స్‌పోజ్‌డ్ హెడ్స్' రచన ఆధారంగా రాయబడిన ఈ నాటకం గిరీశ్ కర్నాడ్‌కు ఎంతో ఇష్టమైన యక్షగాన జానపద ఫణితిని రచనలో అనుసరించడం జరిగింది. ఈ నాటకం జర్మన్‌లోకి అనువదింపబడి విజయ్‌మెహతా దర్శకత్వంలో ప్రదర్శితమైంది. హయవదనలో– ఒక యువతి భర్త ఆమెను జెలసీతో అనుమానించి, తన తల నరుక్కుంటాడు. తన మీదకు హత్యానేరం వస్తుందేమోనని ఆమె ప్రియుడూ తల కోసుకుంటాడు. తానూ ఆ పని చేయబోయిన యువతికి దేవత ప్రత్యక్షమై ఆ తలలు శరీరానికి మామూలుగా అతికిస్తే బతుకుతారని వరమిస్తుంది. ఆమె కంగారులో ఒకరి తలను మరొకరి శరీరానికి అతికిస్తుంది. భర్త ప్రియుడి శరీరంతోనూ, ప్రియుడు భర్త శరీరంతోనూ బతుకుతారు. ఆ తరువాత ఏం జరిగిందన్నదే ఈ నాటక వైశిష్ట్యం.

'నాగమండల' నాటకం కూడా ఒక స్త్రీ మానసిక ఘర్షణకు సంబంధించిందే. ఒక సర్పం భర్తరూపంలో రాత్రివేళ ఆమెతో ఎంతో ప్రేమగా లాలనగా వుంటూంటుంది. ఉదయం వేళల్లో ఆ భర్త శాడిస్టుగా, కర్కశంగా ఆమెను అసహ్యించుకుంటూ దూరంగా పెట్టి ప్రవర్తిస్తుంటాడు. తన శీలాన్ని ఆమె, భర్త దగ్గర నిరూపించుకోవాల్సి రావడం, చివరకు ఆ నాగసర్పమే ఆమె రక్షణకు రావడం– ఒక సంచలనాత్మక నాటకం.

తమ అధికారాన్నీ, ఆధిక్యాన్నీ పురుషులు ఎలా అవినీతిపరులై దుర్వినియోగం చేసి పతనమయ్యేదీ, అలాగే స్త్రీల ఆశలు, ఆశయాలు పురుషాధిక్యానికి ఎలా బలి అయ్యేదీ, అలాగే ధ్వనిపూర్వకంగా రాజకీయ అంశాలనూ ప్రతిభావంతంగా తన నాటకరచనలుగా అందించిన సృజనాత్మక శక్తి ఆయనది. 'తుఘలక్', 'బలి', 'అగ్ని–వర్షం' అనే నాటకాలు ఆయనకు పేరు తెచ్చిన రచనలే. ఇక్కడే ఒక విషయం చెప్పుకోవాలి. గిరీశ్‌కర్నాడ్‌ను తెలుగువారికి పరిచయం చేసిన తొలికీర్తి ప్రముఖ కన్నడ, తెలుగు కవయిత్రి, రచయిత్రి కీ॥శే॥ డాక్టర్ భార్గవీరావుదే ననాలి. భార్గవీరావు గారి వల్లనే ఒక సందర్భంలో ఆయనను చూసే భాగ్యం మీ వ్యాసకర్త సుధామకు కలిగింది. యయాతి, హయవదన, తుఘలక్ నాటకాలను కన్నడం నుంచి తెలుగులోకి అనువదించి ఆ నాటక రచనా గ్రంథాలను భార్గవీరావు నాకు కానుక చేశారు కూడాను. అలాగే శ్రీ దెంచనాల శ్రీనివాస్ తన నాటకరంగ కృషిలో భాగంగా గిరీశ్‌కర్నాడ్ 'బలి' నాటకాన్ని తెలుగు చేసి, ఇరవైనాలుగు ప్రదర్శనలకు పైగా తన దర్శకత్వంలో ఇచ్చాడు. ఆ నాటకం కలిగించిన ప్రకంపనలు తనకు ప్రాణహాని

అయినా లక్ష్యపెట్టలేదు. గిరీశ్ కర్నాడ్ స్వయంగా శ్రీనివాస్‌ను అభినందిస్తూ లేఖ రాశారు. 'ఫ్లవర్స్', 'ఆన్‌టోస్ట్' 2012 లో గిరీశ్ కర్నాడ్ రాసిన నాటకాలు, గిరీశ్ కర్నాడ్ నాటకాలు రెండు భాగాలుగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రచురించింది. అలాగే యయాతి, వెడ్డింగ్ ఆల్బమ్, బాయిల్డ్ బీన్స్ ఆన్ టోస్ట్ అనే ఆంగ్లంలో నాటకాలను ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ వారే వెలువరించారు. గిరీశ్ కర్నాడ్– కన్నడనాటకాలు తనవి తానే ఆంగ్లంలోకి అనువదించడమే కాక, స్వయంగా ఇంగ్లీష్‌లో కొన్ని నాటకాలు రాశారు.

నటునిగా, దర్శకునిగా సినీరంగ జీవనం:

నాటకరచయితగా తెలిసినదానికన్న మిన్నగా సినీరంగ ప్రేమికులకు గిరీశ్ కర్నాడ్ మంచి నటునిగా తెలుసు. 1970 లో మన తెలుగుకవే అయిన పఠాభి (తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి) కన్నడంలో నిర్మించిన 'సంస్కార' చిత్రంలో గిరీశ్ కర్నాడ్ 'ప్రాణేశాచార్య' పాత్రలో నటించి నటునిగా తన ఖ్యాతికి జేగంట కొట్టాడు. 1971 లో 'వంశవృక్ష' కన్నడ చిత్రంలో లెక్చరర్‌గా నటించడమే కాక, ఆ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. కన్నడంలో తాను దర్శకత్వం వహించిన 'కాడు' సినీ విమర్శకుల ప్రశంసలందుకుంది. 'గోధూళి', 'ఉత్సవ్' వంటి హిందీ చిత్రాలకు, అలాగే హిందీలో కొన్ని డాక్యుమెంటరీలకు కూడా గిరీశ్ దర్శకత్వం వహించారు. సుమారు వందచిత్రాల దాకా ఆయన నటుడిగా నటించిన కన్నడ, తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, మళయాళం చిత్రాలు వున్నాయి. ముఖ్యంగా మన తెలుగు ప్రేక్షకులకు ఆనందభైరవి, ధర్మచక్రం, శంకర్‌దాదా ఎం.బి.బి.ఎస్., కొమరంపులి వంటి చిత్రాల ద్వారా గిరీశ్ కర్నాడ్ నటుడిగా పరిచయమే. రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి వంటి వారి సరసన కూడా ఆయన నటించారు. ఆయన నటుడిగా వేసిన చివరి తెలుగుచిత్రం 'స్కెచ్ ఫర్ లవ్' బహుశా ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల కావచ్చు. 'సంస్కార' చిత్రానికి భారత ప్రభుత్వ రాష్ట్రపతి బంగారు కమలం లభించింది. 1971 లో దర్శకునిగా తను చేసిన 'వంశవృక్ష' చిత్రానికి ఉత్తమ దర్శకునిగా జాతీయ ఫిలిం అవార్డు బి.వి.కారంత్‌తో బాటుగా లభించింది. డి.ఆర్.బింద్రేపై (1972), కనక పురందరదాసుపై (1988 ఆంగ్లంలో), 'సూఫీయిజం'పై డాక్యుమెంటరీలు తీసి డాక్యుమెంటరీల దర్శకునిగా కూడా గిరీశ్ పేరొందారు. కన్నడంలో నవలాచిత్రాలకు దర్శకత్వం వహించిన ఖ్యాతీ వారికుంది. ఏడు ఫిలింఫేర్ అవార్డులు,

పది జాతీయ ఫిలిం అవార్డులు పొందిన నటుడు, దర్శకునిగా గిరీశ్ కర్నాడ్ ప్రతిభా వైజయంతి రెపరెపలాడింది.

బుల్లితెర దీధితి:

టీ.వీ. తెరపై ఆర్.కె.నారాయణ్ 'మాల్గుడి డేస్' ధారావాహికలో స్వామి తండ్రిగా, అలాగే 1989 లో 'ఇంద్రధనుష్' ధారావాహికలో 'అప్ప', 'బాలా'ల తండ్రిగా గిరీశ్ కర్నాడ్ ఇంటింటా తండ్రిగా ప్రేక్షకులను అలరించారు.

స్వేచ్ఛా విలువల మార్గానుగామి:

గిరీశ్ కర్నాడ్ జానపద, పౌరాణిక, చారిత్రక అంశాల భారతీయ సంస్కృతియే పునాదిగా ప్రయోగాత్మక నాటక రచనలు చేసిన గొప్ప రచయిత. ఆయన అభ్యుదయ వాది. ప్రగతిశీల ప్రజాస్వామిక విలువలకు కట్టుబడిన సాహసి. ముఖ్యంగా కులవ్యవస్థ నిర్మూలనకూ, హిందూ మతోన్మాద ధోరణులకు వ్యతిరేకంగానూ– కలం, గళం సారించిన సాంస్కృతిక సేనాపతి. దేశం గర్వించదగిన మేధావి రచయిత. గుండెను తాకే సృజనాభినయకారుడు. ఆయనకు అనేక సందర్భాలలో ప్రాణహాని వుందని తెలిసినా– నిర్భయంగా అనుకున్నది అనుకున్నట్లుగా ప్రకటిస్తూ, ఆచరిస్తూ, స్వేచ్ఛా విలువల మార్గానుగామిగా నిలిచినవారు.

విలువలతో కూడిన మేధోమయతరానికి చెందిన మనదేశం గర్వించదగిన వ్యక్తులలో ఒకరు గిరీశ్‌కర్నాడ్. ఆ వరిష్ట సృజనకారుడు, భారతీయ సంస్కృతికీ, నాగరికతకూ చెందిన ఉదాత్తతనూ, గాఢతనూ నిస్వార్థంగా నిలిపిన ప్రజాస్వామికవాదిగా, వ్యవస్థలోని అన్యాయాలను నిర్భయంగా ఎదిరించిన మహనీయునిగా, ఎందరికో ఆరాధ్యుడూ, అభిమానపాత్రుడూ, స్ఫూర్తిమూర్తి. గత కొంతకాలంగా శ్వాససంబంధిత అనారోగ్యంతో, ఆక్సిజన్ సహాయంతోనే కాలం వెళ్ళదీస్తున్న గిరీశ్‌కర్నాడ్ జూన్ 12 వ తేదీ సోమవారం ఉదయం నిద్రలోనే శాశ్వతంగా కన్నుమూసారు.

గిరీశ్‌కర్నాడ్– సమాంతర సినిమాలకు, ఉదాత్త విలువల పాత్రలకు కాణాచిగా నిలచిన కార్యశూరుడు. ఒక సామాజిక కార్యకర్త, మేధోమయ తరానికి చెందిన మేటి నట రచయిత. ఆయన మరణంతో ఒక 'ఐకాన్' మాయమైంది. ఒక తరం భారతీయ నాటక రంగం అంతరించిపోయింది.

(వార్త దినపత్రిక, 23 జూన్ 2019)

❖

(68) అస్తమించిన సాహిత్య 'ఛాయ'

అమెది ప్రసన్నవదనం. చెదరని చిరునవ్వు ఆమె ఆభరణం. తెలుగు సాహితీ రంగంలో స్త్రీవాదానికి ఆమె కొత్తకోణం చూపారు. స్త్రీల సమస్యలను 'తన మార్గం'లో చూసి, కథలుగా– ఆర్ద్రతతోనూ, ఆలోచనాత్మకంగానూ మలిచారు. గ్రంథాలయాధికారిణిగా, సంపాదకురాలిగా, ఒక కాలమిస్టుగా స్ఫూర్తిదాయక ప్రయాణం సాగించారు. 'ఆడవాళ్ళు గట్టిగా నవ్వడం కూడదు' అనే ఆంక్షలున్న కుటుంబం నడుమ పుట్టి పెరిగినందు వల్లనే– పురుషాధిపత్యాన్ని నిగ్గదీసే మధ్యతరగతి మహిళల అంతరంగాలకు– కథకురాలిగా అక్షరాకృతినిచ్చారు. కుటుంబంలో ఆడపిల్లలు ఎదుర్కొంటూండే వివక్షలను ఎండగట్టి, స్త్రీల హక్కులకు దన్నుగా, ఒక సాహిత్య తరు'ఛాయ'గా నిలిచారు. పిల్లలు లేకున్నా– ఎల్లలెరుగని ప్రేమను, ఆత్మీయతనూ అందరికీ పంచారు. గౌరవనీయురాలైన సాహితీవేత్తగా తెలుగు సాహిత్యప్రపంచం మన్ననలు అందుకున్నారు.

ఆవిడే– అబ్బూరి ఛాయాదేవి. సాహితీలోకంలో పేరెన్నికగన్న అబ్బూరి రామకృష్ణారావుగారి కోడలిగా, అబ్బూరి వరద రాజేశ్వరరావు భార్యగా, మెట్టినింట తానూ ఒక సాహితీమూర్తిగా ఎదిగిన అసమాన ప్రతిభామూర్తి. జూన్ 28 శుక్రవారం ఉదయం 5–40 కు డా॥ వింజమూరి సూర్యప్రకాశ్‌గారి నుండి ఫోన్ వచ్చినట్లుగా లేచాక గుర్తించి, 7 గంటలప్పుడు ఫోన్ చేశాను. డాక్టర్ సామవేదం కామేశ్వరిగారు మాట్లాడారు. ఆ డాక్టర్ దంపతులు ఎంతోకాలంగా 'స్పెడింగ్ లైట్' ద్వారా– ఛాయాదేవిగారి మద్దతుతో, అనేక సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొత్తపేటలో వారు నెలకొల్పిన– 'అందరి ఇల్లు' లో ఎవరయినా, ఏ సమయంలోనైనా వెళ్ళి, సిద్ధంగా వున్న ఆహారపదార్థాలతో వండుకు తిని, తమ ఆకలి తీర్చుకోవచ్చు. కామేశ్వరిగారు– స్త్రీల ఆరోగ్యం కోసం, ముఖ్యంగా అనవసర గర్భాశయాల తొలగింపుపై ఉద్యమించి, పిల్లలు కలగరనుకున్న ఎన్నో జంటలకు సంతానభాగ్యం

సంతరించినవారు. అంతేకాదు! 'అందరికోసం– మనవంతున' అని అనేక జనహిత చింతనా సేవలను అందించే వారు. 'ఉత్తరం', 'వందరోజుల పుస్తకాల పరిచయ పర్వం' వంటి మానవసంబంధాలు మెరుగుపరిచే కార్యక్రమాలు వారిరువురూ నిర్వహించినప్పుడు, ఛాయాదేవిగారు వాటి వెనుక ప్రోత్సాహకంగా, స్ఫూర్తిమంతంగా నిలచేవారు.

గత పదేళ్ళుగా కొండాపూర్‌లోని, సి.ఆర్.ఫౌండేషన్‌లో వుంటున్న ఛాయాదేవిగారు తనకు ఆరోగ్యం సరిగాలేదని, రమ్మంటే రెండు రోజుల క్రితమే వెళ్ళి 'అందరి ఇల్లు'కు తీసుకువచ్చారు. ముందురోజు కారులో ప్రయాణిస్తూ– వెనకసీటులో తల వెనుక చేతులు పెట్టుకుని కూర్చుని, కొండాపూర్ నుండి కొత్తపేట వరకు నగర దర్శనం చేస్తూ, పలు కబుర్లుచెప్పి రాత్రి కూడా అనేక విషయాలు ముచ్చటించిన ఛాయాదేవిగారు 28 వ తేదీ 'అందరి ఇల్లు'లోనే తెల్లవారు జామున నిద్రలోనే కన్నుమూశారు. అంబులెన్స్‌లో కొండాపూర్ సి.ఆర్. ఫౌండేషన్‌కు ఆమె పార్థివదేహం తరలించారు. ఆ సంగతులు వినడంతో– ఆమె హఠాన్మరణానికి మనసు కలతబారింది! భూమిక సంపాదకురాలు కొండవీటి సత్యవతి గారికి ఛాయాదేవిగారు తన మరణానంతరం ఏం చేయాలో వివరంగా ముందే వీలునామా లేఖ రాసి ఇచ్చారు. తదనుగుణంగానే– ఆమె కళ్ళను ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి, మోహన్ ఫౌండేషన్ వారు అవయవాలు మాత్రమే తీసుకుంటారు కనుక, ఆమె దేహాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల కోసం –ఇ.ఎస్.ఐ. ఆసుపత్రికి అందించారు. మరణానంతరం కూడా తాను ఉపయోగపడాలన్న ఆమె తుదికోరిక అలా సాఫల్యం చెందింది.

అబ్బూరి ఛాయాదేవిగారి మృతిపట్ల తెలుగు సాహితీలోకమంతా అశ్రు తర్పణాలు విడిచింది. ఆవిడ రచయిత్రిగానూ, వ్యక్తిగానూ కూడా ఆదర్శవనిత. జీవితంలో సమస్యలను భూతద్దాల్లో చూడక, సంయమనంతోనూ, ప్రశాంత చిత్తంతోనూ పరిశీలించి, ఆలోచనాత్మకంగా పరిష్కారాలు సూచించడం, శాంతిసాధనే కర్తవ్యంగా, బ్రతుకు ఘర్షణలను కూడా ఎదుర్కోవాలని, తన సాహిత్యం ద్వారా ప్రబోధించిన స్త్రీవాద రచయిత్రే ఆవిడ. 'స్త్రీవాదం' అంటే ఆవేశం కాదనీ, సంయమనం, సమ్యక్ దృష్టితో సాగే అస్తిత్వ పోరాటమనీ– ఛాయాదేవిగారి సాహిత్యం తెలియజేస్తుంది. ఆవిడ 'తన మార్గం'లో తానుగా నడిచి తరుణులెందరికో సమస్యల పరిష్కారాలకు తరణోపాయం చెబుతూ, జిడ్డు కృష్ణమూర్తి తాత్త్వికతను అలవరుచుకుని, ఒక గంభీరమైన, ఉదాత్త వ్యక్తిత్వంతో– అందరికీ స్నేహశీలిగా జీవితాన్ని సార్థకం చేసుకున్నారు.

అబ్బూరి ఛాయాదేవి 1933 అక్టోబర్ 13 న రాజమండ్రిలో ఒక సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. నలుగురు పిల్లలలో ఆవిడ మూడవ సంతానం. అన్నయ్య, అక్కయ్య, చెల్లి, తాను. తండ్రి న్యాయవాది. పుట్టినింటి పేరు– మద్దాలి. రాజమండ్రిలో బి.ఏ. చదువుతుండగా పెళ్ళిచూపులు జరిగాయి. నిశ్చయతాంబూలాలు కూడా పుచ్చుకున్నారు. కానీ ఆ కుర్రాడు మరో అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. నాటికి చిన్న ఊరే అయిన రాజమండ్రిలో విషయం తెలిసి నలుగురూ ఏమయినా అనుకుంటారని అన్నయ్య, చెల్లెలు ఛాయాదేవిని హైదరాబాద్ తీసుకొచ్చేశాడు తండ్రిని ఒప్పించి. అలా 1951 లో హైదరాబాద్ చేరిన ఛాయాదేవి నిజాం కాలేజీలో ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ చేశారు. నిజాంకాలేజ్ తెలుగు విద్యార్థిసంఘం సభ్యురాలుగా కూడా వున్నారు. వదిన రుక్మిణీగోపాల్ సాంగత్యంలోనే సాహిత్యాభిమానం ఏర్పడింది. వార, పక్ష పత్రికల్లోని కథలను చదివి చర్చించుకునేవారు. వదినగారి ప్రోద్బలంతోనే కుటుంబంలో మగవారి పెత్తనం ఇతివృత్తంగా 1952 లో తొలుతగా 'అనుబంధం' అనే కథ రాసారు. కళాశాల వార్షిక సంచిక 'విద్యార్థి'లో అది ప్రచురితం అయింది. అన్నగారింట్లో వున్న రేడియో 'వినడం' ఆవిడకు చాలా ఇష్టం. అలాగే కాలేజీలో పి.ఎన్.ఆర్. అప్పారావు, భమిడిపాటి కామేశ్వరరావుగార్ల ప్రోత్సాహంతో కొన్ని నాటకాల్లోనూ నటించారు.

ఆకాశవాణిలో భాస్కరభట్ల కృష్ణారావుగారి ప్రోత్సాహంతో చిన్న చిన్న ప్రసంగాలు ఇవ్వడం, నాటికలు వేయడం చేశారు. ఒకసారి రేడియోలో 'మంచి భర్తను ఎన్నుకోవడం ఎలా' అనే అంశంపైన ప్రసంగించిన సందర్భంలో, భాస్కరభట్లవారు 'ఎలాంటి భర్త కావాలి నీకు' అని అడిగితే, 'మంచివాడు, కట్నం అడగనివాడు' అని సమాధాన మిచ్చారు. 'అలాంటివాణ్ణి చూపిస్తే చేసుకుంటావా' అంటే సరేనన్నారు. ఆయనే– అబ్బూరి వరద రాజేశ్వరరావుగారికి ఛాయాదేవి గురించి చెప్పారు. అన్నయ్యతో అబ్బూరివారికి ముందే పరిచయం వుండడం వల్ల, ఆయన వచ్చి చూసాడు. అబ్బూరి రామకృష్ణారావుగారికి విషయం తెలిసింది. అలా 1953 లో ఛాయాదేవిగారి వివాహం అబ్బూరి వరద రాజేశ్వరరావుగారితో జరిగింది.

అబ్బూరి ఛాయాదేవిగారు లెక్చరర్‌గా చేయడానికి అనువైన కంఠస్వరం కలిగినవారు కాదని, మామగారు ఆంధ్రాయూనివర్సిటీ లైబ్రేరియన్‌గా పనిచేస్తూ, కోడలిని కూడా ఆ కోర్సులో చేరమన్నారు. అలా లైబ్రెరీసైన్స్ కోర్సు చేసి, న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో– 'ఇండియన్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్

స్టడీస్' లో 1982 వరకూ డిప్యూటీ లైబ్రెరీయన్‌గా పనిచేసి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 1954 లోనే వరద రాజేశ్వరరావు 'కవిత' అనే త్రైమాసిక కవిత్వపత్రికను ప్రారంభించారు. దానికి సంపాదకురాలు ఛాయాదేవియే!. 1955 లో 'తెలుగు స్వతంత్ర'లో కథ వచ్చింది. శ్రీశ్రీ, ఆరుద్ర వంటివారు మద్రాసునుంచి వీరింటికి వస్తూండేవారు. అజంతా, ఏల్చూరి, రాయప్రోలు వంటివారు కవితా చర్చలు వీరింట్లోనే జరిపేవారు. వివిధ దేశాల జానపద కథలతో పిల్లలకోసం 1955 లోనే 'అనగా... అనగా' అనే పుస్తకాన్ని ఆవిడ తీసుకువచ్చారు. 'మోడర్న్ తెలుగు పొయెట్రీ', ఆంధ్ర యువతీమండలి పక్షాన 'వనిత' మాసపత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నెరిపారు.

న్యూఢిల్లీలో ఉద్యోగంలో వుండగా, ఆఫీసు, ఇంటిపనుల హడావుడి వల్ల ఓ ఏడేళ్ళ పాటు కథలు రాయలేదు. ఆ తర్వాత 'జ్యోతి' మాసపత్రిక కలిగించిన స్ఫూర్తితో– బాపు బొమ్మతో తన కథ చూసుకోవాలన్న ఆకాంక్షతో, 'ప్రయాణం' అనే పెద్దకథ రాశారు. ఆడపిల్ల అత్యాచారానికి గురికావడం ఒక ప్రమాదంలా భావించి– జీవితాన్ని కొనసాగించాలనీ, సహృదయుడైన వ్యక్తి దొరికితే జీవితంలోకి ఆహ్వానించాలనీ రాసిన ఆ కథ కథకురాలిగా గుర్తింపు తెచ్చింది ఆమెకు. అలాగే 'ఉపగ్రహం–1' అనే కథ రాసాక, ఆవిడని ప్రత్యేకసంచికకి కథలు రాయమని సంపాదకులు అభ్యర్థించే స్థాయికి వెళ్ళారు. జ్యోతి దీపావళి సంచికలోరాసిన 'సుఖాంతం' కథ ఛాయాదేవిగారిని జాతీయస్థాయి కథకురాలిగా నిలబెట్టింది. నేషనల్ బుక్ ట్రస్ట్ 'కథాభారతి' లో అది చోటుచేసుకుంది.

ఆమె కథల నాయికలు తిరుగుబాటుదారులు, పోరాటాలు చేసే అతివాదులు, తీవ్రవాదులు కారు. చిన్న చిన్న ఆశలు, కలలు తీరని సామాన్య మహిళల తపనలు గుర్తించి, వారిని స్వతంత్ర జీవనులుగా బ్రతికేలా ప్రేరణాత్మక రచనలు చేశారు. 'సుఖాంతం' కథలో నిద్రకోసం పరితపించే స్త్రీ, నిద్రపట్టక కలతపడే స్త్రీ, చిన్నప్పుడు తల్లి ముఖాన నీళ్ళు చల్లి నిద్రలేపి మరీ చదువుకోమంటే, ఎదిగాక ఆడపిల్లలు పొద్దేక్కేదాకా పడుకోకూడదని ఆంక్షలుంటే, పెళ్ళయ్యాక ఇంటి పనితో చంటిపిల్లలతో నిద్రకరువైతే, మొత్తం జీవితమంతా 'నిర్నిద్రగానం' కాగా, ఇన్నాళ్ళూ దూరమైన నిద్రంతా ఒకేసారి పోవాలని నిద్రమాత్రలు– 'ఇది ఆత్మహత్య కోసం కాదు. నిజంగా నిద్రపోవడానికే' అని భర్తకు చీటీ రాసి వేసేసుకోవడాన్ని– ఎంతో హృదయదఘ్నంగా చిత్రించారు. అలాగే ఛాయాదేవిగారు అనగానే పాఠకలోకం గుర్తు చేసుకునే– 'బోన్సాయ్ బ్రతుకు' కథ 1988 కేంద్రసాహిత్య అకాడమీ ప్రచురించిన 'తెలుగు

కథ' సంకలనంలో వచ్చింది. 'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' సంకలనంలో ఉటంకితమై- స్పానిష్, ఇంగ్లీష్, కన్నడ భాషల్లోకి అనువాదమైంది.

'అబ్బూరి ఛాయాదేవి కథలు', 'తన మార్గం' అనే కథాసంపుటాలు, 'మృత్యుంజయ' నవల, 'వ్యాసచిత్రాలు', 'వ్యాససంపుటి', చైనాలో ఛాయాచిత్రాలు (యాత్రా చరిత్ర), 'అనగా అనగా', 'అపరిచిత లేఖ', 'మన జీవితాలు', అనే అనువాద గ్రంథాలు వెలువరించారు. తన తండ్రి తనకురాసిన ఉత్తరాలఆధారంగా రాసిన- స్వీయ చరిత్రాత్మక 'మృత్యుంజయ' నవలకు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ రచయిత్రి పురస్కారం లభించగా, 'తన మార్గం' కథా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఆవిడ 2011లో శివానందమూర్తిగారి సమక్షంలో, సనాతన ధర్మసంస్థ ప్రతిభాపురస్కారం గ్రహించారు.

ఢిల్లీ నుండి రిటైరై వచ్చి- హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో సొంత ఇల్లు ఏర్పరచుకుని, 1982 నుండి ఆ ఇంటిని- ఒక ఉద్యానవనశాఖలా, పనికిరాని వ్యర్థాలతో సంతరించి అలంకరించిన- గృహోపకరణాల సౌందర్యంతో, ముద్దులొలుకుతూ తిరిగే పిల్లిపిల్లలతో, వెళ్ళిన సాహితీకారులందరికీ ఒక 'పర్ణశాల' అనుభూతినిచ్చేలా మలుచుకున్నారు. అక్కడనుండే అనేక సాహితీసభలలో ఉత్సాహంగా పాల్గొనేవారు.

1993 లో భర్త అబ్బూరి వరద రాజేశ్వరరావుగారి మరణానంతరం- 'అబ్బూరి ట్రస్ట్' స్థాపించి, 'వరదస్మృతి', 'అబ్బూరి చాటువులు', 'మంగళసూత్రం' వంటి గ్రంథాలు ప్రచురించారు. తన అత్తగారు అబ్బూరి రుక్మిణి పేర ఒక సాహిత్య పురస్కారాన్ని నెలకొల్పారు. జీవితంలోని అరుదైన ఛాయాచిత్రాలతో అస్మిత సంస్థ సహకారంతో 'ఛాయచిత్ర కథనం' పేర ఒక సిడి వచ్చింది. భారత్-చైనా సాంస్కృతిక సంబంధాలలో భాగంగా- చైనా ప్రభుత్వం ఆహ్వానం మేరకు, కేంద్ర సాహిత్యఅకాడమీ చైనా పంపిన పదిమంది భారతీయ రచయితలలో ఛాయాదేవిగారు ఒకరు. ఆ యాత్రా కథనాన్ని కూడా గ్రంథస్థం చేశారు. బాగ్‌లింగంపల్లిలో ఆమె ఇంటికి సమీపంలోనే 'భూమిక' పత్రిక కార్యాలయం, శ్రీమతి కొండవీటి సత్యవతిగారి నివాసం వున్నాయి. సత్యవతిగారిని పుత్రికా వాత్సల్యంతో చూసే ఛాయాదేవిగారు- బాగ్‌లింగంపల్లిలోని ఇంటిని (భర్త మరణానంతరం కొన్నేళ్లు నివసించినా) తొమ్మిదేళ్ళ క్రితమే అమ్మేసి, కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు వయోధిక ఆశ్రమంలో చేరారు. సి.ఆర్. ఫౌండేషన్‌లో ఒక ఆహ్లాదకర వాతావరణం చొరవచేసి నెలకొల్పారు. మహిళా శిక్షణా

కేంద్రం ద్వారా బొమ్మలు కుట్టడం, వ్యర్థాలతో కళాకృతులు తయారు చేయడం, బొమ్మలు చేయడం, క్రాఫ్ట్‌వర్క్‌లలో ఎందరికో శిక్షణ ఇచ్చారు. తాను కన్నుమూశాక ఏం చేయాల్సిందీ వీలునామా లేఖలో రాసి సత్యవతిగారికి అందచేసారు. తన దేహం మరణానంతరం కూడా ఉపయుక్తం కావాలన్న ఆదర్శం ఆచరణలో చూపిన అసమాన స్త్రీ ఆమె.

ఆమెను ఎన్ని పురస్కారాలు వరించినా, రచయిత్రిగా ఎంతో కీర్తి ప్రతిష్ఠ లార్జించినా ఎక్కడా ఆమె స్వభావంలో గర్వరేఖలు పొడచూపేవి కావు. గొప్ప స్నేహశీలిగా అందరితో నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడడం ఆమె నైజం. సంభాషణల్లో హాస్యం దొర్లించడం ఆమెకు భర్త సాంగత్యంలో మరింతగా వికసించిందనిపిస్తుంది. పొత్తూరి విజయలక్ష్మి, సోమరాజు సుశీల వంటి సాటి రచయిత్రులు ఆమె హాస్యపు జల్లులను ఎంతగానో చెబుతూంటారు. ఆటోలో ప్రయాణించి వచ్చి– 'ఆటోమేటిగ్గా వచ్చాను' అనడం లాంటి చమత్కారాలు ఎన్నో! అబ్బూరి ఛాయాదేవి నిరాడంబర నిగర్వ రచయిత్రిగా వాసికెక్కారు.

'20వ శతాబ్దంలో తెలుగు రచయిత్రుల రచనలు' అనే అద్భుత సంకలనం ఆమె సంపాదకత్వంలోనే రూపొంది వెలువడింది. ఆవిడ పరిచయాలూ, స్నేహాలూ అపురూపమైనవి. అంత గొప్ప స్నేహశీలి, మానవతామూర్తి రచయిత్రులలో అరుదుగానే కానవస్తారు. అనుబంధాలకు, ప్రేమ, ఆప్యాయతలకు, ఆదరణలకు పెద్దపీట వేసి, తనచుట్టూ అందరికీ పంచిన అమృతహృదయం ఆమెది. 'తన మార్గం'తో తనకు సాటి తానే ఆమె!

అబ్బూరి ఛాయాదేవి మరణంతో ఒక విశిష్ట సాహితీ మూర్తినీ, స్ఫూర్తిదాయక మార్గదర్శినీ తెలుగు సాహితీలోకం పోగొట్టుకుంది. ఆ 'అమ్మవెళ్ళిపోయింది'.

(ఆంధ్రభూమి వారపత్రిక, 25 జులై 2019)

❖

(69) విలువల గ్రహింపు కలిగించే నేర్పరి కథకుడు

'బహుమతి కథానికలు' అంటేనే సహజంగా పాఠకులకు ఒక ఉత్సుకత వుంటుంది. పత్రికలవారూ, సంస్థలవారూ కథల పోటీలు నిర్వహించడమనేది చాలా కాలంగా కొనసాగుతూ వస్తున్నదే! పోటీలకు కథలు రాయడమంటే– దానికి ఓ గడువుతేదీ వుంటుంది. కనుక ప్రకటన వెలువడినప్పటి నుండి, పోటీకి కథానిక పంపే గడువుతేదీ ముగిసేలోగా వున్న కాలంలోనే రాయవలసిన ఇతివృత్తాన్ని ఎన్నుకోవడం, ఆ కథానిక నిర్మాణాన్ని, శిల్పాన్ని ప్రణాళిక వేసుకుని పాత్రలు, సంఘటనలు కూర్చుకుని రచన చేయడం జరిగిపోవాలి. అంటే ఫలానరోజు పరీక్ష అంటే ఆ రోజుకు ఉత్తీర్ణత సాధించేలా సంసిద్ధుడై నిలవడం అన్నమాట! నిజానికి ఇదేమంత సులభకార్యం కాదు. ఒక అసైన్‌మెంట్‌ను పూర్తి చేయడం వంటిదే!

చాలామంది సీనియర్ కథకులు కథల పోటీలకు కథలు రాయడానికి జంకడం నాకు తెలుసు. ఇంత సీనియర్ రచయిత పోటీలో పాల్గొనడం ఏమిటని అనుకుంటారనో, బహుమతి రాకపోతే తమ పరువు పోతుందనో, ఏ సాధారణ ప్రచురణకో ఎంపిక చేస్తే తమ సీనియారిటీకి భంగం అనో అలా రాయనివారున్నారు. నిజానికి పోటీకి రాసి నిలవడంలో ఒక విశేషజ్ఞత వుంటుంది. ఎందుకంటే వచ్చిన కథల్లోంచి న్యాయనిర్ణేత, బహుమతుల నిర్ణయానికి పరిశీలిస్తున్నప్పుడు ఇతర కథలతో ఆ కథ సామర్థ్యాన్ని బేరీజు వేయడం, తులనాత్మకంగా పరిశీలించి, కథలోని విశిష్టతను గుర్తించడం పోటీకథల విషయంలోనే ఎక్కువగా జరుగుతుంది.

నిజానికి బహుమతి కథల నిర్ణయం న్యాయనిర్ణేతలకు, సంపాదకులకు కూడా కత్తిమీద సామే! ఆంధ్రప్రభ, ఆంధ్రసచిత్ర వారపత్రిక, యువ, జ్యోతి వంటి మాస పత్రికలు గతంలో ఉగాదికీ, దీపావళికీ కథలపోటీలు నిర్వహించి మూడు ఉత్తమ కథలను ప్రచురించి నగదు బహుమతులు ఇచ్చేవి. బహుమతి పొందిన కథకుల

ఫోటోలు, వారి సంక్షిప్త పరిచయాలు ప్రచురించడం ఆ రోజుల్లో ఓ గొప్ప. ఎంపికయిన కథలు కూడా ఎంతో అలరించేవిగా వుండేవి. ద్వితీయ బహుమతి పొందిన కథ ప్రథమ బహుమతికి అర్హమైనది అనిపించే సందర్భాలు కూడా వుండేవనుకోండి!

ఇప్పటికీ అనేక సంస్థలు, పత్రికలు కథలపోటీలు నిర్వహిస్తూనే వున్నాయి. కానీ నిర్వాహకులనూ, సంపాదకులనూ, మంచిచేసుకుని బహుమతులు తెచ్చుకుంటున్నారనీ, "బహుమతి సొమ్ము అక్కర్లేదు. కావాలంటే అంతసొమ్మునూ ఎదురిస్తాం, నాకు బహుమతి ఇవ్వండి కథకు" అనే తరహా రచయితలున్నారనీ, దానికి వత్తాసు పలికే నిర్వాహకులున్నారనీ– ఈ రోజుల్లో వినిపిస్తున్న మాటలే. అయితే ఒక్కటి మాత్రం నిజం! బహుమతి కథలు మామూలు కథలకన్నా ఒకమెట్టు పైన వుంటాయి అవి ఎవరివయినా. ఒక కథారచయిత ప్రజ్ఞను పట్టి ఇచ్చే విశేష రచనలు అవి. పోటీలో బహుమతులు పొందడం సామాన్యమైన సంగతి కాదు.

బ్రతుకు పార్శ్వాలు బాగా తెలిసి, ఆ స్థితిగతులను కదిలించే కథలుగా మలచే 'కలం' కారీతనం తెలిసిన కథారచయిత సింహప్రసాద్. అందుకే కథలపోటీల్లో సాటి రచయితలతో కథారచనలో తన కథలతో పోటీ పడినప్పుడు బహుమతు లెన్నింటినో కైవసం చేసుకోగల ఉత్తమ కథకునిగా రాణిస్తున్నాడు. ఇటీవల కాలంలో ఇంతగా బహుమతి కథలతో రాణించిన కథారచయిత అరుదు. అందుకే సింహప్రసాద్ నిజంగా బహుమతి కథల కథకుడు. అలా వివిధ పత్రికల్లో, సంస్థల ద్వారా ఎంపికైన బహుమతులు అందుకున్న 63 కథలను 'సింహప్రసాద్ 63 బహుమతి కథానికలు' పేర సంపుటీకరించారీ రచయిత శ్రీ చెలంకూరి వరాహ నరసింహప్రసాద్. 'బహుమతుల కోసమే నేనెప్పుడూ కథలు రాయలేదు. ఏదో రకంగా సమయం కల్పించుకుని కథలు రాయడానికి– పోటీల్ని ఒక అవకాశంగా, ఒక ఛాలెంజ్‌గా భావిస్తాను. బ్యాంకులో ఉండగా టార్గెట్ల వెంట పరుగులు పెట్టడం అలవాటైంది. అంచేత 'పోటీ గడువు' ఒక టార్గెట్‌లా మారి నన్ను ప్రేరేపిస్తుంటుంది. ఆ రకంగా పోటీలు మరిన్ని కథలు రాయడానికి నాకు ఉత్ప్రేరకాలు అవుతున్నాయంటే అతిశయోక్తి కాదు. నన్ను కదిలించిన, ఆలోచన రగిలించిన, స్పందింపచేసిన ప్రతి అంశాన్నీ కథగా మలచడమన్నది నా ప్రయత్నం, తపన, ఆరాటం' అంటాడు సింహప్రసాద్.

ఈ 63– సింహప్రసాద్‌కు బహుమతులు తెచ్చిపెట్టిన కథలు మాత్రమే కాదు, సింహప్రసాద్– పాఠకులకు నిజంగా బహుమతిగా ఇస్తున్న కథలు. ఎందుకంటే ఈ కథలు సింహప్రసాద్‌ను రచయితగా నిలబెట్టే ఉత్తమకథలు మాత్రమే కాదు, చదివిన

పాఠకుల ఎదపొరల్లోకి ఇంకి రసానుభూతులనూ, ప్రయోజనదాయకమైన ఆలోచనలనూ రేకెత్తించగల కథానికలు. ఈ 63 కథల్లో ఎంతో వైవిధ్యం వుంది. సమకాలీన సమస్యలు, మానవ మనస్తత్వాలు చిత్రీకరించిన– తెలుగువారి జీవితానికి సంబంధించిన అనేక కథలతో బాటు– శృంగారం, హాస్యం, సాహసం, క్రైం వంటి విషయాలను ఇతివృత్తంగా తీసుకుని కథానికలుగా మలచి, తన అనుభవ సృజనతో బహుమతు లందుకున్నవీ ఉన్నాయి. సమాజాన్నీ, మనుషులనూ ఇంతగా నిశిత పరిశీలన చేస్తూ వర్తమానంలో కాళ్లూని, భవిష్యత్తుకు ఉపయుక్తం కాగల అంశాలను కథలుగా అందించడం సింహప్రసాద్ అసమాన ప్రతిభ.

ఈ సంకలనంలోని అధికశాతం కథలు ఒక ఆర్ద్రతను, స్వచ్ఛమైన బ్రతుకు పరీమళాన్నీ అందించే కథలు. ఒకే వస్తువుని తీసుకున్నా వివిధ రకాలుగా రాసి మెప్పించగల ప్రతిభ తనది. అలాంటి అంశాలున్న కథలు రెండేసి, మూడేసివిగా కనబడతాయి. స్త్రీవాదం అన్నమాట ఉపయుక్తం చేయనక్కరలేదు గానీ– సింహప్రసాద్ స్త్రీల సమస్యలను అర్థం చేసుకుని, అభివ్యక్తీకరించిన ఆనుపానులు బహుధా ప్రశంస నీయాలు. సరోగసి మదర్ మనస్తత్వాన్ని తెలిపే 'తల్లీ నిన్ను దలంచి', ఫైర్‌ఫైటర్‌గా స్త్రీ రాణించగలదని నిరూపించే 'యోధ', ఒక సీనియర్ నటిని పెళ్లాడి తనను వదిలేసిన నిర్మాత దయాధర్మాలు ఆశించక, స్వశక్తితో ఎదిగి ఆ నిర్మాతనే దిగ్భ్రాంతి పరిచేలా చేసిన లహరి గురించి వివరించే 'ఫీనిక్స్', సహజీవనం పేరుతో ఆడదాన్ని మోసం చేసే ఉద్యమకారుడి– 'పురుషుడు' కథ, అలాగే అంటరానితనంపై రాసిన 'గబ్బిలం' వంటి కథలు నిజంగా పాఠకుడిని చదివిన తరువాతా వెంటాడుతాయి.

చాలామంది సీనియర్ రచయితలు అనుకున్న వారి కలం ఆగిపోవడానికి కారణం– ఆ కథకులు గతంలోనే కూరుకుపోయి వర్తమానంతో నడవలేకపోవడమే! ప్రపంచీకరణ తెచ్చిన మార్పులను అర్థం చేసుకుని, ఆధునిక యువ సమాజం బ్రతుకు తీరు నాడిని కూడా సింహప్రసాద్ పట్టుకున్నాడు. అందుకే వస్తువైవిధ్యంలో శిల్పరమణీయతతో పాఠకుల బహు'మతులను' అలరించగల ఇన్నేసి 'బహుమతి' కథలను రాయగలుగుతున్నాడు.

మూసను ఛేదించిన కథకుడు తను. టీవీలో 'రియాల్టీ షో'లు నేటి ఒక వీక్షక ఉన్మాదం. ఆ పేరిటి కథలో 'నూకరాజు' పాత్ర మనల్ని కలచివేస్తుంది. ఫిట్‌నెస్‌ల క్రేజ్‌తో 'జీరోసైజ్' కోసం యువతులు ఎలా ప్రాణాలను కోల్పోయే ప్రమాదాల్లోకి

నెట్టబడుతున్నారో చిత్రించారు ఓ కథలో. 'కదలిక', 'పరబ్రహ్మ' కథలు నేటి విద్యావిధానంపై ఎక్కుపెట్టిన రెండు ఆలోచనాత్మక శరాలు. 'మోడల్' కథ ఓ చిత్రకారుడి నీచత్వాన్నీ, ఆ లంబాడీ యువతి ఔన్నత్యాన్నీ తెలియజేస్తుంది.

మానవత్వాన్ని నమ్ముకున్న కరుణామూర్తులను కొన్ని కథల్లో పాత్రలుగా నిలిపి ఆదర్శంగా చూపితే, బ్రతుకంటే ఒక పోరాటమనే సాహస ప్రబోధం చేసిన కథ లున్నాయి. నేటి భారతంలో 'గోవు'కు ఒక సంచలన ప్రాధాన్యత కనబడుతోంది. గృహప్రవేశం సందర్భంగా ఆవును తిప్పడం అనే ఆచారం భిత్తికగా, గోహింస ఎలా జరుగుతోందో సంకలనంలోని తొలికథ 'గోమాత' చెబుతుంటే, 'గోచర' అనే కథానికలో సలీం అనే ముస్లిం లారీడ్రైవర్‌వల్ల ప్రమాదవశాత్తు గోవు లారీచక్రాల కిందపడి చచ్చిపోతుంది. గోహత్య భీతితోనే అనుకున్నాగానీ, సలీం ఒక ఆవుని కొనితెచ్చి దాన్ని సంరక్షిస్తాడు. అందువల్ల అతనికి మేలు కలుగుతుంది. 'ఆవుపాలలో రసాయనం, ఆవు నెయ్యిలో అమృతం వున్నాయి. ఆవు మాంసం తింటే రోగిష్టులవుతారు' అని మహమ్మద్ ప్రవక్త చెప్పాడట. ఆవు ఈనడం, భార్యకు పాలు పడడం ఈ కథలోని మానవీయ మలుపులు. మతం వేరు, ఆత్మ చింతన వేరు అనిపిస్తారు.

'ఓ సీత కథ' లో సోషల్ నెట్‌వర్కింగ్‌లోని కామాంధుడు ఫణీస్‌కు ధైర్యంగా ఎదురొడ్డి గుణపాఠం నేర్పిన సీతామనోహరి నేటి యువతి ఆత్మస్థైర్యం ప్రతీకయే! అలాగే 'మనసా తొందర పడకే' కథ యువదంపతులకు ఒక సందేశం. చదువుల్నీ, హోదాల్నీ, సంపాదనల్ని పక్కనబెట్టి, అహంవీడి, భార్య భర్తలు నిజంగా స్నేహితుల్లా మనసువిప్పి మాట్లాడుకుంటే కలహాలు సమసిపోతాయనీ, అనవసర ఆవేశాలూ, తొందరపాటుతనాల్నీ వదిలి సమయసందర్భాన్ని బట్టి అవగాహనతో మెలగాలని చెప్పే మంచి కథ.

'మనుషుల మధ్య ఆప్యాయత, అనురాగం, అవగాహన, అన్యోన్యత, అభిమానం, ఆదరణ ఉంటే చాలు. ఇల్లే కాదు సమాజం, దేశం కూడా ఒక ఆనంద నిలయం అయి తీరుతుంది.

కొందరు ఎందుకు ఈ సంగతి గ్రహించక వక్రమార్గాన పోతారో తెలియదు! అమానుషంగా ఎందుకు ప్రవర్తిస్తారో తెలీదు!

డబ్బు, తాత్కాలిక సుఖం, అధికారం, అహం, గర్వం కన్నా మిన్నయైనవి చాలా ఉన్నాయని గ్రహించగలిగితే ఎంత బాగుణ్ణు!

నైతిక విలువలకు సామాజిక జీవనానికి పెద్దపీట వేస్తే ఎంత బాగుణ్ణు!

మానవత్వపు పరిమళాలు వెదజల్లితే మరింత బావుణ్ణు! ఉత్కృష్టమైన మానవజన్మ ఎత్తినందుకు సార్థకం చేసుకోగలిగితే ఎంతెంతో బావుణ్ణు!' అని 'ఆశావహం' కథ ద్వారా నిజంగా పాఠకులను ఆలోచింపచేసే, మంచికి సమాయత్తం చేయగల ప్రేరణ ఇచ్చే కథకుడు సింహప్రసాద్.

ఈ 63 బహుమతి కథానికలు సింహప్రసాద్‌కు బహుమతులు తెచ్చి పెట్టినందుకే కాదు, పాఠకులకు మంచి విలువైన జీవన చిత్రణలను, సందేశాలను అందించడం ద్వారా అసలు సిసలు బహుమతి కథలు. ఇటీవలే అస్తమించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవిగారన్నట్లు 'ఆధునిక కాలంలో వస్తున్న మార్పులు, మానవ సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయో, మనుషుల్లో ఎటువంటి మార్పులు రావాలో సూచిస్తూ మంచి కథలు రాసిన సింహప్రసాద్' గారికి అభినందనలు.

(పాలపిట్ట మాసపత్రిక, సెప్టెంబర్ 2019)

❖

(70) తరలిపోయిన సాహితీ స్నేహమయి

ఒకటా రెండా! యాభై సవత్సరాలకు పైగా పరిచయం. యువభారతిలోనే తొలి పరిచయం. అప్పట్లో చిక్కడపల్లిలో వాళ్ళమ్మమ్మతో బాటు వుంటూ కాలేజీలో చదువుతుండేది. ఆ ఇంట్లో మాత్రం అడపా దడపా కలిసి కబుర్లాడుకునేవాళ్ళం. అలా యువభారతి ద్వారా పరిచయమైన కె.వి.కామేశ్వరరావూ, తనూ ప్రేమించి పెళ్ళాడారు. కోఠీలోని కామత్ హోటల్‌లో మిత్రులకు ఆ విషయం చెప్పడానికి వారు ఇచ్చిన విందూ ఇంకా గుర్తుంది. తను నాకు ఎం.ఏ.లో క్లాస్‌మేట్ కూడాను. ఆ తరువాత ఆకాశవాణిలో డ్యూటీఆఫీసర్‌గా చేస్తున్నప్పుడు తను క్యాజువల్ అనౌన్సర్‌గా వస్తుండేది. ఆ కుటుంబంతో అనుబంధం, స్నేహం ఇంతింతనరానిది. కామేష్ స్కూటర్ మీద లక్ష్మిని, పిల్లలను, నన్ను కూడా ఎక్కించుకుని తిప్పేవాడు. 1985 లో నా వివాహానికి అనుసంధాన కర్తలు వారే.

కామేష్, లక్ష్మి, నేను కలిసి అరకు, బొర్రా గుహలను దర్శించడం, బొర్రా గుహలు చూడడానికి ముందురాత్రి మేం బసచేసిన అక్కడి గైడ్ నన్ను వారి కొడుకేమోనని అనుకోవడం, దానికి తను కినియడం కూడా గుర్తుంది. యువభారతి సాహితీ సభల్లోనే కాక అనేక కవిసమ్మేళనాలలో, సభలలో మేం కలిసి పాల్గొన్నాం. శ్రీశ్రీగారు మరణించినప్పుడు దూరదర్శన్‌లో రాత్రి 10 గంటలకు ఓ అరగంట నివాళి కార్యక్రమం ఆమె, నేను వ్యాఖ్యాతలుగా ప్రత్యక్ష ప్రసారం చేయడం ఓ మరపురాని జ్ఞాపకం. ముఖ్యంగా కవిసమ్మేళనాలలో ఆమె తెలంగాణ యాసలో రాసి చదివే స్వీయ కవితలు ప్రేక్షక శ్రోతలను అలరించేవి. నా వివాహం అయ్యాక మా దంపతులం ఆమె ఇంటి దగ్గర్లోనే అద్దెకు వుండేవారం. తనూ, తన భర్తా మాకు గార్డియన్స్ అన్నట్లు వుండేవారు. అభినందన సంస్థ ఒక సంవత్సరం స్నేహితుల దినోత్సవాన నాకు, తనకు కలిపి 'ఉత్తమ స్నేహితులు' అవార్డు ప్రదానం చేయడం కూడా గుర్తుంది. తను ఈనాడు వారి విపుల, చతుర మాసపత్రికలలో పనిచేస్తూ చలసాని ప్రసాద్‌గారు

పోయాక, కొన్నాళ్ళు ఇన్‌చార్జ్ ఎడిటర్‌గా పనిచేసింది. నాతో గళ్ల నుడికట్టు, పాత బంగారం అనే ఓ కాలమ్ కూడా నిర్వహింప చేసింది. హోళీ పండుగనాడు మా ఇంటికి వచ్చి ఆ దంపతులు రంగులతో ముంచెత్తిన రోజులు మా ఇంటిల్లిపాదికీ తెలుసు.

మా అమ్మగారిని ఆత్మీయంగా పలుకరిస్తుండేది. తన భర్త కామేష్ మరణానంతరం కూడా ఎంతో నిబ్బరంగా, సాధికారిక మహిళగా జీవనాన్ని గడిపింది. కుమార్తె సమీరకు తనే వివాహం చేసింది. అంతకు ముందు కుమారుడు ప్రవీణ్ వివాహం అయిన కొద్దినెలలకే ఓ ఉగాదిరోజు తెల్లవారుజామునే భర్తను కోల్పోయింది. ఆ ఉగాది పూట రేడియోలో ఆమె కవిత ప్రసారమవుతుండగా ఇంటనున్న అత్తగారికి ఆ మరణవార్త తానే చెప్పవలసి రావడమనే స్థితిని తాననుభవించడం వేదనాభరితం. ఆమె మంచి కవయిత్రి. అంతకుమించి కథా రచయిత్రి. దాంపత్య జీవన మధురిమలను తన కథలలో అద్భుతంగా చిత్రించిన రచయిత్రి తాను. గొప్ప సంపాదకురాలు. ఆంధ్రప్రభలో ఒక కాలమిస్టుగా కలంపేరున ఎన్నో స్ఫూర్తిదాయక రచనలు చేసింది. ప్రెస్‌క్లబ్ మహిళావర్గం ప్రతినిధిగా వివిధ హోదాలలో ఎన్నో ఏళ్ళు పనిచేసింది. చైనా, మారిషస్, యు.కె., దుబాయ్, మలేషియా, అమెరికా వంటి దేశాలలో పర్యటించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఐ.వి.యస్. అచ్యుతవల్లి కథలపై పరిశోధించి డాక్టరేట్ పట్టా పొందింది. తల్లిదండ్రులకు ప్రథమ పుత్రికగా చెల్లెళ్ళను, తమ్ముళ్ళను కూడా సమాదరించింది. గొప్ప స్నేహశీలిగా అందరికీ తలలో నాల్కగా మెదిలింది.

ప్రచార, ప్రసార సాధనాల్లో వ్యాఖ్యాతగా కార్యక్రమాలెన్నో నిర్వహించింది. ఎందరి పుస్తకాలకో పీఠికలను సంతరించింది. 'మనసున మనసై', 'జూకామల్లి' కథా సంపుటాలు కథారచయిత్రిగా ఆమెకు పేరు తెచ్చాయి. 'మనసున మనసై' సంకలనానికి జ్యేష్ఠ లిటరరీ అవార్డు లభించింది. నంది అవార్డుల కమిటీలో మెంబర్‌గా, ఎన్నో పోటీలకు ప్యానల్ జడ్జిగా పనిచేసింది. 'వీక్షణం', 'గమనం' అనే రెండు కవితా సంకలనాలు వెలువరించడమే కాక ఒక- కవితాసంకలనాన్ని ఏరికోరి నా చేతి రాతతో తన కవితలన్నింటినీ రాయించి, మొత్తం గ్రంథం నా చేతిరాతతోనే ప్రచురించింది.

ఒక మంచి వక్తగా, సమీక్షకురాలిగా రాణించింది. చినుకు, తెలుగు విద్యార్థి మాస పత్రికలలో 'కవి కథకులు', 'కార్టూనిస్ట్ కథకులు' అంటూ విలక్షణంగా కాలమ్స్

రాసి పాఠకులను మెప్పించింది. తనకు ప్రయాణాలంటే చాలా ఇష్టం. మిత్రులతో గడపడం ఎంతో ఇష్టం. జంటనగరాల సాహిత్య సభల వేదికలపై అధ్యక్షురాలుగా, ముఖ్య అతిథిగా, గ్రంథ పరిచయకర్తగా మాత్రమే కాక అనేక సభలలో ఒక సామాన్య శ్రోతగా కూడా హాజరై ఆ సభలకు ఒక లక్ష్మీకళను సంతరించేది.

రంజని సమావేశాలకు 'ఏ.జి. ఆఫీసు'కు మిట్టమధ్యాహ్నమైనా సభా కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరయ్యే శ్రోతగా వుంటూండేది. యువభారతి వనితా విభాగం అధ్యక్షులుగా యౌవనంలోనే పనిచేసిన తను, తర్వాత సంస్థలో భర్త కామేష్‌తో బాటు 'హాస్యలహరి' వంటి కార్యక్రమాల నిర్వహణలో ప్రధాన భూమిక వహించింది. సి.పి.బ్రౌన్ అకాడమి, కేంద్ర సాహిత్య అకాడమీలకు, మునిమాణిక్యం వారిపై మోనోగ్రాఫ్‌లు రాసింది. తను ఎక్కడవుంటే అక్కడ ఒక సందడినీ, చలాకీనీ, వాతావరణంలో తన నవ్వులతో, మాటలతో పరివ్యాప్తం చేసేది తాను. ఆగస్టు 15, 1953 న విశాఖజిల్లా అనకాపల్లిలో పుట్టిన తను వేటపాలెం, విజయవాడలలో చదివి, ఆ తరువాత హైదరాబాద్‌లో కాలేజీరోజుల నుండీ స్థిరనివాసం ఏర్పరచుకొని జంటనగరాల మహిళా సాహితీవేత్తగా రాణకెక్కింది.

తమ ఇంటికి 'స్నేహనికుంజ్' అని పేరు పెట్టుకున్నది. అట్టి కవయిత్రి, రచయిత్రి, స్నేహశీలి, వక్త, ఆత్మీయురాలు డా॥ శ్రీమతి కె.బి.లక్ష్మి కంచి వరదరాజ స్వామి దర్శనం చేసుకుని తిరిగి వస్తూ- రైల్లోనే మిత్రుల మధ్యనే 2019 జూలై 29 న ఆకస్మికంగా మృతిచెందడం తన నెరిగిన వారందరికీ దిగ్భ్రాంతి కలిగించిన విషాదం. ఆ ప్రియతమ స్నేహితురాలు కె.బి.లక్ష్మికి అక్షరాశ్రువుల నివాళి.

(రంజని దసరా దీపావళి సంచిక- 2019)

❖

(71) స'కాలమ్'లో స'కలం-విహారి'

"WRITING COLUMNS- AND GAINING COMPETENCE AND PROFICIENCY- IS A MATTER OF PATIENCE AND PERSEVERANCE. THE ONLY WAY TO PERSIST IS TO LIKE AND LOVE WHAT THEY DO. FOR A COLUMNIST THE JOURNEY IS FAR MORE INTERESTING AND FULFILLING THAN THE DESTINATION".

-LUKE KOELMAN

(DUTCH WRITER & JOURNALIST)

అవిరామ కృషి, అభినివేశము అందరికీ పట్టుబడే గుణాలు కావు. ప్రతిభావంతులు అయినా, కొందరు క్రమరాహిత్యంతో ఉంటారు. కవులు, రచయితలు నిజానికి తమ రచనల ద్వారా సమాజానికి ఒక సరియైన దిశానిర్దేశం చేయగలవారుగా, బాధ్యతాయుతమైన వారిగా పాఠకలోకం భావిస్తూంటుంది. రచయిత రచనను చూసి మాత్రమే పాఠకుడు అభిమానించడు. తద్వారా ఆ రచయిత వ్యక్తిత్వాన్నీ, వ్యక్తిత్వంతో కూడిన వారి రచనలవల్ల కలిగిన ప్రభావాన్నీ అనుసరించి ఆ రచయిత పట్ల గౌరవాదరాలు పెంచుకుంటాడు. అందుకే రచనకూ, జీవితానికీ పొత్తుకుదరని రచయిత తాత్కాలిక కీర్తిప్రతిష్ఠలు ఆర్జించగలడేమో గానీ, కాలానికి నిలిచే మహనీయునిగా మనలేడు. పాఠకుని వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించేదే ఉపయుక్త రచన. అలాంటి రచనలు చేసేవారే ఉత్తమ రచయితలుగా సార్వకాలికులు కాగలుగుతారు.

పత్రికారచయిత ఒక నిత్య యాత్రికుడు. అలా నిరంతర అధ్యయనంతో, సమాజమమేకమై, ఏ విషయం మీదనయినా తన సాధికారిక ప్రభావోపేత వ్యాఖ్యనూ, సదసద్వివేకాన్నీ కలిగించగల విషయవ్యక్తీకరణను చేయగల పట్టు, నిరంతర శ్రమచేయగల రచయితయే ఒక 'కాలమిస్టు'గా రాణించగలుగుతాడు. అందుకే ఒక రచయిత కాలమిస్టుగా రాణించగలగడమనేది అందరి విషయంలోనూ సాధ్యం కాదు. అలాంటి విశిష్ట శేముషీ సంపన్నులు విహారిగారు. 'విహారి' అన్న కలం పేరున సుప్రతిష్ఠులయిన శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు తెలుగు సాహిత్య

ప్రపంచంలో తనదైన ముద్ర వేసినవారు. ప్రధానంగా ఒక కథకుడుగా ఆయన కీర్తినెరిగిన వారెందరో. కానీ ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదనడం అతిశయోక్తి కాదు. కవిగా సంప్రదాయవాదులు సమాదరించే– 6500 పద్యాలలో 'శ్రీ పదచిత్ర రామాయణం' వెలయించారు. అభ్యుదయ వాదులు, వచన కవితాభిమానులు మెచ్చే 'చలనమ్', 'కలంకన్ను', 'చీకటి నాణెం', 'నంయమనం', "మధ్య'మా'గతి" వంటి అయిదు కవితలసంకలనాలు వెలువరించారు. ఛందస్సుందరమహాకావ్యంగా రామాయణం రచించినవారే, వ్యక్తి–త్వం–వికసనం 'చేవ్రాలు' పేరున వినూత్న దీర్ఘ వచన కవితాకావ్యం విరచించారు. సమశ్రుతి, నవతరం, ప్రణయానలం అనే మూడు నవలలు రాసారు. ఇప్పటికి 'స్పృహ'తో మొదలిడి 'కూకటి' వరకు పదిహేను కథల సంపుటాలు వెలయించిన కథకునిగా పాఠక జనాదరణకు పాత్రులయ్యారు.

తానొక మహోన్నత కథాభూజంగా విస్తరించినా ఎందరో– నవ, యువ కథకులను భుజంతట్టి ప్రోత్సహించుతూ, వారి ఎదుగుదలకు సారవంతమైన తమ సమీక్షాసత్వాన్ని అందిస్తూ ఇప్పటికి అయిదు 'కథాకృతి' సంపుటాలను, సమీక్షాకృతులను ప్రకటించారు. మూర్తిదేవి పురస్కార గ్రహీతలయిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత అయిన సలీం, విశాల సాహితి అధినేత. తెలంగాణ బి.సి.కమీషన్ ఛైర్మన్ బి.ఎస్.రాములుగార్ల సాహిత్య వైశిష్ట్య విశ్లేషణా గ్రంథాలు, 'సాహిత్య జీవి శారద', 'కథానిక వస్తురూపాలు' వంటి గ్రంథాలు సాహిత్య విమర్శకుడిగా విహారిగారి వైభవ దీప్తులను వెలార్చేవిగా ఉన్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీకై 'రాయప్రోలు' వారిపై రాసిన మోనోగ్రాఫ్ వెలుగు చూడబోతున్న గ్రంథం.

ఇవన్నీ ఒక ఎత్తు కాగా, ఇప్పటికీ ఇంకా గ్రంథస్థం కాని ఆయన సాహిత్య కృషి అపారంగా ఉంది. అందులో ఆయన వివిధ పత్రికలలో నిర్వహించిన– 'కాలమ్స్' గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. ఆయన దృష్టికిరాని కథగానీ, కథకులు గానీ నాటి నుంచీ నేటి వరకూ ఎవరూ వుండకపోవచ్చు. ఆయన అధ్యయనశీలత అంత విస్తారమైనది. దాదాపు నాలుగువందల మంది కథకులను వారి కథారచన గుణవిశేషాలను విశ్లేషిస్తూ ఆయన తమ 'కాలమ్స్' ద్వారా వివిధ పత్రికలలో రాసిన పరిచయ వ్యాసాలు– తెలుగు కథా సాహిత్యంలో 'నభూతో నభవిష్యతి' అనదగినవిగా మన్నన లందుకొన్నవి. ఒకనాటి 'భారతి', 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రప్రభ' వంటి పత్రికల నుండి ఈనాటి 'ఆంధ్రభూమి' వరకు అనేక దిన, వార, మాస పత్రికలలో వందలాది

గ్రంథసమీక్షలు చేశారు. ఆయన వివిధపత్రికలలో నిర్వహించిన 'కాలమ్స్' కూడా వైవిధ్యభరితమైనవి.

విహారిగారు వృత్తిరీత్యా ఎల్.ఐ.సీ. హౌసింగ్ ఫైనాన్స్ నుండి జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. మధ్యతరగతి జీవులకు ఉపయుక్తమైన ఆర్థిక అంశాల నెన్నింటినో 2007-2008 సంవత్సరంలో 'వార్త' దినపత్రికలో 'ధన' పేరిట కాలమ్‌లో ప్రతి మంగళవారం ఆయన రాసిన వ్యాసాలు- కుటుంబరక్షణకు వలసిన ఆర్థిక విధానాలనూ, ఆదాయానికి అనువుగా పొదుపు చేసుకుంటూనే నిధిని సమకూర్చు కోవాలనీ, మన జీవనపథంలో సమంజసమైన, సరళమైన ఆర్థిక ప్రణాళికా గమనం ఉండాలి అనీ ప్రబోధిస్తూ సాగిన ఉపయుక్త వ్యాసాలు. విహారిగారు గతానుగతిక భావాలకు, 'మూస' కు భిన్నంగా నిరంతరం ఆలోచించే సృజనశీలి. కాలానుగుణంగా వస్తున్న పరిణామాలకు ప్రత్యక్షసాక్షిగా వుండటం మాత్రమే కాదు. ఆ నవ్యతను, సరికొత్తతరం ఆలోచనాధారను అందిపుచ్చుకుని తన అనుభవంతో సానబెట్టి, యువతకు సరియైన దిశానిర్దేశం చేసే రచనలను చేయడం బాధ్యతగా భావించే రచయిత. యువతకు వ్యక్తిత్వవికాసం మీద ఆయా పత్రికాసంపాదకుల కోరికమేరకు ఆంధ్రభూమి, చినుకు, ఆంధ్రప్రభవంటి పలు పత్రికలలో 'కాలమ్స్' రూపేణే వ్యాసాలుగా రాసారు. 'యువ(త) రంగం' శీర్షికన యువకవులను, రచయితలను, కళాకారులను పరిచయం చేస్తూ, వారి కృషికి వెన్నుతడుతూ ప్రోత్సాహకర వ్యాసాలు రాసారు. అనేక మెళకువలను ఆయా వ్యాసాల రూపంలో వారి పురోగమనానికై ఉపాయనం చేశారు. ఆంధ్రప్రభలో నాలుగు సంవత్సరాలకు పైగా 'పరిచయాలు-పరామర్శలు' శీర్షిక నడిపారు. అది ఒక రికార్డు.

ఆంధ్రభూమి దినపత్రిక వారానికి ఒకరోజు కేటాయించిన 'యువ' పేజీలో 2009 నుండి రెండు మూడేళ్ళ పర్యంతం జె.ఎస్.మూర్తి(విహారి) గారు రాసిన వ్యాసాలు నిజంగా 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్' పాఠాలే! 'మేధోపరిణతే వ్యక్తిత్వ దర్పణం' అనీ, ఆలోచనా ధోరణి, భావవ్యక్తీకరణ, అంగవిన్యాసం, ప్రవర్తనా విధానం వంటి అనేక అంశాలను యువతలోని నిరాశా నిస్పృహలూ, వ్యతిరిక్త భావనలూ తొలగిపోయే రీతిగా ఆ వ్యాసాలను సంతరించారు. 'పరిష్కారం@సమస్య. కామ్', 'గురిపెట్టండి', 'మాట కలపటమే మనసు విప్పటం' వంటి వ్యాసాలు యువతలో సాఫ్ట్‌స్కిల్స్‌ను, టీమ్‌స్పిరిట్‌ను, హెల్త్‌కేర్‌ను, భాషానైపుణ్యాన్ని, భావదీప్తిని ప్రచోదితం చేసేవిగా

రాసారు. అవి గ్రంథరూపేణా వెలువడవలసిన అవసరం ఎంతయినా వుంది. ఇవాళ జంక్‌ఫుడ్ వంటి వాటి ప్రభావాలను హెచ్చరిస్తున్న విషయాలను గురించి ఆనాడే విహారిగారు యువతను అప్రమత్తం చేశారు. 'చిత్ర' మాసపత్రికలోనూ, 'ధర్మశాస్త్రం' అనే మాసపత్రికలోనూ కూడా 2015, 2016 లలో 'యువ(త)రంగం' పేర ఇలాంటి వ్యాసాలు రాసిన విహారిగారు– 'చినుకు' మాసపత్రికలో 'తేజోరేఖలు' పేర 2013 లో నిర్వహించిన కాలమ్ యువతకు జీవననైపుణ్యాన్ని నేర్పిన మరో విశిష్ట వ్యాసపరంపర. 'ఎదగడానికెందుకురా తొందర' అనే సినీగీతం పల్లవి పట్టుకుని 'ఎదగటం' మీదే యువత భవిత ఆధారపడివున్న వైనాన్ని, అందుకు వలసిన సదాచరణను విశ్లేషించారు. రామాయణం, మహాభారతంలోని అంశాలను ఉపపత్తులుగా స్వీకరించి నవసమాజ పథఫణితులను యువతకు ఉపయుక్తంగా మలచి చెప్పిన ప్రజ్ఞ 'తేజోరేఖలు'లో కానవస్తుంది. జీవికకూ, జీవనానికీ, అనివార్యమైన వాహికగా 'మాటతీరు' గురించీ, అన్నిరకాల సామాజిక, నైతిక నియమ నిబంధనలకూ అతీతంగా 'నలుపు'ని ఆశించి, ఆరాధించే వైఖరినుండి యువత నీతి నిజాయితీలవైపు చిత్తశుద్ధితో ఎదగవలసిన తీరు తెన్నులను, 'వ్యక్తిత్వ వికాసం– రేపటి తరం అవసరాలు' కూడా అందిపుచ్చుకునేలా విహారిగారు విశ్లేషించిన తీరు, యువతకే కాదు ఆబాల గోపాలానికీ విభ్రమ కలిగిస్తూనే, వివేచన కలిగించేదిగా భాసిస్తోంది.

ఆంధ్రభూమి దినపత్రిక విజయవాడ ఎడిషన్‌లో ఆదివారాల్లో 'మెఱుపు' అనే పేజీలో యువతరం కవులూ–రచయితలను పరిచయం చేసే 'కాలమ్'ను నిర్వహించారు. ప్రతిభావంతులైన యువతరాన్ని జల్లెడపట్టి– కవులుగా, రచయితలుగా రాణించగల వారిలోని ప్రతిభను గుర్తిస్తూ, ఆయన రాసిన ఆ ధారావాహిక శీర్షికా రచన– తెలుగు సాహిత్య ప్రపంచంలో అప్పడప్పుడే విచ్చుకుని పరిమళిస్తున్న కొత్త పుష్పాలను ఏర్చి కూర్చి మాలకట్టిన మనోజ్ఞ కదంబం. ఆయన ఆ కాలమ్‌లో పరిచయం చేసిన యాభై మందికి పైగా కవులూ, రచయితలులో చలపాక ప్రకాశ్, జమదగ్ని, కోసూరి రవికుమార్, కె.విల్సన్‌రావ్, వంశీకృష్ణ, సాధనాల వెంకటస్వామి నాయుడు, నియోగి, అమ్మిన శ్రీనివాసరాజు, షేక్ అబ్దుల్ హకీంజాని, కోటమర్తి రాధాహిమబిందు వంటి వారెందరో నేటి కథాప్రపంచంలో ఎదిగి రాణిస్తున్న వారున్నారు. ఒక సంయమనం, నిష్పక్షపాత విశ్లేషణ, యువభావ ప్రశంసా వైఖరి 'విహారి' గారి ఈ పరిచయ వ్యాసాలలో ద్యోతకమైందని కొందరు ప్రముఖ విమర్శకులే ప్రశంసించారు.

అలాగే 2013 లో ఆంధ్రభూమి 'మెఱుపు' పేజీలోనే 'ఆనాటి కథలు– ఆణిముత్యాలు' శీర్షికన ఇవాళ్టితరం విధిగా చదవవలసిన అపురూప కథకుల ఆణిముత్యాల వంటి కథలను పరిచయం చేశారు. విహారిగారు పరిచయం చేసిన కథలు కాలానికి నిలిచే ఉదాత్త విలువల ప్రోది అయిన కథలు. శ్రీపాద– 'కలుపు మొక్కలు', సురవరం ప్రతాపరెడ్డిగారి 'సంఘాల పంతులు', విశ్వనాథవారి– 'ముగ్గురు బిచ్చగాళ్ళు', వట్టికోట ఆళ్వారుస్వామి– 'పరిగె', చలం– 'యౌవన వనం', కనపర్తి– 'కుటీర లక్ష్మి', మధురాంతకం– 'పొద్దుచాలని మనిషి' వంటి కథల వైభవ ప్రాభవాల గురించి మునుపెవరూ చూపని మంచి కథలనూ, వాటి కోణాలను విహారిగారు ఈ 'కాలమ్'లో పరిచయం చేశారు. నిజానికి కథకులు ప్రసిద్ధులే. అయినా వారి విస్మృత అపురూప కథలను పరిచయం చేయడం విహారిగారికే చెల్లింది. ఈ అపురూప కథాసంపుటిని నిజానికి ఏ సాహిత్యఅకాడమీ లాంటి సంస్థలో పూనుకుని ప్రచురించాలి. 'చినుకు' మాసపత్రికలో 2014 లో విహారిగారు 'అక్షర జీవులు– ఆణిముత్యాలు' అనే కాలమ్‌లో ఇప్పటితరం కథకుల మంచికథలను విశ్లేషిస్తూ పరిచయం చేశారు. శ్రీపతి, రంగనాథ రామచంద్రరావు, అదృష్టదీపక్, నాయని కృష్ణమూర్తి, డా॥ చింతకింది శ్రీనివాసరావు, గంటి భానుమతి వంటి వారి కథానికలు గురించి ఈ వ్యాసాలలో విశదీకరించారు. 'సాహితీ స్రవంతి' మాసపత్రికలో 'కథావాఙ్మయలహరి' శీర్షికన కొన్ని వ్యాసాలు రాశారు.

ముందే చెప్పుకున్నట్లు విహారిగారు చేపట్టని ప్రక్రియ లేదు. శ్రీశ్రీ, ఆరుద్ర వంటివారు నిర్వహించిన 'పదబంధ పారిజాతం' వంటి గళ్ళ నుడికట్టును కూడా విహారిగారు 'చిత్ర' మాసపత్రిక సంపాదకుల అభీష్టం మేరకు 2012–2013 లో 'పదప్రజ్ఞ' శీర్షికన పదిగళ్ళ పదక్రీడగా నిర్వహించారు. విరిగి పడబోదులెండి (మిన్ను) భాగం త్రాగవచ్చు (పాలు) గోదావరిలో నుతజల పూరితంబులు... వడ్లు పండేదిక్కడే (వరి చేలు), మిమ్మల్నేమీ అడ్డగించం (ఆపం), 'గాలివాన' కథకుని పొట్టిపేరు (పాప), మరమరాల్లో లక్ష్మి (రమ) వంటి చమత్కార ఆధారాలతో ఈ 'పదప్రజ్ఞ' 300/– రూపాయల బహుమతి మొత్తంతో పోటీగా సాగింది. భాష మీద విహారిగాకి ఉన్న పట్టు గొప్పది. ఆయన 'పదచిత్ర రామాయణం'లోని పద సంపదనంతా ఒక 'వాఙ్మయ సంచిక'గా సంతరించవచ్చును.

2018 నుండి ఏడాదికి పైగా విశ్వామిత్ర, మంధర, అనసూయ, శూర్పణఖ లాంటి వ్యాసాలు 'భక్తి' మాసపత్రికలో 'రామాయణ పాత్రలు' అనే ధారావాహికలో

వ్రాశారు. ఆయన రాసిన ఆ వ్యాసాలు వాల్మీకి హృదయాన్ని చూపుతూ ఆ పాత్రల వైశిష్ట్యంపై కొత్త వెలుగులు ప్రసరింప చేసేవిగా భాసించాయి. "కథాగతిని అనుసరించి పాత్రపోషణ జరగాలనే పాఠాన్ని అందించారు మహర్షి. ప్రతి పాత్ర చిత్తవృత్తిని స్పష్టంగా ఎరిగిన కవి ఆయన. ఆయా పాత్రల మనస్తత్వ వైరుధ్యాలను, వైచిత్రిని అపూర్వంగా దర్శనం చేసినవాడు ఆయన" అని వాల్మీకిని విశ్లేషించిన విహారిగారూ తామూ ఆ బాటనే అనుసరించి అడుగడుగునా చూపారు. విహారిగారి కథారచనలోని పాత్రలకు కూడా వర్తించే అంశమే అది. 'ధర్మసూక్ష్మ ప్రసారం' శీర్షికన హిందూ ధర్మ 'శంఖారావం' మాసపత్రికలో ఆరుకాండల సంక్షిప్త వివరణగా 'సంపూర్ణ రామాయణం' ను శీర్షికారచనగా విహారిగారు 2019 లో అందించారు.

ఇలా విహారిగారు 'సకాలంలో సకలం' అన్నట్లుగా తమ కాలమ్స్‌లో కలం జీవులకు బాసటగా నిలుస్తూ, ఎందరో కథకుల వైభవ ప్రాభవాలకు సముచిత దర్పణం పట్టారు. యువరచయితల వెన్ను తట్టారు. యువతకు వ్యక్తిత్వవికాస పాఠాలు చెప్పారు. మధ్యతరగతిజీవుల ఆర్థికావసరాలకు సలహాదారుగా నిలిచారు. వయోధికులు 'అల్టీమర్స్' బారిపడకుండా మెదడుకు మేతపెట్టే 'పదప్రజ్ఞ' లు చూపారు. వాల్మీకి హృదయాన్ని రామాయణ పాత్రల విశ్లేషణతో భక్తిభావ శబ్దలతతో ఆవిష్కృతం చేశారు. ఆయనలోని సమ్యక్‌దృష్టి, విషయ విశ్లేషణా నైపుణ్యం, సకాలానికి రచన అందించే సమయపాలన, రచనలోని పఠనీయత ఒక 'కాలమిస్టు'గా విహారిగారిని సంపాదకులెవరయినా సమాదరించగల సహృదయ శేముషీ వైభవశీలిగా నిల్పుతున్నాయి.

ఆయన 'కాలమ్స్' రచనలన్నీ కూడా పుస్తకరూపం దాల్చి భావితరాలకు అందే 'విహారి సమగ్ర సాహిత్య సర్వస్వం' వెలువడాలని ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నాను. ఈ ఏటి అజో-విభొ-కందాళం ఫౌండేషన్‌వారి సాహిత్య జీవన సాఫల్య పురస్కారం విహారిగారిని వరించి సఫలత చెందిందని, ఆనంద కందళిత హృదయారవిందంతో శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి (విహారి) గారికి మనసా, శిరసా అభినందనలందిస్తున్నాను.

(ఆంధ్రభూమి దినపత్రిక, 23 డిసెంబర్ 2019)

❖

(72) సృజనాత్మక బుద్ధిమతాం వరిష్టం!

సింగిల్ పూరీ శర్మగారిగా, గద్దముక్కు పంతులుగా, సినీ నటుడిగా ఆయన–

కళ్లు, ఓ సీత కథ, శుభలేఖ, ఇంట్లోరామయ్య వీధిలోకృష్ణయ్య వంటి సినిమాల రచయితగా ఆయన–

ఆకాశవాణి కార్యక్రమాల నిర్వాహకునిగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆయన–

ఆంధ్రజ్యోతి, వార్త దినపత్రికల్లో సుమారు పాతికేళ్లు సమకాలిక అంశాలపై 'జీవన కాలమ్' రాసిన కాలమిస్టుగా ఆయన–

ఈటీవీలో ప్రతిధ్వని వ్యాఖ్యాతగా, మనసున మనసై కార్యక్రమ నిర్వాహకునిగా, జెమినీ టీవీలో ప్రజావేదిక, మా టీవీలో వేదిక, దూరదర్శన్‌లో సినీసౌరభాలు, వందేళ్ల కథకు వందనాలు వంటి కార్యక్రమాలతో బుల్లితెర ప్రముఖునిగా ఆయన...

ఓ కథారచయితగా, నటుడిగా, నాటక రంగస్థల ప్రముఖునిగా, డాక్టర్ చక్రవర్తి వంటి ప్రతిష్ఠాత్మక చిత్రాల స్క్రీన్ ప్లే రైటర్‌గా, సినీనటుడిగా, పత్రికా కాలమిస్టుగా, కౌముది వంటి అంతర్జాల పత్రికలలో తన కంఠస్వరంతో అద్భుతమైన ఆడియో రచనలు అందించిన శ్రోతృజనరంజకునిగా, ఆకాశవాణి వైభవ ప్రాభవాలకు తన కలంతో, గళంతో నూతన ద్యుతులందించిన అధికారిగా, హిందూధర్మ పరిరక్షణా వ్యవహార కర్తగా ఆయన–

ఒక తెలుగు వెలుగు, బహుముఖీన ప్రతిభా వైజయంతి,

ఒక మరపురాని మనీషి

అవును! ఆయనే గొల్లపూడి మారుతీరావు.

'అమ్మకడుపు చల్లగా' అనే తన ఆత్మకథతో జీవితాన్ని పరిచి చూపించిన మానవీయ విలువల సృజనశీలి గొల్లపూడి మారుతీరావు. ఆయన ఏది రాసినా, ఏమి మాట్లాడినా 'గొల్లపూడి మార్కు' అనేది తెలుగువారి హృదయాలపై ముద్రించి

మెప్పించాడు. ఎనభై ఏళ్ల తన విస్తార జీవితానికి ఇక 'సాయంకాలమైంది' అని చుక్క పెట్టి డిసెంబర్ 12 వ తేదీ అస్తమించాడు.

1939 ఏప్రిల్ 14 న విజయనగరం... నందబలగ గ్రామంలో జన్మించిన మారుతీరావు ఆంధ్రాయూనివర్సిటీ విశాఖపట్నం నుంచి 1959 లో లెక్కలు, భౌతికశాస్త్రం ప్రధానంగా పట్టభద్రులయ్యారు. కానీ ఆయన అంకెలకన్నా అక్షరాలకే అంకితమైన వాడయ్యాడు. ఆంధ్రప్రభలో కొన్నాళ్లు సబ్- ఎడిటర్‌గా పనిచేసి, ఆ తరువాత ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ (డ్యూటీ ఆఫీసర్) గా చేరి, కార్యక్రమ నిర్వాహకునిగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎదిగి హైదరాబాద్, విజయవాడ, మద్రాస్, కడప కేంద్రాలలో సుమారు రెండుదశాబ్దాలు సేవలందిస్తూ శ్రోతలను అలరించి, ఒక నాటక, సినీ రచయితగా పేరొంది, సినిమా నటునిగా కూడా అవకాశాలు రావడంతో- ఇక ఆకాశవాణి ఉద్యోగానికి రాజీనామా చేసి, సినీరంగంలోనే రచయితగా, నటునిగా స్థిరపడిపోయారు.

గొల్లపూడి మారుతీరావు రాసిన మొట్టమొదటి కథ 'ఆశాజీవి' పొద్దుటూరు నుండి వెలువడే 'రేనాడు' అనే పత్రికలో 1954 డిసెంబర్ 9 సంచికలో అచ్చయ్యిందిట. చిన్న వయసులోనే 'రాఘవ కళానికేతన్' అనే నటసంస్థను స్థాపించి రంగస్థలంపై నాటకాలను నటుడిగా, దర్శకునిగా ప్రదర్శింపజేసేవారు.

తాను స్వయంగా చైనా యుద్ధ సమయంలో 'వందేమాతరం' అనే నాటకాన్ని రచించి దాని ప్రదర్శనల ద్వారా యాభైవేలరూపాయల నిధులను సమకూర్చి రక్షణనిధికి అందజేసిన దేశభక్తుడు ఆయన. సమాచార శాఖ ముద్రించిన ఆ నాటకానికి అప్పటి విదేశీ వ్యవహారల శాఖ మంత్రిగా వున్న మన మాజీ ప్రధాని పి.వి.నరసింహా రావు ఉపోద్ఘాతం రాయడం విశేషం. గొల్లపూడి రాసిన- కళ్లు, రాగరాగిణి వంటి నాటకాలు అత్యంత ప్రసిద్ధాలు. తెలుగు నాటకరంగం మీద తదనంతర కాలంలో గొల్లపూడి రాసిన వ్యాసాలు- థియేటర్ ఆర్ట్స్ విభాగానికి పాఠ్యపుస్తకమయింది. తెలుగు కథ, నాటకం ఆయనకు అత్యంత అభిమానాంశాలు. తెలుగు సాహిత్యం మీద ఆయన రాసిన రెండు పరిశోధనా పత్రాలు 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' పదకొండో సంపుటంలో చోటుచేసుకున్నాయి.

రేడియోలో పనిచేస్తున్న రోజుల్లోనే ఆయనకు 1963 లో దుక్కిపాటి మధుసూదనరావ్ నిర్మించిన 'డాక్టర్ చక్రవర్తి' చిత్రానికి స్క్రీన్ ప్లే, సంభాషణలు రాసే అవకాశం తొలిసారిగా లభించింది. ఆ తొలి ప్రయత్నంలోనే ఆయనకు

రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు లభించింది. కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' చిత్రంతో రచయిత అయిన గొల్లపూడి తొలిసారిగా ఆ చిత్రంలో ఓ ప్రధానపాత్ర పోషించి, నటుడిగా విజయపథంలో అడుగు పెట్టారు. అది మొదలు దాదాపు రెండువందల యాభై పైగా సినిమాలలో వివిధ పాత్రలలో హాస్యాన్నీ, విలనీని, క్యారెక్టర్ యాక్టర్‌గానూ రాణించి కీర్తినార్జించారు. సంసారం ఒక చదరంగం, తరంగిణి, త్రిశూలం, అసెంబ్లీ రౌడీ, ఆదిత్య 369, లీడర్ వంటి సినిమాలలో విభిన్న పాత్రలతో వినుతికెక్కారు. రచయితగా ఉన్న గొల్లపూడి ఒక నటుడిగా ప్రేక్షక హృదయాలను తన నటనతో కొల్లగొట్టడం విశేషమే. ఆయన కలం, ఆయన గళం రెండూ కూడా విశిష్టమైనవి. బుల్లితెరపై కూడా వ్యాఖ్యాతగా, పరిచయ కర్తగా, ప్రజావేదికల సమన్వయ కర్తగా, నిర్మాతగానే కాక సీరియల్స్‌లో కూడా నటించి మెప్పు పొందారు.

1961 నవంబర్ 11 న శివకామసుందరితో హనుమకొండలో గొల్లపూడి వివాహం జరిగింది. సుబ్బారావు, రామకృష్ణ, శ్రీనివాస్ అని ఆయనకు ముగ్గురూ అబ్బాయిలే. కానయితే 1992 ఆగస్టు 12 న ఆయన చిన్న కుమారుడు గొల్లపూడి శ్రీనివాస్ తన తొలి ప్రయత్నంగా ఒక సినిమాకు దర్శకత్వం వహిస్తూ– చిత్రీకరణ సమయంలో సముద్ర కెరటాలకు బలయిపోయాడు. ఆయన జీవితంలో అది ఒక తీరని విషాదం. తన కుమారుని స్మృతిలో ఆయన ఏటా ఒక ఉత్తమ నూతన సినిమా దర్శకునికి లక్షాయాభైవేల నగదు బహుమతినీ, బంగారు జ్ఞాపికనూ అవార్డుగా అందిస్తూ వచ్చారు. అలాగే స్మారకోపన్యాసం ఏర్పాటుచేసి పదిహేనువేలు ఆ వక్తకు పురస్కారంగా అందించసాగారు. 'మారుతీ ఎయిర్‌లింక్' అనే ట్రావెల్ ఏజెన్సీని ఇద్దరు కుమారులు నిర్వహిస్తున్నారు. 'శ్రీకాళహస్తి పైప్స్' సంస్థకు గొల్లపూడి ఛైర్మన్‌గా పనిచేస్తూ వచ్చారు.

ఆయనది బహుముఖీన ప్రతిభ. ముఖ్యంగా కథా, నవలారచయితగా అద్భుతమైన నవలలు రాశారు. 'సాయంకాలమైంది' వంటి నవల పాఠక జనాదరణ పొందింది. అలాగే సమకాలీన, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక అంశాలపై ఆయన ఒక కాలమిస్టుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో, ఆపై కొన్నాళ్లు 'వార్త' దినపత్రికలో రాసిన 'జీవనకాలమ్' పాఠకులను పాతిక సంవత్సరాలుగా అలరిస్తూనే సాగింది. అలాగే తన గళంతో అడియో రచనలను 'కౌముది' అంతర్జాల పత్రికలో అందించారాయన. హాస్యం, వ్యంగ్యం, కరుణ ఆయన కలంలోనూ, గళంలోనూ గొప్పగా

వుండేవి. 'మహానుభావా! మార్తాండ తేజా!' వంటి ఊతపదాలు ఆయన నిజ జీవితం లోంచే వెండితెరకు ఎక్కి– జనం నాల్కలపై నిలిచాయి. 'దటీజ్ సుబ్బారావ్' కూడా అలాంటిదే!. రేడియోలో పనిచేస్తున్న కాలంలో– అధికారిక హోదాలో ఉండి కూడా తన కలాన్నీ, గళాన్నీ ఆయన శ్రోతలకోసం గొప్ప సృజనాత్మక ప్రతిభతో వెలార్చారు. 'రేడియో జింగిల్స్'ను తన గళంలో రూపొందించి, కడప కేంద్రం ద్వారా ఆకాశవాణిలో ప్రసారం చేసి, అశేష శ్రోతృజన అభిమానాన్ని– వాటి ద్వారా కూడా ఆయన పొందేరు. తెలుగు కథ వైభవ దీప్తులకు దర్పణంగా 'వందేళ్ల కథకు వందనాలు' పేర ఆయన బుల్లితెరపై నిర్వహించిన కార్యక్రమం, ఆయన వెలువరించిన పుస్తకం సాటిలేని మేటి కృషిగా మన్ననలందుకున్నవే!. విశాఖతో ఆయనకు మమేకం ఎక్కువైనా తెలుగు నేల నాలుగు చెరగులా ఖ్యాతినొందారు. ఆయన రచనలు అనేకం పాఠ్యాంశాలుగా, పరిశోధనాంశాలుగా ఎందరికో స్ఫూర్తిమంతాలయ్యాయి.

ఆయనకున్న మిత్రకోటి కూడా సామాన్యమైనది కాదు. ఎవరినైనా తన మాటతో, వర్తనంతో ఆకర్షించగల చతుర సంభాషణా నైపుణి, స్వభావం ఆయనది. అశీతి జన్మదినోత్సవాన్ని విశాఖలోనే జరుపుకుని, కొంతకాలంగా అనారోగ్యంతో వుంటూ– 81 ఏళ్ల వయసులో డిసెంబర్ 12 న అస్తమించిన గొల్లపూడి మారుతీరావు మరపురాని చిరస్మరణీయ తెలుగు ప్రముఖుడు. ఆయన అస్తమయం తెలుగు సాహిత్యానికీ, ప్రచార ప్రసార మాధ్యమాలకూ, నాటక సినీరంగాలకూ తీరని లోటు.

(వార్త దినపత్రిక ఆదివారం అనుబంధం, 22 డిసెంబర్ 2019)

❖

(73) వెలగాలి తెలుగు

'మాతృభాషను కాపాడుకుందాం– స్వాభిమానం చాటుకుందాం' అని నినదిస్తూ డిసెంబర్ 27, 28, 29 తేదీలలో విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహిస్తున్నారు. దేశ విదేశాల నుంచి 15 వేల మందికి పైగా సాంస్కృతికమూర్తులు, భాషా సాంకేతిక నిపుణులు తరలి వస్తున్నారు. 2019 సంవత్సరాన్ని అంతర్జాతీయ మాతృభాషా పరిరక్షణ సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాలలో తెలుగుభాష అస్తిత్వం భావితరాలలో ప్రశ్నార్థకమైన సందర్భంలో నిర్వహిస్తున్న ఈ సభలు... మరోసారి తెలుగువారు సంఘటితమై భాషోద్యమాన్ని బలోపేతం చేయవలసిన అగత్యాన్ని నిరూపిస్తున్నాయి. నిజానికి ఈ సాంకేతికయుగంలో తెలుగును– ప్రపంచ తెలుగుగా అభివృద్ధి పరిచేలా కార్యాచరణకు నడుంకట్టాల్సి వుంది. సాహిత్యం ద్వారా కవులూ, రచయితలూ భాషామధురిమను ఇనుమడింప చేస్తారు. గిడుగువంటి మహనీయులు ప్రజల వ్యావహారిక భాషకు పట్టంకట్టి, భాష అంటే జనమమేకమయిన సమాజగత భావ వ్యక్తీకరణయేననీ నిరూపించారు. ప్రజల నాల్కలపై నడయాడే భాషకే సాహిత్య గౌరవం లభించేలా భాష పురోగమించింది.

సాహిత్యం లేకపోయినా భాష ఉంటుంది. కానీ భాష లేకపోతే సాహిత్య సృష్టి ఎక్కడ? భాష అంటే కేవలం మాట్లాడుకోవడం మాత్రమే అనుకుంటే పొరపాటు. ఆ భాషకు– దాని సమగ్ర వికాసానికి లిపి వుండి, ఆ లిపిని చదవడం, రాయడం ఆ భాషీయులందరికీ వచ్చి వుండాలి. భావవ్యక్తీకరణయే భాషకు ప్రధానం. కానీ భాషాభివృద్ధికి సాహిత్యం. కళలు దోహదం చేస్తూ భాషను పరివ్యాప్తం చేస్తాయి. మాతృభాషలో విద్యార్జనం చేయడంవల్ల ఉద్యోగ ఉపాధులు లభించవనీ, దానికి ఆంగ్లమాధ్యమమే అనివార్యమైనదనే స్థితిలోకి పాలక ప్రభుత్వాలు మరింతగా నెట్టివేసే వర్తమాన స్థితిలో తెలుగు భాషా పరిరక్షణ, దాని అభివృద్ధి. ఆధునికీకరణ అంతర్జాతీయ

స్థాయిలో నేడు జరగవలసిన అగత్యం వుంది. సాహితీమూర్తులందరూ సంఘటితమై భాషోద్యమానికి పునరంకితమై బలోపేతం చేయాల్సి వుంది. ఒకప్పుడు తెలుగు మాధ్యమంలోనే చదివి, ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగువెలుగులను ప్రదీప్తం చేస్తున్నవారు ఎందరో వున్నారు. విదేశీగడ్డపై వుండి కూడా తెలుగు కోసం, తెలుగు తనాన్నీ, తెలుగుతరాన్నీ పెంపొందింపచేసే కృషి సాగిస్తున్న వారుండగా, తెలుగు నేలపై తెలుగు పాలకులే– ఒక భాషా సాంస్కృతిక విధానం లేక, పరాయిభాష పంచనే బ్రతుకులీడ్చాల్సిన వైఖరులను ప్రోది చేసి పెంచడం శోచనీయం.

ఈ మహాసభల్లో కొమర్రాజు లక్ష్మణరావు సభాప్రాంగణంలో గిడుగు రామ్మూర్తి సాహితీ సాంస్కృతిక వేదిక, సురవరం ప్రతాపరెడ్డి భాషా పరిశోధన వేదికలపై పదిహేను సదస్సులు నిర్వహించనున్నారు. తెలుగువారైన విదేశీ, రాజకీయ, పాలనారంగ, సాంకేతిక, తెలుగు భాషోద్యమ, చరిత్ర పరిశోధన, సాహితీ సంస్థల, సాంస్కృతిక, ప్రచురణల, రాష్ట్రేతర, పత్రిక, ప్రసార, మహిళా ప్రతినిధులతో విడివిడిగా సదస్సులు నిర్వహిస్తారు. ఈ సందర్భంలోనే భాషోద్యమ సంబంధిత మూడు పదుల వ్యాసాలతో 'ప్రపంచ తెలుగు' అనే వ్యాససంకలనం వెలువరించాలనే నిర్ణయం బాగుంది. భాషా పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి విద్యా, సాంస్కృతిక, సమాచార సాంకేతిక, శాస్త్రీయ రంగాలలో జరపదగిన కృషికి కొన్ని మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. వాటిని ఆచరణలో సాధించుకోవడానికి, ఫలితాన్ని పొందడానికి పరిమిత కృషి మాత్రమే ఈ ఏడు కానవచ్చింది. బహుభాషా విధానాన్ని గౌరవిస్తూనే మాతృభాష పరిరక్షణ. వికాసం సాధించడం కర్తవ్యం. తెలుగుభాష వాడకం వ్యవహారంలో, బోధనలో, పాలనలో, ఆధునిక సాంకేతిక పరికరాల్లో సమగ్రంగా సాగడానికి చేయవలసినదంతా చేయాలి.

'ప్రపంచ తెలుగు' వ్యాససంకలనంలో సంస్కృత శాసనాలలో తెలుగుఔన్నత్యం మొదలు, పాలనభాషగా తెలుగు అమలుకు నేటి సూచనలు వరకు అనేక పార్శ్వాలను సంకల్పించడం బాగుంది. గిరిజన, బంజారా, రెల్లి, సవర మాతృభాషలు కలవారెందరో తెలుగువారిగానే వున్నారు. వారి భాషా సాహిత్యాల గురించి కూడా ఈ సంపుటిలో ఆలోచనలు సంతరింపబూనడం హర్షణీయం. తెలుగును తలకెత్తుకోవడం అంటే ఆంగ్లాది భాషలను నిరసించడం కానేకాదు. అన్యభాషలు నేర్వవద్దనే దృష్టి ఏ కోశానా లేదు. అమ్మను, అమ్మ భాషను కాదని, కాదనుకుని అమ్ముడుపోవడం, అన్యభాషా దాస్యాన్ని వదలుకోకపోవడం, తెలుగుజాతి వికాసానికి విఘాతమై నిలిచేవే!

జనసామాన్యం నోళ్లలో నానుతూ సమానమైన తెలుగుమాటలు లేని పదాలను తెలుగుభాషలోకి దేశీయ పదాలుగానే స్వీకరిస్తే తప్పేమీ కాదు. జనం నాల్కలపైకెక్కని ప్రత్యామ్నాయ తెలుగు పదసృష్టి నిలవదు. కానీ ఆ కృషి మాత్రం సాగడం అవసరమే! భాషపట్ల మమకారం, భాషా వికాసానికి చిత్తశుద్ధి, భాషావ్యవహారానికి ఆచరణాత్మక సంకల్పం వుండి తీరాలి. ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నట్లు కొత్త పదాలు, కొత్త వాక్య విన్యాసాలు, కొత్త రచనా రీతులు భాషలో చోటు చేసుకుంటాయి.

'పాతవడ్డ మాటలు' అనే మాట తిక్కన తన కాలంలోనే వాడాడు. మన వినియోగంలోకి సరికొత్తగా చేరే వస్తుజాలం ఎంతో వుంటూంటుంది. ఆ వస్తుజాలాన్ని వ్యక్తీకరించవలసిన సామర్థ్యం– భాష రూపొందించుకోలేకపోతే మూలంలోని వ్యవహారాన్నే ఔదలదాలుస్తాం. ఇంతకీ భాష– భావ వినిమయ సాధనం అన్నది మరచి పోరాదు. పూర్తిగా జనజీవనమమేకమై అందరూ అలవోకగా వాడుతున్న స్థిరీకృత పదాలను పనిగట్టుకుని తీసేసి, కొత్త పదాలను స్థిరపరచాలని అనవసర ప్రయాసలు కాలహరణే తప్ప మరొకటి కాదు. కానీ మరి మనభాష అస్తిత్వం మాటేమిటి? అనే ప్రశ్న ఉదయించినప్పుడు– ప్రత్యామ్నాయ పదకల్పనో, సమానార్థక పదకల్పనో జనం నాల్కలపైకి నిలిచేలా ప్రసార, ప్రచార మాధ్యమాలతో సహా అందరూ పరివ్యాప్తి చేయడానికి, జనాదరణ పాత్రం చేయగలిగితే అంతకన్న కావలసినదేముంది.

నిజానికి చక్కని ప్రత్యామ్నాయ తెలుగుపదాలు– మీడియా, సాహిత్యం ద్వారా బాగా వ్యాప్తిలోకి తేవచ్చు. ఆ ప్రత్యామ్నాయ పదాలు అధిక జనప్రయుక్తాలుగా మారితే భాషలో స్థిరమౌతాయి. 'ఎవరో ఒకరు కనిపెట్టకపోతే పదాలు ఎలా పుడతాయి' అని మాయాబజార్ చిత్రంలో అన్నట్లు, పదసృష్టి జరుగుతూనే ఉండాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలు నచ్చిందే, మెచ్చిందే నిలుస్తుంది. 'తెలుగు మాట్లాడే దీపాలు తెల్లవార్లూ వెలుగుతూంటాయి' అని ఆరుద్ర అన్నట్లు– భాషపై నేడు కమ్ముకుంటున్న చీకట్లను పారదోలే దీపధారులతో తెలుగువెలుగులు విశ్వవ్యాప్తం కాగలవనీ, ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు అందుకు మూలాధారనాడి కావాలనీ, కాగలవనీ ఆకాంక్షిద్దాం.

(ఆంధ్రప్రభ దినపత్రిక, 26 డిసెంబర్ 2019)

❖



సుధామ పరిచయం

అసలు పేరు	:	**అల్లంరాజు వెంకటరావు**
జననం	:	25-11-1951
తల్లిదండ్రులు	:	కీ॥శే॥ అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ), కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు
విద్యాభ్యాసం	:	ఒకటోతరగతి నుండి ఎం.ఓ.యల్., ఎం.ఫిల్ వరకు హైదరాబాద్ లోనే. కేశవ మెమోరియల్ పాఠశాల, మలక్‌పేట ప్రభుత్వపాఠశాల, వివేకవర్ధనీ కళాశాల, ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల్లో.
వృత్తి ఉద్యోగాలు	:	1975-1977 బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల కరీంనగర్‌లో తెలుగు లెక్చరర్‌గా. 1978 లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధ భారతి) ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక. 1990 లో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతి. విజయవాడ, వరంగల్, హైదరాబాద్ కేంద్రాలలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసి, 2008 లో ఆకాశవాణి వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం నుండి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ. అనంతరం బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ.(తెలుగు) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా కొన్నాళ్లున్నారు.
అభిరుచులు	:	కవిగా, కార్టూనిస్టుగా, చిత్రకారునిగా, సమీక్షకునిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, సినీ విశ్లేషకునిగా, కాలమిస్టుగా, వక్తగా, విశిష్ట సాహితీవేత్తగా, పదబంధ ప్రహేళికలవంటి వివిధ

పజిల్స్ నిర్మాతగా తెలుగు పాఠకలోకానికి, సాహితీలోకానికి పరిచితులు. రేడియో 'వాడి'గా శ్రోతలకు, టివి ప్రేక్షకులకు పరిచితులు.

ముద్రిత గ్రంథాలు : **కవితా సంపుటులు**

మేం (మిత్రుడు డా॥ నాగినేని భాస్కరరావుతో కలిసి)– 1974
అగ్నిసుధ– 1990
మనసు పావనగంగ– 2010
చిత్రగంధి– 2011
కవికాలమ్– 2011

వ్యాస సంపుటులు:

కాలం వెంటకలం– 2020
సందర్భ– 2020

కాలమ్‌వ్యాసాలు

సం.సా.రా.లు– 2001
మన తెలంగాణ (సుధామయోక్తి)– 2018
వ'సుధా (స)మ'య– 2019

ఇతరాలు

పూతరేకులు (జోక్స్‌బాక్స్)– 2001
రామాయణ పథం (ప్రశ్నోత్తరమాలిక–పజిల్స్)– 2018
భూమిక (పీఠికలు–వ్యాసాలు)
సంపాదకురాలు: అల్లంరాజు ఉషారాణి – 2018
మాటాట (గళ్ళనుడికట్టు– ఏడుగళ్ళ వంద పదబంధ పారిజాతాలు)– 2019
తెలుగు సొగసులు (విద్యార్థి యువతకు పరిచయ వ్యాసాలు) యువభారతి ప్రచురణ– 2020

అవార్డులు, సన్మానాలు : 'అగ్నిసుధ' కవితాసంపుటానికి కలహంసి, ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం, 'సం.సా.రా.లు' గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం 2004 సాహితీ పురస్కారం, వంశీ ఇంటర్నేషనల్, జోత్స్నాకళాపీఠం, తేజ ఆర్ట్స్ కవితా పురస్కారం, మునిమాణిక్యం హాస్యనిధి పురస్కారం, నోరి నరసింహశాస్త్రి ఛారిటబుల్‌ట్రస్ట్, దివాకర్ల సాహిత్య పీఠంవారి ఆచార్య దివాకర్ల వేంకటావధాని సాహిత్య పురస్కారం, ఆచార్య తిరుమల స్మారక సాహిత్య

పురస్కారం, పింగళి జగన్నాధరావు స్మృతిసాహిత్య పురస్కారం, హాసం క్లబ్ పురస్కారం, తురగా కృష్ణమోహనరావ్ హాస్య పురస్కారం, చేతన మాసపత్రిక, లేఖిని సంస్థ పురస్కారం, డా॥తిరుమల శ్రీనివాసాచార్య స్వరాజ్యలక్ష్మి ధర్మనిధి పురస్కారం, పోలవరం వెంకటసుబ్బమ్మ సాహితీ పురస్కారం, నవ్య సాహితీసమితి భాషాసేవ పురస్కారం, గుర్రాల రమణమ్మ (నెల్లూరు) స్మారక సాహితీ పురస్కారం, ఖర్గపూర్, బెంగుళూర్ తెలుగు సాహితీ సంస్థలచే, ప్రపంచ తెలుగు మహాసభలు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అ.జో.వి.భో. కందాళం ఫౌండేషన్, తా.నా, ఆటా స్థానిక సంఘాల వారిచే సన్మానాలు మొదలైనవి.

1983 లోనే ఆకాశవాణి జాతీయకవి సమ్మేళనానికి జాతీయ తెలుగుకవిగా ఎంపిక.

ప్రస్తుతం : యువభారతి సంస్థ ప్రచురణల ప్రధాన సంపాదకులు. 'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్' మాసపత్రికలో 'సీ'నియర్ కబుర్లు కాలమ్ నిర్వహణ. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా ప్రస్థానం.

జీవన సహచరి : శ్రీమతి అల్లంరాజు (సూకూరు) ఉషారాణి

కుమారుడు : చి॥ అల్లంరాజు స్నేహిత్

కోడలు : చి॥ సౌ॥ అల్లంరాజు (దువ్వూరి) లక్ష్మీప్రవంతి.

KAALAM VENTA KALAM

A collection of essays

By *Sudhama*

సుధాము ముద్రిత గ్రంథాలు